ఆర్షవిద్యా తరంగిణి

Inspired by the teachings of

**SWAMI PARAMARTHANANDAJI**

# Saddarsanam

భగవద్రమణమహర్షి కృత

# సద్దర్శనం

స్వామి పరమార్థానంద

సద్దర్శనం = అహంకార మూల ఆత్మవిచారణ

**స్వామి పరమార్థానంద బోధనల స్ఫూర్తితో**

**వారి ఆశీస్సులతో**

**తెలుగు సేత – మద్దూరి / కస్తూరి రాజ్యశ్రీ**

**సంధాన కర్త – కస్తూరి వీర రాఘవ రావు**

First edition - Year 2025 Guru Purnima day 1000 copies

For Copies
K V Raghava Rao
C - 804 Aparna Cyberzon
Nallagandla, Hyderabad 500019
Mobile: 9849092368

Email: raghavkasturi@gmail.com
Our Youtube Channel Arsha Vidya Tarangini
https://www.youtube.com/@arshavidyatarangini7911/playlists

For softcopies of our books and audio go to
https://arshavidya.app
https://www.telugubhakti.com

Title - **Saddarsanam**

Sanskrit Support – Sri Desu Chaitanya Krishna
DTP – Sri S Rajendra Kumar 98661 15622

Printed at
Sai Sri Printers
8-3-945 # 21 Pancom Business Centre,
Ameerpet Hyderabad --500073
e-mail : saisriprinters@yahoo.com
Ph.No.040-23730222,Cell:9985530222

Price Rs. 300

# బ్రహ్మయజ్ఞం

**దుర్లభం త్రయమేవైతత్ దేవానుగ్రహహేతుకమ్।**
**మనుష్యత్వం ముముక్షుత్వం మహాపురుషసంశ్రయః॥**

**డాక్టర్ నాయని ఇందిర బాలామణి గారికి** ఉగ్గుపాలతోనే వారి అమ్మమ్మగారు ఆధ్యాత్మికతను నూరిపోస్తే, దాన్ని పెంచి పోషించారు వారి అమ్మగారు, పిన్ని గారు. డా॥ ఇందిరగారికి లక్ష్మీసరస్వతుల కృపాకటాక్షాలు సమృద్ధిగా ఉన్నాయి. వైద్యరంగంలో ఆరితేరటమేకాక, విజయవాడ సిద్ధార్థ మెడికల్ కాలేజీలో ప్రిన్సిపల్‌గా రాణించారు.

ఇవాళ ఇలా ఈ **సద్దర్శనం** సర్వాలంకరణ చేసుకుని మీముందుకు వచ్చిందంటే దానికి **డాక్టర్ ఇందిర గారి** ప్రేరణ, అకుంఠితదీక్ష, నిరంతరతపన కారణం అని చెప్పవచ్చు. మేము సద్దర్శనం బోధ చేయటం మొదలుపెట్టామో లేదో, ఈ గ్రంథప్రచురణ అనే బ్రహ్మయజ్ఞానికి నేను చేయూతను ఇస్తానని మాట ఇచ్చారు.

సద్దర్శనం బోధ కొన్నాళ్ళలో అయిపోతుందనగా, మరో ఇద్దరు మేము సైతం అంటూ ముందుకు వచ్చారు. కాని అప్పటికే ఇందిరగారికి మాట ఇచ్చి ఉండటంవల్ల వారి సహాయాన్ని స్వీకరించలేక పోయాము.

**డాక్టరు ఇందిరగారు** మహామనీషి. తన ఆధ్యాత్మిక ప్రయాణంలో తనకు బీజం వేసిన వారినుంచి, నేటి గురువులైన మా దాకా తలుచుకుని కృతజ్ఞతలు చెప్పటం వారి ఔన్నత్యానికి నిదర్శనం. వయస్సుతో సంబంధం లేకుండా హుషారుగా ఉంటూ, అందరినీ హుషారుగా ఉంచుతారు. ఉజ్జయినీ వేదాంత శిబిరంలో కొంతమందికి చిన్న చిన్న అనారోగ్యాలు చేసినా మాకు తెలిసేలోపే వైద్యం చేసి నయం చేశారు.

వీరి కుటుంబ సభ్యులు - పెద్దకుమారుడు డా॥ శ్రీ తాయి రామానుజులు గారు, కోడలు- డా॥ శ్రీమతి అపర్ణ గారు, చిన్నకుమారుడు శ్రీ తాయి వెంకట గణేష గారు, కోడలు- శ్రీమతి నవీన గారు, కూతురు డా॥ శ్రీమతి తాయి పద్మలత గారు, అల్లుడు శ్రీ మాదిరెడ్డి శ్రీనివాస్ నగేష్ గారు, మనుమరాలు కుమారి డా॥ తాయి నిఖిత, మనుమలు చిరంజీవులు తాయి రోహిత్, మాదిరెడ్డి రిషిత్, తాయి నిర్వాణ్.

సద్దర్శనం గ్రంథప్రచురణ అనే **ఈ బ్రహ్మయజ్ఞానికి డాక్టర్ నాయని ఇందిర బాలామణి గారు** బృహత్తరంగా సహకారాన్ని అందించారు. ముందుగా వీరికి ఆర్ష విద్యా తరంగిణి తరఫున అభినందనలు, కృతజ్ఞతలు. వీరికీ, వీరి కుటుంబ సభ్యులందరికీ భగవంతుడు ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, ఆధ్యాత్మిక చింతన, సుఖశాంతులు, జ్ఞానప్రాప్తి మెండుగా కలుగచేయాలని వేడుకుంటున్నాము. **- రాఘవరావు, రాజ్యశ్రీ**

# పరమార్థానందస్వామివారి బోధలోని విశిష్టత

పరమార్థానందస్వామివారి బోధలో నూతనత్వం ఉంది, స్పష్టత ఉంది, విజ్ఞత ఉంది, విశ్లేషణ ఉంది, విశిష్టత ఉంది. కొంతమంది రమణమహర్షిది ఒక ప్రత్యేకమైన సిద్ధాంతమనీ, అది మన సాంప్రదాయబోధకు భిన్నంగా ఉందనీ, అందువల్ల ఆయనను సాంప్రదాయ ఆచార్యులుగా పరిగణించకూడదనీ భావిస్తారు. కాని మనం కూడా రమణమహర్షి బోధను అలా వారి పద్ధతిలో చూస్తే, మనం ఆయన బోధలోని అద్భుతాన్ని దర్శించని వారమవుతాము. అందువల్ల వారి వలలో మనం పడకుండా, రమణమహర్షిని వేదాంతశాస్త్ర ఆచార్యుల్లో ఒకరిగానూ, ఆయన బోధను వేదాంతబోధగానూ స్వీకరించి, మనం తక్కిన వేదాంత గ్రంథాలను అధ్యయనం చేసిన రీతిలో వీరివి కూడా అధ్యయనం చేస్తే చాలా లబ్ధి పొందుతాము అంటారు స్వామీజీ.

అదెలాగో స్వామీజీ మాటల్లో మీరే స్వయంగా చూడండి! ...

### కాలంగురించి విశ్లేషణ

కాలం గురించి విశ్లేషిస్తే, అది నిజంగా లేదనీ, అదంతా అహంకారం చేసే గారడీ అని అర్థమవుతుంది. సుషుప్తిలో, అహంకారం కూడా పడుకున్నప్పుడు భూత భవిష్యత్ వర్తమాన కాలాలనే విభజన ఉండదు. అంటే అహంకారం లేస్తే కాల విభజన ఉంటోంది; అహంకారం పడుకుంటే కాల విభజన లేదు అంటే దాని అర్థం ఏమిటి? కాలవిభజన అహంకారంమీద ఆధారపడివుంది.

కాని అహంకారం ఆత్మమీద ఆధారపడివుంది. అందువల్ల మనం ఉందనుకుంటున్న ఈ కాలవిభజనకు కూడా ఆత్మే అధిష్ఠానం.

దేశకాలాలు ప్రత్యక్షంగా ఆత్మమీద ఆధారపడి లేవు. అవి అహంకారంమీద ఆధారపడితే, అహంకారం ఆత్మమీద ఆధారపడివుంది. ఆత్మ అంటే నేను అని మర్చిపోకూడదు. చాలా సూక్ష్మమైన అంశం. కాని లోతుగా ఆలోచించాల్సిన అంశం.

రమణమహర్షి ఇలా కాలాన్ని మూడుగా విభజించటం మిథ్య అంటున్నారు. గతం ఒక మిథ్ (myth). మిథ్యను కుదిస్తే మిథ్ అవుతుంది. ఇంగ్లీషులో కాలం ఏమిటి అని అడిగారనుకోండి, మిథ్‌యా (myth ya – mythya) అని జవాబు వస్తుంది. మిథ్ అంటే నిజంగా లేదని అర్థం. ఎలాగో మీరే చూడండి! గతాన్ని విశ్లేషిస్తే అది నిజంగా లేదు; మీ ఊహలో మాత్రమే ఉంది. మీకు భిన్నంగా, బాహ్యంగా గతం ఉండే ప్రసక్తే లేదు. అందువల్ల గతం మిథ్య.

అదెలా సాధ్యం? గతం బాహ్యంగా లేదని ఎలా అంటారు? ఇవాళ అది బాహ్యంగా లేకపోవచ్చు, నిన్న ఉంది కదా? నిన్నటి రోజున నిన్న ఉంది; నేడు లేదు అనవచ్చు మీరు. అదే మేము చెప్పేదీను. నిన్న అనేది నేడు లేదు. నిన్ననే నిన్న ఉంది. నిన్న అది బాహ్యంగా ఉంది, నిజమే. కాని నిన్నటి రోజున చూసేదాన్ని నిన్న అనరు. నిన్నటికి అది నేడే అవుతుంది. ఇవాళ, అది గడిచిపోయిన నిన్న అవుతుంది.

అందువల్ల రమణమహర్షి అంటున్నారు, నిన్నటిరోజు బాహ్యంగా ఉంది, నిజమే కాని అప్పుడది నిన్న అవదు; నేడు అవుతుంది. నిన్న మీరు అనుభవిస్తున్నంతసేపు అది ఇవాళ (నేడు) అవుతుంది. ఆరోజు గడిచిపోతే, అది నిన్న అయిపోతుంది. మీ ఊహల్లోకి వెళ్ళిపోతుంది. నిన్నలో మీరు ఉంటే అది నేడు. నేడులో అనుభవిస్తుంటే నేడు. రేపుని మీరు అనుభవించేసరికి అది నేడు అవుతుంది.

Today is the tomorrow, you worried about yesterday.

నిన్నటిరోజున మర్నాడు గురించి బెంగపడ్డారు. నిన్నటిరోజు గడిచి నేడు వచ్చింది. నిన్నటికి మర్నాడు అయినది. ఇవాళ నేడు అయింది. అంటే మీకు అనుభవంలోకి వచ్చేది నేడు, నేడు, నేడు. నిన్నటి అనుభవం గడిచిపోయింది, నేడు వచ్చింది. గడిచిపోయిన అనుభవం మీ మనస్సు పొరల్లోకి జారుకుంటుంది.

పోనీ రేపైనా బాహ్యంగా ఉంటుందా? మీకు బాహ్యంగా కనిపించేది అంటే అది రేపు కాదు, ఇవాళే అవుతుంది. ఈ రేపనేది ఏమిటి? ఒక కాన్సెప్ట్. నిన్న అనేది ఒక కాన్సెప్ట్. మీ జ్ఞాపకాల్లో జొరబడటానికి అది ఒక పేరు మాత్రమే! అదే విధంగా రేపు మీ ఊహలకు ఒక పేరు మాత్రమే.

నిన్న అనేది మీ జ్ఞాపకమే. అందువల్ల గతం నన్ను బాధిస్తోంది అంటే నిజంగా మిమ్మల్ని బాధిస్తున్నది గతం కాదు. గతం అనేది ఉంటే కదా మిమ్మల్ని బాధించటానికి. లేనే లేని గతం ఎలా మిమ్మల్ని బాధించగలదు? మరి ఏమిటి బాధిస్తోంది? గతం గురించిన మీ జ్ఞాపకాలు. జ్ఞాపకాలు గతంలో ఉంటాయా, వర్తమానంలో ఉంటాయా? గతం గురించిన జ్ఞాపకాలు వర్తమానంలో ఉంటాయి. అందువల్ల సరిగ్గా చూడండి, మిమ్మల్ని బాధించేది గతం కాదు, గతం గురించిన జ్ఞాపకాలు మాత్రమే.

ఇదే సూత్రం భవిష్యత్తుకు కూడా వర్తిస్తుంది. మిమ్మల్ని ఆందోళనకు గురిచేసేది భవిష్యత్తు కాదు. మిమ్మల్ని ఆందోళనకు గురిచేసేది భవిష్యత్తు గురించిన మీ భయాలు. భవిష్యత్తు గురించిన ఆలోచన భవిష్యత్తులో ఉంటుందా, వర్తమానంలో ఉంటుందా? గతం గురించి చూసినట్టే, భవిష్యత్తు గురించిన భయం వర్తమానంలో ఉంటుంది. మరి అయితే భవిష్యత్తు భయం అని ఎందుకంటారు? దాన్ని భవిష్యత్తు**లో** భయంగా విడదీయకూడదు, భవిష్యత్తు **గురించిన** భయంగా విడదీసి, వర్తమానంలో అని కలుపుకోవాలి.

ఆ విధంగా చూస్తే నిజంగా గతమూ లేదు, భవిష్యత్తూ లేదు. మరి అయితే ఉన్నదేమిటి? గతం గురించిన చేదు జ్ఞాపకాలు, భవిష్యత్తు గురించిన లేనిపోని భయాలు. అందువల్ల ఉన్నదొకటే వర్తమానం అంటున్నారు రమణమహర్షి. గతమూ వర్తమానం అయి, భవిష్యత్తూ వర్తమానం అయితే, ఉన్నది ఏ కాలం? వర్తమానం మాత్రమే! అందువల్ల గతం మిమ్మల్ని బాధిస్తోంది అనుకోవటం పొరపాటు. గతం గురించిన చేదు జ్ఞాపకాలు బాధిస్తున్నాయి మిమ్మల్ని.

అందువల్ల ఇంక మిగిలింది వర్తమానం మాత్రమే అని చూశాము కదా! అక్కడా సమస్య తీరదు. ఎలాగో చూద్దాము. వర్తమానకాలం అంటే 24 గంటలు ఉన్నది. ఈ 24 గంటలను ఇంగ్లీషు కాలండర్ పరంగా తీసుకుందాము. నిన్న రాత్రి 12 గంటల నుంచి ఇవాళ రాత్రి 12 గంటల వరకు ఇవాళ అవుతుంది. పేరుకి వర్తమానంలోకి వస్తుంది కాని, ఒక్క గంట మాత్రమే వర్తమానం అవుతుంది. దాని ముందు సమయం గతం, దాని తరువాత సమయం భవిష్యత్తు అవుతుంది.

ఒక్క గంటే వర్తమానం అన్నాము కదా! ఏ గంట అది? మనకు విశ్లేషణకు వీలుగా ఉండటంకోసం స్వామీజీ సద్దర్శనం క్లాసు తీసుకునే సమయాన్ని తీసుకుందాం. అది సాయంకాలం 7-8 వరకు. అందువల్ల నిన్నరాత్రి 12 నుంచి ఇవాళరాత్రి 7 వరకూ గతం అయితే, ఇవాళరాత్రి 8 నుంచి ఇవాళ అర్ధరాత్రి 12 వరకూ భవిష్యత్తు అవుతుంది. సరే అయితే, ఈ 7-8 గంట అయినా వర్తమానమా అంటే అదీ కాదంటున్నారు. 7.40 నిముషాల సమయంలో చూస్తే దానిముందు 39 నిముషాలు గతం, దాని తరువాత రాబోయే 20 నిముషాలు భవిష్యత్తు. 7.40 మాత్రమే వర్తమానం.

అక్కడితో ఆగకూడదు. 7.40 అనేది నిముషాలపరంగా చూస్తున్నాము. ఇప్పుడు ఒక నిముషంలో 60 సెకన్లు ఉన్నాయని తెలుసు. 7.40.25 అన్నారనుకోండి సమయాన్ని. అంటే 24 సెకన్లు గతం, రాబోయే 35 సెకన్లు భవిష్యత్తు అవుతాయి. ఉల్లిపాయను ఒక్కొక్క పొరగా తీస్తూ, పారేస్తూ వస్తే చివరికి ఏదీ మిగలదు. అరటిదూట కూడా అంతే. దాన్ని ఒలుస్తూ పోతే చివరికి ఏమీ మిగలదు. అలాగే సమయాన్ని ఇప్పుడు చూసినట్టుగా విశ్లేషిస్తూ పోతే, చివరికి ఏమీ మిగలదు.

ఒక సెకను వర్తమానం అన్నాము. వర్తమానం గురించిన సత్యమేమిటి? వర్తమానకాలం యొక్క స్వరూపాన్ని విశ్లేషిస్తే, అది అహంకారం ఏర్పరచిన భావన తప్ప మరేమీ కాదు.

**– రాఘవ రావు**

## ఓం శ్రీ గురుభ్యో నమః

## బ్రహ్మయజ్ఞానికి ముందుగా నా పరిచయం

**సదాశివసమారమ్భాం శంకరాచార్యమధ్యమామ్।**
**అస్మదాచార్యపర్యన్తాం వన్దే గురుపరంపరామ్॥**

భగవాన్ శ్రీ రమణమహర్షి గారు తమిళంలో రచించిన ఉల్లదు నార్పదు అనే వేదాంత గ్రంథాన్ని శ్రీ కావ్యకంఠ వాశిష్ఠ గణపతిముని వారు సంస్కృతంలో రచించిన దానిని మన గురువులు శ్రీ కస్తూరి వీరరాఘవరావు గారు, అందులోని సూక్ష్మాలను తేటతెల్లంగా, సంపూర్ణమైన వివరణలతో విపులంగా వివరించారు. మన గురుదంపతులు శ్రీ కస్తూరి వీరరాఘవరావు గారు, శ్రీమతి మద్దూరి రాజ్యశ్రీ గారు ఆర్ష విద్యా తరంగిణి తరుపున ప్రచురించబడే **సద్దర్శనం** అను గ్రంథమునకు నేను ఇతోధికంగా సహాయం చేయుటకు అంగీకరించినందుకు వారికి నా హృదయ పూర్వక కృతజ్ఞతలు.

ఇక నా ఆధ్యాత్మిక ప్రయాణ అంశములోకి వస్తే, ముందుగా నన్ను ఈ గురుపరంపరకి ప్రవేశింపచేసిన ఆ పరమాత్మకు శతకోటి నమస్కారములు. నా ఈ ఆధ్యాత్మిక ప్రయాణము అంచెలంచెలుగా సాగిందని చెప్పవచ్చు. నేను మొదటి సంవత్సరం MBBS (1960–61) చదువుతున్న రోజులలో పూజ్యగురుదేవులు స్వామిచిన్మయానందవారు గుంటూరులో గీతాజ్ఞానయజ్ఞమును నిర్వహించారు. అప్పుడు స్వామీజీ శ్రీ మద్భగవద్గీత 12వ అధ్యాయము, భక్తియోగాన్ని అద్భుతంగా బోధించారు. ఆ బోధన నా మనస్సునకు హత్తుకు పోయింది. అప్పటినుంచి, నాకు ఎప్పుడు అవకాశము వచ్చినా స్వామీజీ విజయవాడ, గుంటూరులో నిర్వహించిన యజ్ఞాలకు మా పిన్నిగారైన శ్రీమతి రమామణి అమ్మగారితోపాటు attend అయ్యేదానిని. ఆ కాలంలోనే స్వామిని శారదాప్రియానంద వారి ఆధ్యాత్మిక ప్రసంగాలకు, యజ్ఞములకు వెళ్ళేదానిని. తరువాత నా ఉద్యోగ బాధ్యతలు, తదితరమైన పనులవల్ల ఆధ్యాత్మిక ప్రయాణమునకు ఎక్కువ దృష్టి పెట్టడానికి వీలులేక కావలసినంత శ్రవణ, మనన నిదిధ్యాసనలు చేయలేకపోయాను. కాని అవి చేయలేకపోతున్నాననే వెలితి నన్ను బాధించేది.

1974 లో మా అమ్మమ్మ గారు Late శ్రీమతి మాదిరెడ్డి కాంతామణి గారు (జగ్గమ్మగారు) wife of Late శ్రీ మాదిరెడ్డి జనార్ధనరావు గారు, నాకు మొదట ఉపదేశము చేశారు. ఆ పుణ్యదంపతులు ఆధ్యాత్మికంగా చాలా ఎత్తుకు ఎదిగిన

జ్ఞానసంపన్నులు. మా తాతగారు వేదాంత పుస్తకాలు చదువుతున్నప్పుడు, ముఖ్యమైన అంశాలను underline చేసి, నేను duty నించి రాగానే, చదివి, వినిపించి, అందులోని సూక్ష్మాలని విశ్లేషించేవారు. మా అమ్మగారు Late శ్రీమతి నాయని జయలక్ష్మిగారు wife of Late Dr. N.Surya Prakasha Rao గారు, మా పిన్నిగారు మనందరికీ సుపరిచితులు Late శ్రీమతి రమామణి అమ్మగారు ఆధ్యాత్మిక ప్రయాణంలో నా పురోగతికి చేయూతనిస్తూ వుండేవారు.

ఇప్పుడు ఈ on-line క్లాసులద్వారా మన గురుత్రయమైన శ్రీ కస్తూరి వీరరాఘవరావుగారు, శ్రీమతి మద్దూరి రాజ్యశ్రీగారు, శ్రీ మూల్పూరి విష్ణు ప్రసాద్‌గారి ద్వారా నా ఆత్మజ్ఞానాన్ని అభివృద్ధి పరచుకుంటూ ఉన్నాను. ఈ విధంగా నా ఆధ్యాత్మిక ప్రయాణం కొనసాగటానికి తోడ్పడిన ఆ గురుత్రయానికి నా శతకోటి వందనములు.

ఈ విధంగా ఆధ్యాత్మిక ప్రయాణం సాగుతూ వస్తున్న తరుణంలో మన గురువులు మనకు వారి గురువులు స్వామి పరమార్థానంద స్వామివారి బోధనల స్ఫూర్తితో సద్దర్శనం అనే గ్రంథమును నిగూఢంగా విశ్లేషించి, వివరించగా, మనం విని, మనం చూస్తున్న ఈ జగత్తు పలుభిన్నరూపాలలో కొనసాగుతుందని, ఆ వున్నది ఒక్కటేనని ఏకత్వాన్ని దర్శింపచేసి అహంకారనివృత్తి యే సద్దర్శనం అని చెబుతూ – ఇది చాలా సూక్ష్మము, సులభము అని చెబుతూ, అహంకారనివృత్తి అన్నది చాలా గొప్ప technique అని, ఆ technique ని మనకి వివరించి మనందరమూ తెలుసుకొని లబ్ధిపొందాలని నిష్కల్మషమైన ధ్యేయంతో మనకు దీనిని భోదించారు. మన గురువులు బోధించిన సద్దర్శనం పుస్తకసారాన్ని గ్రహించి పరిపూర్ణ ఆత్మజ్ఞానాన్ని పొంది, మోక్షప్రాప్తి పొందుతారని ఆశిస్తూ, గురువులకు మరియొక్కసారి నా పాదాభివందనాలు సమర్పిస్తున్నాను.

నమో నమః శ్రీ గురుపాదుకాభ్యామ్

ఓం తత్ సత్

శ్రీ కృష్ణార్పణమస్తు

**Dr. Nayani Indira Bala Mani**

**W/O Late Dr.Tayi Sree Ramakrishna**

గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః ।
గురుస్సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీగురవేనమః ॥



Late మాదిరెడ్డి జనార్దన రావు గారు
Late శ్రీమతి మాదిరెడ్డి కాంతామణి గారు



Late Dr. శ్రీ నాయని సూర్య ప్రకాశ రావు గారు
Late శ్రీమతి నాయని జయలక్ష్మి గారు



Late శ్రీ ఆకునూరి రామ్మోహన్ రావు గారు
Late శ్రీమతి ఆకునూరి రమామణి అమ్మగారు

# నేనెవరు?

రమణమహర్షి పేరు వినగానే ఎవరికన్నా ముందు గుర్తుకొచ్చేది నేనెవరు?Who am I? దానికి జవాబు చుమ్మా ఇరు, మౌనంగా ఉండు అని కూడా అనుకుంటారు. నిశ్శబ్దంగా ఒకచోట కూర్చుని, కళ్ళు మూసుకుని నేనెవరు, నేనెవరు అని విచారణ చేస్తూపోవాలి. అలా ధ్యానం చేస్తే, సమాధానం దొరుకుతుంది అంటారు వారు.

అందువల్ల వేదాంత విచారణ చేయనవసరం లేదు, రమణమహర్షి గ్రంథాలు పరిస్తే చాలు అంటారు. పైగా మన స్వామీజీ చేస్తున్న ఈ సద్దర్శనం బోధకు వస్తున్నవారిలో ఎవరినో ఈ భావన ఉన్నవారు ఆపారుట. ఇలా వేదాంతం ద్వారా రమణులవారి బోధను నేర్చుకుంటే, పెద్ద వలలో పడిపోతావు. ఆయన ఈ గ్రంథాలకు అతీతం. అందువల్ల వెళ్ళొద్దు అన్నారుట. మమ్మల్ని కూడా ఈ బోధ చేస్తున్నప్పుడు, మీ వేదాంతంలో ధ్యానం గురించి లేదా, ఎందుకు నేనెవరు అని ధ్యానం చేయకూడదని నిలదీశారెవరో!

రమణమహర్షి రచనల్లో పదేపదే అహంకార విచారణయొక్క ప్రాముఖ్యతను చూస్తాము. అహంకారం కలుగజేసే సమస్యలను, అహంకారం నాశనం చేయటానికి కారణాలను పదేపదే చర్చిస్తారు. కాని ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, అహంకార విచారణ ఎలా చేయాలో మాత్రం ఎక్కడా వివరంగా చర్చించలేదు. ఆ విషయంలో మౌనం వహిస్తున్నారు. అసలు అహంకారవిచారణ చేయాల్సిన అంశం గురించి మౌనంగా ఉండిపోవటం అనేక వ్యాఖ్యానాలకు దారితీసింది. అందువల్లనే **హు యామ్ ఐ మెడిటేషన్**గా ఆయన బోధ ప్రసిద్ధికెక్కింది.

కాని నిజానికి రమణమహర్షే ఆత్మబోధకు మీరు సంసిద్ధమైన మనస్సుతో వస్తే, అది నేర్చుకోవటం చాలా తేలిక అవుతుంది అంటారు. ముందు మీ మనస్సును సంసిద్ధం చేసుకోండి, తరువాత ఆత్మవిచారణకు రండి అంటారు. కాని దురదృష్టవశాత్తూ చాలామంది రమణులవారి సలహాలో ఈ భాగాన్ని నిర్లక్ష్యం చేస్తారు. అందువల్ల వారు విచారమార్గాన్ని దశదిశలా చాటుతున్నారే కాని, దానికి కావాల్సిన జ్ఞానయోగ్యతా సాధన గురించి ఎక్కడా చెప్పటం లేదు.

అందువల్ల ఏకాంత ప్రదేశంలో కూర్చుని 'నేనెవరు' అనే అంశంమీద జపం చేయసాగారు. రమణులవారు మహర్షులు, ఆయన ప్రత్యేకవ్యక్తి. ప్రతి రంగంలోనూ అసాధారణ వ్యక్తులు ఉంటారు. నిజానికి రమణమహర్షి గురువెవరో, ఆయన వేదాంతాన్ని అధ్యయనం చేశారో లేదో తెలియదు కాని ఆయన రచనలను చూస్తే మాత్రం ఆయన ఖచ్చితంగా ప్రస్థానత్రయంలో

పేరుపొందిన ఉపనిషత్తులను, భగవద్గీతను, బ్రహ్మసూత్రాలను అధ్యయనం చేసివుండాలి. ఎందుకంటే ఆయన రచనల్లో వేదాంతసారం బాగా కనిపిస్తుంది అంటారు స్వామీజీ.

ఇది తెలియక, మనం కూడా నేనెవరు అని పదేపదే మనస్సును ప్రశ్నించుకుంటే జవాబు రాదు సరికదా, నిద్ర ముంచుకు రావచ్చు లేదా తలనొప్పి రావచ్చు. ఇక్కడ మనం ధ్యానాన్ని కించపరచటం లేదు కాని ఆత్మవిచారణ చేసే మార్గం ఇది కాదంటున్నాము అంతే. ఎందుకంటే మీరు నేనెవరు అని మనస్సును ప్రశ్నిస్తే మనస్సుకు తెలిసిన దానినుంచి జవాబు ఇవ్వగలదు కాని, తనకు తెలియని దాని గురించి ఎలా జవాబు చెప్పగలదు?

ఎవరిదాకానో ఎందుకు, రమణులవారే నేనెవరు అనే విచారణ బుద్ధిలో చేయాలని, అది కూడా గురుశాస్త్ర ఉపదేశం ద్వారానే చేయాలని చెప్పారని, ఈ సద్దర్శనంలోనే పరమార్థానంద స్వామీజీ అడుగడుగునా నిరూపించుకుంటూ వస్తారు. అదెలాగో ఈ సద్దర్శనం లోతులు కొలిస్తే మీకే తెలుస్తుంది.

**– రాఘవ రావు**

# సద్దర్శనం = అహంకార మూల ఆత్మవిచారణ

మనిషి సంసారంలో పడి ఎందుకు కొట్టుమిట్టాడుతున్నాడు అనే సమస్యను వేదాంతం విశ్లేషించి, దానికి కారణం ద్వైతం అని నిర్ణయించింది. ద్వైతదర్శనం మూడు రూపాలుగా అవుతున్నది. అవి జీవుడు, జగత్తు, ఈశ్వరుడు. దీన్ని త్రిపుటి అంటారు. ఈ మూడింటిని ముక్కాలిపీటయొక్క మూడు కాళ్ళుగా ఊహించుకుందాము. ముక్కాలిపీటలో ఏ కాలు లాగినా, తక్కిన రెండూ కూడా మీ ప్రయత్నం లేకుండానే లాగబడతాయి. ఇక్కడే ప్రత్యేకత చూపుతున్నారు రమణమహర్షి. ఈ మూడు కాళ్ళల్లో ఒకటి లాగితే చాలంటున్నారు.

ద్వైతం సంసార కారణం, సంసారం పోవాలంటే ద్వైతనివారణ చేయాలి. ద్వైతభావన అజ్ఞానంవల్ల ఏర్పడింది. అజ్ఞానాన్ని పారద్రోలటమెలా? రమణమహర్షి జవాబు ఒక్కముక్కలో చెప్పాలంటే సద్దర్శనం చేయాలి. ఆయన గ్రంథం పేరే **ఉళ్ళదు నార్పదు**. శుద్ధ ఉనికి గురించి నలభై శ్లోకాల్లో చెప్పారు. శుద్ధ ఉనికిని సత్ అంటుంది వేదాంతశాస్త్రం. అందువల్ల సద్దర్శనం అంటే సత్‌యొక్క జ్ఞానం పొందాలి. అంటే ఆత్మజ్ఞానం పొందాలి.

రమణమహర్షి బోధ ప్రత్యేకంగా ఉంటుందని చూశాము. ఆయన సత్‌యొక్క దర్శనం, జీవ, జగత్తు, ఈశ్వరులలో జీవుని గురించి విశ్లేషణ చేస్తే చాలు, తక్కిన రెండూ కూడా మిథ్యగా తేలిపోతాయి అంటారు.

**అహంకార అధిష్ఠాన సద్దర్శనమ్ ఏవ మోక్షకారణమ్**

అహంకార అధిష్ఠానవిచారణ అంటే నేనెవరు ? అందువల్లనే రమణమహర్షి పేరు చెప్పగానే గుర్తొచ్చేది నేనెవరు?(**హు యామ్ ఐ**)

అహంకార విచారణ తక్కిన రెండు విచారణలకన్నా శ్రేష్ఠమైనది, మేలైనది. ఎందుకు? దీనికి కారణాలు చూద్దాము.

1. **అత్యంత సమీపం** – అహంకారం మనకి ఈ మూడింటిలో అత్యంత సమీపమైనది. అందువల్ల అహంకార విచారణ శ్రేష్ఠమైనది, మేలైనది.

2. **అహంకార నాశనం చాలా కష్టం** – ఈ మూడింటిలోనూ అహంకారాన్ని నాశనం చేయటం చాలా కష్టం. అది మనకు అత్యంత సమీపంగా ఉండటంవల్ల మనకు తెలియకుండానే దానిమీద మమకారం పెంచేసుకుంటాము. తేలికగా వదుల్చుకోలేని శత్రువును ప్రత్యక్షంగా ఎదుర్కోవాలి. పరోక్షంగా కుదరదు.

అందువల్ల అహంకారాన్ని ముక్కు గుద్ది లొంగదీసుకోవాలని భావిస్తారు రమణమహర్షి. అహంకారం **నేను** అయితే, జగత్తు **నువ్వు** అయితే, ఈశ్వరుడు **అతను**. ఎక్కడో దూరంగా ఉన్న ఈశ్వరునితో సమస్య లేదు. **నా** తరువాత **నీ** అంటారు. అలా నువ్వా, నేనా అనే పోటీ వస్తే, నాకే ఓటు వేస్తాను నేను. అందువల్ల అహంకారం నాకు తెలియకుండానే నాతో ఎంతగానో పెనవేసుకునిపోయింది. జగత్ విచారణ చేసినా, ఈశ్వరవిచారణ చేసినా అహంకారం నాశనం అవదు కాబట్టి అహంకార విచారణ ప్రత్యక్షంగా చేయాలి.

3. **జగన్మిథ్యాత్వం** – జగత్తు మిథ్య అంటే కొందరు ఒప్పుకోరు. వారు జగత్తును అహంకార పరంగా చూస్తారు. అందువల్ల జగత్తు మిథ్య అని ఒప్పుకోవాలంటే, దాన్ని చూసే అహంకారం మిథ్యగా తేలిపోవాలి.

4. **అహంకారం ఎక్కువవుతుంది** – అహంకారపరంగా ఈశ్వరవిచారణ గాని, జగత్ విచారణ గాని చేస్తే, ఈ రెండూ అర్థమయినవారికి వేరే సమస్య ఎదురవుతుంది. నేను కాబట్టి నేర్చుకున్నానని, వారికి అహంకారం ఇంకొక మెట్టు ఎక్కి కూర్చుంటుంది. అహంకారం చూస్తేనే జగత్తు ఉంటుంది. జగత్తు ఉంటేనే జగత్తుయొక్క సృష్టికర్త గుర్తుకొస్తాడు.

అందువల్ల అహంకారాన్ని మెరుగుపరచటానికి ప్రయత్నించకండి. అహంకార నాశనమే సంసార నాశనానికి దారితీస్తుంది.

ఇలా అహంకారంమీద తిరుగుబాటు చేయటం చాలా శ్రమతో కూడినది, చాలా కష్టమైనది కూడా. ఎందుకంటే జన్మజన్మలుగా అహంకారాన్ని ఒక హీరోగా ఆరాధిస్తూ వచ్చాము. ఇప్పుడది హీరో కాదు సుమా, అది పెద్ద విలన్ అంటే అంత సులభంగా జీర్ణించుకోలేము. కాని రమణమహర్షి అహంకార విచారణ చేస్తే అది సత్యం కాదని తేలిపోతుంది అంటారు.

**అహంకారం అంటే ఏమిటి?** అసలు అహంకారం అంటే ఏమిటి? ధర్మశాస్త్రంలో అహంకారం అంటే గర్వం. వేదాంతశాస్త్రంలో అహంకారం అంటే కార్యకరణసంఘాతం లేదా మనశ్శరీరాలు. పంచకోశాత్మిక శరీరం అహంకారం అంటున్నారు రమణమహర్షి. మనస్సు, అహంకారం ఒకటే అని రెండు పద్ధతుల ద్వారా తెలుసుకోవచ్చు.

**సాంకేతిక పద్ధతి** – శుద్ధ చైతన్యాన్ని మనస్సు ప్రతిబింబింపచేస్తుంది. అందులో ఏర్పడే ప్రతిబింబాన్ని చిదాభాస అంటారు. చిదాభాస సహిత మనస్సును అహంకారం అంటారు.

**మామూలు పద్ధతి** – నేను ఎవరు అంటే మనస్సు అని చెప్పవచ్చు. ఎందుకంటే మనస్సు పని చేస్తుంటేనే, నేను కూడా పని చేస్తాను. మనస్సు పడుకుంటే నేను కూడా పడుకుంటాను.

జాగ్రత్, స్వప్న అవస్థల్లో మనస్సు పని చేస్తుంది. సుషుప్తిలో పడుకుంటుంది. అందువల్ల అంతవరకు మనను ఆటాడించిన అహంకారం కూడా సుషుప్తిలో సద్దుమణుగుతుంది. సుషుప్తిలో అహంకారం పడుకుంటే, జగత్తు, జగత్తు సృష్టించిన సంసారం కూడా ఉండవు. అందువల్ల ఈ అహంకారాన్ని నాశనం చేయాలి.

అహంకారం హీరో అన్నారు కదా, దాన్ని నాశనం చేస్తే అది ఆత్మహత్యతో సమానం అవదా? అవదంటున్నారు రమణులవారు. అహంకారం హీరో అని మీరు అనుకుంటున్నారు. నిజానికి అది విలన్. విలన్‌ను నాశనం చేస్తే అసలు హీరో వెలుగులోకి వస్తాడు. అసలు హీరో ఎవరు? ఆత్మ. అందువల్ల ఆత్మవిచారణ చేయాలి.

**ఆత్మవిచారణ** – నేను ఆత్మ, అహంకారాల మేలుకలయికను. ఆత్మవిచారణ చేస్తే ఆత్మ సత్యం, అహంకారం మిథ్య అని తెలుస్తుంది. శాస్త్రం విచారణకన్నా వివేకం పదం వాడాలంటుంది. ఆత్మానాత్మ వివేకం చేస్తే ఆత్మ సత్యం, అహంకారం మిథ్య అని అర్థమవుతుంది.

ఈ విచారణకు ఆత్మవిచారణే ఎందుకు అహంకార విచారణ అనవచ్చు కదా? నేను అంశద్వయం కాబట్టి ఈ రెండింటిలో ఏదైనా వాడవచ్చు కాని రెండింటిలో ఆత్మవిచారణ పదం సరిగ్గా సరిపోతుంది. ఆత్మ=బ్రహ్మ అని మర్చిపోకూడదు. దీనికి మూడు కారణాలు చెప్పవచ్చు.

1. మిథ్య విచారణవల్ల లాభంలేదు.

2. మిథ్యను పెంచి పోషించేది సత్యం గురించిన అజ్ఞానం. అజ్ఞానం పొరపాటుకి దారి తీస్తుంది. అందువల్ల ఆత్మ అజ్ఞానం పోవాలంటే ఆత్మజ్ఞానం పొందాలి.

ఆత్మవిచారణ → ఆత్మజ్ఞానం → ఆత్మ అజ్ఞాన నాశనం → అహంకార నాశనం → సంసార నాశనం.

పొరపాటుని అధ్యాస అంటారు. ఆత్మ అజ్ఞానంవల్ల నేను అహంకారాన్ని అని పొరపాటు పడుతున్నాము. ఆత్మ అజ్ఞానంనుంచి పుట్టిన పొరపాటుని అహంకారం అంటారు. ఆత్మను అధిష్ఠానం అంటారు. అందువల్ల ఆత్మవిచారణ = అహంకార అధిష్ఠానభూత ఆత్మవిచారః అంటే అహంకారానికి అధిష్ఠానమైన ఆత్మ గురించిన విచారణ.

3. అనాత్మ గురించి మాత్రమే జ్ఞానం పొందితే, నేను ఆత్మను అనే అపరోక్షజ్ఞానంలో నిలబడలేము. నేను ఆత్మను. నేను ప్రమాతా, ప్రమేయం, ప్రమాణం అనే త్రిపుటికి అతీతంగా, వాటికి అధిష్ఠానంగా ఉన్న ఆత్మను అని అర్థం చేసుకోవాలి.

**అహంకారం ఎలా ఏర్పడింది?**

రమణమహర్షి అహంకార స్వరూపాన్ని చర్చించబోతున్నారు. నేను అని చెప్పే ఈ నేను ఎవరు? నేను ఎవరు అని ప్రశ్న వేస్తే శరీరం నేను అని చెప్పలేదు. ఎందుకంటే జడం మాట్లాడలేదు. ఆత్మ కూడా నేను అని చెప్పలేదు. ఎందుకంటే ఆత్మ నిర్వికారం. శుద్ధ అనాత్మా చెప్పలేక, శుద్ధ ఆత్మా చెప్పలేకపోతే, నేను అని చెప్పేది ఎవరు? అది ఈ ఆత్మ–అనాత్మలకు భిన్నంగా ఉన్న మూడో అంశం ఏదైనా అయివుండాలి. కాని దురదృష్టవశాత్తూ ఆత్మ–అనాత్మలకు భిన్నంగా మూడో అంశం వేరే ఏదీ లేదు. మరయితే కొరుకుడు పడని మూడో అంశం ఏమిటి? దీన్ని విశ్లేషణ చేస్తే, అది ఆత్మానాత్మల మేలుకలయిక అని అర్థమవుతుంది. కొన్ని లక్షణాలు అనాత్మలోనివి, కొన్ని లక్షణాలు ఆత్మలోనివి కలగలసిన అంశం ఇది. ఈ మేలుకలయికనే **అహంకారం** అంటారు.

ఈ అహంకారం ఏమిటి అని విచారణ చేస్తే, అహంకారం అనేది విడిగా లేదని అర్థం అవుతుంది. ఉదాహరణకు ఫ్రూట్‌సలాడ్ దేనితో చేయబడిందో చూడటానికి ఒక్కొక్క పండు ముక్కనూ తీసివేస్తే, చివరికి ఏదీ మిగలదు. ఈ అహంకారం ఎక్కడ పుట్టిందో విచారణ చేయాలి; అది కూడా బుద్ధితో చేయాలి. శ్లోకం 25లో **ధియా** అనే పదం వేయటంవల్ల రమణమహర్షి చాలా స్పష్టంగా ఒక విషయం చెబుతున్నారు. ఏమిటది? ఆత్మజ్ఞానాన్ని బుద్ధివల్లనే తెలుసుకోగలం. సమాధిలో కూర్చుంటే ఆత్మజ్ఞానం దానంతట అది వచ్చేయదు. మనస్సును శూన్యం చేస్తే జ్ఞానం రాదు.

ఆత్మ అనుభవం పొందటానికి బుద్ధి అవసరం లేదు. ఎందుకంటే అది ఎప్పుడూ అనుభవంలోకి వస్తుంది కాబట్టి. కాని ఆత్మ గురించి మనకు ఉన్న అపోహలను తొలగించటానికి బుద్ధి కావాలి, గురువు కావాలి, శాస్త్రం కావాలి. గురువు ద్వారా శాస్త్రాన్ని, బుద్ధిని ఉపయోగించి నేర్చుకుంటే ఆత్మ గురించిన సమ్యక్‌జ్ఞానం కలుగుతుంది. ఆత్మనైన నేను దేశకాలాతీతం, సర్వవ్యాపకం, నిత్యం, అసంగం, అకర్తా అభోక్తా. ధియా అని ఉన్నచోట మనం **గురుశాస్త్ర ఉపదేశేన** అని కలుపుకోవాలి.

అహంకారం ఏమిటి? అహంకారంలో ఆత్మ లక్షణాలు, అనాత్మ లక్షణాలు కలగలసి ఉన్నాయి. అహంకారం, ఆత్మనుంచి తీసుకున్న లక్షణం చేతనత్వం. అందువల్లనే మీరు ఎప్పుడు నేను అని అన్నా, నేను అనే విషయం చేతనతత్వాన్ని సూచిస్తుంది. నేను ఉన్నాను తరువాత ఏ గుణం కలిపినా అది అనాత్మ లక్షణం. నేను **లావుగా** ఉన్నాను, నాకు **ఆకలి** వేస్తోంది, నాకు **ఆనందంగా** ఉంది వాక్యాల్లో లావు, ఆకలి, ఆనందం గుణాలు అనాత్మకు చెందినవి. ఇలా ఆత్మ, అనాత్మలను కలిపేసి మనకే అర్థంకాని ఒక మూడో అంశాన్ని తయారుచేశాము. అదే అహంకారం అనే వేషం. ఈ అనాత్మకు చెందిన వేషాలు, లక్షణాలు

నిరంతరం మారుతూనే ఉంటాయి. కాని అన్నింటిలోనూ సమానంగా ఉన్న పదం నేను, నేను. అది ఆత్మ లక్షణం. అనాత్మ లక్షణాలు అహంకారానికి ఆహారం.

ఈ అహంకారం నిజమైనది కాదు. పెద్ద మోసగాడు. మోసగాళ్ళకు అసలు పేర్లు కాకుండా దొంగపేర్లు ఉన్నట్టుగా అహంకారానికి కూడా దొంగపేర్లు ఉన్నాయి. అవి అహంకృతి, గ్రంథి, విబంధః.

**అహంకృతి** – అహంకారం.

**గ్రంథి** – గ్రంథి అంటే ముడి. దీనికి ఒక అర్థం, ముడిని తేలికగా విప్పలేనట్టుగా, అహంకారం అనే ముడిని కూడా తేలికగా విప్పలేము. ఇంకొక అర్థం ముడి రెండు వస్తువులను కలుపుతుంది. మూడు ముడులతో స్త్రీపురుషులు భార్యాభర్తలు అవుతారు. ఇక్కడ అహంకారం ఆత్మ, అనాత్మల లక్షణాలను కలపటం వల్ల ఏర్పడింది.

**విబంధః** – అహంకారం బంధం. అహంకారానికి బంధం లేదు. కాని అహంకారమే బంధం.

**అహంకార నాశనం** – అహంకారమే సంసారానికి మూలకారణం అని ఎత్తి చూపుతున్నారు రమణమహర్షి. దీనికి రెండు మార్గాలను వివరిస్తున్నారు కూడా.

**తాత్కాలిక మార్గం** – అహంకారాన్ని తాత్కాలికంగా ఉపశమింపజేసే మార్గాలు ఉన్నాయి కాని అవి సంసారంనుంచి కూడా తాత్కాలిక ఉపశమనాన్ని కలుగజేస్తాయి అంటారు రమణమహర్షి.

బాహ్యవస్తువులు కలుగజేసే ఏ ఆనందాన్నైనా తీసుకోండి – షడ్రశోపేతమైన విందు భోజనం చేసినా, వినులవిందైన సంగీతం రెండుగంటలు విన్నా, ప్రకృతి అందాలు చూసి మైమరచిపోయినా, స్వర్గలోకంలో స్వర్గసుఖాల్లో మునిగి తేలుతున్నా – ఆనందాన్ని అనుభవిస్తాము. అప్పుడు మనస్సు చాలా ప్రశాంతంగా ఉంటుంది. అప్పుడు అహంకారం ఇబ్బంది పెట్టదు. మనస్సు అప్రయత్నంగా నిర్వికల్పస్థితిలోకి వెళ్ళిపోతుంది.

ప్రయత్నపూర్వకంగా మనస్సు నిర్వికల్పంలోకి వెళ్ళిపోతే దాన్ని సమాధి అంటారు. అప్పుడు కూడా అహంకారలయం అవుతుంది కాని అది తాత్కాలికమే. సమాధినుంచి లేవగానే, మళ్ళీ అహంకారం దూసుకువచ్చేస్తుంది. ప్రళయంలో కూడా తాత్కాలిక లయమే.

**శాశ్వతమార్గం** – శాశ్వతపరిష్కారం కావాలంటే అహంకారాన్ని పూర్తిగా నాశనం చేయాలి. దానికి ఒకటే మార్గం ఉంది అంటున్నారు రమణమహర్షి.

**కారణ నాశనేన ఏవ కార్యనాశః భవతి**

కారణాన్ని నాశనంవల్ల మాత్రమే కార్యం నాశనం జరుగుతుంది.

అందువల్ల మనం చేయాల్సింది అహంకార విచారణ కాదు, ఆత్మవిచారణ. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే అహంకార మూల ఆత్మవిచారణ. అహంకారం ఎక్కడ పుట్టిందో దాన్ని మూలం అంటారు. దీన్ని వేదాంతపరిభాషలో చెప్పాలంటే అహంకారంయొక్క అధిష్ఠానం. అహంకారం అధిష్ఠానం ఆత్మ. అహంకారం అధ్యాస, ఆత్మ అధిష్ఠానం. ఈ అహంకార మిథ్యాత్వనిశ్చయమే అహంకార నాశనం. అందువల్ల ఆత్మవిచారణ చేయాలి అంటున్నారు రమణమహర్షి.

ఆత్మవిచారణ చేసేముందు సాధనచతుష్టయసంపత్తిని పొంది తీరాలని రమణమహర్షే చెబుతున్నారు.

**ప్రాణం చ వాచం చ** – దానికి ఆయన వాడిన పదాలు ప్రాణం, వాక్కు. అది పొందాక, ధ్యానంలో కూర్చుంటే ఆత్మజ్ఞానం వస్తుందని రమణమహర్షి చెప్పలేదు.

**చిన్వన్** – చిన్వన్ అంటే వెతుకు అని అర్థం. ఇక్కడ విచారణ చేయాలని అర్థం. దేని విచారణ? ఆత్మవిచారణ. ఆత్మవిచారణ దేనితో చేయాలి? బుద్ధితో! అందువల్ల సాక్షాత్తూ రమణమహర్షే బుద్ధికి అతీతంగా ఎదిగితే జ్ఞానం రాదు, బుద్ధిని అణగదొక్కితేనూ జ్ఞానం రాదు,

**శితయా బుద్ధ్యా** – తీక్షణమైన బుద్ధిని ఉపయోగించి వేదాంత విచారణ చేయాలి అంటున్నారు. వేదాంత విచారణ చేయాలి అని అడుగడుగునా భిన్న పదాలతో సూచించారు. అవి – **ఆత్మ చయనమ్, చిన్వన్, స్వమూల చర్చా, గవేషణమ్, మార్గణమ్, అన్వేషణమ్**. అది కూడా ఎలా చేయాలి?

**శాస్త్ర ఆచార్య ఉపదేశ సహిత ఆత్మవిచారః**

ఈ విధంగా విచారణ చేస్తే ఏమవుతుంది?

అహంకారం ఆత్మలో లయమవుతుంది. దీన్ని కవితాధోరణిలో వివరిస్తున్నారు రమణమహర్షి. అహంకారం ఆత్మలో చేరటానికి పరుగులు తీస్తుంది అంటున్నారు. రజ్జుసర్పభ్రాంతిలో తాడు జ్ఞానం పొందగానే తాడులో పాము లయమై, మాయమైపోతుంది. అంటే పాము మెల్లమెల్లగా తాడులోకి వెళుతున్నట్లు, ముందు తలభాగం వెళ్ళినట్లు, నెమ్మదిగా తోక కూడా తాడులోకి వెళుతున్నట్లు ఊహించుకోకూడదు.

**పరిభగ్న శీర్షా** – ఇది కూడా కవి హృదయాన్ని సూచించే అద్భుతమైన ఊహాశక్తి. అహంకారం, ఎత్తైన భవనంమీంచి తలక్రిందులుగా పడుతున్న పురుషునిలా పడిపోతుంది అంటున్నారు. తలక్రిందులుగా పడే వ్యక్తి అక్కడికక్కడే తల పగిలి మరణిస్తాడు. బ్రతికే అవకాశమే లేదు. అలా అహంకారం వెళ్ళి ఆత్మలో తలక్రిందులుగా పడిందంటే అర్థం, అహంకారం పూర్తిగా, మళ్ళీ తిరిగి లేవలేనట్టుగా ముక్కలైపోయింది అని. ఇది శాశ్వత పరిష్కారం అని సూచన. అంటే ఇంక అహంకారం కోరలు పీకేసిన త్రాచుపాము అవుతుంది.

**జ్ఞానఫలం** – ఇలా ఆత్మవిచారణ చేస్తే కలిగే ఫలాన్ని కూడా రమణమహర్షి కవితాశైలిలో వివరిస్తున్నారు. ఆత్మజ్ఞానఫలం అహంకారం కోరలు పీకి, ఆత్మ దాని స్థానంలోకి వస్తుంది. ఇన్నేళ్ళూ హీరోగా రాజ్యం ఏలిన అహంకారాన్ని దాని పదవినుంచి కిందకి తోసి, ఆత్మ యాజమాన్యాన్ని చేజిక్కించుకుంటుంది. అప్పుడు జ్ఞాని జీవితంలో కలిగే మార్పులు రెండు.

1. **దృక్పథంలో మార్పు** – అతనిలో కలిగే మార్పులు బాహ్యంగా కలిగేవి కావు; అతని దృక్పథంలో పెద్ద మార్పు వస్తుంది. ఇన్నాళ్ళూ నేను పరిమితి ఉన్న జీవిని, నేను కర్తా, భోక్తాను అనుకునే వ్యక్తి కాస్తా ఇప్పుడు నేను ఆత్మను, సర్వవ్యాపకాన్ని, నేను అకర్తా, అభోక్తాను అని అర్థం చేసుకుంటాడు.

2. **అహంకారం పూర్తిగా నశించిపోదు** – అహంకారం మరణిస్తుందని ఇందాక చూశాము కాని అది కవితాధోరణి అనికూడా చూశాము. అహంకారం మరణిస్తుంది అంటే అహంకారం మళ్ళీ తోక జాడించదని అర్థం. జ్ఞాని ఈ విషయాన్ని బాగా అర్థం చేసుకుంటాడు. ఇన్నాళ్ళూ అహంకారం ఆడింది ఆటగా, పాడింది పాటగా చెల్లింది. ఇప్పుడా పప్పులేమీ ఉడకవు. అది ఆత్మ అయిన తను వాడే ఒక పరికరం మాత్రమే అని జ్ఞాని అర్థం చేసుకుంటాడు.

జ్ఞానికి బ్రహ్మలో రమించటానికి అహంకారం అవసరంలేదు, కాని నేను బ్రహ్మను అని చెప్పటానికి, గురువుగా బోధ చేయటానికి అహంకారం కావాలి. అంటే మిథ్యావ్యవహారాన్ని నడపటానికి మిథ్యా అహంకారం వాడతారు.

ఒక్కముక్కలో చెప్పాలంటే సద్దర్శనం చేస్తే జ్ఞాని జీవన్ముక్తి, విదేహముక్తి పొందుతాడు. సద్దర్శనం ఎలా చేయాలి?

**సద్దర్శనం = అహంకార మూల ఆత్మవిచారణ**

**– రాఘవ రావు**



ఆర్ష సంస్కృతి - సంప్రదాయ - వేదాంత తత్త్వ
త్రివేణీ సంగమ సదృశులు

**శ్రీమతి మద్దూరి రాజ్యశ్రీ - శ్రీ కస్తూరి వీరరాఘవరావు**

పుణ్యదంపతులకు

## ప్రశంసన మాలిక

ఆర్ష విద్యా తరంగిణి సంస్థకు మూలభూతులై, దివ్యతత్త్వప్రతిపాదకమైన "ప్రస్థానత్రయము"లను శ్రీశ్రీశ్రీ పరమార్థానందస్వామి వారి బోధనలతో సమన్వయించి, స్వీయవాదమున తేట తెలుగులో ప్రకటిస్తూ ఆత్మ సంస్కారంతో జీవన పరమార్థాన్ని ఆకళింపు చేసుకొని నిరంతరం ఆధ్యాత్మిక చింతనలో పునీత చేతనులైన పుణ్యదంపతులు మీరు.

గురుకృపా కటాక్షంతో భగవద్గీత, దశోపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు 8 సంవత్సరాల కాలంలో మీరు మీ సత్సంగ సభ్యులకు బోధించడము, పుస్తక రూపంలో వెలువరించడము అనితర సాధ్యము. శ్రుతి, స్మృతి విషయక ఆంధ్ర అనువాదములే గాక,కొన్ని భారతీయవైద్యవిధానములు,ఆరోగ్య సూత్ర గ్రంథములు తెలుగు నుండి ఆంగ్లభాషానువాదాలు, వ్యాసాలు, కథలు, కవితలు, శీర్షికలు, ఛలోక్తులు వంటివి. 'భావం పతిది - భాష సతిది' అన్నట్లు పుంఖానుపుంఖంగా స్వతంత్ర రచనలు చేశారు మీరు.

వృత్తిరీత్యా విదుషీమణి రాజ్యశ్రీగారు ఆంగ్లోపన్యాసకులు - మహోదయులు వీరరాఘవరావు గారు గణిత శాస్త్రోపన్యాసకులుగా జీవనయానం ప్రారంభించి అసంఖ్యాక విద్యార్థులకు, శిష్యగణాలకు నేడు ఆరాధ్యులైన ఆదర్శ గురుదంపతులు మీరు. మీ జీవన మార్గమే మీ రచనల అంతస్సారం.

పుణ్యాత్ములైన మీ కృషికి మీ ఉపజ్ఞకు, మీ ప్రజ్ఞా శేముషికి, నిరంతర ఆధ్యాత్మిక, సామాజిక పరివస్యకు ఉడతా భక్తిగా మా ఫౌండేషన్ అందిస్తున్న అక్షరార్చనము.

యన్.టి.ఆర్.కళా ప్రాంగణము
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయము
హైదరాబాదు
సోమవారము, 24.02.25

బుధజన విధేయం
**అజో - విభో - కందాళం ఫౌండేషన్**

అసతోమా సద్గమయ తమసోమా జ్యోతిర్గమయ
మృత్యోర్మా అమృతంగమయ ఓం శాంతిః శాంతిః శాంతిః

తరుణి
ఆన్ లైన్ ఇంటర్ నేషనల్ మహిళా తొలి సమగ్ర దినపత్రిక
AN INTERNATIONAL ONLINE MAGAZINE POWERED BY WOMEN

# అనువాద సరస్వతి – మద్దూరి రాజ్యశ్రీ

అచ్యుతుని రాజ్యశ్రీ


మద్దూరి రాజ్యశ్రీ

అనువాద సరస్వతి బిరుదాంకితురాలైన మద్దూరి రాజ్యశ్రీ అటు తెలుగు సాహిత్యపు పరిమళాల మధ్య ఎమెస్కో ఇంట పెరగటం, ఇటు ఆంగ్ల ఉపన్యాసకురాలిగా, ఆంగ్ల సాహిత్యాన్ని బోధించటంవల్ల రెండు చేతులతోనూ రెండు భాషలనూ ఒడిసిపుచ్చుకున్నారు. అనేక కథలు, కథానికలు, కవితలు, వ్యాసాలు రెండు భాషలలోనూ రచించటమే కాక, అనువాదాలు కూడా అనేకం చేశారు. ఇవన్నీ ఒక ఎత్తైతే, అద్వైత వేదాంతబోధను తన భర్త రాఘవరావుగారితో కలిసి చేస్తూ, అద్వైత వేదాంతంలో ప్రస్థానత్రయాన్ని బోధించటమేకాక, పుస్తకరూపంలో వెలుగులోకి తీసుకువచ్చిన ఘనత వారికే దక్కింది.

ఉద్యోగపర్వంలోనూ, సాహితీరంగంలోనూ 50 వసంతాల తన సుదీర్ఘ పయనంలోని ఎన్నో అనుభవాలను, జ్ఞాపకాలను, అనుభూతులను మాతో కలబోసుకున్నారు. ఆ గుభాళింపులను వారి మాటలలోనే విందాము.

నేను మొట్టమొదటిగా రాసింది రీడర్స్ రిపోర్ట్. నేను యం. శేషాచలం అండ్ కంపెనీ వ్యవస్థాపకులు అయిన శేషాచలం గారి మనవరాలిని. ఎమెస్కో అధినేత యం.యన్.రావుగారి గారాల పుత్రికను. ఎందరో రచయితలు, రచయిత్రులు ఎమెస్కోలో తమ నవలలను ప్రచురించమని వారి వ్రాతప్రతులను పంపుతారు. వాటిని ఎన్నుకునేందుకు ఈ రీడర్స్ రిపోర్ట్ తోడ్పడుతుంది. ఆ నవల సారాంశాన్ని వివరిస్తూ, ఒక పాఠకురాలిగా ఆ నవల ప్రచురణకు అనుగుణంగా ఉందో లేదో చెప్పాలి. నేను బియ్యేలో ఉండగా, మా నాన్నగారు

ఒక నవల ఇచ్చి రీడర్స్ రిపోర్ట్ రాయమన్నారు. అది మా ఎడిటర్‌గారికి చాలా నచ్చింది. సారాంశం రాసిన పద్ధతి ప్రత్యేకంగా ఉందనీ, అందులో పాత్రల మనస్తత్వాన్ని విశ్లేషిస్తూ రాశాననీ మెచ్చుకున్నారు. అది శుభారంభం. అవి రెండువందల పైచిలుకు రాశాను. అంతేకాదు, పుస్తకాలకు బ్యాక్ కవర్ మ్యాటర్ కూడా రాశాను.

అలా ఎడిటోరియల్ వర్క్ ముందు మా నాన్నగారికీ, తరువాత మా అన్న యం.యస్. కుమార్‌కీ చేశాను. అప్పుడు పుస్తకప్రపంచం అని ఒక మ్యాగజైన్ వచ్చేది. అది సభ్యులకు ఉచితంగా ఇచ్చేవారు. అందులో వచ్చే నెలలో ప్రచురించే పుస్తకం గురించి రివ్యూ రాసేదాన్ని. ఇవి బాగున్నాయి, 'కథలు ఎందుకు రాయవు?' అన్నాడు యం.యస్. కుమార్. 'ఒకటి రాసే ఉంది, నీకు నచ్చుతుందో లేదోనని ఇవ్వలేదు,' అంటూ వెంటనే నా వ్రాతప్రతిని ఇచ్చాను. మా అన్న అప్పటికప్పుడు అది చదివి చాలా బాగుందని చెప్పి తనే దానికి 'ఇల్లే ఇలలో స్వర్గం' అని పేరు పెట్టాడు. అందులో చివరిలైను – 'అప్పటినుంచీ రవి ఇంట్లో ఉండగా షర్ట్ విప్పితే ఒట్టు.'

తనకు అది చాలా నచ్చింది. ఓ హెన్రీ కథల్లో ఉండే ట్విస్ట్ ఉంది నీ రచనలో అన్నాడు. నీ శైలి నీకు పెద్ద ఎస్సెట్ అని నాకొక కితాబు కూడా ఇచ్చాడు. ఈ ప్రశంసను ఆరోజు నుంచీ ఈరోజు వరకూ అనేకమంది నోటంట వింటూనే ఉన్నాను. దాని తర్వాత, ఇంక వెనక్కి తిరిగి చూడలేదు.

'భావం నాదీ, భాష నీదీ,' అని మావారు నాచేత అనేక కథలు రాయించారు. పుస్తక ప్రపంచం అంతా మా కథలు, వ్యాసాలతో నిండిపోయేది. మగవారికి పొట్టిజుట్టు ఎందుకు? ఫోర్క్‌లు ఎందుకు వాడతారు? ఇటువంటివి ఎన్నో! తను కార్టూన్లు వేసేవారు, నేను జోక్స్ రాసేదాన్ని. ఈనాడు, జయంతి పత్రికలలో కూడా కథలు, కవితలు ప్రచురితమయ్యాయి. అంతేకాక ట్రాచెన్‌బర్గ్ సిస్టమ్ ఆధారంగా **ఎక్కాలే అక్కరలేని లెక్కలుగా** సీరియల్‌గా రాశాము.

ఆ రోజుల్లోనే యం.యస్ కుమార్ **వార్మా** అనే చిన్నపిల్లల మ్యాగజైన్ ప్రచురించేవాడు. అది తెలుగులో ఎవరో అనువదించారు కాని, తనకు అది నచ్చలేదు. నేనెవరి చేతనైనా వ్రాయిస్తే మీకు అభ్యంతరమా అని అడిగాడుట. వారు ఫర్వాలేదు అంటే నా దగ్గరకు తీసుకువచ్చి, రెండు రోజుల్లో రాసివ్వమన్నాడు. అందులో ముందే బొమ్మలు ప్రింటయి వస్తాయి. ఆ మధ్యభాగంలో తెలుగులో రాసింది వస్తుంది. ముందు నేను భయపడ్డా, ధైర్యం చేసి రాశాను. అందులో యాజ్ దాసీ లేఖలు అని ఉండేది. అది చాలా బాగుండేది. ముందు అది రాసేదాన్ని. ఇది రెండేళ్ళు కొనసాగింది. వారి నవల ఒకటి '**ఎ క్రై ఫ్రమ్ ది హార్ట్**'ను కూడా అనువదించాను. అవి కాక **ఆలిస్ ఇన్ వండర్‌లాండ్** అనువదించాను.

అనువాదాలమీద రీసెర్చ్ చేస్తున్న ఒక రీసెర్చ్ స్కాలర్ ఇది బాగుందని నా దగ్గరికి వచ్చి నన్ను ఇంటర్వ్యూ చేసింది.

మా నాన్న గురించి, రెండు సభల్లో ప్రసంగించాను, ఐదారు పత్రికల్లో ప్రచురించారు. కాని అన్నిచోట్ల యం.యన్.రావుగారి గురించి ఒక జర్నలిస్ట్‌గానే ఉండేది కాని కూతురుగా ప్రస్తావించలేదు. అది నచ్చి కౌముదిలో కిరణ్‌ప్రభగారు మన రచయితలు/త్రులు పేరిట రెండు సంవత్సరాలు నా వ్యాసాలను ప్రచురించారు. ఒక్కొక్క రచయిత గురించి వారి రచనాశైలిమీద రెండు పేజీలు, వారి ముఖ్య నవలమీద నాలుగైదు పేజీలు రాశాను.

పెళ్ళికి ముందునుంచే ఇంగ్లీషు లెక్చరర్‌గా బందరులో ఎస్పియమ్‌హెచ్ కళాశాలలోనూ, పెళ్ళయ్యాక హైదరాబాద్‌లో నాగార్జునా జూనియర్ కాలేజీలోను 35 సంవత్సరాలు ఉద్యోగం చేశాను. రెండింటిలోనూ ఇంటర్వ్యూ కమిటీ వారు రాజ్యశ్రీని తీసుకోండి, ఆమె మీ కాలేజీకి ఎస్సెట్ అవుతుంది అని చెప్పారుట. ఇంట్లో అందరికన్నా చిన్నదాన్ని, చాలా సున్నితమైన మనస్సుతో పెరిగాను. ఎవరైనా ఏదైనా అంటే ఏడిచేదాన్ని. అలాంటిదాన్ని లెక్చరర్‌గా ఉద్యోగం చేయగలనా అని భయపడ్డారు మావాళ్ళు. కాని ఎక్కడ చేసినా, చేరిన కొన్నాళ్ళలోనే యాజమాన్యం, విద్యార్థుల హృదయాలను చూరగొనేదాన్ని. అందులోనూ ఇంగ్లీషు బోధించేదాన్ని కాబట్టి నా సాహితీ గుభాళింపులను అక్కడ విరబూయిస్తూండేదాన్ని. నేను చదివినవీ, నాకు నచ్చినవీ, విద్యార్థులకు ఉపయోగపడేవీ నా బోధలో చొప్పించేదాన్ని. **జెమ్స్ ఇన్ పెడగాగీ** పేరిట 50 రత్నాలు, జీవితసత్యాలు ఏరి వారికి ఇచ్చేదాన్ని. ఊరికే ఇవ్వటం కాదు, ప్రిన్సిపల్‌తో సహా అందరూ వాటిలో వారికి నచ్చినది ఒకటి చెప్పాలి. వాటిలో ఓ ఉదాహరణ – **కని, పెంచిన అమ్మకు నీ తొలిజీతంలో ఏదైనా కానుక ఇవ్వాలి.**

ఇంగ్లీషు గ్రామర్‌మీద నాకున్న మమకారాన్ని చూసి, ఒకరోజు మా ప్రిన్సిపల్ జగన్‌మోహన్‌రెడ్డిగారు వచ్చి మీరొక గ్రామర్ బుక్ రాయండి, నేను పబ్లిష్ చేస్తాను అన్నారు. జూనియర్ ఇంటర్మీడియెట్‌లో గ్రామర్‌కు 60 మార్కులు ఉన్నాయి. దానికోసం బాగా తర్ఫీదు ఇచ్చేవారము. అందువల్ల అలా అన్నారు మా ప్రిన్సిపల్. ఆయన ఇచ్చిన ప్రోత్సాహంతో రెండు, మూడు గ్రామర్ బుక్స్ రెఫర్ చేసి **'ఆఫ్ట్ ఇంగ్లీషు గ్రామర్'** పేరిట ఒక పుస్తకం ప్రచురించాము. నేను అనుకున్నదానికన్నా బాగా వచ్చింది అది. కొందరు లెక్చరర్లు కూడా దాన్ని వాడుకునేవారు.

ఈ సందర్భంలో ఒక అనుభవాన్ని పంచుకోవాలి మీతో. నేను బందరులో పనిచేస్తున్నప్పుడు, అక్కడ తెలుగు మీడియం పిల్లలు ఎక్కువ ఉండేవారు. ఒక అమ్మాయి మా కొలీగ్ చెల్లెలు. నేను డైరక్ట్–ఇన్‌డైరక్ట్ స్పీచ్ చెప్పినప్పుడు, ఆ అమ్మాయి టక్కున జవాబు చెప్పింది. పైగా

నేను చాలా బాగా చెప్పాను కాబట్టి బాగా అర్థమయింది అందిట. దట్ వజ్ ఎ ఫెదర్ ఇన్ మై క్యాప్.

మాది ఎయిడెడ్ కాలేజీ. అందువల్ల పదవీ విరమణ చేసినప్పుడు నాకొచ్చిన ప్రశంసా పత్రంలోంచి నాలుగు వాక్యాలు – 'వృత్తిరీత్యా ఆంగ్లభాషను బోధిస్తూ, ఎమెస్కో వారి వారసత్వపు సంపదగా తెలుగు భాషాభిమానము రచనా కౌశలము గల రాజ్యశ్రీ మేడమ్ గారి కలం నుండి జాలువారిన స్వతంత్ర రచనలు – అనువాదల నవలలు – ఎన్నో ప్రక్రియలు వారి బహుముఖ ప్రజ్ఞను చాటిచెప్తాయి. విద్యార్థులకు ఆమె ఒక ఆరాధ్యదైవం, కళాశాల యాజమాన్యానికి ఒక ఆదర్శ ఉపాధ్యాయురాలు, కళాశాలకు ఒక ఎస్సెట్.'

ఉద్యోగం చేస్తున్న రోజుల్లోనే ఫ్యామిలీ ఫ్రెండ్ విష్ణుప్రసాద్ గారి ద్వారా మంతెన సత్యనారాయణరాజు గారి ప్రసంగం వినటం తటస్థించింది. ఆయన ప్రోత్సాహంతో, మంతెన గారి అంగీకారంతో ఆయన పుస్తకాలు నాలుగు తెలుగు నుండి ఇంగ్లీషుకు అనువదించాను. తెలుగులో వాటి పేర్లు ఆరోగ్యమే ఆనందం, మధుమేహానికి ప్రకృతివైద్యం, మలబద్ధకం, నీరు–మీరు. మలబద్ధకంమీద అమెరికానుంచి ఎవరో అడిగిమరీ వ్రాయించుకున్నారు. ఈ పుస్తకాలను విడుదల చేసేటప్పుడు విజయవాడలో ఆయన ప్రకృతి ఆసుపత్రి ప్రాంగణంలో, 1000 మంది సభ్యుల సమక్షంలో, నన్ను సన్మానం చేసి, '**అనువాద సరస్వతి**' అని పేరు చెక్కించి, సరస్వతీదేవి ఉన్న పెద్ద మొమెంటో బహుకరించారు. అది నా జీవితంలో మరపురాని రోజు. ఇవికాక ఆంధ్రభూమిలో యువగీత, శ్రీపీఠంలో మానవీయ విలువలు, సాక్షిలో ఆధ్యాత్మకథలు, ధ్యాన భావనలు; ఇంటర్నెట్‌లో ఇంగ్లీషులో పర్సెనాలిటీ డెవలప్‌మెంట్ త్రూ గీత, డివొటీస్ స్టోరీస్, భజగోవిందమ్‌మీద ప్రేమ్ సిద్ధార్థగారి వ్యాఖ్యానం ప్రచురితమయ్యాయి.



ఈ మజిలీలన్నీ తెలిసిన మా ఇంకొక ఫ్యామిలీ ఫ్రెండ్ రవికుమార్ గారు ఒక అనువాద నవల తెచ్చిచ్చి, 'మీరింతకన్నా బాగా రాయగలరని నాకు తెలుసు. మీరెందుకు ప్రయత్నించకూడదు?' అన్నారు. అది జైకో వారి ప్రచురణ. సరే, ప్రయత్నిస్తే తప్పేముందని నేను వారికి ఒక లేఖ రాశాను. వారు పదిపేజీలు పంపి, దాన్ని అనువాదం చేసి పంపమన్నారు. వారికి అది చాలా నచ్చి, ఇంకా నాచేత ఎన్నో రాయించుకున్నారు. వారి ఎడిటోరియల్ బోర్డులో నన్ను చేర్చుకుని, తక్కిన అనువాదకుల సమీక్షలు చేయించుకునేవారు. ఒకటి రాస్తూండగా ఇంకొకటి పంపటమో, రెండూ ఒకేసారి పంపటమో చేశారు. రాబిన్ శర్మవే ఆరు పుస్తకాలు చేశాను. సెల్ఫ్ హెల్ప్‌మీద, వేదిక్ మాథ్స్‌మీద, పర్సనాలిటీ డెవలెప్‌మెంట్ మీద, పాజిటివ్ థింకింగ్‌మీద అనేకం అనువదించాను.

ఈ పాజిటివ్ థింకింగ్ నార్మన్ విన్సెంట్ పీల్ రాశారు. ఆయన బైబిల్‌లోంచి అనేక కొటేషన్లు వాడారు. నేను ఒక తెలుగు బైబిల్ సంపాదించి, అందునుంచి రాసేదాన్ని. కొన్ని దొరకకపోతే, నా క్రిస్టియన్ ఫ్రెండ్ సహాయం తీసుకునేదాన్ని. కాని అది చాలా బాగుంది. నిజజీవితంలోని ఎందరివో అనుభవాలు, అందులో ఉండేవి. జైకో వారి పుస్తకాలు చూసి, మంజుల పబ్లికేషన్స్ కూడా కొన్ని రాయించుకున్నారు. రెండూ కలిపి 21 వచ్చాయి.

**రాజ్యశ్రీ రచించిన పుస్తకాలు**



నేను రిటైర్ అవకముందే మావారు రాఘవరావుగారు చెన్నైకు చెందిన పరమార్థానందస్వామి వారి బోధలు వింటూండేవారు. స్వామీజీ అద్వైత వేదాంతం బోధించేవారు. మా ఇంట్లో ఇటుక, ఇటుకకూ ఆయన బోధ సుపరిచితమే. నేను వంట చేసుకుంటూ, ఆయన గొంతు వినేదాన్ని కాని అది ఏమిటో తెలియలేదు ముందు. ఒక శుభముహూర్తాన (నిజంగా అది శుభముహూర్తమే) కుతూహలం కొద్దీ ఏమిటి వింటున్నారు అని అడిగాను మావారిని. నువ్వే విను, నీకు తెలుస్తుంది అనిచెప్పి ముండకోపనిషత్తు నా సెల్‌లో వేసి ఇచ్చి, రోజుకొక లెక్చర్ కింద వినమన్నారు. అవి 36 లెక్చర్లు ఉన్నాయి.

అది వినేనాటికి నాకు అసలు అద్వైతం అంటే ఏమిటో తెలియదు. ఉపనిషత్తు, ఆత్మ, అనాత్మ, శరీరత్రయం, పంచకోశాలు, కర్మ సిద్ధాంతం – ఈ పదాలతో బొత్తిగా పరిచయం లేదు. అలాంటి అజ్ఞానంలో ఉన్న నేను ముండకోపనిషత్తు వినటం మొదలుపెట్టాను. పరమార్థానందస్వామీజీ పూజ్యస్వామీజీ దయానంద సరస్వతిగారి శిష్యులు. ఎంత బాగా చెప్పారనుకున్నారు! ఆయన గురించి ఎంత చెప్పినా తక్కువే! అసలేమీ తెలియని ప్రపంచంలోకి, స్వయంగా మన చేయి పట్టుకుని, ఒక్కొక్క మెట్టు పైకి ఎక్కించి, ఎక్కడ జారిపోతామో అని మధ్యమధ్యలో జాగ్రత్తగా చూసుకుంటూ, పైకి తీసుకువెళ్ళి ఒక అద్భుతప్రపంచం చూపించారు.

నేను కూడా ఇంగ్లీషు లెక్చరర్‌నేమో, ఒక ఇంగ్లీషు పోయెమ్ ఎలా బోధిస్తామో, అలాగే స్వామీజీ ఒక మంత్రం చదివి, ముందు దాని గురించి కొంత ఉపోద్ఘాతం ఇచ్చి, మళ్ళీ ఒక్కొక్క మంత్రంలోని ఒక్కొక్క పదానికి అర్థం, గూఢార్థం చెప్పి, మళ్ళీ దానికి ముక్తాయింపు పలకటం, మర్నాడు పదినిముషాలు పాత పాఠాన్ని గుర్తు చేసే ఆయన బోధనాశైలి చాలా నచ్చింది. ఆయనది ప్రసంగం కాదు, క్లాస్‌రూమ్ టీచింగ్.

మావారూ, నేనూ కలిసి, మూడుచోట్ల అద్వైత వేదాంతాన్ని బోధించే వారము. అద్వైతవేదాంత పరిచయం, అద్వైతవేదాంతంలో ప్రాథమిక గ్రంథం. శిష్యుల సహకారంతో దాన్ని ప్రచురించాము. అది విశేష ఆదరణ పొంది, నాలుగవ ప్రచురణకు వచ్చింది. అద్వైత వేదాంతంలో ప్రస్థానత్రయం అని ఉంటుంది. అవి – భగవద్గీత, పది ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు (చతుస్సూత్రీ). గురుకృప, సరస్వతీకృపవల్ల ఎనిమిదేళ్ళలో మేమిద్దరం ప్రస్థానత్రయం బోధ చేయటమూ, వాటిని మా సత్సంగసభ్యుల సహాయసహకారాలతో ప్రచురించటం కూడా అయింది. ఇంటర్నెట్‌లో ఇంగ్లీషులో ఎ ట్రియటైజ్ ఆన్ మెడిటేషన్, ఆత్మబోధ, తైత్తిరీయం ప్రచురించబడ్డాయి. మా జీవితంలో ఈ ఆధ్యాత్మిక రంగంలో విజయం ఒక మైలురాయి. మేమిద్దరం రాఘవ రాజీయమ్‌గా, గురుదంపతులుగా, ఒకే బాటలో నడిచే ఆదర్శజంటగా మన్ననలందుకుంటున్నాము.

భగవద్గీతను మూడు షట్కాలుగా (2500 పుటలు) ప్రచురించాము. ఇవికాక కొన్ని ప్రకరణ గ్రంథాలు, అద్వైత జీవనవిధానం అనే గ్రంథాలు కూడా ప్రచురించటం జరిగింది. ఇవన్నీ కలిపి 20 గ్రంథాలు అయ్యాయి. అన్నీ విశేషంగా జనాదరణను పొందాయి. వాటిలో చాలా పునర్ముద్రణకు కూడా నోచుకున్నాయి. పండితులను, పామరులను అందరినీ ఆకట్టుకుంటున్నాయి. జటిలమైన సబ్జెక్టును తేటతెలుగులో రచించారనీ, ఎదురుగుండా కూర్చుని మాట్లాడుతున్నట్టే ఉందనీ, మా దంపతులకు పూర్వజన్మ సుకృతం ఉందనీ, మాకు సరస్వతీకృప అపారంగా ఉందనీ, ఎక్కడా అనువాదంగా లేదనీ, ఇది చూసి మేము కూడా బోధ చేయటానికి వీలుగా ఉందనీ ఎందరో ప్రశంసల వర్షం కురిపించారు.

ఆ విధంగా ఏ రంగంలో చేయి పెట్టినా, ఆ రంగంలో ప్రశంసల వర్షం కురిసిందనీ, నిజానికి ఆయా రంగాల్లో వారే కోరి చేయించుకున్నారనీ చెప్పారు మద్దూరి రాజ్యశ్రీ. 65 పైగా గ్రంథాలు, శీర్షికలు ప్రచురించబడ్డాయి. ప్రస్తుతం వారిరువురు, ఏం ఎస్ టీమ్స్‌లో భగవద్గీత, ఉపనిషత్తులు బోధిస్తున్నారు. ఆర్షవిద్యా తరంగిణి పేరిట యూట్యూబ్‌లో చూడవచ్చు.

***

# సద్దర్శనమ్

శ్రీభగవద్రమణమహర్షి-విరచిత-ద్రావిడగ్రంథస్య సంస్కృతానువాదాత్మకమ్

**మంగళమ్**

సత్ప్రత్యయాః కిం ను విహాయ సన్తం
హృద్యేష చిన్తారహితో హృదాఖ్యః ।
కథం స్మరామస్తమమేయమేకం
తస్య స్మృతిస్తత్ర దృఢైవ నిష్ఠా॥ ॥01॥

మృత్యుంజయం మృత్యుభియాశ్రితానా-
మహంమతిర్మృత్యుముపైతి పూర్వమ్ ।
అథ స్వభావాదమృతేషు తేషు
కథం పునర్మృత్యుధియోఽవకాశః॥ ॥02॥

**గ్రంథారంభః**

సర్వైర్నిదానం జగతోఽహమశ్చ
వాచ్యః ప్రభుః కశ్చిదపారశక్తిః ।
చిత్రేఽత్ర లోక్యం చ విలోకితా చ
పటః ప్రకాశోఽప్యభవత్స ఏకః॥ ॥03॥

**తత్త్వగ్రంథమాలా**

ఆరభ్యతే జీవజగత్పరాత్మ-
తత్త్వాభిధానేన మతం సమస్తమ్ ।
ఇదం త్రయం యావదహంమతి స్యాత్
సర్వోత్తమాఽహంమతిశూన్యనిష్ఠా॥ ॥04॥

సత్యం మృషా వా చిదిదం జడం వా
దుఃఖం సుఖం వేతి ముధా వివాదః ।
అదృష్టలోకా నిరహంప్రతీతి-
ర్నిష్ఠాఽవికల్పా పరమాఽఖిలేష్టా॥ ॥05॥

సరూపబుద్ధిర్జగతీశ్వరే చ
సరూపధీరాత్మని యావదస్తి ।

అరూపకాత్మా యది కః ప్రపశ్యేత్
సా దృష్టిరేకాఽనవధిర్హి పూర్ణా॥ ॥06॥

యత్పంచకోశాత్మకమస్తి దేహం
తదన్తరా కిం భువనం చకాస్తి ।
దేహం వినా పంచవిధం తదేతత్
పశ్యన్తి కే వా భువనం భణన్తు॥ ॥07॥

శబ్దాదిరూపం భువనం సమస్తం
శబ్దాదిసత్తేన్ద్రియవృత్తిభాస్యా ।
సత్తేన్ద్రియాణాం మనసో వశే స్యాత్
మనోమయం తద్భువనం వదామః ॥ ॥08॥

ధియా సహోదేతి ధియాస్తమేతి
లోకస్తతో ధీప్రవిభాస్య ఏషః ।
ధీలోకజన్మక్షయధామ పూర్ణం
సద్వస్తు జన్మక్షయశూన్యమేకమ్ ॥ ॥09॥

భవన్తు సద్దర్శనసాధనాని
పరస్య నామాకృతిభిః సపర్యా ।
సద్వస్తుని ప్రాప్తదాత్మభావా
నిష్ఠైవ సద్దర్శనమిత్యవేహి॥ ॥10॥

ద్వన్ద్వాని సర్వాణ్యఖిలాస్త్రిపుట్యః
కించిత్ సమాశ్రిత్య విభాన్తి వస్తు ।
తన్మార్గణే స్యాద్గలితం సమస్తం
న పశ్యతాం సచ్చలనం కదాపి॥ ॥11॥

విద్యా కథం భాతి న చేదవిద్యా
విద్యాం వినా కిం ప్రవిభాత్యవిద్యా ।
ద్వయం చ కస్యేతి విచార్య మూల-
స్వరూపనిష్ఠా పరమార్థవిద్యా ॥12॥

బోద్ధారమాత్మానమజానతో యో
బోధః స కిం స్యాత్పరమార్థబోధః ।
బోధస్య బోధ్యస్య చ సంశ్రయం స్వం
విజానతస్తద్ద్వితయం వినశ్యేత్ ॥13॥

నిద్రా న విద్యా గ్రహణం న విద్యా
గృహ్ణాతి కించిన్న యథార్థబోధే ।
నిద్రాపదార్థగ్రహణేతరా స్యాత్
చిదేవ విద్యా విలసన్త్యశూన్యా ॥14॥

సత్యశ్చిదాత్మా వివిధాకృతిశ్చిత్
సిధ్యేత్పృథక్సత్యచితో న భిన్నా ।
భూషావికారాః కిము సన్తి సత్యం
వినా సువర్ణం పృథగత్ర లోకే ॥15॥

తద్యుష్మదోరస్మది సంప్రతిష్ఠా
తస్మిన్ వినష్టేఽస్మది మూలబోధాత్ ।
తద్యుష్మదస్మన్మతివర్జితైకా
స్థితిర్జ్వలంతీ సహజాత్మనః స్యాత్ ॥16॥

భూతం భవిష్యచ్చ భవత్స్వకాలే
తద్వర్తమానస్య విహాయ తత్త్వమ్ ।
హాస్యా న కిం స్యాద్గతభావిచర్చా
వినైకసంఖ్యాం గణనేవ లోకే ॥17॥

క్వ భాతి దిక్కాలకథా వినాఽస్మాన్
దిక్కాలలీలేహ వపుర్వయం చేత్ ।
న క్వాపి భామో న కదాపి భామో
వయం తు సర్వత్ర సదా చ భామః॥ ॥18॥

దేహాత్మభావే జ్ఞజడౌ సమానా–
వేకస్య దేహే హృది దీప్త ఆత్మా ।

ఆక్రమ్య దేహం చ జగచ్చ పూర్ణః
పరస్య మేయం తనుమాత్రమాత్మా॥ ॥19॥

అజ్ఞస్య విజ్ఞస్య చ విశ్వమస్తి
పూర్వస్య దృశ్యం జగదేవ సత్యమ్ ।
పరస్య దృశ్యాశ్రయభూతమేకం
సత్యం ప్రపూర్ణం ప్రవిభాత్యరూపమ్॥ ॥20॥

విధేః ప్రయత్నస్య చ కోఽపి వాద-
స్తయోర్ద్వయోర్మూలమజానతాం స్యాత్ ।
విధేః ప్రయత్నస్య చ మూలవస్తు
సంజానతాం నైవ విధిర్న యత్నః ॥21॥

యదీశితుర్వీక్షణమీక్షితార-
మవీక్ష్య తన్మానసికేక్షణం స్యాత్ ।
న ద్రష్టురన్యః పరమో హి తస్య
వీక్షా స్వమూలే ప్రవిలీయ నిష్ఠా ॥ ॥22॥

ఆత్మానమీక్షేత పరం ప్రపశ్యే-
దిత్యాగమోక్తేః సులభో న భావః ।
నాత్మైవ దృశ్యో యది కా కథేశే
స్వయం తదన్నీభవనం తదీక్షా ॥ ॥23॥

ధియే ప్రకాశం పరమో వితీర్య
స్వయం ధియోఽన్తః ప్రవిభాతి గుప్తః ।
ధియం పరావర్త్య ధియోన్తరేఽత్ర
సంయోజనాన్నేశ్వరదృష్టిరన్యా॥ ॥24॥

న వక్తి దేహోఽహమితి ప్రసుప్తౌ
న కోఽపి నాభూవమితి ప్రవక్తి ।
యత్రోదితే సర్వముదేతి తస్య
ధియాఽహమః శోధయ జన్మదేశమ్॥ ॥25॥

దేహో న జానాతి సతో న జన్మ
దేహప్రమాణోఽన్య ఉదేతి మధ్యే ।
అహంకృతిగ్రన్థివిబంధసూక్ష్మ-
శరీరచేతోభవజీవనామా॥ ॥26॥

రూపోద్భవో రూపతతిప్రతిష్ఠో
రూపాశనో ధూతగృహీతరూపః ।
స్వయం విరూపః స్వవిచారకాలే
ధావత్యహంకారపిశాచ ఏషః॥ ॥27॥

భావేఽహమః సర్వమిదం విభాతి
లయేఽహమో నైవ విభాతి కించిత్ ।
తస్మాదహంరూపమిదం సమస్తం
తన్మార్గణం సర్వజయాయ మార్గః॥ ॥28॥

సత్యా స్థితిర్నాహముదేతి యత్ర
తచ్చోదయస్థానగవేషణేన ।
వినా న నశ్యేద్యది తన్న నశ్యేత్
స్వాత్మైక్యరూపా కథమస్తు నిష్ఠా॥ ॥29॥

కూపే యథా గాఢజలే తథాన్త-
ర్నిమజ్జ్య బుద్ధ్యా శితయా నితాన్తమ్ ।
ప్రాణం చ వాచం చ నియమ్య చిన్వన్
విన్దేన్నిజాహంకృతిమూలరూపమ్॥ ॥30॥

మౌనేన మజ్జన్మనసా స్వమూల-
చర్చైవ సత్యాత్మవిచారణం స్యాత్ ।
ఏషోఽహమేతన్న మమ స్వరూప-
మితి ప్రమా సత్యవిచారణాంగమ్ ॥ ॥31॥

గవేషణాత్ప్రాప్య హృదన్తరం తత్
పతేదహన్తా పరిభుగ్నశీర్షా ।

అథాహమన్యత్స్ఫురతి ప్రకృష్టం
నాహంకృతిస్తత్పరమేవ పూర్ణమ్ ॥ ॥32॥

అహంకృతిం యో లసతి గ్రసిత్వా
కిం తస్య కార్యం పరిశిష్టమస్తి ।
కించిద్విజానాతి స నాత్మనోఽన్యత్
తస్య స్థితిం భావయితుం క్షమః కః॥ ॥33॥

ఆహ స్ఫుటం తత్త్వమసీతి వేద-
స్తథాప్యసమ్ప్రాప్య పరాత్మనిష్ఠామ్ ।
భూయో విచారో మతిదుర్బలత్వం
తత్సర్వదా స్వాత్మతయా హి భాతి॥ ॥34॥

న వేద్మ్యహం మాముత వేద్మ్యహం మా-
మితి ప్రవాదో మనుజస్య హాస్యః ।
దృగ్దృశ్యభేదాత్ కిమయం ద్విధాత్మా
స్వాత్మైకతాయాం హి ధియాం న భేదాః॥ ॥35॥

హృత్ప్రాప్య సద్ధామ నిజస్వరూపే
స్వభావసిద్ధేఽనుపలభ్య నిష్ఠామ్ ।
మాయావిలాసః సదసత్సరూప-
విరూపనానైకముఖప్రవాదాః॥ ॥36॥

సిద్ధస్య విత్తిః సత ఏవ సిద్ధిః
స్వప్నోపమానాః ఖలు సిద్ధయోఽన్యాః ।
స్వప్నః ప్రబుద్ధస్య కథం ను సత్యః
సతి స్థితః కిం పునరేతి మాయామ్॥ ॥37॥

సోఽహంవిచారో వపురాత్మభావే
సాహాయ్యకారీ పరమార్గణస్య ।
స్వాత్మైక్యసిద్ధౌ స పునర్నిరర్థో
యథా నరత్వప్రమితిర్నరస్య॥ ॥38॥

ద్వైతం విచారే పరమార్థబోధే
త్వద్వైతమిత్యేష న సాధువాదః ।
గవేషణాత్ప్రాగ్దశమే వినష్టే
పశ్చాచ్చ లబ్ధే దశమత్వమేకమ్ ॥ ॥39॥

కరోమి కర్మేతి నరో విజానన్
బాధ్యో భవేత్కర్మఫలం చ భోక్తుమ్ ।
విచారధూతా హృది కర్తృతా చేత్
కర్మత్రయం నశ్యతి సైవ ముక్తిః॥ ॥40॥

బద్ధత్వభావే సతి మోక్షచిన్తా
బన్ధస్తు కస్యేతి విచారణేన ।
సిద్ధే స్వయం స్వాత్మని నిత్యముక్తే
క్వ బంధచింతా క్వ చ మోక్షచిన్తా॥ ॥41॥

రూపిణ్యరూపిణ్యుభయాత్మికా చ
ముక్తిస్త్రిరూపేతి విదో వదన్తి ।
ఇదం త్రయం యా వివినక్త్యహంధీ-
స్తస్యాః ప్రణాశః పరమార్థముక్తిః॥ ॥42॥

సద్దర్శనం ద్రావిడవాఙ్నిబద్ధం
మహర్షిణా శ్రీరమణేన శుద్ధమ్ ।
ప్రబన్ధముత్కృష్టమమర్త్యవాణ్యా-
మనూద్య వాసిష్ఠమునిర్వ్యతానీత్॥ ॥43॥

సత్తత్త్వసారం సరలం దధానా
ముముక్షులోకాయ ముదం దదానా ।
అమానుషశ్రీరమణీయవాణీ-
మయూఖభిత్తిర్మునివాగ్ విభాతి॥ ॥44॥

॥సద్దర్శనం సమాప్తమ్॥

# శ్రీగణపతి ప్రార్థన

ఓం గణానాం త్వా గణపతిగ్ం హవామహే
కవిం కవీనాముపమశ్రవస్తమమ్।
జ్యేష్ఠరాజం బ్రహ్మణాం బ్రహ్మణస్పత ఆ నః
శృణ్వన్నూతిభిస్సీద సాదనమ్॥

ప్రణో దేవీ సరస్వతీ వాజేభిర్వాజినీవతీ ।
ధీనామవిత్ర్యవతు । గణేశాయనమః ।
సరస్వత్యైనమః । శ్రీ గురుభ్యోనమః ।
హరిః ఓమ్ ॥

ఓం శాంతిః శాంతిః శాంతిః॥

### భగవద్రమణ మహర్షి కృత

# సద్దర్శనం

## ఉపోద్ఘాతం

రమణమహర్షి విరచిత **సద్దర్శనం** ఒక అద్భుతమైన వేదాంతగ్రంథం. రమణమహర్షి ఒక గొప్ప మహాత్ముడు, గొప్ప అద్వైత గురువు. ఈయన తిరువణ్ణామలైలో ఉండేవారు. ఈయన తెలుగులో, తమిళంలో, సంస్కృతంలో అనేక గ్రంథాలు రచించారు. **సద్దర్శనం** అనే గ్రంథాన్ని తమిళంలో **ఉళ్ళదు నార్పదు** అనే పేరుతో రచించారు. ఉళ్ళదు అంటే సత్యం. సత్యం అంటే ఉనికి. ఉనికి ఒక్కటే సత్యం. నార్పదు అంటే నలభై అని అర్థం. అంటే 40 సత్యాలు ఉన్నాయని కాదు అర్థం. ఉన్నదొకటే సత్యాన్ని 40 శ్లోకాల్లో వివరించారు రమణ మహర్షి. అది కూడా చాలా లోతైన, గంభీరమైన పదాలతో వివరించారు.

మన అదృష్టం కొద్దీ ఈ తమిళగ్రంథాన్ని రమణమహర్షి శిష్యులలో ఒకరైన వాసిష్ఠ గణపతిముని సంస్కృతంలోకి అనువదించారు. ఈయనను కావ్యకంఠ గణపతిముని అని కూడా అంటారు. ఈయన రమణమహర్షి గ్రంథాన్ని దానికి ధీటుగా, అందంగా అనువదించారు. సంస్కృతంలో ఆయన పెట్టిన పేరు సద్దర్శనం. ఉళ్ళదుని సత్‌గా అనువదించారు ఆ ముని.

**సదేవ సోమ్య ఇదమగ్ర ఆసీత్ ఏకమేవాద్వితీయమ్**– ఛాందోగ్యమ్

ఈ జగత్తు రాకముందు సత్ మాత్రమే ఉందని అందులో వస్తుంది. ఆ శుద్ధ సత్ లేదా ఉనికిని ఇక్కడ చూస్తున్నాము. దర్శనం అంటే జ్ఞానం. అందువల్ల సద్దర్శనం అంటే సత్ గురించిన జ్ఞానం. సద్విద్యా బ్రహ్మ. ఇంకో విధంగా చెప్పాలంటే ఈ సద్దర్శనము బ్రహ్మవిద్యను బోధిస్తుంది. రమణమహర్షి రచనలో 40 శ్లోకాలు ఉంటే, ఇందులో 44 శ్లోకాలు చూస్తాం. అంటే కొన్ని ఈ వాసిష్ఠముని కలిపి ఉండవచ్చు.

అద్వైత వేదాంత అధ్యయనంలో ఈ సద్దర్శనం చాలా ప్రసిద్ధి కెక్కింది. ఎందుకంటే రమణమహర్షిని వేదాంత ఆచార్యులలో ఒకరుగా పరిగణిస్తాము. రమణమహర్షి గురువెవరో మనకు తెలియదు. ఆయన ఒక గురువు ద్వారా అద్వైత వేదాంతాన్ని అధ్యయనం చేశారో లేదో కూడా తెలియదు. కాని ఆయన రచనలు చూస్తే మాత్రం ఒక విషయాన్ని స్పష్టంగా చెప్పగలము. ఆయన ఖచ్చితంగా వేదాంత గ్రంథాలని అధ్యయనం చేసి ఉండాలి.

ప్రస్థానత్రయంగా పేరుపొందిన ఉపనిషత్తులను, భగవద్గీతను, బ్రహ్మసూత్రాలను లోతుగా అధ్యయనం చేసి ఉండాలి. ఎందుకంటే ఆయన రచనల్లో వేదాంతసారం బాగా కనిపిస్తుంది. అందువల్ల రమణమహర్షిని కూడా సాంప్రదాయ గురువుగా గౌరవిస్తాము.

ఈ విషయం ప్రత్యేకించి చెప్పడం ఎందుకంటే కొంతమంది రమణమహర్షిది ఒక ప్రత్యేకమైన సిద్ధాంతమనీ, అది మన సాంప్రదాయబోధకు భిన్నంగా ఉందనీ, అందువల్ల ఆయనను సాంప్రదాయ ఆచార్యులుగా పరిగణించకూడదనీ భావిస్తారు. కాని మనం కూడా రమణమహర్షి బోధను అలా వారి పద్ధతిలో చూస్తే, మనం ఆయన బోధలోని అద్భుతాన్ని దర్శించని వారమవుతాము. అందువల్ల వారి వలలో మనం పడకుండా, రమణమహర్షిని వేదాంతశాస్త్ర ఆచార్యుల్లో ఒకరిగానూ, ఆయన బోధను వేదాంతబోధగానూ స్వీకరించి, తక్కిన వేదాంత గ్రంథాలను అధ్యయనం చేసిన రీతిలో వీరివి కూడా అధ్యయనం చేస్తే చాలా లబ్ధి పొందుతాము.

ఎప్పుడైతే వీరిని వేదాంత ఆచార్యులుగానూ, వీరి బోధను వేదాంతబోధగానూ పరిగణిస్తామో అప్పుడే రమణమహర్షిగారి గ్రంథాలను ప్రకరణ గ్రంథాలుగా పేర్కొనవచ్చు. వివేకచూడామణి, సర్వవేదాంత సిద్ధాంతసార సంగ్రహము, ఆత్మబోధ, తత్త్వబోధ, సద్దర్శనం– అన్నీ కూడా ప్రకరణ గ్రంథాల్లోకి వస్తాయి.

ఎప్పుడైతే రమణమహర్షి గ్రంథాలను ప్రకరణగ్రంథాలుగా స్వీకరిస్తామో అప్పుడే వాటిని అధ్యయనం చేసే తీరు కూడా నిర్ణయం అయిపోతుంది. ప్రకరణ గ్రంథాల అధ్యయనం ఇదమిత్థంగా ఉంటుంది. సాంప్రదాయ పద్ధతిలో శ్రుతి, యుక్తి, అనుభవ ప్రమాణాల ద్వారా అధ్యయనం చేస్తాము.

శ్రుతి అంటే వేదాంతం లేదా ఉపనిషత్తులు. ఈ ప్రకరణ గ్రంథాల్లోని బోధ ఉపనిషత్తుల్లో చేసిన బోధకు అనుగుణంగా ఉండాలి. యుక్తి అంటే తర్కం. తర్క సమ్మతంగా ఉండాలి. అది కూడా శ్రుతిసమ్మత తర్కం అయివుండాలి. ఇకపోతే అనుభవం. అనుభవం అంటే ఏవో అసాధారణ అనుభవాలు కాదు, మన రోజువారి అనుభవాలే! అవస్థాత్రయం అంటే జాగ్రత్, స్వప్న, సుషుప్తి అవస్థలను ఆధారంగా తీసుకుని వేదాంతబోధ సాగుతుంది. ఈ సద్దర్శనమే కాదు, ఏ ప్రకరణ గ్రంథాన్ని తీసుకున్నా కూడా ఈ మూడు నియమాలను – శ్రుతి, యుక్తి, అనుభవ ప్రమాణాలను వాడాలి. అప్పుడే ఆ గ్రంథంవల్ల కలిగే ప్రయోజనాన్ని పొందగలము.

రమణమహర్షి కూడా ఈ శ్రుతి, యుక్తి, అనుభవ ప్రమాణాలను ఎన్నుకున్నా కూడా, ఆయనకు తనదంటూ ఒక ప్రత్యేకమైన నేర్పు, కూర్పు, ఆలోచనాశైలి ఉన్నాయి. ఆయన వేదాంతంలోని సూక్ష్మాన్ని గ్రహించినవారు కాబట్టి, ఈ వేదాంత లోతుల్లోకి వెళ్ళటానికి

సులభమైన మార్గాన్ని ప్రతిపాదించారు. మనం ఆయనయొక్క బాణి, ఆయనయొక్క ప్రత్యేక విధానాన్ని అందుకోవాలంటే, ముందు మనకు అసలు సాంప్రదాయ బోధ ఏ విధంగా సాగుతుందో అర్థం కావాలి. అందువల్ల రమణుల వారి గ్రంథాన్ని అర్థం చేసుకునేముందు వేదాంతంలోకి తొంగిచూద్దాము.

వేదాంతబోధ ఏమిటి? అది మూడు దశలుగా సాగుతుంది. అవి సంసారకారణం, ద్వైతదర్శనం, ద్వైతనివారణ.

1. **సంసారకారణం** – మనిషి సంసారంలో పడి ఎందుకు కొట్టుమిట్టాడుతున్నాడు అనే సమస్యను వేదాంతం విశ్లేషించి, దానికి కారణం ద్వైతం అని నిర్ణయించింది. ద్వైతం అంటే నానాత్వం, అంటే అనేకంగా చూడటం. ఒక్క ముక్కలో చెప్పాలంటే భేదదర్శనం. దీన్నే ద్వైతభావన అంటారు.

**ద్వితీయాద్వై భయం భవతి** – బృహదారణ్యకమ్

మనకు భిన్నంగా రెండో వస్తువు ఉంటే చాలు, అది భయహేతువు అవుతుందని వస్తుంది బృహదారణ్యకంలో. రెండవది ఉంటే భయం వేస్తోంది అంటే, రెండవది లేకపోతే మోక్షం అని అర్థం. ద్వైతం భయాన్ని, సమస్యలను, ఆందోళన కలిగిస్తే, అద్వైతం వీటిని పారద్రోలి అభయాన్ని, నిశ్చింతను, పూర్ణత్వాన్ని కలుగజేస్తుంది. భేదం సంసారకారణం అయితే, అభేదం మోక్షం ఇస్తుంది. అభేదాన్ని అద్వైతం అంటారు.

**ద్వైతభేదాత్ సంసారః**
**అద్వైత అభేదాత్ మోక్ష ఆనందః**

ఎప్పుడైతే మీరు ద్వైతంనుంచి విడివడి అద్వైతంలో ఉన్నారో, అద్వైతసిద్ధిని పొందారో అప్పుడే మీ జీవితం సుగమంగా సాగిపోతుంది. మీకు జీవన్ముక్తి లభిస్తుంది. ఈ భావాన్ని ఈశావాస్యోపనిషత్తు చక్కగా వివరించింది.

**తత్ర కో మోహః కః శోకః ఏకత్వమనుపశ్యతః** – ఈశావాస్యమ్

ఏకత్వం అంటే అభేదం లేదా అద్వైతం. ఎవరైతే అద్వైతాన్ని అనుభవిస్తారో అతనికి మోహం ఎక్కడిది? శోకం ఎక్కడిది? అంటే వారికి శోకమోహాలు లవలేశం కూడా ఉండవు. అలా సంసార కారణం మొదటి దశ, మొదటి పాఠం.

2. **ద్వైతదర్శనం** – ద్వైతదర్శనమే సంసారకారణం అని తేల్చి చెప్పింది కదా శాస్త్రం! ద్వైతదర్శనం ఎలా కలుగుతున్నది అంటే మూడు రూపాలుగా అవుతున్నది అంటుంది శాస్త్రం. అవి జీవుడు, జగత్తు, ఈశ్వరుడు.

**జీవుడు** – ఈ మూడు రూపాల్లో మొట్టమొదటిది జీవుడు. జీవుడు చాలా ముఖ్యమైన రూపం. జీవుడు అంటే నేను. ఇంగ్లీషులో సబ్జెక్టు అంటారు. నేను ఈ జగత్తును చూస్తున్నాను, అనుభవిస్తున్నాను, ఎదుర్కొంటున్నాను, జగత్తు గురిచేసే చిత్రహింసలకు గురి అవుతున్నాను, అందువల్ల చాలాసార్లు నిస్సహాయంగా అనిపించి, నిరాశానిస్పృహలకు లోనవుతున్నాను. ఒక్కముక్కలో చెప్పాలంటే మొదటి దశలో చూసిన సంసారాన్ని అనుభవించే నిస్సహాయ సంసారి. ఈ సంసారి జీవుడు ఈ ద్వైతదృష్టిలో మొట్టమొదటి సభ్యుడు. అహంకార పూరితమైన వ్యక్తి. ఈ నానాత్వంలో ముఖ్యమైన సభ్యుడు. ఇతన్ని సాంకేతికంగా వర్ణించాలంటే **జీవుడు** అంటారు. మూడు రకాల పురుషులలో చెప్పాలంటే ఉత్తమపురుషుడు – నేను.

**జగత్తు** – ఈ నానాత్వంలోని రెండవ అంశం, ఇందాక నేను ఎదుర్కొంటున్న జగత్తు అని చెప్పాము కదా, ఆ జగత్తు. ఎప్పుడైతే నేను ఉన్నాను, నేను ఒక జీవిని అని నాకు ఎరుక అవుతుందో, అప్పుడే నేను తప్పించుకోలేని, నాకు తెలియకుండానే ఎదురయ్యేది, నా ఎదురుగా ఉన్న జగత్తు. ఈ జగత్తు నాకు అతి సన్నిహితంగా అందుబాటులో ఉంది, ప్రత్యక్షంగా, ఎదురుగా ఉంది. ఎదురుగా ఉన్నదాన్ని ఆబ్జెక్టు అంటాము. ఈ ఆబ్జెక్టును పురుషుల పరంగా చెప్పాలంటే ద్వితీయ పురుషుడు. సబ్జెక్టు అయిన నేను ఆబ్జెక్టు అయిన ఈ జగత్తుతో వ్యవహారం నడుపుతున్నాను. అది నాకు అనేక అనుభవాలను కలుగజేస్తున్నది.

ఆబ్జెక్టును లేదా ద్వితీయ పురుషుడిని నువ్వు అంటాము. మొత్తం జగత్తును వేదాంతం **నువ్వు** అంటుంది. అందువల్ల వేదాంత పరిభాషలో నువ్వు అంటే జీవం ఉన్న వ్యక్తులే కాదు, జడపదార్థాలు కూడా వస్తాయి. జడవస్తువు ఎదురుగా ఉంటే, దాన్ని నువ్వు అని సంబోధించము, అయినా అది ఆబ్జెక్టుగా అనుభవంలోకి వస్తున్నది కాబట్టి నువ్వులోకే వస్తుంది. అలా ఇప్పుడు రెండు చూశాము. సబ్జెక్టు అయిన నేను, ఆబ్జెక్టు అయిన జగత్తు.

**ఈశ్వరుడు** – ఈ మూడవ అంశం మానవమాత్రులకే ఉంటుంది కాని, జంతువులకు ఉండదు. ఈ మూడవ అంశం మనిషికి మాత్రమే ఎందుకు వస్తున్నది? ఎందుకంటే మనిషి మాత్రమే బుద్ధిజీవి కాబట్టి. మనిషి జగత్తులో వ్యవహారం నడుపుతున్నప్పుడు, ప్రతిదానికి ఎందుకు, ఎందుకు అనే ప్రశ్న అతన్ని వేధిస్తుంది. అంటే ప్రతి అనుభవం వెనుక ఒక కారణాన్ని అన్వేషిస్తాడు. ఈ అన్వేషణ ఆలోచించేశక్తి ఉన్న మనిషికి మాత్రమే సాధ్యం. ఆవు అడగదు, చెట్టు అడగదు, బల్ల అడగదు కాని మనిషి మాత్రం నిరంతరంగా ఎందుకు అని అడుగుతూనే ఉంటాడు.

ఒక జంతువుకు ఏదైనా నొప్పి వస్తే, అది ఆ బాధను నిశ్శబ్దంగా అనుభవిస్తుంది తప్పితే ఎందుకు వచ్చింది అని శోధించదు. అదే మనిషికి ఏ కడుపునొప్పో వస్తే ఎందుకు వచ్చిందా

అని పరిశోధిస్తాడు. తినకూడనిది ఏం తిన్నాను అని బేరీజు వేసుకుంటాడు. కారణం ఏమిటో తేలేదాకా నిద్ర కూడా పట్టదు అతనికి. ఒకవేళ తనంతట తాను కారణాన్ని వెతికి పట్టుకోలేకపోతే, డాక్టరు దగ్గరకు వెళతాడు. ఇది తప్పించుకోలేని స్వభావం మనిషికి.

ఇలా ప్రతి చిన్నదానికీ కారణం వెతుకుతూపోయే మనిషి ఒక శుభముహూర్తాన ఈ జగత్తుయొక్క సృష్టికర్త ఎవరు అనే సందేహంలో పడతాడు. విజ్ఞానశాస్త్రపరంగా చూస్తే కాస్మాలజీని స్టడీ చేస్తాడు. అదే వేదాంతశాస్త్రపరంగా చూస్తే సృష్టి విచారణ చేస్తాడు. ఈ సృష్టి విచారణ ఫలితంగా మూడవ సభ్యుడు రంగప్రవేశం చేస్తాడు. ఎవరా మూడవ సభ్యుడు? **పరమాత్మ**. జగత్కారణ ఈశ్వరుడు.

ఈశ్వరుడు ఎక్కడ ఉన్నాడు? నా ఎదురుగా లేడు, ఆబ్జెక్టుగా తెలియడు. అందువల్ల భగవంతుణ్ణి అధోక్షజ అంటారు. అక్షజ అంటే కంటికి కనపడేవాడు. అధోక్షజ అంటే కంటికి కనపడనివాడు. అక్ష ప్రత్యక్షం అయితే అధోక్షజ పరోక్షం. ప్రత్యక్షంగా అంటే ఎదురుగా కనపడే వ్యక్తిని నువ్వు అంటాము. ప్రమేయం అంటాము. ఎదురుగా లేని వ్యక్తిని అతడు అంటాము. అంటే పరోక్షం. అప్రమేయం అంటాము. పురుషులలో చెప్పాలంటే ప్రథమ పురుషుడు – అతడు, ఆమె, అది.

ఇప్పుడు మూడు రూపాలు చూశాము – జీవుడు–నేను, జగత్తు–నువ్వు, ఈశ్వరుడు–అతను. జీవుడైన నేను జగత్తుతో వ్యవహారం నడుపుతూ, జగత్తు నన్ను బాధిస్తోందని ఈశ్వరునికి మొరపెట్టుకుంటాను. దీన్ని త్రిపుటి లేదా ట్రయాంగులర్ ఫార్మాట్ అంటారు. ఈ త్రిపుటి సంసారానికి దారితీస్తుంది.

మొదటి దశలో ద్వైతం సంసారానికి కారణం అని చూస్తే, ఇక్కడ ద్వైతం అంటే త్రిపుటి అని చూశాము. ద్వైతం అంటే రెండే అని కాదు, ఒకటికన్నా ఎక్కువ ఉండటం, నానాత్వం ఉండటం, భిన్నత్వం ఉండటం.

3. **ద్వైత నివారణ** – ఈ ద్వైత నివారణ చేసే పద్ధతిలోనే రమణమహర్షి ప్రత్యేకత గోచరిస్తుంది. రమణమహర్షి బోధలోని ప్రత్యేకతను అభినందించాలంటే వేదాంతబోధ ఎలా సాగుతుందో చూడాలి. రెండూ పక్కపక్కనే చూస్తేనే, వాటిలో ఉన్న భేదం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది.

ఆ భేదాన్ని చూసేముందు మళ్ళీ ఒకసారి సమస్యను చూద్దాము. మూడు రూపాలు ఉన్నాయి. అవి జీవుడు–నేను, జగత్తు–నువ్వు, ఈశ్వరుడు–అతను. ఈ మూడింటిని ముక్కాలి పీటయొక్క మూడు కాళ్ళుగా ఊహించుకుందాము. ఈ మూడూ కలిసే పీట అయింది. వీటిలో ఒకటి లేకుండా, తక్కిన రెండూ లేవు. అందువల్ల మీరు ఈ మూడు కాళ్ళల్లో ఏ కాలు లాగినా, తక్కిన రెండూ కూడా మీ ప్రయత్నం లేకుండానే లాగబడతాయి. ఒక్క

కాలుని లాగితే తక్కిన రెండూ కదలకుండా ఉంటాయనుకోవటంలో అర్థంలేదు. ఇప్పుడు ఈ సూత్రాన్ని ఆధారం చేసుకుని, రమణమహర్షి ఈ మూడు కాళ్ళల్లో ఒకటి లాగితే చాలంటున్నారు. ఆ ఒక్కటీ ఏమిటో చూసేముందు, ఈ మూడు ఒకదానితో ఒకటి ఎలా పెనవేసుకుని ఉన్నాయో చూద్దాము.

దీన్ని తార్కికంగానూ నిరూపించవచ్చు, అనుభవపూర్వకంగానూ నిరూపించవచ్చు. జాగ్రదావస్థలో జీవుడనే నేను ఉన్నాను. ఎప్పుడైతే నేను ఉన్నానో, నాకిష్టం ఉన్నా లేకపోయినా అప్రయత్నంగా, సహజంగా జగత్తు కూడా వస్తుంది. అందులో నాకు ఎన్నుకునే హక్కు లేదు. నేను ఉంటాను, ఈ జగత్తు ఎందుకు అనవసరంగా? ఇది నన్ను సతాయిస్తోంది, జగత్తుతో నాకు పనిలేదు అనలేము. నేను ఉనికిలోకి రాగానే, నాతోపాటే జగత్తు కూడా ఉనికిలోకి వస్తుంది. జగత్తు కూడా నాకు అనుభవంలోకి వచ్చేసరికి, భగవంతుడు కూడా వస్తాడు. భగవంతుణ్ణి నేను తలుచుకున్నా, తలుచుకోకపోయినా, భగవంతుణ్ణి నేను స్వీకరించినా, స్వీకరించకపోయినా, భగవంతుడు కూడా ఉన్నాడు. ఎలా? జగత్కారణ ఈశ్వరునిగా. జగత్‌యొక్క సృష్టికారణం అంటే దానితో పాటు స్థితి, లయలను కూడా కలుపుకోవాలి.

జగత్‌యొక్క సృష్టి స్థితి లయకారకుడు ఈశ్వరుడు ఉన్నాడు. నేను ఒప్పుకున్నా, ఒప్పుకోకపోయినా ఆయన త్రిపుటిలో ఒక భాగం. అందువల్ల జాగ్రదావస్థలో మూడూ కలిసి ఉన్నాయి. అంతేకాదు, స్వప్నావస్థలో కూడా మూడూ ఉన్నాయి. కాని సుషుప్తిలోకి వచ్చేసరికి మూడూ ఉండవు. నేను ఎప్పుడయితే గాఢనిద్రలోకి జారుకుంటానో అప్పుడే, నా ప్రయత్నం లేకుండా, సహజంగానే నా జ్ఞానేంద్రియాల అనుభవంలోకి వచ్చే జగత్తు కూడా లయమవుతుంది. చూసే నేను లేను, చూడబడే జగత్తు లేదు. ఈ రెండూ లేకపోతే మూడవ వస్తువు ఎక్కడినుంచి వస్తుంది? మూడవ వస్తువు ఎవరు? పరమాత్మ. త్రిపుటి లేదు. ఉన్నదొకటే అద్వైతం లేదా అభేదం. సుషుప్తిలో ఈశ్వరుడు కూడా లేడు అని మనం మాట్లాడం కాని దానికి చాలా గుండెధైర్యం కావాలి. రమణమహర్షి బోధలో ఈ గుండెధైర్యం కనిపిస్తోంది.

దీన్నిబట్టి మనం నేర్చుకునే మూడవ పాఠం ఏమిటి? అయితే మూడింటినీ అనుభవించాలి, లేదా మూడింటినీ పారద్రోలాలి. ద్వైతనివారణ మూడవ దశ అన్నాము. ద్వైతనివారణ చేయాలంటే ఈ మూడింటినీ నివారించాలి. ఎందువల్లనంటే, ఇప్పుడే చూశాము, ఈ మూడూ ఒకదానితో ఒకటి, ముప్పేట గొలుసులా పెనవేసుకుని ఉన్నాయి.

అందువల్ల ద్వైతనివృత్తి సంసారనివృత్తి అంటే, ద్వైతంలో మూడు వస్తాయని చూశాము. ఆ మూడూ జీవుడు, జగత్తు, ఈశ్వరుడు. అందువల్ల ఈ మూడింటినీ నివారించాలి. పైగా

ఈ మూడు ఒకదానితో ఒకటి పెనవేసుకుని ఉన్నాయని కూడా చూశాము. కాని వచ్చిన చిక్కేమిటంటే జీవుణ్ణి, జగత్తుని ఎలాగైనా పారద్రోలగలము కాని, ఈశ్వరుణ్ణి పారద్రోలాలంటే కష్టం. వ్యావహారిక ఈశ్వరుడు కూడా సంసారకారణం అంటే జీర్ణించుకోవటం కష్టమే మరి. అందువల్లనే వేదాంతం కొంతమందికి నాస్తికవాదంగా కనిపించినా ఆశ్చర్యపోనవసరం లేదు. కాని ఇది నమ్మలేని సత్యం.

వ్యవహారంలో మూడు ఉన్నాయి. అవి జీవుడు, జగత్తు, ఈశ్వరుడు అంది శాస్త్రం. అది ద్వైతం అంది.

ద్వైతం సంసారకారణం.
సంసారం పోవాలంటే ద్వైతనివారణ చేయాలి.

మరి ఇప్పుడు చెప్పండి, ఈశ్వరుడు కూడా సంసారకారణం అవునా, కాదా? ఇక్కడ ఈశ్వరుడు అంటే సగుణ ఈశ్వరుడు, పరిమితి ఉన్న నామరూపాలు ఉన్న ఈశ్వరుడు. మీరు వేదాంతంలో కొత్తగా అడుగుపెడితే, ఇది జీర్ణించుకోవటానికి చాలా కష్టపడాల్సి ఉంటుంది. చాలా యుద్ధం చేయాల్సి ఉంటుంది. యుద్ధం అంటే బాహ్యంగా కాదు, ఆంతరంగా. మీ భావాలతో యుద్ధం చేయాల్సి ఉంటుంది. అంటే బుద్ధికి పదును పెట్టాలి.

జీవ జగత్ ఈశ్వర భేదాన్ని పారద్రోలాలంటే ఏం చేయాలి? మీలో ఉన్న ఒక అనారోగ్యాన్ని పారద్రోలాలంటే ఏం చేయాలి? పైన కనబడే లక్షణాలను చూసి, మందు వేస్తే ఆ లక్షణాలు పోతాయేమో కానీ రోగం పోదు. లక్షణాలకు మందు వేయటమంటే రోగాన్ని తాత్కాలికంగా అణచివేయటం అవుతుంది. అందువల్ల మీరేం చేస్తారు? లక్షణాలను మాత్రమే పరిగణనలోకి తీసుకోకుండా, డాక్టరు దగ్గరికి వెళతారు. డాక్టరు రోగకారణాన్ని నిర్ధారించి, ఆ కారణనివృత్తికి మందు ఇస్తాడు.

**రోగకారణనివృత్యా రోగనివృత్తిః**

రోగకారణానికి మందు వేస్తే రోగం పోతుంది.

ఇదే సూత్రాన్ని సంసారమనే భవరోగానికి కూడా అన్వయించాలి. సంసారమనే రోగానికి కారణం ఏమిటి? జీవ, జగత్తు, ఈశ్వరభేదం. అంటే ద్వైతభావన. వేదాంతం ఈ ద్వైతభావన అజ్ఞానంవల్ల కలుగుతున్నది అంటుంది.

**అజ్ఞానమ్ ఏవ జీవ–జగత్–ఈశ్వరభేదస్య కారణమ్**

అజ్ఞానం మూలకారణం, భేదభావన అజ్ఞానంనుంచి వచ్చిన పొరపాటు. రోగపరంగా చూస్తే, భేదభావన రోగలక్షణాలు. ఎప్పుడైతే రోగనిర్ధారణ అయిందో, అప్పుడే దానికి

మందు వేయాలి. రోగం అజ్ఞానం, మందు అజ్ఞాననివృత్తి. అజ్ఞానం అనగానే సరిపోదు. దేని అజ్ఞానం? అజ్ఞానం పదాన్ని ఇంకో పదంతో కలపకుండా ఉచ్చరించలేరు. అజ్ఞానం ఏదో ఒకదాని గురించిన అజ్ఞానం అయివుంటుంది. దానికి విడిగా ఉనికి లేదు. దాన్ని దేనితోనైనా కలిపి వాడాలి.

ఇప్పుడు అజ్ఞానం దేనితో ముడిపడి ఉందో చూద్దాము.

జీవ అజ్ఞానం అందామా? జీవుడు అజ్ఞానంనుంచి పుట్టాడు; జగత్తు అజ్ఞానం అందామా, జగత్తు కూడా అజ్ఞానంనుంచే పుట్టింది. పోనీ ఈశ్వరుడు అందామా? ఈశ్వరుడు కూడా అజ్ఞానంనుంచే పుట్టాడు. అజ్ఞానం అనే కారణంనుంచి పొరపాటు పుడుతుంది. అజ్ఞానం కారణం, పొరపాటు కార్యం అవుతాయి. జీవ జగత్తు ఈశ్వరులు ఆ విధంగా కార్యం. అందువల్ల కారణమైన అజ్ఞానం, ఈ కార్యం అవలేదు. అంటే అజ్ఞానం ఈ భేదమనే పొరపాటుకి భిన్నంగా ఉండాలి. భేదమనే పొరపాటుకి భిన్నంగా ఉన్నది ఏమై ఉంటుంది? సరిగ్గా ఆలోచిస్తే, జవాబు చాలా తేలిక.

భేదభావన పొరపాటు అంటే అజ్ఞానకారణం ఏమిటి? అభేదజ్ఞానం. ఇక్కడ అభేద భావన అనకూడదు. భేదమనే పొరపాటుకి అజ్ఞానం దారితీస్తోంది అంటే అభేదజ్ఞానం పొందితే అజ్ఞానం పోతుంది; అజ్ఞానం పోతే, అజ్ఞానజన్యమైన భేదభావన కూడా పోతుంది. ఇదే నిజం. అజ్ఞానం అనే పదాన్ని ఇంకో పదంతో కలపాలన్నాం కదా? అది అద్వైత అజ్ఞానం అవుతుంది.

### అద్వైత అభేదవస్తు అజ్ఞానమ్ ఏవ జీవ–జగత్–ఈశ్వరభేదస్య కారణమ్

స్వామీజీ వాదనతో ప్రయాణం చేస్తున్నారా? జిడ్డు కృష్ణమూర్తి 'నాతో ఉన్నారా?' అంటుండేవారు. ఇప్పుడు అజ్ఞానకారణం ఏమిటి? అద్వైతభేద వస్తు అజ్ఞానం. ఉన్నదొకటే అద్వైతం, రెండోది లేదు అనే జ్ఞానం పొందకపోవటంవల్ల ఈ త్రిపుటిలో ఉన్నాము.

ఇప్పుడు అజ్ఞానకారణం తెలిసింది. అద్వైత అభేదవస్తుజ్ఞానం పొందాలి. ఇప్పుడు ఈ అద్వైతజ్ఞానాన్ని పొందటం ఎలా? మరొక సమస్య. వేదాంతంలో దీనికి అనేక మార్గాలు వస్తాయి. ఇక్కడ మనం రమణమహర్షి సద్దర్శనం చూస్తున్నామని, ఆయన వేదాంతాన్ని తనదైన శైలిలో వివరిస్తారనీ, ఆ శైలిని చూద్దామనుకున్నామనీ మర్చిపోకూడదు.

రమణమహర్షి జవాబు ఒక్కముక్కలో చెప్పాలంటే సద్దర్శనం చేయాలి. అంటే ఉన్నదొకటే సత్, ఏకమేవాద్వితీయం సజాతీయ విజాతీయ స్వగత భేదాలు లేని సత్. సత్‌ని ఉనికి అంటున్నారు రమణమహర్షి.

**సదేవ సోమ్య ఇదమగ్ర ఆసీత్ ఏకమేవాద్వితీయమ్**– ఛాందోగ్యమ్

అలా వేదాంతంలో కూడా సత్ అనే పదాన్ని చూస్తాము. కొన్నిచోట్ల బ్రహ్మ (నిర్గుణబ్రహ్మ) అని చూస్తాము. ఈ సత్ వివరణను దక్షిణామూర్తి శ్లోకం (3)లో చూస్తాము.

**యస్యైవ స్ఫురణం సదాత్మకమసత్కల్పార్థకం భాసతే**
**సాక్షాత్తత్త్వమసీతి వేదవచసా యో బోధయత్యాశ్రితాన్ ।**
**యస్సాక్షాత్కరణాద్భవేన్న పునరావృత్తిర్భవామ్భోనిధౌ**
**తస్మై శ్రీ గురుమూర్తయే నమ ఇదం శ్రీ దక్షిణామూర్తయే ॥**

సత్ ఆత్మ గురించి వస్తుంది ఇందులో. సత్ అంటే శుద్ధ ఉనికి.

సత్ జీవ జగత్ ఈశ్వరులలో ఒక భాగం కాదు, వారి లక్షణం కాదు, వారినుంచి ఉత్పత్తి చెందలేదు.

సత్ స్వతంత్ర వస్తువు కాని వాటి అన్నింటిలోనూ అంతటా ఉంది.

వాటి అంతటా ఉండటం ద్వారా వాటికి ఉనికిని ఇస్తుంది.

జీవుడు ఉన్నాడు, జగత్ ఉంది, ఈశ్వరుడు ఉన్నాడు – ఈ మూడు వాక్యాలలోనూ ఉంది (ఉన్నాడు అన్నా ఒకటే) పదం సమానంగా ఉంది. ఈ మూడింటిలోనూ సమానంగా ఉన్న ఉనికే సత్. ఈ శుద్ధ సత్తే జీవునిగా ప్రకటితమవుతుంది, శుద్ధసత్తే జగత్తుగా ప్రకటిత మవుతుంది, శుద్ధ సత్తే ఈశ్వరునిగా ప్రకటితమవుతుంది. ఈ నామరూపాల వెనకనున్న శుద్ధసత్‌ను అర్థం చేసుకోవటమే **సద్దర్శనం**.

ఈ సద్దర్శనం చేసుకుంటే పొందే తక్షణఫలం ఏమిటి? అజ్ఞానం పోతుంది. జ్ఞానం పొందగానే, అజ్ఞానం మటుమాయమవుతుంది. దేని గురించిన అజ్ఞానం? భాగాలు లేని శుద్ధసత్ గురించిన అజ్ఞానం. అజ్ఞానం పోతే అజ్ఞానజన్య పొరపాటు కూడా పోతుంది. ఏమిటా పొరపాటు? జీవజగత్ ఈశ్వరులనే త్రిపుటిని చూడటం.

**సద్దర్శనేన సత్ అజ్ఞానమ్ అపగచ్ఛతి॥**
**అజ్ఞాననాశనేన అజ్ఞానజన్యభేదః అపి అపగచ్ఛతి॥**

అంటే జీవజగత్ ఈశ్వరులు లయమయిపోతారు. ఈశ్వరుడు అంటే సగుణ ఈశ్వరుడు, ఏకరూప ఈశ్వరుడు. రాముడు, కృష్ణులకు కూడా అవతారం ఎత్తినరోజు, అవతారం చాలించిన రోజు ఉంటాయి. అంటే వారికి కూడా రాకపోకలు ఉంటాయి. రాకపోకలు ఉన్నవి శాశ్వతం కాదు. ఈ జ్ఞానం పొందితే ఈ మూడూ లయమయిపోతాయి అంటే కళ్ళ ముందునుంచి మాయమవవు. జీవుడనైన నేను ఉంటాను, జగత్తు ఉంటుంది, ఈశ్వరుడు ఉంటాడు. కాని

వీటిని మనం చూసే దృక్పథంలో మార్పు వస్తుంది. ఈ మూడూ కూడా శుద్ధసత్‌యొక్క తాత్కాలిక నామరూపాలు మాత్రమే అని అర్థం చేసుకుంటాము.

అవి నామరూపాలే అని అర్థం చేసుకున్నాక కూడా నామరూపాలు కొనసాగుతాయి. బంగారమే ఆభరణాల అంతటా ఉంటుంది అనే జ్ఞానం పొందాక కూడా ఆభరణాలు అలాగే ఉంటాయి. గొలుసుని గొలుసుగాను, గాజుని గాజుగాను, ఉంగరాన్ని ఉంగరంగాను ఉంచవచ్చు. వాటిని కరిగించాల్సిన అవసరం లేదు. వాటిని అలాగే ధరిస్తాము, వాటితో వ్యవహారం నడుపుతాము కాని వాటివల్ల బాధలను అనుభవించము. నానాత్వం చూడటంలో సమస్య లేదు, నానాత్వాన్ని సరిగ్గా అర్థం చేసుకోకపోవటంవల్ల సమస్య వస్తుంది. నానాత్వం వెనక ఉన్న ఏకాత్మను, అద్వయసత్‌ను అర్థం చేసుకోకపోవటంవల్ల సమస్య వస్తుంది.

శుద్ధసత్ జ్ఞానాన్ని ఏర్పరచుకుని, నానాత్వం ఈ శుద్ధసత్‌యొక్క నామరూపాలు మాత్రమే అని అర్థం చేసుకుని వ్యవహారం నడిపితే, జీవితం ఒక లీల, జీవితం ఒక అద్భుతం. వినటానికి కూడా అద్భుతంగా ఉంది కాని ఈ శుద్ధసత్‌ను ఎక్కడ వెతకాలి? దానికి జవాబు ఒక్కటే! బంగారాన్ని అర్థం చేసుకోవటానికి మీరు ఏ ఆభరణాన్ని పరిశీలిస్తారు? గొలుసునా, గాజునా? దేన్నైనా అధ్యయనం చేయవచ్చు. రెండింటిలోనూ అంతర్లీనంగా ఉన్నది బంగారం మాత్రమే.

ఈ సూత్రం ప్రకారం శుద్ధసత్‌ను అర్థం చేసుకోవటానికి దేన్ని అధ్యయనం చేయాలి? జీవుణ్ణా, జగత్తునా, ఈశ్వరుణ్ణా అని అడగటం అర్థంలేని ప్రశ్నే అవుతుంది. ఎందుకంటే, ఈ మూడింటిలోనూ సమానంగా ఉంది శుద్ధసత్. అందువల్ల ఈ మూడింటిలోనూ దేన్నైనా విశ్లేషించవచ్చు.

ఈశ్వరుడు పరోక్షంగా ఉన్నాడు. జగత్తు అనంతంగా ఉంది. జీవుడు అంటే నేనే. అందువల్ల రమణమహర్షి తనదైన బాణీలో, మిగతా వేదాంత గ్రంథాలకు భిన్నంగా జీవుడిని విశ్లేషించి, జీవునియొక్క అహంకార విశ్లేషణ ద్వారా సద్దర్శనం చేయించటానికి పూనుకున్నారు. ఎప్పుడైతే అహంకారం నామరూపం మాత్రమే అని అర్థం చేసుకుంటారో, అప్పుడు అహంకార నాశనం చేస్తే చాలు, తక్కిన రెండింటి విశ్లేషణ కూడా చేయకనే చేసినట్టు అవుతుంది. ముక్కాలిపీట ఉదాహరణ మర్చిపోకూడదు. ముక్కాలిపీటలో ఒక కాలు లాగితే, పీట మొత్తం వచ్చినట్టుగా, జీవ, జగత్, ఈశ్వరులలో జీవుడొక్కడి గురించి విశ్లేషణ చేస్తే చాలు, జగత్ ఈశ్వరుల విశ్లేషణ కూడా చేసినట్టు అవుతుంది. ఈ మూడూ మిథ్యా నామరూపాలు మాత్రమే అనీ, ఉన్నదొకటే సత్ అనీ చెప్పి సద్దర్శనం చేయిస్తారు రమణులవారు.

ఆ విధంగా జగత్తు విచారణ, ఈశ్వర విచారణ చేయకుండా, జీవవిచారణ మాత్రమే చేసి, సద్దర్శనం చేయించిన ఘనత రమణమహర్షికే దక్కింది. అందువల్లనే రమణమహర్షి హూ యామ్ ఐ? నేనెవరు విచారణ చేస్తారు అని ప్రసిద్ధికెక్కారు. నేనెవరు విచారణ అంటే అహంకార విచారణ. తద్వారా అహంకారానికి అధిష్ఠానమైన సద్దర్శనం చేయిస్తారు.

**అహంకార అధిష్ఠాన సద్దర్శనమ్ ఏవ మోక్షకారణమ్**

ఇదీ మనం చూడబోయే సద్దర్శనం సారాంశం.

ఈ నేపథ్యంతో గ్రంథంలోకి అడుగుపెడదాము.

**శ్లోకాలు 1, 2**

**సత్ప్రత్యయాః కిం ను విహాయ సంతం**
**హృద్యేష చింతారహితో హృదాఖ్యః।**
**కథం స్మరామస్తమమేయమేకం**
**తస్య స్మృతిస్తత్ర దృఢైవ నిష్ఠా ॥**
**మృత్యుంజయం మృత్యుభియాశ్రితానా-**
**మహంమతిర్మృత్యుముపైతి పూర్వమ్।**
**అథ స్వభావాదమృతేషు తేషు**
**కథం పునర్మృత్యుధియోఽవకాశః॥**

ఈ మొదటి రెండు శ్లోకాలను మంగళశ్లోకాలు అంటారు. ఏదైనా గ్రంథాన్ని మొదలు పెట్టేటప్పుడు మంగళాచరణం లేకుండా ఆరంభించరు. ఈ మంగళాచరణం మూడు విధాలుగా ఉంటుంది.

1. **ఆశీర్వచనం** – మానవాళి శ్రేయస్సు కోరుతూ ఆశీర్వచనం చేయటం ఒక పద్ధతి.
2. **నమస్కారం** – భగవంతుని కృప కోరుతూ భగవంతునికి నమస్కారం పెట్టటం.
3. **వస్తునిర్దేశం** – ఆత్యంతిక సత్యాన్ని ప్రతిపాదన చేయటం.

ఆత్యంతిక సత్యం ఏమిటి? బ్రహ్మ. అందువల్ల బ్రహ్మ లక్షణాన్ని ప్రతిపాదిస్తాము. జీవ జగత్ ఈశ్వరులకు అధిష్ఠానం అయిన అభేదమైన సత్ వస్తునిర్దేశం.

ఇక్కడ రమణమహర్షి ఈ మూడు రకాల మంగళాచరణ శ్లోకాల్లో మూడవ పద్ధతిని ఎన్నుకున్నారు. అంటే వస్తునిర్దేశం చేస్తున్నారు. బ్రహ్మ నిర్వచనం తైత్తిరీయోపనిషత్తులోని నిర్వచనాన్ని ఆధారంగా చేసుకుని వస్తుంది.

సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ. సర్వవ్యాపకం, దేశకాల వస్తు అతీతం అని వస్తుంది, కాని ఇక్కడ సత్యం అంటే శుద్ధ సత్, జ్ఞానం అంటే శుద్ధ చిత్. అనంతం అంటే అఖండం అని వివరిస్తున్నారు రమణమహర్షి.

ఈ నేపథ్యంతో మొదటి శ్లోకం అర్థం చూద్దాము.

**ప్రతిపదార్థం:** సంతం = సత్; విహాయ = లేకుండా; సత్ ప్రత్యయః = సత్‌యొక్క అనుభవం లేకుండా; కిం ను (భవేయు) = వస్తువు అనుభవం ఎలా అవుతుంది; ఏషః = సద్రూపం; హృది = హృదయంలో ఉంది; హృదాఖ్యః = హృదయం అనే పేరుగలది; చింతారహితః = ఆలోచనలతో సంగత్వం లేనిది;ఏకం = అనంతం;అమేయం = అప్రమేయం; కథం తస్య స్మృతిః = దాన్ని స్మరించటం ఎలా; తత్ర దృఢైవ నిష్ఠా = సిద్ధంగా నెలకొని ఉండాలి.

**తాత్పర్యం:** సత్ లేకుండా అంటే సత్‌యొక్క అనుభవం లేకుండా, వస్తువు అనుభవం ఎలా అవుతుంది? ఈ సత్ హృదయం అనే పేరుగల హృదయంలో ఆలోచనలతో సంగత్వం లేకుండా ఉంది. ఈ ఏకం అయిన సద్రూపాన్ని స్మరించటం ఎలా? సద్రూపంలోనే స్థిరంగా నెలకొని ఉండటమే దాన్ని స్మరించటం అవుతుంది.

**వివరణ:** మొదటి పాదంలో బ్రహ్మను సత్ బ్రహ్మగా వివరిస్తున్నారు. సత్ అంటే ఉనికి అని అద్భుతంగా చూపిస్తున్నారు రమణమహర్షి. అదెలాగో చూద్దాము. ముందు దాన్ని ఒక ఉదాహరణతో చూద్దాము. మీరు స్వామీజీ క్లాసులో కూర్చుని, స్వామీజీని చూస్తున్నారంటే, నిజానికి మీరు రెండు అంశాలను చూస్తున్నారు. మీరు స్వామీజీని మాత్రమే చూస్తున్నాననుకుంటారు కాని, ఇంకొక వస్తువు కూడా ఉంది అక్కడ. ఏమిటది? కాంతి. కాంతి స్వామీజీ శరీరం అంతటా వ్యాపించి, స్వామీజీ శరీరాన్ని ప్రకాశింపజేస్తున్నది. కాని మీరు అది పట్టించుకోరు. బోధ మధ్యలో ఉన్నట్టుండి, కాంతి మటుమాయమై చీకటి అలుముకుంటే, అప్పుడు కాంతిని గమనిస్తారు.

అదే సూత్రం ప్రకారం, మీరు ఏ వస్తువును గమనిస్తున్నా కూడా, దానిలో రెండు అంశాలు ఉన్నాయి అంటున్నారు రమణులవారు. ముందు కొన్ని వస్తువులను ఇంగ్లీషులో చూద్దాము. ది బుక్ ఈజ్, ది టేబుల్ ఈజ్, ది మ్యాన్ ఈజ్, ది పెన్ ఈజ్ అని వాటి పట్టికను చెప్పుకుంటూపోతాము. ఆ చెప్పేటప్పుడు ఆ వస్తువులమీదే దృష్టి పెడతాము కాని అన్ని వాక్యాలలోనూ సమానంగా ఉన్న పదం ఏమిటి? ఈజ్, ఈజ్, ఈజ్. ఈ ఈజ్‌నెస్‌నే ఎక్జిస్టెన్స్ అంటారు. ఇప్పుడు ఆ పదాలను తెలుగులో చూస్తే పుస్తకం ఉంది, బల్ల ఉంది, మనిషి ఉన్నాడు, కాలం ఉంది అంటాము. వీటన్నిటిలోనూ సమానంగా ఉన్నది, ఉంది

ఉంది ఉంది పదం. దాన్నే ఉనికి అంటారు. వీటిని విడదీస్తే రెండు అంశాలు ఉన్నట్టుగా అర్థమవుతుంది. పుస్తకం+ఉంది; బల్ల+ఉంది. అలా మనకు అయ్యే ప్రతి అనుభవంలోనూ రెండు అనుభవాలు ఉన్నాయి. అవి వస్తువు+ఉనికి. ఇది మొదటి అంశం.

ఉనికి అనగానే సత్ గురించిన ఐదు అంశాలు గుర్తు తెచ్చుకోవాలి. అవి –

1. సత్ వస్తువులో ఒక భాగం కాని, లక్షణం కాని కాదు. శరీరంనుంచి ఉత్పత్తి చెందింది కూడా కాదు.

2. సత్ స్వతంత్రమైనది. అది వస్తువు అంతటా వ్యాపించి, శరీరాన్ని ప్రకాశింపజేస్తుంది.

3. సత్ వస్తువు సరిహద్దులకే పరిమితమవలేదు.

4. వస్తువు నాశనమయినా సత్ నాశనమవదు. వస్తువు పతనం చెందాక కూడా సత్ ఉంటుంది.

5. సత్ వస్తువు లేకపోయినా ఉంటుంది కాని కనబడదు. దాన్ని ప్రతిబింబింపజేసే శరీరం లేదు కాబట్టి అది కనిపించదు. అంతమాత్రాన సత్ లేనట్టు కాదు. అందువల్ల సత్ లేనిదే వస్తువు లేదు.

**సంతం విహాయ** – విహాయ అంటే అది వ్యాపించి ఉండకుండా, ఏది? సంతం అంటే సత్ ఒక వస్తువుమీద వ్యాపించి ఉండకపోతే ఆ వస్తువును అనుభవించలేము. ప్రత్యయం అంటే అనుభవం. సత్ అంటే ఉనికి. **సత్ ప్రత్యయాః** అంటే ఉనికియొక్క అనుభవం.

**(భవేయుః)** – భవేయుః క్రియాపదం మనం కలుపుకోవాలి. అంటే అనుభవంలోకి రావటం.

**కిమ్ (భవేయుః)** – సత్ అనుభవం లేకుండా వస్తువు అనుభవం ఎలా అవుతుంది? అంటే అవదు అని అర్థం.

దీనివల్ల ఒక సూత్రాన్ని ప్రతిపాదించవచ్చు. ఒక వస్తు అనుభవం అవుతోందంటేనే అక్కడ బాహ్యంగా ఆ వస్తువు ఉండాలి. కుండ అనుభవం అవుతోందంటే బాహ్యంగా కుండ ఉండాలి. మనస్సులో జరిగే అనుభవానికి, బాహ్యంగా వస్తువు ఉండాలి. లోపల ఉన్న ఉనికి బాహ్యంగా ఉన్న వస్తువు అంతటా కూడా ఉండాలి. బాహ్యంగా ఉన్న ఉనికిని సత్ అంటారు. బ్రహ్మ మొదటి నిర్వచనం **సర్వవ్యాపకమైన ఉనికి** లేదా **సత్**. సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మలో మొదటి నిర్వచనం చూశాము. సత్యం అంటే ఉనికి లేదా సత్. ఇప్పుడు రెండవ పదమైన జ్ఞానానికి వెళుతున్నారు రమణమహర్షి. అది జ్ఞానం.

**ఏషః** – అన్ని వస్తువుల్లోనూ ఉనికి రూపంలో ఉన్న బ్రహ్మ నాలోనూ ఉన్నాడు. ఐ యామ్ పదంలో యామ్ ఉనికిని సూచిస్తుంది. నేను ఉన్నాను. ఈ ఉనికి నాలో ఎక్కడ ఉంది?

**(ఏషః) హృది** – హృదయంలో ఉంది. హృదయంలో ఉన్న మనస్సులో ఉంది. హృది అంటే బుద్ధి

**యో వేద నిహితం గుహాయామ్**

బుద్ధి అనే గుహలో ఉంది. అంతటా ఉనికి రూపంలో ఉన్నది; నాలో, బుద్ధిలో చైతన్యరూపంలో ఉంది. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే సాక్షిచైతన్యరూపంలో ఉంది. బాహ్యంగా చెప్పినప్పుడు సత్ అంటే, మనస్సు లేదా బుద్ధిపరంగా చెప్పినప్పుడు చిత్ అంటారు.

**హృదాఖ్యః** – ఈ చైతన్యాన్ని హృది అనే పేరుగలది అంటున్నారు రమణమహర్షులు. బాహ్యంగా చెప్పినప్పుడు ఏమున్నాయి? వస్తువు+ఉనికి అన్నాము. ఇప్పుడు అంతరంగా, మనస్సుపరంగా చెప్పినప్పుడు ఆలోచన+చైతన్యం అనాలి. మనస్సులో అనేక ఆలోచనలు వస్తాయి, పోతాయి. ఒక ఆలోచన వస్తున్నట్టు తెలుస్తున్నది, ఇంకొక ఆలోచన పోతున్నట్టు తెలుస్తున్నది. అంటే ప్రతి ఆలోచన కూడా చైతన్యం లేదా చిత్‌వల్లనే తెలుస్తున్నది.

ఈ గదిలోకి వచ్చిన ప్రతివ్యక్తి కాంతిలో ఎలా ఓలలాడతాడో అలా మనస్సు అనే గదిలోకి వచ్చిన ప్రతి ఆలోచన కూడా చైతన్యంలో ఓలలాడుతుంది. ఆలోచన+చైతన్యం=అనుభవం. బాహ్యంగా కుండను చూస్తే కుండ+ఉనికి అన్నాము. ఇప్పుడు మనస్సులో ఆ కుండ ఆలోచన+చైతన్యం=కుండ అనుభవం అవుతుంది. మనిషి అనుభవం అవుతోందంటే బాహ్యంగా మనిషిని చూస్తున్నారన్నమాట. ఆ విధంగా ఆలోచనలను అంటిపెట్టుకుని ఉన్న చైతన్యంవల్ల అనుభవాల దొంతర ఏర్పడుతున్నది. బాహ్యంగా వాడితే సత్ అంటాము, అంతరంగా చెపితే చిత్ అంటాము. అంటే అంతటా సద్రూపంలో ఉన్నది చిద్రూపంలో అనుభవంలోకి వస్తున్నది. ప్రతి అనుభవం కూడా బాహ్యంగా ఉన్న వస్తువుతో పెనవేసుకుని ఉంటుంది.

సత్‌కు చూసిన ఐదు లక్షణాలను చిత్‌కు కూడా అన్వయించుకోవాలి. చైతన్యం ఆలోచనల్లో ఒక భాగం కాని, వాటి లక్షణం కాని, వాటినుంచి ఉత్పత్తి చెందిన వస్తువు కాని కాదు. మారే అన్ని ఆలోచనల వెనకా, మారని చైతన్యం ఉంది. ఆలోచనలు ఆగిపోయి, మనస్సు శూన్యంగా ఉన్నా, మనస్సు శూన్యంగా ఉందనికూడా చైతన్యానికి తెలుస్తుంది.

**చింతా రహితః** – చింతా అంటే ఆలోచన; రహితః అంటే సంబంధం లేదు. అంటే ఈ చైతన్యానికి ఆలోచనతో సంబంధం లేదు. అది ప్రతి ఆలోచన వెనకా ఉంటుంది కాని దేనితోనూ సంగత్వం లేదు. ఒకవేళ చైతన్యానికి ఆలోచనతో సంగత్వం ఉంటే ఏమవుతుంది? ఆలోచన పోగానే, చైతన్యం కూడా వెళ్ళిపోతుంది కాని మనస్సు శూన్యంగా ఉందని కూడా

చైతన్యానికి తెలుస్తున్నది. కాబట్టి అది అసంగచైతన్యం. అది ఆలోచన అంతటా వ్యాపించి, ఆ ఆలోచనను మనకు తెలియజేస్తుంది. అందువల్ల చింతారహితః అంటే ఆలోచనలతో సంగత్వం లేదు.

ఉనికి, వస్తువు అంతటా వ్యాపించి ఉన్నా, వస్తువుతో ఉనికికి ఎలా సంగత్వం లేదో, అలా చైతన్యం ఆలోచన అంతటా వ్యాపించి ఉన్నా, ఆలోచనతో చైతన్యానికి సంగత్వం లేదు. అందువల్ల వృత్తి సంబంధ రహితః అని చెప్పవచ్చు. రెండవ పాదంలో సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మలో సత్యం జ్ఞానం బ్రహ్మ నిర్వచనం చూశాము. ఇంక మూడవ నిర్వచనం మిగిలింది. అది అనంతం.

**ఏకమ్** – ఇంతవరకూ చూసిన, వస్తువులంతటా వ్యాపించిన ఉనికి, ఆలోచనలంతటా వ్యాపించిన చైతన్యం – ఈ రెండూ కూడా అటు వస్తువుల సరిహద్దులకు కాని, ఇటు ఆలోచనల పరిమితులకు కాని పరిమితి చెందలేదు. అంతేకాదు, ఈ సత్ చిత్ రెండూ ఒకటే. ఏకమ్ పదం దాన్ని సూచిస్తుంది. ఏకం అంటే రెండవది లేనిది. వస్తువులు అనేకం, సత్ ఏకం; ఆలోచనలు అనేకం, చిత్ ఏకం. అందువల్ల సత్ చిత్ రెండూ ఒకటే. ఏకమ్. ఏకమ్ అంటే పరిమితి కూడా లేదు.

సత్, చిత్ రెండూ ఒకటే అయితే, రెండు పేర్లు ఎందుకనే సందేహం రావచ్చు మీకు. దానికి జవాబు చెప్పకుండా మిమ్మల్ని ఎదురు ప్రశ్నిస్తాము. ఏం, మనిషికి మాత్రం అనేక పేర్లు ఎందుకు? ఆఫీసులో ఒక పేరు, ఇంట్లో ఒక పేరు, స్నేహితుల మధ్యలో మరో పేరు ఎందుకు? ఒక మామూలు మనిషికి అనేక పేర్లు ఉండగా లేనిది, పరబ్రహ్మకు ఎందుకు ఉండకూడదు? రకరకాల పేర్లు ఉన్నంతమాత్రాన సత్ చిత్ భిన్నవస్తువులు కాదని అర్థం చేసుకోవాలి.

వస్తుపరంగా చెప్పినప్పుడు సత్ అంటే, వృత్తి (ఆలోచన) పరంగా చెప్పినప్పుడు చిత్ అంటాము. బాహ్యంగా అంతటా సత్ రూపంలో బ్రహ్మ తెలిస్తే, మనలో చిత్ రూపంలో తెలుస్తాడు. అందువల్ల రెండు కోణాల్లో రెండు పేర్లు కాని, ఉన్నది ఒకటే బ్రహ్మ.

ఇక్కడ మీకొక సందేహం రావచ్చు. సరే, బాగానే ఉంది వస్తుపరంగా సత్, వృత్తిపరంగా చిత్ అంటున్నారు కదా, రెండూ లేకపోతే ఏమని పిలుస్తారు? వస్తు సంబంధం లేదు, వృత్తి సంబంధం లేదు. అప్పుడేమంటారు? అప్పుడు దాన్ని అమాత్ర అని, అవ్యవహార్యః అని, తురీయం అని అంటారు. అంటే ఇది నిశ్శబ్దాన్ని సూచిస్తుంది. అందువల్ల ఏకం అంటే భాగాలు లేని బ్రహ్మ. దీన్ని అనంతం బ్రహ్మ అనవచ్చు. దీనితో బ్రహ్మ నిర్వచనంలోని మూడవ పదం కూడా వచ్చేసింది.

**సత్ ప్రత్యయాః** – సత్‌నూ, **హృది ఏష** – చిత్‌నూ, **ఏకం** – అనంతాన్నీ సూచిస్తాయి.

**అమేయం** – అమేయం అంటే సబ్జెక్ట్–ఆబ్జెక్ట్ విభజన లేనిది. సబ్జెక్ట్ అంటే ప్రమాత, ఆబ్జెక్ట్ అంటే ప్రమేయం. అమేయం అంటే అప్రమేయం. అంటే ప్రమేయం కానిది. బ్రహ్మను ప్రమేయంగా తెలుసుకోలేము. అంటే ఇంద్రియాలకు అందనిది. బ్రహ్మ అప్రమేయం అంటే అయితే దాన్ని ఎలా తెలుసుకోవాలని ప్రశ్నించకూడదు. ప్రశ్నే తప్పు. బ్రహ్మ ప్రమేయం కాదు అంటే ప్రమాత అయిన మీరు, తెలుసుకునే మీరు. తెలుసుకునే మిమ్మల్ని, బాహ్యవస్తువుగా తెలుసుకోవటానికి ఎలా ప్రయత్నించగలరు?

**ఎవర్ ది ఎక్స్‌పీరియన్సర్ నెవర్ ది ఎక్స్‌పీరియన్స్‌డ్**

**అనుభవించే నువ్వే అది ఎప్పటికీ, అనుభవించబడే వస్తువు కాదు ఎన్నటికీ**

అందువల్ల బ్రహ్మ నాలుగవ నిర్వచనం అప్రమేయం. ఇప్పుడు నాలుగు నిర్వచనాలను కలిపితే –

**సత్యం జ్ఞానం అనంతమ్ అప్రమేయం బ్రహ్మ**

భగవద్గీతలో కృష్ణపరమాత్మ తన బోధను మొదలుపెడుతూనే ఆత్మ లేదా బ్రహ్మ నిర్వచనంతో ఆరంభించాడు. అక్కడ చెప్పిన నిర్వచనాలలో ఒకటి **అప్రమేయం**.

**అనాశినోఽ ప్రమేయస్య తస్మాద్యుధ్యస్వ భారత** – 2.18

ఈ అప్రమేయాన్ని రమణులవారు అమేయం అంటున్నారు.

ఆత్మ నువ్వే కాబట్టి దాన్ని పంచజ్ఞానేంద్రియాలతో తెలుసుకోలేవు.

**యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ** – తైత్తిరీయమ్

వాక్కుతో నిర్వచించలేము, మనస్సుతో తెలుసుకోలేము అంటారు కదా! మరి ఆత్మజ్ఞానం పొందే వస్తువు కాకపోతే ధ్యానం చేసే వస్తువు మాత్రం ఎలా అవుతుంది? ఆత్మధ్యానం ఎలా చేస్తాము? కాని శాస్త్రం ఏమో ఆత్మధ్యానం, బ్రహ్మధ్యానం, నిదిధ్యాసనం చేయండి అంటుంది. ఈ నిదిధ్యాసనాన్ని ఇంగ్లీషులో వేదాంతిక్ మెడిటేషన్ అంటారు. భగవద్గీతలో ఆత్మధ్యానం గురించి వస్తుంది, కైవల్యోపనిషత్తులో ఆత్మధ్యానం గురించి వస్తుంది. అదెలా సాధ్యం? దానికి జవాబు నాలుగవ పాదంలో చూస్తాము.

**తస్య స్మృతిః** – తస్య స్మృతిః అంటే ఇప్పుడు చూసిన నిర్వచనం గుర్తు తెచ్చుకోవాలి. సత్యం జ్ఞానం అనంతమ్ అప్రమేయం. బ్రహ్మను గుర్తు తెచ్చుకోవటం. ఆ గుర్తు తెచ్చుకోవటమే,

**తత్ర దృఢైవ నిష్ఠా** – బ్రహ్మజ్ఞానంలో స్థిరంగా నెలకొని ఉండటం. బ్రహ్మను ప్రమేయంగా చూడకుండా, బ్రహ్మజ్ఞానంలో నెలకొని ఉండటం అంటే నేను బ్రహ్మను అనే జ్ఞాననిష్ఠ పెంచుకోవటం. బ్రహ్మను ఆబ్జెక్టుగా తెలుసుకోలేము, బ్రహ్మను ఆబ్జెక్టుగా తెలుసుకోకూడదు, బ్రహ్మను ఆబ్జెక్టుగా తెలుసుకునే అవసరం లేదు. ఎందుకంటే ఆ బ్రహ్మను నేనే అనే జ్ఞానంలో నెలకొని ఉండటమే నిదిధ్యాసనం. జ్ఞానంలో నెలకొని ఉండటం అంటే ఈ జ్ఞానాన్ని ఎట్టి పరిస్థితిలోనూ మర్చిపోకపోవటం. లౌకికంగా ఏ వ్యవహారం నడుపుతున్నా కూడా, నేను బ్రహ్మను అనే జ్ఞానం మీ మనస్సులో స్థిరంగా ఉండాలి.

ఈ దృఢనిష్ఠ అంటే ఏమిటో చూద్దాము. ఆ దృఢనిష్ఠలో నిలబడటం అంటే స్వరూప జ్ఞానంలో నిలబడటం. అంటే మీ బొమ్మ గీసి, దానిమీద నిలబడటం కాదు. లేదా అహం బ్రహ్మ అస్మి, అహం బ్రహ్మ అస్మి అని పదేపదే వల్లెవేస్తూ, ఎవరైనా నీ పేరేమిటి అని అడిగితే నేను బ్రహ్మను అని చెప్పటం అంతకన్నా కాదు. సరే, పైకి చెప్పకూడదు అంటే పదేపదే మనస్సులో ఆలోచనల రూపంలో అనుకోవాలా అంటే అదీకాదు.

ఎందుకంటే, మీరు పదేపదే ఒక మాటను వల్లెవేసినా, ఒక ఆలోచనను పదేపదే తలుచుకుంటున్నా, ఇంకే వ్యవహారమూ నడపలేరు. మీకేదైనా సందేహం ఉంటే మీరే ప్రయత్నించి చూడండి. మనస్సు ఒక్కసారి రెండు పనులను చేయలేదు. నేను చేస్తానే అని మీకు అనిపించవచ్చు, మల్టీటాస్కింగ్ చేస్తున్నాను అనుకుంటారు కాని దానిలో నానో సెకండ్స్ తేడా ఉంటుంది. మనస్సు లక్షణమే అది. ఒకేసారి రెండు పనులను చేయలేదు. మీరు మనస్సులో ఏదో ఆలోచిస్తూ, ఇంకేదో పని చేస్తే, అది అస్తవ్యస్తంగా అవుతుంది.

అందువల్ల ఈ జ్ఞానాన్ని మర్చిపోకూడదు అంటే పదేపదే తలుచుకోవటం కాదు, మీ ప్రయత్నం లేకుండా, ఆ జ్ఞానం మీకు గుర్తుకు రావాలి. ఉదాహరణకు మీ పేరు, మీ ఊరు, మీ అడ్రస్, మీ ఫోను నెంబరు, రెండు నెంబర్లు ఉంటే రెండు నెంబర్లు – ఇవన్నీ ఎవరన్నా అడిగితే తడుముకోకుండా చెబుతారా లేదా? ఉండండి, ఆలోచించి చెబుతాను అనరు కదా! ఇవి తడుముకోకుండా చెప్పారంటే రోజంతా వీటిని వల్లె వేసుకుంటూ కూర్చుంటున్నారా? లేదే! అడిగిన క్షణమే చెప్పగలిగిన జ్ఞానం మీకు అందుబాటులో ఉన్న జ్ఞానం. మీరు మర్చిపోని జ్ఞానం. దీన్నే దృఢనిష్ఠ అంటారు.

మీ వ్యక్తిగత వివరాలని ఎలాగైతే తడుముకోకుండా చెబుతారో, అంత చక్కగా బ్రహ్మ లక్షణాలను కూడా తడుముకోకుండా చెప్పగలగటమే దృఢనిష్ఠ, జ్ఞాననిష్ఠ, బ్రహ్మనిష్ఠ. నేను మనిషిని అని ఎలా మర్చిపోరో, అలా నేను బ్రహ్మను అని కూడా మర్చిపోకుండా ఉండగలగటమే బ్రహ్మనిష్ఠ.

ఇప్పుడు ఈ మంగళశ్లోకం సారాంశం చూస్తే – బ్రహ్మ నిర్వచనం, బ్రహ్మనిష్ఠ వస్తాయి.

బ్రహ్మ నిర్వచనం – సత్యం జ్ఞానం అనంతమ్ అప్రమేయం బ్రహ్మ

బ్రహ్మనిష్ఠ – బ్రహ్మనిష్ఠలో నిలబడటం అంటే ఎట్టి పరిస్థితిలోనూ నేను బ్రహ్మను అనే జ్ఞానాన్ని మర్చిపోకపోవటం.

ఈశావాస్యోపనిషత్ శాంతిపాఠంలో కూడా బ్రహ్మ నిర్వచనం, జీవాత్మ పరమాత్మ ఐక్యం వస్తుంది. అంత అద్భుతంగానూ ఈ మంగళశ్లోకంలో బ్రహ్మ నిర్వచనాన్ని, బ్రహ్మనిష్ఠని వివరించారు రమణులవారు.

**శ్లోకం 2**

**మృత్యుంజయం మృత్యుభియాశ్రితానా**
**మహంమతిర్మృత్యుముపైతి పూర్వమ్ ।**
**అథ స్వభావాదమృతేషు తేషు**
**కథం పునర్మృత్యుధియోఽవకాశః॥**

**ప్రతిపదార్థం:** మృత్యుంజయం = పరమశివుణ్ణి; మృత్యుభియా = మృత్యుభయంతో; శ్రితానామ్= ఆశ్రయిస్తే; అహంమతిః = అహంకారం; మృత్యుముపైతి = మరణం చెందుతుంది; పూర్వమ్= ముందు; అథ = తరువాత; స్వభావాత్ = స్వస్వరూపంగా; అమృతేషు = శాశ్వతమని తెలుసుకున్న; తేషు = ఆ శరణాగతునికి; కథం = ఎలా; పునః మృత్యుధియః = మళ్ళీ మృత్యుభయం; అవకాశః = ఎలా వస్తుంది?

**తాత్పర్యం:** మృత్యుంజయుడైన పరమశివుణ్ణి, మృత్యుభయంతో ఆశ్రయిస్తే, ముందు అహంకారాన్ని నాశనం చేస్తాడు. ఆ తరువాత అమృతమైన స్వస్వరూపజ్ఞానంలో నిలబెడతాడు. ఆ శరణాగతునికి ఇంక మళ్ళీ మృత్యుభయం ఎలా వస్తుంది?

**వివరణ:** రెండవ శ్లోకం కూడా మంగళశ్లోకమే. ఇది కూడా సత్యాన్ని చెబుతున్నది. ఏమిటా సత్యం? శివపూజ మహిమ గురించి చెబుతున్నది. ప్రతి ఒక్క సంసారి కూడా శివపూజ చేస్తే కలిగే లాభాన్ని వివరిస్తున్నది. సంసారి ఎవరు? ముందు శ్లోకంలో వివరించిన బ్రహ్మజ్ఞానాన్ని పొందని అజ్ఞాని. అంటే సత్యం జ్ఞానం అనంతం అప్రమేయం బ్రహ్మజ్ఞానాన్ని పొందని వ్యక్తి. ఉన్నదొకటే బ్రహ్మ అని తెలియక త్రిపుటిలో పడి అవస్థ పడేవాడు. త్రిపుటి అంటే జీవ జగత్ ఈశ్వరుల భేదభావనలో ఉన్నవాడు. ప్రమాత అయిన అతను, ప్రమేయం అయిన జగత్తు తనని బాధిస్తోందని, ప్రమేయ ఈశ్వరునితో మొరపెట్టుకుంటాడు. అంటే ద్వైతప్రపంచంలో ఉంటాడు.

ఎక్కడ ద్వైతం ఉంటుందో అక్కడ దేశకాల వస్తు పరిమితులు ఉంటాయి. పరిమితి ఉంటే అశాశ్వతం ఉంటుంది. అశాశ్వతత్త్వం ఉంటే మరణం ఉంటుంది. మరణం ఉంటే భయం తోడవుతుంది. ఎలా ఒక దశనుంచీ ఇంకొక దశలోకి దిగుతూ వస్తున్నామో చూశారా?

ద్వైతం = పరిమితి = అశాశ్వతత్త్వం = మరణం = భయం. అందువల్లనే

**ద్వితీయాద్వై భయం భవతి**

అంటుంది బృహదారణ్యకోపనిషత్తు. సంసారి ద్వైతదర్శనం చేస్తాడు; దానివల్ల భయం కోరల్లో చిక్కుకుంటాడు. భయం అభద్రతాభావనకు దారితీస్తుంది. నిజానికి మనం చేసే చాలా పనులు ఈ అభద్రతాభావనను పోగొట్టుకోవటానికి చేసేవే అయివుంటాయి.

**మృత్యుభియా** – భిః అంటే భయం. మృత్యుభిః అంటే మృత్యుభయం. అభద్రతా భావన. సంసారికి అత్యంత సన్నిహిత స్నేహితుడు భయం.

ఈ సంసారులు ఈ మృత్యుభయాన్ని పోగొట్టుకోవటానికి శివునికి పూజ చేస్తే ఏమవుతుంది?

**మృత్యుంజయం** – ఇక్కడ శివుణ్ణి మృత్యుంజయునిగా వర్ణిస్తున్నారు రమణులవారు. జయం అంటే అక్షరాలా చూస్తే ఓడించేవాడు. ఇక్కడ నాశనం చేసేవాడు. దేన్ని? మరణభయాన్ని, అభద్రతా భావనని, ద్వైతాన్ని. పరమశివుడు ద్వైతాన్ని, మృత్యుభయాన్ని నాశనం చేస్తాడు కాబట్టి మృత్యుంజయుడు అంటున్నాడు రమణులవారు.

మృత్యుంజయుడు మాట వినగానే మార్కండేయ పురాణం గుర్తుకు రాకతప్పదు. మార్కండేయునికి మృత్యుగండం ఉంది. మృత్యుగండం ఉందని తెలుసుకుని శివపూజ చేస్తూ కూర్చున్నాడు. ఆ సమయంలో యమధర్మరాజు వచ్చి, తన పాశాన్ని మార్కండేయుని మీదకు విసురుతాడు. అప్పుడతను శివలింగాన్ని కౌగలించుకుని తన్మయత్వంతో శివపూజ చేస్తున్నాడు. అందువల్ల ఆ పాశం వచ్చి మార్కండేయునితో పాటు శివుడికి కూడా పడింది. ఎప్పుడైతే ఇలా జరిగిందో అప్పుడే పరమశివునికి కోపం వచ్చి, యమధర్మరాజుని ఒక తాపు తన్నాడు. యమధర్మరాజు ఆ దరిదాపుల్లో ఉండకుండా వెళ్ళిపోయాడు. తన భక్తుణ్ణి ఆ విధంగా మృత్యుంజయుణ్ణి చేశాడు పరమశివుడు. ఈ పౌరాణికగాథ భగవంతుణ్ణి వేడితే మృత్యుంజయుడవుతాడని సూచిస్తుంది. దీని అంతరార్థం మోక్షాన్ని సూచిస్తుంది.

మృత్యువును జయించటానికి, ఈ భక్తుడు పరమశివుని దగ్గరకు వెళతాడు. మృత్యుభయం పోగొడతాడు కాబట్టి మృత్యుంజయుడు అని ఇక్కడ సంభోదిస్తున్నారు రమణులవారు. కాని తమాషా ఏమిటంటే పరమశివుడు ఆ భక్తుణ్ణి నాశనం చేస్తాడు అంటున్నారు. ఇదేం విడ్డూరం?

తనను యమధర్మరాజు నాశనం చేస్తాడు, ఆయననుంచి కాపాడమని కోరితే, పరమశివుడే నాశనం చేస్తే, ఏం చేయాలి? ఇంకెవరిని ప్రార్థించాలి? చూడటానికి వింతగా ఉన్నా ఇందులో చాలా లోతైన, గంభీరమైన, గమ్మత్తైన వేదాంతం ఉంది.

దీనికి కాళిదాసు చమత్కారం సరిగ్గా సరిపోతుంది. ఒకరోజు భోజమహారాజు తన ఆస్థాన పండితులతో 'మోక్షానికి పోగలిగే వాడెవడు?' అని ప్రశ్నించాడట. అందరూ తలో విధంగా సమాధానం చెప్పారు కాని మహాకవి కాళిదాసు లేచి, 'నేను పోతే పోవచ్చు,' అన్నాడు. ఆ మాట తక్కిన పండితులకి కోపం తెప్పించింది. అతను మాత్రమే ఎలా వెళతాడు అనుకున్నారు. అప్పుడు కాళిదాసు తన మాటను వివరించాడు. 'మహాప్రభూ! నేను, పోతే పోవచ్చు అంటే నేను అనే అహంకారం పోతే, ఎవరైనా సరే మోక్షాన్ని పొందవచ్చు అన్నాను కాని, నేను పోతానని చెప్పటం కాదు నా ఉద్దేశ్యం.'

సరిగ్గా ఇదే మాట వర్తిస్తుంది ఇక్కడ కూడా. పరమశివుడు భక్తుణ్ణి నాశనం చేస్తాడు అంటే, నేను భక్తుణ్ణి అనే భావనను నాశనం చేస్తాడని అర్థం. భక్తుడనే భావనలో తప్పేముంది, అది నాశనం చేయటం ఎందుకని సందేహం వస్తుంది. మనం మొదటి శ్లోకంలో వేదాంతసారం చూశాము. జీవ, జగత్, ఈశ్వర విభజన ఉంటేనే అది సంసార కారణం అనీ, ఉన్నదొకటే బ్రహ్మ అనే జ్ఞానం మాత్రమే సంసారాన్ని పారద్రోలుతుందనీ చూశాము.

అందువల్ల, భగవంతుడు భక్తునికి ఆత్మజ్ఞానం కలిగించటం ద్వారా, అతనిలోని భక్తుణ్ణి నాశనం చేస్తాడు అని పరోక్షంగా చెబుతున్నారు రమణులవారు. నేను భక్తుణ్ణి అనగానే ద్వైతం వస్తుంది. భగవంతుడు నాకు భిన్నంగా ఉండాలి. జీవుడు వేరు, ఈశ్వరుడు వేరు అయితేనే జీవుడు, ఈశ్వరునితో మొరపెట్టుకోగలుగుతాడు. అప్పుడే నేను నీ దాసుణ్ణి, నువ్వు నా రక్షకుడివి అనగలుగుతాడు. భక్తిపరంగా ఇదంతా వినటానికి బాగుంటుంది.

కాని దానినుంచి వేదాంతానికి ఎదిగితే, నువ్వు, నేను భక్తుణ్ణి అని అన్నావంటే ద్వైతం వస్తుంది. ద్వైతం వస్తే పరిమితి వస్తుంది; పరిమితి వస్తే అశాశ్వతత్వం వస్తుంది. అశాశ్వతత్వం వస్తే మరణం వస్తుంది. ఈ దశల్లో మొదటిదీ ఆఖరిదీ చూస్తే భక్తుడు = మరణం అని వస్తుంది. బాబోయ్, ఇదేం ఆలోచన అనిపించవచ్చు మీకు! ఎందుకంటే నేను భకుణ్ణి అని, దేవునిమీద భారం వేస్తే మృత్యుభయం పోతుందని నమ్ముతూ వచ్చాము ఇన్నాళ్ళు. ఇప్పుడేమో ఒక్కసారిగా పిడుగులాంటి వార్త చెబుతున్నారు. నువ్వు భక్తుడివా అయితే మరణం తప్పదని! ఎలా దీన్ని జీర్ణించుకోవటం.

ఆవేశపడకూడదు! దీని విచారణను సరిగ్గా అర్థం చేసుకోవాలి. నేను భక్తుణ్ణి అని చెప్పేది మీ అహంకారం. మీరు అహంకారంతో మమేకం చెందితే సంసారం తప్పదు. అందువల్ల నేను అహంకారాన్ని అనే భావనలోని అహంకారాన్ని నాశనం చేస్తాడు పరమశివుడు అంటున్నారు రమణమహర్షి.

ఇంగ్లీషులో ఐ యామ్ ఎ డివోటీ అంటాము. ఐ అనేది చిత్‌ను, యామ్ సత్‌ను సూచిస్తాయి. అక్కడితో ఆగిపోతే నేను శుద్ధ చిత్, శుద్ధ సత్ అని అర్థం వస్తుంది. ఈ పదాల తరువాత ఏ పదం వేసినా అది అహంకారం అంటుంది శాస్త్రం.

**అహం కర్తా ఇతి అహంకారః** – తత్త్వబోధ

ముందు అసలు అహంకారం నిర్వచనం ఏమిటో సరిగ్గా అర్థం చేసుకోవాలి. లౌకికంగా మాట్లాడేటప్పుడు అహంకారాన్ని గర్వం లేదా ఈగో అని వర్ణిస్తాము. నేను చేస్తున్నాను, నావల్లే ఇదంతా, నావల్లే అవుతోంది, నేను తెలివైనవాణ్ణి – ఇలా చెప్పే వాక్యాలు. కాని వేదాంతం నిర్వచనం వేరే. ఐ యామ్ తర్వాత ఏది కలిపినా అది అహంకారమే అంటుంది. ఐ యామ్ ఎ మాన్, ఐ యామ్ ఎ ఫాదర్, ఐ యామ్ ఎ శిష్య – ఇలా ఏ పదం కలిపినా అది అహంకారం అవుతుంది. వీటిని తెలుగులో చూస్తే నేను మనిషిని, నేను తండ్రిని, నేను శిష్యుడిని – ఇలా ఏ పదం కలిపినా నేను అనాత్మస్థాయికి దిగిపోతున్నాను. నేను మాత్రమే వాడినా, నేను ఉన్నాను అన్నా సాక్షిచైతన్యంగా అర్థం చేసుకుంటాను.

నేను అంటే అహం. ఈ అహం పదానికి ఏ పదం కలిపినా అది **అహంకారం** అయి కూర్చుంటుంది. అహం శిష్యః అస్మి. కారం పదంలోనే ఉంది కారం. ఈ కారం చేయాల్సిన నాశనం చేసేస్తుంది. అహం పదానికి ఏ నామరూపాలు చేర్చినా అది అహంకారం అయిపోతుంది. మీకు మృత్యుభయం పోగొట్టాలంటే ఈ అహంకారాన్ని నాశనం చేసి, మిమ్మల్ని అహంలో నిలపాలి భగవంతుడు. అదే చేస్తున్నాడు పరమశివుడు అంటున్నారు రమణులవారు. ఎప్పుడైతే ఈ అహంకారం పోతుందో అప్పుడే **నేను భక్తుణ్ణి** అనే భావన పోతుంది.

నేను భక్తుణ్ణిలో **భక్తుణ్ణి** పోతే మిగిలేది ఏమిటి? **నేను**. నేను అంటే శుద్ధ చిత్, శుద్ధ సత్. ఇంక జీవ ఈశ్వర భేదం లేదు. ఈ కృపను కురిపించేదెవరు? మృత్యుంజయుడు. అందువల్ల భగవంతుడు తన భక్తుణ్ణి నాశనం చేస్తాడు అంటే అతనిలోని భక్తుణ్ణి పదాన్ని నాశనం చేసి, శుద్ధ చిత్, సత్‌గా నిలుపుతాడని అర్థం. దీన్నే సానుకూలంగా చెప్పాలంటే, భగవంతుడు తన భక్తుణ్ణి ఆలింగనం చేసుకుని, తనలో ఐక్యం చేసుకుంటాడని చెప్పవచ్చు. అప్పుడు భక్తుడు, భగవంతుడు అనే భేదభావన లేదు. అంటే దీన్ని అక్షరాలా చూడకూడదు. బుద్ధిలో ఐక్యజ్ఞానం కలిగిస్తాడు. ఇది శివపూజా ఫలం.

**మృత్యుభియా శ్రితానామ్** – శ్రితానాం అంటే భగవంతుని ఆశ్రయించినవానికి శరణు వేడినవానికి. భక్తుడు ఎవరిని శరణు వేడతాడు? భగవంతుణ్ణి. అందువల్ల మృత్యుంజయం శ్రితానాం. ఎందుకు శరణు వేడతాడు? దేనినుంచి రక్షణ కోరుకుంటున్నాడు?

మృత్యుభియా – మృత్యుభయంనుంచి; మృత్యుభయం ప్రతి జీవిని నిరంతరం వెంటాడుతూనే ఉంటుంది.

**జన్మమృత్యు జరావ్యాధి దుఃఖదోషానుదర్శనమ్**

అందువల్లనే కృష్ణపరమాత్మ ఈ భయంనుంచి బయటపడమంటున్నాడు. మృత్యువు అనేది ఎప్పుడో చివర్లో హఠాత్తుగా వచ్చి కబళించదు. క్షణక్షణం కాలం తన పని తాను మనమీద నిశ్శబ్దంగా చేసుకుపోతూ ఉంటుంది. ఒక్కొక్క అంగాన్నీ బలహీనపరుస్తూ వస్తుంది. క్షణక్షణం చస్తూ బ్రతుకుతున్నాము. యమధర్మరాజు మనను వెంటాడుతూనే ఉన్నాడు రహస్యంగా పొంచివుండి. ఎప్పుడో ఎదుటికి వచ్చి తన పాశాన్ని విసురుతాడు.

అందువల్ల పుణ్యలోకాలకు వెళితే హాయిగా ఆనందాన్ని అనుభవించవచ్చని యజ్ఞయాగాదులు, జపతపాలు చేస్తాము. స్వర్గంలోనో, బ్రహ్మలోకంలోనో శాశ్వతంగా ఉండిపోవచ్చని ఆశిస్తాము. కాని కాలతత్త్వం అక్కడ కూడా ఉంటుంది; కాకపోతే ఇక్కడ కాలం వేగంగా కరిగిపోతే అక్కడ కాలపరిమితి చాలా ఎక్కువ. అయినా లాభం లేదంటుంది శాస్త్రం.

**ఆబ్రహ్మభువనాల్లోకాత్ పునరావర్తినోఽర్జున** – గీత

బ్రహ్మలోకానికి వెళ్ళినా సరే, వెనక్కి తిరిగిరాక తప్పదని కృష్ణపరమాత్మ హెచ్చరిస్తాడు.

ఎక్కడికెళ్ళినా కాలం కోరల్లో చిక్కుకోక తప్పదు. ఈ కాలం బారినుంచి తప్పించుకోవాలంటే కాలకాలుడైన మృత్యుంజయుణ్ణి ఆశ్రయించటం ఒక్కటే మార్గమని ఈ భక్తుడు అర్థం చేసుకున్నాడు. వాలి–సుగ్రీవ కథలో చూస్తాము. వాలి, సుగ్రీవుడెక్కడికి వెళ్ళినా అతన్ని వెన్నంటే వాడు. వాలి బారినుంచి సుగ్రీవుడు తప్పించుకోగలిగే ప్రదేశం ఒకటే ఉంది. దాన్ని ఋష్యమూక పర్వతం అంటారు. అది చిన్న పర్వతమే అయినా, అక్కడికి వాలి వెళ్ళలేడు. ఎందుకంటే వాలికి శాపం ఉంది. అతను ఆ పర్వతంమీద కాలు పెడితే, అతని తల వేయి చెక్కలవుతుంది.

ఈ కథను మనకు అన్వయిస్తే మనమంతా సుగ్రీవులం. యమధర్మరాజు వాలిలాగా మనను వెంటాడుతున్నాడు. మనను రక్షించగలిగే ఋష్యమూక పర్వతం మృత్యుంజయుడే. అంటే పరమశివుడే! పరమశివుణ్ణి శరణు వేడితే ఆయన ఏం చేస్తాడు?

**అహంమతిః మృత్యుమ్ ఉపైతి పూర్వమ్** – దీన్ని అక్షరాలా తీసుకుంటే పరమశివుడు మనను నాశనం చేస్తాడని వస్తుంది. యమధర్మరాజు నాశనం చేస్తాడని పరమశివుణ్ణి వేడుకుంటే ఆయన కూడా నాశనం చేస్తే మనకి ఇంక దిక్కెవరు? ఈ వాక్యాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి.

అహంమతిః – అహం+మతిః – నేను అనే బుద్ధి. అంటే నేను శరీరాన్ని, నేను మనస్సును అని మనశ్శరీరాలతో మమేకం చెందే బుద్ధి. దీన్ని శాస్త్రంలో అహంకారం అంటారు. ఈ అహంకారమే జీవజగత్ ఈశ్వరభేదాన్ని చూపిస్తుంది. ఒక్కముక్కలో చెప్పాలంటే అహంమతిః అంటే అహంకారం.

మృత్యుమ్ ఉపైతి పూర్వమ్ – ఈ అహంకారం ముందుగా మరణం పొందుతుంది అంటే ఈశ్వరుడు అహంకారాన్ని నాశనం చేస్తాడు. అహంకారాన్ని ఎలా నాశనం చేస్తాడు? అహంకారాన్ని కంటికి కనబడే ఆయుధాలతో నాశనం చేయలేము. ఎందుకంటే అది అజ్ఞానంవల్ల బుద్ధిలో కలిగిన పొరపాటు. దేని అజ్ఞానం? అంతకుముందు కూడా చూశాము. అద్వైత బ్రహ్మ అజ్ఞానం. ఈ అజ్ఞానం ద్వైతమనే పొరపాటుకి దారితీసింది. సద్దర్శనం చేయకపోవటంవల్ల అజ్ఞానం, అజ్ఞానంవల్ల అహంకారం ఏర్పడ్డాయి. అందువల్ల అహంకారం పోవాలంటే, అజ్ఞానం పోవాలి. అజ్ఞానం ఎలా పోతుంది? జ్ఞానం పొందితేనే పోతుంది.

జ్ఞానం ఎలా పొందుతారు? గురు, శాస్త్ర ఉపదేశం ద్వారా. గురు, శాస్త్ర ఉపదేశం ఎలా అవుతుంది? పరమశివుడు ఏర్పాటు చేస్తాడు. ఆయనే దక్షిణామూర్తి రూపంలో ఉపదేశిస్తాడు లేదా గురువును ఏర్పాటు చేస్తాడు. ఉపదేశం జ్ఞానానికి దారితీస్తుంది; జ్ఞానం అజ్ఞానాన్ని నాశనం చేస్తుంది; అజ్ఞాననాశనం అహంకారాన్ని నాశనం చేస్తుంది. అహంకారనాశనం భేదదర్శనాన్ని నాశనం చేస్తుంది. భేదదర్శననాశనం మృత్యుభయాన్ని నాశనం చేస్తుంది. నాశః పదంలో ఇన్ని దశలు అంతర్లీనంగా ఉన్నాయి. ఈ దశలన్నీ అర్థం చేసుకోలేకపోతే వేదాంతం అర్థంకాదు.

అహంమతిః మృత్యుమ్ ఉపైతి పూర్వమ్ – మృత్యువు అంటే నాశః; ఉపైతి అంటే పొందుతున్నది; పూర్వం అంటే మొదటే. మొత్తం కలిపితే ముందు అహంకారం నాశనమవుతుంది. తరువాత భయం నాశనమవుతుంది.

**అథ** – అథ అంటే తరువాత. దేని తరువాత? అహంకార మరణానంతరం ఏం మిగులుతుంది? ఏమీ మిగలదు అనకూడదు. అహంకారంలో కారం పోయి అహం మిగులుతుందని చూశాము. అహం భక్తః అస్మిలో భక్తః మాత్రమే పోతుంది. అహం అస్మి నేను ఉన్నాను మిగులుతుంది. నేను అంటే శుద్ధ చిత్ అనీ, ఉన్నాను అంటే శుద్ధ సత్ అనీ చూస్తూ వస్తున్నాము.

**స్వభావాత్ అమృతేషు** – నా స్వభావం ఏమిటి? శాశ్వతం, అమృతం, అనంతం. నేను సహజంగానే శాశ్వతం, నాకు కాలపరిమితి లేదు, నాకు మృత్యువు లేదు. శాశ్వతం నా జన్మహక్కు. నేను నా స్వస్వరూపం తెలియక, నేను అహంకారం అనుకుని, మృత్యుభయాన్ని పెంచుకుంటున్నాను.

తేషు – వీరికి. ఎవరు వీరు? తేషు భక్తేషు ఆశ్రితేషు అంటే నిన్ను శరణు కోరాక నీ భక్తులకు అమృతం లభిస్తుంది. అమృతం పొందితే, అంటే వారి స్వస్వరూపం అర్థం చేసుకుంటే,

**కథం పునః మృత్యుధియః అవకాశః** – ఎలా మళ్ళీ మరణభయం కలుగుతుంది?

ఇది ప్రశ్న కాదు; దీన్ని రిటారికల్ క్వొశ్చన్ అంటారు. అంటే స్వస్వరూపజ్ఞానం పొందిన వారికి మరణభయం మళ్ళీ రాదు.

**ఆనందం బ్రహ్మేతి వ్యజానాత్ ... న బిభేతి కుతశ్చనేతి –** తైత్తిరీయమ్

ఆనందం బ్రహ్మ తానే అని అర్థం చేసుకున్న జ్ఞానికి భయం ఎలా కలుగుతుంది? భయం ఉండాలంటే రెండో వస్తువు ఉండాలి. మీరు ఎవరితోనైనా, నాకు భయం వేస్తోంది అంటే వారు వెంటనే అడిగే ప్రశ్న దేని గురించి భయం వేస్తోంది అని. కాని జ్ఞానికి ఉన్నదొకటే బ్రహ్మ. అది తనే అని తెలిస్తే ఇంక దేన్ని చూసి భయపడతాడు?

మృత్యుధీ – ధీ అంటే ఇక్కడ ఆలోచన; మృత్యుధీ అంటే మృత్యుభయం కలిగించే ఆలోచన.

కథమ్ అవకాశః – దానికి ఆస్కారం ఏది? అహంకారం నాశనం అయితే భయం నాశనం అవుతుంది.

**అహంకారనాశే మృత్యుభయనాశః**

అందువల్ల శివపూజ చేయండి. అప్పుడు ఆత్మజ్ఞానం పొందే అవకాశం కలుగుతుంది. ఇది రెండవ శ్లోకం అర్థం.

కాని ఇక్కడ ఒక విషయం గ్రహించాలి. శివపూజ చేస్తే ఆత్మజ్ఞానం పొందుతాము అంటే వేరే దేవునికి పూజ చేస్తే పొందమని కాదు దీని అర్థం. మీరు ఏ కృష్ణుడినో కొలుస్తున్నట్టయితే వెంటనే మీ ఇష్టదేవతని మార్చనవసరం లేదు. రమణమహర్షుల వారు అరుణాచలంలో ఉన్నారు కాబట్టి, అక్కడి దేవుడు అరుణాచలేశ్వరుడైన శివుడు కాబట్టి, ఆయన శివభక్తులు అయివుండవచ్చు. అందువల్ల శివుణ్ణి కొలవండి అన్నారు. ఇక్కడ మీ దేవుని పేరు మీరు వేసుకోవచ్చు.

**శ్లోకం 3**

**సర్వైర్నిదానం జగతోఽ హమశ్చ**
**వాచ్యః ప్రభుః కశ్చిదపారశక్తిః।**
**చిత్రేఽ త్ర లోక్యం చ విలోకితా చ**
**పటః ప్రకాశోఽ ప్యభవత్స ఏకః॥**

**ప్రతిపదార్థం:** సర్వైః = అందరు సిద్ధాంతులు; నిదానం వాచ్యః = అధిష్ఠానం ఉన్నాడని చెబుతారు; జగతః అహం చ = ఈ జగత్తుకు, నాకు కూడా; ప్రభుః కశ్చిత్ (వాచః) = మూలకారణం; అపారశక్తిః = అనంతమయిన శక్తిగల; ఏకః ప్రకాశః – చైతన్యరూపం; అభవత్ = భిన్నంగా అయ్యాడు; విలోకితా చ, లోక్యం చ = జీవుడుగా, జగత్తుగా; అత్ర = ఇక్కడ; చిత్రే = చిత్రపటంలోలాగా.

**తాత్పర్యం:** అందరు సిద్ధాంతులు, ఈ జగత్తుకూ, నాకు కూడా, అనంతమైన శక్తిగల, చైతన్యరూపం అయిన మూలకారణం ఒక్కటే ఉందని చెబుతారు. ఒక చిత్రపటంలో జీవుడు, జగత్తు భిన్నంగా ఉన్నట్టుగా ఉన్నారు.

**వివరణ:** ఈ శ్లోకంనుంచి రమణమహర్షుల బోధ మొదలవుతుంది. రమణమహర్షి బోధ ప్రత్యేకంగా ఉందని, సత్‌యొక్క దర్శనం ద్వారా నా స్వస్వరూపజ్ఞానం పొందేలాగా చేస్తారనీ చూశాము. అఖండ అద్వైత ఆత్మజ్ఞానం పొందితే, ద్వైతంగా కనిపిస్తున్నది మిథ్యగా తేలిపోతుంది. నిర్గుణబ్రహ్మకు జీవుడు ఒక నామరూపం; జగత్తు ఒక నామరూపం; చివరికి ఈశ్వరుడు కూడా ఒక నామరూపమే. దీన్నే వేదాంతశాస్త్రంలో మిథ్యాత్వ నిశ్చయం అంటారు. ఈ మూడూ మిథ్యే అని కొట్టివేయటానికి మూడింటి గురించీ అధ్యయనం చేయనవసరం లేదు.

ఉదాహరణకు సముద్రమూ నీరే, దానిలో ఎగసిపడే అలా నీరే; అలమీద తేలే నురుగూ నీరే. ఈ మూడింటికీ అధిష్ఠానంగా ఉన్నది నీరు. అది తెలుసుకోవటానికి ఈ మూడింటినీ అధ్యయనం చేయనవసరం లేదు. ఏ ఒక్కదాన్ని గమనించినా చాలు. అలాగే బంగారం కూడా. గాజులోను, గొలుసులోను, ఉంగరంలోను ఉండేది బంగారమే. దాన్ని తెలుసుకోవటానికి మూడింటినీ అధ్యయనం చేయనవసరం లేదు. ఏ ఒక్కటి విశ్లేషించినా చాలు. అన్నింటా అధిష్ఠానంగా ఉన్నది బంగారమే అని అర్థమవుతుంది.

దీన్ని స్థాలీపులాక న్యాయం అంటారు. పూర్వం ఇత్తడిగిన్నెలో అన్నం వండేవారు. అత్తెసరు అంటారు. అందులో అన్నం ఉడికిందో లేదో చూడటానికి, ఒక మెతుకు చేతిలోకి తీసుకుని, చిదిమి చూసేవారు. అది మెత్తగా ఉంటే ఉడికినట్టు అర్థం. అన్నం అంతా చూడనవసరం

లేదు. అలాగే ముక్కాలి పీటలోని మూడు కాళ్ళలాగా, ఒకదానితో ఒకటి పెనవేసుకుని ఉన్న ముప్పేట గొలుసులాగా ఉన్న జీవ జగత్ ఈశ్వరులలో ఏ ఒక్కటి అధ్యయనం చేసినా కూడా వాటి అధిష్ఠానం గురించి జ్ఞానం పొందవచ్చు. ఎటునుంచి చూసినా సద్దర్శనమే కలుగుతుంది.

జీవ జగత్ ఈశ్వరులలో దేన్నైనా అధ్యయనం చేయవచ్చు అంటే మూడూ ధీటైనవేనని అర్థం. కాని రమణమహర్షి విచారణ కొత్త పంథాలో సాగుతుందని చూశాము. అందువల్ల ఆయన జీవవిచారణను తీసుకున్నారు తన విశ్లేషణకు. ఈ విచారణ మూడింటిలోకీ శ్రేష్ఠమైనది. జీవుణ్ణి **అహంకారం** అంటారు. అందువల్ల జీవవిచారణనే అహంకారవిచారణ అని కూడా అంటారు. దీన్ని శ్రేష్ఠమైన పద్ధతిగా భావిస్తున్నారు రమణులవారు.

అహంకార విచారణ తక్కిన రెండు విచారణలకన్నా ఎందుకు శ్రేష్ఠమైనది, మేలైనది? దీనికి రెండు కారణాలు చెప్పవచ్చు.

1. **అత్యంత సమీపం** – అహంకారం మనకి ఈ మూడింటిలో అత్యంత సమీపమైనది. ఒక నగరంలో ఏదైనా ఫ్యాక్టరీ నెలకొల్పాలన్నా కూడా, దానికి సంబంధించిన ముడిసరుకులు దొరికేచోట స్థాపించాలని చూస్తారు. అప్పుడు ఆ సరుకులను చేరవేయటం వారికి చాలా తేలిక అవుతుంది. లేకపోతే రవాణా ఖర్చే ఎక్కువైపోతుంది. అదే విధంగా అహంకార విచారణ సమీపమైనది. శరీరం సన్నిహితంగా ఉంది, మనస్సు ఇంకా సన్నిహితంగా ఉంది, బుద్ధి ఇంకా సన్నిహితంగా ఉంటుంది. అజ్ఞానం మరీ సన్నిహితంగా ఉంటుంది. అందువల్ల అహంకార విచారణ శ్రేష్ఠమైనది, మేలైనది.

2. **అహంకార నాశనం చాలా కష్టం** – ఈ మూడింటిలోనూ అహంకారాన్ని నాశనం చేయటం చాలా కష్టం. అది మనకు అత్యంత సమీపంగా ఉండటంవల్ల మనకు తెలియకుండానే దానిమీద మమకారం పెంచేసుకుంటాము. మమకారాన్ని పారద్రోలటం అంత తేలికగా అయ్యే వ్యవహారం కాదు. తేలికగా వదల్చుకోలేని శత్రువును ప్రత్యక్షంగా ఎదుర్కోవాలి. పరోక్షంగా కుదరదు. జగత్ విచారణో, ఈశ్వర విచారణో చేస్తే ఆ రెండూ మిథ్యగా తేలిపోతాయి కాని అహంకారం మాత్రం నాశనమవకపోగా, ఇంకొక మెట్టు పైకెక్కి కూర్చుంటుంది. చూశావా, నేను శాస్త్రాన్ని అధ్యయనం చేశాను అనే అహంకారం పెరుగుతుంది. ఇది ఇంకా బలవత్తరంగా చేస్తుంది అహంకారాన్ని.

అహంకారం ఇలా అత్యంత సమీపంగా ఉంది కాబట్టి, దాన్ని నాశనం చేయటం అంత తేలికగా అవదు కాబట్టి, రమణమహర్షి అహంకార విచారణ చేయాలని దానికే పెద్దపీట వేస్తారు. ఒక్క ఈ సద్దర్శనంలోనే కాదు, ఆయన రచనలు అన్నింటిలోనూ ఇదే ప్రాముఖ్యత

సంతరించుకుంది. జగత్ విచారణకు అంతగా ప్రాధాన్యతనివ్వరు. అంటే సృష్టి ప్రకరణం చూడము ఆయన రచనలో. కాని ఉపనిషత్తుల్లో చాలా వివరంగా చూస్తాము.

భగవంతునినుంచి ముందు సూక్ష్మపంచభూతాలు వచ్చాయని, అవి పంచీకరణం అయ్యాక స్థూల పంచభూతాలు, వాటినుంచి పాంచభౌతిక వస్తువులు వచ్చాయని చూస్తాము. ఈ జగత్ యొక్క సృష్టికి కారణం ఈశ్వరుడు అని ఉపనిషత్తులలో కూడా చూస్తాము. ఈ రెండూ రమణమహర్షి రచనల్లో అంతగా చూడము. ఆయన అహంకార విచారణే ఎక్కువగా చేస్తారు. దానికి కారణం కూడా ఇప్పుడు చూశాము. అది అత్యంత సమీపంగా ఉంది; దాన్ని నాశనం చేయటం అంత తేలికగా అవదు.

రమణమహర్షి రచనల్లో పదేపదే అహంకార విచారణయొక్క ప్రాముఖ్యతను చూస్తాము. అహంకారం కలుగజేసే సమస్యలను అహంకారం నాశనం చేయాల్సిన కారణాలను పదేపదే చర్చిస్తారు. అంటే అహంకార విచార విలువను, దాని లక్ష్యాన్ని చర్చిస్తారు కాని, ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే అహంకార విచారణ ఎలా చేయాలో మాత్రం ఎక్కడా వివరంగా చర్చించలేదు. అహంకారాన్ని అనేక కోణాల్లో చర్చిస్తారు. అహంకార విచారణ ఎందుకు చేయాలో; దాని లక్ష్యం ఏమిటో, దానివల్ల కలిగే ఫలమేమిటో పదేపదే చెబుతారు కాని, అసలైన విషయం మాత్రం ముట్టుకోవటం లేదు. అంటే అహంకార విచారణ ఎలా చేయాలో మాత్రం చెప్పకుండా నిశ్శబ్దం వహిస్తున్నారు.

అసలు అహంకార విచారణ చేయాల్సిన అంశం గురించి మౌనంగా ఉండిపోవటం అనేక వ్యాఖ్యానాలకు దారితీసింది. మౌనాన్ని ఎలాగైనా అర్థం చేసుకోవచ్చు. మౌనం అంగీకారం అని కొందరంటే, మౌనం అనంగీకారం అని మరికొందరు అంటారు.

బౌద్ధమతం గురించిన నాలుగు దర్శనాలు రావటానికి ఈ మౌనమే కారణం. బుద్ధభగవానుణ్ణి, భగవంతుడు ఎవరని అడిగితే, ఆయన మౌనం వహించారు. దాన్ని ఎవరికి తోచినరీతిలో వారు వ్యాఖ్యానించారు. వాటిల్లో శూన్యవాదం ఒకటి. ఇంకొక దర్శనం ప్రకారం భగవంతుడు ఉన్నాడు కాని మాటలలో వర్ణించలేము. అందువల్లనే బుద్ధభగవానుడు మౌనంగా ఉండిపోయాడు అంటారు వారు.

అలా చెప్పుకుంటూపోతే మౌనానికి ఎన్నన్నా వ్యాఖ్యానాలు చేయవచ్చు. మౌనం అంటే మాటలతో వర్ణించలేమని చెప్పవచ్చు. ఆ వస్తువు లేదని చెప్పవచ్చు; నేను చెప్పటానికి సిద్ధంగా ఉన్నా కూడా నీకు అర్థంకాదని చెప్పవచ్చు; చెప్పినా నువ్వు స్వీకరించనప్పుడు చెప్పి లాభమేమిటి అని భావించినట్టు చెప్పవచ్చు. కొండొకచో, నాక్కూడా జవాబు తెలీదు కాని ఆ విషయం చెప్పి, నా అజ్ఞానాన్ని ప్రదర్శించటం ఇష్టంలేదని భావిస్తున్నట్టుగా చెప్పవచ్చు.

ఆ విధంగా రమణులవారు అహంకార విచారణ అంత ముఖ్యమైనదని నొక్కివక్కాణిస్తూ కూడా, అహంకార విచారణ ఎలా చేయాలో వివరంగా చెప్పకపోవటంవల్ల రెండు వ్యాఖ్యానాలు వచ్చాయి. అందువల్లనే రమణులవారి బోధ **చుమ్మా ఇరు – మౌనంగా ఉండు** అని ఒక వ్యాఖ్యానం వచ్చింది. అహంకార విచారణ అంటే నిశ్శబ్దంగా ఒకచోట కూర్చుని, కళ్ళు మూసుకుని, నేనెవరు, నేనెవరు అని విచారణ చేస్తూ పోవాలి అంటారు. రమణులవారి సిద్ధాంతం **హూ యామ్ ఐ మెడిటేషన్**గా ప్రసిద్ధి చెందింది. ధ్యానంలో నేనెవరు, ఈ అహంకారం ఎక్కడనుంచి వచ్చిందని విచారణ చేస్తే, సమాధానం దొరుకుతుంది అంటారు వారు.

కాని స్వామీజీ ఈ పంథాలో విచారణ చేయటం సరియైనది కాదనీ, ఆత్మవిచారణలో ముందుకు సాగలేరనీ భావిస్తారు. ఈ సిద్ధాంతం వారికి – ఆత్మవిచారణ చేయాలని తెలుసు; విచారణ విలువ ఏమిటో తెలుసు; విచారణ లక్ష్యం ఏమిటో తెలుసు, కాని వచ్చిన చిక్కేమిటంటే అసలైనదే తెలియదు. విచారణ ఎలా చేయాలో తెలియదు. అందువల్ల వారు విచారణ చేసే మార్గంలోనే ఆగిపోతారు, ఎన్నటికీ గమ్యం చేరుకోలేరు.

రమణులవారు విచారణ ఎలా చేయాలో చెప్పలేదు కాబట్టి విచారణ చేయనవసరం లేదు, నేనెవరు అని ధ్యానంలో కూర్చుంటే చాలు అనుకోవటం ఒక పొరపాటు. నిజానికి రమణులవారి బోధ వేదాంతబోధకు అనుగుణంగానే ఉంది. అందులో జ్ఞానాన్ని గురు, శాస్త్ర ఉపదేశం ద్వారానే పొందాలని పదేపదే వస్తుంది. మరయితే, రమణులవారు ఎందుకు విచారణ ఎలా చేయాలో చెప్పలేదు అంటే, దానికి కారణాన్ని ఊహించవచ్చు. విచారణ ఎలా చేయాలో ఆయనే వివరిస్తే, శిష్యులు స్వంతంగా చేయటానికి ప్రయత్నిస్తారు కాని గురువు దగ్గరకు వెళ్ళరు. స్వంతంగా శాస్త్రాన్ని అధ్యయనం చేస్తే అర్థం కాదు. అర్థం కాకపోయినా ఫర్వాలేదు, అపార్థం చేసుకునే అవకాశం ఉంది. అందువల్లనే శాస్త్రాన్ని స్వంతంగా అధ్యయనం చేయకూడదు అంటారు. అలా చేయకుండా ఉండటానికే రమణులవారు మార్గం చెప్పలేదేమో అనుకోవాలి.

ఈ విషయం వేదాలను చూస్తే అర్థం అవుతుంది. మనకు శాస్త్రం మొదట్లో తరతరాలుగా ఎలా వచ్చింది? గురుపరంపరగా వచ్చింది. అప్పుడు పుస్తకాలు లేవు, కొన్నాళ్ళు తాళపత్ర గ్రంథాలు కూడా లేవు. వేదాన్ని గురుపరంపరగా ఇంకా మాట్లాడితే కర్ణపరంపరగా నేర్చుకునేవారు. తరువాత కాలక్రమేణా వేదాలను ప్రచురించారు. అప్పుడు వాటికి స్వరాలను చూపించలేదు. ఎందుకో తెలుసా? వేదాలను ఎలా పలకాలో, స్వరాలను స్వరబద్ధంగా ప్రచురిస్తే గురువు దగ్గరకు వెళ్ళకుండా, స్వంతంగా నేర్చుకుని, పొరపాటుగా ఉచ్చరిస్తారు.

శాంతిపాఠమైన పూర్ణమదః పదాన్ని స్వరం మార్చి పఠిస్తారు కొందరు. ఇలాంటివారు, వారు నేర్చుకుని ఊరుకోరు. మరో వందమందికి నేర్పిస్తారు. దీన్ని అంధపరంపర అంటారు.

రమణమహర్షికి మనుష్యుల మనస్తత్వం బాగానే తెలుసు. ఆయన అహంకార విచారణ ఎలా చేయాలో చూపిస్తే, వారే చేసుకుపోతారనీ, ఆ విచారణ గురువు ద్వారా, శాస్త్రం ద్వారా మాత్రమే చేయాలనీ గట్టిగా నమ్ముతారు. అందువల్ల రమణమహర్షి విచారణ చూపరు. ఆయన గురు, శాస్త్ర ఉపదేశం ద్వారా నేర్చుకోవాలని ఎక్కడ, ఎలా చెబుతారో ముందుముందు మీరే చూద్దురు గాని. అందువల్ల ఈ గ్రంథాన్ని పక్కన పెట్టుకుని, దీనికి గురు, శాస్త్ర ఉపదేశం ద్వారా నేర్చుకున్న వేదాంతబోధను కలగలిపితే, అద్భుతంగా ఉంటుంది.

గురువు ద్వారా నేర్చుకోకపోతే సరిగ్గా అర్థం కాదు; అటు మన వేదాంత గ్రంథాలైనా, ఇటు రమణమహర్షి గ్రంథాలైనా కూడా. ఇప్పుడు రాబోయే శ్లోకాల్లో అహంకార విచారణ ఎందుకు చేయాలో, ఫలమేమిటో వస్తుంది కాని, విచారణ ఎలా చేయాలో తెలిపే మార్గం మాత్రం రాదని గుర్తుంచుకోండి.

**లక్ష్యం** – అహంకార విచారణ లక్ష్యం ఏమిటి? భేదాలు లేని నిర్గుణ బ్రహ్మజ్ఞానం పొంది, భేదాలున్న ద్వైతాన్ని మిథ్యా నామరూపాలుగా కొట్టివేయటం. ద్వైతాన్ని అనేక కోణాల్లో చూడవచ్చు. మనం ఉపోద్ఘాతంలో మూడుగా చూశాము. జీవ, జగత్, ఈశ్వరుడు. దీన్ని త్రిపుటి అన్నాము; ఇప్పుడు ఈ శ్లోకాల్లో ఈ త్రిపుటిని రెండుగా విభజిస్తున్నారు. ఇంకో కోణంలోంచి చూస్తే, అంతేమరి. అది సబ్జెక్ట్–ఆబ్జెక్ట్ విభజన; ప్రమాతా–ప్రమేయం విభజన; చూసే నేను చూడబడే వస్తువు విభజన.

ఈ విభజన ప్రకారం ఉన్నది జీవ–జగత్తు అని చెప్పవచ్చు. జీవుడు సబ్జెక్టు – జగత్తు ఆబ్జెక్టు. ఈశ్వరుణ్ణి విడిగా పేర్కొనటం లేదు. ఈ ద్వైతానికి అధిష్ఠానం ఏమిటి? బ్రహ్మ. మరి ఈశ్వరుడు ఏమవుతాడు? ఇక్కడ రమణమహర్షి ఈశ్వర పదాన్ని బ్రహ్మ పదానికి పర్యాయపదంగా వాడుతున్నారు. వేదాంతంలో కూడా చూస్తాము. ఈశ్వరుడు పదాన్ని ఇటు సగుణబ్రహ్మకు, అటు నిర్గుణబ్రహ్మకు కూడా వాడతారు. సగుణబ్రహ్మ అంటే ఈశ్వరుడు–జీవ జగత్ ఈశ్వర త్రిపుటిలో వస్తాడు. అక్కడ వ్యావహారిక సత్యంగా, మిథ్యగా కొట్టివేయబడతాడు. అదే ఈశ్వర పదాన్ని నిర్గుణబ్రహ్మకు వాడితే, అది పారమార్థిక సత్యంగా, సద్రూపంగా నిలబడతారు. వ్యావహారిక సత్యంలో మిథ్య అంటే, పారమార్థిక సత్యంలో అధిష్ఠానం అంటుంది శాస్త్రం.

ఈశ్వరుడు సత్యమా, మిథ్యా అంటే వెంటనే జవాబు చెప్పకూడదు. వ్యావహారిక సత్యంలో మిథ్య; పారమార్థిక సత్యంలో సత్యం లేదా అధిష్ఠానం అని చెప్పాలి. ఇప్పుడింక మనం ఈశ్వరుణ్ణి బ్రహ్మగా, అధిష్ఠానంగా చూడబోతున్నాము.

ఈ నేపథ్యంతో ఈ శ్లోకాన్ని చూద్దాము.

**సర్వైః** – అందరు సిద్ధాంతులు;

**నిదానం వాచ్యః** – అధిష్ఠానం ఉన్నాడని చెబుతారు. దేనికి?

**జగతః అహమః చ** – ఈ జగత్తుకూ, నేను అనే జీవునికీ కూడా.

జగత్తు అంటే ఆబ్జెక్టు అనీ, నేను అంటే సబ్జెక్టు అనీ చూశాము. సబ్జెక్ట్–ఆబ్జెక్ట్ విభజనకు ఒక అధిష్ఠానం ఉండాలని, అన్ని సిద్ధాంతాలవారు చెబుతారు. విజ్ఞానశాస్త్రపరంగా మూలకారణాన్ని అన్వేషిస్తున్నారు. శాస్త్రం ఏమంటుంది?

**ప్రభుః కశ్చిత్ (వాచః)** – ఏదో ఒక భగవంతుని గురించి చెప్పాలి. ప్రభుః అంటే మూలకారణం, భగవంతుడు. ఆ భగవంతుణ్ణి ఏ పేరుతోనైనా కొలవండి – రాముడు, కృష్ణుడు, శివుడు, ఎవరైనా సరే. అందువల్ల ఏదో ఒక పేరు చెప్పాలి. ఈ మూలకారణం, ఈ అంతిమసత్యం ఎలా ఉంటుంది?

**అపారశక్తిః** – ఒక్క శక్తి ఇంత భిన్నత్వం ఉన్న జగత్తంతా ప్రకటితమవాలంటే, ఎంత శక్తి ఉండాలో ఊహించుకోండి. ఆ శక్తిని పరాశక్తి అనండి, నిర్గుణబ్రహ్మ అనండి, ఏదైనా అనండి; దాన్ని జగత్తుకు అధిష్ఠానంగా స్వీకరించాలి. అప్పుడు జీవుడు–జగత్తు కూడా నామరూపాలుగా కొట్టివేయబడతాయి.

**ఏకః ప్రకాశః** – రెండవ పాదంలో చూసిన ప్రభుః అర్థమే ప్రకాశః పదానికి కూడా తీసుకోవాలి. ప్రకాశః అంటే చైతన్యరూపం. చైతన్యం ఎన్ని? ఒకటే అద్వైత వస్తువు. భేదాలు లేని వస్తువు.

**అభవత్** – ఈ బ్రహ్మ పైపైన భిన్నంగా అయ్యాడు. ఏం అయ్యాడు?

**విలోకితా చ** – జీవుడుగా అయ్యాడు. విలోకిత అంటే ద్రష్ట; ప్రమాత, భోక్తా, సబ్జెక్ట్.

**లోక్యం చ** – జగత్తుగా కూడా అయ్యాడు. లోక్యం అంటే దృశ్యం; ప్రమేయం, ఆబ్జెక్ట్. అంటే బ్రహ్మ రెండుగా అయ్యాడు. ద్రష్టా, దృశ్యం లేదా జీవుడు, జగత్తు.

నిర్గుణ, నిర్వికార, అఖండ బ్రహ్మ అనేకంగా అయ్యాడు. తార్కికంగా చూస్తే భాగాలు లేని అఖండం బ్రహ్మ భాగాలు అవటానికి అవకాశం లేదు. అనంతం బ్రహ్మ పరిమితి ఉన్న జీవి, జగత్ అవలేదు. ఎక్కడ భాగం వస్తే అక్కడ పరిమితి వస్తుంది. మరి బ్రహ్మ **విలోకితా చ లోక్యం చ అభవత్** అని ఎలా అన్నారు? అలా విభజించుకున్నట్టుగా అనిపిస్తుంది, కాని నిజంగా కాలేదు. అఘటిత ఘటన పటీయసీ మాయయా. మాయాశక్తివల్ల అసాధ్యం సాధ్యం అయినట్టుగా అనిపిస్తుంది.

దీనికి ఉదాహరణ మనం రోజూ చూసే స్వప్నప్రపంచమే. జాగ్రద్ పురుషుడు పడుకున్నప్పుడు అద్వైతం, అంటే ఒక్కడే ఉన్నాడు. కాని ఒకసారి స్వప్నప్రపంచం ఏర్పడ్డాక తనను తాను రెండుగా విభజించుకుంటాడు. స్వప్నపురుషుడు తానే అవుతాడు, స్వప్నప్రపంచమూ తానే అవుతాడు. ప్రమాతా తానే అవుతాడు, ప్రమేయం తానే అవుతాడు. స్వప్నంలో ఉన్నంతవరకూ ఆ విభజన నిజంగా జరిగినట్టే ఉంటుంది కాని స్వప్నంనుంచి లేవగానే, ఏ ప్రయత్నమూ లేకుండానే విభజన పోయి, మళ్ళీ ఏకం అవుతాడు.

**సాక్షాత్ కురుతే ప్రబోధసమయే స్వాత్మానమేవ అద్వయమ్**

నిద్ర లేచాక, అద్వయమే ఉంటుందని దీని అర్థం.

**చిత్రే అత్ర** – ఈ భావాన్ని విశదీకరించటానికి, రమణమహర్షి ఒక అద్భుతమైన ఉదాహరణను జోడిస్తున్నారు. అది చిత్రపటం. ఒక చిత్రపటంలో ఒక చిత్రకారుడు చిత్రించిన దృశ్యం చూడండి. అందులో మనిషి, కొండలు, చెట్లు ఉన్నాయనుకుందాము. మనిషి చేతనం; కొండలు అచేతనం; చూడటానికి రెండు భిన్నవస్తువులుగా ఉన్నప్పటికీ, ఆ భిన్న వస్తువులు ఎక్కడ ఉన్నాయి? ఒకే అధిష్ఠానంలో. ఇక్కడ ఒకే చిత్రపటంలో.

మనం వేదాంతంలో తరచూ చూసే దృష్టాంతం – తెర, సినిమా. సినిమాలో చేతన మనుష్యులని, అచేతన వస్తువులనీ, ఎందరినో, ఎన్నింటినో చూస్తాము. కాని వాటన్నిటికీ ఒకటే ఆధారం. అది తెర. అందువల్ల సినిమాలోని ప్రమాతా, ప్రమేయంకు, చేతన–అచేతన రూపాలకు కూడా అధిష్ఠానం ఈ తెరే! తెర ఒక్కటి, దానిమీద కనబడుతున్నవి అనేకం.

ఇక్కడ చిత్రపటం ఒకటే, దానిమీద కనబడుతున్న రూపాలు అనేకం. అలాగే బ్రహ్మ ఏకం, బ్రహ్మనుంచి వచ్చినవి అనేకం. కాని ఉదాహరణను ఎంతమేరకు తీసుకోవాలో అంతమేరకే తీసుకోవాలి. ఇక్కడ చిత్రపటం కాని, వేదాంతంలో మనం చూసే తెర కాని జడం. అదే విధంగా బ్రహ్మ కూడా జడం అనేయకూడదు. అధిష్ఠానం చిత్రపటం, అధిష్ఠానం తెర జడం కాని, అధిష్ఠానం బ్రహ్మ చైతన్యం.

బ్రహ్మ ఏకం అంటాము, మళ్ళీ బ్రహ్మ మాయాశక్తివల్ల జీవజగత్తులను సృష్టించాడు అంటాము. అయితే ఇక్కడ సందేహం రావచ్చు. బ్రహ్మ ఒకటే అయితే, బ్రహ్మకు భాగాలు లేకపోతే మాయ ఎక్కడినుంచి వచ్చింది? బ్రహ్మ + మాయా అంటే ఇద్దరు అవుతారు కదా!

దీనికి వేదాంతంలో జవాబు చూస్తాము. ఒక జవాబు మాయకు విడిగా ఉనికి లేదు. అది శక్తి. ఉదాహరణకు స్వామీజీకి బోధించే శక్తి అపారంగా ఉంది. స్వామీజీ వస్తుంటే, అదుగో స్వామీజీ + ఆయన బోధనాశక్తి వచ్చారు అంటామా? అనము.

ఇంకొక జవాబు – సృష్టి చేసేటప్పుడు బ్రహ్మ మాయాశక్తితో సృష్టి చేశాడు అంటాము. బ్రహ్మ + మాయ = ఈశ్వరుడు అని నేర్చుకుంటాము వేదాంతంలో. కాని జగత్తును, జీవుణ్ణి మిథ్యగా కొట్టివేసేటప్పుడు మాయను కూడా మిథ్యగా కొట్టివేస్తాము. సృష్టి వ్యావహారిక సత్యం, బ్రహ్మ ఇంకా స్పష్టంగా చెప్పాలంటే నిర్గుణబ్రహ్మ పారమార్థిక సత్యం. పారమార్థిక సత్యానికి ఎదిగితే ఉన్నదొకటే అద్వైతం బ్రహ్మ. అందువల్ల మాయ బ్రహ్మలో ఒక భాగం కాదు.

**శ్లోకం 4**

**ఆరభ్యతే జీవజగత్పరాత్మ**
**తత్త్వాభిధానేన మతం సమస్తమ్ ।**
**ఇదం త్రయం యావదహంమతి స్యాత్**
**సర్వోత్తమాఽహంమతిశూన్యనిష్ఠా॥**

**ప్రతిపదార్థం:** సమస్తం మతమ్ ఆరభ్యతే = అన్ని మతాలు కూడా సమానంగా మొదలవుతాయి; జీవజగత్పరాత్మ = జీవ, జగత్, ఈశ్వర; తత్త్వాభిధానేన = అనే ప్రాథమిక తత్త్వాలను ప్రతిపాదిస్తున్నాయి; యావత్ ఇదం త్రయం = ఈ మూడు భేదాలు కొనసాగుతున్నంతవరకు; అహంమతిః స్యాత్ = నేను అహంకారాన్ని అనే భావన కొనసాగక తప్పదు; అహంమతి శూన్యనిష్ఠా = అహంమతి రహితమైన స్థితే; సర్వోత్తమా (భవతి) = అన్నింటికన్నా శ్రేష్ఠమైనది.

**తాత్పర్యం:** అన్ని మతాలు జీవ, జగత్, ఈశ్వరులనే ప్రాథమిక తత్త్వాలని ప్రతిపాదిస్తున్నాయి కాని ఈ తత్త్వత్రయం అహంబుద్ధి ఉన్నంతవరకూ ఉంటుంది. అహంమతి రహితమైన స్థితే అన్నింటికన్నా శ్రేష్ఠమైనది.

**వివరణ:** ఈ శ్లోకంలో రమణమహర్షి తక్కిన సిద్ధాంతాలన్నీ ద్వైతభావననే పెంచి పోషిస్తాయని చూపించబోతున్నారు.

మానవాళిని ఉద్ధరించటంకోసం అనేక మతాలు, అనేక దర్శనాలు వెలుగులోకి వచ్చాయి. అందరి అంతిమలక్ష్యం ఒక్కటే. మనుష్యులను సంసార సాగరంనుంచి రక్షించి, మోక్షాన్ని కలుగజేయటం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తక్కిన మతాలను పక్కనపెడితే, మన హిందూమతంలోనే పన్నెండు దర్శనాలు ఉన్నాయి. ద్వాదశ దర్శనాని అంటారు. వాటిలో ఆరింటిని నాస్తిక దర్శనాలనీ, ఆరింటిని ఆస్తిక దర్శనాలనీ అంటారు.

నాస్తిక దర్శనాలు – చార్వాక దర్శనం, జైనదర్శనం, నాలుగు బౌద్ధదర్శనాలు

ఆస్తిక దర్శనాలు – సాంఖ్య, యోగ, వైశేషిక, న్యాయ, పూర్వమీమాంస, ఉత్తర మీమాంస దర్శనాలు.

అన్ని దర్శనాలూ మానవాళికి మోక్షం ఇప్పించటానికి కంకణం కట్టుకున్నాయి. వారి శాస్త్రాన్ని మోక్షశాస్త్రం అని కూడా అంటారు. నాలుగు పురుషార్థాలలోకి మోక్షం పరమ పురుషార్థం. అదే శ్రేయోమార్గం కూడా. అందరూ మోక్షం ఇప్పించేటట్టయితే మరి భేదం ఎక్కడ వస్తున్నది? వారి తత్త్వంలో వస్తున్నది. తత్త్వం అంటే వారి దర్శనంలో వారు చెప్పే ప్రాథమిక సూత్రాలు. ఇవి ఒక్కొక్క దర్శనానికీ మారుతూ వస్తాయి. మనం చూసిన పన్నెండూ కాక, ఇంకా ఎందరో సిద్ధాంతాలని పేర్కొన్నారు గౌడపాదాచార్యులవారు తన మాండూక్య కారికల్లో.

**పంచవింశక ఇత్యేకే షడ్వింశ ఇతి చాపరే ।**
**ఏకత్రింశక ఇత్యాహురనంత ఇతి చాపరే॥**

సాంఖ్య దర్శనం 25 తత్త్వాలే సత్యం అంటుంది. యోగదర్శనం 26 తత్త్వాలే సత్యం అంటుంది. పాశుపత శైవులు 31 తత్త్వాలే సత్యం అంటారు. కొంతమంది అనంతమైన పదార్థాలే సత్యం అంటారు.

ఎవరెన్ని తత్త్వాలను పేర్కొన్నా కూడా, అందరూ సమానంగా మూడు ప్రాథమిక తత్త్వాలను అయితే ఒప్పుకుని తీరాలి. దాన్ని తత్త్వత్రయం అంటారు. అవి జీవుడు, జగత్తు, ఈశ్వరుడు. వీటికన్నా ఎక్కువ చెబుతారు కాని, అది పట్టించుకోము. ఎందుకు?

ఏ దర్శనానికైనా హీరో ఎవరు? జీవుడు. వ్యష్టి అంటాం వేదాంతంలో. ఏ సిద్ధాంతం అయినా ఎందుకు వెలుగులోకి వచ్చింది? ఈ జీవుడు సంసారంలో పడి కొట్టుమిట్టాడుతున్నాడు, అతన్ని ఉద్ధరించాలనే తపనతో. జీవుడికి సమస్యలు సృష్టించేదెవరు? జగత్తు. జగత్తుతో వ్యవహారం నడపటంవల్ల అతను అవస్థ పడుతున్నాడు. జీవుడు హీరో అయితే, జగత్తు విలన్. ఎందుకంటే ఎవరైనా ఫిర్యాదు చేస్తే ఎదుటివారి గురించి ఫిర్యాదు చేస్తారే కాని వారి మీద వారు చేసుకోరు. అవునా, కాదా? ఎంతసేపూ ఎదుటివారిలో తప్పులెన్నటానికే చూస్తారు. అతనిలా అన్నాడు, ఆమె ఇలా చేసింది – ఇదే భాగవతం రోజంతా!

ఇలా జగత్తుని తిట్టుకుంటున్నప్పుడు, నాకు సమస్యలను ఇచ్చే జగత్తును, తీరికూర్చుని సృష్టించిందెవరు అనే ఆరా మొదలవుతుంది. అప్పుడు జగత్కారణ ఈశ్వరుడు వెలుగులోకి వస్తాడు. ఇప్పుడు త్రిపుటిలో మూడు చూశాము. జీవ, జగత్, ఈశ్వర. ఈ మూడింటిలో ఒకరైన ఈశ్వరుడు శాశ్వతమా, అశాశ్వతమా?

ఇదంతా మనం ముందే చూశాము. ఈ మూడూ ముక్కాలిపీటలో మూడు కాళ్ళలా ఒకదానితో ఒకటి పెనవేసుకుని ఉన్నాయి. అందువల్ల ఈ సగుణ ఈశ్వరుడు కూడా అశాశ్వతం, మిథ్య అని మనం అంటాము. మిగతా వారేమంటారో ముందు ముందు

చూద్దాము. ముందైతే వారు ఈ మూడింటినీ పరిచయం చేశాక అనేక సాధనలను నిర్దేశిస్తారు. అనేక కర్మలను, అనేక ఉపాసనలను నిర్దేశిస్తారు. కర్మ, ఉపాసన రెండింటిలోనూ మూడు అంశాలు ఉంటాయి.

ఉపాసనపరంగా చూస్తే ఉపాసకుడు, ఆలంబనం, ఉపాస్యదేవత. ఉపాసకుడు జీవుడు, ఆలంబనం జగత్తులో ఏదైనా వస్తువు, ఉపాస్యదేవత ఈశ్వరుడు. ఇలా ఎన్నో ఉపాసనలు ఉన్నాయి. బాగుంది! అద్భుతంగా ఉంది. అన్నీ మంచి ఫలితాలను ఇస్తాయి. కాని ఒక్క విషయాన్ని గ్రహించాలి అంటారు రమణమహర్షి. ఇది ఇంకా అద్భుతంగా ఉంటుంది. ఏమిటది? ఏ సాధన చూసినా, అది ఈ భేదభావనను ఆధారంగా తీసుకుని, ఏర్పడినదే. అంటే ఈ సాధన చేయాలంటే విభజన కొనసాగాలి. ఇంకా మాట్లాడితే, ఈ సాధన జీవ, ఈశ్వరభేదాన్ని పెంచి పోషిస్తుంది.

అంటే జీవుడు ఎంత సాధన చేసినా కూడా అతను భక్తునిగానే కొనసాగుతాడు. జీవుడు, జీవునిగానే కొనసాగుతాడు. మహా అయితే సంస్కరించబడ్డ, ఉన్నతస్థాయికి చేరిన భక్తుడు అవుతాడు. కొంతమంది ఉపాసకులు ఉంటారు. వారు నేను దేవీ ఉపాసకుణ్ణి, రామ ఉపాసకుణ్ణి, ఆంజనేయస్వామి ఉపాసకుణ్ణి అంటారు. అందరూ వారిని చాలా ఉన్నతంగా చూస్తారు. కాని అందరిలోనూ సమానంగా ఉన్న అంశం ఏమిటి? ఏ ఉపాసన చేసినా, ఏ దర్శనాన్ని పాటించినా, అతను చిన్న జీవిగానే మిగిలిపోతాడు. పరిమితి ఉన్న అహంకారంగానే మిగిలిపోతాడు. అతను గొప్ప ఉపాసకుడు అవవచ్చు కాని, పరిమితి ఉన్న అహంకారం, జీవ, జగత్తులకు భిన్నంగా ఉన్న చిన్న జీవి.

ఎప్పుడైతే అతని పరిమితి కొనసాగుతుందో, అప్పుడే అతని సంసారమూ కొనసాగుతుంది; అతని అశాశ్వతత్వమూ కొనసాగుతుంది; అతని అభద్రతాభావనా కొనసాగుతుంది. ఈ దశలన్నీ ముందు కూడా చూశాము. అందువల్ల ఈ సాధనలన్నీ సంసారాన్ని పెంచి పోషిస్తాయి. ఈ విభజనను కూడా అలాగే భద్రంగా పోషిస్తాయి అంటున్నారు రమణమహర్షి. ఎంత లోతైన విశ్లేషణో చూడండి. ఈ నేపథ్యంతో ఇక్కడ దాకా శ్లోకాన్ని చూద్దాము.

**సమస్తం మతమ్ ఆరభ్యతే** – అన్ని మతాలు కూడా సమానంగా ఒకటే ప్రతిపాదనతో ఆరంభమవుతున్నాయి. ఏమిటది?

**జీవజగత్పరాత్మ తత్త్వాభిధానేన** – జీవుడు, జగత్తు, పరమేశ్వరుడు అనే మూడు ప్రాథమిక తత్త్వాలను ప్రతిపాదిస్తున్నాయి.

ముందే చూసినట్టుగా వారి తత్త్వాల సంఖ్య మారినా, ఎవరైనా ఈ మూడింటినీ పేర్కొనక తప్పదు. ఈ దర్శనాలన్నీ సాధనలను చెప్పాయి కాని అవి లాభం లేదు అంటున్నారు రమణమహర్షి.

**ఇదం త్రయం** – ఈ తత్త్వత్రయం అనే భేదం కొనసాగుతున్నంతవరకూ,

**అహం మతి స్యాత్** – నేను అహంకారాన్ని అనే భావన కొనసాగక తప్పదు.

జీవ జగత్ ఈశ్వర భేదం కొనసాగినంతవరకూ పరిమితి ఉన్న అహంకారం, అశాశ్వతమైన అహంకారం, బాధాతప్త అహంకారం, అభద్రతాభావన ఉన్న అహంకారం కొనసాగుతుంది. కాకపోతే ఈ సాధనలు చేయకముందు మామూలు సంసారి అయితే ఇప్పుడు గొప్ప భక్తుడు అయిన సంసారి. సంసారం మాత్రం ఏ కాస్తకూడా మాయమవలేదు.

అంతకుముందు అతను తన ఇంట్లో కూర్చుని తన స్థాయిలో బాధపడితే, ఇప్పుడు స్థాయి పెరిగి ఆలయాల్లో భక్తిపాటలు పాడుతూ తన ఆవేదనను వెలిబుచ్చుకుంటున్నాడు.

నాతో ఆటలాడే సమయమా ఇది,
నా ప్రార్థన వినలేదా, నీకు కళ్ళు లేవా చెవులు లేవా

అంటూ భక్తిగా భగవంతునితో మొరపెట్టుకుంటాడు. సంగీతం వచ్చినవారు కీర్తనలు పాడతారు. ఆ రాగాలకు పేర్లు కూడా ఉంటాయి.

ఎందుకు వీరు ఇంకా సంసారంలోనే ఉన్నారంటే, ఈ దార్శనికులు చెప్పే సాధనలు ద్వైతాన్ని పారద్రోలటానికి కాదు. నిజం చెప్పాలంటే, ఈ సాధనలు ద్వైతాన్ని పారద్రోలటం సంగతి దేవుడెరుగు, ఇంకా పెంచి పోషిస్తాయి.

**యావత్ ఇదం త్రయమ్** – ఈ సాధనలు జీవ జగత్ ఈశ్వర త్రిపుటిలోనే ఉన్నంతవరకు,

అహంమతిః స్యాత్ – అహంకారంలోనే నిల్చుంటారు. అహంకారంలో నిలుస్తే సంసారం తప్పదు. నేను దేవీ ఉపాసకుణ్ణి, నేను కృష్ణభక్తుణ్ణి, ఇలా చెప్పినన్నాళ్ళూ అహంకారం కొనసాగుతుంది.

ఒక్క వేదాంతం మాత్రమే మొదలుపెట్టటం ద్వైతంతో మొదలుపెట్టినా, నెమ్మదిగా ద్వైతం మిథ్య, అద్వైతం ఒక్కటే సత్యం అంటుంది. దీనికి వేదాంతం అధ్యారోప అపవాద ప్రక్రియను వాడుతుంది. అధ్యారోపంలో ఈ త్రిపుటిని ప్రవేశపెడుతుంది. ఈశ్వరుడు జగత్కారణం అంటుంది. జగత్తుతో పాటు జీవుణ్ణి కూడా తీసుకోవాలి. దాని తర్వాత జీవ, జగత్తులకు ఈశ్వరుడు లేనిదే విడిగా ఉనికి లేదు అంటుంది. విడిగా ఉనికి లేనిది, ఉన్నా లేకపోయినా ఒకటే. అందువల్ల అది మిథ్య. ఉన్నదొకటే సత్ బ్రహ్మ అంటుంది.

ఇంకో విధంగా చూసినా కూడా రాకపోకలు ఉన్నదేదీ శాశ్వతం కాదు. జీవ, జగత్తులు ఒక కాలంలో ఉండి, ఇంకొక కాలంలో ఉండవు. అలా ఒక కాలంలో ఉండి, ఇంకొక

కాలంలో ఉండనిదాన్ని మిథ్య అంటారు. ఎలా చూసినా జీవుడు శాశ్వతం కాదు. అలాంటప్పుడు అతని అహంకారం కూడా శాశ్వతం కాదు. వేదాంతం ఈ కర్మలు, ఉపాసనలు, చిత్తశుద్ధి అంటే జ్ఞానయోగ్యతాప్రాప్తి పొందేవరకే చేయాలంటుంది. దాన్నే సాంకేతిక పరిభాషలో చెప్పాలంటే సాధన చతుష్టయ సంపత్తి పొందేదాకానే చేయాలి. ఒకసారి జ్ఞానయోగ్యతాప్రాప్తి పొందాక, జ్ఞానానికి వచ్చి, అహంకారాన్ని కొట్టివేయాలి.

**అహంమతి శూన్య** – నేను ఆత్మను అని జ్ఞానం పొందాక, ఏడ్చే అహంకారాన్ని వేళ్ళతో సహా పెకిలించి వేయాలి. గుర్తుంచుకోండి, ఏడుపుని పారద్రోలలేము; ఏడ్చే అహంకారాన్ని పారద్రోలాలి, ఫిర్యాదు చేసే అహంకారాన్ని పారద్రోలాలి.

**సర్వోత్తమా నిష్ఠా** – ఈ జ్ఞాననిష్ఠే అన్నింటిలోకీ శ్రేష్ఠమైనది. నిష్ఠా అంటే అంతిమదశ; ఆ అంతిమదశ అన్నింటిలోకీ శ్రేష్ఠమైనది. అహంకారాన్ని శూన్యం చేయటమే అంతిమదశ. నేను భక్తుణ్ణి, నేను ఉపాసకుణ్ణి, నేను జ్ఞానిని అని చెప్పే అహంకారాన్ని మటుమాయం చేయాలి.

నేను జ్ఞానిని అని చెప్పుకున్నా అది అహంకార లక్షణమే అవుతుంది. ఎందుకంటే జ్ఞాని బ్రహ్మతో ఐక్యం అవుతాడు. బ్రహ్మకు గుణాలు లేవు. నిర్గుణబ్రహ్మ. జ్ఞానిత్వం అనే గుణం కూడా ఉండదు. జ్ఞానం పొందేది ప్రమాతా. అందువల్ల జ్ఞానిత్వం అనే గుణం ప్రమాతది. అందువల్లనే శంకరభగవత్పాదులు ప్రమాతృత్వనివృత్తి హి మోక్షః అని చెప్పారు. ప్రమాత వస్తే ప్రమాత, ప్రమేయం, ప్రమాణం విభజన వస్తుంది. అయితే నేనేం చెప్పాలి?

నేను కర్త కాదు, నేను భోక్త కాదు, నేను భక్తుణ్ణి కాదు, నేను ఉపాసకుణ్ణి కాదు, నేను ప్రమాతను కాను, జ్ఞానిని కూడా కాదు.

**బ్రహ్మైవ న బ్రహ్మవిత్** – మనీషా పంచకమ్

జ్ఞాని బ్రహ్మ అవుతాడు కాని బ్రహ్మవిత్ కాదు అంటే బ్రహ్మజ్ఞానం పొందినవాణ్ణి అని గొప్పలు చెప్పుకోడు. అలా చెప్పుకుంటే అది అహంకారానికే చెందుతుంది అని చూశాము. నేను బ్రహ్మవిత్‌ను అని చెపితే అది ఉన్నతమైన అహంకారమవుతుంది. జ్ఞానం బుద్ధికి సంబంధించింది, ఆత్మకు జ్ఞాని అనే పదం లేదు. అందువల్ల ఈ జ్ఞానం పొందటం, తద్వారా నేను అహంకారాన్ని అనే భావనను శూన్యం చేయటం అన్ని నిష్ఠలలోకెల్లా శ్రేష్ఠమైనది. ఒకసారి అద్వైతజ్ఞానం పొందాక, ఏ విధమైన భేదమూ ఉండదు.

**తత్ర భేదః అభేదః భవతి**

**న శాస్తా న శాస్త్రం న శిష్యః న శిక్షా**

**న చ త్వం న చ అహమ్**

జ్ఞానం పొందగానే గురువు, శిష్యుడు భేదం ఉండదు. ప్రమాతా, ప్రమేయం భేదం ఉండదు. భేదం ఉండదు అంటే భేదం మాయమయిపోదు. భేద అనుభవం కొనసాగుతూనే ఉంటుంది, భేద భావన పోతుంది. అల–సముద్రం విషయం తీసుకుంటే, అలకు విడిగా ఉనికి లేదు, నీరు పరంగా అల, సముద్రం ఒకటే అనే జ్ఞానం పొందాక కూడా అలని అలగానే చూస్తాము. కాకపోతే అలను చూస్తున్నా అలలో ఉన్న నీటినే చూస్తుంది బుద్ధి. దానికి ఆపాదించిన సత్యత్వభావన పోతుంది.

అదే విధంగా జ్ఞానం పొందాక, ఎదురుగా కనిపిస్తున్న జగత్తు మాయమైపోదు. త్రిపుటి అనుభవం కలుగుతూనే ఉంటుంది. జగత్తులో మార్పు కూడా రాదు. జగత్తుతో వ్యవహారం కూడా నడుపుతూనే ఉంటాడు. కాని బుద్ధిలో మాత్రం నేను శరీరం కాదు, నేను అహంకారం కాదు, నేను ఆత్మను, నేను నిర్గుణ చైతన్యాన్ని అనే నిష్ఠలో నిలబడతాడు.

తక్కిన దర్శనాలకూ, అద్వైత వేదాంతానికీ మధ్య భేదం ఉంది. తక్కిన దర్శనాలన్నీ ద్వైతంతో మొదలై, ద్వైతంతోనే ముగుస్తాయి. ఒక్క అద్వైత వేదాంతమే ద్వైతంతో మొదలయి, అద్వైతంతో ముగుస్తుంది. అప్పుడు అహంమతిని శూన్యం చేస్తున్నాను. నేను అహంకారాన్ని అనే భావనను కూకటివేళ్ళతో పెకలించి వేస్తుంది కాబట్టి అన్నింటికన్నా ఇది సర్వోత్తమం అంటున్నారు రమణులవారు.

**శ్లోకం 5**

**సత్యం మృషా వా చిదిదం జడం వా**
**దుఃఖం సుఖం వేతి ముధా వివాదః।**
**అదృష్టలోకా నిరహం ప్రతీతిః**
**నిష్ఠాఽవికల్పా పరమాఽఖిలేష్టా॥**

**ప్రతిపదార్థం:** ఇదం = ఈ జగత్తుయొక్క; వివాదః = విచారణ; సత్యం మృషా వా = సత్యమా లేక మిథ్యా; చిత్ జడం వా = చేతనమా లేక అచేతనమా; సుఖం దుఃఖం వా ఇతి= సుఖమా లేక దుఃఖమా; ముధా (వివాదః)= (అనేది)వ్యర్థం; పరమానిష్ఠా = శ్రేష్ఠమైన జ్ఞాననిష్ఠే; అఖిలేష్టా = అందరికీ సమ్మతమయినది; అదృష్టలోకా = లోకదృష్టి లేదు; నిరహం ప్రతీతిః= అహంకార భావన లేనిది; అవికల్పా = సందేహము లేనిది; (భవతి = అవుతుంది)

**తాత్పర్యం:** ఈ జగత్తుయొక్క విచారణ, ఇది సత్యమా లేక మిథ్యా, చేతనమా లేక అచేతనమా, సుఖమా లేక దుఃఖమా అనేది వ్యర్థం. శ్రేష్ఠమైన జ్ఞాననిష్ఠే అందరికీ సమ్మతమైనది, లోకదృష్టి లేనిది, అహంకారభావన లేనిది, సందేహము లేనిది, చాలా ఉన్నతమైనది అవుతుంది.

**వివరణ:** ద్వైతం అంటే జీవ, జగత్, ఈశ్వర అనే త్రిపుటిలో నిలవటమని, జ్ఞానం పొందటమంటే నిర్గుణబ్రహ్మజ్ఞానం పొందాలనీ చూశాము. ఆ సందర్భంలో ఈ జ్ఞానం పొందాలంటే ఈ మూడింటిలో దేని విచారణ చేసినా, నిర్గుణబ్రహ్మజ్ఞానం పొందుతామనీ, కాని అన్నింటిలోకీ జీవవిచారణ శ్రేష్ఠమని కూడా చూశాము.

కాని ఇప్పుడు జీవవిచారణ ఎందుకు శ్రేష్ఠమో మళ్ళీ చూద్దాము ఈ శ్లోకపరంగా. ఒకే బ్రహ్మ జీవ, జగత్, ఈశ్వరునిగా ప్రకటితమవుతున్నాడు; ఒకే బంగారం గొలుసు, గాజు, ఉంగరంలో ప్రకటితమయినట్లుగా. బంగారం గురించి విచారణ చేయాలంటే ఈ మూడింటిలో ఒక్క దాన్ని విచారణ చేసినా చాలు; మూడూ చేయనవసరం లేదు. అంటే ఏ మిథ్యావస్తువుని విచారణ చేసినా, సత్య అధిష్ఠానజ్ఞానం పొందుతాము. గొలుసు, గాజు, ఉంగరాలకు బంగారం లేకుండా విడిగా ఉనికి లేదనీ, అవి నామరూపాలు మాత్రమేనని, వాటికి సత్య అధిష్ఠానం బంగారం అనీ విచారణతో తేలుతుంది.

అదే విధంగా జీవ, జగత్, ఈశ్వరులకు బ్రహ్మ లేకుండా విడిగా ఉనికి లేదనీ, అవి నామరూపాలు మాత్రమేననీ, వాటికి సత్య అధిష్ఠానం బ్రహ్మ అనీ విచారణలో తేలుతుంది. ఆ విచారణ జీవ, జగత్, ఈశ్వరులలో దేనిమీదైనా చేయవచ్చు కాని రమణులవారు జీవవిచారణను ఎన్నుకున్నారు. ఆయన ఓటు జీవవిచారణకు లేదా ఆయన పరిభాషలో చెప్పాలంటే **అహంమతి** విచారణకు అని అంటున్నారు. ఇది చాలా శక్తివంతమైన విచారణ అనీ, శ్రేష్ఠమైనదనీ అంటున్నారు. దానిలో కొన్ని ప్రయోజనాలు ఉన్నాయని కూడా భావిస్తున్నారు. అవేమిటో చూద్దాము.

1. **అహంకార నాశనం** – జీవవిచారణలోనే అహంకారంమీద డైరెక్ట్ ఎటాక్ జరుగుతుంది. అంటే విరోధిని ప్రత్యక్షంగా ఎదుర్కొని, అతన్ని నాశనం చేసే అవకాశం ఉంటుంది. ఇక్కడ ప్రత్యర్థి అహంకారం. కొందరు ఆచార్యులలాగా, రమణమహర్షి అహంకారాన్ని ముక్కు గుద్ది, లొంగదీసుకోవాలని భావిస్తారు. ఎందుకంటే అన్నింటిలోకీ కష్టమైన పని అహంకారాన్ని నాశనం చేయటం. గుళ్ళో కొబ్బరికాయను కొట్టటంలోని అంతరార్థం అదే. అన్నింటిలోకీ కొబ్బరికాయను పగలగొట్టటం ఎలా కష్టమో, అలా అన్నింటిలోకి అహంకారాన్ని పగలగొట్టటం అంతే కష్టం.

అహంకారం మనకు అత్యంత సమీపంగా ఉంది. అహంకారం నేను అయితే, జగత్తు నువ్వు అయితే, ఈశ్వరుడు అతను. ఎక్కడో దూరంగా ఉన్న ఈశ్వరునితో సమస్య లేదు. నా తరువాతే నీ అంటారు. అలా నువ్వా, నేనా అనే పోటీ వస్తే, నాకే ఓటు వేస్తాను నేను. అందువల్ల అహంకారం నాకు తెలియకుండానే నాతో ఎంతగానో పెనవేసుకునిపోయింది. నా ప్రతి వ్యవహారంలోనూ చోటు చేసుకుని, అంతకంతకూ పెరిగిపోతోంది.

నేను చదువుకుంటే, నేను ఎమ్.ఎ. అని గొప్పగా చెబుతాను. జరిగింది విద్యాజ్ఞానం పొందటం, కాని పెరిగింది నా అహంకారం. నాకు పెళ్ళి అయింది, ఇంకొక విజయం; నాకు పిల్లలు పుట్టారు, మరొక విజయం; నాకు ఉద్యోగంలో ప్రమోషన్ వచ్చింది, నా అహంకారం ఇంకా రెట్టింపు అవుతుంది. అక్కడితో ఆగుతుందా? ఆగదు. నేను ఇల్లు కొన్నాను, నేను తాతనయ్యాను, విజిటింగ్ కార్డులో పేరు పక్కన హోదాలు పెరిగినకొద్దీ, అహంకారం పెరుగుతూ వస్తుంది. ఎందువల్ల? నేను ఏ వ్యవహారం చేపట్టినా అహంకారం నా వెన్నంటే ఉంటుంది.

పొద్దున్నే స్వామీజీ బోధ వింటున్నంతసేపూ నేను శిష్యుణ్ణి. బోధ అవగానే స్వామీజీ ఉండరు, బోధ జరిగే స్థలం ఉండదు. ఇంటికి వెళతాను, అక్కడ వాతావరణం మారుతుంది, నా పాత్ర కూడా మారుతుంది. అక్కడ తండ్రిగా, భర్తగా వ్యవహారం నడపాలి. తరువాత ఆఫీసుకు వెళతాను. అక్కడ యజమానిగా నా పాత్ర మొదలవుతుంది. ఎక్కడికెళ్ళినా, ఏం చేసినా, ఏం మాట్లాడినా, అహంకారం దూసుకువస్తుంది. నేనున్నానంటూ నా మీదకెక్కి స్వారీ చేస్తుంది. నేను శిష్యుణ్ణి, నేను తండ్రిని, నేను యజమానిని – ఇలా ఏవో వ్యవహారాలను, బంధాలను సృష్టించి, వాటితో సంగత్వం ఏర్పరస్తుంది. అంతకంతకూ ఆ ఊబిలో కూరుకుపోతాను నేను. వీరందరికీ దూరంగా ఏ మానససరోవరంకో వెళ్ళిపోయినా, ఈ అహంకారం మాత్రం నన్ను వదలదు. అలా అహంకారం నిరంతరం నన్నంటిపెట్టుకుని, అది విజృంభిస్తూ, నాకు అత్యంత సమీపంగా ఉంటున్నది.

అందువల్ల అహంకార మిథ్యాత్వభావన పొందటం చాలా కష్టం. అహంకారం నాశనమవాలంటే, దాన్ని డైరెక్టుగా గురిచూసి కొట్టాలి. అది ఒక్క జీవవిచారణలోనే సాధ్యం. జగత్ విచారణలో కాని, ఈశ్వరవిచారణలో కాని అహంకారాన్ని ప్రత్యక్షంగా ఎదుర్కోలేము సృష్టి గురించి విచారణ చేస్తే బ్రహ్మ ఉన్నాడని, సత్త్వరజస్తమో గుణాత్మిక మాయ ఉందని, ఆ మాయనుంచి సూక్ష్మపంచభూతాలు వచ్చాయని, పంచీకరణం జరిగి స్థూలపంచభూతాలు, పాంచభౌతిక జగత్తు వచ్చాయని నేర్చుకుంటాము. బ్రహ్మ సత్యం, జగన్మిథ్యా అద్భుతంగా నేర్చుకుంటాము.

కాని, ఒకపక్క అది చిలకలా పలుకుతూనే, భార్య గురించో, పిల్లల గురించో, అమెరికాలో ఉన్న మనవడి గురించో ఆందోళన చెందుతాము. అంటే జగన్మిథ్యాత్వ జ్ఞానంతో పాటుగా అహంకారం కూడా చెట్టాపట్టాలు వేసుకుని కొనసాగుతున్నది. అందువల్ల జగత్ విచారణ, ఈశ్వర విచారణలు చేసినా, అహంకారం నాశనం అవదు. ఇది మొదటి సమస్య.

2. **జగన్మిథ్యాత్వం** – ఇంకొక సమస్య వేదాంతం ఎంత వివరంగా జగన్మిథ్య అని పదేపదే చెప్పినా, కొంతమంది జగత్ మిథ్య అంటే మేము ఒప్పుకోము అని వాదిస్తారు. ఎందుకంటే

వారు ఈ జగన్మిథ్యాత్వ వాదనను అహంకారం దృష్ట్యా అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తున్నారు. అహంకారానికి ఈ జగత్తు ఎన్నడూ మిథ్యకాదు. అహంకారానికి ఈ జగత్తు మహా సత్యం. భర్త అనే నేనుకి జగత్తు మిథ్య కాదు; తండ్రి అనే నేనుకి జగత్తు మిథ్య కాదు; భక్తుడు అనే నేనుకి జగత్తు మిథ్య కాదు. ఇంకో విధంగా చెప్పాలంటే, అహంకారం–జగత్తు వ్యావహారిక స్థాయికి చెందినవి. వ్యావహారిక స్థాయిలో అహంకారం జగత్తుతో వ్యవహారం నడుపుతుంది. ఇంత ప్రయోజనకారిగా, కంటికి ఎదురుగా, నాకు భిన్నంగా కనిపిస్తున్న జగత్తు మిథ్య అంటే అహంకారం బుద్ధిగా ఒప్పుకోదు.

ఒక స్వాప్నికునికి, తను స్వప్నంలో ఉన్నంతవరకూ, తన స్వప్నం ఒక స్వప్నం అని తెలియదు. ఎవరైనా తను స్వప్నంలో ఉండగా చెప్పినా నమ్మడు. కాని నిద్రలేచాక, స్వప్నం మిథ్యగా తేలికగా తేలిపోతుంది. అలాగే జాగ్రద్ పురుషునికి జాగ్రదావస్థలో ఉండి, వ్యవహారం నడుపుతున్నంతసేపూ జగత్ మిథ్య అంటే నమ్మడు. అతను తన ఉన్నతస్థాయికి లేస్తే, నమ్ముతాడు. అంటే పారమార్థిక స్థాయికి ఎదగాలి. తను బ్రహ్మను అని అర్థం చేసుకుని, ఉన్నదొకటే బ్రహ్మ అని జీర్ణించుకుంటే అప్పుడు జాగ్రత్ ప్రపంచం, జాగ్రత్ పురుషుడు కూడా స్వప్నం–2గా తేలిపోతారు. కాని అహంకారపరంగా జగత్తుని చూసినంతసేపూ ఈ సమస్య తప్పదు. తను తండ్రి, కొడుకు, ఉద్యోగి అనే మమకారాల్లో కూరుకుపోయినంతసేపూ, అవి తను వేసుకున్న వేషాలు మాత్రమే అని ఎంతమాత్రమూ జీర్ణించుకోలేడు. ఇది రెండవ సమస్య.

3. **అహంకారం ఎక్కువవుతుంది** – అహంకారపరంగా ఈశ్వర విచారణ గాని, జగత్ విచారణ గాని చేస్తే, ఆ రెండూ బాగా అర్థమయినవారికి వేరే సమస్య ఎదురవుతుంది. వారు ఈ జ్ఞానాన్ని బాగా అర్థం చేసుకుంటారు. తలుచుకుంటే, వేదాంతబోధ కూడా బాగా చేయగలరు. దానితో, అహంకారం తగ్గకపోగా, మరింత ఎక్కువవుతుంది. నేను కాబట్టి వేదాంతం నేర్చుకున్నాను, ఎవరికీ అంతుబట్టని విద్య నేను నేర్చుకున్నాను అని గొప్పలు పోతారు. వారికున్న గొప్పల్లో ఇది ఇంకొక గొప్పగా వచ్చి చేరుతుంది. అసలు వేదాంతం నేర్చుకునేది ఈ అహంకార మమకారాలను పారద్రోలటానికి. దాన్ని సరిగ్గా అర్థం చేసుకోకపోతే, అహంకారం తగ్గటం మాట దేవుడెరుగు, మరింత వెన్ను విరుచుకు తిరిగేలా చేస్తుంది.

తండ్రి అనే నేను ఎదుర్కొనే **సమస్యలను** పారద్రోలాలి, **తండ్రి అనే నేనుని** పారద్రోలాలి. అందువల్లనే రమణులవారు ఎవరైనా మా అబ్బాయితో నాకీ సమస్య ఉంది అంటే సమస్యకు పరిష్కారం చూపకుండా, ముందు నేనెవరు అని ఆలోచించు అంటారు. హూ యామ్ ఐ బోధే ఆయన ప్రత్యేకత. నేను తండ్రినా, నేను కొడుకునా, నేను ఉద్యోగినా అని ముందు ఆలోచించాలి.

**న మృత్యుర్న శంకా న మే జాతి భేదా**
**పితా నైవ మే నైవ మాతా న జన్మ ।**
**న బన్ధుర్న మిత్రం గురుర్నైవ శిష్యః**
**చిదానన్దరూపః శివోఽహం శివోఽహమ్ ॥** – నిర్వాణషట్కమ్

**వివాదః** – అందువల్లనే రమణమహర్షి వివాదః పదం వేశారు. వివాదః అంటే విచారణ. దేని విచారణ?

**ఇదం** – ఇదం అంటే ఈ జగత్తు. జగత్తుయొక్క విచారణ చేయాలి? ఏ విధంగా చేయాలి?
**సత్యం మృషా వా** – సత్యమా లేక మిథ్యా?
**చిత్ జడం వా** – చేతనమా లేక అచేతనమా?
**సుఖం దుఃఖం వా** – సుఖమా లేక దుఃఖమా?
**ముధా** – వ్యర్థము.

ఇప్పుడు దీని సారాంశం చూస్తే, జగత్తు విచారణ చేసి, జగత్తు సత్యమా లేక మిథ్యా; చేతనమా లేక అచేతనమా, సుఖాన్ని కలుగజేస్తుందా లేక దుఃఖాన్ని కలుగుజేస్తుందా అని కనుగొనటం వ్యర్థం అంటున్నారు. ఎందుకు వ్యర్థమో మనం ఇక్కడ కారణాన్ని కలుపుకోవాలి. జీవజగత్ ఈశ్వర విచారణలలో ఏ ఒక్కటి విచారణ చేసినా, బ్రహ్మజ్ఞానం పొందవచ్చు అని చెప్పినా, రమణమహర్షులవారు జీవవిచారణకు, 'హూ యామ్ ఐ' విచారణకు పెద్దపీట వేస్తున్నారు. ఎందుకంటే ఒక్క జీవవిచారణలోనే అహంకారాన్ని ప్రత్యక్షంగా ఎదుర్కొంటాం. తక్కిన విచారణలు ఎన్ని సంవత్సరాలు చేసినా, అహంకారం ఇంకా లోతుగా పాతుకుపోయి, సంసారనివారణ చేయనివ్వదు ఒక్కోసారి.

వేదాంతవిచారణ చేశాక కూడా, ఒక జీవి ఇంకా సంసారంలోనే మునిగి తేలుతున్నాడంటేనే, అతనికి అహంకారం నాశనమవలేదని అర్థం. ఎందుకంటే, ఆత్మకు సంసారం లేదు. ఇంత కష్టపడి వేదాంతం నేర్చుకుని కూడా మొట్టమొదటి సమస్య అయిన మనకు ఏకు మేకు అయి కూర్చున్న అహంకారాన్ని పారద్రోలకపోతే ఏమిటి లాభం? అందువల్ల రమణమహర్షి ప్రత్యేకించి చెబుతున్నారు. జగత్ విచారణ చేసి లాభం లేదు. వివాదః ముధా ఇదం – ఈ జగత్ విచారణ చేస్తే అది వ్యర్థం, నిష్ప్రయోజనం.

దానికి భిన్నంగా జీవవిచారణ చేస్తే, అహంకార నాశనం అవటమే కాక, మన ప్రయత్నం లేకుండానే జగత్, ఈశ్వరులు కూడా మిథ్యగా తేలిపోవటం జరుగుతుంది అంటున్నారు రమణమహర్షి. జీవవిచారణ చేస్తే పరోక్షంగా జగత్తు, ఈశ్వరుల విచారణ కూడా చేసినట్టు అవుతుంది. చేసే విచారణ ఎలా ఉండాలంటే జీవ జగత్ ఈశ్వరుల భేదం మటుమాయమై

పోవాలి. అహంకారం ఎంతమాత్రమూ తలెత్తకూడదు. తక్కిన రెండింటి మిథ్యాత్వం నిశ్చయం తరువాతి అంశం. అహంకార నాశనం ప్రాథమిక సమస్య. ఎందుకు అహంకారానికి ఇంత పెద్దపీట వేయాలి? ఎందుకంటే మనకు లేనిపోని సమస్యలను సృష్టించేది జగత్తు కాదు, ఈశ్వరుడు కాదు, అహంకారమే!

**పరమనిష్ఠా** – అన్ని విచారణలకన్నా ఉత్కృష్టమయిన విచారణ,

**అఖిలేష్టా** – అందరకు, అన్ని దర్శనాలకు సమ్మతమైనది. అన్ని దర్శనాలకూ సమ్మతమైన, అన్ని విచారణలకన్నా శ్రేష్ఠమైన విచారణ ఏది?

**అవికల్పః** – భేదం చూపని జ్ఞానం. వికల్పం అంటే భేదం. అభేదం జీవ, జగత్, ఈశ్వర భేదం కావచ్చు; ప్రమాతృ ప్రమాణ ప్రమేయ భేదం కావచ్చు. కాని మనం సద్దర్శనంలో జీవ జగత్ ఈశ్వర భేదం చూస్తున్నాము కాబట్టి, అవే చూస్తూ వద్దాము. అందువల్ల విచారణ అంటే ఈ భేదం మాయమయ్యే విచారణ చేయాలి.

ఈ భేదం అక్షరాలా మాయమవదు. అద్వైతజ్ఞానం పొందాక కూడా జీవ జగత్ ఈశ్వరులు భిన్నంగానే కనిపిస్తారు. జ్ఞానికూడా జగత్తును చూస్తాడు, అది కూడా తనకు భిన్నంగా చూస్తాడు. అందువల్ల అనుభవం మారదు కాని దృక్పథం మారుతుంది.

అలాగే జగత్తు మిథ్యా, అది నామరూపాత్మకం మాత్రమే అని నేర్చుకున్నాక కూడా జగత్ కంటికి ఎదురుగా ఉంటూనే ఉంటుంది. వేదాంతంలో నేర్చుకునే ఉదాహరణ అల–సముద్రం. అల వేరు, సముద్రం వేరు; అల సముద్రంనుంచి పుట్టి, అందులోనే స్థితిపొంది, అందులోనే లయమవుతుంది అని నేర్చుకున్నాక కూడా, సముద్రంలో అలలు ఎగిసిపడటం మానవు. అవి మనకు కనపడకా మానవు. మామూలు కళ్ళతో అలలు ఎగిసిపడటం చూస్తే, జ్ఞాననేత్రంతో అలలోనూ, సముద్రంలోనూ అధిష్ఠానంగా ఉన్న నీటిని మాత్రమే చూస్తాము. జగత్తును మిథ్యగా ఎప్పుడు చూస్తాము?

**అదృష్టలోకా** – జ్ఞానం పొందిన జ్ఞాని జగత్తును తనకు భిన్నంగా ఉంది అనుకోడు. అంటే లోకదృష్టి లేదు.

**నిరహం ప్రతీతిః** – అహంకారదృష్టి కూడా లేదు.

అంటే జ్ఞానికి నేను అనే పరిమితి దృష్టి లేదు. సబ్జెక్టు అయిన నేను లేదు; ఆబ్జెక్టు అయిన జగత్తు లేదు. సబ్జెక్టు–ఆబ్జెక్టు విభజన లేదు. అటువంటి నిష్ఠ, అటువంటి జ్ఞానమే అన్నింటికన్నా శ్రేష్ఠమైన జ్ఞానం.

ఈ సందర్భంలో ఒక విషయం గుర్తు పెట్టుకోవాలి. శాస్త్రం అద్వైతజ్ఞానాన్ని నొక్కి చెబుతుంది కాని అద్వైత అనుభవం గురించి మాట్లాడదు. అద్వైత అనుభవం కలిగినా, అది తాత్కాలికమే. అద్వైత అనుభవం పొందాను అంటే, ఏ అనుభవమైనా సరే అది తాత్కాలికమే. ఎందుకంటే, దానికి రాకపోకలు ఉంటాయి. ఈ అద్వైత అనుభవాన్ని రెండు అవస్థల్లో పొందుతారు. ఒకటి సుషుప్తి అవస్థ, ఇంకొకటి సమాధి అవస్థ.

ఈ అవస్థల్లో పొందిన అద్వైత అనుభవం నిజమైన అద్వైత అనుభవం కాదని శాస్త్రం ఎందుకంటుందంటే, ఈ అవస్థల్లోకూడా ద్వైతం ఉంటుంది. కాకపోతే అది అవ్యక్తావస్థలో ఉంటుంది. ఏ అనుభవం తీసుకున్నా అది అద్వైత అవస్థ కానేకాదు. ఎలా చెప్పగలరు? ఎలాగంటే అద్వైత అనుభవం పొందిన సుషుప్తినుంచి కాని, సమాధినుంచి కాని, బయటకు రాగానే ద్వైతం దూసుకువస్తుంది. అప్పుడు అద్వైత అనుభవాన్ని పారద్రోలి ద్వైత అనుభవం వస్తుంది.

దానికి భిన్నంగా అద్వైతజ్ఞానం పొందితే. నేను అద్వైతబ్రహ్మను అనే జ్ఞాననిష్ఠలో నెలకొని ఉంటే, అది నిత్యమూ ఉంటుంది, శాశ్వతంగానూ ఉంటుంది. నేను అద్వైత బ్రహ్మను, ఈ ద్వైత అనుభవం మిథ్యా అనుభవం. ఈ అనుభవాలు నానుంచే వచ్చి, నాలోనే అంతమవుతున్నాయి అని అర్థమవుతుంది. అప్పుడు మిథ్యాద్వైతం నా సత్య అద్వైతస్వరూపాన్ని చెదరగొట్టలేదు. ద్వైత అనుభవాలు వచ్చిపోతాయి, కాని నా అద్వైతజ్ఞానం చెక్కుచెదరదు. అద్వైతం అనుభవం అయితే, తక్కిన అనుభవాలు వచ్చి దాన్ని పారద్రోలుతాయి. కాని అదే అద్వైతం జ్ఞానం అయితే, ఎన్ని అనుభవాలు వచ్చిపోయినా దానిని పారద్రోలలేవు.

ఉదాహరణకు 2 + 2 = 4 జ్ఞానం నాకు ఉంది. అది ఎన్ని అనుభవాలు ఎదురైనా మారదు. నేను ఆనందంలో తేలిపోతున్నా, దుఃఖంలో మునిగిపోతున్నా, ఈర్ష్యతో భగ్గుమంటున్నా, కోపంతో మండిపడుతున్నా 2 + 2 = 4 అనే అంటాను కాని ఆ జ్ఞానం పోదు; సందేహం రాదు. అందువల్ల ఈ శ్లోకంలోని నిష్ఠ పదాన్ని జ్ఞాననిష్ఠగా తీసుకోవాలి.

**శ్లోకం 6**

**సరూపబుద్ధిర్జగతీశ్వరే చ**
**సరూపధీరాత్మని యావదస్తి।**
**అరూప ఆత్మా యది కః ప్రపశ్యేత్**
**సా దృష్టిరేకాఽనవధిర్హి పూర్ణా॥**

**ప్రతిపదార్థం:** సరూప ధీరాత్మని = ఆత్మకు రూపం ఉందనే భావనలో; (తావత్) – ఉన్నంత వరకూ; సరూపబుద్ధిః జగతి = జగత్తును కూడా సగుణ జగత్తుగా చూస్తాము. ఈశ్వరే చ=

ఈశ్వరుణ్ణి కూడా; అరూప ఆత్మా = నేను నిర్గుణ చైతన్యం; యది కః = అని ఎవరైనా అంటే; సా దృష్టిరేకా = అప్పుడు ఉన్నదొకటే చైతన్యం అవుతుంది; అనవధిః హి = అనంతం; పూర్ణా= పూర్ణం.

**తాత్పర్యం:** ఆత్మకు రూపం ఉందనే భావనలో ఉన్నంతవరకూ జగత్తు, ఈశ్వరుడు కూడా సగుణంగానే ఉంటారు. నేను నిర్గుణచైతన్యం అని ఎవరైనా అంటే అప్పుడు ఉన్నదొకటే చైతన్యం అవుతుంది. అది అనంతం, పూర్ణం.

**వివరణ:** రమణమహర్షి జీవవిచారణ ఎందుకు ముఖ్యమో ఈ శ్లోకంలో కూడా వివరించుకు వస్తున్నారు. ఎందుకంటే మీరు జగత్తును, ఈశ్వరుణ్ణి చూసే దృష్టికోణాన్ని నిర్దేశించేది మీ అహంకారమే కాబట్టి అంటున్నారు. మిమ్మల్ని మీరు ఎలా భావించుకుంటారో, ఆ కోణంలోంచే తక్కిన రెండింటిని కూడా చూస్తారు. అందువల్ల జగత్తును, ఈశ్వరుణ్ణి చూసే మీ దృష్టికోణం మారాలి అంటే ముందుగా మిమ్మల్ని మీరు చూసే దృష్టికోణం మారాలి. వేదాంతాన్ని ఎన్నో సంవత్సరాలు అధ్యయనం చేశాక కూడా, కొంతమంది జీవన్ముక్తిని అనుభవించలేకపోతున్నారు అంటే ఇదే కారణం.

మీరు ఎంతసేపూ ప్రపంచాన్ని మార్చటానికి ప్రయత్నిస్తున్నారు. భగవంతునిమీద మీకున్న భావనను మార్చటానికి ప్రయత్నిస్తున్నారు కాని మిమ్మల్ని మీరు చూసుకునే పద్ధతిని మార్చుకోవటం లేదు. మీరు వేదాంతానికి వచ్చినప్పుడు నేను తండ్రిని, నేను భర్తను – అనే అహంకారంతో వచ్చారు; మీరు వ్యవహారం నడిపే పుత్రుణ్ణి, భార్యను, వారు కొలిచే భగవంతుణ్ణి మార్చటానికి ప్రయత్నిస్తున్నారే కాని 'నేనెవరు?' ప్రశ్న జోలికి పోవటం లేదు. అందువల్ల వాటిని ఎలా చూస్తారనేదాన్ని, మిమ్మల్ని మీరు ఎలా చూస్తారనే దానిమీద ఆధారపడి ఉంటుంది. మిమ్మల్ని మీరు ఒక చిన్న జీవిగా చూసుకుంటే, మీరు జగత్తుతో వ్యవహారం నడుపుతున్నట్టు, జగత్తు మిమ్మల్ని బాధిస్తున్నట్టు భావిస్తారు. కైలాసంలోనో, వైకుంఠంలోనో ఉన్న భగవంతుణ్ణి కాపాడమని వేడుకుంటారు. ఒక్కముక్కలో చెప్పాలంటే, మిమ్మల్ని మీరు సగుణజీవిగా భావిస్తే, జగత్తు సగుణ జగత్తే, భగవంతుడు సగుణ ఈశ్వరుడే అవుతారు.

ఒకసారి, ఒక టీనేజీ అమ్మాయి స్వామీజీ దగ్గరకు తన తల్లితో వచ్చింది. సంభాషణలో భాగంగా, ఆ టీనేజీ అమ్మాయి నాకు సోనియాగాంధీ అంటే చాలా ఇష్టం అని చెప్పింది. ఇంత చిన్న అమ్మాయికి, కాలేజీలో చదివే ఆ ముగ్ధకు, రాజకీయాల్లో శ్రద్ధ ఏర్పడటమా అని ఆశ్చర్యపోయారు స్వామీజీ. కాని ఆ అమ్మాయికి సోనియాగాంధీ ఎందుకు ఇష్టమో తెలుసుకున్నాక, ఆయన ఆశ్చర్యం రెట్టింపు అయింది. 'ఆమె చీరె అద్భుతంగా కడుతుంది,' అంది. ఆ విషయమై అనర్గళంగా ఐదు నిముషాలు మాట్లాడింది. ఆ చీరెల గురించి, కట్టే

విధానాన్ని గురించీ చెప్పటమే కాకుండా, తన తల్లితో, 'అమ్మా, నువ్వు భారతీయురాలివి కాని, అసలు చీర ఎలా కట్టుకోవాలో సోనియాగాంధీ దగ్గరే నేర్చుకోవాలి. నేను చీరెలు కట్టుకునే వయస్సు వచ్చేసరికి తన దగ్గరికి వెళ్ళి నేర్చుకుంటాను,' అంది.

ఆ టీనేజీ అమ్మాయి దృష్టి అంతా బాహ్యాలంకరణమీదే ఉంది. ఏ సందర్భానికి తగ్గట్టుగా ఏ దుస్తులు ధరించాలి, ఎలా ముస్తాబు అవాలి – వీటిమీదే ధ్యాస అంతా ఉంటుంది. అలాంటమ్మాయికి, నువ్వు కూడా క్లాసుకి రామ్మా అని పిలిచి, నువ్వు అన్నమయకోశం కాదు, పంచకోశాలకు అతీతంగా ఉన్న ఆత్మవు అంటే ఏం వింటుంది? ఏం జీర్ణించుకుంటుంది?

తమాషా ఏమిటంటే, ఆ అమ్మాయి ఎంతగా సోనియాగాంధీ చీరకట్టు గురించి మాట్లాడిందంటే, దాని తరువాత స్వామీజీ పేపరు తిరగేస్తుంటే, అనుకోకుండా ఆయన దృష్టి ఆవిడ చీరకట్టుమీదకు పోయిందని హాస్యమాడారు.

ఇంతకీ చెప్పొచ్చింది, అలా ఎవరి దృష్టి పంచకోశాల్లో ఏ కోశంమీద ఎక్కువగా ఉంటే, దాని పరంగా వారు బాహ్యప్రపంచాన్ని చూస్తారు. మీరు సౌందర్యాన్ని ఆరాధించేవారయితే, అందంగా ఉన్నవారి వైపు మీకు తెలియకుండానే తిరుగుతారు. మీరు భావోద్రేకాలకు విలువనిచ్చేవారయితే, మీలాగా భావోద్రేకాలకు లోనయ్యేవారిని చూస్తారు. మీకు జ్ఞానతృష్ణ ఉంటే, వారివైపు ఆకర్షితులవుతారు. అందువల్లనే ఇంగ్లీషులో **బ్యూటీ లైస్ ఇన్ ది ఐస్ ఆఫ్ ది బిహోల్డర్** అంటారు. ఉన్నదొకటే జగత్తు, కాని దాన్ని మనుష్యులు, వారివారి అభిరుచులకు తగ్గట్టుగా చూస్తారు.

వేదాంతానికి వచ్చి, నిర్గుణబ్రహ్మజ్ఞానం పొంది, జ్ఞాననిష్ఠలో నిలబడిన జ్ఞాని మాత్రం తన మనశ్శరీరాలు మిథ్య అనీ, జగత్తు మిథ్య అనీ, తను వ్యవహారం నడపటానికి మాత్రమే ఇవి ఇవ్వబడ్డాయని అర్థం చేసుకుంటాడు. భగవంతుణ్ణి అరూప ఈశ్వరునిగా అర్థం చేసుకోవాలంటే, తనను తాను నిర్గుణబ్రహ్మగా అర్థం చేసుకోవాలి ముందు.

**క్లేశోఽధికతరస్తేషామవ్యక్తాసక్తచేతసామ్॥** – గీత 12.5

దేహ అభిమానం ఉంటే నిర్గుణబ్రహ్మను ఎన్నడూ అర్థం చేసుకోలేరు అని కృష్ణపరమాత్మ కూడా చెబుతున్నాడు. అందువల్ల దేహాభిమానంతో వేదాంతం వింటే అది ఏదో బోధగా అనిపిస్తుంది అంతే. వేదాంతం ఏం నేర్పిస్తుందో అతనికి అర్థం కాదు. నేను భర్తగా, తండ్రిగా, ఉద్యోగిగా మరింత ఆనందంగా ఎలా ఉండగలను అన్నదే ప్రతివారికీ కోరిక. అంటే భర్తగా, తండ్రిగా, ఉద్యోగిగా ఉంటూనే వేదాంతం నేర్చుకుని ఆనందం పొందాలనుకుంటారు.

గురువు అవి మీరు వేస్తున్న పాత్రలు మాత్రమే, వాటిని మీరు మర్చిపోండి అని మొట్టమొదటే చెబితే, రెండో క్లాసుకి మీరు రానేరారు. అందువల్ల వేదాంతం ముందు శిష్యులను ఆకట్టుకోవటానికి మీ జీవితం మరింత ఆనందమయంగా సాగటానికి, మీరు భర్తగా, తండ్రిగా, ఉద్యోగిగా మరింత ఆనందం పొందటానికి మార్గం చెబుతాను రండి అంటుంది. నిజానికి వేదాంతం లక్ష్యం మిమ్మల్ని భర్తగా మరింత ఆనందపరచటం కాదు, మీ భర్త భావనను పోగొట్టటం; అలాగే ఉద్యోగిగా మరింత ఆనందపరచటం కాదు, అసలు మీరు ఉద్యోగి కాదు అంటుంది.

మీరు అనుకుంటున్న భర్త, తండ్రి, ఉద్యోగి అనేవి వ్యక్తిగా మీకు చెందినవి. వ్యక్తి అంటే పరిమితి ఉన్న జీవి. ఆనందంగా ఉండే పరిమితి ఉన్న జీవి అంటూ ఎవరూ ఉండరు. ఆనందం, పరిమితి పరస్పర విరుద్ధపదాలు. అవి జంటగా ఉండలేవు. కాని ఆ మాట గురువు ఆరంభంలోనే చెబితే, శిష్యులెవరూ రారు. ఎవరికైనా వారి అహంకారానికి అలంకారం చేసి, దాన్ని మరింత మెరుగుపరచుకోవాలని ఉంటుంది. కాని వారికొక విషయం తెలియటం లేదు. అలంకారం చేసిన అహంకారం అశాశ్వతం, అనారోగ్యం పాలు అవుతుంది. ఒకరోజు మరణిస్తుంది.

**సరూపధీరాత్మని** – ధీః అంటే భావన. ఆత్మకు రూపం ఉందనే భావనలో,

(తావత్) – ఇది మనం కలుపుకున్నాం. అంతవరకూ,

**సరూపబుద్ధి జగతి** – జగత్తును కూడా సగుణ జగత్తుగా చూస్తారు. అది మీకు భిన్నంగా ఉందని, మీకు అనేక ఆనందకర అనుభవాలను, దుఃఖంలో ముంచేసే అనుభవాలను కలుగజేస్తుందని భావిస్తారు.

మిమ్మల్ని బాధపెట్టే జగత్తు కొనసాగుతుంది. కాని జగత్తుని నిందించకండి. పాపం దాని తప్పేం లేదు. మీరే దానికి ఒక సగుణ రూపాన్ని ఇచ్చారు. మీరు సగుణ అహంకారం నేను అనుకున్నన్నాళ్ళూ సగుణ జగత్తు ఇచ్చే అనుభవాలలో మునిగితేలక తప్పదు. చలువ కళ్ళద్దాలు పెట్టుకుని 'ఏమిటి, జగత్తు ఇంత చీకటిగా ఉందేమిటి?' అన్నాడుట ఒక వ్యక్తి. అలా ఉంటుంది మీ వ్యవహారం కూడా. జగత్తుకి మిమ్మల్ని బాధించే హక్కు మీరే చేతులారా ఇచ్చారు.

**ఈశ్వరే చ** – అంతేకాదు, మీరు కొలిచే దేవుడు కూడా సగుణ ఈశ్వరుడే అయివుంటాడు.

**అభయాభయదర్శినః**

జగతీశ్వరే పదాన్ని ఇలా విడదీయాలి. జగతి – సప్తమీవిభక్తి, ఏకవచనం – జగత్తులో. ఈశ్వరే – ఇది విషయసప్తమి, భగవంతుని విషయంలో.

ఆ విధంగా జగత్తు, భగవంతుని విషయంలో సగుణ భావన ఎన్నటికీ పోదు. ఆ భావన ఉన్నంతవరకూ అశాశ్వతత్వం పోదు. ఎందుకు?

మీరు వాదించవచ్చు, నేను అహంకార భావనలోనే ఉంటాను. సగుణ ఈశ్వరుణ్ణి సృష్టికర్తగా, స్థితికర్తగా కొలుస్తాను. ఆయన నన్ను రక్షిస్తాడు అనవచ్చు. దానికి వేదాంతం జవాబేం చెబుతుందో తెలుసా? సగుణ ఈశ్వరుడు సృష్టికర్త, స్థితికర్త మాత్రమే కాదు, లయకర్త కూడా. అంత జాలిగుండె కల, ఆర్తత్రాణపరాయణుడైన భగవంతుడు లయకర్తగా తన ధర్మాన్ని నిర్వహించక తప్పదు. అప్పుడు మీరే ఆయనకు జాలి, దయ లేవని, నిర్దాక్షిణ్యంగా పట్టుకుపోయాడని నిందిస్తారు.

అందువల్ల ఈ గొలుసుకట్టుని మర్చిపోకూడదు. ఎక్కడ సగుణత్వం ఉంటుందో, అక్కడ భిన్నత్వం ఉంటుంది. ఎక్కడ భిన్నత్వం ఉంటుందో, అక్కడ అశాశ్వతత్వం ఉంటుంది. ఎక్కడ అశాశ్వతత్వం ఉంటుందో అక్కడ భయం తిష్ఠ వేసుకుని కూర్చుంటుంది. మరయితే ఏం చేయాలి? సగుణ ఈశ్వరరూపంనుంచి లేదా ఏకరూప ఈశ్వరుణ్ణుంచి అరూప ఈశ్వరుడు లేదా నిర్గుణబ్రహ్మగా భగవంతుణ్ణి అర్థం చేసుకునే స్థాయికి ఎదగాలి.

సగుణ ఈశ్వరుణ్ణి నామరూపాలున్న నిర్గుణ సత్‌గా అర్థం చేసుకోవాలి; సగుణ జగత్తును నామరూపాలున్న నిర్గుణ సత్‌గా అర్థం చేసుకోవాలి. ఆ విధంగా జగత్ దృష్టి, ఈశ్వరదృష్టిగా మారాలి. అలా మారాలంటే మీరు నిర్గుణ ఆత్మ అని అర్థం చేసుకోవాలి. మీరు **నేను** అని మీ గురించి ఎప్పుడు అనుకున్నా నేను నిర్గుణ ఆత్మను అని అర్థం చేసుకోవాలి.

ఒక నటుడు అనేక పాత్రలను పోషిస్తాడు. ఆ పాత్రలను పోషిస్తున్నప్పుడు వాటిల్లో జీవిస్తాడు కూడా. కాని గ్రీన్‌రూమ్‌లో తనెవరో మర్చిపోడు. అలాగే మీరు వేషాలు వేసుకుని తండ్రిగా, భర్తగా పాత్రలను పోషిస్తారు. కాని మీరెవరు?

**అరూప ఆత్మా** – మీరు నిర్గుణ చైతన్యం. ఈ మార్పు రావాలి. ఇంగ్లీషు పదం దీనికి ట్రాన్స్‌ఫర్మేషన్ (transformation – transform the form, transcend the form). మీరు నామరూపాలు ఉన్న అహంకారం కాదు, నామరూపాలు లేని ఆత్మ. ఈ నామరూపాల అహంకారానికి అతీతంగా ఎదగటమే మార్పు. అలా మారితే,

**కః** – కః అంటే కశ్చిత్. ఇలా ఒక వ్యక్తి ఈ దశలను దాటుకుంటూ వచ్చి, నేను సాక్షి చైతన్యాన్ని అని చెపితే,

**సా దృష్టిరేకా** – అప్పుడు ఉన్నదొకటే సచ్చిదానంద ఆత్మ అవుతుంది. ఎందుకంటే అహంకారం సచ్చిదానంద ఆత్మ, జగత్తు సచ్చిదానంద ఆత్మ, ఈశ్వరుడు సచ్చిదానంద ఆత్మ. అంటే మూడింటిలోనూ **సద్దర్శనం** చేస్తాడు. అలా నిర్గుణ ఆత్మను అర్థం చేసుకుంటేనే ఈ త్రిపుటి అనే విభజన పోతుంది. అప్పుడు

**అనవధిః హి** – ప్రతి ఒక్కటి కూడా అనంతం అవుతుంది.

సగుణ జీవ, సగుణ జగత్, సగుణ ఈశ్వరుడు అంటే మూడింటికీ కూడా పరిమితులు ఉంటాయి. మూడు లెక్ఖ పెట్టారు అంటేనే ఒకటి, తక్కిన రెండింటికీ భిన్నంగా ఉందని అర్థం. అందువల్ల సగుణ ఈశ్వరుడు అనంతం కాలేడు. పరిమితిని సావధి అంటారు. అవధి అంటే పరిమితి; సావధి అంటే అవధులు ఉన్నది; అనవధి అంటే అవధులు లేనిది. నిర్గుణ బ్రహ్మ అవధులు లేనిది.

మూడింటికీ సగుణ పదం తీసేస్తే, మూడూ కూడా అనంతం అవుతాయి అంటే భిన్న పదాలుగా అనిపిస్తాయి. ఎందుకంటే మూడు అనంతాలు ఉండవు. అంటే దాని అర్థం మూడు భిన్నవస్తువులు ఉండవు. ఒకటే సత్యానికి ఉన్న మూడు భిన్ననామరూపాలు మాత్రమే అవుతాయి.

**బ్రహ్మార్పణం బ్రహ్మ హవిర్బ్రహ్మాగ్నౌ బ్రహ్మణా హుతమ్ ।**
**బ్రహ్మైవ తేన గంతవ్యం, బ్రహ్మకర్మసమాధినా ॥** గీత – 4.24
**ఇదం బ్రహ్మ, ఇదం క్షత్రం, ఇమే లోకాః, ఇమే వేదాః, ఇమే దేవాః, ఇమాని భూతాని, ఇదగ్ం సర్వం యదయమాత్మా.**

ఉన్నదొకటే బ్రహ్మ లేదా ఆత్మ. తక్కినవన్నీ భిన్ననామరూపాలుగా ప్రకటితమవుతున్న నామరూపాలు మాత్రమే.

జీవ = జగత్ = ఈశ్వర = సత్. అందువల్ల అనవధి. అందువల్ల,

**పూర్ణా** – పూర్ణం. పూర్ణత్వభావన కలుగుతుంది.

ఎప్పుడైతే పూర్ణత్వభావన కలుగుతుందో, అప్పుడే పరిమితి ఉన్న భావన పోతుంది. దాన్ని జ్ఞాననిష్ఠ అంటారు.

ఇక్కడ ఒక విషయాన్ని గమనించాలి మనం. ఇది ముందే చూశాము నిజానికి. రమణుల వారు ఆత్మవిచారణ చేసి తీరాలని నొక్కి చెబుతున్నారు కాని, ఈ సద్దర్శనంలో కాని, తన తక్కిన గ్రంథాలలో కాని ఎలా చేయాలో చెప్పలేదు. ఆత్మవిచారణ ఎలా చేయాలో తెలుసుకోవాలంటే వేదాంతంలోకి వెళ్ళాలి. ఉపనిషత్తులు ఒక క్రమపద్ధతిలో నేర్పిస్తాయి. మాండూక్యోపనిషత్తు అవస్థాత్రయవివేకం చేసి,

**అవస్థాత్రయ అతీత తురీయ ఆత్మా అహమస్మి**

అని చూపిస్తుంది. ఇది కాక పంచకోశ వివేకం, దృగ్దృశ్యవివేకం, శరీరత్రయవిచారణ చేయిస్తాయి. ముందు తత్త్వబోధలో ఆత్మ నిర్వచనం వస్తుంది.

ఆత్మ అంటే ఏమిటి? అవస్థాత్రయ సాక్షిచైతన్యం, పంచకోశ అతీతం, శరీరత్రయవిలక్షణం అని వస్తుంది.

తైత్తిరీయోపనిషత్తులో పంచకోశవివేకం బాగా వస్తుంది. ఆనందమయకోశంతో మొదలుపెట్టి అది కాదు, అన్యోంతర ఆత్మా ప్రాణమయ అని ప్రాణమయకోశానికి వెళుతుంది. అలా ఒక్కొక్క కోశాన్ని దాటుకుంటూ వెళ్ళి పంచకోశాలకు అతీతంగా ఏది ఉందో, అది ఆత్మ అని విచారణ చేస్తుంది. ఈ విచారణ అంతా మనం ఉపనిషత్తులనుంచి అరువు తెచ్చుకోవాలి.

కాని వచ్చిన చిక్కేమిటంటే, కొంతమంది ఈ వేదాంతవిచారణ చేయనవసరం లేదు, రమణమహర్షి గ్రంథాలు పఠిస్తే చాలు అంటారు. ఎందుకంటే ఈ శ్లోకంలోనే చూశాము. **అరూప ఆత్మా పశ్యేత్** – ఎవరు నేను, సాక్షి చైతన్యాన్ని అని అర్థం చేసుకుంటారో అన్నారు కాని ఎలా అర్థం చేసుకుంటారో చెప్పలేదు. అందువల్ల ఆయన చెప్పలేదు కదా, ఎందుకు శాస్త్రం నేర్చుకోవటం, అనవసరం అనేస్తారు. కాని మనం ఈ మధ్యలో దశను, అంటే గురుశాస్త్ర ఉపదేశం ద్వారా ఆత్మవిచారణ చేయాలని చెబుతాము.

**శ్లోకం 7**

**యత్పంచకోశాత్మకమస్తి దేహం**
**తదన్తరా కిం భువనం చకాస్తి।**
**దేహం వినా పంచవిధం తదేతత్**
**పశ్యంతి కే వా భువనం భణంతు॥**

**ప్రతిపదార్థం:** తదంతరా – దేహం లేకుండా; భువనం చకాస్తి – జగత్తు ఎలా ప్రకాశిస్తుంది? యత్ పంచకోశాత్మకమ్ అస్తి దేహం – శరీరం పంచకోశాత్మకం; తదేతత్ – ఈ; పంచవిధం దేహం – పంచకోశాత్మక దేహం; వినా – లేకుండా; కే వా – ఎవరు; భువనం – జగత్తును; పశ్యంతి – చూస్తారు; భణంతు – చెప్పండి.

**తాత్పర్యం:** దేహం లేకుండా జగత్తు ఎలా ప్రకాశిస్తుంది? శరీరం పంచకోశాత్మకం; ఈ పంచకోశాత్మక దేహం లేకుండా, ఎవరు ఈ జగత్తును చూస్తారు చెప్పండి (జగత్తు లేకపోతే ఎవరు సృష్టికర్త గురించి ఆలోచిస్తారు)?

**వివరణ:** ఆధ్యాత్మిక సాధకుడు జీవవిచారణ ఎందుకు చేయాలనే అంశాన్ని కొనసాగిస్తున్నారు రమణులవారు.

**5వ శ్లోకంలో** అహంకారాన్ని నాశనం చేయాలంటే జగత్ విచారణ, ఈశ్వరవిచారణ చేసి లాభం లేదు, జీవవిచారణ చేయాలి అన్నారు.

**6వ శ్లోకంలో** మీరు జగత్తును, ఈశ్వరుణ్ణి చూసే విధానం మిమ్మల్ని మీరు చూసుకునే దానిమీద ఆధారపడి ఉంటుంది అన్నారు. అందువల్ల వేదాంతం కూడా విచారణ మీనుంచి మొదలుపెట్టండి అంటుంది.

**7వ శ్లోకంలో** జగత్తు, ఈశ్వరుల ఉనికి అహంకారం రాకమీదే ఆధారపడి ఉంది అంటున్నారు.

తార్కికంగా చూసినా అంతేకదా! సుషుప్తిలో అహంకారం లయమవుతుంది కదా! శాశ్వతంగా కాదు, తాత్కాలికంగానే అని మీకూ తెలుసు. అహంకారం లేకపోతే చూసే నేను లేను. చూసే నేను లేకపోతే జగత్తును ఎలా చూస్తాను. నేను ఉంటేనే నువ్వు ఉన్నావు అంటాము సరదాగా; అది నిజం అంటుంది వేదాంతం. ఎప్పుడైతే మీ అహంకారం పడుకుంటుందో, అప్పుడే అహంకారం చూసే జగత్తు మీ కంటిముందు ఉండదు. కన్ను చూస్తే కదా కనబడేది! జగత్తు లేకపోతే ఈశ్వరుడూ లేడు.

వినటానికి కష్టంగా ఉంటుంది కాని జగత్తు లేకపోతే, దాని సృష్టికర్త ఎవరు అనే ప్రసక్తి లేదు, ఈశ్వరుడు అనే జవాబూ లేదు. ఈశ్వరుని నిర్వచనం – జగత్కారణం. జగత్తనే కార్యమే లేకపోతే, కారణం ఎక్కణ్ణుంచి వస్తుంది? కార్యజగత్తు, కారణ ఈశ్వరుడు ప్రమేయంలోకి వస్తారు. చూసే నేను ప్రమాతను. చూసే ప్రమాత లేకపోతే, చూడబడే ప్రమేయానికి విడిగా ఉనికి లేదు. మొదటి పురుషుడు వస్తేనే తక్కిన రెండు పురుషులకూ ఉనికి ఉంది.

సుషుప్తినుంచి లేస్తే అహంకారం లేస్తుంది. అహంకారం లేస్తే, దాన్ని వెన్నంటే అది చూసే జగత్తు, దాన్ని వెన్నంటే దాన్ని సృష్టించిన ఈశ్వరుడూ వస్తారు. స్వప్నంలో కూడా ఈ త్రిపుటి ఉంటుంది. అందువల్ల జగత్తు, ఈశ్వరుల ఉనికికి ఆధారం అహంకారం అంటున్నారు రమణులవారు.

అహంకారం ఎలా వస్తుంది? **అనాత్మ అధ్యాసేన.** అనాత్మతో మీరు మమేకం చెందితే అహంకారం వస్తుంది. బ్రహ్మసూత్రాల భాష్యాన్ని శంకరులవారు **అధ్యాసభాష్యం**తో మొదలు పెడతారు. అది చాలా ప్రసిద్ధి పొందిన భాష్యం.

అధ్యాసం ఏర్పడాలంటే, దేహాభిమానం కలగాలి. అప్పుడే మీరు ఒక జీవి అవుతారు. అహంకారం ఏర్పడుతుంది. మీ చుట్టూ చూస్తే, జగత్తు కనబడుతుంది. ఆ జగత్తుయొక్క సృష్టికర్త ఈశ్వరుడు అంటారు. అందువల్ల జగత్తుకు, ఈశ్వరునికీ కూడా ఉనికిని ఇచ్చేది అహంకారమే. అందువల్ల ఈ భేదభావన ఏర్పడుతున్నది. ఈ నేపథ్యంతో ఈ శ్లోకాన్ని చూద్దాము.

**తదంతరా** – తత్ + అంతరా. తత్ అంటే దేహం. అంతరా అంటే లేకుండా. అంటే ఈ దేహం లేకుండా; అంటే దేహాభిమానం లేకుండా,

**భువనం చకాస్తి** – జగత్తు ప్రకాశిస్తుందా?

దేహాభిమానం పెంచుకోవటంవల్ల మీరు మీ స్వస్వరూపంనుంచి కిందకు దిగుతున్నారు. మీ స్వస్వరూపం ఏమిటి? నామరూపరహిత చైతన్యం. కాని దేహాభిమానంవల్ల కిందకు దిగి, అవతారం ఎత్తుతున్నారు.

నిజానికి ఎవరూ నేను అవతారం ఎత్తాను అనరు. అవతారానికీ, జీవుడు పుట్టటానికీ మధ్య చాలా వ్యత్యాసం ఉంది. భగవంతుడు రామశరీరాన్నో, కృష్ణశరీరాన్నో కావాలని తీసుకుంటారు; అది కూడా ధర్మ సంస్థాపనార్థం. అందువల్ల అది లీల అవుతుంది భగవంతునికి. అందువల్ల భగవంతునిది దివ్యజన్మ అనీ, దివ్యకర్మ అనీ భగవత్‌లీల అనీ అంటారు.

కాని మన జన్మను ఎవరూ అవతారం అనరు. ఎందుకంటే ఇది మనం జ్ఞానంతో పొందినది కాదు. అజ్ఞానంచేత పొందిన పరిణామం. భగవంతుడు అవతారం ఎత్తితే, కిందకి దిగివచ్చాడు అంటారు. మనిషి జన్మనెత్తితే కిందకు పడ్డాడు అంటారు. ఈ జన్మ అజ్ఞానంచేత ఏర్పడటంవల్ల దేహాభిమానం పుట్టుకొస్తుంది.

ఏదేమైనా, మనిషికి ఈ దేహాభిమానం లేకపోతే, అహంకారం లేదు. ఏమిటా దేహం?

**యత్ పంచకోశాత్మకమ్ అస్తి దేహం** – శరీరం పంచకోశాత్మకం. అంటే పంచకోశాలతో కూడినది.

ఇప్పుడు మీరే చెప్పండి. రమణమహర్షి గ్రంథాలు మాత్రం చదివితే చాలు, వేదాంత శాస్త్రం అవసరం లేదు అనేవారికి ఈ పంచకోశాత్మకం దేహం అంటే ఏమర్థమవుతుంది? రమణులవారు వివరించరు, వీరు శాస్త్రం చదవరు, ఎలా అర్థమవుతుంది? వేదాంతం నేర్చుకుంటేనే పంచకోశాలు అంటే అన్నమయకోశం, ప్రాణమయకోశం, మనోమయకోశం, విజ్ఞానమయకోశం, ఆనందమయకోశం అనీ, ఆత్మ పంచకోశవిలక్షణం అనీ అర్థమవుతుంది.

రమణులవారు పంచకోశాల పదం వేశారంటేనే ఆయన ప్రస్థానత్రయగ్రంథాలను అధ్యయనం చేశారనీ, మనను కూడా ఆత్మవిచారణ వేదాంతం ద్వారా చేయమనీ చెప్పకనే చెబుతున్నారు. అందువల్లనే ఆయనను సాంప్రదాయ ఆచార్యులుగానూ, ఆయన గ్రంథాలను ప్రకరణ గ్రంథాలుగా పరిగణించవచ్చనీ మొదట్లోనే చూశాము.

ఇంత స్పష్టంగా తెలుస్తున్నా కూడా కొంతమంది రమణమహర్షి బోధను అర్థం చేసుకోవటానికి శాస్త్రం అధ్యయనం చేయనవసరం లేదని వాదిస్తారు. పైగా మన స్వామీజీ చేస్తున్న ఈ సద్దర్శనం బోధకు వస్తున్నవారిలో ఎవరినో ఈ భావన ఉన్నవారు ఆపారుట. ఇలా వేదాంతం ద్వారా రమణులవారి బోధను నేర్చుకుంటే, పెద్ద వలలో పడిపోతావు. ఆయన ఈ గ్రంథాలకు అతీతం. అందువల్ల వెళ్ళొద్దు అన్నారుట.

యత్ పంచకోశాత్మకమ్ అస్తి దేహం – ఈ వాక్యం చాలు శాస్త్రం రమణమహర్షి నేర్చుకున్నారో లేదో చెప్పటానికి; మనం నేర్చుకోవాలో వద్దో చెప్పటానికీ కూడా. వారి ఉద్దేశ్యంలో శాస్త్రం నేర్చుకుంటే సంసారంలో పడిపోతామట. ఎంత పెద్ద పొరపాటు. ఇది అజ్ఞానంతో కూడిన పొరపాటు! అందువల్ల ఈ సందర్భంలో పంచకోశవిచక్షణ చేయబోవటం లేదు స్వామీజీ. అది నేర్చుకోవాలంటే వేదాంతానికి వచ్చితీరాలి. అందువల్ల పంచకోశాత్మక దేహంమీద అభిమానం అంటే అహంకారం పెంచి పోషించటం. ఎందుకంటే పంచకోశ అభిమానం అహంకారాన్ని పెంచి పోషిస్తుంది. అహంకారం లేకపోతే,

**తదంతరా కిం భువనం చకాస్తి** – అహంకారం లేకపోతే ప్రపంచం ఎక్కడ ఉంటుంది? ప్రమాత లేకుండా ప్రమేయం ఎలా ఉంటుంది? ఈ భావననే మళ్ళీ తక్కిన పాదాలలో కొనసాగిస్తున్నారు.

**తదేతత్ పంచకోశవిధం దేహం వినా** – పంచకోశాలతో కూడిన ఈ శరీరం లేకుండా, అంటే అనాత్మ అభిమానం లేకుండా, అహంకారం లేకుండా,

**కే వా భువనం పశ్యంతి** – ప్రపంచాన్ని ఎవరు చూస్తారు? అంటే అహంకారం లేకుండా జగత్తును ఎలా చూస్తారు?

**భణంతు** – చెప్పండి.

**(కే వా ఈశ్వరం పశ్యంతి)** – ఇది మనం కలుపుకోవాలి. జగత్తు లేకపోతే, జగత్తుయొక్క సృష్టికర్త గురించి ఎవరు ఆలోచిస్తారు?

దీని సారాంశం, అహంకారం లేకపోతే, తక్కిన రెండు భేదాలు కూడా లేవు. అహంకారం చూస్తేనే జగత్తు ఉంటుంది; జగత్తు ఉంటేనే జగత్తుయొక్క సృష్టికర్త గుర్తుకొస్తాడు.

అందువల్ల అహంకారాన్ని మెరుగుపరచటానికి ప్రయత్నించకండి. వేదాంత లక్ష్యం అదికాదు. అహంకార నాశనం చేయటమే వేదాంతం లక్ష్యం.

ఈ శ్లోకాలన్నింటిలో రమణమహర్షి అహంకారంమీద తిరుగుబాటు చేస్తున్నారు. ఇది చాలా శ్రమతో కూడినది, చాలా కష్టమైనది కూడా. ఎందుకంటే ఇన్నాళ్ళూ అహంకారాన్ని ఒక హీరోగా ఆరాధిస్తూ వచ్చాము. ఈ జన్మలోనే కాదు జన్మజన్మలుగా. అలాంటిది ఒక్కసారి అహంకారం హీరో కాదు సుమా, అది పెద్ద విలన్ అంటే అంత సులభంగా జీర్ణించుకోలేము. అహంకారాన్ని హీరోగా అభిమానంచి, దాన్ని బుజ్జగించి, సేవలు చేసి, సహాయసహకారాలు అందిస్తూ వస్తున్నాము. ఇప్పుడేమో అది హీరో కాదు, అది విలన్ అని అంటే అంత తేలికగా అరాయించుకోలేము.

ఎందుకంటే, మన ప్రయత్నమంతా అహంకారాన్ని మెరుగుపరచుకోవటంమీదే ఉంది. దానిమీద అంత సానుకూల భావన పెంపొందించుకుని వేదాంతానికి వస్తే, ముందుగా అహంకారంమీద నీ భావనను మార్చుకో అంటుంది. ఈ బోధ చేయటం అటు గురువుకీ కష్టమే, ఇటు శిష్యునికీ కష్టమే. ఏదో గురువుమీద భయం కొద్దో, భక్తి కొద్దో గురువు చెప్పిన మాటకు పైపైన తల ఊపినా, దాన్ని స్వీకరించలేము. పైపెచ్చు, నేను వేదాంతాన్ని నేర్చుకున్నాను అని విర్రవీగుతాము. అది అహంకారానికి ఇంకొక విజయం.

అందువల్ల ఇంతగా అహంకారాన్ని పెంచి పోషించే శిష్యుని మనస్సులోంచి అహంకారంమీద ఉన్న మమకారాన్ని పారద్రోలటం గురువుకు పెద్ద పరీక్షే. నిజానికి **సద్దర్శనం** సారాంశం ఒక్కముక్కలో చెప్పాలంటే ఈ అహంకారంమీద మనకున్న దృక్పథాన్ని మార్చటమే. రమణమహర్షి ప్రయత్నం అంతా, అహంకార విచారణ చేయటం ఎంత అవసరమో నొక్కి చెప్పటానికే కాని, అహంకారాన్ని పెంచి పోషించటానికి కాదు. అహంకారం మిథ్య; మిథ్య విచారణ చేస్తే సత్యం కాదని తేలిపోతుంది. వెలుతురు వస్తే చీకటి ఎలా నిలవలేదో, అలా అహంకారం విచారణ చేస్తే నిలవలేదు.

ఇంతగా అహంకారం, అహంకారం అని పదేపదే ఈ పదాన్ని వాడుతున్నాము కదా అసలు అహంకారం అంటే ఏమిటో సరియైన అవగాహన ఉండాలి. అహంకారం పదానికి ధర్మశాస్త్రంలో అర్థం వేరు, వేదాంతశాస్త్రంలో అర్థం వేరు. ధర్మశాస్త్రంలో విలువలకు విలువనిస్తారు.

**అమానిత్వమదంభిత్వమహింసా క్షాంతిరార్జవమ్** – గీత

అక్కడ గీతలో అమానిత్వం అంటే గర్వం లేకపోవటం. అహంకారం అంటే గర్వం, పొగరు. నేనే ఎక్కువ అనే అహంభావం. అహంకారం లేకపోతే అనహంకారి అంటారు.

అంటే అణకువ, వినయం. అదే వేదాంత పరిభాషలో చూస్తే అహంకారం అంటే గర్వం, పొగరు కాదు. వేదాంతంలో అహంకారం లేకుండా అణకువ, వినయం ఉన్న వ్యక్తికి కూడా అహంకారం ఉంటుంది. ఇక్కడ అహంకారం అంటే నేను అనే పరిమితిని విధించుకోవటం. వేదాంతంలో అహంకారం, నేను శరీరాన్ని, నేను మనస్సుని, నేను పంచకోశాత్మక శరీరాన్ని అని పరిమితులు ఏర్పరచుకోవటంవల్ల వస్తుంది. ఇక్కడ అహంకారం నిర్వచనం చూస్తాము.

**పంచకోశ అనాత్మని అహమ్ ఇతి అధ్యాసః**

నేను పంచకోశాత్మక శరీరాన్ని అని భావిస్తే, పంచకోశాలు ఒక శరీరానికి పరిమితి అయి ఉండటంవల్ల, నేను కూడా పరిమితి ఉన్న జీవినే అవుతాను. పంచకోశాలకున్న విలువలు నా విలువలు అవుతాయి. చివరికి వినయం కూడా కోశానికి చెందినదే. అందువల్ల నేను వినయంగా ఉన్నానని చెప్పటం కూడా, నన్ను నేను అనాత్మతో పెనవేసుకోవటమే అంటుంది వేదాంతం. ఇది ధర్మశాస్త్రంలో అహంకారం కాదు కాని, వేదాంతశాస్త్రంలో అహంకారం కిందకు వస్తుంది. ఎప్పుడైతే నేను అనాత్మతో మమేకం చెందుతానో, అప్పుడే అనాత్మకున్న మంచి లక్షణాలు, బలహీనతలు కూడా నా స్వంతం అవుతాయి.

**సగుణ పరిచ్ఛిన్న అహమ్ ఇతి భావనా ఏవ అహంకారః॥**

సగుణ పరిచ్ఛిన్న అహం నేను అనుకోవటమే అహంకారం. రమణమహర్షి ఈ అహంకారం అజ్ఞానంవల్ల ఏర్పడిన పొరపాటు అనీ, దాన్ని పారద్రోలాలనీ నడుం కట్టుకున్నారు ఈ **సద్దర్శనం**లో. పొరపాటు పోవాలంటే, దానికి కారణమైన అజ్ఞానాన్ని పారద్రోలాలి. అహంకారం అనే దీపం వెలగటానికి తోడ్పడేది అజ్ఞానమనే చమురు. ఈ అజ్ఞానమనే చమురును జ్ఞానం ద్వారా ఇంకిపోయేలా చేయాలి. విచారణ చేస్తే అజ్ఞానం మాయమవుతుంది, అజ్ఞానజన్య పొరపాటూ మాయమవుతుంది. అందువల్ల రమణమహర్షి ఈ అహంకార నాశనానికి కంకణం కట్టుకున్నారు.

**శ్లోకం 8**

**శబ్దాది రూపం భువనం సమస్తం**
**శబ్దాది సత్తేంద్రియవృత్తిభాస్యం।**
**సత్తేంద్రియాణాం మనసో వశే స్యాత్**
**మనోమయం తద్భువనం వదామః॥**

**ప్రతిపదార్థం:** సమస్తం భువనం = ఈ జగత్తు మొత్తం; శబ్దాదిరూపం = శబ్దస్పర్శరూప రసగంధాలతో కూడినది; శబ్దాది సత్తా = శబ్దాది విషయాలయొక్క ఉనికి; ఇంద్రియవృత్తి= ఇంద్రియాల ప్రవృత్తివల్ల; భాస్యా = కనిపిస్తుంది; సత్తేంద్రియాణాం = అన్ని ఇంద్రియాల ఉనికి; మనసో వశే = మనస్సుయొక్క వశంతో; స్యాత్ = ఉంటుంది; మనోమయం = మనస్సునుంచి; తద్భువనం = ఈ జగత్తు (వచ్చింది); వదామః = అంటున్నారు.

**తాత్పర్యం:** ఈ జగత్తు మొత్తం శబ్దస్పర్శరూప రసగంధాలతో కూడినది. శబ్దాది విషయాల ఉనికి ఇంద్రియాల ప్రవృత్తివల్ల కనిపిస్తుంది. అన్ని ఇంద్రియాల ఉనికి మనస్సుయొక్క వశంలో ఉంటుంది. అందువల్ల మనస్సునుంచి ఈ జగత్తు వచ్చింది అంటున్నారు.

**వివరణ:** మన ముందు ఎంతో విశాలమైన విశ్వం, అనంతమైన విశ్వం ఉంది. విజ్ఞానశాస్త్రంలో కూడా ఇప్పటికీ విశ్వంయొక్క సరిహద్దులను నిర్దేశించలేకపోతున్నారు శాస్త్రజ్ఞులు. అంతేకాదు, అంతకంతకూ ఈ విశ్వం ఇంకా ఇంకా విస్తరిస్తూ పోతున్నది అంటారు వారు. ఇంత విశాల విశ్వాన్ని సర్వశక్తిమంతుడూ, సర్వజ్ఞుడూ అయిన భగవంతుడు సృష్టించాడు.

విశ్వం ఇంత విశాలంగా ఉంటే, అందులో నాకు అనుభవంలోకి వచ్చే విశ్వం ఎంత? పెద్ద ఎడారిలో చిన్న ఇసుకరేణువంత. విచారణ చేస్తే, ఉనికి ఉన్న విశ్వం కాదు మనను పట్టి బంధించేది, మనకు అనుభవంలోకి మాత్రమే వస్తున్న భాగం అని అర్థమవతుంది. ప్రపంచంలో మారుమూలల్లో కూడా అనేక సంఘటనలు జరుగుతుంటాయి. ఎక్కడో భూకంపం వస్తుంది; మరెక్కడో అగ్నిజ్వాలలు రోజుల తరబడీ రేగుతుంటాయి. అవేవీ మనను చలింప జేయజాలవు. వాటి విషయంలో మనం జీవన్ముక్తులం అవుతాము.

ఎక్కడిదాకానో ఎందుకు? మనం నివసించే హైదరాబాదులోనే ఎన్నో ప్రాంతాలు మనకు తెలియను కూడా తెలియవు. అక్కడ మనుష్యులు కాని, వారి సమస్యలు కాని మనను కుదిపివేయవు. దీనివల్ల మనమొక ముఖ్యమైన సూత్రాన్ని గ్రహించాలి. ఉనికి ఉన్న జగత్తు మనను బంధించదు. మనకు అనుభవంలోకి వస్తున్న జగత్తే మనను బంధిస్తుంది. మనకు అనుభవంలోకి వస్తున్న జగత్తు మనలో రాగాన్నో, ద్వేషాన్నో, ఈర్ష్యనో, కోపాన్నో కలుగజేస్తుంది. ఈ సమస్యాత్మక జగత్తు మన మనస్సుని నిరంతరం తొలిచివేస్తుంది.

అసలు మీరెప్పుడైనా మీ మనస్సుని గమనించారా? ఒక్కక్షణం ఖాళీగా ఉండదు. ఎప్పుడూ భార్య గురించి, పిల్లల గురించి, మనవళ్ళ గురించి, తెలిసినవారి గురించీ ఆలోచిస్తూనే ఉంటుంది. ఈ బెంగలు, ఆందోళనలు, మనస్సుని ఎంతగా కృంగదీస్తాయంటే, శరీరాన్ని కూడా వంగదీస్తుంది. అనుభవంలోకి వచ్చే జగత్తు అంటే మనుష్యులు మాత్రమే కాదు,

జంతువులు, పెంపుడు కుక్కలు కూడా వస్తాయి. అందువల్ల బంధకత్వాన్ని కలుగజేసేది అనుభవంలోకి వచ్చే జగత్తే కాని, ఉనికి ఉన్న జగత్తు కాదు అంటారు రమణులవారు.

వీటికి సాంకేతిక పదజాలాన్ని ఇస్తారు విద్యారణ్యులవారు పంచదశిలో ఒక అధ్యాయంలో. ఉనికి ఉన్న జగత్తును ఈశ్వరసృష్టి అనీ, అనుభవంలోకి వచ్చే జగత్తును జీవసృష్టి అనీ నిర్వచిస్తారు ఆయన. అంటే భగవంతుడు సృష్టించిన జగత్తును ఉన్నది ఉన్నట్టుగా చూస్తే అది ఈశ్వరసృష్టి అవుతుంది. ఉన్న సృష్టికి మన రాగద్వేషాలనే రంగులు పులిమి చూస్తే అది జీవసృష్టి అవుతుంది.

ఈ జగత్తుకు రంగులు పులిమి చూపించేది మన అహంకారం అంటున్నారు రమణమహర్షి. ఈ శ్లోకాల్లో చాలాసార్లు చూశాము, చూసే నేను ఉంటేనే, చూడబడే జగత్తు ఉంటుంది. అనుభవించే నేను ఉంటేనే, అనుభవంలోకి వచ్చే జగత్తు ఉంటుంది. ఇలా రంగులు పులమటంవల్ల జగత్తు భారంగా అవుతుంది.

ప్రమాత లేకుండా ప్రమేయం లేదు. అందువల్ల మనను బంధించే జగత్తుకు ఆధారం మన అహంకారమే. అందువల్ల బాధించే జగత్తును మార్చాలంటే, ఆ బాధను కలుగజేసే అహంకారాన్ని మార్చాలి. జగత్తు, అహంకారం ఒకే నాణేనికి రెండు పక్కలు. అహంకారం ఒక వైపు, జగత్తు ఇంకో వైపు ఉంటాయి. అనుభవంలోకి వచ్చే జగత్తు, నా అహంకారంమీద ఆధారపడి ఉంటుంది. అహంకారాన్ని సత్యంగా భావిస్తే, జగత్తు కూడా సత్యం అయి కూర్చుంటుంది. అహంకారాన్ని మిథ్యగా అర్థం చేసుకుంటే, జగత్తు కూడా మిథ్యగా తేలిపోతుంది. అహంకారం ఎలా ఉంటే, జగత్తు అలా ఉంటుందన్నమాట. అహంకారం సత్త్వప్రధానంగా ఉంటే, జగత్తు కూడా సత్త్వప్రధానంగా ఉంటుంది.

దీనికి ధర్మరాజు, దుర్యోధనుల కథ చెబుతారు. ఒకసారి ధర్మరాజుని ఒక దుర్మార్గుణ్ణి వెతికి తీసుకురమ్మనీ, దుర్యోధనుడిని ఒక అత్యంత మంచివాడిని వెతికి తీసుకురమ్మనీ పంపారుట. ఇద్దరూ దేశం అంతా తిరిగారు కాని, ఇద్దరూ విజయం సాధించలేకపోయారు. మంచితనం మూర్తీభవించిన ధర్మరాజుకి ఎవరిలోనూ చెడు కనబడలేదు. అలాగే దుర్మార్గానికి పరాకాష్ఠ అయిన దుర్యోధనునికి ఎవరిలోనూ మంచి కనబడలేదు. అందువల్ల చూడబడే జగత్తు, చూసే నామీద ఆధారపడి ఉంటుంది.

**సంపూర్ణం జగదేవ నందనవనం సర్వేఽపి కల్పద్రుమా ...**

జ్ఞానికి జగత్తు నందనవనంగా కనిపిస్తుంది.

ఈ వివరణ సారాంశం ఒక్కటే. జగత్తును మార్చటానికి ప్రయత్నించకండి, మీ అహంకారాన్ని మార్చండి అని అర్థం. దీనికి ఒక తండ్రీకొడుకుల కథ చెబుతారు. ఒక తండ్రి, ఇంట్లోనే ఆఫీసుపనిలో తలమునకలయి ఉన్నాడు. ఆ సమయంలో కొడుకు వచ్చి తనకు తోచటం లేదు, తనతో ఆడమని తండ్రిని సతాయించసాగాడు. తండ్రి తన ఆఫీసుపని ఒదులుకోలేడు, అలాగని పిల్లవాడినీ నిర్లక్ష్యం చేయలేడు. అందువల్ల అప్పటికప్పుడు అతనికొక జిగ్‌సా పజిల్‌ను ఇచ్చాడు. ఒక కాగితంమీద ప్రపంచ చిత్రపటం ఉంది. దాన్ని చిన్నచిన్న ముక్కలుగా చింపి ఇచ్చి, దాన్ని మళ్ళీ అతికించుకు రమ్మన్నాడు. కనీసం ఒక గంటసేపు నిశ్చింతగా తన పని తాను చేసుకోవచ్చు అనుకున్నాడు తండ్రి. కాని ఆశ్చర్యం! తన కొడుకు కాసేపట్లోనే ప్రపంచ చిత్రపటాన్ని అతికించి తీసుకువచ్చాడు. ఎలా చేశావని తండ్రి నివ్వెరపోతూ అడిగితే, దాన్ని వెనక్కి తిప్పి చూపాడు. అటువైపు మనిషి బొమ్మ ఉంది. 'ఈ మనిషి బొమ్మను, అతని ఆకారంలో పేర్చితే, ప్రపంచ ఆకారం వచ్చేసింది నాన్నా,' అన్నాడు. అద్భుతం!

వేదాంతబోధ వచ్చేసింది! జగత్తును మార్చకండి, మీ అహంకారాన్ని మార్చండి! అహంకారాన్ని మారిస్తే, జగత్తు దానంతట అదే మారుతుంది. ఎందువల్లనంటే జగత్తును ఎదుర్కోవాలంటే, అహంకారాన్ని ఎదుర్కోవాలి. ఈ శ్లోకం సారాంశం ఇదే. దీన్ని అద్భుతంగా, ఒక క్రమపద్ధతిలో వివరిస్తున్నారు. ఈ నేపథ్యంతో ఈ శ్లోకాన్ని చూద్దాము.

**సమస్తం భువనం శబ్దాదిరూపం** – మొత్తం జగత్తులో ఐదు రకాల వస్తువులు ఉన్నాయి. శబ్దాది రూపం అంటే శబ్దస్పర్శరూప రసగంధాత్మకం జగత్తు. మీ ఎదురుగా ఉన్న జగత్తులోని రంగురూపాలను కళ్ళతో చూస్తే, శబ్దాలను చెవులతో వింటారు. అంటే పంచజ్ఞానేంద్రియాలతో పంచవిషయవస్తువులను చూస్తారు. అందువల్ల జగత్తును ప్రపంచం అంటారు. పంచవిధాలుగా విభజించి, ప్ర అంటే ప్రత్యేకంగా చూపిస్తుంది. అంటే ఒక జ్ఞానేంద్రియం చూపించేదాన్ని, ఇంకొక జ్ఞానేంద్రియం చూపించలేదు. కంటిచూపు సూదంటురాయిలా ఉన్నా కూడా, దానివల్ల ఇసుమంతైనా శబ్దాన్ని వినలేరు. అందువల్ల ఎవరైనా మాట్లాడేది స్పష్టంగా వినాలంటే, కళ్ళను ఎంత నులుముకున్నా కూడా శబ్దాన్ని వినలేరు.

నిజానికి ఇలా జగత్తును చూస్తున్నారంటే, అసలు వస్తువును చూడటం లేదు; ఆ వస్తువుకున్న గుణాలను చూస్తున్నారు. ఉన్నది ఒకటే సత్ బ్రహ్మ. అందువల్ల ఈ జగత్తులో ఏం చూస్తున్నా అది సత్‌బ్రహ్మకు ఉన్న నామరూపాలు మాత్రమే. అందువల్ల జగత్తును చూస్తున్నారంటే దానికి శబ్దస్పర్శరూపరసగంధాలనే గుణాలు ఆపాదించి చూస్తున్నారు. అందువల్లనే ఈ జగత్తు మొత్తం శబ్దాదిరూపం మాత్రమే అంటున్నారు. ఈ జగత్తుయొక్క ఉనికిని ఎలా నిరూపిస్తారు?

**శబ్దాది సత్తా** – ఈ జగత్తులో శబ్దాది విషయాలయొక్క ఉనికి,

**ఇంద్రియవృత్తి భాస్యా** – భాస్యా అంటే కనిపిస్తుంది; వృత్తి అంటే ప్రవృత్తి. ప్రవృత్తి దేనిది? ఇంద్రియాలది. పంచజ్ఞానేంద్రియాలది. అంటే పంచజ్ఞానేంద్రియాలు, ఈ జగత్తును ఐదుగా విభజించి చూపిస్తాయి. అంటే జగత్తుయొక్క ఉనికి పంచజ్ఞానేంద్రియాలమీద ఆధారపడి ఉంది.

పుట్టుగుడ్డి వ్యక్తికి రంగు, రూపులను చూపించే ప్రపంచం ఉండదు. ఎందుకంటే వీటిని కంటితోనే చూడాలి. రంగు, రూపాలను ఎంత బాగా మీరు మాటలతో వర్ణించినా కూడా, అతను వాటిని ఆస్వాదించలేడు. అందువల్ల ఇంద్రియంవల్ల జగత్తు కనిపిస్తుంది అంటున్నారు రమణులవారు. ఇంద్రియవృత్తి భాస్యా అంటే అదీ అర్థం.

**సత్తేంద్రియాణాం మనసో వశే స్యాత్** – కాని ఇంద్రియాల ఉనికి మనస్సు వశంలో ఉంటుంది.

జగత్తును ఇంద్రియాలు చూస్తేనే ఉంది అన్నారు ఇంతకుముందు. ఇప్పుడేమో ఇంద్రియాల వెనక మనస్సు ఉంటేనే అది పనిచేస్తుంది అంటున్నారు. ఇంద్రియాల పని బాహ్యావస్తువులను చూడటం. కాని ఇంద్రియాల పని సవ్యంగా అవాలంటే, దాని వెనక మనస్సు కూడా ఉండాలి. ఉదాహరణకు మీరు స్వామీజీ బోధను వింటుండగా, మనస్సు ఎటో వెళ్ళిపోవచ్చు. ఎక్కడిదాకానో ఎందుకు, క్లాసులోకి బోధ మధ్యలో ఒక వ్యక్తి వచ్చాడు. మీకతను బాగా తెలుసు. అతను నాస్తికుడని కూడా బాగా తెలుసు; అటువంటి వ్యక్తి వేదాంతబోధకు ఎలా వచ్చాడబ్బా అనే ఆలోచనలోకి జారుకుంటుంది మనస్సు.

ఇంతే సంగతులు! స్వామీజీ బోధ కొనసాగుతూ ఉంటుంది; చెవులు పని చేస్తూనే ఉంటాయి; స్వామీజీ గొంతు వినిపిస్తూనే ఉంటుంది కాని, అందులో ఒక్క అక్షరంముక్క కూడా అర్థం కాదు. ఎందుకంటే మనస్సు చెవుల వెనక లేదు. అంటే ఇంద్రియాలు ఉన్నాయా లేదా అనే సందేహం లేదు. ఇక్కడ మాట్లాడుతున్నది ఇంద్రియాల పని. అందువల్ల ఇంద్రియాణాం సత్తా – ఇంద్రియాలయొక్క ఉనికి, మనసః వశే స్యాత్ – మనస్సుయొక్క ఆధీనంలో ఉంది.

ఇది అర్థం చేసుకోవాలంటే సుషుప్తిని గుర్తు తెచ్చుకోండి. గాఢనిద్రలో మీ చెవులు తెరుచుకునే ఉంటాయి కాని టీవీ పెద్ద వాల్యూమ్‌లో మోగుతున్నా మీకేం తెలియదు. ఎందుకంటే మనస్సు పడుకుంటుంది అప్పుడు. అలాగే ముక్కు, మీ గాఢనిద్రలో కూడా ఊపిరి పీలుస్తూ, వదులుతూ ఉంటుంది. అందులో ఏం సందేహం లేదు కదా! కాని అప్పుడు ఏ సుగంధమూ మీ ముక్కుపుటాలను సోకలేదు. ఇంద్రియాలు వాటి శక్తిని కోల్పోతాయి.

జగత్తు ఉనికి ఇంద్రియాలమీద ఆధారపడి ఉందని ఇంతకుముందు చూశాము; ఇప్పుడేమో ఇంద్రియాల ఉనికి మనస్సుమీద ఆధారపడి ఉందని చూస్తున్నాము. అంటే మొదటిదీ, చివరిదీ కలిపితే జగత్తు దాని ఉనికికి మనస్సుమీద ఆధారపడి ఉంది. ఈ మనస్సునే వేదాంతంలో అహంకారం అంటారు.

మనస్సు, అహంకారం ఒకటే అనే విషయాన్ని రెండు భిన్నపద్ధతుల్లో తెలుసుకోవచ్చు. ఒకటి సాంకేతిక పద్ధతి, ఇంకొకటి మామూలు పద్ధతి

**సాంకేతిక పద్ధతి** – సాంకేతిక పరంగా నిర్వచించాలంటే,

**చిదాభాస సహిత అంతఃకరణమ్ అహంకారః**

మనస్సు స్వతహాగా జడమే అయినా, దానికి ప్రతిబింబింపజేసే శక్తి ఉంది. అందువల్ల సాక్షిచైతన్యాన్ని లేదా చిత్‌ను లేదా బింబచైతన్యాన్ని మనస్సు ప్రతిబింబింపజేస్తుంది. అందువల్ల మనస్సును ప్రతిబింబ మాధ్యమం అంటారు. అందులో ఏర్పడిన ప్రతిబింబాన్ని చిదాభాస లేదా ప్రతిబింబ చైతన్యం అంటారు. ఈ మూడు పదాలను ఇంగ్లీషులో కూడా చూద్దాము.

| | | | |
|---|---|---|---|
| బింబ చైతన్యం | – | Original Consciousness | – OC |
| ప్రతిబింబ మాధ్యమం | – | Reflecting Medium | – RM |
| ప్రతిబింబ చైతన్యం | – | Reflected Consciousness | – RC |

ఇంకో విధంగా చెప్పాలంటే చిత్‌ను మనస్సు ప్రతిబింబింపచేస్తే, ప్రతిబింబాన్ని చిదాభాస అంటారు. ఇదంతా ఏదో గందరగోళంలా ఉంది, అర్థం కావటం లేదు అనిపిస్తే, మామూలు పరిభాషలో చూద్దాము.

**మామూలు పద్ధతి**– నేను ఎవరు అంటే మనస్సు అని చెప్పవచ్చు. ఎందుకంటే మనస్సు పనిచేస్తుంటేనే, నేను కూడా పనిచేస్తాను; మనస్సు పడుకుంటే నేను కూడా పడుకుంటాను. దీన్ని అన్వయవ్యతిరేక న్యాయం అంటారు. మనస్సు ఉంటే నేను ఉన్నానని తెలుస్తుంది; లేకపోతే తెలియదు. మనస్సును పువ్వుతో పోలుస్తారు.

జాగ్రదావస్థలో మనస్సు పూర్తిగా విచ్చుకున్న పువ్వులా ఉంటుంది. అంటే అన్ని ఇంద్రియాలతో జాగ్రదావస్థలో వ్యవహారం నడుపుతుంది. స్వప్నావస్థలో మనస్సు అరవిచ్చిన పువ్వులా ఉంటుంది. ఇంద్రియాలు పడుకుంటాయి, మనస్సు ఒక్కటే పనిచేస్తుంది. దానితో స్వప్నప్రపంచాన్ని సృష్టిస్తుంది. సుషుప్తిలో మనస్సు కూడా పడుకుంటుంది. అందువల్ల అది ముడుచుకుని ఉన్న మొగ్గలా ఉంటుంది. అప్పుడు ప్రపంచం కూడా పడుకుంటుంది. దాన్నే **ప్రపంచోపశమం** అంటారు గౌడపాదాచార్యులవారు. సుషుప్తిలో మనస్సు పడుకునేసరికి,

అంతవరకు ఆటాడించిన అహంకారం సద్దుమణుగుతుంది. నేను ఫలానావాడిని, నా భావాలు ఇవి, నా బుద్ధి ఇలా పనిచేస్తుంది అని విర్రవీగేవేవీ గుర్తుండవు.

మనస్సు పడుకుంటే, జగత్తు పడుకుంటుంది అని చూశాము. జగత్తు పడుకుంటుంది అంటే జగత్తుతో వ్యవహారం ఉండదు. అహం లేకపోతే ఇదం లేదు. ఇక్కడ గుర్తుంచుకోవాల్సింది మనస్సు అంటే అహంకారం. అందువల్లనే –

**మన ఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః**

మనస్సే మనుష్యులను ఇటు బంధంలోనూ పడవేయగలదు; అటు మోక్షాన్నీ ఇప్పించగలదు. మనస్సు పడుకుంటే అహం, ఇదం భేదం ఉండదు కాబట్టి దాన్ని నిర్వికల్ప సమాధి అనవచ్చు.

**తద్భువనం వదామః** – అందువల్ల జగత్తు మనస్సునుంచి వచ్చిందని చెబుతున్నాము. మనోమయంలో మయం అంటే వచ్చింది; మనోమయం అంటే మనస్సునుంచి వచ్చింది. అంటే జగత్తు మనస్సునుంచి వచ్చింది. మనస్సు = అహంకారం అని చూశాము కాబట్టి జగత్తు అహంకారంవల్ల వచ్చిందని చెప్పవచ్చు.

ఉపోద్ఘాతంలో చూశాము, నేను ఉంటేనే నువ్వు, అతడు ఉంటారని. అంటే ఉత్తమ పురుషుడు ఉంటేనే, మధ్యమ పురుషుడు, ప్రథమ పురుషుడు వస్తారు. అందువల్ల ఉత్తమ పురుషుడు అయిన అహంకారాన్ని పారద్రోలితే, సహజంగానే జగత్తు, ఈశ్వరుడు కూడా మాయమవుతారు.

తత్ భువనం – తత్ అంటే శబ్దరూపం. భువనం మనోమయం ఇతి వయం వదామః. ఈ శ్లోకం అర్థం, ఈ జగత్తును ఇంద్రియాల ద్వారా చూస్తే, ఇంద్రియాలు మనస్సువల్ల పనిచేస్తాయి కాబట్టి, ఈ జగత్తు మనస్సునుంచి ఉత్పత్తి చెందింది అని చెబుతున్నాను అంటున్నారు రమణులవారు.

**శ్లోకం 9**

**ధియా సహోదేతి ధియాఽస్తమేతి**
**లోకస్తతో ధీప్రవిభాస్య ఏషః।**
**ధీలోకజన్మక్షయధామ పూర్ణం**
**సద్వస్తు జన్మక్షయశూన్యమేకమ్॥**

**ప్రతిపదార్థం:** ధియా సహ = మనస్సుతో; ఉదేతి = లేచినప్పుడు; లోకస్తః = జగత్తు; ఉదేతి = లేస్తుంది; ధియా సహ అస్తమేతి = మనస్సుతోపాటు అస్తమిస్తుంది; తతః=

అందువల్ల; ఏషః = ఈ జగత్తు; ధీ ప్రవిభాస్య = ఈ మనస్సుతోనే ప్రకాశిస్తుంది; సద్వస్తు= నేను సద్వస్తువును; జన్మక్షయ శూన్యమ్ = నాకు జన్మ, మరణములు లేవు; పూర్ణం = నేను పూర్ణం; ధీ = మనస్సు; లోకః = జగత్తు; జన్మక్షయధామ = అధిష్ఠానం నేనే.

**తాత్పర్యం:** మనస్సు లేచినప్పుడు జగత్తు లేస్తుంది; మనస్సు పడుకున్నప్పుడు జగత్తు పడుకుంటుంది. అందువల్ల ఈ జగత్తు మనస్సుతోనే ప్రకాశిస్తుంది. నేను సద్వస్తువును. నాకు జన్మ, మరణములు లేవు. నేను పూర్ణం. ఈ మనస్సుకు, జగత్తుకు అధిష్ఠానం నేనే.

**వివరణ:** ఈ శ్లోకం ముందు శ్లోకానికి మరికాస్త వివరణను ఇస్తుంది. ఇంతకుముందేమని చూశాము? అహంకారం, జగత్తు ఒకదానితో ఒకటి పెనవేసుకుని ఉన్నాయని, అవి ఒకే నాణేనికి రెండు పక్కలని, అందువల్ల ఒకటి ఉంటే ఇంకొకటి ఉంటుందని చూశాము. ఇప్పుడు ఈ రెండూ ఒకేసారి ఉదయిస్తాయని, ఒకేసారి అస్తమిస్తాయని చెబుతున్నారు రమణమహర్షి. ఒకటి ఉంటే రెండోది ఉండితీరాలి. ఒకదాన్ని పారద్రోలి, రెండోదాన్ని ఉంచలేము. అది కూడా ఇంతకుముందు చూశాము.

జాగ్రదావస్థలో, స్వప్నావస్థలో మనస్సు పనిచేస్తుంది కాబట్టి జాగ్రద్ ప్రపంచంతో, స్వప్నప్రపంచంతో వ్యవహారం నడుపుతుంది. సుషుప్తిలో మనస్సు పడుకుంటుంది కాబట్టి జగత్తు కూడా లయమవుతుంది. మళ్ళీ జాగ్రదావస్థలో మనస్సు లేచిన ఎంతసేపటికో జగత్తు ప్రత్యక్షమవదు. మనస్సుతో పాటు జగత్తు వచ్చేస్తుంది.

**లోకః ఉదేతి** – సమస్యలను సృష్టించే జగత్తు, భయపెట్టే జగత్తు, ఆందోళనలు కలుగజేసే జగత్తు, పరిమితి కలిగించే జగత్తు లేస్తుంది. ఎప్పుడు?

**ధియా సహ ఉదేతి** – మనస్సు లేచినప్పుడు లేస్తుంది. ఇక్కడ ధియా అంటే భావన. ఏ భావన? అహం అనే భావన అని మనం కలుపుకోవాలి. అహం భావనయా అహంకారేణ సహ.

అందువల్ల మీ కళ్ళముందు జగత్తు ఉంటే పాపం జగత్తును నిందించకండి. మీరు అహంకారాన్ని పెంచిపోషించారు, అది జగత్తును తోడుదొంగలా తెచ్చుకుంది. లోకః అంటే సంసారం అనికూడా చెప్పవచ్చు. అందువల్ల మనస్సు లేస్తే జగత్తు లేస్తుంది. జగత్తు లేస్తే సంసారంలో పడవేస్తుంది. ఇది అన్వయవ్యతిరేకంలో అన్వయం భాగం. ఇప్పుడు వ్యతిరేకం చూస్తాము.

**ధియాఽస్తమేతి** – మనస్సు పడుకుంటే జగత్తు కూడా అస్తమిస్తుంది. జగత్తు పడుకుంటే సంసారం ఉండదు. అంటే సంసారానికి మూలకారణం మనస్సు లేదా అహంకారం.

అందువల్ల అహంకారాన్ని ఉంచుకుని సంసారాన్ని నాశనం చేస్తానంటే కుదరదు. సంసారం లేని అహంకారం భిన్నపదాలు అవుతాయి.

సుషుప్తిలో అహంకారం పడుకుంటే జగత్తు, జగత్తు సృష్టించిన సంసారం కూడా ఉండవు. అంటే సుషుప్తిలో మోక్షం కలుగుతుంది. సంసారబంధంనుంచి విడివడటమే మోక్షం. ఈ మోక్షం ఎలా కలుగుతున్నది? సునాయాసంగా, వేదాంతం నేర్చుకోకుండా, గురుశాస్త్ర ఉపదేశం పొందకుండా, సాధనచతుష్టయసంపత్తికోసం పాటుపడకుండా మోక్షం పొందుతాము.

ప్రతిరాత్రి బ్రహ్మతో జీవాత్మ ఐక్యం పొందుతుంది. కాకపోతే ఇది తాత్కాలిక ఐక్యం; నిద్ర లేస్తే ద్వైతం కూడా లేస్తుంది. కాని మోక్షం ఎలా ఉంటుందో రుచి చూపిస్తున్నాడు భగవంతుడు. అందువల్లనే బృహదారణ్యకంలో స్వయంజ్యోతి బ్రాహ్మణంలో సుషుప్తిని మోక్షంతో పోల్చి, దాన్ని స్తుతిస్తారు.

**తత్ర పితా అపితా భవతి మాతా అమాతా లోకా అలోకా దేవా అదేవా వేదా అవేదాః**

– బృహదారణ్యకమ్

అంటే గాఢనిద్రలో నేను తల్లిని లేదా నేను తండ్రిని అనే భావన ఉండదు. లోకాలు, దేవతలు, వేదాలు, అనే ద్వైతం ఉండదు. ఉన్నదొకటే అద్వైతం. అందువల్లనే గాఢనిద్రనుంచి లేచాక, 'నేను హాయిగా నిద్రపోయాను, నాకేం తెలియలేదు,' అంటాము. దీన్నిబట్టి అహంకార నాశనం చేస్తే జగత్తు నాశనం అవుతుందని అర్థమవుతున్నది. అందువల్ల ఆత్మవిచారణ, జగత్తు విచారణ విడివిడిగా చేయనవసరం లేదు. ఒకటి చేస్తే, రెండోది చేసినట్టే లెక్క.

ఇక్కడొక సందేహం రావచ్చు మీకు. ఇంతకుముందేమన్నారు, మీ జీవితచరిత్రలో హీరో మీ అహంకారం అన్నారు. ఇప్పుడేమో ఆ అహంకారాన్ని నాశనం చేయమంటున్నారు. అంటే అది ఆత్మహత్యతో సమానం అవదా? అవదంటున్నారు రమణులవారు. ఎందుకు? అహంకారం హీరో అని మీరు అనుకుంటున్నారు. నిజానికి అహంకారం విలన్. విలన్‌ను నాశనం చేస్తే, అసలు హీరో వెలుగులోకి వస్తాడు. అసలు హీరో ఎవరు? ఆత్మ. అహంకారం అనే అనారోగ్యాన్ని తీసేస్తే, అసలు అహం, శుద్ధ అహం, సాంకేతికంగా చెప్పాలంటే లక్ష్యార్థ అహం వెలుగులోకి వస్తుంది. లక్ష్యార్థ అహం రావాలంటే, వాచ్యార్థ అహంకారం పోవాలి. అహంకారంలో కారంగా మిమ్మల్ని చిర్రుబుర్రులాడించిన కారాన్ని తీసేస్తే శుద్ధ అహం మిగులుతుంది. అందువల్ల అహంకారాన్ని పారద్రోలటం ఆత్మహత్యా సదృశం కాదు.

నిజానికి తక్కిన దార్శనికుల్లో కొందరు అద్వైత వేదాంతాన్ని ఈ కారణంగా నిందిస్తూంటారు. మీరు జీవుణ్ణి నాశనం చేస్తారు. అహంకారాన్ని నాశనం చేస్తారు. నేనే లేకపోతే మోక్షాన్ని

ఎలా పొందుతాను? అది ఆత్మహత్య కాదా అంటారు. కాని మనం చేసేది ఆత్మహత్య కాదని, ఆత్మను మరుగున పడిపోయేటట్టుగా చేసిన అహంకారాన్ని హత్య చేస్తున్నామని, అప్పుడు అసలు నేను, శుద్ధ నేను, శాశ్వతమైన నేను ఎప్పటికీ నిలుస్తాను అని చెబుతాము. సరే ఆ అసలు నేను గురించి అంతగా ఊరిస్తున్నారు కదా! ఏమిటా అసలు నేను? రమణమహర్షి ఆ అసలు నేనుని మూడు, నాలుగు పాదాల్లో వివరిస్తున్నారు.

**సద్వస్తు** – అసలు నేను సద్వస్తు. అంటే శుద్ధ ఉనికిని నేను.

**జన్మక్షయశూన్యమ్** – నాకు పునరపి జననం, పునరపి మరణం లేదు. శూన్యం అంటే లేవు. నాకు జన్మ లేదు, మరణం లేదు.

**పూర్ణమ్** – నేను పూర్ణం, నాకు ఏమీ కొరత లేదు.

దానికి భిన్నంగా అహంకారం ఎప్పటికీ ఏదో ఒకటి కోరుతూనే ఉంటుంది. దయానంద స్వామీజీ అంటారు, తంబురశ్రుతి నిరంతరం కొనసాగినట్టుగా. నాకు కావాలి, నాకు కావాలి అనే శ్రుతి కొనసాగుతూనే ఉంటుంది. కాకపోతే సంగీతంలో రాగాలు మారినట్టుగా, నాకేం కావాలో ఆ రాగాలు మారుతాయి. నాకు బొమ్మలు కావాలని చిన్నప్పుడు అంటే నాకు భార్య కావాలి అంటాం పెద్దయ్యాక. తరువాత పిల్లలు కావాలి. ఆ తరువాత మనవళ్ళు కావాలి; వారికి స్కూల్లో సీటు దొరకాలి. అందువల్ల నాకు కావాలి అని కోరేది చిన్న నేను. అది అహంకారంయొక్క జీవితచరిత్ర. కోరిక లేని అహంకారం అంటూ ఉండనే ఉండదు. అహంకారం ఎప్పటికీ పరిమితి ఉన్నది, ఆత్మ అయిన నేను పూర్ణం. అంతేకాదు,

**ధీలోక జన్మక్షయ ధామ** – ధామ అంటే అధిష్ఠానం. ఈ అధిష్ఠానంలోనే పుట్టుక, మరణం జరుగుతున్నది. వేటి పుట్టుక, మరణం? ధీ అంటే అహంకారం; లోకః అంటే జగత్తు. ఆ విధంగా సబ్జెక్ట్, ఆబ్జెక్ట్లు రెండింటికీ లయస్థానం అసలు నేనే.

**మయి సర్వం లయం యాతి** – నాలోనే అన్నీ లయమవుతాయి. నేను అంటే ఆత్మను. ఇది నా జీవితచరిత్ర. దీన్ని అసలు జీవితచరిత్రగా స్వీకరించటం నేర్చుకోవాలి.

**శ్లోకం 10**

**భవంతు సద్దర్శనసాధనాని**
**పరస్య నామాకృతిభిః సపర్యాః।**
**సద్వస్తుని ప్రాప్తతదాత్మభావా**
**నిష్ఠైవ సద్దర్శనమిత్యవేహి॥**

**ప్రతిపదార్థం:** ప్రాప్త = విచారణ ద్వారా పొందిన జ్ఞానంవల్ల; తదాత్మ = తత్ ఏవ ఆత్మా; భావా = భావన; సపర్యాః = పూజలు; భవంతు = చేయవచ్చు; పరస్య = పరబ్రహ్మమీద పూజ; నామాకృతిభిః = సగుణరూపంమీద; సద్దర్శనసాధనాని = ఇవి సద్దర్శన సాధనలు; నిష్ఠా ఏవ = జ్ఞాననిష్ఠ మాత్రమే; సద్దర్శనమ్ ఇతి = సద్దర్శనం అని; అవేహి = అంటారు.

**తాత్పర్యం:** విచారణ ద్వారా పొందిన జ్ఞానంవల్ల నేను ఆత్మను అనే భావనలో నెలకొని ఉంటారు. అంతవరకు పరబ్రహ్మమీద పూజ, సగుణ ఈశ్వరునిమీద, పూజలు చేయవచ్చు. అవి సహకారీ సాధనలు, జ్ఞాననిష్ఠ మాత్రమే సాక్షాత్ సాధన అని అంటారు.

**వివరణ:** ముందు శ్లోకంలో అహంకార విచారణ చేసి తీరాలనీ, అది చేస్తే సద్దర్శనం కలుగుతుందనీ చూశాము. ఈ శ్లోకంలో రమణులవారు కొంచెం పక్కకి వెళుతున్నారు. చూడటానికి పక్కకి వెళ్ళినట్టుగా అనిపించినా, ఇది చాలా ముఖ్యమైన శ్లోకం. ఇది కొన్ని సందేహాలను తీరుస్తుంది. ముందు మూడు, నాలుగు పాదాలను చూద్దాము.

**సద్వస్తుని ప్రాప్తతదాత్మభావా**
**నిష్ఠైవ సద్దర్శనమిత్యవేహి**

ముందు శ్లోకంలో రమణమహర్షి అహంకార విచారణ చేస్తే అహంకారానికి అధిష్ఠానమైన జ్ఞానం పొందుతారు అన్నారు. అధిష్ఠానం ఎవరు? సత్‌బ్రహ్మ. అందువల్ల బ్రహ్మజ్ఞానం అంటే బ్రహ్మనిష్ఠ అని చెప్పవచ్చు. దీన్నే సద్దర్శనం అంటారు. మొదలు, చివరా కలిపితే,

**అహంకారవిచారణ = సద్దర్శనం.**

సద్దర్శనం అంటే సత్ గురించి జ్ఞానం అని చూశాము. సత్ అంటే ఏమిటి? బ్రహ్మ. బ్రహ్మ ఎవరు? అహంకారానికి అధిష్ఠానం. అందువల్ల అహంకార విచారణ చేస్తే అది అహంకార అధిష్ఠాన సత్‌బ్రహ్మ జ్ఞానానికి దారితీయాలి. దాన్ని సద్దర్శనం అంటారు. మనం చూస్తున్న ఈ గ్రంథం పేరే అది.

ఈ పదాలను చాలా జాగ్రత్తగా వాడాలి. వచ్చిన చిక్కేమిటంటే సద్దర్శనం, బ్రహ్మజ్ఞానం అనగానే బ్రహ్మను ఆబ్జెక్టుగా జ్ఞానం పొందాలి అనుకుంటారు. మామూలుగా అలాగే వాడతాము పదాలను. అణువు గురించిన జ్ఞానాన్ని అణుజ్ఞానం అంటాము. అణుజ్ఞానంలో తెలుసుకునే నేను సబ్జెక్టును; అణువు, నేను తెలుసుకోబడే వస్తువు. అందువల్ల ఇందులో సబ్జెక్ట్–ఆబ్జెక్ట్ విభజన స్పష్టంగా ఉంది.

ఇదే సూత్రాన్ని అన్వయించి, బ్రహ్మజ్ఞానం అంటే నేను సబ్జెక్టు, తెలుసుకోబడే బ్రహ్మ ఆబ్జెక్టు అని పొరపాటు పడే అవకాశం ఉంది. బ్రహ్మజ్ఞానం పొందితే బ్రహ్మను ఎదురుగా

చూస్తాను, **బ్రహ్మ సాక్షాత్కారం** అవుతుంది, **బ్రహ్మ అనుభవం** కలుగుతుందని భావిస్తారు. ఈ అపోహను తొలగించటానికి రమణులవారు బ్రహ్మజ్ఞానం అంటే **బ్రహ్మనిష్ఠ**లో ఉండటం అంటున్నారు. బ్రహ్మను తెలుసుకోవటం అంటే **బ్రహ్మలో నెలకొని ఉండటం**.

అందువల్ల సద్దర్శనం అంటే నిష్ఠ. నిష్ఠ అంటే నెలకొని ఉండటం. నిశ్చయేన అవస్థానం నిష్ఠా. బ్రహ్మలో నెలకొని ఉండటం. నిష్ఠలోని ని అంటే నిశ్చయేన – ఏమాత్రం సందేహం లేకుండా బ్రహ్మలో నెలకొని ఉండటం. **సద్వస్తు** అన్నారు ముందు శ్లోకంలో. సద్వస్తు అంటే సత్ అనే వస్తువు. వేదాంతపరిభాషలో వస్తువు అంటే సత్యం. మామూలుగా వస్తువు అంటే ఏదో ఒక వస్తువు. కాని వేదాంతపరిభాషలో వస్తువు అంటే శుద్ధ ఉనికి ఉన్న ఏకైక వస్తువు.

**వసతి సర్వదా అభేదతయా త్రికాలే ఽ పి తిష్ఠతి ఇతి వస్తు**

వస్ ధాతునుంచి వసతి వచ్చింది. ఉనికి ఉన్నది. వస్తు అంటే ఎప్పుడూ ఉండేది. తక్కినవన్నీ జ్ఞానం పొందితే మిథ్యగా కొట్టుకుపోతాయి. బ్రహ్మ మాత్రమే ఎప్పటికీ ఉంటాడు. అందువల్ల దీన్ని వస్తు అంటారు. **త్రికాలేపి తిష్ఠతి ఇతి వస్తు.** అందువల్ల సత్ వస్తు అంటే బ్రహ్మ. సత్ వస్తుని అంటే ఆ సత్ బ్రహ్మలో నిష్ఠ అంటే నెలకొని ఉండటం. కాని అలా అంటే ఒక సమస్య తీర్చబోయి, ఇంకొక సమస్యని సృష్టించినట్టు అవుతోంది. సత్ దర్శనం లేదా బ్రహ్మ దర్శనం అంటే బ్రహ్మను ఆబ్జెక్టుగా భావిస్తారని, అది తప్పించటానికి బ్రహ్మలో నెలకొని ఉండాలని వాడాము. కాని అది ఇంకొక కొత్త సమస్యకు దారితీస్తుంది.

ఏమిటది? నేను ఎక్కడో ఉన్నాను, బ్రహ్మ కింద ఒక కార్పెట్ లాగానో, కుర్చీలాగానో ఉంది, వెళ్ళి దానిలో కూర్చోవాలి అనుకుంటారు. బ్రహ్మ అధిష్ఠానం అంటే జీవాత్మ జగత్తు నుంచి విడివడి, బాగా కిందికి వెళ్ళాలి అనుకుంటారు. దీన్ని డౌన్ డీప్ ఫిలాసఫీ (down deep philosophy) అంటారు. ఎందుకంటే బ్రహ్మ నాలో చాలా లోతుగా ఉన్నాడు. వెళ్ళి ఆ బ్రహ్మమీద కూర్చోవాలి అనుకుంటారు. ఈ పొరపాటు ఉదయించే అవకాశం ఉంది. అందువల్ల బ్రహ్మజ్ఞానం, బ్రహ్మనిష్ఠ పదాలను చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. అందువల్ల రమణమహర్షి ఈ విధంగా నిర్వచిస్తున్నారు.

**ప్రాప్తతదాత్మభావా** – నిష్ఠ అంటే నెలకొని ఉండటం అని చూశాము. ఎందులో? ఒక భావనలో! ఎటువంటి భావన? జ్ఞానం అనే భావనలో. ఎటువంటి జ్ఞానం? తదాత్మా – తత్ అంటే తత్ బ్రహ్మ లేదా సద్వస్తు. ఆత్మ అంటే? నేను. అందువల్ల తదాత్మ అంటే ఆ బ్రహ్మను నేను. ఆ బ్రహ్మ ఎక్కడో లోతుగా లేదు, నేను వెళ్ళి కూర్చోవటానికి. బ్రహ్మ నాకు అనుభవంలోకి వచ్చేందుకు నా ఎదురుగా ఉన్న వస్తువు కాదు. బ్రహ్మ నాలోనూ లేదు, నా ఎదురుగానూ లేదు. మరి బ్రహ్మ ఎవరు? నేనే ఆ బ్రహ్మను.

తదాత్మ– తత్ ఏవ ఆత్మా. బ్రహ్మైవ అహం ఇతి భావన. భావన అంటే జ్ఞానం, అర్థం చేసుకోవటం. శ్రమ లేకుండా జ్ఞానంలో నెలకొని ఉండటం.

భావా – అంటే భావన. భావన అంటే దర్శనం, ఎరుక.

ప్రాప్త – అంటే అహంకారవిచారణ ద్వారా పొందిన జ్ఞానం.

**సద్దర్శనం** నిర్వచనం – సత్ బ్రహ్మలో నెలకొని ఉండటం. నెలకొని ఉండటం అంటే ఆత్మలో అహంకారవిచారణ ద్వారా నేను బ్రహ్మను అనే జ్ఞానంలో నిలబడటం.

జ్ఞానభావనకీ, అనుభవానికీ మధ్య చాలా భేదం ఉంది. ఒక అనుభవాన్ని ఇంకొక అనుభవం వచ్చి పారద్రోలుతుంది. సుఖ అనుభవాన్ని దుఃఖ అనుభవం పారద్రోలుతుంది; సూర్య అనుభవాన్ని చంద్ర అనుభవం పారద్రోలుతుంది. అందువల్ల ఏ అనుభవమూ శాశ్వతం కాదు. ఇంకో అనుభవం ఏర్పడేదాకానే ఇది ఉంటుంది.

జ్ఞానం విషయం అలా కాదు. ఎన్ని అనుభవాలు ఎదురైనా, మీలో జ్ఞానం స్థిరంగానే ఉంటుంది. మీరు ఎంత ఘోరున విలపిస్తున్నా, మీ ఫోన్ నెంబరును మర్చిపోరు. మీరు ఆనందంలో తేలుతున్నా మీ ఫోన్ నెంబరును మర్చిపోరు. అంటే మీరు ఏడుస్తున్నా, నవ్వుతున్నా ఫోన్ నెంబరును చెప్పగలుగుతారు. అంటే అనుభవం జ్ఞానాన్ని పారద్రోలలేదు. అందువల్లనే జ్ఞానం పొందటానికి పాటుపడతారు.

అంతేకాదు, ఒకసారి జ్ఞానం పొందాక, ఇంక దాన్నే వల్లెవేస్తూ కూర్చోరు. మీ ఫోన్ నెంబరు ఎప్పుడు గుర్తుంటుంది? ఎప్పుడూ గుర్తుంటుంది. నిజానికి మీరు ఎదురు ప్రశ్నించవచ్చు. ఎప్పుడు గుర్తుండదు అని. అలా ఎలా గుర్తుంటుంది? మీరు నిరంతరం మీ ఫోన్ నెంబరు 73180 45989 అని చెప్పుకుంటూ ఉంటారా? లేదే! కాని ఎప్పుడడిగినా చెప్పగలరు. మరయితే ఈ నెంబరు గుర్తు ఉందో లేదో ఎలా తెలుస్తుంది? అది ఎప్పుడు కావాలంటే అప్పుడు మీకు అందుబాటులో ఉంటే, మీకు గుర్తున్నట్టు అర్థం. అందుబాటులో ఉండబట్టే అడగగానే చెప్పగలిగారు.

ఇంకొక ఉదాహరణ మీ చిరునామా. మీ చిరునామా ఏమిటి అంటే ఆలోచించి చెబుతాను అంటారా? అది బాగా గుర్తుంటుంది. అలాగని రోజూ వల్లెవేసుకోరు. అది బాగా గుర్తుంటుంది కాబట్టి, ఇంక పదేపదే తలుచుకోనవసరం లేదు. ఇదే సూత్రం జ్ఞానికి కూడా వర్తిస్తుంది. జ్ఞాని నిరంతరం అహం బ్రహ్మ అస్మి అని చెప్పుకుంటూ కూర్చోడు. కొంతమంది అలా చేసేవారు లేకపోలేదు.

ఎవరికో ఓం నమశ్శివాయ నామజపం నేర్పించి దాన్ని ఎప్పుడూ జపిస్తూ ఉండు అన్నారుట. అందువల్ల అతను ఏం మాట్లాడినా దానికి ఓం నమశ్శివాయ కలుపుతూ ఉండేవాడు. ఎప్పుడొచ్చారు ఓం నమశ్శివాయ? కాఫీ తాగుతారా ఓం నమశ్శివాయ – ఇలా సాగుతుంది.

నిజానికి నిశ్చయజ్ఞానం పొందాక, దాన్ని పదేపదే చెప్పుకుంటూ కూర్చోనవసరం లేదు. అది అందుబాటులో ఉంటే చాలు. అందువల్ల నిష్ఠ అంటే అర్థం చేసుకోవటం.

**పశ్యన్ శృణ్వన్ స్పృశన్ జిఘ్రన్నశ్నన్ గచ్ఛన్ స్వపన్ శ్వసన్ ॥** – గీత

ఏం చేస్తున్నా నేను బ్రహ్మను అనే జ్ఞానంలో నెలకొని ఉండటం. నేను భర్తను, నేను తండ్రిని, నేను ఉద్యోగిని అనే అనాత్మకు సంబంధించిన భావనలు అప్రయత్నంగా ఎలా దూసుకువస్తాయో అంత అప్రయత్నంగా నేను బ్రహ్మను అనే జ్ఞానం కూడా దూసుకురావాలి. కాకపోతే ఈ జ్ఞానాన్ని ఎప్పుడు ప్రకటించాలో తెలియాలి. ఏదైనా ఊరు వెళ్ళటానికి టికెట్టు కొనేటప్పుడు పేరు అంటే అహం బ్రహ్మ అస్మి అనీ, పుట్టినతేదీకి అనాది అనీ, చిరునామా అంటే అనంతం అనీ పూరించకూడదు. అప్పుడు మిమ్మల్ని వింతగా చూస్తారు. అక్కడ అనాత్మ వివరాలే ఇవ్వాలి.

బ్రహ్మనిష్ఠ అంటే జ్ఞాననిష్ఠ. జ్ఞాననిష్ఠ అంటే బ్రహ్మ బాహ్యంగా దొరికే వస్తువు కాదు, ఆంతరంగా నాలో అట్టడుగున ఉన్న అధిష్ఠానము కాదు, నేనే బ్రహ్మను అని అర్థం చేసుకోవటం. ఎవరంటున్నారు అలా? రమణమహర్షి అంటున్నారు. **ప్రాప్తతదాత్మభావా**. దాన్నే సోఽహం భావా అంటారు. దాన్నే **సద్దర్శనం** అంటారు. దాన్ని అహంకారవిచారణ ద్వారా పొందాలి. అంటే జ్ఞానమార్గం ద్వారా పొందాలి.

ఇప్పుడొక సందేహం రావచ్చు. జ్ఞానమార్గం తేలికా, కష్టమా? దీనికి జవాబు మొదటి రెండు పాదాల్లో దొరుకుతుంది.

**భవన్తు సద్దర్శన సాధనాని**
**పరస్య నామాకృతిభిః సపర్యాః**

జ్ఞానమార్గం తేలికా, కష్టమా? ఏది చూసినా మనుష్యులకు అయోమయం కలుగుతుంది. జీవితమంతా అయోమయమే అయోమయం. అన్ని సమస్యలలాగే దీనికి కూడా రెండు జవాబులు ఇస్తారు. ఆత్మజ్ఞానం అబ్బో చాలా కష్టం అంటారు కొందరు. లేదు, చాలా తేలిక అంటారు మరికొందరు. కర్మ చేయనవసరం లేదు, భక్తి చూపనవసరం లేదు, ఉపాసన చేయనవసరం లేదు, జ్ఞానం పొందితే చాలు. జ్ఞానం పొందటం చాలా తేలిక అంటారు వారు.

పోనీ శాస్త్రంలో దీనికి జవాబు దొరుకుతుందా అంటే శాస్త్రం కూడా అయోమయంలో పడవేస్తుంది. జ్ఞానమార్గం చాలా కష్టం ఉంటుంది ఒకచోట.

**క్షురస్య ధారా నిశితా దురత్యయా** – కఠ

జ్ఞానమార్గానికి రావటమంటే పదునైన క్షురకుని కత్తిమీద నడవటం అంటుంది కఠోపనిషత్తు.

**క్లేశో౽ ధికతరస్తేషామ్ అవ్యక్తాసక్తచేతసామ్ ।**
**అవ్యక్తా హి గతిర్దుఃఖం దేహవద్భిరవాప్యతే ॥** – గీత

కృష్ణపరమాత్మ కూడా పన్నెండవ అధ్యాయంలో జ్ఞానమార్గం చాలా కష్టమని చెప్పాడు. ఇంకో సందర్భంలో తేలిక అన్నాడు.

**రాజవిద్యా రాజగుహ్యం పవిత్రమిదముత్తమమ్ ।**
**ప్రత్యక్షావగమం ధర్మ్యం సుసుఖం కర్తుమవ్యయమ్ ॥** – గీత

శాస్త్రం నేర్చుకోవటం సుసూక్ష్మం, చాలా తేలిక అని చెప్పాడు. ఆ విధంగా శాస్త్రంలో ఆత్మవిద్య లేదా బ్రహ్మవిద్య చాలా తేలిక అనీ వస్తుంది, కష్టమనీ వస్తుంది. అయితే ఆత్మవిద్య తేలికా, కష్టమా? ఎవరైనా ఈ ప్రశ్న మిమ్మల్ని అడిగితే, మీరు వెంటనే సమాధానం చెప్పకూడదు; సమాధానం చెప్పలేక కాదు, ప్రశ్న స్పష్టంగా లేనందువల్ల.

అందువల్ల మీరు జవాబు చెప్పకుండా ఎదురు ప్రశ్నించాలి. తేలికా, కష్టమా అని ప్రశ్నించేది ఎవరిని? ఏ విషయమన్నా తీసుకోండి, అది తేలికా, కష్టమా అంటే వ్యక్తినిబట్టి మారుతుంది. ఎవరైనా లిఫ్ట్ లేని అపార్ట్‌మెంట్‌లో మూడో అంతస్తులో ఇల్లు తీసుకుంటే, అలా ఎలా తీసుకున్నారు అని మీరు ప్రశ్నించవచ్చు. అది మీకు కష్టం కావచ్చేమో కాని వారు ఛెంగు ఛెంగున మూడో అంతస్తునుంచి దిగేయవచ్చు. కొంతమందికి మొదటి అంతస్తుకి ఎక్కటమే చాలా కష్టం. కొంతమంది బాత్రూమ్‌లో లేవటానికి వీలుగా హ్యాండిల్ పెట్టుకుంటారు. అంటే వారికి లేవటమే చాలా కష్టం. అలాగే కింద కూర్చోవటం కష్టమా, తేలికా అంటే ఎదుటివ్యక్తినిబట్టి ఉంటుంది దానికి జవాబు.

కొంతమందికి వాకింగ్‌కి వెళ్ళటం అసాధ్యం. కొంతమంది వాకింగ్ చేయకుండా ఉండలేరు. కొంతమంది ట్రెక్కింగ్‌కి ఉత్సాహంగా వెళతారు. మరికొంతమంది మెట్లే ఎక్కలేరు. నేపాల్ దేశానికి చెందిన షెర్పా ఎవరెస్ట్ శిఖరాన్ని తొమ్మిదిసార్లు ఎక్కాడుట. ఇంకోసారి ఎక్కి రికార్డ్ బ్రేక్ చేయాలనుకుంటున్నాడు. అంటే అందరికీ అతి కష్టమైన ట్రెక్కింగ్ అతనికి వెన్నతో పెట్టిన విద్య అయింది. అందువల్ల వేదాంతవిచారణ తేలికా, కష్టమా అనే ప్రశ్నకు సంసిద్ధమైన మనస్సు కలవానికి తేలిక; సంసిద్ధమైన మనస్సు లేనివానికి కష్టం.

సంసిద్ధమైన మనస్సు కలిగివుండటం అంటే ఏమిటి? సాధన చతుష్టయ సంపత్తి కలిగి ఉండటం. సాధన చతుష్టయ సంపత్తి అంటే వివేకం, వైరాగ్యం, తీవ్రముముక్షుత్వం, శమాది షట్కసంపత్తి. ఈ నాలుగూ బ్రహ్మాండంగా ఉండకపోయినా కొంతమేరకు ఉన్నా అతను అధికారి అవుతాడు. అంటే జ్ఞానయోగ్యతను పొందుతాడు. కాబట్టి జ్ఞానం కష్టమా, తేలికా అనే మన ప్రశ్నకు మళ్ళీ వస్తే జ్ఞానయోగ్యత ఉన్న వ్యక్తికి తేలిక; జ్ఞానయోగ్యత లేని వ్యక్తికి కష్టం.

మరొక ప్రశ్న. జ్ఞానయోగ్యత ఎంతమందికి ఉంటుంది? చాలా తక్కువ మందికి ఉంటుంది. 90% లేదా 95% లేదా 99% లేదా 99.9% మనుష్యులు జ్ఞానవిచారణకు అర్హులు కారు; అర్హత ఉన్నా రారు. ఎందుకంటే జ్ఞానయోగ్యత పొందాలంటే ముఖ్యమైన అర్హత వైరాగ్యం. అంటే రాగద్వేషాలకు అతీతంగా ఎదగటం.

**వీతరాగభయక్రోధాః** – గీత

**కామక్రోధ వియుక్తానామ్** – గీత

కృష్ణపరమాత్మ పదేపదే రాగం, భయం, క్రోధంనుంచి విడివడాలనీ, కామక్రోధాలనుంచి బయటపడాలనీ చెబుతాడు. కాని ఇది చాలా కష్టమని శాస్త్రానికి కూడా తెలుసు. మనకు తోటి మనుష్యులు అర్థం కారు కాని శాస్త్రానికి మనుష్యుల నాడి బాగానే తెలుసు. అందువల్లనే శాస్త్రం వేద అంతభాగంలో జ్ఞానసాధనను పెట్టింది. జ్ఞానకాండలో జ్ఞానయోగం వస్తుంది. దానిని వేదాంతం అనికూడా అంటారు. ఎందుకంటే అది వేద అంతభాగంలో వస్తుంది. ఒక సాధకుని ప్రయాణం ఇలా సాగాలి.

కర్మకాండ → ఉపాసనకాండ → జ్ఞానకాండ

ముందే జ్ఞానకాండకు వచ్చేయలేడు సాధకుడు. అలా రాగలడు అనిపిస్తే వేదమే ఉపనిషత్తులను ముందుకు తీసుకువచ్చి ఉండేది. అందువల్ల వేదాంతవిచారణ చాలా తేలిక అని చెప్పటంలో అర్థంలేదు.

పూజలు చేయనవసరం లేదు, ఆలయానికి వెళ్ళనవసరం లేదు, జ్ఞానం పొందనవసరం లేదు – ఇలా అనేక విషయాలు చెప్పి, కూర్చుని ధ్యానం చేయండి. నేనెవరు? నేనెవరు? ఇలా ధ్యానం చేస్తే, మీకు జవాబు వస్తుంది. దానికి రమణమహర్షే గొప్ప ఉదాహరణ అంటారు కొందరు. కాని అది సరియైన సలహా కాదు.

**న బుద్ధిభేదం జనయేత్** – గీత

అన్నాడు కృష్ణపరమాత్మ. మనుష్యులను అయోమయంలో పడవేయకండి. రమణమహర్షి ధ్యానంలో నేనెవరో తెలుసుకోలేదా అంటే ఆయన ప్రత్యేక ఋషి. ఆయన సాధారణ

నియమాలకు ఎక్సెప్షన్. ఎవ్విరి రూల్ హాజ్ ఏన్ ఎక్సెప్షన్ అని ఒక రూల్. మనం రూల్సు నేర్పించేటప్పుడు సాధారణ రూలు నేర్పించాలి కాని ఎక్సెప్షన్‌ని కాదు. రమణమహర్షిని చూపించి, మీరు విచారణ చేయనవసరం లేదు అంటే వారిని అయోమయంలో పడవేయటమే అవుతుంది. ఇలా జరుగుతుందని రమణమహర్షికే తెలిసి ఉంటుంది, అందువల్ల స్వయంగా ఆయనే ప్రతిసాధకుడు విచారణకు వచ్చేముందు, తక్కిన సాధనలు చేయాలి అని మొదటి రెండు పాదాల్లో చెబుతున్నారు.

సాధకుడు, అద్వైతానికి వచ్చేముందు పూజలు చేయవచ్చు, ద్వైతంలో ఉండవచ్చు, సగుణ బ్రహ్మను ఉపాసన చేయవచ్చు అంటారు. కాని దురదృష్టవశాత్తు చాలామంది ఈ సూచనను గ్రహించలేకపోయారు. నిజానికి సూచనప్రాయంగా కాదు, చాలా గట్టిగానే హెచ్చరిస్తున్నారు.

**సపర్యాః (భవంతు)** – సపర్యాః అంటే పూజలు. దీనికి రాకముందు పూజలు చేయవచ్చు అంటున్నారు.

వేదాంతం ప్రకారం ద్వైతం మిథ్య, పూజ మిథ్య అని తెలిసినా, శాస్త్రం ఫర్వాలేదు, పూజ చేయండి మొదట్లో అంటుంది. మీ అహంకారం పండేవరకు ద్వైతంలో ఉండండి అంటుంది శాస్త్రం. పచ్చికాయను చెట్టునుంచి కోయటానికి ప్రయత్నిస్తే అంత తేలికగా కోయలేరు. ఆ కోసే చోట ఒక ద్రవం కారటం కూడా చూస్తారు. అంటే ఆ కాయ హృదయం ద్రవిస్తోందన్నమాట. అది అప్పుడే చెట్టునుంచి విడిపోవటానికి సిద్ధంగా లేదు. కాని అదే కాయ పండాక, దానంతట అదే చెట్టునుంచి రాలిపడుతుంది. అది పండటానికి చెట్టు అండ కావాలి. కాని పండాక, మీరు అడక్కపోయినా అది రాలిపోతుంది.

అహంకారం విషయం కూడా అంతే. అహంకారమనే పండు పండితే, ద్వైతంమీద ఉన్న ఆకర్షణ మీకు తెలియకుండానే పోతుంది. పిల్లలను గమనిస్తే ఈ విషయం అర్థమవుతుంది. చిన్నప్పుడు చాలా బొమ్మలతో ఆడుకునేవారు కాస్తా, వారికి తెలియకుండానే ఒక వయస్సు వచ్చేసరికి బొమ్మలమీద వ్యామోహం పోతుంది. అలాగే ముందు పూజలు, వ్రతాలతో మొదలుపెట్టినా వారికి తెలియకుండానే భక్తినుంచి పైకి ఎదుగుతారు. ఎవరిదాకానో ఎందుకు, రమణులవారే అరుణాచలాధీశుని అనుంగు భక్తులు.

సపర్యాః భవంతు – సపర్యాః భవంతు అంటే పూజలు మొదట్లోనే మాననవసరం లేదు. ఎవరిమీద పూజ?

**పరస్య** – పరబ్రహ్మమీద పూజ. సర్వవ్యాపకమైన బ్రహ్మమీద ఎలా పూజ చేస్తారు?

**అశబ్దమస్పర్శమరూపమవ్యయమ్** – కఠ

**నామాకృతిభిః** – నిర్గుణబ్రహ్మమీద కాదు. నిర్గుణబ్రహ్మమీద పూజ చేయలేరు. సగుణ నామరూపసహిత బ్రహ్మమీద చేయాలి. అంటే మీ ఇష్టదేవతమీద. రాముడు, కృష్ణుడు, దేవి, గణేశుడు, వెంకటాచలపతి – ఏ నామం అయినా, ఏ ఆకృతి (రూపం) అయినా పూజలు చేయండి. రమణమహర్షి ఉదాహరణ చెప్పకండి. ఆయన ఎక్సెప్షన్.

రామానుజం మాథ్స్‌లో మేధావి. ఆయన స్కూలు, కాలేజీలకు వెళ్ళకుండానే మాథ్స్‌లో దిట్ట అయ్యాడు. ఆయన స్కూలు, కాలేజీలకు వెళ్ళకుండా నేర్చుకున్నాడు కాబట్టి సూళ్ళు, కాలేజీలు మూసివేయండి అంటే కుదురుతుందా? మేధావిని ఎలా ఉదాహరణగా తీసుకుంటాము? రమణులవారు ధ్యానం ద్వారా సాధించారు కాబట్టి అందరికీ తేలికగా అవుతుందని కొందరి భావన. కాని రమణులవారే పూజలు మానకండి అంటున్నారు. పైగా పూజలు ఉపయోగపడతాయి అంటున్నారు. దేనికి?

**సద్దర్శన సాధనాని** – సగుణ పూజలు నిర్గుణజ్ఞానం పొందటానికి సాధనలు. జ్ఞానయోగ్యతా ప్రాప్తిని ఇస్తాయి.

అదే సమయంలో, ఇంకొక హెచ్చరిక కూడా చేస్తున్నారు రమణులవారు. ఇది చాలా ముఖ్యమైన హెచ్చరిక కూడా. ద్వైతపూజ, సగుణ పూజ ముఖ్యమైన సాధన. కాని దీన్ని సాధ్యంగా తీసుకోకూడదు. మొదట్లో చూశాము, తక్కిన దార్శనికులు ద్వైతంతో మొదలుపెట్టి, ద్వైతంతోనే ముగుస్తారని. అలా ఆగిపోకూడదు అంటున్నారు రమణమహర్షి. పూజ చేసి, పూజ ద్వారా పూజకు అతీతంగా ఎదగాలి. ద్వైతాన్ని ఉపయోగించి, ద్వైతం ద్వారా అద్వైతానికి ఎదగాలి. కర్మ చేసి, కర్మ ద్వారా కర్మకు అతీతంగా ఎదగాలి. అందువల్ల పూజ, కర్మ, ద్వైతం సద్దర్శన సాధనాలు మాత్రమే. అదే సాధ్యం (అంతిమ లక్ష్యం) కాకూడదు.

పూజకు, విచారణకు మధ్య భేదం ఏమిటి? పూజ సాధనే, విచారణ కూడా సాధనే. పూజ చేస్తే విచారణ చేయటానికి అర్హత పొందుతారు. అంటే పూజ సాధన, జ్ఞానయోగ్యత సాధ్యం. జ్ఞానయోగ్యత పొందితే విచారణ చేయటానికి అర్హత పొందుతారు. అంటే అప్పుడు విచారణ సాధన, జ్ఞానం, మోక్షం సాధ్యం అవుతాయి. ఇంకో విధంగా చెప్పాలంటే కర్మయోగం జ్ఞానయోగానికి దారితీస్తే, జ్ఞానయోగం మోక్షానికి దారితీస్తుంది. అందువల్ల కర్మయోగాన్ని సహకారీ సాధన లేకపోతే పరంపరా సాధన అనీ, జ్ఞానయోగాన్ని సాక్షాత్ సాధన అనీ అంటారు. అందువల్ల దీన్ని క్రమసముచ్చయం అంటారు.

సాధకుని పరంగా చెపితే, సాధకుడు కర్మచేసి చిత్తశుద్ధి పొంది, జ్ఞానానికి వచ్చి జ్ఞానం పొంది మోక్షం పొందాలి. అందువల్ల కర్మ చేయాలి, దానికి అతీతంగా ఎదగాలి. విచారణ చేయాలి, మోక్షం పొందాలి. ఈ దశలన్నీ ఈ శ్లోకంలో చూశాము.

అలా పక్కకి వెళ్ళి చెప్పిన ఈ శ్లోకంలో కొన్ని అపోహలను పారద్రోలారు రమణులవారు. జ్ఞాననిష్ఠలో ఉండటం అంటే, నేను బ్రహ్మను అనే జ్ఞానంలో నిలబడటం.

**కర్మకాండ లేనిదే జ్ఞానకాండ అసాధ్యం.**
**జ్ఞానకాండకు రానిదే కర్మకాండ అసంపూర్ణం.**

**శ్లోకం 11**

**ద్వంద్వాని సర్వాణ్యఖిలాస్త్రిపుట్యః**
**కించిత్సమాశ్రిత్య విభాంతి వస్తు ।**
**తన్మార్గణే స్యాద్గలితం సమస్తం**
**న పశ్యతాం సచ్చలనం కదాఽపి॥**

**ప్రతిపదార్థం:** సర్వాణి = అన్ని రకాల; ద్వంద్వాని = ద్వంద్వాలు; అఖిలా = అన్ని రకాల; త్రిపుట్యః = త్రిపుటులు; కించిత్ = ఒకానొక; వస్తు = ఆత్మవస్తువును; ఆశ్రిత్యా = ఆశ్రయించి; విభాంతి = ఉన్నాయి; తన్మార్గణే = అధిష్ఠాన వస్తువిచారణ చేస్తే; సమస్తం = అన్నీ; గలితం స్యాత్ = లయమవుతాయి; సతు పశ్యతామ్ = సద్వస్తు జ్ఞానం పొందాక; చలనం = సంసారంలో పడే అవకాశం; న కదాఽపి = ఎంత మాత్రం లేదు.

**తాత్పర్యం:** అన్ని రకాల ద్వంద్వాలు, అన్ని రకాల త్రిపుటులు, ఒకానొక ఆత్మవస్తువును ఆశ్రయించి ఉన్నాయి. అధిష్ఠాన వస్తువిచారణ చేస్తే అన్నీ లయమవుతాయి. సద్వస్తు జ్ఞానం పొందాక సంసారంలో పడే అవకాశం ఎంతమాత్రం లేదు.

**వివరణ**: మళ్ళీ ఈ శ్లోకంలో మన అంశానికి వెనక్కి వస్తాము. మన అంశం ఏమిటి? ఆత్మ విచారణ. మనం అనుభవించే ఈ జగత్తు మొత్తం నామరూపాలుగా ప్రకటితమవుతున్న బ్రహ్మే. ఈ నామరూపాత్మక జగత్తును ఒకసారి ద్వంద్వంగా చూస్తాము – అంటే సబ్జెక్ట్, ఆబ్జెక్ట్‌గా లేదా ప్రమాతా–ప్రమేయంగా. ఇంకోసారి త్రిపుటిగా చూస్తాము – జీవ, జగత్, ఈశ్వరులుగా. ఎలా చూసినా ఉన్నదొకటే బ్రహ్మ. తక్కినవన్నీ మిథ్యానామరూపాలు మాత్రమే.

జగత్తు = బ్రహ్మ + నామరూపాలు.

ఇందులో బ్రహ్మ సత్యం, నామరూపాలు మిథ్య. అందువల్ల ఈ జగత్తు మొత్తం సత్యం బ్రహ్మ + మిథ్యా నామరూపాల మేలుకలయిక. అంటే **సత్యానృతమిథునీకరణమ్.**

అనృతం అంటే మిథ్య; మిథునీకరణం అంటే కలయిక. అందువల్ల ఈ జగత్తంతా సత్యం, మిథ్యల కలయిక.

సత్యానృతే మిథునీకృత్య '**అహమిదమ్**', '**మమేదమ్**' ఇతి నైసర్గికోऽయం లోకవ్యవహారః
– అధ్యాసభాష్యం

జగత్తు అంతా బ్రహ్మ + నామరూపాలు అని అంటే అర్థమేమిటి? మీరు శుద్ధబ్రహ్మను అనుభవించలేరు; శుద్ధ నామరూపాలనూ అనుభవించలేరు. రెండూ కలిస్తేనే అనుభవంలోకి వస్తాయి. నామరూపాలు తీసేస్తే శుద్ధబ్రహ్మ కనిపిస్తాడు కదా అనుకుంటే పొరపాటు. శుద్ధబ్రహ్మ అనుభవంలోకి వచ్చే ఆబ్జెక్టు కాదు.

**ఎవ్వర్ ది ఎక్స్‌పీరియన్సర్ నెవ్వర్ ది ఎక్స్‌పీరియన్సడ్**
**అనుభవించే నువ్వే అది ఎప్పటికీ, అనుభవించబడే వస్తువు కాదు ఎన్నటికీ**

నిన్ను నువ్వు అనుభవించలేవు. పోనీ నామరూపాలను విడిగా చూద్దామా అంటే, బ్రహ్మ లేకుండా నామరూపాలకు విడిగా ఉనికే లేదు. మట్టి లేకుండా కుండకి విడిగా ఉనికి లేనట్టుగా, బ్రహ్మ అనే కారణం లేకుండా నామరూపాలనే జగత్తు లేదు.

అందువల్ల మనం శుద్ధ సత్‌ను అనుభవించలేము, శుద్ధ మిథ్యను అనుభవించలేము. మరి ఏమిటి అనుభవిస్తున్నాము? సత్యం + మిథ్యల మేలుకలయికను అనుభవిస్తున్నాము. జగత్తంతా ఈ రెండింటి మేలుకలయికే అయితే వ్యష్టి నేను, ఉత్తమ పురుషుడనైన నేను కూడా రెండింటి మేలుకలయికే. ఇక్కడ పేర్లు ఆత్మ, అహంకారం. అంటే నేను సత్య ఆత్మ + మిథ్య అహంకారాల మేలు కలయికను. నేను కూడా శుద్ధ సత్ కాదు, శుద్ధ మిథ్య కూడా కాదు.

అందువల్ల నా గురించిన విచారణ చేయాలంటే, ఆత్మ, అహంకారాల మేలుకలయిక అయిన నా గురించి విచారణ చేయాలి. అందువల్ల శాస్త్రం విచారణకన్నా వివేకం పదం వాడుతుంది. జగత్తు పరంగా అయినా, వ్యష్టిపరంగానైనా, ఆత్మ అన్నాతల వివేకం చేయాలి అంటుంది. వివేకం చూపాలి అంటేనే మనం పొరపాటు పడుతున్నాము, ఇప్పుడు ఆత్మవిచారణ చేస్తే ఆత్మ సత్యం, అహంకారం మిథ్య అని తెలుస్తుంది అని చెబుతున్నాము. వివేకం చూపకముందు ఏది సత్యమో, ఏది మిథ్యో తెలియదు. వేదాంతానికి రాకముందు అహంకారం సత్యం అనుకుంటూ వచ్చాము. దాన్ని మన జీవితచరిత్రకు హీరోగా చూస్తున్నాము ఈ సద్దర్శనంలో. అందువల్ల వివేకం అంటే ఏది సత్యమో, ఏది మిథ్యో తెలుసుకోవాలి.

సత్యం అంశం ఆత్మ; మిథ్యా అంశం అహంకారం. ఈ ఆత్మా–అహంకార వివేకాన్నే నా గురించిన విచారణ అంటారు. రెండు అంశాలు ఉన్నాయి కాబట్టి ఈ విచారణకు

ఏ పేరైనా పెట్టవచ్చు. అహంకారపరంగా చేస్తే అహంకార విచారణ అనవచ్చు; ఆత్మపరంగా చేస్తే ఆత్మ విచారణ అనవచ్చు. ఈ రెండింటిలో ఏది సరియైనది? నేను అంశద్వయం కాబట్టి ఈ రెండింటిలో ఏదైనా వాడవచ్చు. తప్పులేదు.

రెండింటిలో ఏది మెరుగైన పదం? ఏ విచారణ చేస్తే, మన జ్ఞానం మరింత ప్రయోజనకరంగా ఉంటుంది? దీని గురించి ఇంతగా ఆలోచించటం అవసరమా అనిపించవచ్చు మీకు. కాని ఎలా విచారణ చేయాలో కూడా తెలియాలి. దాన్నిబట్టి పేరు నిర్ణయించాలి. అహంకార విచారణ పదం కూడా వాడవచ్చు, ఫర్వాలేదు. కాని ఈ రెండింటిలో, ఆత్మ విచారణ పదం సరిగ్గా సరిపోతుంది. ఆత్మ = బ్రహ్మ అని మర్చిపోకూడదు.

**అథాతో బ్రహ్మజిజ్ఞాసా** – బ్రహ్మసూత్రములు, సూత్రం 1

వ్యాసాచార్యులవారు బ్రహ్మవిచారణ చేయాలి అని మొదలుపెడతారు తన బ్రహ్మసూత్రములను. జిజ్ఞాసా అంటే విచారణ.

ఎందుకు అహంకారవిచారణకన్నా ఆత్మవిచారణ మెరుగైన పదం అంటున్నామో, దానికి రెండు కారణాలు చెప్పవచ్చు.

1. **మిథ్యా విచారణవల్ల లాభం లేదు** – అహంకార విచారణ అంటే మిథ్యా విచారణ. నిజానికి మిథ్యా విచారణ చేస్తే ఎక్కడకు చేరుతామో అర్థం కాదు. మిథ్య అంటేనే అర్థం కానిదని అర్థం.

**సత్ అసద్భ్యామ్ అనిర్వచనీయం మిథ్యా**

ఇది సత్యం అనీ చెప్పలేము, అసత్యం అనీ చెప్పలేము. దాన్ని నిర్వచించలేము. ఉదాహరణకు స్వప్నప్రపంచం. అది సత్యమా అంటే మిథ్య అంటాము, లేవగానే ఉండదు కాబట్టి. పోనీ మిథ్య అందామా అంటే స్వప్నంలో ఉన్నంతసేపూ అది సత్యం. అందువల్ల మిథ్య. అర్థంకానిదాని లోతులు కొలిచినకొద్దీ, అయోమయంలో పడతాము. బాహ్యవస్తువుల నుంచి సూక్ష్మవస్తువులు, సూక్ష్మవస్తువులనుంచి అత్యంత సూక్ష్మవస్తువులలోకి వెళ్ళినకొద్దీ ఎక్కడా తేలము. అంతకంతకూ అగాథంలో పడిపోతాము. అందువల్ల శాస్త్రం ఎన్నడూ మిథ్యను శోధించకండి అంటుంది. మొదటి కారణం మిథ్యా విచారణవల్ల లాభం లేదు.

2. **మిథ్యను పెంచి పోషించేది సత్యం గురించిన అజ్ఞానం** – సత్యం గురించిన అజ్ఞానం, పొరపాటుకి దారితీస్తుంది. దీన్ని సరిగ్గా అర్థం చేసుకోవటానికి స్వయంగా గౌడపాదాచార్యుల వారే, తన మాండూక్య కారికల్లో రజ్జుసర్పభ్రాంతిని వివరిస్తారు. తేలికగా చెప్పాలంటే తాడుని చూసి పాముగా పొరపాటు పడతారు. అక్కడ ఉన్నది తాడు. ఆ జ్ఞానం లేదు.

అంటే తాడు అజ్ఞానం, అది పాము అనే పొరపాటుకి దారితీసింది. సాంకేతిక పరిభాషలో చెప్పాలంటే తాడు అధిష్ఠానం, పాము అధ్యాస. అంటే సత్యం లేకుండా మిథ్యకు అవకాశం లేదు. అక్కడ తాడు లేకపోతే పాము అనే పొరపాటుకి ఆస్కారం లేదు.

ఇప్పుడు ఈ పొరపాటును ఎలా ఎదుర్కోవాలి? పాము గురించి విచారణ చేస్తూ కూర్చుంటే లాభం లేదు. ఈ పాము గుడ్లు పెట్టే పామా, పాముపిల్లని పుట్టించే పామా అని విచారణ చేస్తే ఏమైనా అర్థం ఉందా? అక్కడ పాము ఉంటే కదా, ఆ విచారణ చేయటానికి. పాము లేదని ఎలా తెలుస్తుంది? తాడు గురించి తెలుసుకోవాలి. అధిష్ఠానజ్ఞానం పొందాలి. అక్కడ ఉన్నది తాడు అనే జ్ఞానం కలిగితే, తాడు గురించిన అజ్ఞానం తొలుగుతుంది. తాడు గురించిన అజ్ఞానం తొలగితే దానివల్ల ఏర్పడిన పొరపాటు దానంతట అదే మాయమవుతుంది. అంటే అధ్యాస పోతుంది. అందువల్ల మిథ్యను విచారించి లాభం లేదు, దాని అధిష్ఠానం గురించి తెలుసుకోవాలి. అందువల్ల

తాడు విచారణ → తాడు జ్ఞానం → తాడు అజ్ఞాన నాశనం → పాము అనే పొరపాటు నాశనం.

దీన్ని తాడు పాము అంటారు. ఇది అసలు పాము కాదు, ఇది తాడు అజ్ఞానంవల్ల ఏర్పడింది.

ఇప్పుడు తాడు తీసి ఆత్మ, పాము తీసి అహంకారం పదాలు పెట్టి చూస్తే ఇవే దశలు మళ్ళీ వస్తాయి.

ఆత్మ విచారణ → ఆత్మ జ్ఞానం → ఆత్మ అజ్ఞాన నాశనం → అహంకార నాశనం

అహంకారం నాశనమయితే ద్వంద్వాలు ఉండవు, త్రిపుటి ఉండదు. ఇదంతా శంకరాచార్యులవారి అధ్యాసభాష్యంలో చూస్తాము. దాన్ని ఈ శ్లోకంలో చక్కగా కుదించారు రమణమహర్షి, ఇక్కడ, ఇందాక చూసినట్టుగా నా గురించిన విచారణకు ఆత్మవిచారణ పదం అక్షరాలా సరిపోతుంది అంటున్నారు.

**అహంకార అధిష్ఠానభూత ఆత్మవిచారః**

అహంకారానికి అధిష్ఠానమైన ఆత్మ గురించిన విచారణ.

ఇందులో దశలను చూద్దాము.

1. ఆత్మవిచారణ చేస్తే ఆత్మజ్ఞానం కలుగుతుంది
2. ఆత్మజ్ఞానం కలిగితే ఆత్మ అజ్ఞానం తొలుగుతుంది
3. ఆత్మ అజ్ఞానం తొలగితే, అజ్ఞానజన్య పొరపాటు తొలుగుతుంది.

పొరపాటుని అధ్యాస అంటారు. ఆత్మ అజ్ఞానంవల్ల నేను అహంకారాన్ని అని పొరపాటు పడుతున్నాము. ఆత్మ అజ్ఞానంనుంచి పుట్టిన పొరపాటుని అహంకారం అంటారు. అందువల్ల అసలు నేను గురించిన అజ్ఞానం, మిథ్యా నేనుకి దారితీసింది. మిథ్యా నేనుని అహంకారం అంటారు.

విచారణ ఆత్మజ్ఞానానికి, తద్వారా అజ్ఞాన నాశనానికీ, తద్వారా అధ్యాస నాశనానికీ దారితీస్తుంది. అధ్యాస అంటే ఇక్కడ అహంకారం కాబట్టి, అధ్యాస నాశనం అంటే అహంకార నాశనం. ఆత్మవిచారణ చేస్తే వచ్చే చివరి దశ అహంకార నాశనం. అహంకారాన్ని ప్రత్యక్షంగా ఎదుర్కోకుండా, ఆత్మజ్ఞానం ద్వారా ఎదుర్కొంటాము.

ఈ నేపథ్యంతో ఈ శ్లోకాన్ని చూద్దాము.

**ద్వంద్వాని సర్వాణి** – అన్ని రకాల ద్వంద్వాలు. అది సబ్జెక్ట్–ఆబ్జెక్ట్ జంట అవవచ్చు, మరేదైనా జంట అవవచ్చు.

**అఖిలాః త్రిపుట్యః** – అన్ని రకాల త్రిపుటులు – జీవ, జగత్, ఈశ్వరులు; జ్ఞాతా, జ్ఞానం జ్ఞేయం. ప్రమాతా–ప్రమేయం అంటే ద్వంద్వం. దానికి ప్రమాణం కలిపితే త్రిపుటి.

అటు ద్వంద్వాలకు, ఇటు త్రిపుటులకు కూడా మూలం అహంకారమే. అంతకుముందే చూసినట్టుగా నేను ఉంటేనే నువ్వు, అతను వస్తారు. అందువల్ల ఈ ద్వంద్వాలు, ఈ త్రిపుటులు కూడా, తాడు–పాములాగా అధ్యాసే.

**సమాశ్రిత్య విభాంతి** – ఇవన్నీ వాటి అధిష్ఠానాన్ని ఆశ్రయించి ప్రకాశిస్తున్నాయి. ఇవి స్వప్నంలోని మిథ్యావస్తువులలాగా, ఎండమావులలాగా, తాడు–పాములాగా మిథ్యా వస్తువులు. ఇవి మిథ్య కాబట్టి వీటికొక సత్య అధిష్ఠానం కావాలి. మిథ్యా స్వప్నప్రపంచానికి అధిష్ఠానం జాగ్రత్ పురుషుడు; ఎండమావులకు అధిష్ఠానం ఎడారిలోని ఇసుక. మిథ్యా పాముకి అధిష్ఠానం తాడు. అదే విధంగా మిథ్యా ద్వంద్వాలు, మిథ్యా త్రిపుటులు. **సమాశ్రిత్య**– వాటి అధిష్ఠానాన్ని ఆశ్రయించి ప్రకాశిస్తున్నాయి. వాటి అధిష్ఠానం ఏమిటి?

**కించిత్ వస్తు** – వస్తు అంటే సత్యం. ఇక్కడ ఆత్మ వస్తువు; కించిత్ అంటే ఒకానొక; అందువల్ల ఈ ద్వంద్వాలు, త్రిపుటులు ఒక ఆత్మవస్తువుమీద ఆధారపడి ఉన్నాయి. వీటికి అధిష్ఠానం ఆత్మ.

అందువల్ల ఈ మిథ్యా ద్వంద్వాలను నాశనం చేయాలన్నా, మిథ్యా త్రిపుటులను నాశనం చేయాలన్నా, ఈ మిథ్యా అహంకారాన్ని నాశనం చేయాలన్నా, అహంకారాన్ని నాశనం చేయటానికి ప్రయత్నించకండి. వాటి అధిష్ఠానానికి వెళ్ళండి అంటున్నారు రమణులవారు.

స్వప్నప్రపంచాన్ని మిథ్యగా నిరూపించటానికి ఏం చేస్తారు? స్వప్నంలో ఏమీ చేయరు. స్వప్నంనుంచి దాని అధిష్ఠానమైన జాగ్రద్ పురుషుని స్థాయికి లేస్తే చాలు, స్వప్నం మిథ్యగా తేలిపోతుంది. అందువల్ల అధ్యాసను అధ్యాసగా తెలుసుకోవాలంటే దాని అధిష్ఠానానికి వెళ్ళాలి.

**తన్మార్గణే** – తత్ + మార్గణే. తత్ అంటే అధిష్ఠాన ఆత్మవస్తు. అధిష్ఠానం అంటే ఆధారం. దేనికి ఆధారం? ద్వంద్వాలకు, త్రిపుటులకు. తత్ అంటే –

**ద్వంద్వ త్రిపుటి అధిష్ఠాన ఆత్మవస్తు**

మార్గణమ్ అంటే విచారణ. తన్మార్గణే అంటే అధిష్ఠాన విచార ఏవ. అధిష్ఠాన విచారణవల్ల మాత్రమే. ఏమవుతుంది?

**సమస్తం గలితం స్యాత్** – ద్వంద్వాలు, త్రిపుటులు అన్నీ నశించినవి అవుతాయి. స్వప్నప్రపంచం పరంగా చూశాము. స్వప్నప్రపంచం మిథ్యగా తేలిపోవాలంటే, ప్రత్యేకించి స్వప్నంలో ఏమీ చేయనవసరం లేదు. జాగ్రద్ పురుషుని స్థాయికి లేస్తే చాలు. నిద్రలేస్తే స్వప్నప్రపంచానికి విడిగా ఉనికి లేదు. నా అజ్ఞానమే దానికి స్వప్నంగా ఉనికి ఇచ్చింది. అజ్ఞానం తొలగితే, అజ్ఞానజన్య స్వప్నప్రపంచం తొలగిపోతుంది.

తన్మార్గణే – విచారణ చేస్తే జ్ఞానం కలుగుతుంది. ఈ దశను మనము కలుపుకోవాలి. ఇదే కాదు ఇంకొక దశ కూడా కలుపుకోవాలి. జ్ఞానం కలిగితే, అజ్ఞానం పోతుంది. తరువాత దశ ఇక్కడ వచ్చింది. అజ్ఞానం తొలగితే, అజ్ఞానజన్య పొరపాటు పోతుంది.

సమస్తం – అవి అన్నీ పోతాయి. అన్నీ అంటే ఏమిటి? ద్వంద్వాలు, త్రిపుటులు అన్నీ పోతాయి.

గలితం స్యాత్ – అంటే అవన్నీ లయమయిపోతాయి. ఎప్పుడైతే అధ్యాస పోతుందో, అప్పుడే ఆ వ్యక్తి అధిష్ఠానజ్ఞానంలో నెలకొని ఉంటాడు.

**సత్ పశ్యతామ్** – ఇక్కడ సత్ అంటే సచ్చిదానంద ఆత్మ. పశ్యతామ్ అంటే సద్వస్తు గురించిన జ్ఞానం పొందిన జ్ఞానులకు,

**న చలనం కదాఽపి** – సంసారంలో పడే అవకాశం ఎన్నడూ లేదు.

నేను అహంకారంతో మమేకం చెందినన్నాళ్ళూ సంసారం పట్టి పీడిస్తూనే ఉంటుంది. అహంకారం దాని పోషణకోసం చాలా వాటిమీద ఆధారపడి ఉంటుంది. శరీర పోషణకు తిండి, బట్ట, గూడు కావాలి. మానసిక పోషణ తక్కినవారి ప్రవర్తనమీద ఆధారపడివుంటుంది. బుద్ధి వికసించటానికి అనేక అంశాలు తోడ్పడాలి. ఇన్ని అంశాలమీద అహంకారం ఆధారపడి

ఉంది కాబట్టి, చాలామంది కళాకళలు చూపిస్తారు. ఎప్పుడు చిరునవ్వులు చిందిస్తారో, ఎప్పుడు చిటపటలాడతారో వారికే తెలియదు. అందువల్ల అహంకారంయొక్క రూపురేఖలు మారుతూ ఉంటుంది.

ఈ అహంకారాన్ని జయించిన జ్ఞానికి ఈ కళాకళలు ఉండవు. అందువల్లనే భగవంతుణ్ణి అచ్యుతః అంటారు. ఆత్మగా నేను అనంతం. అందువల్ల అచ్యుతం. అందువల్ల మళ్ళీ సంసారంలో పడే ప్రసక్తే లేదు.

**గమనిక** – ఇక్కడ కూడా ఒక విషయాన్ని గమనించాలి. రమణమహర్షి మూడవపాదంలో చాలా స్పష్టంగా చెప్పారు. **అధిష్ఠాన ఆత్మవిచారే ద్వైతం గచ్ఛతి**

ద్వైతానికి అధిష్ఠానమైన ఆత్మవిచారణ చేస్తే ద్వైతం పోతుంది. అదెలా చేయాలి? గురుశాస్త్ర ఉపదేశం పొందాలి; శ్రవణ మనన నిదిధ్యాసనం చేయాలి. దీన్ని **తన్మార్గణమ్** పదంతో సూచించారు రమణులవారు. అందువల్ల ఆత్మవిచారణ చేసితీరాలంటున్నారు రమణమహర్షి.

ముందే చూసినట్టుగా, రమణులవారు ఆత్మవిచారణ చేసితీరాలని నొక్కివక్కాణిస్తారే కాని, ఆత్మవిచారణ ఎలా చేయాలో ఆయన రచనల్లో ఎక్కడా చెప్పరు. అందువల్ల మీరు వేదాంతానికి రాకుండా, కేవలం సద్దర్శనమే చదివారనుకోండి, ఆత్మవిచారణ ఎలా చేయాలో తెలియదు. అందువల్ల కళ్ళు మూసుకుని నేనెవరు, నేనెవరు అని ధ్యానం చేస్తే, జవాబు వస్తుందని అనుకుంటారు.

కాని నేనెవరు అని మీరడిగే ప్రశ్నకు వచ్చే జవాబు నేను అహంకారం అని మాత్రమే!

నేనెవరు? నేను ఫలానా వారి అబ్బాయిని

నేనెవరు? నీటి సమస్యతో బాధపడుతున్న జీవిని. ఇలా జవాబులు వస్తాయే తప్ప, నేను ఆత్మను అని రాదు. ఎందుకు? నేనెవరు అనే ప్రశ్న జ్ఞానానికి సంబంధించినది. జ్ఞానం పొందటానికి తత్ సంబంధమైన ప్రమాణం వాడాలి.

ఉదాహరణకు మీకు కాకి రంగు ఏమిటో తెలుసుకోవాలనుకున్నారు. కళ్ళు మూసుకుని కాకి రంగేమిటి, కాకి రంగేమిటి అని ధ్యానం చేస్తే, జవాబు వస్తుందా? రాదు. ప్రశ్న అడిగినంత మాత్రాన జవాబు దానంతట అదే వచ్చేయదు. ఈ విషయం చాలా స్పష్టంగా తెలుసుకోవాలి. అదికాక, భగవంతుడు మీకు అందమైన కళ్ళను ఇచ్చాడు. ఆ కళ్ళను ఉపయోగించి కాకి రంగు తెలుసుకోవాలి కాని ధ్యానంలో కూర్చుని అడగటంవల్ల ప్రయోజనం లేదు.

ఇక్కడ ఒక విషయం గమనించాలి. మనమేమీ ధ్యానాన్ని కించపరచటం లేదు. ధ్యానం చాలా విలువైనదే! కాదనటం లేదు! కాని ధ్యానంవల్ల జ్ఞానం పొందలేరు అంటున్నాము, అంతే!

అందువల్ల కాకి రంగు తెలుసుకోవాలంటే, దానికి భగవంతుడిచ్చిన సరియైన ప్రమాణం వాడాలి. ఇంద్రియాలను జ్ఞానేంద్రియాలని ఎందుకంటారు? వాటి ద్వారా జ్ఞానం పొందుతాము కాబట్టి. ఏదైనా శబ్దజ్ఞానం పొందాలంటే, చెవులను మాత్రమే ఉపయోగించాలి. అందువల్లనే ఈ ఇంద్రియాలను ప్రమాణాలు అంటారు. ఈ సూత్రం ప్రకారం ఆత్మజ్ఞానం పొందటానికి సరియైన ప్రమాణం వాడాలి. అదృష్టవశాత్తూ, మనం అనంతమైన జ్ఞానాన్ని పొందటానికి భగవంతుడు ఆ జ్ఞానానికి తగ్గ ప్రమాణాలను ఇచ్చాడు.

అలాంటప్పుడు ఏ జ్ఞానానికి తగ్గ ప్రమాణాన్ని ఆ జ్ఞానానికి వాడకుండా, జ్ఞానం పొందాలంటే ఎలా కుదురుతుంది? ఆత్మజ్ఞానం పొందటానికి కూడా ప్రత్యేకమైన ప్రమాణం ఉంది కాని చాలామందికి ఈ విషయం తెలియదు. కొంతమందికి ప్రమాణం వాడాలని తెలుసు, కాని ఏ ప్రమాణం వాడాలో తెలియదు. అది మరీ విచారకరం. అందువల్ల నేనెవరు విచారణ చేస్తే చాలు అనుకుంటారు. ఆత్మవిచారణ ఎలా చేయాలో తెలుసుకోవాలంటే, వేదాంతానికి వెళ్ళాలి. వేదాంతం ఏ ప్రమాణం వాడాలో చెబుతుంది. నిజానికి మనం వాడే ఈ పంచజ్ఞానేంద్రియాల ద్వారా ఆత్మజ్ఞానాన్ని పొందలేమనీ, మనస్సు ద్వారా అంటే తార్కికంగా పొందలేమనీ, దానికి ఆరవ ప్రమాణం వాడాలనీ అంటుంది. దాన్ని శాస్త్రం అంటారనీ చెబుతుంది. శాస్త్రాన్ని కూడా స్వంతంగా అధ్యయనం చేయకూడదు. గురువు ద్వారానే అధ్యయనం చేయాలనీ అంటుంది. రెండూ కలిపి గురుశాస్త్ర ఉపదేశం అంటుంది.

**వేదాంతవిజ్ఞానసునిశ్చితార్థాః । సంన్యాసయోగాద్యతయః శుద్ధసత్వాః ।**
**తే బ్రహ్మలోకేషు పరాన్తకాలే । పరామృతాః పరిముచ్యన్తి సర్వే ॥**

వేదాంత విజ్ఞానం పొందాలి; అది కూడా గురువు ద్వారా. అందువల్ల ఆత్మవిచారణ అంటే వేదాంతబోధ వినటం.

**వేదాంత విచారః ఏవ ఆత్మ విచారః**

శంకరాచార్యులవారు ఈ విషయాన్ని తన అధ్యాసభాష్యంలో సుస్పష్టం చేస్తారు. ఇదంతా చెప్పి, ఇంకొక మాట వేస్తారు. కళ్ళు మూసుకుని, 'నేనెవరు,' అని ధ్యానం చేయకండి అంటారు. గురువు ద్వారా శాస్త్రాన్ని అధ్యయనం చేయాలని, వేదాంత శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేయాలని వేదాంతం నొక్కి మరీ వక్కాణిస్తుంది. ఇంతా విని గురువు

అవసరమా లేదా అని అడగకూడదు. శ్రవణం అంటేనే గురువు ఉండాలని చెప్పకనే చెప్పినట్లు అర్థం. మీరు వినాలంటే, చెప్పేవారు ఒకరు ఉండాలి కదా! నేను గట్టిగా మాట్లాడి, నేనే వింటాను అనటం అర్థం లేనిమాట. ఇంత పెద్ద వివరణ రమణులవారు ఒక్క **తన్మార్గణమ్** పదంలో తెలియచేశారు.

**శ్లోకం 12**

**విద్యా కథం భాతి న చేదవిద్యా**
**విద్యాం వినా కిం ప్రవిభాత్యవిద్యా ।**
**ద్వయం చ కస్యేతి విచార్య మూల-**
**స్వరూపనిష్ఠా పరమార్థ విద్యా ॥**

**ప్రతిపదార్థం:** విద్యా = జ్ఞానం గురించి; కథం భాతి = ఎలా మాట్లాడగలరు; న చేత్ అవిద్యా = అవిద్య లేకపోతే; అవిద్యా = అజ్ఞానం; ప్రతిభాసి కిమ్ = ఎలా ప్రకాశిస్తుంది; విద్యాం వినా = విద్య లేకుండా; ద్వయం చ కస్య = ఈ రెండింటి అధిష్ఠానం ఏమిటో; ఇతి విచార్య = విచారణ చేయండి; మూల స్వరూపనిష్ఠా = అన్నింటికీ మూలమైన అధిష్ఠానం నేనే అనే జ్ఞానంలో నెలకొని ఉంటాడు; పరమార్థవిద్యా = అదే యథార్థమైన జ్ఞానం.

**తాత్పర్యం:** జ్ఞానం గురించి ఎలా మాట్లాడగలరు, అవిద్య లేకపోతే? అలాగే అజ్ఞానం గురించి ఎలా మాట్లాడగలరు, జ్ఞానం లేకపోతే? ఈ రెండింటి అధిష్ఠానం ఏమిటో విచారణ చేయండి. చేస్తే అన్నింటికీ మూలమైన అధిష్ఠానం అనే జ్ఞానంలో నెలకొని ఉంటారు. అదే యథార్థమైన జ్ఞానం.

**వివరణ:** ముందు శ్లోకంలో జ్ఞానసాధనే సాక్షాత్ సాధన అని చూశాము. ఎందుకంటే, సంసారం ద్వైతభావనవల్ల ఏర్పడుతున్నది. ద్వైతం అజ్ఞానం వల్ల ఏర్పడుతుంది. అంటే అజ్ఞానం మన సమస్యకు కారణం. అజ్ఞానం పోవాలంటే, జ్ఞానం పొందటం పరిష్కారం. జ్ఞానం ఒక పరిష్కారం కాదు, జ్ఞానం ఒక్కటే పరిష్కారం వేరే ఏదీ లేదు.

ఇంకోచోట శంకరులవారు అద్భుతంగా చెబుతారు. ఒకవేళ చీకటి సమస్య అయితే, చీకటిని వెలుగుతోనే పారద్రోలగలము. అలా కాకుండా, చీకటిగదిలో కూర్చుని విష్ణు సహస్రనామ పారాయణం చేస్తే పోతుందా? విష్ణుసహస్రనామాన్ని కించపరచటం లేదు. అది చిత్తశుద్ధి కలుగజేస్తుంది. కాని అది చీకటిని పారద్రోలలేదని మాత్రం అర్థం చేసుకోవాలి. చీకటి పోవాలంటే అక్కడ దీపం వెలిగించాలి. అదొక్కటే మార్గం.

అదే సూత్రం అజ్ఞానానికి కూడా వర్తిస్తుంది. అజ్ఞానం ఆంతర చీకటి. ఆంతర చీకటి తొలగించటానికి కూడా జ్ఞానజ్యోతిని వెలిగించమొక్కటే మార్గం. వివేకచూడామణిలో

శంకరులవారు ఈ విషయాన్ని సుస్పష్టం చేస్తారు. యోగాసనం చేస్తే అజ్ఞానం పోదు, ఉపాసన చేస్తే అజ్ఞానం పోదు. జ్ఞానం పొందితేనే అజ్ఞానం పోతుంది.

ముందు శ్లోకంలో ద్వంద్వాలు, త్రిపుటులు అధ్యాస అని చెప్పారు రమణులవారు. ఈ శ్లోకంలో జ్ఞానం–అజ్ఞానం జంట కూడా ద్వంద్వాలలోకే వస్తుంది అంటున్నారు. జ్ఞానం–అజ్ఞానం ద్వంద్వం అయితే, ద్వంద్వం మిథ్య అయితే, ఈ సూత్రం ప్రకారం జ్ఞానం కూడా మిథ్యే అవుతుంది. అదెలాగో చూద్దాము.

జ్ఞానం పదం వాడాలంటే అజ్ఞానం పదం వాడాలి. జ్ఞానం అంటే అజ్ఞానానికి భిన్నంగా ఉన్నది. అందువల్ల అదికూడా ఆపేక్షిక పదమే అవుతుంది. ఆపేక్షిక పదం అయితే, జ్ఞానం కూడా మిథ్యే అవుతుంది. ఎందుకంటే జ్ఞానం పదం లేకుండా అజ్ఞానం పదాన్ని వాడలేరు; అలాగే అజ్ఞానం పదం జ్ఞానం పదం లేకుండా వాడలేరు. అందువల్ల ఈ జంటపదాలు కూడా ద్వైతంలోకి, ద్వంద్వాలలోకి వస్తాయి. ఇవి రెండు భిన్నపదాలు. అందువల్ల ఒకటి ఉందంటే, రెండవది లేదని చెప్పకనే చెప్పినట్టు అర్థం. జ్ఞానం వస్తే అజ్ఞానాన్ని పారద్రోలుతుంది. కాని జ్ఞానం కూడా మిథ్యే. అలాగని జ్ఞానం పొందము అనకూడదు. ముందు జ్ఞానం పొందాలి, అజ్ఞానాన్ని పారద్రోలాలి, తరువాత నేను జ్ఞానం పొందాను అనే భావనను పారద్రోలాలి.

ఇక్కడ సరిగ్గా అర్థం చేసుకోవాలి. జ్ఞానాన్ని పారద్రోలమనటం లేదు. నేను జ్ఞానిని అనే భావనను పారద్రోలాలంటున్నాము. ఎందుకంటే నేను జ్ఞానిని అని చెప్పేది అహంకారం, ఆత్మ కాదు. అందువల్ల జ్ఞానం పొందాక నేను అజ్ఞానం, జ్ఞానం రెండింటికీ అధిష్ఠానాన్ని అని చెప్పగలగాలి. నేను వాటికి అధిష్ఠానాన్ని అంటే నేను వాటికి భిన్నంగా ఉన్నాను అని అర్థం. రెండూ నాకు చెందవు. మరయితే నేనెవరు?

**విద్యా అవిద్యా ద్వంద్వ అధిష్ఠానమ్ అహమ్ అస్మి**

శంకరాచార్యులవారు మనీషా పంచకంలో అద్భుతంగా వివరిస్తారు.

**అహం బ్రహ్మైవ న బ్రహ్మవిత్**

జ్ఞాని నేను బ్రహ్మను అంటాడు కాని నేను బ్రహ్మజ్ఞానిని అనడు. ఏమిటి భేదం? నేను బ్రహ్మను అంటే ఐక్యజ్ఞానంలో నెలకొని ఉండటం; నేను బ్రహ్మజ్ఞానిని అంటే అహంకారం చెబుతుంది అది. అందువల్ల జ్ఞాని, ఇతరులు నన్ను జ్ఞాని అంటారు 'కాని నేను జ్ఞానిని కాదు,' అంటాడు. 'అయితే నువ్వు అజ్ఞానివా?' 'కాదు, కాదు. అజ్ఞానినీ కాదు.' 'మరి నువ్వెవరు?' నేను ఆత్మను. జ్ఞానానికి, అజ్ఞానానికి భిన్నంగా ఉన్న ఆత్మను. ఈ భావనను మొదటి రెండు పాదాలలో వివరిస్తారు రమణమహర్షి.

జ్ఞానం మిథ్య, అజ్ఞానం మిథ్య అయితే మిథ్యాజ్ఞానం పొందటం ఎందుకు? ఎందుకంటే మిథ్యా అవిద్యను మిథ్యావిద్యచేత పారద్రోలి మిథ్యావిద్యను కూడా పారద్రోలాలి. అంటే విద్య పొందాను అనే భావనను పారద్రోలాలి. ఉదాహరణకు మీరు స్నానం చేసేటప్పుడు ఏం చేస్తారు? మీ ఒంటిమీదున్న దుమ్మును పారద్రోలటానికి సబ్బును వాడతారు. సబ్బు దుమ్మును పారద్రోలుతుంది.

ఇప్పుడు చెప్పండి. నేను వాడిన ఈ సబ్బు చాలా ఖరీదైనది, నాకు చాలా అపురూపమైనది. పైగా అది నా శరీరాన్ని శుభ్రం కూడా చేసింది. అందువల్ల నేను నా ఒంటిమీదనుంచి సబ్బును కడగను, అలానే ఉంచుకుంటాను, అని సబ్బుతోనే బయటకు వస్తారా? రానేరారు.

ఇక్కడ దుమ్ము అజ్ఞానం, సబ్బు జ్ఞానం. అందువల్ల అజ్ఞానమనే దుమ్మును జ్ఞానంతో పారద్రోలాక, జ్ఞానం పొందాను అనే భావనను కూడా పారద్రోలాలి. ఈ నేపథ్యంతో ఈ శ్లోకం చూద్దాము. ముందు విద్య యొక్క సాపేక్షిక తత్త్వం గురించి మాట్లాడుతున్నారు.

**విద్యా కథం భాతి** – విద్య గురించి ఎలా మాట్లాడగలరు,

**న చేత్ అవిద్యా** – అవిద్య లేకపోతే!

ఇప్పుడు దీన్ని తిరగేసి చెబుతున్నారు

**అవిద్యా ప్రతిభాతి కిమ్** – అవిద్య ఎలా ప్రకాశిస్తుంది,

**విద్యాం వినా** – విద్య లేకుండా.

అంటే విద్యా అవిద్యలు రెండూ ద్వంద్వపదాలు. ఒకటి లేకుండా రెండవదాని గురించి మాట్లాడలేరు. విద్య అంటే జ్ఞానం, అవిద్య అంటే అజ్ఞానం; జ్ఞానం గురించి మాట్లాడాలంటే అజ్ఞానం ఉండాలి. అలాగే అజ్ఞానం గురించి మాట్లాడాలంటే జ్ఞానం ఉండాలి.

ఉదాహరణకు పగలు, రాత్రి. ఒకవేళ మీరు సూర్యగ్రహంలో ఉన్నారనుకోండి. అలా ఎలా ఉంటాము అనకండి, ఒకవేళ ఉంటే ఏమవుతుంది? అక్కడ వెలుతురే వెలుతురు. పగలే ఉంటుంది కాని రాత్రి ఉండదు. రాత్రి ఒకటి ఉందని తెలియకపోతే పగలు ఒకటి ఉందని ఎలా తెలుస్తుంది? పగలు, రాత్రి పదాలు వాటి భిన్న తత్త్వాన్ని వాడటానికి ఉపయోగిస్తాము. అక్కడిదాకా ఎందుకు? ఒక గుడ్డివాని పరిస్థితే తీసుకోండి! అతనికి ప్రకాశవంతమైన వెలుతురు తెలియదు, చిమ్మచీకటి తెలియదు. రెండు భిన్న అంశాలు ఉన్నాయని తెలియదు. తను చూస్తున్నది చీకటి అని తెలియాలంటే, చీకటికి పూర్తి విరుద్ధంగా వెలుతురు అనేది ఒకటి ఉందని తెలియాలి కదా!

విద్యాం వినా అవిద్యా ప్రవిభాతి కిమ్ – విద్య లేకుండా అవిద్య ఎలా ప్రకాశిస్తుంది? ఎలా ప్రకాశిస్తుంది అనేది ప్రశ్నకాదు, అందులోనే జవాబు మిళితమైవుంది. ప్రకాశించలేదని అర్థం. దీన్ని రిటారికల్ కొశ్చన్ అంటారు ఇంగ్లీషులో. అందువల్ల ఏం చేయాలి?

**ద్వయం చ కస్య ఇతి విచార్య** – ఈ రెండింటి అధిష్ఠానం ఏమిటో విచారణ చేయండి. ఇంతకుముందు శ్లోకంలో ద్వంద్వాలకు, త్రిపుటులకు అధిష్ఠానంగా ఉన్న సత్‌వస్తు విచారణ చేయమన్నారు. విచారణకు **తన్మార్గణం** పదం వేశారు ఇక్కడ.

ఇతి విచార్య అంటున్నారు. అంటే ఆత్మవిచారణ చేయమనే అర్థం. ఇంతకుముందు చూసినట్టుగా రమణమహర్షి విచారణ చేయమని చెబుతున్నారే కాని, ఎలా చేయాలో చెప్పటం లేదు. అందువల్ల మనమే కలుపుకోవాలి.

**(వేదాంత గురుముఖతః విచార్య)** – వేదాంత శాస్త్రాన్ని గురువు ద్వారా నేర్చుకోవాలి. అప్పుడేమవుతుంది? అధిష్ఠానంలో నెలకొని ఉంటాడు. అధిష్ఠానంలో నెలకొని ఉంటాడంటే నేను అధిష్ఠానాన్ని అనే జ్ఞానంలో నెలకొని ఉంటాడు.

**మూలస్వరూప నిష్ఠా** – అంటే తను అన్నింటికీ మూలమైన అధిష్ఠానం అనే జ్ఞానంలో నెలకొని ఉంటాడు. స్వరూప నిష్ఠ అంటే ఆత్మజ్ఞాన నిష్ఠ లేదా బ్రహ్మజ్ఞాన నిష్ఠ. జ్ఞానంలో నెలకొని ఉండటం. ఒక పదంయొక్క అర్థం తెలియకుండా ఆ పదాన్ని వాడకూడదు. అలా వాడితే అది అమానుషత్వం అవుతుంది. అందువల్ల ఆత్మజ్ఞానంలో నెలకొని ఉండటం అంటే, ఆ జ్ఞానాన్ని మర్చిపోకపోవటం. జ్ఞానాన్ని మర్చిపోక పోవటాన్ని జ్ఞాననిష్ఠ అంటారు.

జ్ఞానాన్ని మర్చిపోక పోవటమంటే, మీకు దాని అవసరం వచ్చినప్పుడు మీకు అది అందుబాటులో ఉండటం. దీనికి ఉదాహరణగా మీ ఫోను నెంబర్, మీ చిరునామా చూశాము. ఎప్పుడెవరు ఈ రెండింటిలో ఏది అడిగినా, తడుముకోకుండా ఎలా చెబుతారో, అలా అప్రయత్నంగా అహం బ్రహ్మ అస్మి జ్ఞానం అందుబాటులోకి రావటం జ్ఞాననిష్ఠ. ఏమిటా జ్ఞానం?

**పరమార్థ విద్యా** – యథార్థమైన జ్ఞానం. నేను జ్ఞానానికి, అజ్ఞానానికి కూడా అధిష్ఠాన ఆత్మను. నేను వీటికి అతీతం. జ్ఞానం–అజ్ఞానం అహంకారానికి చెందుతాయి తప్ప, ఆత్మనైన నాకు కాదు. ఈ విషయం అర్థం చేసుకుంటే ఇదే యథార్థమైన జ్ఞానం. ఇదే పరమార్థ విద్య. నేను ప్రమాతను కాను. నేను జ్ఞానం, అజ్ఞానాలకు భిన్నంగా ఉన్న ఆత్మను. ఈ పరమార్థ విద్యలో నెలకొని ఉండటమే మూలస్వరూప నిష్ఠా.

**శ్లోకం 13**

**బోద్ధారమాత్మానమజానతో యో**
**బోధః స కిం స్యాత్పరమార్థబోధః।**
**బోధస్య బోధ్యస్య చ సంశ్రయం స్వం**
**విజానతస్తద్ద్వితయం వినశ్యేత్॥**

**ప్రతిపదార్థం:** ఆత్మానం = ఆత్మజ్ఞానం; అజానతః = పొందని; యః = పురుషుడు; సః బోధ = పొందిన జ్ఞానం; పరమార్థ బోధః = యథార్థ జ్ఞానం; కిం స్యాత్ = అవుతుందా? బోద్ధారమ్ = జ్ఞానాన్ని పొందేది; ఆత్మానమ్ = ఆత్మ; సంశ్రయం = అధిష్ఠానం; బోధస్య = జ్ఞానానికి; బోధ్యస్య = జ్ఞేయానికి కూడా; విజానత = తెలుసుకుంటే; తత్ = ఆ; ద్వితయం= రెండూ; వినశ్యేత్ = నశిస్తాయి.

**తాత్పర్యం:** ఆత్మజ్ఞానం పొందని పురుషుడు పొందిన జ్ఞానం యథార్థజ్ఞానం అవుతుందా? జ్ఞానం పొందేది ఆత్మ. ఇది అధిష్ఠానం. ఈ జ్ఞానం పొందితే జ్ఞానానికి, జ్ఞేయానికి కూడా అధిష్ఠానం ఆత్మ అని తెలుసుకుంటే, ఈ రెండూ నశిస్తాయి.

**వివరణ:** ఈ శ్లోకంలో రమణమహర్షి ఆత్మజ్ఞానాన్ని స్తుతిస్తున్నారు. మానవాళి మొత్తం అసలు ఆత్మజ్ఞానం జోలికి పోవటం లేదు అంటున్నారు. నేనెవరు అనే ప్రశ్నే ఎవరిలోనూ ఉదయించటం లేదు. అంత ముఖ్యమైన అంశాన్ని పట్టించుకోకుండా అనాత్మ జ్ఞానాన్ని అంతకంతకూ పొందటానికి అర్రులు చాస్తున్నారు. అనాత్మ జ్ఞానాన్ని నేర్పించటానికి అనేక శాఖలుగా విజ్ఞానశాస్త్రం పుట్టుకొచ్చింది. అత్యంత సూక్ష్మమైన అణువునుంచి, అత్యంత పెద్దదైన సౌరమండలం దాకా, దేని గురించి కావాలంటే దాని గురించిన జ్ఞానం అందుబాటులో ఉంది.

వాటిని నేను నేర్చుకుంటూనే ఉన్నాను. కాని ఆ నేర్చుకుంటున్న నేను ఎవరు? ఆ జ్ఞానం పొందటానికి ఎంతమాత్రమూ కుతూహలం చూపటం లేదు. కాని రమణుల వారు ఆత్మజ్ఞానం పొందకపోతే, తక్కిన జ్ఞానం అంతా వృథా ప్రయాసే అంటున్నారు.

**ఆత్మానమ్ అజానతః (పురుషస్య)** – ఆత్మజ్ఞానం పొందని పురుషుడు,

**సః బోధ** – పొందిన జ్ఞానం ఏమిటి? అనాత్మ బోధ మాత్రమే.

**పరమార్థ బోధః కిం స్యాత్** – అది పరమార్థ బోధ అవుతుందా? అంటే అది అసలు జ్ఞానం కాదు. వీరికి ఆత్మ అంటే ఏమిటో తెలియదు. ఆత్మ ఏమిటి?

**బోద్ధారమ్ ఆత్మానమ్** – ఆత్మ ఈ జ్ఞానాలన్నిటిని పొందే ప్రమాత.

మీరు ఫిజిక్స్, ఎకనామిక్స్, కెమిస్ట్రీ, సంగీతం, నృత్యం, కంప్యూటర్ – ఏ జ్ఞానమైనా పొందండి. ఆత్మే అన్నింటికీ ప్రమాత. కానీ ఆ ప్రమాత గురించి తెలుసుకోవటానికి

ప్రయత్నిస్తున్నారా? లేదు! ముండకోపనిషత్తు పరిభాషలో చెప్పాలంటే తక్కిన విద్యలన్నీ అపరావిద్యలోకి వస్తాయి. ఒక్క ఆత్మజ్ఞానం మాత్రమే పరావిద్యలోకి వస్తుంది. మీ పేరు తర్వాత ఎన్ని డిగ్రీలను పేర్చుకున్నా, ఆత్మవిద్య పొందకపోతే వాటి విలువ ఉండదు. శంకరులవారు ఇంకొక సందర్భంలో అపరావిద్యను అవిద్య అంటారు. అవిద్య అంటే అజ్ఞానం. ఎందుకు అపరావిద్యను శాస్త్రం అంతగా కొట్టివేస్తుంది? దానికి రెండు కారణాలు చెప్పవచ్చు.

1. అనాత్మ గురించి జ్ఞానం ఎంత పొందినా అది వృథా అని శాస్త్రం ఎందుకంటుందంటే అనాత్మను మిథ్యగా కొట్టివేస్తుంది. మిథ్యాజ్ఞానం ఎంత పొంది మాత్రం ఏం లాభం? మిథ్యా వస్తువు గురించిన జ్ఞానం మిథ్యా జ్ఞానమే అవుతుంది. అంటే వృథా అవుతుంది.

2. అనాత్మ జ్ఞానం ఎంత పొందినా ఆ జ్ఞానం అసంపూర్ణమే అవుతుంది. నేను పరిమితి ఉన్న జీవిని అనే భావన పోదు. ఎక్కడ పరిమితి ఉంటే అక్కడ సంసారం ఉంటుంది. సంసారం ఉండనీ, నష్టమేమిటి అంటే సంసారం, నేను పరిచ్ఛిన్న జీవుణ్ణి, నాకు ఇవి కావాలి, అవి కావాలి అని పరుగులు తీయిస్తుంది. దానితో జీవితం భారంగా మారుతుంది.

అనాత్మ గురించి మాత్రమే జ్ఞానం పొందితే, ఎలాగుంటుందంటే, ఒక బీదవాడు, అత్యంత ధనవంతులైన బిల్‌గేట్స్ గురించో, సచిన్ టెండూల్కర్ గురించో నేర్చుకుంటే, అతని బీదరికం పోతుందా? నేనెవరు ప్రశ్నకు సమాధానం నాకు తెలియక పోవటంవల్ల నేను సమస్యల్లో కూరుకుపోతున్నాను. అలాంటప్పుడు నేనెవరు తెలుసుకోకుండా మిథ్యా అనాత్మ గురించిన జ్ఞానం ఎంత పొందినా అది వృథా. అది మిథ్యా జ్ఞానమే అవుతుంది. అది మోక్షాన్ని ఇవ్వదు.

ఏది సత్యజ్ఞానం? నేను ఆత్మను, నేను వ్యవహారం నడపటానికి అనాత్మగా వేషాలు వేసుకున్నాను అనేది సత్యజ్ఞానం. ఆత్మ స్వరూపం ఏమిటి?

**సంశ్రయం** – ఆశ్రయం లేదా అధిష్ఠానం. దేనికి?

**బోధస్య బోధ్యస్య** – అంటే జ్ఞానానికి, జ్ఞేయానికి కూడా అధిష్ఠానం. ఆత్మజ్ఞానం పొందితే జ్ఞానం, జ్ఞేయం రెండూ,

**వినశ్యేత్** – నశిస్తాయి.

నిద్రలోంచి లేస్తే ఏమవుతుంది? స్వప్నవస్తువులు మాయమవుతాయి. స్వప్నవస్తువులు మాయమయితే, వాటి గురించిన జ్ఞానం మాటేమిటి? స్వప్న ఏనుగు మాయమయితే స్వప్న ఏనుగు జ్ఞానం కూడా మాయమవుతుంది. సాంకేతికంగా చెప్పాలంటే వాటిని అర్థ అధ్యాస,

జ్ఞాన అధ్యాస అంటారు. మామూలుగా చెప్పాలంటే వస్తువు, వస్తువు గురించి జ్ఞానము – రెండూ మాయమవుతాయి. జ్ఞానం కూడా పోతే, నేను ఇంక ప్రమాతను కాను. అంటే నాకు ప్రమాతా అనే హోదా పోతుంది. అయితే నేను ఎవరు? నేను ఆత్మను – ప్రమాతా, ప్రమేయ, ప్రమాణం అనే త్రిపుటికి అతీతంగా, వాటికి అధిష్ఠానంగా ఉన్న ఆత్మను.

**విజానతః తత్ ద్వితయం (వినశ్యేత్) –**

విజానతః – ఈ జ్ఞానం పొందితే; తత్ – ఆ; ద్వితయం – రెండూ (జ్ఞానం, జ్ఞేయం); వినశ్యేత్ – నశిస్తాయి.

జ్ఞానం పొందినవానికి జ్ఞానం, జ్ఞేయం నశిస్తాయి. ద్విపుటి పోతుంది అంటే ముందు శ్లోకంలోంచి త్రిపుటి కూడా తెచ్చుకోవచ్చు. ప్రమాతా–ప్రమేయం అంటే ద్విపుటి. ఆ జంటకు ప్రమాణం కలిపితే త్రిపుటి. ఆత్మజ్ఞానం పొందితే,

**ప్రమాతృప్రమేయ ప్రమాణవిలక్షణ ఆత్మా అహమస్మి** అని చెప్పగలుగుతాము.

దీని సారాంశమేమిటి? అనాత్మ విచారణ చేసే బదులు ఆత్మ విచారణ చేయాలి. ఎంతసేపూ ఆబ్జెక్ట్ గురించిన జ్ఞానం పొందుతున్నారు. ఆ ఆబ్జెక్ట్ గురించి నేర్చుకునే సబ్జెక్ట్ గురించిన జ్ఞానం పొందండి.

ఇంతవరకూ రమణమహర్షి ఆత్మవిద్య యొక్క ప్రాముఖ్యత గురించి చెబుతూ వచ్చారు. దానికొక రూట్ మ్యాప్ కూడా వేశారు.

1. అజ్ఞాన నాశనం చేయాలి.
2. అజ్ఞాన నాశనం చేస్తే అహంకార నాశనం అవుతుంది.
3. అహంకార నాశనం అయితే ద్వంద్వ నాశనం, త్రిపుటి నాశనం అవుతాయి.
4. ద్వంద్వాలు, త్రిపుటులు నాశనం అయితే సంసార నాశనం అవుతుంది.

**శ్లోకం 14**

**నిద్రా న విద్యా గ్రహణం న విద్యా**
**గృహ్ణాతి కించిన్న యథార్థబోధే ।**
**నిద్రాపదార్థగ్రహణేతరా స్యాత్**
**చిదేవ విద్యా విలసన్త్యశూన్యా ॥**

**ప్రతిపదార్థం:** యథార్థ బోధే = బ్రహ్మజ్ఞాన విషయంలో; గ్రహణం = గ్రహించటం; న విద్యా = జ్ఞానం కాదు; నిద్రా = మనస్సు శూన్యం చేయటం; న విద్యా = జ్ఞానం కాదు;

కించిత్ = దేనిని కూడా; న గృహ్ణాతి = కొత్తగా గ్రహించదు; నిద్రా = శూన్యానికి; పదార్థగ్రహణం= పట్టుకోవటానికి; ఇతరా స్యాత్ = భిన్నంగా ఉంది; చిదేవ = చైతన్యమే; విద్యా = యథార్థజ్ఞానం; విలసంతి = స్వయంప్రకాశకంగా ఉంది; అశూన్యా = పూర్ణంగా ఉంది.

**తాత్పర్యం:** బ్రహ్మజ్ఞానవిషయంలో గ్రహించటం విద్య కాదు, మనస్సును శూన్యం చేయటం విద్య కాదు. జ్ఞాని కొంచెం కూడా కొత్తగా ఏమీ గ్రహించదు. ఆత్మజ్ఞానం నిద్రాగ్రహణాలకు భిన్నంగా ఉంటుంది. అది చైతన్యం, స్వయంప్రకాశకం, పూర్ణం.

**వివరణ:** ఈ శ్లోకంలో బ్రహ్మవిద్యయొక్క ప్రత్యేకత చూస్తాము. దీని ప్రత్యేకత చూడాలంటే, లౌకికవిద్యను ఎలా నేర్చుకుంటారో తెలియాలి ముందు. లౌకిక విద్యలో బుద్ధి జ్ఞానాన్ని గ్రహిస్తుంది. మేధాశక్తిని గ్రహణధారణ శక్తి అంటారు. గ్రహణం అంటే జ్ఞానాన్ని గ్రహించటం; ధారణ అంటే గ్రహించిన జ్ఞానాన్ని గుర్తుంచుకోవటం. ఇక్కడ గ్రహణపరంగా చూస్తాము. అందువల్ల లౌకికవిద్యలో బుద్ధి గ్రహిస్తుంది. దేన్ని గ్రహిస్తుంది? అది వస్తువు గురించి కావచ్చు, వ్యక్తి గురించి కావచ్చు, పరిస్థితిని గురించి కావచ్చు, లేదా మ్యాథ్‌లో ఉన్న కాన్సెప్టును కూడా కావచ్చు. అందువల్ల జ్ఞానం అంటే దేన్నైనా గ్రహించటం. దీన్ని గ్రహణశక్తి అంటారని చూశాము.

మామూలుగా గ్రహించటం అంటే దేన్నైనా చేతులతో పట్టుకోవటం. కాని జ్ఞానం విషయంలో అక్షరాలా పట్టుకోవటం కాదు, బుద్ధిలో గ్రహించటం. బుద్ధ్యా గ్రహణమ్, దీనికి ఆంగ్లపదం గ్రాస్ప్. ఐ యామ్ నాట్ ఏబుల్ టు గ్రాస్ప్ సద్దర్శనం అంటారు. ఇది లౌకికవిద్య పరంగా. ఇప్పుడు, ఆత్మవిద్య దీనికి భిన్నంగా ఉంది అంటున్నారు కదా! బ్రహ్మవిద్యలో బుద్ధి కొత్తగా గ్రహించేది ఏదీ ఉండదు. ఒక వస్తువు గురించి కాని, ఒక వ్యక్తి గురించి కాని, ఒక సంఘటన గురించి కాని, ఒక కాన్సెప్టును గురించి కాని కొత్తగా గ్రహించదు. బ్రహ్మవిద్యలో కొత్తగా ఏమీ గ్రహించము. అందువల్ల బ్రహ్మవిద్య పొందితేనో, ధ్యానంలోనో ప్రత్యేకమైన బ్రహ్మను చూస్తాము అనే భావనను ఒదులుకోమంటున్నారు రమణమహర్షి. ఏమీ గ్రహించేది ఉండదు. ఎందుకు? రమణమహర్షులే వివరిస్తున్నారు.

**యథార్థబోధే** – బ్రహ్మజ్ఞాన విషయంలో,

**కించిత్ న గృహ్ణాతి** – కొంచెం కూడా కొత్తగా ఏమీ గ్రహించదు జ్ఞాని.

బ్రహ్మజ్ఞానం పొందితే, కొంచెం కూడా కొత్తగా ఏమీ గ్రహించదు. కొత్తగా ఏమీ గ్రహించదు అనగానే ఒక సందేహం వస్తుంది. అయితే మనస్సు శూన్యం అవుతుందా? అంటే ఆలోచనలు లేని స్థితి అవుతుందా? దాన్ని సంస్కృతంలో నిద్రా అంటారు. బ్రహ్మవిద్యలో

క్రొత్తగా ఏమీ గ్రహించరు అనగానే మనస్సు శూన్యం అవుతుందని భావిస్తారేమోనని వెంటనే దాన్ని కూడా ఖండిస్తున్నారు రమణులవారు.

**నిద్రా న విద్యా** – బ్రహ్మవిద్య పొందటమంటే మనస్సును శూన్యం చేయటం కాదు; మనస్సును చంచలంగా లేకుండా స్థిరంగా చేయటం అంతకంటే కాదు.

ఆలోచనారహిత స్థితి బ్రహ్మవిద్య అంటే నిద్ర బ్రహ్మవిద్య అవుతుంది. ఎందుకు? గాఢనిద్రలో కూడా ఆలోచనలు ఉండవు. అదికాక సుషుప్తి బ్రహ్మవిద్య అయితే, మనమంతా ఇసుమంత కూడా ప్రయత్నం లేకుండా, ప్రపంచంలోనే అత్యంత తెలివైనవారిమి అవుతాము.

**గ్రహణం న విద్యా** – అంటే గ్రహించటమూ బ్రహ్మవిద్య కాదు, గ్రహించకపోవటమూ బ్రహ్మవిద్య కాదు; చూడటమూ బ్రహ్మవిద్య కాదు, చూడకపోవటమూ బ్రహ్మవిద్య కాదు; తెలుసుకోవటమూ బ్రహ్మవిద్య కాదు, తెలుసుకోకపోవటమూ బ్రహ్మవిద్య కాదు. ఆబ్జెక్టుగా చూడటమూ బ్రహ్మవిద్య కాదు. ఆబ్జెక్టుగా చూడకపోవటమూ బ్రహ్మవిద్య కాదు. ఇవేవీ బ్రహ్మవిద్య కాకపోతే, మరయితే బ్రహ్మవిద్య ఏమిటి?

**నిద్రాపదార్థగ్రహణేతరా స్యాత్** – నిద్రకు, గ్రహణానికి భిన్నంగా ఉన్నది బ్రహ్మవిద్య. ఇతర స్యాత్ – వీటికి భిన్నంగా ఉంది. వేటికి? నిద్రా – నిద్రకు; పదార్థగ్రహణం – గ్రహణానికి; భిన్నంగా ఉంది. ఏది? బ్రహ్మవిద్య. నిద్ర అంటే శూన్యం అని చూశాము. పదార్థగ్రహణం అంటే పట్టుకోవటం.

ఈ రెండూ కాకపోతే మరేమిటి ఈ బ్రహ్మవిద్య?

**చిదేవ విద్యా** – బ్రహ్మవిద్య అంటే చిత్ గురించిన విద్య. చిత్ అంటే చైతన్యమే. బ్రహ్మవిద్య అంటే పట్టుకోవటం కాదు, పట్టుకోక పోవటం కాదు, అది చైతన్యమే అంటే సమస్య తీరకపోగా, ఇంకా జటిలమవుతున్నది. చైతన్యమే బ్రహ్మవిద్య అంటే అది తర్కానికి అందదు. సమస్య ఏమిటో ఊహించారా?

చైతన్యం బ్రహ్మవిద్య. ఆ చైతన్యం మన అందరికీ ఉంది. చైతన్యం ఉండబట్టే ఇది చదవగలుగుతున్నాము. అందువల్ల చైతన్యం ఉన్న అందరికీ బ్రహ్మవిద్య వచ్చివుండాలి. ఎక్కడికి దారి తీస్తున్నారో గ్రహిస్తున్నారనుకుంటాను.

బ్రహ్మవిద్య = చైతన్యం = అందరికీ ఉంది = అందరికీ బ్రహ్మవిద్య వచ్చివుండాలి. అందరికీ బ్రహ్మవిద్య వచ్చివుంటే అందరూ మోక్షం పొందివుండాలి. మోక్షాన్నే పొందేశాక, కర్మచేసి జ్ఞానయోగ్యతను పొందటం ఎందుకు? శ్రవణ, మననాలు చేసి మోక్షం పొందటం ఎందుకు? అప్పుడది నిర్మోక్ష ప్రసంగం అవుతుంది. శాస్త్రం అనర్థకం అవుతుంది.

చిదేవ విద్యా – అందువల్ల రమణులవారు చిత్తే బ్రహ్మవిద్యా అంటే దాన్ని అక్షరాలా తీసుకోకూడదు. దాని లక్ష్యార్థాన్ని తీసుకోవాలి. ఇలా లక్ష్యార్థం తీసుకోవాలంటే, వేదాంత శాస్త్రాన్ని అధ్యయనం చేసి ఉండాలి. పైపైన చిత్తే బ్రహ్మవిద్య అని చూస్తే ఏ సమస్యా లేదు. కాని లోతుగా ఆలోచిస్తే పైన చెప్పిన సందేహం కలుగుతుంది. అందువల్ల ఇక్కడ రమణమహర్షి చెప్పిన వివరణకు లోతైన విశ్లేషణ చూడాలి. చిత్తే బ్రహ్మవిద్య అని తేలికగా ఒప్పుకోలేము. అలా ఒప్పుకోలేనిదాన్ని రమణమహర్షి ఎందుకు చెప్పారు? ఎందుకు చెప్పారో తరువాత చూద్దాము. ముందు ఇక్కడ రమణమహర్షి బ్రహ్మవిద్యను వివరించిన తీరు చూద్దాము.

మళ్ళీ ఆ నిర్వచనాన్ని చూస్తే, బ్రహ్మవిద్య అంటే దేన్నో గ్రహించటం కాదు, ఆలోచనా రహితస్థితి అంతకన్నా కాదు. మరయితే బ్రహ్మవిద్య అంటే ఏమిటి?

**అవిద్యాజన్య అధ్యాస నివృత్తిః బ్రహ్మవిద్యా**

అజ్ఞానంనుంచి పుట్టిన పొరపాటును పారద్రోలటమే బ్రహ్మవిద్య. అంటే కొత్తగా దేన్నో పట్టుకోవటం కాదు, మనం గట్టిగా పట్టుకుని పాకులాడుతున్న రెండింటిని వదులుకోవటం. ముందుగా పైన చెప్పినట్టుగా కొత్తగా ఏమీ గ్రహించము, మనస్సును శూన్యం చేయము అని గ్రహించాలి. అంతేకాదు, బ్రహ్మవిద్యలో మనస్సును శూన్యం చేయకపోగా, మనస్సులోకి ప్రయత్నపూర్వకంగా కొత్త ఆలోచనను తెస్తాము. ఆ ఆలోచన ప్రత్యేకమైన ఆలోచన. ఏమిటది?

**అహం బ్రహ్మ అస్మి** – నేను బ్రహ్మనై ఉన్నాను. ఈ ఆలోచనను నిలుపుకోవటాన్నే బ్రహ్మజ్ఞానం అంటారు. అంతేకాదు, ఈ ఆలోచన నిలుపుకోవటంవల్ల ఇన్నాళ్ళూ మనలో నిలిచివున్న రెండు పొరపాట్లూ మటుమాయమవుతాయి. మనని పట్టి పీడిస్తున్న అపోహలు పోతాయి.

1. **అబ్రహ్మత్వ భావన** – నేను ఒక చిన్న, పరిచ్ఛిన్నజీవిని. నేను బ్రహ్మకు భిన్నంగా ఉన్నాను. ఈ భావనను వేదాంతశాస్త్రం అబ్రహ్మత్వభావన అంటుంది. అంటే నేను బ్రహ్మను కాను అనే పొరపాటు.

2. **అవిద్యా నివర్తక వృత్తి** – రెండవ అపోహ ఇంకా చాలా శక్తివంతమైనది. బ్రహ్మను ఆబ్జెక్టుగా గ్రహించాలి అనుకుంటాము. అహం బ్రహ్మ అస్మి అంటే బ్రహ్మను ప్రమేయంగా చూడాలి అనే భావనను వదిలివేస్తాము. ఎందువల్లనంటే బ్రహ్మను నేను, ఆబ్జెక్టు కాదని అర్థం అవుతుంది కాబట్టి.

**ఎవ్వర్ ది ఎక్స్‌పీరియన్సర్ నెవ్వర్ ది ఎక్స్‌పీరియన్సడ్**
**అనుభవించే నువ్వే అది ఎప్పటికీ అనుభవించబడే వస్తువు కాదు ఎన్నటికీ**

బ్రహ్మ గ్రహించబడే వస్తువు కాదు, గ్రహించే నేను. నేను బ్రహ్మను అనే వృత్తిజ్ఞానమే బ్రహ్మవిద్య.

మళ్ళీ ఈ వివరాలు ఒకసారి చూస్తే – బ్రహ్మ గ్రహించబడే వస్తువు కాదు. అలాగని మనస్సును శూన్యం చేసేదీ కాదు. మనస్సులోకి ఒక ఆలోచన ప్రవేశపెడుతుంది. నేను బ్రహ్మను అనే ఆలోచన ప్రవేశపెడుతుంది. దానివల్ల నేను పరిమితి ఉన్న జీవిని అనే అపోహ, బ్రహ్మను ఆబ్జెక్టుగా చూడాలనే అపోహ తొలుగుతాయి. దీన్ని సంస్కృతంలో అవిద్యా నివర్తక వృత్తి అంటారు. కాని రమణులవారు ఈ సాంప్రదాయ నిర్వచనం ఇవ్వకుండా చైతన్యమే బ్రహ్మవిద్య అనేశారు. ఎందుకలా అన్నారో, తరువాత వచ్చే శ్లోకంలో స్పష్టమవుతుంది. అక్కడ వివరంగా చూద్దాము.

ఇక్కడ రమణమహర్షి నిర్వచనమే చూద్దాము. బ్రహ్మవిద్య అంటే చిత్ ఏవ విద్యా. గ్రహించే వస్తువు కాదు, గ్రహించబడని వస్తువు కాదు.

**విలసంతి అశూన్యా** – ఇక్కడ విలసంత్యశూన్యా పదాన్ని జాగ్రత్తగా విడదీయాలి.

విలసంతి – స్వయంప్రకాశకం. ఇది చైతన్యానికి విశేషణం. అంటే చైతన్యం స్వయం ప్రకాశక జ్యోతి.

అశూన్యా – శూన్యం కానిది. శూన్యం కాదు అది పూర్ణం, నిత్యం. ఇప్పుడు ఈ నిర్వచనాలన్నీ కలిపితే బ్రహ్మవిద్య –

స్వయంప్రకాశక చైతన్యమ్ ఏవ బ్రహ్మవిద్యా॥

మిథ్యా ప్రత్యయ నివర్తక అహం బ్రహ్మ స్మృతి వృత్తి జ్ఞానమ్ ఏవ బ్రహ్మవిద్యా॥

**శ్లోకం 15**

**సత్యశ్చిదాత్మా వివిధాకృతిశ్చిత్**
**సిద్ధ్యేత్పృథక్సత్యచితో న భిన్నా।**
**భూషావికారాః కిము సంతి సత్యం**
**వినా సువర్ణం పృథగత్ర లోకే ॥**

**ప్రతిపదార్థం:** చిదాత్మా = ఈ చైతన్య ఆత్మ; సత్యః = సత్యం; చిత్ = (ఒక్కటే) చిత్; వివిధాకృతిః= అనేక ఆకారాలను; (భవతి) ధరిస్తుంది. సత్యచితః = ఒకటే అయిన సత్యచైతన్యం కన్నా; పృథక్ భిన్నా = ప్రత్యేకంగా, వేరుగా; న సిద్ధ్యేత = సిద్ధించదు; అత్ర = ఈ; లోకే = జగత్తులో; సత్యం = నిజమైన; సువర్ణం వినా = బంగారం లేకుండా; పృథక్ = వేరుగా; భూషావికారాః = ఆభరణాలు; సంతి కిము = ఉన్నాయా?

**తాత్పర్యం:** ఈ చైతన్య ఆత్మ సత్యం. చిత్ ఒక్కటే అనేక ఆకారాలను ధరిస్తుంది. ఒకటే అయిన సత్యచైతన్యానికి భిన్నంగా వేరే ఈ జగత్తులో ఏదీ లేదు. నిజమైన బంగారం లేకుండా ఆభరణాలు విడిగా ఉంటాయా? ఉండవు అని అర్థం.

**వివరణ:** ఈ శ్లోకంలో ఒకటే చైతన్యం అనేక జ్ఞానాలుగా తెలుస్తున్నది అంటున్నారు రమణమహర్షి. దానికి ఉదాహరణ కూడా ఇస్తున్నారు. బంగారం–ఆభరణాలు. ఒకటే బంగారం ముద్దనుంచి కంసాలి గొలుసు, గాజు, ఉంగరం చేశాడు. మూడు భిన్న పేర్లు చూశాము కాని, మూడింటిలోనూ సమానంగా ఉన్నది ఏమిటి? ఒకటే బంగారం! అదే విధంగా ఉన్నది ఒకటే చైతన్యం. దాన్ని సామాన్యజ్ఞానం లేదా ఎరుక అంటారు.

మనం అనేక వస్తువుల గురించిన జ్ఞానం పొందుతాము. ఎలా పొందుతాము? బాహ్యంగా ఒక వస్తువును చూస్తే ఆ వస్తువు నా ఇంద్రియాల ద్వారా నా మనస్సులోకి వెళ్ళి ఆలోచనగా మారుతుంది. దాన్ని వృత్తిజ్ఞానం అంటారు. ఈ వృత్తిజ్ఞానం మారుతూ ఉంటుంది. కుండను చూస్తే కుండ వృత్తి ఏర్పడుతుంది. తద్వారా కుండ జ్ఞానం కలుగుతుంది. తరువాత గోడను చూస్తే, కుండ వృత్తి పోయి గోడ వృత్తి ఏర్పడుతుంది. తద్వారా గోడ జ్ఞానం కలుగుతుంది.

అలా ఒక వస్తువును చూసినప్పుడు మామూలుగా మనం దానికి సంబంధించిన వృత్తి (ఆలోచన) మాత్రమే ఉంటుంది అనుకుంటాము. కాని అక్కడ రెండు అంశాలు ఉన్నాయి.

సామాన్య వృత్తి + విశేష వృత్తి

సామాన్య వృత్తి – చైతన్యం; విశేష వృత్తి – ఏ వస్తువును చూస్తే దానికి సంబంధించిన ఆలోచన. విశేష వృత్తి మారుతూ ఉంటుంది. కుండ వృత్తి వస్తుంది, సామాన్య వృత్తి ఉంటుంది. కుండ వృత్తి పోతుంది, సామాన్య వృత్తి ఉంటుంది, గోడ వృత్తి వస్తుంది, సామాన్య వృత్తి ఉంటుంది. అలా వచ్చిపోయే ఆలోచనల వెనక మారకుండా ఉన్న ఆలోచనే చైతన్యం. ఒక వస్తువును చూస్తే కలిగేది విశేష వృత్తి. కాని వస్తువు వృత్తి ఉన్నా లేకపోయినా సామాన్య వృత్తి ఎప్పుడూ ఉంటుంది. అది సర్వవ్యాపకం. కాబట్టి, నేను కళ్ళు మూసినా నేను చైతన్యజీవినే. కళ్ళు తెరవగానే, విశేష వృత్తులు ఒకదాని తర్వాత ఒకటి దూసుకువస్తాయి. కాకపోతే ఈ విశేష వృత్తిని **జ్ఞానం** అంటారు. అందువల్లనే వృత్తిజ్ఞానం అన్నాము.

ఈ విషయాన్ని జాగ్రత్తగా గమనించాలి. ఒక వస్తువును చూస్తే కలిగిన విశేషవృత్తిని జ్ఞానం అంటున్నాము. ఇంతకుముందు శ్లోకంలో రమణులవారు ఏమన్నారు? **చిదేవ విద్యా.** చైతన్యమే బ్రహ్మవిద్య అన్నారు. సామాన్య చైతన్యం ఎప్పుడూ ఉంటుంది. ఒక వస్తువు గురించిన జ్ఞానం ఏర్పడితే అది విశేషవృత్తి అవుతుందనీ, తద్వారా జ్ఞానం అవుతుందనీ చూశాము. ఆభరణాలు బంగారానికి భిన్న నామరూపాలు మాత్రమే అన్నాము.

ఈ సూత్రాన్ని బ్రహ్మవిద్యకు కూడా అన్వయిస్తే, చైతన్యం = బ్రహ్మవిద్యాజ్ఞానం అని చెప్పవచ్చు. కాకపోతే మధ్యలో ఒక షరతు విధించాలి.

చైతన్యం + సరియైన వృత్తి = బ్రహ్మవిద్య
ఏమిటా సరియైన వృత్తి? అహం బ్రహ్మ అస్మి వృత్తి.
చైతన్యం + అహం బ్రహ్మ అస్మి వృత్తి = బ్రహ్మవిద్య.

ఇప్పుడు ఈ వాక్యాన్ని జాగ్రత్తగా చూస్తే, ఈ జ్ఞానంలో బ్రహ్మను పట్టుకోవటం లేదు, మనస్సును శూన్యం చేయటం లేదు. పైపెచ్చు మంచి వృత్తిని ప్రయత్నపూర్వకంగా తెస్తున్నాము. అహం బ్రహ్మ అస్మి వృత్తి సహిత చైతన్యం అది.

అందువల్ల చైతన్యమే అనేక వృత్తులుగా కనిపిస్తున్నది అంటున్నారు రమణమహర్షి. సామాన్యవృత్తిని ఎరుక అంటే, ఇలా ఒక వస్తువు గురించిన వృత్తిని జ్ఞానం అంటారు. ఆ విధంగా సామాన్యవృత్తి ఏకం, విశేషవృత్తులు అనేకం. ఈ నేపథ్యంతో ఈ శ్లోకాన్ని చూద్దాము.

**చిదాత్మా సత్యః** – ఈ చైతన్య ఆత్మ సత్యం. ఇది ఒక్కటే సత్యం. ఈ చిదాత్మ ఏమవుతుంది?

**చిత్ వివిధాకృతిః (భవతి)** – ఒకటే చిత్ అనేక ఆకారాలను ధరిస్తుంది. అంటే అనేక విశేష వృత్తులుగా, తద్వారా వృత్తిజ్ఞానంగా మారుతుంది. కుండను చూస్తే కుండ జ్ఞానం, గోడను చూస్తే గోడ జ్ఞానం, ఫిజిక్స్ నేర్చుకుంటే ఫిజిక్స్ జ్ఞానం కలుగుతుంది. ఈ జ్ఞానాన్ని ఎరుక అంటారు. అన్ని జ్ఞానాల్లోనూ అంతర్లీనంగా ఉన్న ఎరుకే చైతన్యం. అందువల్ల అది సత్యచిదాత్మ అయింది.

ఒక కుండ జ్ఞానం కలిగిందంటే దానిలో సామాన్యజ్ఞానం + విశేషజ్ఞానం ఉంటాయని చూశాము. అందువల్ల సామాన్యజ్ఞానం లేకుండా విశేషజ్ఞానం పొందలేరు.

ఉనికి గురించి చూసినప్పుడు కుండ ఉంది, గోడ ఉంది అంటాము. ఈ రెండింటిలోను సమానంగా ఉన్న పదం ఉంది. ఈ ఉంది అంశాన్ని ఉనికి లేదా సామాన్య అంశం అంటాము. కాని ఇక్కడ రమణులవారు బంగారం ఉదాహరణగా ఇస్తున్నారు.

**సువర్ణం వినా భూషావికారాః కిము సంతి** – బంగారం లేకుండా ఆభరణాలకు విడిగా ఉనికి ఎక్కడిది? వికారాః అంటే కార్యం; భూషాః అంటే ఆభరణాలు. ఆభరణాలనే కార్యం, బంగారం లేకుండా ఎలా ఉండగలదు? అంటే బంగారం లేకుండా, ఆభరణాలకు ఉనికి లేదు. ఇప్పుడు బంగారం స్థానంలో చైతన్యాన్ని, ఆభరణాల స్థానంలో అనేక వృత్తి జ్ఞానాలనీ పెడదాము.

బంగారం ఏకం, ఆభరణాలు అనేకం; చైతన్యం ఏకం, వృత్తులు అనేకం. ఆభరణాలు లేకపోయినా బంగారం ఉంటుంది, వృత్తులు లేకపోయినా చైతన్యం ఉంటుంది. ఆభరణాలకు బంగారం లేకపోతే విడిగా ఉనికి లేదు; వృత్తులకు చైతన్యం లేకపోతే విడిగా ఉనికి లేదు. బంగారానికి స్వతంత్ర ఉనికి ఉంది కాబట్టి అది సత్యం, ఆభరణాలు మిథ్య. అలాగే చైతన్యానికి విడిగా ఉనికి ఉంది కాబట్టి అది సత్యం, వృత్తులు మిథ్య. అందువల్ల సత్యం బంగారం లేకుండా ఆభరణాలకు ఉనికి లేదు అంటున్నారు రమణమహర్షి.

ఇదే సూత్రం ప్రకారం సత్యం చైతన్యం లేకుండా తక్కిన వృత్తులకు ఉనికి లేదు. ఈ సూత్రాన్ని అర్థం చేసుకుంటే, అంతకు ముందు శ్లోకాల్లో జ్ఞానమూ, అజ్ఞానమూ కూడా ద్వంద్వాలు; అవి కూడా మిథ్యే అని చూశాము. దానికి ఇక్కడ జవాబు దొరుకుతుంది.

ఒక జ్ఞానం వృత్తిలో ఏర్పడుతుందనీ, దాన్ని వృత్తిజ్ఞానం అంటారనీ, అది మిథ్య అనీ చూశాము. మరయితే, బ్రహ్మజ్ఞానం కూడా వృత్తిలో ఏర్పడుతుంది, దాన్నీ వృత్తిజ్ఞానం అంటారు. అలాంటప్పుడు అదీ మిథ్యే అవుతుంది కదా అంటే అవును, బ్రహ్మవిద్య కూడా మిథ్యే; కాని బ్రహ్మ సత్యం అని ధైర్యంగా చెబుతాము. బ్రహ్మజ్ఞానం వృత్తిజ్ఞానం; అందువల్ల మిథ్య. కాని బ్రహ్మ సద్వస్తు.

మరి మిథ్యాజ్ఞానం ఎలా తోడ్పడుతుంది? మనకున్న సంసారం కూడా మిథ్యా సంసారమే. మిథ్యా సంసారాన్ని పారద్రోలటానికి కావాల్సింది మిథ్యా జ్ఞానమే. ఉదాహరణకు స్వప్నంలో దాహం వేస్తే, స్వప్నంలో నీరు తాగితే చాలు. ఇంకా మాట్లాడితే, స్వప్నంలో దాహం వేస్తే స్వప్నంలో నీరే తాగాలి. మీరు పడుకున్నప్పుడు, మీ మంచం పక్కన చెంబుడు నీళ్ళు పెట్టుకున్నా వాటిని తాగలేరు.

అదే విధంగా సంసారం నిజంగా లేదు. మీరు అహంకారంతో మమేకం చెంది, అహంకారానికి చెందిన సంసారం మీదీ అనుకుని పొరపడుతున్నారు. కాబట్టి ఆ మిథ్యా సంసారాన్ని పారద్రోలటానికి మిథ్యాజ్ఞానం పొందాలి. మిథ్య అంటే వింతగా ఉంటుంది. దాన్ని వ్యావహారిక సత్యం అని కూడా అంటారు. అందువల్ల వ్యావహారిక స్థాయిలో ఉన్న సంసారాన్ని, వ్యావహారిక స్థాయిలో జ్ఞానం పొంది పారద్రోలాలి. పారమార్థిక సత్యంలో కాదు. అందువల్లనే సత్ చిదాత్మా అంటున్నారు రమణులవారు.

**వివిధాకృతిః చిత్ పృథక్ అత్ర లోకే న సిద్ధ్యేత్** – వివిధాకృతిః చిత్ సత్యచితః వినా న భవతి– రెండింటి అర్థం ఒకటే. సత్య చిత్ లేకుండా వివిధాకృతులు భిన్నరూపంలో ఏర్పడవు.

**శ్లోకం 16**

**తద్యుష్మదోరస్మది సంప్రతిష్ఠా**
**తస్మిన్ వినష్టేఽస్మది మూలబోధాత్ ।**
**తద్యుష్మదస్మన్మతివర్జితైకా**
**స్థితిర్జ్వలంతీ సహజాఽఽత్మనః స్యాత్ ॥**

**ప్రతిపదార్థం:** తద్యుష్మదో = తత్ + యుష్మదోః = ప్రథమపురుషుడయిన అతను; మధ్యమ పురుషుడైన నువ్వు; అస్మది = ఉత్తమ పురుషుడనైన నేనులో; సంప్రతిష్ఠా = నెలకొని ఉంటారు; తస్మిన్ = ఆ; అస్మత్ = అహంకారం; వినష్టే సతి = నాశనం అయితే; మూల బోధాత్= అధిష్ఠాన జ్ఞానంవలన; తత్ = అతను; యుష్మత్ = నువ్వు; అస్మత్ = నేను అనే; మతివర్జితా= భేదభావనలు తొలగి; ఏకా = ఏకమైన ఆత్మలో; స్థితిః = ఆత్మనిష్ఠలో ఉంటాడు. జ్వలంతీ= ప్రకాశిస్తున్న ఆత్మనః (స్థితిః) = ఈ ఆత్మనిష్ఠ; సహజా = సహజమైనది; స్యాత్ = అవుతుంది.

**తాత్పర్యం:** ప్రథమ పురుషుడయిన అతను, మధ్యమ పురుషుడైన నువ్వు, ఉత్తమ పురుషుడైన నాలోనే నెలకొని ఉంటారు. ఎప్పుడైతే అధిష్ఠాన జ్ఞానంవల్ల ఆ అహంకారం నాశనమవుతుందో, అప్పుడే అతను, నువ్వు, నేను అనే ఈ భేదభావనలు తొలగి, ఏకమైన ఆత్మజ్ఞాననిష్ఠలో నెలకొని ఉంటాడు. ఆ ప్రకాశిస్తున్న ఈ ఆత్మనిష్ఠ సహజమైనది అవుతుంది.

**వివరణ:** ముందు శ్లోకంలో జ్ఞానం ఎలా పొందుతామో, సామాన్యవృత్తి, విశేషవృత్తి ఎలా ఉన్నాయో చూశాము. జ్ఞానం అంటే ఏమిటో విశ్లేషించేదాన్ని **ఎపిస్టమాలజీ** అంటారు. జ్ఞానం ఎలా పుడుతుంది? జ్ఞానం స్వరూపం ఏమిటి? అజ్ఞానం అంటే ఏమిటి? అజ్ఞానం స్వరూపం ఏమిటి? జ్ఞానం పొందితే, అజ్ఞానం ఎలా మటుమాయమవుతుంది? పొరపాటు అంటే ఏమిటి? పొరపాటుకి, అజ్ఞానానికి మధ్య భేదం ఏమిటి? పొరపాటుకి, జ్ఞానానికి మధ్య భేదం ఏమిటి? జ్ఞానం, అజ్ఞానం, పొరపాటుల హోదా ఏమిటి? ఈ ప్రశ్నలకు జవాబిచ్చే దాన్ని ఎపిస్టమాలజీ అంటారు.

అది చాలా లోతైన సబ్జెక్ట్. ఇందులో లోతులు కొలిచే, పైన చెప్పిన ప్రశ్నలకు జవాబులు కనుగొన్నారు మన వేదాంత సిద్ధాంతులు. బ్రహ్మవిద్యాజ్ఞానం అంటే సరియైన ఆలోచన మనస్సులో రావటం అనీ, మనస్సు కొత్తగా ఏమీ గ్రహించదనీ, మనస్సును శూన్యం చేయటం కాదనీ ముందు శ్లోకంలో చూశాము. అంతేకాదు, బ్రహ్మవిద్య పొందితే, నేను పరిమితి ఉన్న జీవిని అనే పొరపాటు, బ్రహ్మను ఆబ్జెక్టుగా తెలుసుకోవాలని భావించే పొరపాటుని వదులుతామని కూడా చూశాము. అన్నింటినీ మించి బ్రహ్మవిద్య గురుశాస్త్ర

ఉపదేశ ప్రమాణం ద్వారానే నేర్చుకోవాలని, అప్పుడే అహం బ్రహ్మ అస్మి ఆలోచన మనస్సులో వస్తుందనీ కూడా చూశాము.

ఇప్పుడు, ఈ శ్లోకంలో మొదటి పొరపాటుని ఎలా పారద్రోలాలో చూస్తాము. పొరపాటుని పారద్రోలటమే బ్రహ్మవిద్య అని నిర్వచనం చూశాము. మొదటి పొరపాటు ఏమిటి? నేను కాలపరిమితి ఉన్న, దేశపరిమితి ఉన్న జీవిని. దీన్ని అబ్రహ్మత్వభావన అంటారని కూడా చూశాము. నేను బ్రహ్మను అనే జ్ఞానం పొందకముందు నేను అహంకార ప్రధాన జీవిని. ఎప్పుడైతే నేను అహంకారాన్ని అని భావిస్తానో అప్పుడే నేను ప్రమాతను అవుతాను.

**తద్యుష్మదోః** – తత్ అంటే ప్రథమ పురుషుడు – అతను; యుష్మత్ అంటే మధ్యమ పురుషుడు– నువ్వు; అతను, నువ్వు అనే పరిమితులు ఎందుకు ఏర్పడుతున్నాయి?

**అస్మది సంప్రతిష్ఠా** – ఎందుకంటే నన్ను నేను అనే ఉత్తమ పురుషునిగా భావిస్తున్నాను కాబట్టి. ఇదంతా అహంకారం చేసే గారడీ. నన్ను నేను పరిమితి ఉన్న జీవిగా భావిస్తే, నిన్ను, అతన్నీ కూడా పరిమితి ఉన్న జీవిగానే భావిస్తాను.

జ్ఞాని కూడా అహం పదం వాడతాడు. మహావాక్యం **అహం బ్రహ్మ అస్మి** ఉంది. అక్కడ అహం అంటే పరిమితి ఉన్న జీవి కాదు; వ్యష్టి కాదు; ఉత్తమ పురుషుడు నేను కాదు. అది అనంతం నేనును సూచిస్తుంది. నేను అనంతం అనేసరికి, మధ్యమ పురుషుడు, ప్రథమ పురుషుడు అందులో లయమయిపోతారు. ఎందుకంటే అనంతాలు అనేకం ఉండవు. అందువల్ల జ్ఞాని నేనులో నువ్వు, అతను లయమయిపోతాయి. ఈ త్రిపుటి భేదం ఉండదు.

కాని ఇక్కడ అజ్ఞానిపరంగా మాట్లాడుతున్నాము. అజ్ఞాని అహం అంటే నేనే, అతనికి నేను–నువ్వు. అతను అనే త్రిపుటి ఉంటుంది. అతను అస్మది – నేను అనే భావనలో; సంప్రతిష్ఠా – నెలకొని ఉంటాడు.

ఇక్కడ మనం కొంత నేను, నువ్వు, అతను పదాలను విశ్లేషిద్దాము. ఈ పదాలకు ఉన్నాను పదం వాడాలంటే ఎలా వాడతాము?

నేను ఉన్నాను, నువ్వు ఉన్నావు, అతను ఉన్నాడు. మూడు భిన్న పదాలు వాడాము. వీటిని మరికొంచెం పెద్ద వాక్యాలుగా చూద్దాము.

నేను సమస్యలకు కారణంగా ఉన్నాను – ఉత్తమ పురుషుడు
నువ్వు సమస్యలకు కారణంగా ఉన్నావు – మధ్యమ పురుషుడు
అతను సమస్యలకు కారణంగా ఉన్నాడు – ప్రథమ పురుషుడు.

ఇప్పుడు రెండు వాక్యాలు ప్రయోగిస్తాను. వాటి మధ్య భేదం చూడండి.

నేను సమస్యలకు కారణంగా ఉన్నాను

నేను సమస్యలకు కారణంగా ఉంది.

వీటి మధ్య సూక్ష్మభేదం ఉంది. నేను సమస్యలకు కారణంగా ఉన్నాను వాక్యంలో నేను అంటే నేనే. ఉత్తమ పురుషుణ్ణి. కాని రెండవ వాక్యంలో నేను అంటే అహంకారం. అది ఉత్తమ పురుషుడు కాదు; ప్రథమ పురుషుడు. దానిలో రెండు పదాలు కలిపితే భావం అర్థమవుతుంది.

'నేను అనే భావన సమస్యలకు కారణంగా ఉంది'

దీన్ని ఇన్‌వర్టెడ్ కామాల్లో చెబుతాము. నేను అంటే ఇక్కడ అహంకారం. నేను తీసేసి చెబితే బాగా అర్థమవుతుంది.

అహంకారం సమస్యలకు కారణంగా ఉంది.

అంతకుముందు కూడా చూశాము. భోజరాజు సభలో స్వర్గానికి ఎవరు వెళ్ళగలరు అని చర్చ వచ్చింది. మహాకవి కాళిదాసు లేచి, 'నేను పోతే పోవచ్చు,' అన్నాడు. ఆ మాట తక్కిన పండితులకి కోపం తెప్పించింది. అతను మాత్రమే ఎలా వెళతాడు అనుకున్నారు. అప్పుడు కాళిదాసు తన మాటను వివరించాడు. 'మహాప్రభూ! నేను, పోతే పోవచ్చు అంటే నేను అనే అహంకారం పోతే, ఎవరైనా సరే మోక్షాన్ని పొందవచ్చు అన్నాను కాని, నేను పోతానని చెప్పటం కాదు నా ఉద్దేశ్యం.'

అలా నేను పదాన్ని నాకు వాడితే ఉత్తమ పురుషుడు, అహంకారానికి వాడితే ప్రథమ పురుషుడు.

ఇదే సూత్రం మధ్యమ పురుషునికి, ప్రథమ పురుషునికి కూడా వర్తిస్తుంది.

నువ్వు సమస్యలకు కారణంగా ఉన్నావు.

నువ్వు (అనే భావన) సమస్యలకు కారణంగా ఉంది.

అతను సమస్యలకు కారణంగా ఉన్నాడు.

అతను (అనే భావన) సమస్యలకు కారణంగా ఉంది.

ఈ శ్లోకానికి ఇప్పుడు అన్వయిస్తే నేను అనే భావన ఉంటే, నువ్వు, అతను అనే భేదాలు చూస్తాను.

అతను పదానికి ఇక్కడ రమణులవారు యుష్మత్ పదం వేశారు. **యుష్మత్** పదాన్ని సంస్కృత వాఙ్మయంలో చాలా అరుదుగా చూస్తాము.

**యుష్మదస్మత్ప్రత్యయ గోచరయోః** – అధ్యాసభాష్యం

శంకరులవారు తన అధ్యాసభాష్యాన్ని యుష్మత్ పదంతో మొదలుపెట్టారు.

తద్యుష్మదోరస్మది – నువ్వు, అతను, నేను పదాలు అక్షరాలా నువ్వు, అతను, నేను అనే వ్యక్తిగత జీవులు కారు. ఇక్కడ పురుషాలను సూచిస్తుంది. అంటే ఉత్తమ పురుషుడైన 'నేను' పదం వస్తేనే మధ్యమ పురుషుడైన 'నువ్వు' పదం, ప్రథమ పురుషుడైన 'అతను' పదం వస్తాయి.

ఇక్కడ నేను అంటే వేదాంతం బోధించే అహం బ్రహ్మ అస్మిలో అహం కాదు; అహంకారంతో మమేకం చెందిన నేను. ఇక్కడ నేను అంటే బ్రహ్మ కాదు, నేను అంటే అహంకారం అని ఎలా చెప్పగలరు? నువ్వు, అతను మాటలు వచ్చాయంటేనే నేను అంటే పరిమితి ఉన్న అహంకారాన్ని అని అర్థం. నన్ను మధ్యమ పురుషునికి, ప్రథమ పురుషునికీ భిన్నంగా చూస్తున్నాను. త్రిపుటిలో ఉన్నాను. అంటే పరిమితి భావనలో ఉన్నాను. అందువల్ల ఇక్కడ నేను అంటే అహంకారం. అహం పద వాచ్యార్థః అంటారు దీన్ని.

అహంకారం అనే వేరునుంచి మధ్యమ పురుషుడు, ప్రథమ పురుషుడు అనే చెట్టు పుట్టుకొస్తుంది. అందువల్ల ఈ అహంకారం అనే వేళ్ళను పెకలించివేయండి. అప్పుడు మధ్యమ పురుషుడు, ప్రథమ పురుషుడు అనే చెట్టు మిమ్మల్ని బాధించలేదు అంటుంది వేదాంతం. తేలికగా చెప్పాలంటే నేను ఉంటేనే నువ్వు, అతను వస్తారు. నేనే లేకపోతే నువ్వు ఎలా ఉంటావు, అతనెలా ఉంటాడు?

కాని అహంకారం రాజ్యమేలటంవల్ల, నేను నేను నేను అని నిరంతరం భావిస్తాను. నేను ఉంటే నువ్వు, అతను ఉండి తీరతారు. అందువల్ల ఎప్పుడూ నా చూపుడువేలు చూపించి, నువ్వు అలా చేశావు, నువ్వు ఇలా చేశావు అని తిడుతూనే ఉంటాను. లేదా అతను అలా చేశాడు, అతను ఇలా చేశాడని తిడుతుంటాను. కాని, ఎన్నడూ నేను అలా చేశాను, అందువల్ల ఈ సమస్య వచ్చింది అని నన్ను నేను నిందించుకోను. ఎదుటివారిమీదకు ఆ నేరాన్ని నెడుతాను.

కాని వేదాంతం ఆ అలవాటుని మానుకోమంటుంది. నేను ఉన్నాను కాబట్టి, నువ్వు, అతను ఉన్నాడని అర్థం చేసుకోము. మామూలుగా మనం మాటల్లో, 'నా తరువాతే నీ' వస్తుంది అంటాము. న గుణింతాలలో ననానినీ వస్తుంది. ఇంగ్లీషులో కూడా '**ఐ**' ఆల్ఫబెట్ తరువాతే '**యు**' ఆల్ఫబెట్ వస్తుంది అంటాము. ఇది మనకు మనం ప్రాముఖ్యత నిచ్చుకోవటానికి వాడతాము. దీన్నే ఎత్తి చూపుతున్నది వేదాంతం కూడా.

నేను ఉండటంవల్లనే నువ్వు, అతను వస్తున్నారు జాగ్రత్త అంటున్నది వేదాంతం. అంటే అహంకారం రాజ్యం ఏలుతున్నంతవరకూ ఈ త్రిపుటి తప్పదు. వారు నిన్ను బాధించకా తప్పదు అంటున్నది వేదాంతం. ఈ త్రిపుటి భావన పోవాలంటే అహం బ్రహ్మ అస్మి జ్ఞానం

పొందాలి. జ్ఞాని అహం అంటే పరిమితి ఉన్న నేను కాదు. అహం అంటే అనంతం బ్రహ్మ. అందువల్ల ఈ అనంతంలో నువ్వు, అతను కూడా లయమయిపోతారు. మూడు పురుషార్థాల భేదం ఉండదు.

**తస్మిన్ అస్మది వినష్టే సతి** – ఇక్కడ కూడా అస్మది ఉంది. అస్మత్ అంటే పరిమితి ఉన్న నేను, అహంకారం. నేను అనే భావన. వినష్టే సతి – నాశనం అయితే. అక్షరాలా తీసుకుంటే ఎప్పుడైతే అహంకారం నాశనం అవుతుందో అని అర్థం. కాని నాశనం పదాన్ని అక్షరాలా తీసుకోకూడదు. అహంకారం మిథ్య అని అర్థం చేసుకోవటాన్ని అహంకార నాశనం అంటారు.

జ్ఞాని అహంకారాన్ని శారీరకంగా నాశనం చేయడు. అహంకారాన్ని శారీరకంగా నాశనం చేస్తే, ఇంక ప్రపంచంతో వ్యవహారం నడపలేడు. వ్యవహారం దాకా ఎందుకు? వేదాంతాన్నే బోధించలేడు. వేదాంతబోధను పాపం ఆత్మ చేయలేదు; అహంకారమే చేయగలదు. అందువల్ల జ్ఞాని **అహం బ్రహ్మ అస్మి** జ్ఞానం పొందాక కూడా, జ్ఞానికి అహంకారం కొనసాగుతుంది. ఈ అంశాన్ని సందర్భం వచ్చినప్పుడు వివరంగా చూద్దాము. ఇప్పటికి జ్ఞానికి జ్ఞానం పొందాక కూడా అహంకారం కొనసాగుతుందని అర్థం చేసుకుంటే చాలు. కాకపోతే జ్ఞాని, అజ్ఞానిలాగా దాన్ని పెంచి పోషించడు. జ్ఞాని అహంకారాన్ని మిథ్యగా లేదా వ్యవహారిక సత్యంగా భావిస్తాడు. అహంకార నాశనం అంటే మిథ్యాత్వ నిశ్చయం. నాశనం అంటే మిథ్యగా అర్థం చేసుకోవటం.

అహంకారాన్ని ఎలా మిథ్యగా కొట్టివేస్తాము? తాడుపాముని మిథ్యగా ఎలా కొట్టివేస్తాము? అధిష్ఠానాన్ని తెలుసుకోవటం ద్వారా. తాడుని చూసి పాము అనుకున్నాము. అది పాము కాదని తెలియాలంటే, తాడు జ్ఞానం పొందాలి. సాంకేతికంగా చెప్పాలంటే తాడుని అధిష్ఠానం అనీ, పొరపాటుని అధ్యాస అనీ అంటారు. అధ్యాసను మిథ్యగా కొట్టివేయాలంటే, అధిష్ఠానజ్ఞానం పొందాలి; మిథ్యకు అధిష్ఠానం సత్యం.

**మూలబోధాత్** – మూలం అంటే అధిష్ఠానం. అధిష్ఠానజ్ఞానం పొందితే, అధ్యాస పోతుంది. తాడు జ్ఞానం పొందితే, పాము అజ్ఞానం పోతుంది; జాగ్రత్ పురుషుని జ్ఞానం పొందితే, స్వప్నం మిథ్యగా తేలిపోతుంది. అహంకార మూలం ఏమిటో తెలుసుకోవాలని రమణమహర్షి పదేపదే చెబుతున్నారు. అహంకార అధిష్ఠానజ్ఞానాన్ని మూలబోధ అంటున్నారు. ఈ సత్య అధిష్ఠాన జ్ఞానం పొందటం ఎలాగో ఆ పద్ధతి చెప్పటం లేదు రమణమహర్షి. అక్కడికొచ్చేసరికి మౌనం వహిస్తున్నారు.

దాన్ని సరిగ్గా అర్థం చేసుకోలేకపోతున్నారు. రమణమహర్షి మౌనంగా ఉండమన్నారనీ, ధ్యానంలో నేనెవరు తెలుసుకోవాలనీ అంటారు.

**ఆత్మా వా అరే ద్రష్టవ్యః శ్రోతవ్యో మంతవ్యో నిదిధ్యాసితవ్యః** – బృహదారణ్యకమ్

ఆత్మజ్ఞానాన్ని శ్రవణ, మనన, నిదిధ్యాసనల ద్వారా పొందాలని శాస్త్రమే చెబుతున్నది. శ్రవణం అంటేనే గురువు ద్వారా నేర్చుకోవాలని అర్థం. అందువల్ల మూలబోధకు ఇలా కలుపుకోవాలి.

గురుముఖతః వేదాంత శ్రవణ మనన నిదిధ్యాసనం ద్వారా మూలబోధ. అలా శాస్త్ర అధ్యయనం చేసి జ్ఞానం పొందితే ఏమవుతుంది? అహంకారం నాశనం అవుతుంది. దాని తరువాత కూడా జ్ఞాని అహంకారాన్ని వాడతాడు కాని, అది వ్యావహారిక సత్యమే అవుతుంది కాని పారమార్థిక సత్యం అవదు. ఆ జ్ఞానం పొందితే ఏమవుతుంది?

**తత్ యుష్మత్ అస్మత్ మతివర్జితా** – అతను – నువ్వు – నేను అనే భేదభావనలు తొలగి,

**ఏకాస్థితిః** – తను అనంతమైన, ఏకమైన ఆత్మను అని అర్థం చేసుకుంటాడు.

ఉత్తమ పురుషుడు, మధ్యమ పురుషుడు, ప్రథమ పురుషుడు అని ముగ్గురు లేరు; ఉన్నదొకటే పురుషః అని అర్థం చేసుకుంటాడు. ఏకా అంటే అర్థం రమణమహర్షే ఇచ్చారు. తత్ యుష్మత్ అస్మత్ మతివర్జితా ఏకాస్థితిః – స్థితిః అంటే ఆత్మనిష్ఠ. త్రిపుటి భేదం లేని ఆత్మస్థితి.

వర్జితా – ఉత్తమ పురుషుడు, మధ్యమ పురుషుడు, ప్రథమ పురుషుడు ఈ మూడు పురుషాల భేదాలు లేవు అతనికి. ఇక్కడ కూడా సరిగ్గా అర్థం చేసుకోవాలి. భేదభావన పోతుంది, కాని భేద అనుభవం కొనసాగుతుంది. జ్ఞాని జీవించి ఉన్నంతకాలం భేద అనుభవం కొనసాగుతుంది. ఈ విషయాన్నే ముందు ముందు రమణమహర్షి చర్చిస్తారు. అక్కడ వివరంగా చూద్దాము.

జ్ఞాని అన్నీ సమానంగా చూస్తాడు అంటే సరిగ్గా అర్థం చేసుకోవాలి. రంగుల్ని విడిగా చూడడనీ, స్త్రీపురుషుల భేదం చూడడనీ కాదు అర్థం అక్కడ. ఒకవేళ ఎవరికన్నా అన్ని రంగులూ ఒకేలా కనిపించినా, మనుష్యులందరూ ఒకేలా కనిపించినా, అతనికి జ్ఞానం వచ్చిందనీ, సమభావం పెంపొందించుకుంటున్నాడనీ కాదు అర్థం. అతనికి శుక్లాలు (క్యాటరాక్ట్) వచ్చిందని అర్థం. అందువల్ల జ్ఞానం వచ్చిందని పొరపాటు పడకుండా, వెంటనే కంటిడాక్టరు దగ్గరకు వెళ్ళాలి. అందువల్ల జ్ఞానంవల్ల దృష్టిలో మార్పు రాదు, బుద్ధిలో మార్పు వస్తుందని అర్థం చేసుకోవాలి.

దీనికి మంచి ఉదాహరణ సూర్యోదయం, సూర్యాస్తమయం. విజ్ఞానశాస్త్రం సూర్యుడు ఉదయించడు, అస్తమించడు; భూమే సూర్యుని చుట్టూ తిరుగుతోందని నేర్పిస్తుంది. సూర్యుడు ఉదయించడు, అస్తమించడని నేర్చుకున్నాక కూడా అనుభవం మారదు. సూర్యోదయం,

సూర్యాస్తమయం అనుభవిస్తూనే ఉంటాము. కాకపోతే దృష్టి మారుతుంది. కంటికి కనిపించేదంతా సత్యం కాదని తెలుస్తుంది.

అదే విధంగా జ్ఞానం పొందాక కూడా అహంకారం కొనసాగుతుంది. కాని అహంకారంతో మమేకం చెందము. దాని మిథ్యాత్వబుద్ధిలో ఉంటాము.

**జ్వలంతీ ఆత్మనః (స్థితిః) సహజా స్యాత్** – ప్రకాశిస్తున్న ఈ ఆత్మనిష్ఠ అతనికి సహజమైనది అవుతుంది.

అతను ఆత్మనిష్ఠలో అప్రయత్నంగా నెలకొని ఉంటాడు. ఎందుకంటే ఒకసారి పొందిన జ్ఞానం ఇంక పోదు. ఎన్ని అనుభవాలు ఎదురైనా, అది జ్ఞానాన్ని పారద్రోలలేదు. సూర్యోదయం అనుభవం, సూర్యుని గురించిన జ్ఞానాన్ని పారద్రోలలేదు. అలాగే భూమి నలుచదరంగా ఉన్నట్టు కనిపిస్తుంది కాని ఈ అనుభవం భూమి గుండ్రంగా ఉంటుందనే జ్ఞానాన్ని పారద్రోలలేదు. అదే జ్ఞానంయొక్క గొప్పదనం.

ఈ సూత్రం ప్రకారం, జ్ఞాని ఎన్ని అనుభవాలను ఎదుర్కొన్నా అతని జ్ఞానం చెక్కు చెదరదు. ఏమిటా జ్ఞానం? భేదాలు అహంకారానికి ఉన్నాయి కాని, ఆత్మనైన నాకు లేవు. అతను ఏ పని చేస్తున్నా, తింటున్నా, తాగుతున్నా, మాట్లాడుతున్నా, ఈ భావనలోనే నెలకొని ఉంటాడు. దీన్ని **సహజ నిష్ఠా** అంటారు. కొంతమంది సహజ సమాధి అంటారు కాని పదాలను జాగ్రత్తగా వాడాలి. సహజ సమాధి అనగానే జ్ఞాని ఎక్కడో ఒకచోట కుదురుగా ధ్యానం చేస్తూ కూర్చుంటాడు అనుకునే ప్రమాదం ఉంది. అతను తక్కినవారిలాగే చురుకుగా ఉంటాడు. అందరిలాగే అన్నింటికీ స్పందిస్తాడు.

జ్ఞాని ఏ మాత్రమూ అసాధారణంగా కనబడడు. లోకభిన్నంగా ప్రవర్తించడు. అందరూ ముందుకు నడిస్తే జ్ఞాని వెనకకు నడవడు; కళ్ళు మూసుకుని కూర్చోడు, రోజంతా పద్మాసనంలో కూర్చోడు; కారణం లేకుండా నవ్వడు. బాహ్యంగా ఏమీ మార్పులు కనబడవు. మీరు, నేను ఎలా ఉన్నామో, జ్ఞాని కూడా అలాగే ఉంటాడు. కాని అత్యంత గొప్ప జ్ఞానం పొందిన జ్ఞాని అతను. దానివల్ల అతను జ్ఞాని అని అందరికీ తెలియదు.

సన్న్యాసి కాషాయవస్త్రాలు ధరిస్తాడు కాబట్టి అతన్ని ప్రత్యేకంగా చూస్తారు. అతను జ్ఞానం పొందినా, పొందకపోయినా గౌరవిస్తారు. కాని గృహస్థజ్ఞానికి నీరాజనాలు పట్టరు. పాదపూజ చేయరు. దండలు వేయరు. ఎందుకంటే అతను జ్ఞాని అని లోకానికి తెలియదు. కాని జ్ఞాని బాధపడడు. అలా ఒకవేళ నాకు మర్యాదలు చేయటం లేదు, దండలు వేయటం లేదు, నన్ను జ్ఞానిగా గుర్తించటం లేదు అని ఒకవేళ జ్ఞాని భావించేటట్టయితే అతను

నిజమైన జ్ఞాని కాదు. అతను ఈ మర్యాదలన్నీ అహంకారానికి, నేను వీటికి అతీతమైన ఆత్మను అనే ఆత్మనిష్ఠలో ఉంటాడు.

**జ్వలంతీ** – అటువంటి జ్ఞాని ఆత్మజ్ఞానంతో ప్రకాశిస్తాడు. మళ్ళీ ఇక్కడ ప్రకాశిస్తాడు పదాన్ని అక్షరాలా తీసుకోకూడదు. జ్ఞాని మొహంలో కాంతి రాదు, లేదా అతని వెనకాల పెద్ద కాంతి చక్రం ఏర్పడదు.

ఇంగ్లీషులో అతను తెలివైన విద్యార్థి అనటానికి హి ఈజ్ ఎ బ్రైట్ బాయ్ అనో, హి ఈజ్ ఎ బ్రిలియంట్ స్టూడెంట్ అనో అంటారు. దీనికి సంబంధించి ఒక జోక్ ఉంది.

'టీచర్ క్లాసుకి ఎందుకు చలువ కళ్ళద్దాలతో వచ్చింది?'

'పిల్లల మొహంలో ఉన్న కాంతిని తట్టుకోలేక.'

ఆ బ్రైట్, బ్రిలియంట్ అర్థమే జ్వలంతీ అంటే. కాని జ్ఞానంవల్ల కలిగే కాంతి బయటకు తెలియదు. ఇక్కడ అర్థం అతను జ్ఞాననిష్ఠలో నిలబడతాడని వస్తుంది.

**శ్లోకం 17**

**భూతం భవిష్యచ్చ భవత్స్వకాలే**
**తద్వర్తమానస్య విహాయ తత్త్వమ్ ।**
**హాస్యా న కిం స్యాద్గతభావిచర్చా**
**వినైకసంఖ్యాం గణనేవ లోకే ॥**

**ప్రతిపదార్థం:** భూతం = భూతకాలం; భవిష్యత్ చ = భవిష్యత్ కాలం కూడా; స్వకాలే = ఆయా కాలాల్లో; భవత్ = వర్తమానమే; తత్ = అందువలన; వర్తమానస్య = వర్తమానంయొక్క; తత్త్వం = స్వరూపాన్ని; విహాయ = వదిలి; గతభావిచర్చా = భూతభవిష్యత్తుల చర్చ; లోకే= లోకంలో; ఏకసంఖ్యా వినా = ఒకటి అనే సంఖ్య లేకుండా; గణనా ఇవ = 2, 3 లను లెక్క పెట్టినట్టు; హాస్యా = పరిహసించదగినది; న స్యాత్ కిం = కాదా?

**తాత్పర్యం:** భూతభవిష్యత్తు కాలాలు, ఆయా కాలాల్లో వర్తమానమే అవుతాయి. అలాంటప్పుడు వర్తమానంయొక్క స్వరూపాన్ని వదిలి, భూత భవిష్యత్ కాలాలను చర్చించటం అంటే, సంఖ్య 1 ని వదిలి, 2, 3 ను లెక్కపెట్టటం పరిహసించదగినది కాదా? అంటే అది సరియైనది కాదు.

**వివరణ:** ఇంతవరకూ రమణమహర్షి దేశపరిమితి గురించి వివరించారు. ఇప్పుడు ఈ శ్లోకంలో కాలపరిమితి గురించి వివరిస్తున్నారు రమణమహర్షి.

కాలాన్ని మూడు పదాలతో కొలుస్తాము – భూతకాలం, వర్తమానకాలం, భవిష్యత్ కాలం. దేశవిభజనను అడ్డగీతగానూ, కాలవిభజనను నిలువుగీతగానూ చూపిస్తారు. ఎందుకంటే కాలాన్ని ప్రవహించే నదితో పోలుస్తారు. కింద ఉన్న కాలం గడిచిపోయిన కాలం. నా ఎదురుగా ఉన్న కాలం నడుస్తున్న కాలం; పైన ఉన్న కాలం ఇంకా నాకు అందుబాటులోకి రాని కాలం. అందనిది కాబట్టి భవిష్యత్తు కాలం పైన ఉంది. ఆ విధంగా కాలాన్ని నిలువుగీతలో చూపిస్తారు.

కాలాన్ని, దేశాన్ని గ్రాఫ్ రూపంలో చూపాలంటే, అడ్డగీతని 'x' axis అనీ, నిలువుగీతను 'y' axis అనీ అంటారు. ప్రతి వస్తువును కాలపరిధిలో అంటే 'y' axisమీద, దేశపరిధిలో 'x' axisమీద చూపిస్తారు. ముందు శ్లోకంలో నేను, నువ్వు, అతను అనే విభజన మిథ్యగా కొట్టివేశారు. ఇది దేశవిభజనలోకి ఎలా వస్తుందంటారా? ఉత్తమ పురుషుడనైన నేను ఇక్కడ ఉన్నాను ఇది ఒక చోటు. మధ్యమ పురుషువైన నువ్వు నా ఎదురుగా ఉన్నావు. ఇది రెండో చోటు. ప్రథమ పురుషుడైన అతను ఎక్కడో దూరంగా ఉన్నాడు. ఇది ఇంకొక చోటు. ఇవన్నీ కలిపితే దేశవిభజన అవుతుంది. దీన్ని మిథ్యగా కొట్టివేశారు అంతకుముందు శ్లోకంలో.

ఇప్పుడు కాలం కూడా మిథ్యే అంటున్నారు. నిజంగా కాలం గురించి విశ్లేషిస్తే, అది నిజంగా లేదనీ, అదంతా అహంకారం చేసే గారడీ అని అర్థమవుతుంది. సుషుప్తిలో, అహంకారం కూడా పడుకున్నప్పుడు భూత భవిష్యత్ వర్తమాన కాలాలనే విభజన ఉండదు. అంటే అహంకారం లేస్తే కాల విభజన ఉంటోంది; అహంకారం పడుకుంటే కాల విభజన లేదు అంటే దాని అర్థం ఏమిటి? కాలవిభజన అహంకారంమీద ఆధారపడివుంది.

కాని అహంకారం ఆత్మమీద ఆధారపడివుంది. అందువల్ల మనం ఉందనుకుంటున్న ఈ కాలవిభజనకు కూడా ఆత్మే అధిష్ఠానం.

**కాల అధిష్ఠానమ్ అహమ్ అస్మి**

దేశకాలాలు ప్రత్యక్షంగా ఆత్మమీద ఆధారపడి లేవు. అవి అహంకారంమీద ఆధారపడితే, అహంకారం ఆత్మమీద ఆధారపడివుంది. ఆత్మ అంటే నేను అని మర్చిపోకూడదు. చాలా సూక్ష్మమైన అంశం. కాని లోతుగా ఆలోచించాల్సిన అంశం.

రమణమహర్షి ఇలా కాలాన్ని మూడుగా విభజించటం మిథ్య అంటున్నారు. గతం ఒక మిథ్ (myth). మిథ్యను కుదిస్తే మిథ్ అవుతుంది. ఇంగ్లీషులో కాలం ఏమిటి అని అడిగారనుకోండి, మిథ్‌యా (myth ya – mythya) అని జవాబు వస్తుంది. మిథ్ అంటే నిజంగా లేదని అర్థం. ఎలాగో మీరే చూడండి! గతాన్ని విశ్లేషిస్తే అది నిజంగా లేదు;

మీ ఊహలో మాత్రమే ఉంది. మీకు భిన్నంగా, బాహ్యంగా గతం ఉండే ప్రసక్తే లేదు. అందువల్ల గతం మిథ్య.

అదెలా సాధ్యం? గతం బాహ్యంగా లేదని ఎలా అంటారు? ఇవాళ అది బాహ్యంగా లేకపోవచ్చు, నిన్న ఉంది కదా? నిన్నటి రోజున నిన్న ఉంది; నేడు లేదు అనవచ్చు మీరు. అదే మేము చెప్పేదీను. నిన్న అనేది నేడు లేదు. నిన్ననే నిన్న ఉంది. నిన్న అది బాహ్యంగా ఉంది, నిజమే. కాని నిన్నటి రోజున చూసేదాన్ని నిన్న అనరు. నిన్నటికి అది నేడే అవుతుంది. ఇవాళ, అది గడిచిపోయిన నిన్న అవుతుంది.

అందువల్ల రమణమహర్షి అంటున్నారు, నిన్నటిరోజు బాహ్యంగా ఉంది, నిజమే కాని అప్పుడది నిన్న అవదు; నేడు అవుతుంది. నిన్న మీరు అనుభవిస్తున్నంతసేపు అది ఇవాళ (నేడు) అవుతుంది. ఆరోజు గడిచిపోతే, అది నిన్న అయిపోతుంది. మీ ఊహల్లోకి వెళ్ళిపోతుంది. నిన్నలో మీరు ఉంటే అది నేడు. నేడులో అనుభవిస్తుంటే నేడు. రేపుని మీరు అనుభవించేసరికి అది నేడు అవుతుంది.

Today is the tomorrow, you worried about yesterday.

నిన్నటిరోజున మర్నాడు గురించి బెంగపడ్డారు. నిన్నటిరోజు గడిచి నేడు వచ్చింది. నిన్నటికి మర్నాడు అయినది. ఇవాళ నేడు అయింది. అంటే మీకు అనుభవంలోకి వచ్చేది నేడు, నేడు, నేడు. నిన్నటి అనుభవం గడిచిపోయింది, నేడు వచ్చింది. గడిచిపోయిన అనుభవం మీ మనస్సు పొరల్లోకి జారుకుంటుంది.

పోనీ రేపైనా బాహ్యంగా ఉంటుందా? మీకు బాహ్యంగా కనిపించేది అంటే అది రేపు కాదు, ఇవాళే అవుతుంది. ఈ రేపనేది ఏమిటి? ఒక కాన్సెప్ట్. నిన్న అనేది ఒక కాన్సెప్ట్. మీ జ్ఞాపకాల్లో జొరబడటానికి అది ఒక పేరు మాత్రమే! అదే విధంగా రేపు మీ ఊహలకు ఒక పేరు మాత్రమే.

నిన్న అనేది మీ జ్ఞాపకమే. అందువల్ల గతం నన్ను బాధిస్తోంది అంటే నిజంగా మిమ్మల్ని బాధిస్తున్నది గతం కాదు. గతం అనేది ఉంటే కదా మిమ్మల్ని బాధించటానికి. లేనే లేని గతం ఎలా మిమ్మల్ని బాధించగలదు? మరి ఏమిటి బాధిస్తోంది? గతం గురించిన మీ జ్ఞాపకాలు. జ్ఞాపకాలు గతంలో ఉంటాయా, వర్తమానంలో ఉంటాయా? గతం గురించిన జ్ఞాపకాలు వర్తమానంలో ఉంటాయి. అందువల్ల సరిగ్గా చూడండి, మిమ్మల్ని బాధించేది గతం కాదు, గతం గురించిన జ్ఞాపకాలు మాత్రమే.

ఇదే సూత్రం భవిష్యత్తుకు కూడా వర్తిస్తుంది. మిమ్మల్ని ఆందోళనకు గురిచేసేది భవిష్యత్తు కాదు. మిమ్మల్ని ఆందోళనకు గురిచేసేది భవిష్యత్తు గురించిన మీ భయాలు. భవిష్యత్తు

గురించిన ఆలోచన భవిష్యత్తులో ఉంటుందా, వర్తమానంలో ఉంటుందా? గతం గురించి చూసినట్టే, భవిష్యత్తు గురించిన భయం వర్తమానంలో ఉంటుంది. మరి అయితే భవిష్యత్తు భయం అని ఎందుకంటారు? దాన్ని భవిష్యత్తు**లో** భయంగా విడదీయకూడదు, భవిష్యత్తు **గురించిన** భయంగా విడదీసి, వర్తమానంలో అని కలుపుకోవాలి.

ఆ విధంగా చూస్తే నిజంగా గతమూ లేదు, భవిష్యత్తూ లేదు. మరి అయితే ఉన్నదేమిటి? గతం గురించిన చేదు జ్ఞాపకాలు, భవిష్యత్తు గురించిన లేనిపోని భయాలు. అందువల్ల ఉన్నదొకటే వర్తమానం అంటున్నారు రమణమహర్షి. ఈ శ్లోకం దయానందస్వామీజీకి చాలా ఇష్టం. దీని గురించి ఎంతసేపైనా మాట్లాడతారు. ఈ నేపథ్యంతో ఈ శ్లోకం చూద్దాము.

**భూతం** – గతం లేదా భూతకాలం,
**భవిష్యత్ చ** – భవిష్యత్ కాలం,
**స్వకాలే** – తామున్న కాలంలో,
**భవత్** – వర్తమానమే.

భూతకాలం కాని, భవిష్యత్ కాలం కాని ఇప్పుడు లేవు. అవి వాటి కాలంలోనే ఉంటాయి. కాకపోతే భూతకాలంయొక్క ఉనికి ఉన్నప్పుడు అది భూతకాలం అవదు. అది వర్తమానమే అవుతుంది. అలాగే భవిష్యత్ కాలం వచ్చేసరికి, అది రాబోయే కాలం కాదు, వచ్చేసింది. అంటే అదీ వర్తమానమే అవుతుంది. స్వకాలే భవత్ అంటే అర్థం అదీ. అవి ఉన్న కాలం వర్తమానమే అవుతుంది. అవి భూత, భవిష్యత్తులు అవవు. గతమూ వర్తమానం అయి, భవిష్యత్తూ వర్తమానం అయితే, ఉన్నది ఏ కాలం? వర్తమానం మాత్రమే! అందువల్ల గతం మిమ్మల్ని బాధిస్తోంది అనుకోవటం పొరపాటు. గతం గురించిన చేదు జ్ఞాపకాలు బాధిస్తున్నాయి మిమ్మల్ని.

అందువల్ల ఇంక మిగిలింది వర్తమానం మాత్రమే అని చూశాము కదా! అక్కడా సమస్య తీరదు. ఎలాగో చూద్దాము. వర్తమానకాలం అంటే 24 గంటలు ఉన్నది. ఈ 24 గంటలను ఇంగ్లీషు కాలండర్ పరంగా తీసుకుందాము. నిన్న రాత్రి 12 గంటల నుంచి ఇవాళ రాత్రి 12 గంటల వరకు ఇవాళ అవుతుంది. పేరుకి వర్తమానంలోకి వస్తుంది కాని, ఒక్క గంట మాత్రమే వర్తమానం అవుతుంది. దాని ముందు సమయం గతం, దాని తరువాత సమయం భవిష్యత్తు అవుతుంది.

ఒక్క గంటే వర్తమానం అన్నాము కదా! ఏ గంట అది? మనకు విశ్లేషణకు వీలుగా ఉండటంకోసం స్వామీజీ సద్దర్శనం క్లాసు తీసుకునే సమయాన్ని తీసుకుందాం. అది

సాయంకాలం 7–8 వరకు. అందువల్ల నిన్నరాత్రి 12 నుంచి ఇవాళరాత్రి 7 వరకూ గతం అయితే, ఇవాళరాత్రి 8 నుంచి ఇవాళ అర్ధరాత్రి 12 వరకూ భవిష్యత్తు అవుతుంది. సరే అయితే, ఈ 7–8 గంట అయినా వర్తమానమా అంటే అదీ కాదంటున్నారు. 7.40 నిముషాల సమయంలో చూస్తే దానిముందు 39 నిముషాలు గతం, దాని తరువాత రాబోయే 20 నిముషాలు భవిష్యత్తు. 7.40 మాత్రమే వర్తమానం.

అక్కడితో ఆగకూడదు. 7.40 అనేది నిముషాలపరంగా చూస్తున్నాము. ఇప్పుడు ఒక నిముషంలో 60 సెకన్లు ఉన్నాయని తెలుసు. 7.40.25 అన్నారనుకోండి సమయాన్ని. అంటే 24 సెకన్లు గతం, రాబోయే 35 సెకన్లు భవిష్యత్తు అవుతాయి. ఉల్లిపాయను ఒక్కొక్క పొరగా తీస్తూ, పారేస్తూ వస్తే చివరికి ఏదీ మిగలదు. అరటిదూట కూడా అంతే. దాన్ని ఒలుస్తూ పోతే చివరికి ఏమీ మిగలదు. అలాగే సమయాన్ని ఇప్పుడు చూసినట్టుగా విశ్లేషిస్తూ పోతే, చివరికి ఏమీ మిగలదు.

మాథ్స్‌లో పాయింట్‌ని 'ఒక పరిమాణం లేని ఒక గీత' అన్నారెవరో. ఒక పాయింట్‌ను తీసుకుని, మైక్రోస్కోప్‌లో గమనిస్తే, అది ఒక పెద్ద గీతగా కనిపిస్తుంది. అంటే అదొక అంతుపట్టని సమస్య. ఇప్పుడు కాలం కూడా అలాగే అంతుపట్టని సమస్యగా ఉంది. సరే ఒక సెకను వర్తమానం అన్నాము. వర్తమానం గురించిన సత్యమేమిటి?

**తత్ వర్తమానస్య తత్త్వమ్** – అందువలన వర్తమానకాలంయొక్క స్వరూపాన్ని విశ్లేషిస్తే, అది అహంకారం ఏర్పరచిన భావన తప్ప మరేమీ కాదు. కాలాతీతమైన చైతన్యాన్ని కాలంగా విభజిస్తున్నది అహంకారం.

అహంకారం ఎలా ఏర్పడింది? దేహాభిమానంవల్ల. ఈ విషయాన్ని రమణమహర్షి తరువాత వివరిస్తారు. ఇప్పటికి అహంకారం దేహాభిమానం వల్ల ఏర్పడింది అని గుర్తుంచుకుంటే చాలు. ఎప్పుడైతే దేహాభిమానం వస్తుందో, వర్తమానం వస్తుంది. ఎప్పుడైతే దేహాభిమానం పోతుందో, వర్తమానం కూడా పోతుంది. అందువలనే సుషుప్తిలో నేను నిద్రస్తున్నాను అని చెప్పలేరు.

ఇదొక పజిల్ – 'ఏ ప్రశ్నకు ఎన్నడూ అవును అని జవాబు చెప్పలేవు?'

– 'గాఢనిద్ర పోతున్నావా?'

అవును, నేను గాఢనిద్ర పోతున్నాను అని చెప్పలేము. ఎందుకంటే అహంకారం పడుకుంటే, అహంకారజన్య కాలవిభజన కూడా పోతుంది. గాఢనిద్రనుంచి లేస్తే, అహంకారం లేస్తుంది, కాలమూ లేస్తుంది. అహంకారం లేనప్పుడు వర్తమానమే లేదు అంటే గతమూ, భవిష్యత్తూ

లేవని చెప్పకనే చెప్పినట్టు అవుతుంది. ఇంతకుముందే ఈ రెండూ లేవనీ, ఉన్నదొకటే వర్తమానమనీ చూశాము కదా!

కాలత్రయానికి ఆధారం వర్తమానం; వర్తమానానికి ఆధారం అహంకారం. అహంకారానికి ఆధారం ఆత్మ. ఇటునుంచి వస్తే ఆత్మ అహంకారంగా మారి, అహంకారం వర్తమానంగా మారి, వర్తమానం భూత, భవిష్యత్, వర్తమాన కాలాలుగా మారుతున్నది. ఆత్మ శరీరం ద్వారా దేశత్రయంగా, కాలత్రయంగా కనిపిస్తున్నది. అంటే వర్తమానస్య తత్త్వమ్ – చివరికి ఆత్మ అన్నాము.

**విహాయ** – కాని ఆత్మను వదిలివేస్తున్నారు. అహంకారానికీ, తద్వారా కాలత్రయానికీ అధిష్ఠానం ఆత్మ అనే విషయాన్ని తెలుసుకోవటం లేదు. అందువల్ల కాలం, కాలం, కాలం అంటున్నారు. కాని ఆత్మజ్ఞానాన్ని పొందందే కాలాన్ని అర్థం చేసుకోలేరు. విజ్ఞానశాస్త్రం కూడా దేశాన్ని, కాలాన్ని వివరించలేకపోతున్నది. ఆ రెండే చెప్పలేకపోతున్నాయంటే ఇంకేం చెప్పగలదు? ఎందుకంటే ప్రతివస్తువు కూడా దేశకాల పరిధుల్లోకి వస్తుంది.

అందువల్ల రమణమహర్షి దేశకాలాలను వాటి తత్త్వం గురించి తెలుసుకోలేకపోతే, వాటిని తెలుసుకోలేము అంటారు. వాటి తత్త్వం ఆత్మ.

**గతభావిచర్చా** – గతం గురించిన, భవిష్యత్తు గురించిన చర్చ,

**హాస్యా** – పరిహాసంగా ఉంది.

దేశకాలాల గురించిన చర్చ హాస్యాస్పదంగా ఉంది అంటున్నారు రమణమహర్షి. వాటిని ఆత్మలో కలపకుండా, ఎంత వాదోపవాదాలు చేసినా, జవాబు దొరకదు.

చర్చను తత్త్వమ్ విహాయ పదంతో కలుపుకోవాలి. ఆత్మ గురించి తెలుసుకోకుండా, దేశకాలాలను చర్చిస్తే అది అంతుపట్టని సమస్యగా మిగిలిపోతుంది.

ఫేటా, ఫ్రీవిల్లా చర్చ కూడా అంతుపట్టని సమస్యే అంటారు రమణమహర్షి. ఎందుకంటే అది కూడా కాలానికి చెందినదే.

**(హాస్యం) న స్యాత్ కిమ్** – హాస్యాస్పదంగా ఉండదా?

దీనికి ఒక ఉదాహరణ కూడా ఇస్తున్నారు.

**ఏక సంఖ్యాం వినా గణనా ఇవ లోకే** – ఇదెలా ఉందంటే సంఖ్య 1ని వదిలేసి, 2, 3, 4 సంఖ్యలను అర్థం చేసుకోవటానికి ప్రయత్నించినట్టు ఉంది అంటున్నారు.

ఎందుకంటే 1 లేకుండా 2 గురించి మాట్లాడలేము. 2 అంటే ఏమిటి? 1+1; 3 అంటే 1+1+1; అలా సాగుతుంది. అంటే 2 అనేది 1 యొక్క మారిన సంఖ్య. అలాంటిది వీటికి ఆధారమైన 1ని వదిలేసి, 2, 3, అర్థం చేసుకోవటానికి ప్రయత్నించటం హాస్యాస్పదం కాదా?

ఆత్మను వదిలేసి, సృష్టిని గురించి అర్థం చేసుకోవటానికి ప్రయత్నించటం అంతే హాస్యాస్పదంగా ఉంటుంది . అది అంతుపట్టని సమస్యగా మిగిలిపోతుంది. సైన్స్ Theory of Everything (TOE) అంటుంది. కాని ఇంకా మూలకారణాలు శోధించలేకపోతున్నది. దేశం మిథ్య, కాలం మిథ్య, ఆత్మ ఒక్కటే సత్యం; ఆ ఆత్మ నువ్వే అంటుంది శాస్త్రం. అదే అంటున్నారు రమణమహర్షి.

ఈ శ్లోకాల్లో రమణమహర్షి, ఆత్మ అజ్ఞానంవల్ల మనం అహంకారంతో మమేకం చెందుతున్నామనీ, తద్వారా దేహాభిమానం పెంచుకుంటున్నామనీ నిరూపిస్తున్నారు. ఆత్మ అజ్ఞానం మూలకారణం. ఆత్మ అజ్ఞానంనుంచి ఉత్పత్తి చెందిన మొదటి పొరపాటు లేదా అధ్యాస అహంకారం. ఈ పొరపాటు మరిన్ని పొరపాట్లకు కారణం అయింది. అవి ద్వైతభావన లేదా త్రిపుటి, దేశవిభజన, కాలవిభజన. అహంకారం అనే పునాదిమీద ఈ మూడంతస్తుల భవనం లేచింది. ఈ మూడు మనను సంసారంలో పడవేస్తున్నాయి.

దేశవిభజనవలన నేను పరిమితి ఉన్న జీవిని అనుకుంటాము. నేనిక్కడ ఉన్నాను, నా వారెక్కడో ఉన్నారు; నేను ప్రయాణం చేసి వారిని చేరుకోవాలి. ఆ దూరాన్ని తరిగించటానికి అనేక సాధనలు. ముందు నడక, తరువాత పరుగులు, తరువాత చక్రాన్ని కనుగొన్నాడు మనిషి. దాన్ని ఉపయోగించి రెండెడ్ల బండి, గుర్రబ్బండి తయారుచేశాడు. మేధస్సు పెరిగిన కొద్దీ, కారు, బస్సు, రైలుబండి, విమానం కూడా కనుగొన్నాడు. ఇదంతా దూరాన్ని తగ్గించుకోవటానికి వచ్చిన తపనవల్ల వచ్చాయి. అంతేకాదు, ఇప్పుడు సోషల్ మీడియా – టీవీ, వార్తాపత్రికలు, ఫోన్లు, టెలిగ్రామ్‌లు, కొరియర్లు, అన్నీ దూరంగా ఉన్నవారిని చేరుకోవటానికి ఉపయోగపడుతున్నాయి. ఈ సమస్యకు కారణం నేను పరిమితి ఉన్న ఒక చిన్న జీవిని అని బాధపడటం.

ఇంకొక సమస్య కాలం కోరల్లో చిక్కుకుపోవటంవల్ల ఏర్పడుతున్నది. ఈ రోజుల్లో అయితే మరీ! పరుగో, పరుగు! వచ్చే వారానికి ఈ ప్రాజెక్ట్ అవ్వాలి అంటారు ఐ.టీ.వారు; వచ్చే నెలకల్లా కొత్త ప్రొడక్ట్ ఉత్పత్తి చెందాలి అంటారు వ్యాపారవేత్తలు. నేను మరణించేలోపు నా బాధ్యతలను పూర్తిచేయాలి అంటాడు ఉద్యోగి. ఎటు చూసినా ఆందోళన, పరుగులు – ఈ కాలం అనే మహమ్మారి కోరల్లో చిక్కటంవల్ల.

మూడవ సమస్య ద్వైతభావన లేదా త్రిపుటిలో నిలవటంవల్ల. ఎక్కడ విభజన ఉంటుందో అక్కడ రాగం, ద్వేషం, అసూయ ఉంటాయి. ఎదుటివారితో పోల్చుకుంటే, అసూయ కలుగుతుంది. అంటే సంసారంలో పడవేస్తుంది.

అదే సుషుప్తిలో చూడండి – ఈ మూడూ లేవు. దేశపరిమితి లేదు, కాలపరిమితి లేదు, ద్వైతభావన లేదు, త్రిపుటి లేదు. అందువల్ల వీటినుంచి వచ్చిన సంసారమూ లేదు! సుషుప్తిలో ఈ సమస్యలు ఎందుకు లేవని విశ్లేషిస్తే సుషుప్తిలో అహంకారం పడుకుంటుంది కాబట్టి, అహంకారజన్య సమస్యలూ పడుకుంటాయి. అందువల్ల అహంకారాన్ని నాశనం చేయాలి అని అర్థమౌతుంది. అహంకారం అంటే దేహాభిమానం.

**శ్లోకం 18**

**క్వ భాతి దిక్కాలకథా వినాఽస్మాన్**
**దిక్కాలలీలేహ వపుర్వయం చేత్ ।**
**న క్వాపి భామో న కదాఽపి భామో**
**వయం తు సర్వత్ర సదా చ భామః ॥**

**ప్రతిపదార్థం:** అస్మాన్ = మనం; వినా = లేకుండా; దిక్కాలకథా = దేశంయొక్క, కాలంయొక్క వ్యవహారం; క్వ = ఎలా; భాతి = జరుగుతుంది?; వయమ్ = మనం; వపుః శరీరం; చేత్= అయితే; దిక్కాలలీలా = దేశకాలాల విలాసం; (భవతి) = ఉంది; క్వ అపి = ఎక్కడ కూడ; న భామః = మేము భాసించటం లేదు; కదా అపి = ఎప్పుడు కూడా; న భామ = మేము భాసించటం లేదు; తు = కానీ; వయం = మేము; సర్వత్ర = అంతటా; సదా చ = ఎప్పుడూ; భామః = భాసిస్తాము.

**తాత్పర్యం:** చూసే మనం లేకుండా దేశకాల వ్యవహారం ఎలా జరుగుతుంది? మనం శరీరం అయితే దేశకాలాల వ్యవహారం ఉంది. కాని మేము ఎక్కడా, ఎప్పుడూ భాసించటం లేదు. మేము అంతటా, అన్నివేళలా భాసిస్తాము.

**వివరణ:** నేను లేకుండా దేశకాల వ్యవహారం కుదరదు. ఏ నేను? రెండు నేనులు ఉన్నారు. చైతన్యం (ఆత్మ) నేను, అహంకారం నేను.

**అస్మాన్ వినా** – మనం లేకుండా,
**క్వ భాతి** – ఎలా జరుగుతుంది?

చైతన్యం అయిన నేను లేకపోతే, దేశకాల విభజన ఉండదు. ఇప్పుడు అహంకార పరంగా చూస్తాము. అంటే, అహంకారంతో మమేకం చెందితే,

**వయం** – మనము,

**వపుః చేత్** – శరీరమే అయితే,

వపుః అంటే శరీరం; వపుః చేత్ అంటే శరీరాభిమానినః చేత్ అని తీసుకోవాలి.

అంటే నేను అధిష్ఠానం నేనునుంచి అధ్యాస నేనుకి పడిపోతే, నేను ఆత్మనునుంచి నేను అహంకారాన్ని స్థాయికి పడిపోతే, పెద్ద నేనునుంచి చిన్న నేనుకి పడిపోతే, ఆ పడిపోవటాన్ని సంసారం అంటారు. భగవంతుడు కూడా శరీరాన్ని ధరిస్తాడు. అవతారం ఎత్తినప్పుడు భగవంతుడు కూడా మానవ శరీరాన్ని ధరిస్తాడు, కాని దాన్ని జన్మ అనము, అవతారం అంటాము. అవతారం అంటే కావాలని శరీరాన్ని ధరించి, అహంకారం ఉన్నది వ్యవహారం నడపటానికే అనే జ్ఞానంతో, ప్రయత్నపూర్వకంగా, కిందకు దిగటం.

మానవజన్మ ఎత్తినందుకు, అవతారపరంగా పరమాత్మ కూడా వ్యవహారం నడుపుతాడు, కాని దానితో మమేకం చెందదు. అందువల్ల భగవంతుడు చేసే కర్మను లీల అంటాము. అంటే అందులో బాధ ఉండదు. మనుష్యులకు జీవితమంతా ఘర్షణే. ఎందుకు? వారు అహంకారంతో మమేకం చెందుతారు కాబట్టి. వ్యవహారసత్యమే అంతిమ సత్యంగా తీసుకుంటారు కాబట్టి. వారికి పారమార్థిక సత్యం అనే అంతిమసత్యం ఉందని తెలియదు కాబట్టి.

వపుః వయం చేత్ – ఒకవేళ శరీరంతో మమేకం చెంది, నేను అహంకారం అనుకుంటే ఏమవుతుంది?

**దిక్కాలలీలా** – దేశకాలాల విలాసం మొదలవుతుంది. వృద్ధాప్యం, అనారోగ్యం, అభద్రతా భావన భయంకరంగా పట్టి పీడిస్తాయి. శనిదశ, రాహుదశ భయపెడతాయి. వీటన్నిటిని ఎలా పారద్రోలాలి? వీటిని పారద్రోలలేము. వీటికి మూలకారణమైన, వీటికి పునాది అయిన అహంకారాన్ని పారద్రోలాలి.

అన్వయ వ్యతిరేక పద్ధతి ఉపయోగిస్తే సమస్య అహంకారంవల్లనే అని అర్థమవుతుంది. జాగ్రదావస్థలో, స్వప్నావస్థలో అహంకారం ఉంది; సంసారం ఏర్పడుతున్నది. అదే సుషుప్తి అవస్థలో అహంకారం పడుకుంటుంది, సంసారం కూడా పడుకుంటుంది. అంటే సమస్యకు ఏది కారణం? నిస్సందేహంగా అహంకారమే.

ఇప్పుడు అహంకారాన్ని ఎలా పారద్రోలాలి? అహంకారానికి మూలకారణమేమిటో తెలియాలి. ఇంకొక మెట్టు ఎక్కాము గమనించారా?

దశ 1 – సంసారానికి మూలకారణం అహంకారం.

ఇప్పుడు అహంకారానికి మూలకారణం కనుక్కోవటమే దశ 2.

దశ 2 – అహంకారానికి మూలకారణం దేహాభిమానం.

వయం వపుః చేత్ – నేను శరీరాన్ని అనే అభిమానమే అహంకారానికి మూలకారణం అంటున్నారు రమణమహర్షి.

దేహాభిమానం ఎలా పోతుంది? అది అజ్ఞానంవల్ల ఏర్పడింది. దాన్ని సరియైన జ్ఞానంతో పారద్రోలాలి. జ్ఞానాత్ ఏవ అహంకారనాశః.

**మనో బుద్ధ్యహంకారచిత్తాని నాఽహమ్ ।**

నేను మనస్సు కాదు, బుద్ధి కాదు, అహంకారం కాదు, చిత్తం కాదు, నేను ఇంద్రియాలు కాదు, నేను శరీరం కాదు. మరి నేనెవరు?

**చిదానందరూపః శివోఽహం శివోఽహమ్ ।** నేను సచ్చిదానంద ఆత్మను.

కాని ఈ జ్ఞానం ఎలా పొందాలి? నేనెవరు అని కళ్ళు మూసుకుని ధ్యానం చేస్తే ఈ జ్ఞానం కలుగుతుందా? ఇది వేదాంతం ఎంతమాత్రమూ ఒప్పుకోదు.

**సమిత్పాణిః సగురుమేవాభి గచ్ఛేత్ శ్రోత్రియం బ్రహ్మనిష్ఠమ్** – ముండకమ్

ముండకోపనిషత్తు, ఆత్మజ్ఞానం పొందటానికి శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ అయిన గురువు దగ్గరకు, సమిధలు పుచ్చుకుని, మీరే వెళ్ళాలి అంటుంది. వేదాంతం ఆధారంగా వచ్చిన గీతలో కూడా కృష్ణపరమాత్మ ఈ అంశాన్ని నొక్కివక్కాణిస్తాడు.

**తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా** – గీత

గురువు దగ్గరకు వెళ్ళి ఆయనకు శుశ్రూష చేసి, ప్రశ్నలు వేసి, ఆత్మజ్ఞానాన్ని పొందాలి. శాస్త్రప్రమాణం ద్వారా పొందే జ్ఞానమేమిటి? రమణులవారు మూడవపాదంలో చెబుతున్నారు.

**న క్వాపి భామః** – క్వ అపి అంటే ఆత్మ; న క్వ భామః – అది ఎక్కడా భాసించటం లేదు. ఎక్కడా లేదు అంటే దేశపరిమితి లేదు. ఉత్తరం రాసేటప్పుడు ఏ ఊరునుంచి రాస్తున్నామో ఆ ఊరిపేరు రాస్తాము. అంటే దేశపరిమితిని సూచిస్తాము. అలాగే తారీఖు వేస్తాము. అంటే కాలపరిమితిని సూచిస్తాము. అంటే మనం రాసే ప్రతి ఉత్తరం కూడా అహంకారాన్ని ఎలుగెత్తి చాటుతోంది.

ఒక్కోసారి ఉత్తరం రాసి, అది నచ్చక దాన్ని చించి పోగులు పెడతాము. అలా భగవంతుడు కూడా చించి పోగులు పెడతాడు. దేన్ని? దేశకాలపరిమితులను. వాటికి కారణమైన అహంకారాన్ని.

న క్వాపి భామః అంటే ఒక్క దేశానికి పరిమితమవలేదు. అంటే దేశపరిమితి లేదు ఆత్మకు.

**న కదాఽపి భామః** – అంటే కాలపరిమితి లేదు. కదా అంటే కాలపరిమితి.

న క్వాపి భామో, న కదాఽపి భామః – రెండూ కలిపితే మేము ఒక దేశంలో లేము, ఒక కాలంలో లేము. అయితే ఎక్కడ, ఎప్పుడు ఉన్నాము? నాలుగవ పాదంలో వస్తుంది.

**వయం తం** – మేము

**సర్వత్ర సదా చ భామః** – అంతటా, అన్నివేళలా భాసిస్తాము. నిజానికి దేశకాలాలు కూడా మాలోనే ఉన్నాయి. మేము అంటే అనేక ఆత్మలు కాదు. అది గౌరవసూచకమైన పదం.

**తస్మాద్వా ఏతస్మాత్ ఆత్మనః ఆకాశః సంభూతః** – తైత్తిరీయమ్

ఆత్మనుంచే ఆకాశం (space) పుట్టింది అని తైత్తిరీయంలో వస్తుంది. మరి ఆత్మకు కాలపరిమితి లేదని ఎక్కడ వస్తుంది? గీతలో!

**నిత్యః సర్వగతః స్థాణుః** – గీత

ఆత్మ నిత్యం. అంటే కాలాతీతం. ఈ శ్లోకాలను ఊరికే పారాయణం చేసి ఊరుకోకూడదు. అవి సత్యం అవాలి. ఎవరి గురించిన సత్యం? రాముడు, కృష్ణుడు, శంకరాచార్యుల గురించిన సత్యం కాదు. ఇది నా గురించిన సత్యం అని ఎవరికి వారు అర్థం చేసుకోవాలి. ఇది జీర్ణించుకుంటే కాని మోక్షం సాధ్యం కాదు.

అందువల్ల సమస్య ఎక్కడ ఉంది? బాహ్యంగా లేదు, నాలోనే ఉంది. ఇంకా మాట్లాడితే నా గురించి సరిగ్గా అర్థం చేసుకోకపోవటంవల్ల ఉంది. అందువల్ల పరిష్కారం నన్ను నేను సరిగ్గా అర్థం చేసుకోవాలి. బాహ్యంగా పరిష్కారం దొరకదు.

**శ్లోకం 19**

**దేహాత్మభావే జ్ఞజడౌ సమానా–**
**వేకస్య దేహే హృది దీప్త ఆత్మా ।**
**ఆక్రమ్య దేహం చ జగచ్చ పూర్ణః**
**పరస్య మేయం తనుమాత్రమాత్మా ॥**

**ప్రతిపదార్థం:** దేహాత్మభావే = దేహం అనే సన్నిహితమైన అనుభవం; జ్ఞజడౌ = జ్ఞానికి, అజ్ఞానికి; సమానౌ = సమానమే; ఏకస్య = ఒకరికి, జ్ఞానికి; దేహే = శరీరంలోని; హృది= హృదయంలో; ఆత్మా = ఆత్మ; దీప్తః = ప్రకాశిస్తుంది. దేహం చ = అది దేహాన్ని; జగచ్చ= జగత్తునీ; ఆక్రమ్య = ఆక్రమించి; పూర్ణః = పూర్ణంగా ఉంది; పరస్య = ఇంకొకతనికి, అజ్ఞానికి; తనుమాత్రం = శరీరమే; ఆత్మా = ఆత్మ; మేయం = పరిమితమైంది.

**తాత్పర్యం:** దేహం అనే సన్నిహితమైన అనుభవం జ్ఞానికి, అజ్ఞానికి సమానమే. జ్ఞానికి ఆత్మ శరీరంలోని హృదయంలో ప్రకాశిస్తుంది. అది దేహాన్నీ, జగత్తునూ ఆక్రమించింది, పూర్ణంగా ఉంది. అజ్ఞానికి శరీరమే ఆత్మ, అది శరీరానికే పరిమితమైంది.

**వివరణ:** ఇది చాలా ముఖ్యమైన శ్లోకం. అహంకారానికి మూలకారణం ఏమిటి? దేహాభిమానం. ఇది దశ రెండు అని అంతకుముందు చూశాము. దాన్ని ఇప్పుడు వివరిస్తున్నారు రమణులవారు.

దేహాత్మభావన అంటే ఏమిటి? ఒక శరీరాన్ని సన్నిహితంగా నేనుగా భావించటం. అంటే అనేక శరీరాలు నా ఎదురుగా ఉన్నాయి. అవి నాకు తెలుస్తున్నాయి. నా శరీరమూ నాకు తెలుస్తున్నది. ఈ రెండింటి మధ్య భేదం ఏమిటి? తక్కిన శరీరాలు నాకు సన్నిహితంగా లేవు. కొంతదూరం ఉంది. నాకున్న జ్ఞానేంద్రియాలను ఉపయోగిస్తే వాటిని నేను చూడగలను; వారిని వినగలను. నేను నా ఇంద్రియాలను మూసుకుంటే వారిని అనుభవించలేను. అంటే తక్కిన శరీరాలలో ఉన్న వారి గురించి తెలియాలంటే, నాకు ఒక మాధ్యమం కావాలి.

ఆ మాధ్యమం కూడా కొంతమేరకే వారి గురించి తెలుపగలదు. అంటే ఒక వ్యక్తి నా ఎదురుగా ఉంటే, అతని రంగు, ఒడ్డు, పొడుగు – ఇవి మాత్రమే తెలుసుకోగలను. కాని అతని శరీరానికి కలిగే సుఖదుఃఖాలు తెలియవు. అతన్ని ఒక దోమ కుదుతుంటే, నా కళ్ళకు అతనూ కనబడుతున్నాడు, దోమ కుట్టటమూ కనబడుతోంది, కాని అది అతనికి ఎంత బాధ కలిగిస్తున్నదో నా అనుభవంలోకి రాదు.

కాని అదే దోమ అతని మీంచి ఎగిరివచ్చి, నన్ను కుడితే, ఆ అనుభవం పూర్తి అవుతుంది. ఆ అనుభవం వెంటనే తెలియటం మాత్రమే కాదు, ఆ అనుభవాన్ని పొందటానికి నేను కళ్ళు తెరిచి చూడనవసరం లేదు కూడా. దీన్నే దేహాత్మభావన అంటారు. అంటే ప్రత్యేకించి ఒక శరీరాన్ని నేనుగా అనుభవించటం.

**దేహాత్మభావే** – ఈ దేహమే నేను అనే సన్నిహితమైన అనుభవం.

**జ్ఞజడౌ** – ఈ భావన జ్ఞానికి, అజ్ఞానికీ కూడా సమానంగా కలుగుతుంది అంటున్నారు రమణమహర్షి. ఇది మనం గుర్తుంచుకోవాల్సిన చాలా ముఖ్యమైన విషయం. ఈ అనుభవం ఒక ప్రత్యేకమైన శరీరంతో, ఈ శారీరక అనుభవం, ఈ సన్నిహిత సంబంధం, ఈ స్థూల శరీర అనుభవం అటు జ్ఞానికీ, ఇటు అజ్ఞానికీ కూడా సమానమే. జ్ఞ అంటే జ్ఞాని, జడః అంటే అజ్ఞాని. అంటే ఏమిటి? ఒక అజ్ఞాని జ్ఞాని అయ్యాక కూడా, ఒక ప్రత్యేకమైన శరీరాన్ని తన స్వంత శరీరంగా భావించటం కొనసాగిస్తాడు. దీని అర్థం ఏమిటి? అతని

శరీరానికి ఆకలి వేస్తే, అతనికి ఆకలి వేస్తుంది. కాని తక్కినవారి శరీరాలకి ఆకలి వేస్తే, అతనికి ఆకలి వేయదు.

జ్ఞాని విషయంలో రెండు సందేహాలు వచ్చే అవకాశం ఉంది. ఒకటి జ్ఞానికి జ్ఞానం పొందాక దేహాభిమానం పోయి, అతనికి ఆకలి వేసినట్టుగా కూడా తెలియదా? రెండవది, జ్ఞానికి సర్వాత్మభావన ఉంటుంది కాబట్టి, అంటే అందరిలోనూ ఆత్మను చూస్తాడు కాబట్టి, ఎవరికి ఆకలి వేసినా అతనికి కూడా ఆకలి వేస్తుందా?

రమణమహర్షి ఈ సందేహాలను తీరుస్తున్నారు ఇక్కడ. శారీరక అనుభవాలు జ్ఞానికి కూడా కొనసాగుతాయి. తన శరీరానికి అనారోగ్యం కలిగితే, అది అతనికి తెలుస్తుంది. అంతేకాని, ఇంకొకరి శరీరానికి అనారోగ్యం కలిగితే అతనికి తెలియదు. దీన్నిబట్టి మనం గ్రహించాల్సింది – శారీరక అనుభవాల విషయంలో జ్ఞానం పొందటంవల్ల ఏ మార్పూ ఉండదు.

అందువల్లనే వేదాంతశాస్త్రం జ్ఞాని కూడా ప్రారబ్ధకర్మను అనుభవించక తప్పదు అంటుంది. జ్ఞాని, జ్ఞానం పొందాక నేను చేస్తున్నాను అనడు కాబట్టి ఆగామికర్మలు అంటవు. జ్ఞానాగ్ని సంచితకర్మలను దగ్ధం చేస్తుంది కాబట్టి పునర్జన్మ ఉండదు; కాని ఈ జన్మలో అనుభవించాల్సిన ప్రారబ్ధ పుణ్యపాప కర్మల ఫలాన్ని అనుభవించక తప్పదు. ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలి.

ఇదొక అపోహ కొంతమందిలో. వేదాంతశాస్త్రంలో, జ్ఞానికి దేహాభిమానం ఉండదని నేర్చుకుంటారు. దీన్ని సరిగ్గా అర్థం చేసుకోక, జ్ఞానికి శరీరానికి ఏమయినా, నొప్పి తెలియదు అని అర్థం చేసుకుంటారు. అందువల్ల కొంతమంది, ఏ దశకు వెళతారంటే, ఆరోజు క్లాసు అయ్యాక వారి చేతిని పిన్నుతో గుచ్చుకుని చూస్తారు. వారికి నొప్పి తెలిస్తే, వారికి జ్ఞానం వచ్చింది కాని, జ్ఞాననిష్ఠలో లేరని బాధపడతారు. కాని స్వామీజీ ఆ ఆలోచన ఉన్నవారిని గట్టిగా హెచ్చరిస్తున్నారు.

వారు గనుక, పిన్నుతో గుచ్చుకుని నొప్పి తెలియకపోతే, జ్ఞాననిష్ఠలో ఉన్నామని మురిసిపోవటం కాదు, వెంటనే డాక్టరు దగ్గరికి పరిగెత్తాలి అంటున్నారు. వారికి స్పర్శ తెలియకపోవటం మురిసిపోయే విషయం కాదు, భయపడాల్సిన విషయం అంటారు స్వామీజీ.

కాని వచ్చిన చిక్కేమిటంటే, వారికి ఆ అపోహ ఉండటమే కాదు, దాన్ని సమర్థించుకునేందుకు కథ కూడా ఉంది. ఇలాంటి అయోమయంలో పడేవారికి ఈ కథ చాలా నచ్చుతుంది. సదాశివ బ్రహ్మేంద్రకు శరీరం గురించిన శ్రద్ధ ఉండదు. వంటిమీద బట్ట ఉందో లేదో స్పృహ కూడా ఉండేది కాదు. తిరుగుతున్న రోజుల్లో బ్రహ్మము తప్ప మరేమీ పట్టని పరధ్యానస్థితిలో దిగంబరంగా, శరీరస్పృహ లేకుండా, ఎటు వెళుతున్నాడో

తెలియకుండా, ఒక నవాబుగారి అంతఃపురంలో అటూ ఇటూ తిరుగుతుండగా, అంతఃపురవాసులు గమనించి నవాబుకు చెప్పారు. ఆయనను పట్టుకోమని నవాబు పురమాయించగా, సైనికులు ఆయన రెండు చేతులను నరికివేశారు. చేతులు రాలాయి. సదాశివలో మార్పు లేదు. అలా పరధ్యానంగా నడుస్తూనే ఉన్నారు. ఇది నవాబుకు చెప్పారు.

నవాబు తన తప్పు తెలుసుకుని పశ్చాత్తాపపడి, నవాబు రెండు చేతులను తీసుకుని, సదాశివకు ఎదురువెళ్ళి ఆ చేతులను అర్పించారు. అంతే రెండు చేతులూ తిరిగి అతుక్కున్నాయి. సదాశివ నడుచుకుంటూ వెళ్ళిపోయారు. ఎవరూ ఏమీ మాట్లాడలేదు.

ఈ కథ కాకుండా, రమణమహర్షి అనుభవం కూడా చెబుతారు. ఆయన మత్తుమందు తీసుకోకుండా ఆపరేషన్ చేయించుకున్నారని చెబుతారు. అలా సదాశివ బ్రహ్మేంద్రకూ, రమణమహర్షికీ వారు జ్ఞానులు కాబట్టి, సిద్ధులు వచ్చాయి కాబట్టి, తమకూ సిద్ధులు వస్తాయని ఎదురుచూస్తారు కొందరు. వారికి సిద్ధులు వచ్చాయి నిజమే, కాని జ్ఞానానికీ, సిద్ధులకూ సంబంధం లేదు. జ్ఞానం పొందితే సిద్ధులు వచ్చితీరాలనే నియమం లేదు.

జ్ఞానం పొందకుండా కూడా, మత్తుమందు లేకుండా, హిప్నోటిజమ్ ఉపయోగించి కూడా ఆపరేషన్ చేయవచ్చని ఒకసారెప్పుడో టీవీలో కార్యక్రమం వచ్చింది. అందులో, ఒక స్త్రీకి ఒక డాక్టరు హిప్నోటైజ్ చేసి, ఆవిడకు మత్తుమందు ఇవ్వకుండా ఆపరేషన్ చేశారు. ఆవిడ కూడా మహాజ్ఞాని అవాలి కదా. ఇవన్నీ లేనిపోని అపోహలు. అదృష్టం బాగుండి రమణులవారే ఈ అపోహను పారద్రోలుతున్నారు.

జ్ఞజడే సమానౌ – జ్ఞ అంటే జ్ఞాని; జడః అంటే అజ్ఞాని. ఇద్దరూ దేహాత్మ భావన విషయంలో సమానమే. దేహాత్మ భావన అంటే ఒక శరీరాన్ని ప్రత్యేకించి తన శరీరంగా భావించటం. అంటే శరీరానికి వచ్చే ఆకలిదప్పులు, సుఖదుఃఖాలు, వృద్ధాప్యం, అనారోగ్యం, చివరికి మరణం – అన్నీ ఇద్దరికీ సమానం. **వేదాంతం నేర్చుకుంటే శారీరక సమస్యలు పోవు. వేదాంతం మానసిక, బుద్ధిపరమైన సమస్యలకు మాత్రమే పరిష్కారం.**

శారీరక బాధకు, మానసిక బాధకు మధ్య భేదమేమిటి? జ్వరం రావటం శారీరక బాధ. నాకే ఎందుకు వచ్చిందని వాపోవటం మానసిక బాధ. ఒక చిన్న పిల్లవానికి జ్వరం వచ్చినా ఓపికుంటే ఆడుకుంటాడు, లేకపోతే పడుకుంటాడు. అంతేకాని, నాకే ఎందుకు వచ్చింది? దీనికోసం ఎంత ఖర్చు అవుతుంది? ఎన్నాళ్ళు ఆడుకోకూడదు? ఈ మానసిక బెంగలేవీ ఉండవు.

జ్ఞాని పరిస్థితి కూడా అంతే. శారీరక బాధ ఒక చిన్న చుక్క అయితే, మామూలుగా మనం దానిచుట్టూ అనేక వలయాలు ఏర్పరచి, దాన్ని పెద్దది చేస్తాము. నాకే ఎందుకు వచ్చింది? – ఒక వలయం. ఇది ఎంత పెద్ద అనారోగ్యం? – ఇంకొక వలయం. ఎంత డబ్బు ఖర్చు అవుతుంది? – మరో వలయం. భగవంతునికి కళ్ళు లేవా? – మరో వలయం. నేనెవరికీ హాని చేసి ఎరుగను – మరో వలయం. ఇలా వలయాలు పెంచుకుంటూ పోతాము మనం.

కాని జ్ఞాని దాన్ని చిన్న చుక్కగా చూస్తాడు తప్పితే, ఇలా వలయాలు పెంచుకుపోడు. అంటే శారీరక బాధకు మానసిక దుఃఖాన్ని పెంచి పోషించడు. పైగా వేదాంతం నేర్చుకున్నాక, ఆ బాధ శరీరానిది, నేను శరీరం కాను అని అర్థం చేసుకోవటంవల్ల ఆ నొప్పి కూడా అంతగా బాధించదు. అందువల్ల దేహాత్మభావే జ్ఞజడౌ సమానౌ అంటున్నారు రమణమహర్షి.

మనం ఎప్పుడూ చూసే సూర్యోదయం ఉదాహరణను గుర్తుకు తెచ్చుకోవాలి. సూర్యోదయం మనకు అనుభవంలోకి వస్తుంది. అనుభవాన్ని బట్టి ఒక సిద్ధాంతాన్ని ఏర్పరచుకుంటాము. ఎన్ని సంవత్సరాలో సూర్యుడు భూమి చుట్టూ తిరుగుతున్నాడు అనుకున్నాము. కాని తరువాత ఒక శాస్త్రజ్ఞుడు వచ్చి సూర్యుడు తిరగటం లేదు, భూమే సూర్యుని చుట్టూ తిరుగుతోందని నిరూపించాడు.

ఈ శాస్త్రజ్ఞుడు చెప్పిన జ్ఞానం పొందాక, మన సిద్ధాంతాన్ని మార్చుకున్నాము. అంటే బుద్ధిలో మార్పు వచ్చింది. కాని సూర్యోదయం అనుభవం మారుతుందా? మారదు! అనుభవం అలాగే కొనసాగుతుంది, కాని అనుభవం వల్ల ఏర్పరచుకున్న సిద్ధాంతం మారుతుంది. అదే విధంగా, నేను శరీరం కాదనే జ్ఞానం పొందాక కూడా శారీరకంగా పొందే అనుభవాలు మారవు. ఆకలిదప్పులు, అనారోగ్యం, వృద్ధాప్యం, సుఖదుఃఖాలు కొనసాగుతాయి. జ్ఞానానికి రాకముందు, శరీరానికి అవుతున్న అనుభవాలనుబట్టి నేను శరీరం అనుకుంటాము. కాని జ్ఞానం పొందాక, నేను తప్పుగా అర్థం చేసుకున్నాను, నేను శరీరం కాదు, నేను శరీరానికి అతీతంగా ఉన్న ఆత్మను అని అర్థం చేసుకుంటాము. అనుభవం మారదు, బుద్ధిలో మార్పు వస్తుంది.

శరీరంలో జరిగే మార్పులవల్ల మనం కొన్ని సిద్ధాంతాలు ఏర్పరచుకున్నాము. ఎక్కడ? బుద్ధిలో, శరీరంలో కాదు. ఏమిటవి?

1. నేను శరీరాన్ని
2. నేను శరీరాన్ని కాబట్టి నాకొక పుట్టినరోజు ఉంది. అలాగే ఒకరోజు మరణిస్తాను.

3. నాకు చావు–పుట్టుకలు ఉన్నాయి కాబట్టి నేను అశాశ్వతమైన జీవిని

4. ఇవన్నీ నాకు బుద్ధి చెప్పింది.

కాని వేదాంతానికి వచ్చాక, నీ బుద్ధి నీకు చెప్పినది తప్పని నిరూపిస్తుంది. నువ్వు అనుభవాన్ని బట్టి ఏర్పరచుకున్న సిద్ధాంతాలు నిజంకాదు. అనుభవంలోకి వచ్చినంత మాత్రాన అది నిజమవాలని నియమం లేదు. సూర్యోదయమే దానికి తిరుగులేని ఉదాహరణ. అందువల్ల అనుభవం చెప్పినవేవీ నిజం కాదు.

1. నువ్వు శరీరానివి కాదు

2. నువ్వు శరీరానివి కాదు కాబట్టి నీకు పుట్టినరోజు, మరణించే రోజు ఉండవు

3. నీకు చావు–పుట్టుకలు లేవు కాబట్టి నువ్వు శాశ్వతమైన ఆత్మవు. శరీరం రాలిపోవటంవల్ల అనుభవాలు రాలిపోతాయి కాని అది నీ ముగింపు కాదు. నువ్వు కొనసాగుతావు. సుషుప్తిలో శరీరాన్ని అనుభవించకపోయినా, నువ్వు ఉన్నట్టుగా శరీరం ఉన్నా లేకపోయినా ఆత్మగా నువ్వు ఉంటావు.

4. అనుభవంనుంచి నీకు బుద్ధి చెప్పినది మార్చుకో. శాస్త్రం ద్వారా జ్ఞానం పొందు.

ఆ విధంగా వేదాంతం మీ అనుభవాన్ని మార్చదు, మీ బుద్ధిని లేదా మీ దృక్పథాన్ని మారుస్తుంది. అందువల్ల ఎవరైనా, నాకు బుద్ధిలో జ్ఞానం కలిగింది అంటే, నీకు కావాల్సింది అంతే. ఇంకేమీ మారదు. ఎవరు అంటున్నారు? రమణమహర్షి అంటున్నారు. జ్ఞానికి, అజ్ఞానికి సమాన అనుభవం అవుతుంది అంటే అర్థం అదీ. శరీరపరంగా మార్పులు రావు. దృక్కోణంలో మార్పు వస్తుంది. ఏమిటా మార్పు?

**ఏకస్య** – ఒకరికి. ఎవరికి? జ్ఞానికి అని అర్థం చేసుకోవాలి. అంటే ఏకస్య జ్ఞానినః.

**ఆత్మా దేహే దీప్తః** – ఆత్మ అంటే నేను, శరీరమంతటా వ్యాపించి ఉన్న చైతన్యాన్ని. జ్ఞానికి నేను అంటే శరీరం కాదు. నేను అంటే చైతన్యం. శరీరంలో ఉన్న చైతన్యం. చైతన్యం అనగానే చైతన్యంయొక్క ఐదు సూత్రాలను గుర్తు తెచ్చుకోవాలి.

1. చైతన్యం శరీరంలో ఒక భాగం కాని, లక్షణం కాని కాదు. శరీరాన్నుంచి ఉత్పత్తి చెందింది కూడా కాదు.
2. చైతన్యం స్వతంత్రమైనది. అది శరీరం అంతటా వ్యాపించి, శరీరాన్ని ప్రకాశింపజేస్తుంది.
3. చైతన్యం శరీరం సరిహద్దులకే పరిమితమవలేదు.
4. చైతన్యం, శరీరం నాశనమయితే నాశనమవదు. శరీరం పతనం చెందాక కూడా చైతన్యం ఉంటుంది.
5. చైతన్యం శరీరం లేకపోయినా ఉంటుంది కాని కనబడదు. దాన్ని ప్రతిబింబింపజేసే

శరీరం లేదు కాబట్టి కనబడదు. అంతమాత్రాన చైతన్యం లేనట్టు కాదు.
అందువల్ల జ్ఞానికి నేను అంటే ఆత్మ.

దీప్తః – చైతన్యంగా భాసిస్తున్నది. ఎక్కడ?
దేహే – శరీరంలో. శరీరంలో కూడా.

**హృది** – హృదయంలో. ఇక్కడ హృదయంలో అంటే మనస్సులో. మనస్సులో ఎలా ఉంది? ఆలోచనలు ఉన్న, ఆలోచనలు లేని మనస్సును సాక్షీభూతంగా చూసే సాక్షిచైతన్యంగా.

అందువల్లనే జ్ఞాని నేను శరీరాన్ని కాను, నేను శరీరంలో ఉన్న చైతన్యాన్ని, మనస్సులో ఉన్న చైతన్యాన్ని, మనస్సులో ఆలోచనలు ఉన్నా లేకపోయినా తెలుసుకుంటున్న చైతన్యాన్ని అంటాడు.

దేహే హృది దీప్తః – దీప్త అంటే అక్షరాలా చూస్తే ప్రకాశిస్తున్నది. ప్రకాశం అంటే ట్యూబ్‌లైట్‌లాగా ప్రకాశించేది కాదు. ఆత్మ చైతన్యాన్ని స్వయంప్రకాశకజ్యోతి అంటారు. దాన్ని తెలుసుకోవటానికి వేరే ప్రమాణం అవసరం లేదు. చైతన్యంవల్లనే అన్నీ తెలుసుకో గలుగుతున్నాడు.

**ప్రతిబోధవిదితం మతమ్** – కేనోపనిషత్

చైతన్యం మాత్రంగానే కాదు,

**దేహం చ జగచ్చ ఆక్రమ్య** – దేహం చ అంటే నా శరీరంలో మాత్రమే కాదు,
జగత్ చ – జగత్తంతటా వ్యాపించి ఉన్నాను.

కాని ఇక్కడ ఒక విషయం మర్చిపోకూడదు. నేను సర్వవ్యాపకమైనా, శరీరపరంగా చూస్తే, నాకు ఆకలి నేను ఉన్న శరీరానికి వేస్తేనే తెలుస్తుంది. అందువల్ల నేను సర్వవ్యాపకం కాబట్టి, నేను అన్ని శరీరాల్లో ఉంటాను కాబట్టి, అందరి శరీరాల్లోని ఆకలిదప్పులు నాకు తెలుస్తాయనే సిద్ధాంతాన్ని మీరు తయారు చేసేసుకోకండి. అనుభవం అయ్యేది ఒక్క శరీరం నుంచే.

ఆక్రమ్య – ఆక్రమ్య పదాన్ని దీప్తః క్రియాపదంతో కలుపుకోవాలి. ఆక్రమ్య అంటే ఆక్రమించి ఉన్నాను.

**పూర్ణః** – పూర్ణః అంటే సర్వగతం. నేను సర్వవ్యాపకం. జ్ఞాని నేను సర్వవ్యాపకం అని చెప్పేది ఆత్మపరంగా. కాని అనుభవపరంగా చెప్పాలంటే మనశ్శరీరాల పరంగానే చెప్పాలి. అందువల్ల పూర్ణః పదాన్ని అనుభవపరంగా చెప్పకూడదు.

సర్వవ్యాపకత్వాన్ని అనుభవించలేరు. సర్వవ్యాపకత్వాన్ని అర్థం చేసుకోవాలి కాని అనుభవించలేరు. సర్వవ్యాపకత్వాన్ని అనుభవించాలంటే రెండు భిన్న పదాలను కలిపి వాడటం అవుతుంది. అది సాధ్యం కాదు. ఎప్పుడైతే అనుభవం పదం వేస్తానో, అప్పుడే నేను అనుభవించే వ్యక్తిని అవుతాను. ఎప్పుడైతే నేను అనుభవించే వ్యక్తిని అవుతానో, అప్పుడే నేను ఒక పరిమితి ఉన్న జీవిని అవుతాను. సర్వవ్యాపకత్వాన్ని అనుభవించలేను. జాగ్రత్, స్వప్నావస్థలను అనుభవించగలను కాని సుషుప్తిలో ఏ అనుభవమూ ఉండదు. అప్పుడు ఏ పరిమితులూ ఉండవు.

జ్ఞానికీ, అజ్ఞానికీ కూడా జాగ్రద్, స్వప్నావస్థలలో పరిమితి అనుభవం అవుతుంది. ఇద్దరికీ కూడా సుషుప్తిలో పరిమితి అనుభవంలోకి రాదు. అంటే జ్ఞానికీ, అజ్ఞానికీ కూడా సమానంగా పరిమితి అనుభవంలోకి వస్తుంది; ఇద్దరికీ కూడా పరిమితి అనుభవం ఉండదు. ఎందుకంటే ఇద్దరికీ మూడు అవస్థలూ సమానం కాబట్టి. ఈ రెండు అనుభవాలు కాక, సర్వవ్యాపకత్వం అనే మూడవ అనుభవం, అనుభవంలోకి రాదు. ఎందుకంటే అనుభవం, సర్వవ్యాపకం రెండు భిన్న పదాలు.

ఎప్పుడైతే అనుభవం పదం వేస్తామో, అప్పుడే త్రిపుటి ఉండితీరాలి. త్రిపుటి అంటే అనుభవించే నేను, అనుభవించబడే వస్తువు, అనుభవానికి వాడే పరికరం. ఈ మూడు భిన్న అంశాలు లేకుండా ప్రత్యేకమైన, ప్రయత్నపూర్వకమైన, స్పష్టమైన అనుభవం సాధ్యం కాదు. త్రిపుటి వస్తే పరిమితి వస్తుంది. అందువల్ల అనుభవం, పరిమితి చెట్టాపట్టాలు వేసుకుని వస్తాయి. అంటే అనుభవం, సర్వవ్యాపకత్వం – ఈ రెండింటికీ పొత్తు కుదరదు.

సుషుప్తిలో సర్వవ్యాపకత్వాన్ని అనుభవిస్తాము కదా అనకూడదు. సుషుప్తిలో పరిమితిని అనుభవించే అనుభవం ఉండదు అంతే. సరిగ్గా అర్థం చేసుకోవాలి ఈ భేదాన్ని. సుషుప్తిలో సర్వవ్యాపకత్వాన్ని అనుభవించలేము. పరిమితినీ అనుభవించలేము. ఎందుకంటే అనుభవించే నేను (అహంకారం) ఉండను కదా!

అందువల్ల ముందు చూసినట్టుగా రెండే అనుభవాలు ఉన్నాయి. పరిమితిని అనుభవించటం, పరిమితిని అనుభవించకపోవటం. అంతేకాని స్పష్టంగా, ప్రయత్నపూర్వకంగా, తెలిసి తెలిసీ సర్వవ్యాపకత్వాన్ని అనుభవిస్తాను అనటంలో అర్థం లేదు.

సమాధిలో కూడా పరిమితిని అనుభవించము. సమాధిలో పరిమితిని అనుభవించము కాబట్టి పరిమితిని అనుభవించకపోవడమే సర్వవ్యాపకత్వాన్ని అనుభవంగా తీసుకోవచ్చు కదా అని ఎవరైనా వాదిస్తే అది తప్పు.

**పరిమితి అనుభవంలోకి రాకపోవటం సర్వవ్యాపకత్వ అనుభవం కాదు.** ఇది మళ్ళీ మళ్ళీ చెబుతున్నారు. సుషుప్తిలో అయినా, సమాధిలో అయినా జ్ఞానికీ, అజ్ఞానికీ కూడా పరిమితి గాని, త్రిపుటి కాని అనుభవంలోకి రావు. అనుభవపరంగా మూడు అవస్థల్లో అనుభవమూ ఒకటే. ఇద్దరూ, అయితే పరిమితి అనుభవం పొందుతారు, లేకపోతే పరిమితి అనుభవం పొందరు. మరి అయితే జ్ఞానికీ, అజ్ఞానికీ మధ్య భేదం ఎక్కడ ఉంది? వారి జ్ఞానంలో ఉంది.

జ్ఞాని పొందే జ్ఞానం శాస్త్రంమీద ఆధారపడివుంటే, అజ్ఞాని జ్ఞానం అనుభవంనుంచి అతను అర్థం చేసుకున్న దానిమీద ఆధారపడి ఉంటుంది.

ఏకస్య దేహే హృది దీప్త ఆత్మా. జ్ఞానికి నేను అంటే ఆత్మ. ఆత్మ ఈ శరీరంలో, హృదయంలో, హృదయంలో ఉన్న మనస్సులో ఆలోచనలను సాక్షిగా చూసే సాక్షి చైతన్యంగా ఉంది. అంతేకాదు,

ఆక్రమ్య దేహం చ జగచ్చ. సర్వవ్యాపకంగా ఉంది. ఎక్కడ? ఈ శరీరంలో, జగత్తు మొత్తంలో.

పూర్ణః. అందువల్ల నేను పరిమితి లేని, సర్వవ్యాపకమైన చైతన్యాన్ని అని జ్ఞానికి తెలుసు. దీని అర్థం ఏమిటి? అనుభవపరంగా జ్ఞానికి కూడా పరిమితి ఉంటుంది. కాకపోతే, ఆ పరిమితి దేనిదో అతనికి తెలుసు. అది సర్వవ్యాపకమైన ఆత్మది కాదు, ఆ అనుభవం పరిమితి ఉన్న అహంకారానిది అని తెలుసు. జ్ఞానికి తన శరీరం కూడా ఆబ్జెక్టు అని తెలుసు. అనుభవంలోకి వచ్చేది ఆబ్జెక్టు. అనుభవంలోకి వచ్చేదేదీ సబ్జెక్టు అయిన నేను కాదని జ్ఞానికి తెలుసు.

జ్ఞాని తను జ్ఞానం పొందాక కూడా, శరీరపరంగా పరిమితిని అనుభవిస్తాడు. తను అన్నానగర్‌లో ఉన్నానంటాడు, స్వామీజీ బోధకు వెళతాడు. కాని బుద్ధిలో అతను శరీరం కాదని, తను సర్వవ్యాపకమైన ఆత్మనని తెలుసుకుంటాడు. అనుభవంలోకి వచ్చేదేదీ అనుభవించే నేను కాదు సూత్రం ప్రకారం అనుభవంలోకి వచ్చే పరిమితి నేను కాదు. అది శరీరానిది అనే స్పష్టమైన జ్ఞానం ఉంటుంది జ్ఞానికి. అదీ జ్ఞానికీ, అజ్ఞానికీ మధ్య ఉన్న భేదం.

భూమి సూర్యుని చుట్టూ తిరగటంవల్ల సూర్యోదయం అవుతున్నదనే జ్ఞానం పొందాక కూడా సూర్యోదయం అనుభవంలోకి రాకమానటం లేదు. అలాగే జ్ఞానికి తను సర్వవ్యాపకం అనే జ్ఞానం కలిగినా కూడా, అనుభవం మారదు. కాని అజ్ఞాని పరిస్థితి ఏమిటి?

**పరస్య** – అజ్ఞానికి అనుభవాన్ని ఆధారం చేసుకుని, చేసుకున్న తప్పుడు సిద్ధాంతం కొనసాగుతుంది. ఏమిటా తప్పుడు సిద్ధాంతం? నేను పరిమితి ఉన్న జీవిని.

**తనుమాత్రమాత్మా** – తను అంటే శరీరం; మాత్రం అంటే మాత్రమే; ఆత్మా అంటే నేను. అన్నీ కలిపితే అజ్ఞానికి నేను అంటే శరీరం మాత్రమే. శరీరం ఎంతమేరకు ఉంది?

**మేయమ్** – కొలువదగిన, పరిమితమయినది.

అజ్ఞానికి నేను పరిమితి ఉన్న శరీరాన్ని మాత్రమే అనే జ్ఞానం తన తప్పుడు అవగాహనవల్ల ఏర్పడుతుంది.

జ్ఞానికీ, అజ్ఞానికీ పరిమితి ఉన్న అనుభవం సమానం; కాకపోతే అజ్ఞానికి ఈ అనుభవం సత్యం, జ్ఞానికి ఈ అనుభవం మిథ్య. అందువల్ల జ్ఞానం పొందాక అనుభవం మారుతుంది అనే అపోహను పెంచుకోకండి. అలా కొత్త అనుభవం పొందాలని ఆశిస్తే, మీరు పెద్ద వలలో చిక్కుకున్నట్టే. అనుభవం రావాలి, అనుభవం రావాలి, ఇంకా రాలేదు, ఇంకా రాలేదు అని ఎదురు చూస్తున్నంతకాలం మీరు జ్ఞాని కాలేరు.

**శ్లోకం 20**

**అజ్ఞస్య విజ్ఞస్య చ విశ్వమస్తి**
**పూర్వస్య దృశ్యం జగదేవ సత్యమ్ ।**
**పరస్య దృశ్యాశ్రయభూతమేకం**
**సత్యం ప్రపూర్ణం ప్రవిభాత్యరూపమ్ ॥**

**ప్రతిపదార్థం:** అజ్ఞస్య = అజ్ఞానికి; విజ్ఞస్య చ = జ్ఞానికి కూడా; విశ్వమస్తి = జగత్తు ఉంది; పూర్వస్య = అజ్ఞానికి; దృశ్యం = కనిపిస్తున్న; జగదేవ = జగత్తు మాత్రమే; సత్యం = సత్యం; పరస్య = జ్ఞానికి; దృశ్యాశ్రయ భూతం = కనిపించే జగత్తుకు ఆధారమైన; ఏకం = అద్వితీయమైన; ప్రపూర్ణం = సర్వవ్యాపకమైన; అరూపం = నిర్గుణమైన ఆత్మ; సత్యం = సత్యం; ప్రవిభాతి = అధికంగా భాసిస్తుంది.

**తాత్పర్యం:** అజ్ఞానికి, జ్ఞానికి కూడా జగత్తు ఉంది. అజ్ఞానికి కనిపిస్తున్న జగత్తు మాత్రమే సత్యం; జ్ఞానికి కనిపించే జగత్తుకు ఆధారమైన, అద్వితీయమైన, సర్వవ్యాపకమైన, నిర్గుణమైన ఆత్మే సత్యంగా భాసిస్తుంది.

**వివరణ:** ఇది కూడా చాలా ముఖ్యమైన శ్లోకం. అద్వైతాన్ని ఎలా చేరుకోవాలో వస్తుంది ఈ శ్లోకంలో. ద్వైతాన్ని ఖండించందే అద్వైతానికి చేరుకోలేము. ద్వైతం ఉన్నన్నాళ్ళు పరిచ్ఛిన్న భావన ఉంటుంది. నేను సబ్జెక్ట్, ప్రపంచం ఆబ్జెక్ట్ అనే విభజన, పరిమితికి దారి తీస్తుంది. ఎక్కడ పరిమితి ఉంటుందో అక్కడ అశాశ్వతత్వం ఉంటుంది. ఎక్కడ అశాశ్వతత్వం వస్తుందో అక్కడ భయం లేదా అభద్రతా భావన వస్తుంది. ఈ నిరంతర అభద్రతా భావననే సంసారం అంటారు. ఈ అభద్రతా భావనను ఉపనిషత్తులు జుగుప్స అనీ, విజుగుప్స అనీ అంటాయి.

**తతో న విజుగుప్సతే** – ఈశ

జ్ఞానికి అభద్రతా భావన ఉండదు. ఎందుకు ఉండదు?

ఇప్పుడు వెనకనుంచి చూస్తే సంసారం పోవాలంటే అభద్రతా భావన పోవాలి. అభద్రతా భావన పోవాలంటే అశాశ్వతత్వ భావన పోవాలి. అశాశ్వతత్వ భావన పోవాలంటే పరిచ్ఛిన్న భావన పోవాలి. పరిచ్ఛిన్న భావన పోవాలంటే సబ్జెక్ట్–ఆబ్జెక్ట్ విభజన పోవాలి. సబ్జెక్ట్–ఆబ్జెక్ట్ విభజన పోవాలంటే ఆబ్జెక్ట్ పోవాలి. సబ్జెక్ పోవాలి అనకూడదు. సబ్జెక్ట్ పోతే, వీటన్నింటినీ ఖండించే నేను కూడా ఉండను. అందువల్ల సంసారాన్ని పారద్రోలాలి అంటే ద్వైతప్రపంచాన్ని ఖండించుకుంటూ రావాలి. మోక్షం పొందాలంటే, జగత్తును నిషేధించాలి. జగత్తును నిషేధిస్తేనే సబ్జెక్ట్ అయిన నేను మాత్రమే మిగులుతాను.

ఒక కుక్క అద్దంలో చూస్తే, తన ప్రతిబింబమే కనిపిస్తుంది అందులో. కాని ఆ విషయం తెలియని కుక్క, అక్కడ రెండో కుక్క ఉందని పొరపాటుపడి, దానిమీద అరుస్తుంది. కుక్కలు వాటి సామ్రాజ్యంలోకి వేరే కుక్కలను రానివ్వవు. అద్దంలో కుక్కతో 'భౌభౌ' అంటుంది. అద్దంలోని కుక్క కూడా భౌభౌ అంటుంది. ఇది కోపంతో రెచ్చిపోయి, ఇంకా గట్టిగా అరిస్తే, అది కూడా ఇంకా గట్టిగా అరుస్తుంది. పాపం ఆ కుక్కకు తెలియదు, అది అక్కడ లేనే లేని కుక్కను చూసి, నిజమని పొరపాటుపడి, దానిమీద అరుస్తున్నదని. అదే సంసారం. మనం దాని సంసారం చూసి నవ్వుతాము. మీరేం తక్కువ తినలేదు అంటుంది వేదాంతం. లేనే లేని సంసారాన్ని ఊహించుకుని మీరు కూడా కుక్కలాగా భయపడుతున్నారు అంటుంది.

కుక్కకు రెండో కుక్క లేదని, నీ ప్రతిబింబాన్నే చూసి భయపడుతున్నావని వివరించాలి.

**విశ్వం దర్పణదృశ్యమాననగరీతుల్యమ్ నిజాంతర్గతమ్** – దక్షిణామూర్తి స్తోత్రం

కుక్కకు ఎలా బోధ చేయాలి? కుక్కకు కలుగుతున్న అనుభవాన్ని పారద్రోలలేము. అక్కడ అద్దం ఉన్నంతసేపూ, అద్దంలో కుక్క కనబడకమానదు; ఇది అరిస్తే అది అరవక మానదు. కాకపోతే అది చూస్తున్న కుక్క నిజంకాదని, దాని ప్రతిబింబం మాత్రమేనని వివరించాలి. ప్రతిబింబం సత్యం కాదు.

ఇదే సూత్రాన్ని జగత్తుకి అన్వయించండి అంటుంది వేదాంతం. జగత్తును నిషేధించాలి అంటే జగత్తుతో జరిగే అనుభవాలను నిషేధించటం కాదు. ఆ జరిగే అనుభవాలను సత్యంగా తీసుకోవద్దు అంటుంది వేదాంతం. ఇది అర్థం చేసుకోవాలంటే మూడు సత్యాలను అర్థం చేసుకోవాలి.

ప్రాతిభాసిక సత్యం – స్వప్నప్రపంచం
వ్యావహారిక సత్యం – జాగ్రద్ ప్రపంచం
పారమార్థిక సత్యం – అద్వైత ఆత్మ

స్వప్నంలో ఉన్నంతవరకూ, ఒక స్వాప్నికునికి తన స్వప్నం, స్వప్నం అని తెలియదు. అదే సత్యం అనుకుంటాడు. దాన్ని ప్రాతిభాసిక సత్యం అంటారు. దాన్నించి లేస్తే, స్వప్నం మిథ్యగా తేలిపోతుంది. అలాగే జాగ్రద్ పురుషునికి, జాగ్రదావస్థలో ఉన్నంతవరకూ అది మహాసత్యం అనుకుంటాడు. అది స్వప్నం 2 అంటుంది శాస్త్రం. అది స్వప్నం 2 అని ఎలా తెలుస్తుంది? జాగ్రద్ పురుషుడు తన ఉన్నతస్థాయికి లేస్తే, జాగ్రద్ ప్రపంచం స్వప్నం 2గా వీగిపోతుంది. ఉన్నతస్థాయి అంటే పారమార్థిక సత్యం. పారమార్థిక సత్యంలో ఉన్నదొకటే ఆత్మ. ఆత్మ సత్యం, జగత్ మిథ్య అని అర్థమవుతుంది. ఆ ఆత్మను నేనే అని అర్థమవుతుంది. కాకపోతే పారమార్థిక సత్యానికి ఎదిగినా కూడా, జాగ్రద్ ప్రపంచం మాయమవదు. దానితో కలిగే అనుభవాలూ మాయమవవు.

ఇప్పుడు మనం చూస్తున్న జగత్తు వ్యావహారిక సత్యానికి చెందినది. జగత్తులోకి ఏం వస్తాయి? మూడు వస్తాయి. బాహ్యవస్తువులు వస్తాయి. అంతవరకే తెలుసు మనకు. కాని మన శరీరం, మన మనస్సు కూడా జగత్తులో వస్తాయి అని నేర్పిస్తుంది వేదాంతం.

దీన్ని తేలిక భాషలో చెప్పాలంటే, నేనెవరు అనే ప్రశ్నకు జవాబుగా, నీకు ఆబ్జెక్టుగా తెలిసేవేవీ నువ్వు కాదు అంటుంది శాస్త్రం. జగత్తులో వస్తువులు ఆబ్జెక్టుగా తెలుస్తాయి, శరీరానికి వచ్చే మార్పులు తెలుస్తాయి కాబట్టి శరీరం ఆబ్జెక్టే; అలాగే మనస్సులో వచ్చే ఆలోచనలు, భావోద్రేకాలు తెలుస్తాయి కాబట్టి మనస్సు కూడా ఆబ్జెక్టే. ఇంక మిగిలిందెవరు? వీటిని సాక్షిగా చూసే సాక్షిచైతన్యమైన నేను. నేను పారమార్థిక సత్యం, అవి వ్యావహారిక సత్యం. ఇలా బుద్ధిలో అర్థం చేసుకోవటాన్నే జగత్తును నిషేధించటం అంటారు.

ఇలా జగత్తును, శరీరాన్ని, మనస్సును మిథ్యగా కొట్టివేసి, నేను మాత్రమే సత్యం అనే జ్ఞానం పొందటంవల్ల కలిగే ఫలమేమిటి? అప్పుడు జగత్తులో జరిగే అనుభవాలు, పారమార్థిక సత్యమైన నన్ను బాధించలేవు. అనుభవాలు ఆగవు, మారవు; కాని నా దృక్పథం మారుతుంది. అవి నన్ను చలింపచేయజాలవు.

ముందు శ్లోకంలో చూసినట్టుగా జగత్తులో జరిగే అనుభవాలు జ్ఞానికి, అజ్ఞానికి కూడా సమానంగానే అవుతాయి. ఈ విషయం పదేపదే చెప్పటంలోని ఉద్దేశ్యం చాలామంది జ్ఞానికి ద్వైతప్రపంచం అనుభవంలోకి రాదనే అపోహ ఉంది. ఒక శుభముహూర్తాన కళ్ళు

తెరిచి చూశాక, అన్నీ ఒక్కలాగే కనబడితే, జ్ఞానం వచ్చినట్టు అర్థం అని పొరపాటు పడతారు వారు. కాని దాని అర్థం వారికి కాటరాక్ట్ వచ్చిందని అర్థం.

ఈ పొరపాటు మామూలు మనుష్యులు చేస్తే ఫర్వాలేదు. ఒక గొప్ప వేదాంతి, ప్రపంచ ప్రఖ్యాతి చెందిన వేదాంతి, అలాంటి పొరపాటుతో కూడిన వ్యాఖ్యానం చేశారు. ఆ వేదాంతి, నేను కూడా జ్ఞానంయొక్క పరాకాష్ఠకు చేరుకోలేదు; నేను కూడా మీలాగా నేర్చుకుంటున్న సాధకుడినే అంటారు. జగత్తు అంతా అతన్ని గొప్ప జ్ఞానిగా గౌరవిస్తుంది. నేను ఇంకా పరాకాష్ఠకు చేరుకోలేదు అనే వాక్యాన్ని వినయంతో చెప్పలేదు. ఆయన చెప్పిన కారణం, **నేనింకా మిమ్మల్ని విడివిడిగా చూస్తున్నాను**. మీరందరూ ఒక్కలాగా కనపడటం లేదు నాకు అంటారు.

అన్నీ జ్ఞానికి ఒక్కలాగే కనబడతాయన్న అపోహను సమర్థించే కథ కూడా చెబుతారు కొందరు. ఒక జంట జ్ఞానం పొంది, సర్వసంగపరిత్యాగం చేసి, జ్ఞాననిష్ఠలో ఉన్నారు. ఒకరోజు వారిద్దరూ వాకింగ్ చేస్తున్నారు. భర్త ముందు నడుస్తున్నాడు, భార్య వెనకబడింది. ముందు నడుస్తున్న భర్త కంట మట్టిలో ఒక వజ్రం కనబడింది. వెంటనే భర్తకు ఖంగారు పుట్టింది. భార్య అన్నీ త్యజించింది నిజమే కాని, అంత ఖరీదైన వజ్రాన్ని చూస్తే ఆమెలో దానివైపు ఆకర్షింపబడే స్త్రీబుద్ధి ఎక్కడ పైకి వస్తుందేమో అనే భయంకొద్దీ, ఆ వజ్రాన్ని కనబడకుండా అక్కడున్న మట్టితో కప్పేశాడు.

ఇదంతా చూడనే చూసింది భార్య. దగ్గరకొచ్చాక ఏం చేస్తున్నారని అడిగింది. భర్తకు నిజం చెప్పక తప్పలేదు. నువ్వు వజ్రాన్ని చూసి, ఎక్కడ ఆకర్షింపబడతావోనని, నేను వజ్రాన్ని మట్టితో కప్పాను అన్నాడు నిజాయితీగా. భార్య నవ్వింది. ఇంకా మీరు మట్టికి, వజ్రానికి మధ్య భేదం చూస్తున్నారన్నమాట అంది. భర్త ఆశ్చర్యపోయాడు. తనేదో మారాడని, భార్యకి ఇంకా వ్యామోహం పోయివుండదని భావించాడు కాని భార్య తనకన్నా ఎక్కువస్థాయికే వెళ్ళింది. వజ్రాన్ని మట్టిలాగా తృణపాయంగా కొట్టివేసిందని గ్రహించి సిగ్గుపడ్డాడు.

ఈ కథనుంచి గ్రహించాల్సింది ఏమిటి? వజ్రాన్ని చూసినా, దాన్ని మట్టి అంత మామూలుదానిగా కొట్టివేయగలిగిందా మహా ఇల్లాలు. కాని ఈ కథను అక్షరాలా తీసుకుని కొందరు మట్టిని వజ్రాన్ని కూడా ఒక్కలాగా చూడగలిగితేనే, అక్షరాలా చూడగలిగితే, తాము జ్ఞానంలో పండిపోయినట్టు భావిస్తారు. అది చాలా పొరపాటు. జ్ఞాని అన్నింటిని ఒక్కలాగా చూస్తాడు అంటే కంటికి భిన్నంగా కనిపించినా వాటిని సమానంగా చూస్తాడు అని అర్థం. ఆ ఇల్లాలుకు వజ్రానికి, ఇసుకకు భేదం, కంటికి కాదు, భావనలో కనపడలేదు.

ఈ అపోహలు పారద్రోలుతున్నారు రమణమహర్షి. జగత్తును మాంసచక్షువులతో చూస్తే జగత్తులో ద్వైతం అలాగే అనుభవంలోకి వస్తుంది అంటున్నారు.

**అజ్ఞస్య విశ్వమ్ అస్తి** – అజ్ఞానికి తన ఎదురుగా కనిపిస్తున్న ప్రపంచం ఉంది.

**విజ్ఞస్య చ (విశ్వమ్ అస్తి)** – జ్ఞానికి కూడా జగత్తు ఉంది. ఈ విషయాన్ని చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి.

మీరు వాదించవచ్చు, జ్ఞాని నిర్వికల్ప సమాధిలో ఉన్నప్పుడు బాహ్యప్రపంచం ఉండదు కదా! దానికి బదులు చెప్పకుండా మీరు ఎదురు జవాబు చెప్పవచ్చు. అజ్ఞానికి కూడా సుషుప్తిలో బాహ్యప్రపంచం ఉండదు కదా!

జ్ఞాని నిర్వికల్పసమాధిలో ఉన్నా, అజ్ఞాని సుషుప్తిలో ఉన్నా, వారిద్దరికీ ప్రపంచం కనబడకపోయినా, అది అద్వైతస్థితి కాదు అంటుంది శాస్త్రం. ఎందువల్లనంటే, ఈ రెండు స్థితుల్లోనూ ద్వైతం పూర్తిగా నాశనమవదు. అది అవ్యక్తంలోకి వెళుతుంది అంటే ద్వైతం ఆ రెండు దశల్లోనూ అవ్యక్తంగా ఉంటుంది. ఆ రెండు దశలనుంచి బయటకు రాగానే, మళ్ళీ ద్వైతం దూసుకువస్తుంది, ద్వైత అనుభవమూ దూసుకువస్తుంది. అందువల్ల జ్ఞాని, అజ్ఞాని ఇద్దరికీ విశ్వం ఉంది. మరి ఏమిటి భేదం?

**పూర్వస్య** – ముందు చెప్పినవానికి. ముందు చెప్పింది అజ్ఞాని గురించి. తన కంటికి కనబడే విశ్వమే సత్యం.

**దృశ్యం జగదేవ సత్యమ్** – అజ్ఞానికి తన కంటికి ఎదురుగా కనిపిస్తున్న జగత్తు మాత్రమే సత్యం. ఎలాగైతే ఒక స్వాప్నికునికి తన స్వప్నం సత్యంలా అనిపిస్తుందో, అలా అజ్ఞానికి జాగ్రద్ ప్రపంచం సత్యంగా కనిపిస్తుంది.

**పరస్య** – రెండో వ్యక్తికి. అంటే జ్ఞానికి.

**ఏకం దృశ్యాశ్రయ భూతం సత్యమ్** – ఏకం అంటే ఉన్నదొకటే చైతన్యం; సత్యమ్. అది మాత్రమే సత్యం. ఎటువంటి చైతన్యం అది?

దృశ్యాశ్రయ భూతం – కనిపించే ఈ జగత్తుకు ఆశ్రయం అంటే అధిష్ఠానం. జడమైన జగత్తుకు ఈ చైతన్యమే అధిష్ఠానం. అందువల్ల అదే సత్యం. దాని స్వరూపమేమిటి?

**ప్రపూర్ణమ్** – సర్వవ్యాపకం,

**అరూపం** – నిర్గుణ చైతన్యం.

రమణమహర్షి చైతన్యం మాత్రమే సత్యం అని చెప్పటం ద్వారా కనబడే జగత్తు మిథ్య అని చెప్పకనే చెబుతున్నారు. జ్ఞాని, అజ్ఞాని కూడా జగత్తును చూస్తారు.

కుక్క పరంగా చూస్తే జ్ఞానం పొందిన కుక్క, జ్ఞానం పొందని కుక్క కూడా, రెండో కుక్కను చూస్తాయి. కాని జ్ఞానం పొందిన కుక్కకు జ్ఞాననేత్రం తెరుచుకోవటంవల్ల అక్కడ నిజంగా రెండో కుక్క లేదని అర్థం చేసుకుంటుంది. అదే విధంగా జ్ఞాని కూడా తనకు భిన్నంగా జగత్తును చూస్తాడు కాని జగత్తు నిజంగా లేదని, అది మిథ్య అని, తను మాత్రమే సత్యం అని అర్థం చేసుకుంటాడు.

**బ్రహ్మ సత్యం జగన్మిథ్యా, జీవో బ్రహ్మైవ నాపరః**

ఈ జ్ఞానంలో నిలబడతాడు జ్ఞాని.

19, 20 శ్లోకాలు కలిపి చూడాలి. వీటి సారాంశం, జగత్తును అనుభవించటంలో కాని, తనను తాను అనుభవించటంలో కాని జ్ఞానికి, అజ్ఞానికి మధ్య భేదం లేదు. భేదమల్లా అర్థం చేసుకోవటంలో వస్తుంది. అంటే బుద్ధిలో లేదా దృక్పథంలో మార్పు వస్తుంది. అజ్ఞాని జగత్తు సత్యం అనుకుంటే, జ్ఞాని జగత్తు మిథ్య అని అర్థం చేసుకుంటాడు (అనుకుంటాడు అనకూడదు). మోక్షం పొందటానికి అనుభవంలో మార్పు అవసరం లేదు, దృక్పథంలో మార్పు వస్తే చాలు.

అనుభవంలో మార్పు ఎందుకు మోక్షాన్నివ్వలేదు? ఏ అనుభవమైనా సరే అది తాత్కాలికమే అవుతుంది. ఒక సమయంలో వచ్చి ఇంకొక సమయంలో పోతుంది. మోక్షం కూడా అనుభవంవల్ల వచ్చేదయితే, ఒక సమయంలో వచ్చి, ఇంకొక సమయంలో పోతుంది. కాని మోక్షం నిర్వచనం నిత్యం. నిత్య మోక్షం పొందాలంటే జ్ఞానం ఒక్కటే నిత్యమైన మోక్షాన్ని ఇస్తుంది.

2+2=4 ఇది జ్ఞానం. ఈ జ్ఞానం మీ జీవితాంతం చెక్కుచెదరకుండా ఉంటుంది. మీ ప్రారబ్ధకర్మ ఎన్ని కొరడా దెబ్బలు కొట్టినా, గ్రహస్థితి ఎంతగా ఇబ్బంది పెట్టినా, 2+2=4 అనే అంటారు కాని 2+2=3 అని ఎన్నడూ అనరు. ఎందుకంటే, ఒకసారి జ్ఞానం కలిగి, అజ్ఞానాన్ని పారద్రోలితే, అజ్ఞానం మళ్ళీ వచ్చి, మళ్ళీ జ్ఞానాన్ని పారద్రోలదు. అంటే వెళ్ళిపోయిన అజ్ఞానానికి మళ్ళీ ఆరంభం లేదు, వచ్చిన జ్ఞానానికి అంతం లేదు. అందువల్ల **జ్ఞానం శాశ్వతం, అనుభవం అశాశ్వతం**. ఈ సూత్రాన్ని మర్చిపోకూడదు. అందువల్ల జ్ఞానం పొందటానికి ప్రయత్నించండి కాని అనుభవంలో మార్పుకోసం ప్రయత్నించకండి అనేది ఈ శ్లోకాల సారాంశం.

**శ్లోకం 21**

**విధేః ప్రయత్నస్య చ కోఽపి వాద-**
**స్తయోర్ద్వయోర్మూలమజానతాం స్యాత్ ।**
**విధేః ప్రయత్నస్య చ మూలవస్తు**
**సంజానతాం నైవ విధిర్న యత్నః॥**

**ప్రతిపదార్థం:** విధేః = విధియొక్క; ప్రయత్నస్య చ = ఫ్రీవిల్‌యొక్క; కః అపి = అనిర్వచనీయమైన; వాదః = వాదనలు; తయోః = ఆ; ద్వయోః = రెండింటియొక్క; మూలం = మూలకారణం; అజానతామ్ = తెలియనివారికి; స్యాత్ = కలుగుతుంది; విధేః = విధియొక్క; ప్రయత్నస్య= ప్రయత్నముయొక్క; మూలవస్తుః = మూలకారణం; సంజానతామ్ = చక్కగా తెలిసిన జ్ఞానికి; విధిః = విధి; న ఏవ = లేనేలేదు; యత్నః = ఫ్రీవిల్ కూడ; న = లేదు.

**తాత్పర్యం:** విధా, ఫ్రీవిల్లా ఏది నిర్ణయిస్తుందనే అనిర్వచనీయమైన వాదన, ఆ రెండింటియొక్క మూలకారణం తెలియనివారు చేస్తారు. వాటి రెండింటి మూలకారణం చక్కగా తెలిసిన జ్ఞానికి విధీ లేదు, ఫ్రీవిల్లూ లేదు. అంటే రెండూ అతన్ని ప్రభావితం చేయలేవు.

**వివరణ:** ఇప్పుడు ఈ శ్లోకంలో, ముందు అంశంతో సంబంధం లేని, పూర్తిగా భిన్న అంశాన్ని చూస్తాము. తక్కిన గ్రంథాలలోలాగా సద్దర్శనంలో ఒక ఆలోచనా ప్రవాహాన్ని చూడము. నిజానికి కొంతమంది, ఈ శ్లోకాలు చెదురుమదురుగా ఆలోచనలు వచ్చినప్పుడు రాయబడ్డాయని, తరువాత వాటిని ఒకచోట చేర్చి, వీలున్నంతగా ఒక పద్ధతిలో ఏర్చి కూర్చారనీ అంటారు. ఈ శ్లోకం చూస్తే ఈ వాదన నిజమనిపించవచ్చు. కాని ఇది చాలా ముఖ్యమైన అంశం. ఏమిటది?

మన జీవితాలను నిర్దేశించేది ఏది? ఫేటా, ఫ్రీవిల్లా? విధా, పురుషప్రయత్నమా? మళ్ళీ ఇందులో మూడు వాదనలు ఉన్నాయి.

1. అసలు ఫ్రీవిల్లే లేదు పొమ్మంటారు కొందరు. తమాషా ఏమిటంటే వారి ఫ్రీవిల్‌ను ఉపయోగించి ఫ్రీవిల్ లేదని వాదిస్తారు. ఎందుకు లేదంటే నా విధి అంటారు.

2. వీరు ఫేట్, ఫ్రీవిల్ రెండూ ఉన్నాయని ఒప్పుకుంటారు కాని, ఫేట్ నిర్ణయిస్తుంది మన జీవితాన్ని అంటారు.

3. వీరు కూడా రెండింటినీ ఒప్పుకుంటారు కాని ఫ్రీవిల్ నిర్ణయిస్తుంది మన జీవితాన్ని అంటారు.

ఇప్పుడు మనం మొదటి తెగవారి వాదనను పట్టించుకోవటం లేదు. ఫ్రీవిల్లా, ఫేటాలో ఫ్రీవిల్‌ని నమ్మేవారు కొందరు. నేను కష్టపడుతున్నాను, దానికి తగ్గ ఫలాన్ని పొందుతున్నాను అంటారు. అంటే నా ఫ్రీవిల్, నా ఫేట్‌ను నిర్ణయిస్తుంది కాబట్టి, ఫ్రీవిల్లే శక్తివంతమైనది అంటారు వారు. కాదు నీ ఫ్రీవిల్ నీ భవిష్యత్తుని నిర్దేశించగలదేమో కాని, ఇప్పుడు నువ్వు ఫ్రీవిల్ వాడగలుగుతున్నావు అంటే, అది నీ గతాన్ని బట్టి ఉంది అంటారు, ఫేట్‌ను నమ్మేవారు.

ఫ్రీవిల్‌ను నమ్మేవారు, ఆ గతాన్ని గతంలోని ఫ్రీవిల్ నిర్దేశించింది కదా అంటారు. ఫేట్‌ను నమ్మేవారు ఒప్పుకోరు. వారు ఒక జన్మలో విధి 1, ఆ జన్మలో ఫ్రీవిల్ 1ని నిర్దేశిస్తుంది; ఆ ఫ్రీవిల్ 1, విధి 2ను నిర్దేశిస్తుంది; విధి 2, ఫ్రీవిల్ 2ను నిర్దేశిస్తుంది; ఫ్రీవిల్ 2, విధి 3ని నిర్దేశిస్తుంది అంటారు.

ఇదంతా వినటానికి బాగానే ఉంది కాని ఈ రెండింటిలో ఏది మూలకారణం? విధివల్ల ఫ్రీవిల్ వచ్చిందా? ఫ్రీవిల్‌వల్ల విధి వచ్చిందా? ఎవరికి వారే వారి వాదననే బలపరచుకోవటానికి చూస్తారు కాని దానికి అంతూపొంతూ ఉండదు.

అలా మూలకారణం శోధించుకుంటూ వెళితే, మూలకారణంగురించి అంతుచిక్కని సమస్యలు వేదాంతంలో ఎన్నో ఉన్నాయి.

1. చెట్టు ముందా, విత్తు ముందా? చెట్టునుంచి విత్తనం వచ్చింది అంటే, విత్తనంనుంచే చెట్టు వచ్చింది అంటారు మరికొందరు. ఇది ఒక వృత్తంలా సాగుతుంది.

2. గుడ్డు ముందా, కోడి ముందా? కోడినుంచి గుడ్డు వచ్చింది అంటే, గుడ్డునుంచే కోడి వచ్చింది అంటారు మరికొందరు. ఇది ఒక అంతుపట్టని సమస్య.

3. జన్మ ముందా, కర్మ ముందా? గౌడపాదాచార్యులవారిది అజాతివాదము. ఆయన అసలు సృష్టి జరగలేదని నిరూపించుకు వస్తారు మాండూక్య కారికల్లో. అందులో ఒక వాదన కార్యకారణ విచారణ. మనం పూర్వజన్మలో చేసుకున్న కర్మవల్ల ఈ జన్మలో శరీరం వచ్చింది అంటారు. కాని పూర్వజన్మలో కర్మ ఎలా చేశాము? ఒక శరీరం ఉండటంవల్ల. ఇందాక ఫ్రీవిల్లా ,ఫేటా గురించి చూసినట్టుగా దీనికి కూడా ఇలా వాదిస్తారు పూర్వమీమాంసకులు.

కర్మ 1 → శరీరం 1 → కర్మ 2 → శరీరం 2 → కర్మ 3 → శరీరం 3

అంటే పూర్వజన్మలో కర్మ చేయటంవల్ల, ఈ జన్మలో ఈ శరీరం వచ్చింది. ఈ శరీరంతో కర్మ చేయటంవల్ల, వచ్చే జన్మలో ఒక శరీరం వస్తుంది. ఆ జన్మలో చేసే కర్మనుబట్టి ఆ తరువాత వచ్చే జన్మలో శరీరం వస్తుంది అంటారు వారు. అంతా బాగానే ఉంది కాని

కర్మ ముందా, శరీరం ముందా తేల్చిచెప్పండి అంటారు గౌడపాదాచార్యులవారు. శరీరం లేనిదే కర్మ చేయలేరు; కర్మ చేయందే శరీరం రాదు.

అందువల్ల ఇదంతా మిథ్య అంటారు. మిథ్యను అనిర్వచనీయం అంటారు. అదే విధంగా విధి మూలకారణం అని తేల్చి చెప్పగలిగితే విధి బలీయం అనవచ్చు. లేదు, ఫ్రీవిల్ మూలకారణం అని చెప్పగలిగితే ఫ్రీవిల్ బలీయం అనవచ్చు. కాని ఏది ముందో ఎవరూ తేల్చలేకుండా ఉన్నారు. అసలు ఇదంతా అజ్ఞానులు చేసే, అంతులేని చర్చ అంటారు రమణమహర్షి.

సరే అజ్ఞానులు చేసే అంతులేని చర్చ అనేటట్టయితే, జ్ఞానులు చేయవచ్చు కదా అంటారు కొందరు. కాని గౌదపాదాచార్యులవారు, ఆత్మజ్ఞానం పొందిన జ్ఞాని అసలు సృష్టే జరగలేదని అర్థం చేసుకున్నాక, వాదనకు ఆస్కారం ఏది అంటారు. సృష్టి జరిగింది అంటే జగత్తు కార్యం, దానికి కారణం బ్రహ్మ అంటారు కాని సృష్టే జరగలేదు అంటే కార్యకారణాల సంబంధం ఏది?

### కార్యకారణ విలక్షణం బ్రహ్మ

ఇదీ వేదాంతం బోధించేది. అందువల్ల అజ్ఞాని వాదనలో అర్థంలేదు; జ్ఞానికి వాదనకు ఆస్కారమే లేదు.

అందువల్ల ఫ్రీవిల్లా, ఫేటా అనే వాదనలో ఏదో ఒకటే నిర్దేశిస్తుంది అని చెప్పలేము. ఎందుకంటే ఫ్రీవిల్‌ను కొట్టివేసి, మన జీవితం విధి ఆడే వింత నాటకమనీ, ఆ జగన్నాటక సూత్రధారి మనను తోలుబొమ్మలు చేసి ఆడిస్తున్నాడనీ భావిస్తే అందులో కొన్ని దోషాలున్నాయి. వాటిల్లోంచి ఒక దోషం చూద్దాము. దాన్ని **వైషమ్య నైర్ఘుణ్య దోషః** అంటారు.

భగవంతుడే మన జీవితాలను నిర్దేశించేటట్టయితే, అందరి జీవితాలు ఒక్కరీతిలో ఉండాలి కదా. అలా లేవెందుకు? ఒకరు అష్టైశ్వర్యాలలో తులతూగుతుంటే, మరొకరు కటిక దరిద్రంలో మునుగుతున్నారు అంటే దేవుడు పక్షపాతం చూపినట్టు అవుతుంది. అలాగే మంచికి మారుపేరైన వ్యక్తి అవస్థలు పడుతున్నాడు, దుర్మార్గానికి దుస్తులు తొడిగినట్టుగా ఉన్న వ్యక్తి స్వర్గసుఖాలను అనుభవిస్తున్నాడు. అంటే దేవునికి జాలి, దయ లేనట్టవుతుంది.

పోనీ జగత్తు మన జీవితాన్ని నిర్దేశిస్తుందా అంటే జగత్తు జడం. జడమైన జగత్తు మన జీవితాన్ని ఎలా నిర్దేశించగలదు?

పోనీ మనకు జరిగే అనుభవాలు అనుకోకుండా జరుగుతున్నాయా అంటే, శాస్త్రం ఒప్పుకోదు. ప్రకృతిలో అంతా ఒక క్రమపద్ధతిలో జరుగుతుంది. **ఇంటిలిజెంట్లీ పుట్ టుగెదర్**

అంటారు పూజ్య స్వామీజీ. అందువల్ల అనుకోకుండా, యాదృచ్ఛికంగా జరిగింది అనే పదాలను శాస్త్రం ఒప్పుకోదు.

భగవంతుడు కాదు, జగత్తు కాదు, యాదృచ్ఛికంగా కాదు అంటే మన జీవితాలను నిర్దేశించేది ఏమిటి? నా ఫ్రీవిల్లే అని కొంతమేరకు చెప్పవచ్చు. నేను గతంలో నా ఫ్రీవిల్‌ను ఉపయోగించి చేసిన కర్మల ఫలితాన్ని ఈ జన్మలో అనుభవిస్తున్నాను. కొంతమేరకు అని ఎందుకన్నామంటే గత జన్మలో నా ఫ్రీవిల్‌ను ఉపయోగించే పద్ధతికి అనేక అంశాలు తోడయి ఉంటాయి. ఆ జన్మలో నాకున్న శరీరం, నాకున్న మనశ్శక్తి, నా తల్లిదండ్రుల పెంపకం, నేను పెరిగిన పరిసరాలు, వీటన్నింటి ప్రభావం నేను చేసే కర్మలమీద ఉంటుంది. అంటే నా కర్మలు నా విధిని నిర్దేశిస్తాయి, విధి నా కర్మలను నిర్దేశిస్తుంది.

అంటే తార్కికంగా చూస్తే రెండూ ఒకదానిమీద ఒకటి ఆధారపడి ఉన్నాయి. ఏది దేన్ని అదుపులో పెడుతుంది లేదా ఏది దేనిమీద ఆధారపడివుంది అని అడిగితే, ఇదమిద్ధంగా తేల్చిచెప్పలేము. అలా తేల్చి చెప్పలేనిదాన్ని అనిర్వచనీయం, మిథ్య అంటారు. ఈ రెండూ ఒకదానిమీద ఒకటి ఆధారపడి ఉండటంవల్ల వాటిని **అన్యోన్య ఆశ్రితాలు** అంటారు.

ఇంకొక ఉదాహరణ శరీరం–మనస్సుల జంట. శరీరానికి ఏకాస్త అనారోగ్యం చేసినా మనస్సు చెదురుతుంది. మనస్సు కలత చెందితే శరీరం అనారోగ్యం పాలవుతుంది. అందువల్ల అనిర్వచనీయం. సినిమా మనుష్యులను ప్రభావితం చేస్తుందా, మనుష్యులు సినిమాను ప్రభావితం చేస్తున్నారా? ఇది ఇంకొక అంతుపట్టని సమస్య. మీరు చూపించే అంశాలు, టీనేజీ పిల్లలను ప్రభావితం చేస్తున్నాయి, సమాజం మారుతోంది అంటే; సినిమా దర్శకులు మేమేమీ కొత్తగా సృష్టించటం లేదు. సమాజంలో మేము చూస్తున్నదే మీకు చూపిస్తున్నాము అంటారు. ఇది ఒక అంతులేని కథ.

ఫ్రీవిల్లా, ఫేటా – ఇది ఒక అంతుపట్టని సమస్యే అయినా దీనికి మనమే ఒక ఆచరణీయమైన పరిష్కారాన్ని వెతుక్కోవాలి. మనం ఆధ్యాత్మిక సాధన చేయాలంటే ఇది ఎంతైనా అవసరం. ఇంతవరకూ ఏం చూశాము? రెండూ ముఖ్యమే, ఒకదానికి ఒకటి ఆధారం, ఏది ఎక్కువో తార్కికంగా నిరూపించలేము అన్నాము. కాని మన ఆధ్యాత్మిక సాధన సాఫీగా సాగాలంటే ఈ రెండింటిలో ఒకదానికి మనం పెద్దపీట వేయాలి. అయితే విధిని నమ్ముకోవాలి లేదా ఫ్రీవిల్‌ను నమ్ముకోవాలి.

మళ్ళీ దేనిని నమ్ముకోవాలి అనేది తెగని సమస్య. అది మనం పాటించే సిద్ధాంతాన్ని బట్టి ఉంటుంది. మనకు మూడు ప్రధాన సిద్ధాంతాలు ఉన్నాయి. అవి ద్వైతం, విశిష్టాద్వైతం, అద్వైతం. వీటిల్లో మోక్షం నిర్వచనం కూడా భిన్నంగా ఉంటుంది. ద్వైతం, విశిష్టాద్వైతాలలో

చిన్న భేదాలు ఉన్నా కూడా, రెండూ మోక్షం అంటే దాసోహం. నువ్వు సదా భగవంతుని భక్తుడివి. భగవంతుడే నీ బాగోగులు చూస్తాడు అని నేర్పిస్తాయి.

మోక్షం నిర్వచనం విముక్తి. దేనినుంచి? సంసారంనుంచి. కాని ఈ రెండూ భగవంతునిమీద నీ భారం వేయి, భగవంతుడే నిన్ను రక్షిస్తాడు అంటాయి. అందువల్ల భగవంతుడొక్కడే స్వతంత్రుడు, నువ్వు పరతంత్రుడివి అంటాయి. అందువల్ల దాసోహం భావన పెంపొందిస్తాయి. శాశ్వతమైన దాసోహం. నిజానికి మోక్షం, దాసోహం పదాలు పరస్పర విరుద్ధంగా ఉంటాయి. మోక్షం అంటే స్వతంత్రం. దాసోహం అంటే పరతంత్రం. రెండింటికీ మధ్య ఎలా పొత్తు కుదురుతుంది? ఈ సిద్ధాంతాల్లో ఫ్రీవిల్‌కు చోటులేదు. నీ విధి నిన్ను నిర్దేశిస్తుంది అంటాయి అవి.

కాకపోతే ఇక్కడ విధి పదం వాడరు. విధికి **భగవంతుని ఇష్టం** అంటారు. **దై విల్ బి డన్** అని నానుడి. అంటే భగవంతుడు ఏది నిర్దేశిస్తే అది జరుగుతుంది. అందువల్ల భగవంతుని మీద నమ్మకం పెట్టుకో. సంసారమనే బంధంనుంచి బయటపడాలని మోక్షం కోరితే దేవునికి శాశ్వతంగా దాసుడవు అవు. ఆయన సేవలో రమించు, అదే మోక్షం అంటాయి ఆ సిద్ధాంతాలు.

అలా ద్వైతంలో, విశిష్టాద్వైతంలో ఫ్రీవిల్‌ను అణగద్రొక్కి విధిని నమ్ముతారు. అక్కడ ఫ్రీవిల్‌కు చోటులేదు.

అద్వైతం వీటికి భిన్నంగా ఉంటుంది. నీ కర్మకు నువ్వే బాధ్యుడివి అంటుంది. నువ్వు ఈ జన్మలో ఇలా ఉన్నావు అంటే పూర్వజన్మలో నువ్వు చేసిన కర్మలే దానికి కారణం కాబట్టి, ఈ జన్మలో నీ ఫ్రీవిల్‌ను ఉపయోగించి, నీ భవిష్యత్తును, నీ వచ్చేజన్మను తీర్చిదిద్దుకో అంటుంది.

**ఉద్ధరేదాత్మనాత్మానమ్** – గీత 6.5

నిన్ను నువ్వే ఉద్ధరించుకోవాలి. నీకు నువ్వే శత్రువువి, నీకు నువ్వే మిత్రుడివి కూడా అంటాడు కృష్ణపరమాత్మ. అద్వైతానికి వస్తే ముందు నా కర్మకు నేనే బాధ్యుణ్ణి అని అర్థం చేసుకుంటాము. ఆ తరువాత అహం బ్రహ్మ అస్మి జ్ఞానం పొందితే, దాని అంతిమబోధ,

**మయ్యేవ సకలం జాతం మయి సర్వం ప్రతిష్ఠితం మయి సర్వం లయం యాతి** – కైవల్యమ్

నానుంచే ఈ జగత్తు వచ్చింది, నాలోనే స్థితి పొందుతున్నది, నాలోనే లయమవుతున్నది. నేనే బ్రహ్మను. నేను పారమార్థిక సత్యాన్ని అని నేర్చుకుంటాము.

నేను దాసుణ్ణి కాను, నేను స్వామిని. దాసోఽహం బదులు సోఽహం అనటం నేర్చుకుంటాము. జగత్తు నామీదే ఆధారపడివుంది, దేశం, కాలం నామీదే ఆధారపడి ఉన్నాయి.

శంకరాచార్యులవారు ఒక అడుగు ముందుకు వేసి జీవజగత్ ఈశ్వర అనే ఈ త్రిపుటి అంతా కూడా బ్రహ్మ అయిన నామీదే ఆధారపడి ఉన్నాయని, త్రిపుటి వ్యావహారిక సత్యమనీ, నేను పారమార్థిక సత్యమనీ చెబుతారు. అందువల్ల మీరు అద్వైతం వైపు మొగ్గు చూపేటట్టయితే, ఫ్రీవిల్ మీ జీవితాన్ని నిర్దేశిస్తుందనీ, మీ ఫ్రీవిల్‌తో మీ విధిని మార్చగలరనీ మీ మనస్సును సిద్ధం చేసుకోండి.

లేదు, నేను అద్వైతానికి రాను, ద్వైతంలోనో, విశిష్టాద్వైతంలోనో ఉంటాను అనేటట్టయితే, విధి ప్రధాన జీవనానికి సిద్ధం కండి. భగవంతుని నిశ్చయానికి కట్టుబడి ఉండాలని నిశ్చయించుకోండి. నిజానికి తార్కికంగా చూస్తే, ఇలా ఏదో ఒకటే మన జీవితాన్ని నిర్దేశించదు, రెండూ అన్యోన్య ఆశ్రితాలని చూశాము. కాకపోతే ఈ నమ్మకాల్లో ఒకదాన్ని ప్రధానంగా తీసుకుంటారు. ఏది ఏమైనా జీవితాన్ని ఏది నిర్దేశిస్తుంది అనే వాదనలోకి దిగకండి. ఎదుటివారు దేన్ని నమ్మితే దాన్ని నమ్మనివ్వండి; మీకు ఏది ఇష్టమో అది పాటించండి. మీరు అద్వైతానికి వచ్చారు కాబట్టి మీ జీవితం ఫ్రీవిల్ వైపు మొగ్గు చూపుతుంది.

ఈ నేపథ్యంతో ఈ శ్లోకం చూద్దాము.

**విధేః ప్రయత్నస్య చ** – విధి అంటే కర్మఫలం; ప్రయత్నం అంటే పురుషప్రయత్నం. ఇంగ్లీషులో ఫ్రీవిల్ అంటారు.

**కః అపివాదః** – ఈ వాదన అనిర్వచనీయం.

**తయోః ద్వయోః** – ఆ రెండింటియొక్క అంటే విధి, పురుషప్రయత్నాలయొక్క,

**మూలమ్** – మూలకారణం. విధి అంటే గతంలో నేనే చేసిన కర్మఫలం. విధి అంటే గతంలోని నేను. గతం అంటే పూర్వజన్మ అవచ్చు, ఈ జన్మలోని గతం అవచ్చు. పురుషప్రయత్నం అంటే వర్తమానంలోని నేను. ఆ విధంగా విధి, ప్రయత్నం నా గతం నేను, నా వర్తమానం నేనుని సూచిస్తాయి. రెండూ కాలంలో ముడివేసుకుని ఉన్నాయి. కాలంలో పెనవేసుకుని ఉన్న నేను అంటే అది అహంకారం నేనుని సూచిస్తుంది; కర్తా భోక్తా అయిన నేను. ఈ చర్చ అంతా ఎందుకు వస్తోంది అంటే అహంకారం యొక్క మూలం ఏమిటో తెలియకపోవటంవల్ల వస్తోంది.

**ద్వయోః కర్తృభోక్తృరూప అహంకారయోః**
**భూతవర్తమాన రూప అహంకారయోః మూలమ్**

మూలమ్ – అహంకారం మూలం ఏమిటి? కాలాతీతమైన ఆత్మ.
**అజానతామ్** – అహంకారంయొక్క అధిష్ఠానం తెలియనివారికి, అంటే అజ్ఞానులకు,
**స్యాత్** – ఈ వాదన ఉంటుంది.

ఇది చాలా ముఖ్యమైన అంశం. అహంకార మూలం తెలియనివారికి అహంకారానికి సంబంధించిన వాదనలు కొనసాగుతాయి. ఎప్పుడైతే దాని అధిష్ఠానజ్ఞానం కలుగుతుందో అప్పుడు అహంకారం మటుమాయమవుతుంది.

**మూలవస్తు సంజానతామ్** – మూలవస్తు అంటే అధిష్ఠాన ఆత్మ. దేనికి?
**విధేః ప్రయత్నస్య చ** – విధికి, ఫ్రీవిల్‌కీ. ఈ రెండూ కలిస్తే అహంకారం అని చూశాము.

ఎవరైతే అహంకారంయొక్క అధిష్ఠానం ఆత్మ అని నేర్చుకుంటారో, వారికి,
**నైవ విధిః న యత్నః** – విధి లేదు, ఫ్రీవిల్ లేదు. అంటే గతంలోని నేను లేదు, వర్తమానంలోని నేను లేదు.

ఇది అర్థం చేసుకోవాలంటే ఒకసారి కాలం గురించి శ్లోకం 15లో చూసిన వివరణ గుర్తు తెచ్చుకోవాలి. గతం మీ చేదు జ్ఞాపకాల్లోనే ఉందనీ, నిజంగా లేదనీ, అలాగే భవిష్యత్తు మీ భయాల్లో ఉందనీ, నిజంగా లేదనీ, వర్తమానం ఒక్కటే నిజమనీ చూశాము. అప్పుడు గతం అనుభవించాము కదా అని మీరంటే, అనుభవించినప్పుడు గతం వర్తమానమే అవుతుంది. ఇదంతా గందరగోళంగా ఉన్నా, గతం గడిచిపోయింది, భవిష్యత్తు అగమ్యగోచరం, నేడే నిజం. వీటన్నిటిలోనూ సమానంగా ఉన్నది నేను. నేను నిజం.

ఈ శ్లోకం సారాంశం – మన జీవితాన్ని నిర్దేశించేది ఏమిటి? విధా, పురుషప్రయత్నమా అనే అర్థం లేని చర్చల్లోకి దిగకండి. వేదాంతబోధ అర్థం చేసుకోవాలంటే అహం బ్రహ్మ అస్మి జ్ఞానంలో నిలవాలి. అహం బ్రహ్మ అస్మిలోని అహం ఎవరు? సాక్షిచైతన్యం. అహంకారం కాదు, సాక్షిచైతన్యం.

**శ్లోకం 22**

**యదీశితుర్వీక్షణమీక్షితారమ్**
**అవీక్ష్య తస్మానసికేక్షణం స్యాత్ ।**
**న ద్రష్టురన్యః పరమో హి తస్య**
**వీక్షా స్వమూలే ప్రవిలీయ నిష్ఠా ॥**

**ప్రతిపదార్థం:** ఈక్షితారమ్ అవీక్ష్య = దర్శించేవానిని చూడకుండ (తెలుసుకోకుండా); ఈశితుః వీక్షణమ్ = పరమాత్మ దర్శనం; యత్ = ఏదైతే; తత్ = అది (దృశ్యము); మానసిక

ఈక్షణమ్ = మానసిక దృశ్యము; స్యాత్ = అవుతుంది; ద్రష్టుః అన్యః = ద్రష్ట కాక మరొక; పరమః = పరమాత్మ; న = లేనే లేదు; తస్య = ఆయనకు; వీక్ష్యా = దృశ్యమానమైనది; స్వమూలే = తనయొక్క మూలములో; ప్రవిలీయ = విలీనము చేసుకున్నప్పుడు; నిష్ఠా = నిష్ఠ

**తాత్పర్యం:** ద్రష్టను తెలుసుకోకుండా పరమాత్మను దర్శించటం మానసిక కల్పనే అవుతుంది. నిజానికి ద్రష్ట (పారమార్థిక బ్రహ్మ) లేకుండా పరమాత్మ లేనే లేదు. మూలాన్ని తెలుసుకుని ఆ నిష్ఠలో ఉండటమే పరమాత్మ దర్శనం.

**వివరణ:** ఈ శ్లోకంలో వేదాంతబోధ సారాంశం చూస్తాము. అందువల్ల ఉపనిషత్తులు నేర్చుకున్నవారికి బాగా అర్థమవుతుంది. ఉపనిషత్తులతో పరిచయం లేనివారికి వింతగానూ, స్వీకరించలేనట్టుగానూ ఉంటుంది. అంటే ఈ శ్లోకాన్ని స్వీకరించాలంటే మనస్సును సంసిద్ధం చేసుకోవాలి. ఇది కేనోపనిషత్తు, బృహదారణ్యకోపనిషత్తుల సారం.

ఉపనిషత్తుల సారం – నీకు ఆబ్జెక్టుగా అనుభవంలోకి వచ్చేదేదీ సత్యం కాదు. అది వ్యావహారిక సత్యం మాత్రమే. మిథ్యకి ఇంకొక పేరు వ్యావహారిక సత్యం. మరి సత్యం ఏమిటి? చూసే నేను, సాక్షిచైతన్యమైన నేను మాత్రమే సత్యాన్ని. చూసే నేను సత్యం, చూడబడే వస్తువు మిథ్య.

ఉపనిషత్తు, నేనెవరు ప్రశ్నకు నీకు ఆబ్జెక్టుగా కనిపించేదేదీ నువ్వు కాదు అంటుంది.

జగత్తు – నాకు బాహ్యవస్తువుగా కనిపిస్తోంది కాబట్టి జగత్తు నేను కాదు.

శరీరం – శరీరంలో వచ్చే షడ్వికారాలు నాకు తెలుస్తున్నాయి కాబట్టి నేను శరీరం కాదు.

మనస్సు – మనస్సులో వచ్చే రాగద్వేషాలు, కామక్రోధాలు నాకు తెలుస్తున్నాయి కాబట్టి నేను మనస్సు కాదు.

ఈ విధంగా నేను జగత్తు కాదు, నేను శరీరం కాదు, నేను మనస్సు కాదు. ఇవన్నీ మిథ్య. నేను మాత్రమే సత్యం. నేనంటే ఎవరో మర్చిపోకూడదు. నేను సాక్షిచైతన్యాన్ని లేదా ఆత్మను. ఇంతవరకూ సమస్య లేదు. ఇక్కడదాకా రావటం కూడా కష్టమే కొందరికి. కాని ఎలాగోలా దీన్ని జీర్ణించుకోగలరు.

ఇప్పుడు ముఖ్యమైన సమస్య వస్తుంది. మరి భగవంతుని మాట ఏమిటి? భగవంతుడు సత్యమా, మిథ్యా? ఇది చాలా ముఖ్యమైన ప్రశ్న. ముఖ్యంగా భగవంతునికి నిత్యమూ పూజలు చేస్తూ, ఆయనమీదే భావపరంగా ఆధారపడినవారు భగవంతుడు సత్యమా, మిథ్యా అనే ప్రశ్ననే జీర్ణించుకోలేరు. ఉపనిషత్తు తెలివిగా, ఆ ప్రశ్నకు నేను జవాబు చెప్పను. నేను

మీకొక సూత్రం ఇచ్చాను కదా, దాన్నిబట్టి మీరే తేల్చుకోండి అంటుంది. ఒకసారి ఆ సూత్రాన్ని మళ్ళీ చూద్దాము.

**నీకు ఆబ్జెక్టుగా కనిపించేదేదీ సత్యం కాదు, అది మిథ్య.** ఇప్పుడు మీరు చెప్పండి, మీ దృష్టిలో భగవంతుడు ఎవరు? మీరు భగవంతుణ్ణి ఆరాధించే పద్ధతిని బట్టి సత్యమో, మిథ్యో చెబుతాను అంటుంది. భగవంతుడు వేరు, మీరు వేరు అని భావించి, భగవంతుణ్ణి ఆబ్జెక్టుగా, ఏకరూప ఈశ్వరునిగా కొలిచేటట్టయితే, ఈ చేదు నిజాన్ని స్వీకరించక తప్పదు. భగవంతుడు మిథ్య అంటే స్వీకరించటానికి కష్టంగా ఉంటే వ్యావహారిక సత్యంగా తీసుకోవాలి. దీనికి అనుమాన ప్రమాణం –

**ఈశ్వరః మిథ్యా అనాత్మవత్ ఘటవత్**

నాకు ఆబ్జెక్టుగా కనిపించేదేదీ నేను కాదు. అది మిథ్య అన్నాము. ఆత్మ కానిది అనాత్మ. అనాత్మ అంటేనే న+ఆత్మ. ఆత్మ కానిది. **ఈశ్వరః మిథ్యా అనాత్మవత్ ఘటవత్.** ఈశ్వరుడు అనాత్మ కాబట్టి మిథ్య, దానికి హేతువు కుండ. ఎలాగైతే కుండ మిథ్యో, అలా ఈశ్వరుడు కూడా మిథ్యే.

దీనికి శ్రుతిప్రమాణం కూడా ఉంది.

**తదేవ బ్రహ్మ త్వం విద్ధి నేదం యదిదముపాసతే** – కేన

ఉపాసన చేసే నువ్వే బ్రహ్మవు, నీచేత ఉపాసన చేయబడుతున్న దేవత బ్రహ్మ కాదు.

దీనికి కారణం చూశాము. ఏకరూప ఈశ్వరుడు అంటే ఆబ్జెక్టు అవుతాడు. ఆబ్జెక్టుగా అనుభవంలోకి వస్తున్నదేదీ సత్యం కాదు అంటుంది కేనోపనిషత్తు.

మాండూక్యోపనిషత్తు కూడా ముందు, నువ్వు చూసినంత మాత్రాన అది నిజం కానవసరం లేదు అంటుంది. తరువాత ఇంకొక అడుగు ముందుకేసి, నువ్వు చూశావా అయితే అది నిజం కాదు అంటుంది. భక్తునికి ఈ సత్యం జీర్ణించుకోవటం కష్టమే. ఒక విషయం అర్థం చేసుకోవాలి ఇక్కడ. శాస్త్రం ఏకరూప భక్తిని కొట్టివేయటం లేదు. నిజానికి భక్తి అలాగే మొదలవుతుంది. కాని క్రమేపి దాన్నించి ఎదిగి అనేకరూప భక్తికి, అరూపభక్తికి ఎదగాలంటుంది.

మీరు సత్యాన్వేషణ చేయదలుచుకుంటే భావాలకు కట్టుబడకూడదు. శాస్త్రజ్ఞులు సత్యాన్వేషణలో వారి రాగద్వేషాలను, వారి భావోద్రేకాలను పక్కనపెట్టి మరీ వారి పరిశోధన కొనసాగిస్తారు.

మీకు భగవంతుడెవరో తెలుసుకోవాలని ఉంటే, అది కూడా అంతిమసత్యం అయిన భగవంతుని గురించి తెలుసుకోవాలని ఉంటే, దానికి ఒక్కటే మార్గం ఉంది. అది **అహం బ్రహ్మ అస్మి** జ్ఞానం పొందటమే. ఈ జ్ఞానంవల్ల జీవాత్మ, పరమాత్మ ఐక్యజ్ఞానం కలుగుతుంది. పరమాత్మ ఎవరు? నేనే! అంటే ఆబ్జెక్టు కాదు, సబ్జెక్టు అయిన నేనే. కాకపోతే నేను అన్నప్పుడల్లా ఆ నేను ఎవరో మర్చిపోకూడదు. నేను మోకాలి నొప్పితో బాధపడుతున్న శరీరం కాదు, రాగద్వేషాలకు లోనయ్యే మనస్సు కాదు, ఈ రెండింటినీ సాక్షీభూతంగా చూసే సాక్షిచైతన్యాన్ని. భగవంతుడు అంటే ఆబ్జెక్టు కాదు, **ఆత్మ అభిన్న ఈశ్వరుడు**. చైతన్యపరంగా నాకు భిన్నంగా లేని ఈశ్వరుడు.

ఇప్పుడు ఈ చర్చను టూకీగా చూస్తే ఈశ్వరుడు మిథ్యా, సత్యమా ప్రశ్నకు ఈశ్వరుని నిర్వచనాన్నిబట్టే జవాబు మారుతుంది.

ఈశ్వరుణ్ణి – ఏకరూప ఈశ్వరునిగా, ఉపాసనదేవునిగా కొలిస్తే మిథ్య

ఈశ్వరుణ్ణి – ఆత్మనైన నాకు భిన్నంగా లేడని అర్థం చేసుకుంటే సత్యం

దీన్ని భక్తులు, ఉపాసకులు అంత తేలికగా స్వీకరించలేరు. వారు ఎందరో భక్తుల కథలు చదివి, విని ఉంటారు. భగవంతుడు వారి భక్తిని మెచ్చి భగవంతుడు సాక్షాత్కారమైన కథలు ఆర్ద్రతతో తెలుసుకుని ఉంటారు. కాని శాస్త్రం ఒక్కటే అంటుంది – భగవంతుడు ఒక సమయంలో వచ్చి, ఒక సమయంలో అంతర్ధానమయ్యాడంటే, ఆ భగవంతుడు అంతిమ సత్యం కాదు. భగవంతునికి కూడా దేశకాల పరిమితులు వస్తాయి.

రాముడు, కృష్ణుడు, విష్ణుమూర్తి అవతారాలు నిజమే. కాని శాస్త్రం వారికి కూడా ఒక పుట్టినతేదీ, నిర్యాణం చెందిన తేదీ (భగవంతునికి మరణించిన లేదీ అనము) ఉంటాయి. అంటే వారికీ దేశకాల పరిమితులు ఉంటాయి. అవతారం ఎత్తాడు అంటే అవతారం చాలిస్తాడు. కాబట్టి అంతిమసత్యం కాదు.

ముందే చూసినట్టుగా శాస్త్రం భగవంతుణ్ణి కించపరచటం లేదు; భక్తులను, ఉపాసకులను చిన్నచూపు చూడటం లేదు. నిజానికి శాస్త్రమే కర్మకాండ, ఉపాసనకాండలను నిర్దేశించింది. కర్మకాండలో ఇష్టదైవానికి అనేక పూజలు, యజ్ఞాలు చేస్తారు. భగవంతుణ్ణి ఆబ్జెక్టుగా కొలవమని కర్మకాండే చెప్పింది.

ఉపాసనలో కూడా ఉపాస్యదేవుడు వేరు, ఉపాసకుడైన మీరు వేరు. ఉపాసనలు చేయమని ఉపాసనకాండే చెప్పింది. అనేక ఫలాలను కూడా ఇస్తుంది. ఉపాసకులను మనం కీర్తిస్తాము కూడా. గౌడపాదాచార్యులవారు, వారిని కృపణులు అంటున్నారు.

వేదాంతసారం కర్మయోగం చేసి చిత్తశుద్ధి పొంది, ఉపాసనయోగం చేసి చిత్తఏకాగ్రత పొంది, జ్ఞానయోగానికి వచ్చి శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేసి జ్ఞానం పొంది మోక్షం పొందాలి. భగవంతునిపరంగా చూస్తే ముందు ఏకరూప ఈశ్వరపూజ లేదా ధ్యానం చేయాలి. తరువాత అనేకరూప ఈశ్వరధ్యానం చేయాలి. అంటే మీరు కొలిచే ఇష్టదైవమే జగత్తు అంతటా ఉన్నాడని అర్థం చేసుకోవాలి. అక్కడ కూడా ఆగిపోకూడదు. అరూప ఈశ్వరజ్ఞానం పొందాలి. అంటే చైతన్యపరంగా భగవంతుడూ, నేనూ ఒకటే అనే ఐక్యజ్ఞానం. అందువల్ల దీన్ని నహినిందా న్యాయం అంటారు. ముందుకు సాగండి, ముందుకు సాగండి అని తోయటానికి సగుణ ఈశ్వరుడు కూడా మిథ్యే అంటుంది.

రమణమహర్షుల వారు కూడా మొదటే అరూప ఈశ్వరజ్ఞానానికి వచ్చేయమనటం లేదు. అంతకుముందు ఏకరూప ఈశ్వరధ్యానం చేయమనే చెప్పారు. భగవంతునికి పూజ చేసే రోజుల్లో ఇది చెప్పమంటారు.

**దేహో దేవాలయః ప్రోక్తః జీవో దేవః సనాతనః।**
**త్యజేత్ అజ్ఞాన నిర్మాల్యం సోఽహమ్ భావేన పూజయేత్॥**

**దేహో దేవాలయః ప్రోక్తః** – భగవంతుడు ఎక్కడో దూరాన లేదు, నీలోనే ఉన్నాడు.

**జీవో దేవః సనాతనః** – జీవాత్మ, అంటే చైతన్యమే పరమాత్మ.

**త్యజేత్ అజ్ఞాన నిర్మాల్యమ్** – అసలైన పూజ అజ్ఞానమనే నిర్మల్యాన్ని తొలగించటమే. ఏమిటా పూజ?

**సోఽహం భావేన పూజయేత్** – సోఽహం అంటే సః అహం. భగవంతుడూ, నేనూ ఒక్కటే అనే ఐక్యజ్ఞానం. ఐక్యజ్ఞానంతో పూజ చేయాలి అంటే ఐక్యజ్ఞానం స్థాయికి ఎదగాలి.

అందువల్ల ద్వైతపూజతో మొదలుపెట్టాలి కాని అదే అంతిమలక్ష్యం కారాదు. ద్వైతపూజ నుంచి అద్వైతజ్ఞానానికి రావాలి. ఈ నేపథ్యంతో ఈ శ్లోకం చూద్దాము.

**ఈక్షితారమ్** – ద్రష్టను, చూసే నేను లేదా ఆత్మను.

**అవీక్ష్య** – చూడకుండా, తెలుసుకోకుండా,

అంటే ఆత్మజ్ఞానం పొందకుండా,

**ఈశితుః** – ఈశ్వరునియొక్క,

**వీక్షణమ్** – దర్శనం కోరితే,

**తత్** – అది

**మానసిక ఈక్షణం** – అది మనస్సులో కలిగే దర్శనమే అవుతుంది.

ఆత్మజ్ఞానం పొందకుండా, భగవంతుని సాక్షాత్కారం ఆబ్జెక్టుగా కావాలని కోరుకోవటం ప్రాతిభాసిక సత్యం అవుతుంది; మహా అయితే వ్యావహారిక సత్యం అవుతుంది. భగవంతుడు మీ భక్తికి మెచ్చి ప్రత్యక్షమవుతాడు. అద్భుతంగా దర్శనం ఇస్తాడు. అది అద్భుతమే. కాని, అది మీకు కలిగిన అనుభవం. ఒక కాలంలో వచ్చి, ఇంకొక కాలంలో పోయే అనుభవం సత్యం కాదు. భగవంతుడు మీకు ఆబ్జెక్టుగా దర్శనమిస్తున్నాడు. అందువల్ల అది మిథ్య. రమణమహర్షి అలా ఎందుకు అంటున్నారు? ఎందుకంటే,

**ద్రష్టుః అన్యః పరమః న (అస్తి)** – చూసే నేనుకి భిన్నంగా ఈశ్వరుడు లేడు. పరమః అంటే పారమార్థిక సత్యఈశ్వరుడు. అంతిమసత్యం అయిన భగవంతుడు. ద్రష్ట అంటే సాక్షిచైతన్య ఆత్మ. సాక్షిచైతన్యమైన నాకు భిన్నంగా పారమార్థిక సత్య ఈశ్వరుడు లేడు. వేదాంతంలోకి రాని సాధకుడికి ఇది జీర్ణించుకోవటం చాలా కష్టం అవుతుంది.

సద్దర్శనం ఎక్కువగా మాండూక్యోపనిషత్తును ఆధారంగా చేసుకుని వచ్చింది. అది నేర్చుకుని దీనికి వస్తే, సద్దర్శనం చక్కగా అర్థమవుతుంది.

**హి (న అస్తి)** – హి ప్రత్యేకించి వాడుతున్నారు రమణమహర్షి. హి ద్వారా నొక్కి వక్కాణిస్తున్నారు. ఉపనిషత్తుల్లో భగవంతుణ్ణి ఆబ్జెక్టుగా కొలవము. కర్మకాండలో సగుణ ఈశ్వరుణ్ణి కొలుస్తారు కాని జ్ఞానకాండకు వచ్చేసరికి నిర్గుణబ్రహ్మ మాత్రమే సత్యం అంటుంది.

ఒక్క అద్వైత వేదాంతంలోనే నిర్గుణబ్రహ్మజ్ఞానం అంతిమజ్ఞానం అని వస్తుంది. తక్కిన దర్శనాలన్నీ సగుణ ఈశ్వరుని దగ్గరే ఆగిపోతాయి. ఎందుకంటే భక్తిలో భగవంతుడంటే ఏకరూప ఈశ్వరుడే. కాని ఉపనిషత్తులు దాన్ని విమర్శిస్తాయి.

**అన్యో ఽసౌ అన్యో ఽహమ్ అస్మీతి న స వేద, సః దేవానాం పశుః** – బృహదారణ్యకమ్

పూజలు చేసే వ్యక్తి దేవతలకు పశువు అంటుంది బృహదారణ్యకమ్. అంటే దేవతలు ఒక భక్తుడు జ్ఞానమార్గానికి వెళ్ళదలుచుకుంటే, తమకు ఒక భక్తుడు తగ్గిపోతాడని అతనికి అడ్డుపడతారని వస్తుంది అందులో.

మీరు ఏకరూపభక్తితో మొదలుపెట్టండి తప్పులేదు, కాని అక్కడే ఆగిపోకండి అంటాయి ఉపనిషత్తులు. మీకు మోక్షం కావాలి అంటే **అహం బ్రహ్మ అస్మి** జ్ఞానానికి రాకతప్పదు. లేదు, నేను సంసారంలో హాయిగానే ఉన్నాను అంటే పునరపి జననం, పునరపి మరణం చక్రంలో పడి తిరగక తప్పదు. దాసోహం భావన కూడా తప్పదు. అద్వైతానికి వస్తే సోఽహమ్ అంటారు.

ఒకసారి ఒక గోడమీద అద్వైతజ్ఞాని సోఽహమ్ అని రాస్తే, ఒక భక్తుడు అపచారం అని భావించి, దాని ముందు దా కలిపి దాసోఽహమ్ చేశాడు దాన్ని. జ్ఞాని వచ్చి దాని ముందు స కలిపాడు. అప్పుడు సదాసోఽహమ్ అయింది. మళ్ళీ భక్తుడు దా కలిపాడు. దాస దాసోఽహమ్ అయింది. అలా కొనసాగుతుంది. నేను ఎప్పుడూ భగవంతుణ్ణి అని ఒకరంటే, నేను ఎప్పుడూ సేవకుడిని అని ఇంకొకరంటున్నారు.

ఎప్పటికీ సేవకుడిగా నిలిచిపోవాలనుకుంటున్నారా, ఐక్యజ్ఞానం పొందాలనుకుంటున్నారా మీ ఇష్టం, మీరు తేల్చుకోండి అంటుంది శాస్త్రం. సేవకుడిగా ఉండటం అంటే అది సంసారమే అవుతుంది. ఒక మామూలు వ్యక్తికి సేవకుడిగా ఉన్నా, ప్రెసిడెంట్‌కి సేవకుడిగా ఉన్నా, భగవంతుడికి సేవకుడిగా ఉన్నా, సేవకుడు సేవకుడే; సంసారం సంసారమే. మోక్షం అంటే సేవాభావంనుంచి విడుదల. అందువల్ల **అహమ్ ఏవ ఈశ్వరః** అనే జ్ఞానం పొందాలి.

ఈశ్వరజ్ఞానం పొందాలంటే భగవంతుడు బాహ్యంగా లేడు, భగవంతుడు నీలోనూ లేడు, నువ్వే భగవంతుడివి అని శాస్త్రం చెప్పే బోధను అర్థం చేసుకోవాలి. బాహ్యంగా భగవంతుడు దర్శనమైతే అది వ్యావహారిక సత్యం అవుతుంది. భగవంతుడు ధ్యానంలో అనుభవమయితే అది ప్రాతిభాసిక సత్యం అవుతుంది. ఆ అనుభవాన్ని కొట్టివేయటం లేదు, కాని అది అంతిమ అనుభవం కాదంటున్నది, అంతే! భగవంతుడు అనుభవంలోకి వచ్చాడూ అంటేనే భగవంతుడు ఆబ్జెక్టు అవుతాడు, ఆబ్జెక్టుగా అనుభవంలోకి వస్తే అది మిథ్యా అనుభవం అంటుంది శాస్త్రం.

దీన్నే **మానసిక ఈక్షణం** అంటున్నారు రమణమహర్షి. మానసిక ఈక్షణంలోకి ప్రాతిభాసిక సత్య ఈశ్వరుడు, వ్యావహారిక సత్య ఈశ్వరుడు ఇద్దరూ వస్తారు. ఈ సాంకేతిక పదాలు అర్థం కాకపోతే, ఈశ్వర అనుభవం ఆంతరంగా కలిగినా, బాహ్యంగా కలిగినా, రెండూ మిథ్యే అని అర్థం చేసుకుంటే చాలు. ఎవరంటున్నారు అలా? ఉపనిషత్తులే అంటున్నాయి.

**నేదం యదిదముపాసతే** – కేన

నువ్వు ఉపాసన చేసే ఉపాస్యదేవత బ్రహ్మకాదు, అంతిమసత్యం కాదు. బృహదారణ్యకం ఇంకొక అడుగు ముందుకు వేస్తుంది. మరికొంత స్పష్టంగా బ్రహ్మ గురించిన వివరణ ఇస్తుంది. అక్షర బ్రాహ్మణంలో బ్రహ్మను ఈ విధంగా నిర్వచిస్తుంది.

**ఏతదక్షరం గార్గ్యదృష్టం ద్రష్ట్ర శ్రుతం శ్రోత్రమతం మంత్రవిజ్ఞాతం విజ్ఞాతః**

– బృహదారణక్యమ్ 3.8.11

ఏతదక్షరం – ఇది అక్షరం బ్రహ్మ.

అదృష్టం ద్రష్టః – ఆత్మ చూసేది కాని చూడబడేది కాదు.

అశ్రుతగ్ం శ్రోత్రః – ఆత్మ వినేది కాని వినబడేది కాదు.

అమతం మంత్రః – ఆత్మ ఆలోచించేదే కాని ఆలోచించబడేది కాదు.

అవిజ్ఞాతం విజ్ఞాతః – ఆత్మ తెలుసుకునేదే కాని తెలియబడేది కాదు.

అంటే ఆత్మ ద్రష్టా, శ్రోతా, మంతా, విజ్ఞాతా. ఆత్మ సబ్జెక్టు కాని ఆబ్జెక్టు కాదు. అక్షర బ్రహ్మ అంటే ఎప్పటికీ నువ్వే కాని, ఎన్నటికీ విషయవస్తువు కాదు. ఇదీ ఈ మంత్రంయొక్క సారాంశం.

నువ్వే బ్రహ్మవు అయినప్పుడు, బ్రహ్మను ఆబ్జెక్టుగా ఎలా చూస్తావు? అది అసాధ్యం అంటున్నారు రమణమహర్షి. అందువల్ల మీకు నిర్గుణబ్రహ్మ సాక్షాత్కారం కావాలంటే ఆత్మజ్ఞానం పొందాలి. సగుణబ్రహ్మ సాక్షాత్కారం కావాలంటే, తపస్సు చేయాలి.

ఈక్షితారమ్ అవీక్ష్య – చూసే మీ గురించి తెలుసుకోకుండా,

ఈశితుః యత్ వీక్షణమ్ – ఈశ్వరునియొక్క ఏ దర్శనం ఉందో,

తత్ మానసిక ఈక్షణం స్యాత్ – అది మిథ్యాదర్శనమే అవుతుంది.

భగవంతుడు కలలో ప్రత్యక్షమయినా, మీరు భగవంతుని గురించి కలకన్నా కూడా అది ప్రాతిభాసిక సత్యం అంటున్నారు. ఎందుకు? దానికి కారణం మూడవపాదంలో చూశాము.

**ద్రష్టుః అన్యః పరమః న అస్తి** – చూసే నేనుకు భిన్నంగా ఈశ్వరుడు లేడు. చూసే నేను అంటే, ఆ నేను ఎవరో సరిగ్గా అర్థం చేసుకోవాలి. చూసే నేను అంటే అహంకారం నేను కాదు. సాక్షిచైతన్యమైన నేను. మనస్సును సన్నిధి మాత్రంచేత చైతన్యవంతం చేసే సాక్షి చైతన్యాన్ని. కావాలని ప్రయత్నపూర్వకంగా చేయను. అందువల్ల వేరే ఈశ్వరుడు లేడు.

సరే, నాకు అనుభవంలోకి వస్తున్నది అంతిమసత్యం కాదు, ఆబ్జెక్టుగా అనుభవంలోకి రాదు అంటున్నారు; బాగానే ఉంది. ఆ అంతిమసత్యం అయిన అక్షరబ్రహ్మ అనుభవం పొందటమెలా? దానికి ఏదైనా సాధన లేక గైడెడ్ మెడిటేషన్ నేర్పించండి అంటే అలాంటి ఆశలేం పెట్టుకోవద్దు అంటున్నారు రమణమహర్షి.

**తస్య వీక్షా** – ఆ అక్షరబ్రహ్మయొక్క దర్శనం చేయాలంటే,

**స్వమూలే నిష్ఠా** – ఆత్మజ్ఞానంలో నెలకొని ఉండటమే! స్వమూలం అంటే స్వస్వరూపం. స్వస్వరూపంలో నెలకొని ఉండటమే.

**ప్రవిలీయ** – అనుభవంకోసం తహతహలాడే తన అహంకారాన్ని ఆత్మజ్ఞానంలో లయం చేయాలి.

ప్రమాతగా ప్రమేయం గురించి తెలుసుకోవాలి. అనుభవించాలి అనే తపనలో ఉన్నాము ఇన్నాళ్ళు. నేను సబ్జెక్టు, భగవంతుడు ఆబ్జెక్టు అనుకుంటూ వచ్చాము. ఇప్పుడు ఈ త్రిపుటిని లయం చేయాలి.

**ప్రమాతృ ప్రమేయ ప్రమాణ విలక్షణ ఆత్మా అహమస్మి**

ఈ జ్ఞానంలో నెలకొని ఉండటమే భగవద్దర్శనం. ఆత్మనిష్ఠే జ్ఞాననిష్ఠ. నేను సాక్షిచైతన్యాన్ని అనే జ్ఞానంలో నెలకొని ఉండాలి.

**శ్లోకం 23**

**ఆత్మానమీక్షేత పరం ప్రపశ్యేత్**
**ఇత్యాగమోక్తేః సులభో న భావః ।**
**నాత్మైవ దృశ్యో యది కా కథేశే**
**స్వయం తదన్నీభవనం తదీక్షా ॥**

**ప్రతిపదార్థం:** ఆత్మానమ్ ఈక్షేత = ఆత్మను దర్శించాలి; పరం ప్రపశ్యేత్ = పరమాత్మను కూడా దర్శించాలి; ఇతి ఆగమ ఉక్తేః = అని వేదాలు ఘోషిస్తున్నాయి; భావః = అర్థము; న సులభః= సులభము కాదు; యది = కాని; ఆత్మా ఏవ = ఆత్మ మాత్రమే; న దృశ్యః = చూడబడనట్లయితే; ఈశే కా కథా = పరమాత్మను గూర్చి ఏమి చెప్పగలము; తత్ ఈక్షా = ఆ దృశ్యం; తత్ అన్నీ భవనమ్ స్వయమ్ = స్వయంగా ఒకరికి ఆహారం కాగలదు.

**తాత్పర్యం:** ఆత్మను దర్శించాలి. పరమాత్మను లేదా ఈశ్వరుని దర్శించాలి అని వేదాలు ఘోషిస్తున్నాయి. కాని దాని అర్థం సులభగ్రాహ్యము కాదు. ఆత్మయే చూడబడనప్పుడు పరమాత్మను గూర్చి ఏమి చెప్పగలము? ఆ దృశ్యం స్వయంగా ఒకరికి ఆహారం కాగలదు.

**వివరణ:** ఇంతకుముందు శ్లోకంలో చూసిన భావనే ఇక్కడ కూడా వస్తోంది. కాకపోతే భిన్న కోణాల్లోనుంచి వస్తుంది. ఏమిటా భావన?

సత్యబ్రహ్మ దర్శనం చేయాలంటే ఆత్మస్వరూపాన్ని అర్థం చేసుకోవడానికి మించి వేరే మార్గం లేదని అర్థం చేసుకోవాలి. ఈ ఒక్క విషయం మాత్రం మర్చిపోకూడదు. రమణమహర్షి వ్యావహారిక దేవత దర్శనాన్ని ఏమాత్రం ఖండించడం లేదు, కించపరచడం లేదు, భక్తుల కథలు అపూర్వమే. భగవంతుని లీలలు అద్భుతమే. కానీ ఇక్కడ రమణమహర్షి చెప్పాలనుకున్న విషయం వేరు. అలా ప్రత్యక్షమై వరాలిచ్చి అంతర్ధానమయ్యే భగవంతుడు సత్యబ్రహ్మ కాదు, మిథ్యా భగవంతుడని స్పష్టంగా చెబుతున్నారు.

ఆ మాటకొస్తే కంటికి స్పష్టంగా కనిపించే, ప్రత్యక్షంగా కనిపించే బాహ్యప్రపంచాన్ని మిథ్యగా కొట్టివేస్తుంది వేదాంతం. **బ్రహ్మ సత్యం జగన్మిథ్యా** అంటుంది. అటువంటప్పుడు ప్రత్యక్షంగా కనిపించే ప్రపంచంలో, ప్రత్యక్షంగా కనిపించే భగవంతుడు కూడా అదే హోదాలో ఉంటాడు. కంటికి కనిపించే జగత్తులో, కంటికి కనిపించడానికి భగవంతుడు కూడా మిథ్యారూపాన్ని దాల్చాలి. అంత స్పష్టంగా కనిపించే భగవంతుడు సత్యం కాదంటే అసలు భగవంతుడు ఎవరు? వేదాంతం అసలు భగవంతుడు కంటికి కనపడడు, ప్రత్యక్ష ప్రమాణానికి అందదు అంటుంది.

**అశబ్దమస్పర్శమరూపమవ్యయం తథారసం నిత్యమగన్ధవచ్చ యత్ ।**
**అనాద్యనన్తం మహతః పరం ధ్రువం నిచాయ్య తం మృత్యుముఖాత్ప్రముచ్యతే ॥**

కంటికి కనిపించాడా అయితే భగవంతుడు కాదు, వినిపించాడా అయితే భగవంతుడు కాదని ఉపనిషత్తులు ఏకగ్రీవంగా ఘోషిస్తున్నాయి. ఈ సత్యం బ్రహ్మ గురించిన సత్యాన్ని జీర్ణించుకోవడం అంత తేలిక కాదు; ముఖ్యంగా సగుణభక్తిలో రమించే వారికి, భగవంతుణ్ణి ఆర్తత్రాణపరాయణుడుగా భావించి కొలిచేవారికి, పిలవగానే వచ్చి, కోరికలు తీర్చాలని తపించే వారికి, ఇది ఒక అశనిపాతంలాగా ఉంటుంది. వారు బాధపడతారని సత్యాన్ని చెప్పకుండా వదిలేయరు కదా. ఎవరో ఒకరు వారికి సత్యాన్ని చెప్పాలి. అందువలన రమణమహర్షి ఆ సత్యాన్ని చెప్పడానికి ముందుకు వస్తున్నారు. సత్యం చెప్పడంవల్ల ఆయన కొత్తగా నష్టపోయేదేమీ లేదు. అందువల్ల సత్యాన్ని ఉన్నది ఉన్నట్టుగా, దాన్ని కలుషితం చేయకుండా చెబుతున్నారు.

ఏమిటా సత్యం? చూసే మీకు భిన్నంగా సత్యబ్రహ్మ లేదు. కాకపోతే ఈ భావన వేరే పద్ధతిలో చెబుతున్నారు రమణమహర్షి. ఏమిటా పద్ధతి? ఉపనిషత్తులలో బ్రహ్మను తెలుసుకోవాలనుకుంటే బ్రహ్మ కొత్త విషయం కాదు, ముందు ఈ విషయం అర్థం చేసుకోవాలి అని వస్తుంది. మరైతే ఏం చేయాలి? బ్రహ్మ గురించి తెలుసుకోవాలంటే మీ గురించి మీరు తెలుసుకోవాలి.

**ఆత్మానమ్ ఈక్షేత** – మీ స్వరూపాన్ని తెలుసుకోండి అంటున్నారు రమణమహర్షి. నేను స్థూలశరీరాన్నా? ఇంద్రియాలనా? నేను మనస్సునా? వీటికి భిన్నంగా ఉన్నానా? వీటికి భిన్నంగా ఉంటే ఆ భిన్నంగా ఉన్న నేను ఎవరు? ఆ నేనుయొక్క స్వరూపం ఏమిటి? ఆత్మానం ఈక్షేత అంటే ఈ విధంగా ఆత్మవిచారణ చేయాలి. స్వరూపాన్ని తెలుసుకోవాలి.

**పరమ్ ప్రపశ్యేత్** – ఆత్మజ్ఞానం పొందితే బ్రహ్మజ్ఞానం పొందుతారు. ఆత్మజ్ఞానం పొందితే చాలు, పరమాత్మజ్ఞానాన్ని విడిగా పొందనవసరం లేదు.

ఎవరైనా నాకు ఆత్మజ్ఞానం కలిగింది, ఇంక ఈశ్వరజ్ఞానం పొందడమే మిగిలింది అంటే వారికి ఆత్మజ్ఞానం సరిగ్గా కలగలేదని అర్థం. కాటుక అంటే ఏమిటో నాకు తెలీదా? అది పసుపులాగా తెల్లగా ఉంటుంది అన్నట్టు ఉంటుంది. అలా అనే వారికి మూడు రంగులూ తెలియటం లేదు. అలాగే ఇక్కడ ఇతనికి ఆత్మస్వరూపము తెలియదు, బ్రహ్మస్వరూపము తెలియదు. రమణమహర్షి ఏమంటున్నారు? ఆత్మజ్ఞానం పొందితేనే చాలు బ్రహ్మజ్ఞానం పొందుతాము అంటున్నారు. **ఆత్మానమ్ ఈక్షేత పరం ప్రపశ్యేత్**

**ఇతి ఆగమ ఉక్తేః** – రమణమహర్షి ఇది నా సొంత సిద్ధాంతం కాదు, ఆగమశాస్త్రాలు చెప్పిన విషయమే నేను చెబుతున్నాను అని ఇక్కడ స్పష్టంగా తెలియజేస్తున్నారు. సాక్షాత్తూ రమణమహర్షే నా సిద్ధాంతం వేరే కొత్తగా లేదు, నేను బోధిస్తున్నది వేదాలను ఆధారం చేసుకుని వచ్చినదే అని చెప్పినా కానీ, కొందరు ఆత్మవిద్య కొత్తగా నేర్చుకోనవసరం లేదు– నేను ఎవరిని, నేను ఎవరిని అనుకుంటే చాలు అంటారు. పైగా భగవద్గీత, ఉపనిషత్తులు నేర్చుకోనవసరం లేదు; రమణమహర్షిని అధ్యయనం చేస్తే చాలు అంటారు. అది పెద్ద పొరపాటు. సాక్షాత్తూ రమణమహర్షి ఇది ఆగమశాస్త్రంలో చెప్పబడింది అంటున్నారు.

మామూలుగా ఆగమశాస్త్రాలు వేరు, అవి వేదాలు కావు. శివుణ్ణి పూజించేవారికి శైవాగమం, విష్ణువును పూజించేవారికి వైష్ణవ ఆగమం, శక్తిని పూజించేవారికి శాక్త ఆగమం ఉన్నాయి. అవి వేరు, వేదాలు వేరు. ఇక్కడ సందర్భాన్నిబట్టి ఆగమశాస్త్రంలో చెప్పబడింది అంటే వేదంలో లేదా ఉపనిషత్తులలో చెప్పబడింది అని అర్థం. అందువల్ల వేద ఆగమ ఉక్తేః అని అర్థం.

**సులభం కాదు**– కానీ దీన్ని అందరూ చాలా తేలికగా అర్థం చేసుకోలేరు. ఈ వాక్యాన్ని సరిగ్గా అర్థం చేసుకోలేరు. ఏ వాక్యాన్ని? మొదటిపాదంలోని వాక్యాన్ని.

ఆత్మానమీక్షేత పరం ప్రపశ్యేత్. ఆత్మజ్ఞానం పొందితే బ్రహ్మజ్ఞానం పొందినట్టే అనే వాక్యాన్ని అర్థం చేసుకోలేకపోతున్నారు. నిన్ను నువ్వు అర్థం చేసుకుంటే భగవంతుణ్ణి అర్థం చేసుకుంటావు అంటే ఏమిటి అర్థం? నువ్వే భగవంతుడివి అని అర్థం.

**ఆత్మజ్ఞానం = బ్రహ్మజ్ఞానం**

ఈ ఈక్వేషన్ కి రెండు వైపులా సమంగా ఉన్న పదాలు ఏమిటి? జ్ఞానం. దాన్ని తీసివేస్తే ఆత్మ = బ్రహ్మ.

కాని చాలామంది దీన్ని అర్థం చేసుకోలేకపోతున్నారు అంటున్నారు రమణమహర్షి. ఇది మహావాక్యం. వేదాలలో ఈ మహావాక్యం చెప్పబడింది అంటే చాలు. ఎక్కడ చెప్పబడింది అంటారు కొంతమంది. మరి కొందరు శాస్త్రం వారికి కొట్టినపిండి అయినట్టు, వారు ఏదో

చెప్పేసి, అది శాస్త్రంలో ఉందనేస్తారు. ఎక్కడ చెప్పబడింది అంటే వారి దగ్గర సమాధానం ఉండదు.

ఈమధ్య ఒక పేరాలో గీతాసారం అని వాట్సాప్‌లో వైరల్ అవుతున్నది. అది ఇంగ్లీషులో ఏ4 సైజు పేపరులో భగవద్గీతలోని సారంగా ఉంది. అనేక భాషల్లో కూడా తర్జుమా అయింది, మీరు చూసే ఉంటారు, చూడకపోతే మీరు అదృష్టవంతులు. నూతన సంవత్సరానికి ఈ సారాన్ని వేల సంఖ్యలో అచ్చు వేయించి పంచుతున్నారు కూడా. ఎవరు రాసారో గాని అద్భుతంగా ఉంది, కాదనటం లేదు. అది జనాన్ని విపరీతంగా ఆకర్షిస్తున్నది. కాని దురదృష్టకరమైన విషయం ఏమిటంటే అందులో ఒక్క వాక్యం కూడా భగవద్గీతలో చెప్పబడలేదు. అయినా చాలా ఖ్యాతి పొందింది.

ఆ విధంగా కొంతమంది వారికి తోచిందేదో చెప్పేసి, ఇది శాస్త్రంలో ఉంది అంటారు. బృహదారణ్యకోపనిషత్తుమీద జోకు ఉండనే ఉంది. మీరు ఏదైనా కొటేషన్ చెప్పి అది బృహదారణ్యకోపనిషత్తులో ఉంది అంటే అది పెద్ద ఉపనిషత్తు కాబట్టి ఎవరూ వెరిఫై చేయరు. కానీ ఇక్కడ రమణమహర్షి వేదంలో చెప్పబడింది అంటే నిజంగానే చెప్పబడింది.

ముండక ఉపనిషత్తులో సారం ఉంది,

**హిరణ్మయే పరే కోశే విరజం బ్రహ్మ నిష్కలమ్ ।**

**తచ్ఛుభ్రం జ్యోతిషాం జ్యోతిస్తద్యదాత్మవిదో విదుః ॥** –ముండకోపనిషత్ 2.2.10

బంగారు రంగులో మెరిసే ఆత్మ విజ్ఞానమయకోశంలో ఉంది. అది విరజం, నిష్కలం, సిద్ధం, జ్యోతిషాం జ్యోతి. ఎవరు ఆత్మను అధిష్ఠానజ్యోతిగా తెలుసుకుంటారో వారు బ్రహ్మను కూడా తెలుసుకున్నట్టు అంటుంది ఈ మంత్రం.

ఇక్కడ మనకు కావాల్సింది ఆత్మవిదో విదుః – ఎవరు ఆత్మను తెలుసుకుంటారో బ్రహ్మను కూడా తెలుసుకున్నట్టు.

ఆత్మను తెలుసుకుంటే బ్రహ్మను తెలుసుకున్నట్టే. సరే నాకు ఇది బాగా అర్థమైంది, ఇంతవరకు దైవదర్శనం కోరాను. ఇప్పుడు మహావాక్యం ద్వారా ఆత్మదర్శనం చేస్తే దైవదర్శనం చేసినట్టే అని అర్థమైంది. ఇప్పుడు ఆత్మదర్శనం చేసుకోవడం ఎలా?

నన్ను నేను ఎలా తెలుసుకోవాలి?

**ఆత్మైవ న దృశ్యో** – ఆత్మను చూడలేవు అంటున్నారు రమణ మహర్షి.

ఆత్మ తనను తాను చూడలేదు అంటే మహావాక్యం ప్రకారం బ్రహ్మను కూడా చూడలేమని అర్థం. బ్రహ్మ ఏవ న దృశ్యః అని చెప్పవచ్చు. అందువల్ల భగవత్ దర్శనం కోరటం ఆత్మదర్శనం కోరటం కూడా అర్థంలేని పనే.

ఆత్మ = బ్రహ్మ అయితే ఆత్మను చూడలేము అంటే బ్రహ్మను చూడలేము అని చెప్పకనే చెప్పినట్టు అవుతుంది. కానీ ఇదంతా తేలికగా అర్థం కాదు చాలా మందికి. అందుకని వారు జ్ఞానిని, ఓ జ్ఞాని నువ్వు బ్రహ్మను చూసావా? భగవంతుడుని చూసావా? అని అడుగుతారు. ఇది ఓ పెద్ద సమస్య. చూశానన్నా సమస్యే, చూడలేదన్నా సమస్యే. ఒకవేళ జ్ఞాని నేను భగవంతుణ్ణి చూడలేదు అని అంటే, నువ్వు ఇన్ని సంవత్సరాలుగా అధ్యయనం చేస్తున్నావు, అయినా నువ్వు చూడలేదంటే, వేదాంతం అధ్యయనం చేయని మాకు, నీకు మధ్య భేదం ఏముంది అని నిలదీస్తారు.

ఇన్నాళ్లు చేసిన వేదాంత అధ్యయనం వృథా అంటారు. చూశాను అంటే అక్కడినుంచి ప్రశ్నల పరంపర గుప్పిస్తారు. భగవంతుడు ఎలా ఉంటాడు? పొడుగుగా ఉంటాడా? ఐదు అడుగులా? ఆరడుగులా? ఏ రంగులో ఉంటాడు? నీలమేఘశ్యాముడా? రక్తవర్ణమా? జ్ఞానికి భగవంతుడు ఏకరూప ఈశ్వరుడు కాదు, అరూప ఈశ్వరుడు. అందువల్ల జ్ఞాని జవాబు చెప్పలేడు. నన్ను కూడా ఈ ప్రశ్న అడక్కండి, నన్ను దయచేసి వదిలేయండి అంటున్నారు స్వామీజీ.

**న దృశ్యః** – ఆత్మ చూడబడదు అంటే ఆత్మను ఆబ్జెక్ట్‌గా చూడలేకపోతే భగవంతుణ్ణి ఆబ్జెక్టుగా ఎలా చూడగలము?

ఈశ్వరుని గురించి ఇంక చెప్పేదేముంది అంటున్నారు రమణమహర్షి. అంటే ఈశ్వరుణ్ణి కూడా ఆబ్జెక్ట్‌గా చూడలేమని అర్థం.

కాకపోతే ఇక్కడ సరిగ్గా అర్థం చేసుకోవాలి. ఈశ్వరుడు అంటే ఏ ఈశ్వరుడు? ప్రాతిభాసిక సత్య ఈశ్వరుడా? వ్యావహారిక సత్య ఈశ్వరుడా? పారమార్థిక సత్య ఈశ్వరుడా – ఎవరైనా నాకు పారమార్థిక ఈశ్వరుడు అవసరం లేదు, నాకు వ్యావహారిక సత్య ఈశ్వరుని దర్శనం కావాలంటే నిక్షేపంగా ఆబ్జెక్ట్‌గా చూడవచ్చు అంటుంది శాస్త్రం. దానికి తీవ్రమైన తపస్సు చేయాలంటుంది.

వేదాల్లోని ఉపాసన కాండంలో దేవి సాక్షాత్కారం, విష్ణు సాక్షాత్కారం – వీరిలో ఎవరి దర్శనం కావాలన్నా కూడా దానికి తగ్గ ఉపాసనలు ఉన్నాయి శాస్త్రంలో. చెప్పింది చెప్పినట్టుగా చేస్తే భగవత్ సాక్షాత్కారం కలుగుతుంది. కానీ దాంతోపాటు శాస్త్రం హెచ్చరిక కూడా చేస్తుంది. మీకు సాక్షాత్కారం ఇచ్చిన భగవంతుడు వ్యావహారిక ఈశ్వరుడు. అందువల్ల మోక్షాన్ని ఇవ్వలేడు.

చాలామంది భగవత్ సాక్షాత్కారంకోసం తీవ్రమైన తపస్సు చేసి, ఏవేవో వరాలు కోరుతారు. అంటే సాక్షాత్కారం పొందడంవల్ల వారు మోక్షం పొందలేదు. భగవంతుడు ప్రత్యక్షమైన

తర్వాత కూడా వారికి పరిచ్ఛిన్నమైన భావాలు పోలేదు. అంటే సాక్షాత్కారంవల్ల వారు మోక్షం పొందలేదు. ధృవుడు తీవ్రమైన తపస్సు చేసి భగవంతుణ్ణి రాజ్యం కోరాడు. అంటే సాక్షాత్కారం పొందడంవల్ల మోక్షం పొందలేదు. రాక్షసులు కూడా భగవత్ సాక్షాత్కారం పొందారు. కానీ వారు కోరిన కోరికలు మీకు తెలిసినవే. భస్మాసురుడు శివుడు ప్రత్యక్షమైతే, తను ఎవరి నెత్తిమీద చేయి పెడితే వారు భస్మం కావాలని కోరుకున్నాడు. శివుడు వరాన్ని ఇచ్చి అంతర్ధానం అవుతుంటే, భస్మాసురుడు శివుని నెత్తిమీదే చేయి పెట్టడానికి ప్రయత్నించిన కథ విన్నాము.

అందువల్ల వ్యావహారికస్థాయిలో ఈశ్వరసాక్షాత్కారం సాధ్యమే! కానీ అది అంతిమ సత్యం కాదు, దానివల్ల మోక్షం రాదు అంటుంది శాస్త్రం. నాకు ఇప్పుడే మోక్షం వద్దు, ముందు నేను భగవత్ దర్శనం పొందుతాను, దాని తర్వాత మోక్షానికి వస్తాను అంటే సరే మీ ఇష్టం, మీరు చేయాలనుకున్నవన్నీ చేసి రండి. కానీ ఒక్కటి మాత్రం గుర్తుంచుకోండి. మోక్షం పొందాలి అంటే మాత్రం అహం బ్రహ్మ అస్మి జ్ఞానం పొందక తప్పదు. ఎవరు అంటున్నారు ఇదంతా? రమణమహర్షి అంటున్నారు. అలా ఎందుకు అంటున్నారని రమణమహర్షిని అడిగితే, నేను అనటంలేదు, శాస్త్రమే నొక్కి వక్కాణిస్తుంది అంటారు. అందువల్ల ఆత్మదర్శనం కానప్పుడు ఈశ్వరదర్శనం గురించి వేరే చెప్పాలా?

**తదీక్షా–** ఆత్మదర్శనం కావాలంటే అహంకారాన్ని లయం చేయాలి. పరిమితిని కలుగజేసే అహంకారాన్ని లయం చేయాలి.

**తదన్నీభవనం స్వయమ్** – అహంకార లక్షణాలను ఆత్మలో లయం చేయాలి. ఉదాహరణకు **నేను లావుగా ఉన్నాను** వాక్యం చూద్దాం. అందులో నేను అంటే స్వయం ప్రకాశ చైతన్యం. ఉన్నాను అంటే నా స్వరూపమైన ఉనికి, నేను ఉన్నాను అంటే నా చిత్ అంశని సత్ అంశని సూచిస్తున్నాయి. వాటి తర్వాత గాని, మధ్యలో కానీ ఇంకా ఏ పదం కలిపినా అది అనాత్మ అయిన అహంకార లక్షణం అవుతుంది. లావు అనేది శరీరానికి సంబంధించినది.

ఈ అదనపు లక్షణం ఉంటే నేను అహంకారాన్ని అవుతాను. నేను మనిషిని అంటే నేను అశాశ్వతమైన శరీరాన్ని అని అర్థం. ఇది అహంకార లక్షణం. వేదాంతం నేర్చుకుంటే ఈ శరీరలక్షణాలు తీసుకువెళ్ళి శరీరానికి అప్ప చెప్పేస్తాం. ఇవి ఆత్మనైన నాకు అంటవు. నేను లావు కాదు, అశాశ్వతమైన శరీరాన్ని కాదని అర్థం చేసుకుంటాము. ఇలా శరీరానికి చెందిన లక్షణాన్ని తీసివేయడాన్ని భవనం అంటున్నారు రమణమహర్షి. అంటే గుణాలను మార్చడం. అన్నాన్ని ఏం చేస్తాం? తింటాం. తినడం అంటే దాన్ని మింగేయటం. నేను

లావుగా ఉన్నాను వాక్యంలో లావు పదాన్ని మింగేస్తే మిగిలేదేమిటి? నేను ఉన్నాను. నేను ఉన్నాను అని చెప్పగలిగితే అదే అన్నీభవనం.

అందువల్ల అహంకారాన్ని ఆత్మకు అన్నంగా వేయటమే ఆత్మదర్శనం. అహంకారాన్ని అన్నంగా వేయడం అంటే మళ్ళీ దాన్ని ఒక క్రియగా చూడకూడదు. బాహ్యంగా చేసే పని కాదు. అది బుద్ధిలో వచ్చే మార్పు, దృక్పథంలో కలిగే మార్పు. ఏం మార్పు చేయాలి?

అహంకారం మిథ్య అని అర్థం చేసుకోవాలి.

ఈ ఉదాహరణ ఇంతకుముందు కూడా చూసాం. కుండ యొక్క మిథ్యాత్వ దర్శనం చేయాలంటే కుండను మట్టిలో లయం చేయాలి. మట్టి లేకుండా విడిగా కుండకు ఉనికి లేదని అర్థం చేసుకుంటే చాలు. దానికోసం కుండని ముట్టుకుని చూడనవసరం లేదు. కుండను పగలగొట్టనవసరం లేదు. ఏ కర్మ కూడా బాహ్యంగా చేయనవసరం లేదు. కుండను కుండగానే చూస్తారు. కానీ మీ బుద్ధిలో కుండనే వస్తువు విడిగా లేదు, కుండగా కనిపిస్తున్న మట్టి మాత్రమే అని అర్థం చేసుకుంటారు.

అదే విధంగా అహంకారాన్ని ఆత్మలో లయం చేయడం అంటే, ప్రపంచంనుంచి పారిపోనవసరం లేదు. కళ్ళు మూసుకుని నేనెవరు, నేనెవరు అంటూ కూర్చోనవసరం లేదు, ప్రపంచంలో వ్యవహారం యథాతథంగా నడుపుతారు. కుండ మిథ్యావస్తువు అని తెలిసాక కూడా కుండని వాడుతారు. అందులో నీరు తాగుతారు. అలాగే అహంకారం మిథ్య అని తెలిసాక కూడా వ్యావహారం నడపడానికి అహంకారాన్ని వాడతారు. కానీ బుద్ధిలో మాత్రం అహంకారం మిథ్య అని అర్థం చేసుకుంటారు.

**శ్లోకం 24**

**ధియే ప్రకాశం పరమో వితీర్య**
**స్వయం ధియోఽన్తః ప్రవిభాతి గుప్తః ।**
**ధియం పరావర్త్య ధియోన్తరేఽత్ర**
**సంయోజనాన్నేశ్వరదృష్టిరన్యా ॥**

**ప్రతిపదార్థం:** పరమః = పరమాత్మ; ధియే = బుద్ధికి; ప్రకాశమ్ వితీర్య = ప్రకాశాన్ని ప్రసరింపజేయటంవల్ల; స్వయమ్ = స్వయంగా; ధియః అన్తః = బుద్ధిలో; గుప్తః ప్రవిభాతి= గుప్తంగా ప్రకాశిస్తున్నాడు; ధియం పరావర్త్య = బుద్ధిని పరావర్తనం చేయడంవల్ల; అత్ర = ఇక్కడ; ధియః అంతరే = బుద్ధిలోపలే; సంయోజనాత్ = సంయోగం చేయటంవల్ల; ఈశ్వరదృష్టి= పరమాత్మ దర్శనం; న అన్యా = ఇతర పద్ధతులవల్ల కాదు.

**తాత్పర్యం:** పరమాత్మ తన ప్రకాశాన్ని బుద్ధిలో ప్రసరింపజేయటంవల్ల తానే బుద్ధిలో గోప్యంగా ప్రకాశిస్తున్నాడు. బుద్ధిని పరావర్తనం చేయటంవల్ల (వెనుకకు లోనికి మళ్ళించటంవల్ల) సంయోగం చేయటం ద్వారా ఇక్కడ బుద్ధి లోపలే పరమాత్మ దర్శనం కలుగుతుంది. మరి ఏ ఇతర పద్ధతులవల్ల కాదు.

**వివరణ:** ఆత్మజ్ఞానం పొందడం అంటే, ఆత్మను కొత్త విషయంగా తెలుసుకోవడం కాదు. ఎందుకంటే నేను చైతన్యస్వరూపం అని నాకు ముందే తెలుసు. నేను ఎప్పుడూ చైతన్య స్వరూపాన్నే. ఆ విషయం అనుభవించడానికి నేనేమీ ప్రయత్నం చేయనవసరం లేదు. జీవితంలో దేన్ని అనుభవించాలన్నా కూడా దానికి కొంత ప్రయత్నం చేయాలి. ఒక ప్రమాణాన్ని వాడాలి.

ఉదాహరణకు, నేను గోడను చూడాలి అంటే నేను కొంత ప్రయత్నం చేయాలి. గోడ ఉన్న వైపుకి నా తలను తిప్పాలి. దాన్ని చూడ్డానికి కన్ను అనే ప్రమాణాన్ని వాడాలి. అప్పుడు గోడ చూసిన అనుభవం నాకు కలుగుతుంది. అంటే ఈ పనికి శ్రమ, కాలం, రెండు కావాలి. ఈ సృష్టి మొత్తంలో ఆత్మ ఒక్కటే చైతన్యంగా ఎప్పుడూ అనుభవంలోకి వస్తుంది. చైతన్యంవల్లనే నేను ఆ గోడలా జడం కాదు, నేను చైతన్యం ఉన్న జీవిని, నా చుట్టూ ఉన్న పరిసరాలను తెలుసుకోగలుగుతున్నాను అని చెప్పగలుగుతున్నాను.

చైతన్యం ఎప్పుడూ అనుభవంలోకి వస్తుంది కాబట్టే, చైతన్యం తెలుసుకోవడానికి శ్రమ పడనవసరం లేదు, ప్రయాణం చేయనవసరం లేదు, కాలాన్ని వెచ్చించనవసరం లేదు. కానీ ఒక విషయం తెలుసుకోవాలి. ఆత్మ నిత్యచైతన్యంగా ఎప్పుడూ అనుభవంలోకి వచ్చేదే అయినా ఈ నిత్యచైతన్యం వైపు దృష్టి మళ్ళించడానికి మనస్సు కావాలి. ఈ విషయాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. నిత్యచైతన్యమైన ఆత్మవైపు దృష్టి మరల్చాలంటే మనస్సు కావాలి. లేకపోతే మనస్సు బాహ్యముఖంగా పరుగులు తీస్తుంది. బాహ్యవస్తువుల వైపు, బాహ్యసంఘటన వైపు పరుగులు తీస్తుంది.

మీరు ఏ పని చేస్తున్నా కూడా మీరు నిత్యచైతన్యమే. కానీ అది తెలుసుకోవాలంటే దానికి మనస్సు ఉపయోగించాలి అంటుంది వేదాంతం. ఉదాహరణకు మీరు వార్తాపత్రిక చదువుతున్నప్పుడు, ఎవరైనా మీరు చైతన్య స్వరూపమా? జడమా? ఇలా అడిగితే, మీరు మీ దృష్టిని వార్తాపత్రికనుంచి మీ వైపు మరలుస్తారు. నేను చైతన్యస్వరూపాన్ని అంటారు.

నేను చైతన్యస్వరూపాన్ని అని మీరు చెప్పినప్పుడు, మీ మనస్సు మీ చైతన్యాన్ని ప్రకాశింపజేయదు. ఈ విషయం సరిగ్గా అర్థం చేసుకోవాలి. చైతన్యం స్వయంప్రకాశం,

మనస్సు దాన్ని ప్రకాశింపజేయనవసరం లేదు. మరి ఇందులో మనస్సు పాత్ర ఏమిటి? బాహ్యవస్తువుల వైపు పరుగులు మాని చైతన్యం వైపు దృష్టి మారుస్తుంది. అప్పుడు మీరు చైతన్యస్వరూపులని, శరీరానికి చైతన్యం ఉందని అర్థం చేసుకుంటారు.

అప్పుడు ఈ చైతన్య లక్షణాలను వివరించడానికి శాస్త్రం కావాలి. జడ ప్రపంచంనుంచి చైతన్యం వైపు తిప్పడానికి మనస్సు కావాలి. ఆ చైతన్యలక్షణాలు తెలుసుకోవడానికి శాస్త్రం కావాలి. చైతన్య అనుభవం పొందడానికి కాదు. ఎందుకంటే చైతన్యం నిత్యమూ అనుభవంలోకి వస్తుంది. మళ్ళీ చెబుతున్నాను వినండి, చైతన్యం అనుభవించడానికి మనస్సు అవసరం లేదు; చైతన్యాన్ని అనుభవించడానికి శాస్త్రం అవసరం లేదు.

మరి అయితే వీటి పాత్ర ఏమిటి? అనాత్మనుంచి ఆత్మవైపుకు అంటే చైతన్యం వైపుకు మళ్ళించడానికి మనస్సు కావాలి. ఒకసారి చైతన్యంవైపు దృష్టి మరల్చాక, ఎప్పుడూ అనుభవంలోకి వచ్చే చైతన్యలక్షణాలను తెలుసుకోవడానికి శాస్త్రం కావాలి. శాస్త్రం చైతన్యంయొక్క ఐదు లక్షణాలు వివరిస్తుంది. అది కూడా నిత్యము అనుభవంలోకి వచ్చే చైతన్య లక్షణాలు. అవి–

1. చైతన్యం శరీరంలో ఒక భాగం గాని, లక్షణం గాని కాదు. దానినుంచి ఉత్పత్తి చెందిన వస్తువు కానీ కాదు.
2. చైతన్యం స్వతంత్ర వస్తువు. అది శరీరం అంతటా వ్యాపించి, దాన్ని ప్రకాశింప చేస్తుంది.
3. చైతన్యం శరీరం సరిహద్దులకే పరిమితం కాలేదు.
4. చైతన్యం శరీరం నాశనం అయితే నాశనం అవ్వదు. తదనంతరం కూడా చైతన్యం ఉంటుంది.
5. చైతన్యం శరీరం లేకపోయినా ఉంటుంది కానీ కనబడదు. దాన్ని ప్రతిబింబింప చేసే మాధ్యమం లేదు కాబట్టి అది కనపడదు. అంత మాత్రాన చైతన్యం లేనట్టు కాదు.

చైతన్యం కనిపించనంత మాత్రాన చైతన్యం లేనట్టు కాదు అనే వాక్యం చాలా ముఖ్యం. ఎప్పుడూ అనుభవంలోకి వచ్చే చైతన్యం నిత్యమూ ఉంటుంది. ఈ విధంగా ఆత్మవిచారణ చేయాలి.

పరమ అంటే పరమాత్మ ఎవరో కాదు, ఆత్మ. నిత్య చైతన్యం.

**వితీర్య** – ఈ చైతన్యం ఏం చేస్తుంది? వితీర్య అర్థం అక్షరాలాచూస్తే పంచుతుంది. ప్రసాద వితరణ అంటే ప్రసాదాన్ని పంచటం. ఇక్కడ ఆత్మ లేదా చైతన్యం కూడా పంచుతుంది. ఏం పంచుతుంది?

**ప్రకాశం** – ప్రకాశాన్ని పంచుతుంది అంటే చిదాభాసను పంచుతుంది. చిదాభాసను దేనికి పంచుతుంది?

**ధియే** – మనస్సుకు పంచుతుంది.

ఇది అర్థం కావాలంటే అద్దం ఉదాహరణ చూద్దాం. అద్దం స్వతహాగా జడం. దానికి విడిగా కాంతి లేదు. కానీ అద్దాన్ని సూర్యకాంతి ముందు పెడితే అద్దంమీద ప్రతిబింబ సూర్యకాంతి పడుతుంది. ప్రతిబింబ సూర్యకాంతి దేనివల్ల ఏర్పడింది? బింబ సూర్యకాంతివల్ల ఏర్పడింది. ఎప్పుడైతే అద్దంమీద ప్రతిబింబ సూర్యకాంతి ఏర్పడిందో, అప్పుడే జడమైన అద్దం ప్రకాశవంతంగా, కాంతివంతంగా మారుతుంది. అది దాని స్వరూపం కాదు, అరువు తెచ్చుకున్న కాంతి. ఇప్పుడు మూడు అంశాలు చూసాం. అవి బింబసూర్యకాంతి, ప్రతిబింబసూర్యకాంతి, అద్దం. ప్రతిబింబించింది కాబట్టి దాన్ని ప్రతిబింబ మాధ్యమం అంటాం.

ఇప్పుడు ఈ మూడు పదాలను చైతన్యపరంగా చూద్దాం. అద్దానికి స్వతహాగా కాంతి లేకపోయినా ప్రతిబింబింప జేసే మాధ్యమంగా పనిచేసినట్టుగా, మనస్సు స్వతహాగా జడమైనా కూడా అది ప్రతిబింబ మాధ్యమంగా పనిచేస్తుంది. అది బింబచైతన్యాన్ని ప్రతిబింబింప చేస్తుంది. అలా ఏర్పడిన చైతన్యాన్ని ప్రతిబింబ చైతన్యం అని అంటారు. చిదాభాస అని అంటారు. వీటికి పేర్లు చూద్దాం.

| | | |
|---|---|---|
| బింబ చైతన్యం | – Original Consciousness | – OC |
| ప్రతిబింబ మాధ్యమం | – Reflecting Medium | – RM |
| ప్రతిబింబ చైతన్యం | – Reflected Consciousness | – RC |

ఈ శ్లోకంలో పదాలు చూస్తే పరమ అంటే చిత్, వితీర్య అంటే చిదాభాసను ఇస్తుంది. ధియే అంటే మనస్సుకు. మనస్సును ప్రతిబింబమాధ్యమం అంటారని చూశాం. చిత్ ప్రకాశాన్ని పంచాక ఎక్కడికి వెళ్తుంది? మనం మామూలుగా ప్రసాద వితరణ చేశాక అక్కడినుంచి వెళ్ళిపోతాము. చిదాభాస ఇచ్చాక, చైతన్యం ఎక్కడికి వెళుతుంది? పాపం ఆత్మ ఎక్కడికీ వెళ్ళలేదు. ఎందుకు? చాలా ముఖ్యమైన ప్రశ్న ఇది. ఆత్మ ఎందుకు ఎక్కడికీ వెళ్ళలేదు? ఎందుకంటే ఆత్మ సర్వవ్యాపకం కాబట్టి. అంతటా ఉన్న ఆత్మ ఎక్కడికి వెళుతుంది? అంటే ఎక్కడకీ వెళ్ళలేదు.

**స్వయం గుప్తః** – మనస్సులో దాగి ఉన్నట్టుగా ఉంటుంది.

చిత్ కూడా ఉంటుంది. ఎక్కడ?

**ధియో అంతః** – మనసులోని చిదాభాసలోనే,

**ప్రవిభాతి** – ఉంటుంది. చిత్ ప్రకాశవంతంగా ఉంటుందా? ఉండదా? ప్రతిబింబ సూర్యకాంతే కాంతివంతంగా ఉండగా లేనిది బింబచైతన్యం ఇంకా ఎంత కాంతివంతంగా ఉండాలి? అదేవిధంగా చైతన్యం కాంతివంతంగా ఉంటుంది. ఈ బింబచైతన్యాన్ని తెలుసుకోవడం ఎలా? చాలా తేలిక అంటున్నారు రమణమహర్షి.

**శ్లోకం 25**

**న వక్తి దేహోஉహమితి ప్రసుప్తౌ**
**న కోஉపి నాభూవమితి ప్రవక్తి ।**
**యత్రోదితే సర్వముదేతి తస్య**
**ధియాஉహమః శోధయ జన్మదేశమ్ ॥**

**ప్రతిపదార్థం:** దేహః = శరీరం; అహం = నేను; ఇతి = అని; న వక్తి = చెప్పదు; ప్రసుప్తౌ= గాఢనిద్రలో; నాభూవమ్ = నేను లేను; ఇతి = అని; కః అపి = ఎప్పుడూ; న ప్రవక్తి = చెప్పరు; యత్ర = ఏ అహంభావం; ఉదితే సతి = ఉద్భవించగా; సర్వం = సమస్తం; ఉదేతి= ఉద్భవిస్తోందో; మనస = ఇంద్రియ గోచరమౌతోందో; తస్య = అటువంటి; అహమః = అహంభావముయొక్క; జన్మదేశమ్ = ఉత్పత్తి స్థానాన్ని; ధియా= సూక్ష్మబుద్ధితో; శోధయ = అన్వేషించు.

**తాత్పర్యం:** దేహం నేను అని ఎప్పుడూ అనదు, గాఢనిద్రలో నేను లేను అని ఎవ్వరూ అనరు. అహంభావం ఉదయించగానే సమస్తం ఉద్భవిస్తోంది, ఇంద్రియ గోచరమౌతోంది. అటువంటి అహంభావం పుట్టే చోటును సూక్ష్మబుద్ధితో అన్వేషించు.

**వివరణ:** ఈ శ్లోకాల్లో రమణమహర్షి అహం స్వరూపం లోతులు కొలుస్తున్నారు. నిజానికి అహమని మనం అనుకుంటున్నది అసలు నేను కాదు. అది పొరపాటు. అజ్ఞానంనుంచి పుట్టిన పొరపాటు. అందువల్ల అహం అనేది సరైన జ్ఞానం కాదు. ఒకదానికొకటి తీసుకుంటున్నాం. ఎప్పుడైతే దాని లోతులు కొలుస్తామో, అప్పుడే అహం మటుమాయం అయిపోతుంది. ఎందుకంటే ఏ పొరపాటైనా కూడా దాన్ని లోతులు విచారిస్తే మాయం అయిపోతుంది. రమణమహర్షి ఇప్పుడు మనకు అర్థంకాని, మనని అయోమయంలో పడవేసిన అహంకార స్వరూపాన్ని విశ్లేషించబోతున్నారు. అందువల్ల ఇక్కడ విషయవస్తువు మారబోతున్నది. ముందు శ్లోకంలో ఆత్మస్వరూపాన్ని చర్చిస్తే, ఇక్కడ అహంకార స్వరూపాన్ని, పొరపాటు స్వరూపాన్ని చర్చించబోతున్నారు.

ఇక్కడ రమణమహర్షి నేను అని చెబుతున్నది ఎవరు అని ప్రశ్నిస్తున్నారు. నేను అని చెప్పే ఈ నేను ఎవరు? ఈ ప్రశ్న వేస్తే శరీరం నేను అని చెప్పలేదు, ఆత్మ కూడా నేను అని చెప్పలేదు అంటున్నారు. శరీరం అనాత్మలోకి వస్తుంది.

అనాత్మ నేను అని చెప్పలేదు, ఆత్మ నేను అని చెప్పలేదు. కానీ ప్రపంచంలో ఉన్నవి ఈ రెండే వస్తువులు. అవి జడమైన అనాత్మ, చేతనమైన ఆత్మ. జడమైన అనాత్మంటే శరీరం నేను ఉన్నాను అని చెప్పలేదు. ఎందుకంటే జడం మాట్లాడలేదు. జడం మాట్లాడగలిగితే,

స్వామీజీ పుస్తకాలు పెట్టుకునే బల్ల క్లాసు మధ్యలో మాట్లాడటం మొదలుపెట్టే ప్రమాదం ఉంది. లేకపోతే ఒకచోట కుదురుగా ఉండక, నడవడం మొదలు పెడుతుంది. అదృష్టం బాగుంది, అలా జరగదు.

మరి అయితే ఆత్మ మాట్లాడుతుందా? ఆత్మ కూడా నేను ఉన్నానని చెప్పలేదు. దానికి ఎన్నో కారణాలు చెప్పవచ్చు. ఆత్మకు నోరు లేదు చెప్పడానికి, పైగా నేను ఉన్నాను అని చెబితే అది కర్మలోకి వస్తుంది. ఏ కర్మ అయినా కూడా మార్పుకు లోనవుతుంది. దాన్ని వికారం అంటారు. ఆత్మ నిర్వికారం. కర్మ చలనత్వాన్ని కూడా సూచిస్తుంది. ఆత్మ సర్వవ్యాపకం కాబట్టి, ఆత్మకు చలనం లేదు. నేను ఉన్నాను అని నోరు చెప్పినా, మనస్సు చెప్పినా అది కర్మ కిందకు వస్తుంది. మాట కూడా కర్మే. కానీ ఆత్మ అకర్త.

శుద్ధ ఆత్మ నేను ఉన్నాను అని చెప్పలేదు, **నిర్వికారత్వాత్**. శుద్ధ అనాత్మ నేను ఉన్నాను అని చెప్పలేదు, **జడత్వాత్**. ఆత్మ చెప్పలేక, అనాత్మ చెప్పలేకపోతే నేను అని చెప్పేది ఎవరు? అది ఈ ఆత్మ, అనాత్మకు భిన్నంగా ఉన్న మూడో అంశం ఏదో ఉండాలి. కానీ దురదృష్టవశాత్తు ఆత్మ–అనాత్మలకు భిన్నంగా మూడో అంశం వేరే ఏదీ లేదు.

మరైతే నేను ఉన్నాను అని కొరుకుడు పడని మూడో అంశం ఏమిటి? దీన్ని విశ్లేషణ చేస్తే ఈ కొరుకుడు పడని మూడో అంశం ఆత్మానాత్మల మేలుకలయిక అని అర్థమవుతుంది. కొన్ని లక్షణాలు అనాత్మలోనివి, కొన్ని లక్షణాలు ఆత్మలోనివి కలగలిసిన అంశం ఇది. ఈ మేలు కలయికని అహంకారం అంటారు.

ఈ అహంకారం ఏమిటి అని విచారణ చేస్తే, అహంకారం అనేది విడిగా లేదని అర్థం అవుతుంది. ఉదాహరణకు ఫ్రూట్‌సలాడ్ విషయమే తీసుకోండి. ఒక వ్యక్తి ఈ ఫ్రూట్‌సలాడ్ దేనితో చేయబడిందో చూడాలని ఉందని, దాని పరిశీలించడం మొదలుపెట్టాడు. అందులోంచి మామిడిపండు ముక్కలు తీసి ఇది సలాడ్ కాదని తీసివేశాడు; ఆపిల్ ముక్కలు తీసి ఇది సలాడ్ కాదని తీసివేశాడు; అలా ఒక్కొక్క పండు ముక్కనూ తీసేస్తూ వచ్చేసరికి, కప్పు ఖాళీ అయిపోయింది. ఫ్రూట్‌సలాడ్ అనే వస్తువు ఏమీ కనబడలేదు.

మామిడిపండు అంటే ఒక వస్తువు ఉంది; ఆపిల్ అంటే ఒక వస్తువు ఉంది; దానిమ్మ అంటే ఒక వస్తువు ఉంది; కానీ సలాడ్ అంటే దాన్ని చూపించే వస్తువు లేదు. అంటే అక్కడ పదమే ఉంది గాని పదార్థం లేదు. అలాగే అహంకారం అంటే ఏమిటి అని సలాడ్‌లా విశ్లేషించుకుంటూ వెళితే, అక్కడ కూడా అహంకారం అనే పదమే ఉంటుంది, కానీ పదార్థం ఉండదు. ఆ భావనే ఈ శ్లోకంలో చెప్పదలుచుకున్నారు రమణమహర్షి. ఇప్పుడు ఈ నేపథ్యంతో ఈ శ్లోకాన్ని చూద్దాం.

**దేహః అహమ్ ఇతి న ప్రవక్తి** – శరీరం ఎన్నడూ 'అహం' అంటే నేను అని చెప్పదు, చెప్పలేదు కూడా. ఎందుకంటే అది జడం. దానిలో చైతన్యం లేదు. ఒకవేళ శరీరానికి స్వతహాగా చైతన్యం ఉంటే ఏమవుతుందో తెలుసా? అప్పుడు శరీరానికి మరణం ఉండదు. అది నిత్యం, శాశ్వతం అవుతుంది. నేను మరణించాను అని ఎన్నటికీ చెప్పలేదు.

దీన్నిబట్టి మనకు ఒక విషయం స్పష్టంగా తెలుస్తున్నది. 'నేను' అనే శరీరం చెప్పడం లేదు, శరీరం ద్వారా వేరే ఎవరో చెప్తున్నారు. శరీరం జడం కాబట్టి చెప్పలేదు. మరి అయితే ఎవరు చెబుతున్నారు?

**ప్రసుప్తౌ న అభూవమ్ ఇతి కః అపి న ప్రవక్తి** – ఎవరు కూడా నేను లేను అని చెప్పరు. ఎందుకు? ఎందుకంటే అందరికీ స్పష్టంగా తెలుసు, గాఢనిద్రలో కూడా వారు ఉన్నారని. అంటే మూడు అవస్థల్లోనూ తాము ఉన్నారని అందరికీ తెలుసు. ఒకవేళ గాఢనిద్ర పోయినప్పుడు వారు మళ్ళీ లేవరు అనేటట్టయితే ఎవరూ కూడా నిద్రపోరు. కళ్ళలో కారం కొట్టుకునైనా మేలుకొనే ఉంటారు. మళ్ళీ లేవరు అంటే ఎవరు మాత్రం నిద్రపోతారు?

దీన్నిబట్టి అర్థమైంది ఏమిటి? ఆత్మనైన నేను మూడవస్థల్లోనూ ఉన్నాను. జాగ్రదావస్థలో ఉన్నాను, స్వప్నావస్థలో ఉన్నాను, సుషుప్తి అవస్థలో ఉన్నాను.

**న అభూవమ్** – నేను గాఢనిద్రలో లేను. ఎవరంటారిలా?

**కోఽపి న ప్రవక్తి** – ఎవరూ కూడా అనరు. ఈ రెండు వాక్యాలు కలిపితే నేను గాఢనిద్రలో లేను అని, ఎవరూ కూడా అనరు. అంటే దీని అర్థం అసలు నేను మూడు అవస్థల్లోనూ ఉన్నాను. ఆత్మ అయిన నేను మూడు అవస్థల్లోనూ ఉన్నాను. అలా అయితే ఆత్మ చెబుతుందా నేను ఉన్నానని? ఆత్మ కూడా చెప్పదు, చెప్పలేదు కూడా. అది ఎలా నిరూపించగలరు?

ఆత్మగా చెప్పగలిగేటట్టు అయితే, ఆత్మ నేను సుషుప్తిలో ఉన్నాను; మనస్సు, ఇంద్రియాలు సుషుప్తిలో పడుకుంటాయి, నేను అవస్థాత్రయ సాక్షిచైతన్యాన్ని, నేను ఇవి పడుకున్నాయని నీకు తెలియజేస్తున్నాను అని చెప్పి ఉండేది, కాని అది చెప్పలేదు.

అందువల్ల మనకు తెలిసింది ఏమిటి? నేను ఉన్నాను అని శరీరం చెప్పదు, నేను ఉన్నాను అని ఆత్మ కూడా చెప్పదు. అంటే ఈ శరీరానికి, ఆత్మకు కూడా భిన్నంగా ఉన్నది ఇంకొకటుంది; అది చెబుతున్నది అన్నమాట. దాని పేరు అహంకారం. ఈ అహంకారం కూడా సుషుప్తిలో పడుకుని, తర్వాత లేచాక, నేను గాఢనిద్ర పోయాను, నాకేమీ తెలియదు అంటుంది. ఈ అహంకారం ఏమిటి? అది శరీరం కాదు, ఆత్మ కాదు.

**యత్ర ఉదితే** – అహంకారం నిద్రలేస్తే. యత్ర అంటే ఇక్కడ అహంకారం; ఉదితే అంటే నిద్రలేస్తే; అహంకారం నిద్రలేస్తే, **సర్వమ్ ఉదేతి** – అన్ని కూడా నిద్ర లేస్తాయి అంటే అహంకారం నిద్రలేవగానే అన్ని వ్యవహారాలు, పరిమితులు, బెంగలు, ఆందోళనలు, హెచ్చుతగ్గులు, ఈర్ష్యాద్వేషాలు ఒకటేమిటి అన్నీ దూసుకు వస్తాయి. ఒక్క ముక్కలో చెప్పాలంటే సంసారం దూసుకు వస్తుంది. అందువల్ల మనం ఈ అద్భుతమైన నేను ఎవరో శోధించాలి. ఈ అహంకారం ఎక్కడినుంచి వచ్చిందో తెలుసుకోవాల్సిన గురుతరమైన బాధ్యత మనమీద ఉంది.

**తస్య అహమః జన్మదేశం శోధయ** – శోధయ అంటే శోధించాలి. అంటే విశ్లేషించాలి, విచారణ చేయాలి, పరిశోధన చేయాలి. జన్మదేశం – జన్మించిన ప్రదేశం ఏమిటో తెలుసుకోవాలి. ఏదీ నీ జన్మ ప్రదేశం? అహమః – ఈ అహంకారంయొక్క, ఇప్పుడు ఇవన్నీ కలిపితే – ఈ అహంకారం ఎక్కడ పుట్టిందో విచారణ చేయాలి. ఎలా చేయాలి?

**ధియా** – బుద్ధితో. ఈ ధియా పదం చాలా ముఖ్యం. విచారణ బుద్ధితో చేయాలి. అది తెలిస్తే చాలా పొరపాటు అవగాహనలు మటుమాయం అయిపోతాయి.

ఒక పెద్ద పొరపాటు– బుద్ధివల్ల ఆత్మజ్ఞానాన్ని పొందలేము, అందువల్ల బుద్ధికి అతీతంగా ఎదగాలి అనుకోవడం. అందువల్ల సమాధిలో కూర్చుని, చిత్తనిరోధం చేయాలి అంటారు. అంటే ఆలోచనలను పారద్రోలి, మనస్సును శూన్యం చేస్తే, ఆ శూన్యంలో ఆత్మజ్ఞానం ఒక మెరుపులా మెరుస్తుంది అనుకుంటారు కొందరు. ఇది చాలా పెద్ద పొరపాటు. కానీ చాలామందిలో ఈ అపోహ బాగా పాతుకుపోయి ఉంటుంది. అందువల్ల వీరు వేదాంతాన్ని తీవ్రంగా విమర్శిస్తారు. వేదాంతం బోధించడంలో అర్థం లేదు అనేస్తారు. వేదాంతం నేర్చుకోవడం అంటే మెదడుకు మేత, కానీ ఆత్మను బుద్ధి ద్వారా తెలుసుకోలేము అనేటట్టయితే, పనిగట్టుకుని వేదాంతం నేర్చుకోవడం ఎందుకు అంటారు వారు.

ఇక్కడ ధియా పదం వేయడం ద్వారా రమణమహర్షి చాలా స్పష్టంగా తెలియచేస్తున్నారు. ఏమని? ఆత్మజ్ఞానాన్ని బుద్ధివల్లనే తెలుసుకోగలం. సమాధిలో కూర్చుంటే ఆత్మజ్ఞానం దానంతట అది వచ్చేయదు. మనస్సును శూన్యం చేస్తే జ్ఞానం రాదు. మహా అయితే తాత్కాలికంగా మనస్సు ప్రశాంతంగా అవుతుంది. ఇంకా మాట్లాడితే మీ మనస్సు ప్రశాంతంగా అయినా కాకపోయినా, కాసేపు మీ అరుపులు, కేకలులేకుండా ఉండటంవల్ల, తక్కిన వారికి మనశ్శాంతి కలుగుతుంది. అంతేతప్ప జ్ఞానం మాత్రం కలగదు. మనస్సును అణగదొక్కవద్దు లేదా తోసిపుచ్చవద్దు. మనస్సు ద్వారానే ఆత్మజ్ఞానాన్ని పొందాలని అంత స్పష్టంగా చెప్పారు రమణమహర్షి.

మరి అయితే మనస్సు ఆత్మను తెలుసుకోలేదని ఎందుకంటారు? దీనికి జవాబు ముందే చూసాం మనం. ఏమిటది? ఆత్మ అనుభవం పొందడానికి బుద్ధి అవసరం లేదు. ఎందుకంటే అది ఎప్పుడూ అనుభవంలోకి వస్తుంది కాబట్టి, కాని ఆత్మ గురించి మనకు ఉన్న అపోహలను తొలగించడానికి బుద్ధి కావాలి, గురువు కావాలి, శాస్త్రం కావాలి. గురువు ద్వారా శాస్త్రాన్ని, బుద్ధిని ఉపయోగించి నేర్చుకుంటే ఆత్మ గురించిన సమ్యక్ జ్ఞానం కలుగుతుంది.

**ఎవర్ ది ఎక్స్‌పీరియన్సర్ నెవ్వర్ ది ఎక్స్‌పీరియన్స్‌డ్**
**అనుభవించే నువ్వే అది ఎప్పటికీ అనుభవించబడే వస్తువు కాదు ఎన్నటికీ**
అంటుంది శాస్త్రం

శరీరానికి మరణం ఉంది కానీ ఆత్మనైన నాకు లేదు. మనస్సుకు భావోద్రేకాలు ఉన్నాయి కానీ ఆత్మనైన నాకు లేవు. ప్రతి అనుభవం ద్వారా తెలియబడే ఆత్మనైన నాకు పరిమితులు లేవు. నేను దేశకాల అతీతం, నేను శాశ్వతం, నేను అసంగం. ఇవన్నీ తెలుసుకోవాలంటే ధియా, మనస్సును, ఇంకా స్పష్టంగా చెప్పాలంటే బుద్ధిని ఉపయోగించాలి.

అందువల్లనే మనం పదేపదే చెబుతాము. ఆత్మజ్ఞానం శ్రవణంవల్లనే కలుగుతుంది; అది కూడా గురు ఉపదేశంవల్లనే కలుగుతుంది. అంటే తాజాగా జ్ఞానం పొందాలంటే బుద్ధి ఉండాలి, శాస్త్రం ఉండాలి, గురువు ఉండాలి, గురుశాస్త్ర ఉపదేశాన్ని బుద్ధి, బుద్ధిగా అందుకోగలదు.

అదే ధ్యానంలో కూర్చుంటే ఇంద్రియాలను ఉపయోగించరు, మనస్సును ఉపయోగించరు. ఉత్తప్పుడే మనస్సు పని చేస్తుందో లేదో తెలియదు. అలాంటిది ధ్యానంలో ఆలోచనలను పారద్రోలి మనస్సును శూన్యం చేస్తారు. మనస్సు, ఇంద్రియాలు ఇవేవీ లేకపోతే జ్ఞానం ఎలా కలుగుతుంది? జ్ఞానం కలగాలంటే శాస్త్ర అధ్యయనం చేయాలి. అది కూడా సజీవమైన గురువు ద్వారా, అది కూడా బుద్ధిని ఉపయోగించి. జ్ఞానం పొందాక, నేను ఎప్పుడూ అనుభవంలోకి వచ్చే ఆత్మచైతన్యాన్ని, నాకు పరిమితులు లేవు అని చెప్పగలగాలి.

అందువల్ల ధియా అని అన్నచోట మనం గురుశాస్త్ర ఉపదేశేన అని కలుపుకోవాలి. అప్పుడే మనం గురుశిష్య పరంపర ద్వారా నేర్చుకున్న సాంప్రదాయంలోకి వస్తాము. కొంతమంది నేను బుద్ధిని ఉపయోగిస్తాను, కానీ గురువు దగ్గరకు వెళ్ళను, శాస్త్రాన్ని నేర్చుకోను అంటారు. అది వేరే సిద్ధాంతంలోకి వస్తుంది. అటువంటి సిద్ధాంతం చాలా ప్రమాదకరం. జ్ఞానం అనేది ఒక్క మనిషినుంచి వచ్చేది కాదు. కేవలం శంకరాచార్యులవారు లేదా కేవలం వ్యాసాచార్యులవారు చెప్పినది కాదు. ఈ జ్ఞానం ఏ ఒక్క గురువు కనిపెట్టినది కాదు. ఇది

సాక్షాత్తూ పరమాత్మనుంచి గురుపరంపరగా గురుశాస్త్ర ఉపదేశం ద్వారా వస్తున్న జ్ఞానం. అందువల్ల ఇటువంటి సిద్ధాంతం ఏర్పడకుండా ఉండాలంటే గురుశాస్త్ర ఉపదేశం ద్వారా బుద్ధిని ఉపయోగించి నేర్చుకోవాలి అని కలుపుకోవాలి.

**శ్లోకం 26**

**దేహో న జానాతి సతో న జన్మ**
**దేహప్రమాణోఽ న్య ఉదేతి మధ్యే ।**
**అహఙ్కృతిగ్రన్థివిబన్ధసూక్ష్మ-**
**శరీరచేతోభవజీవనామా ॥**

**ప్రతిపదార్థం:** దేహో న జానాతి = శరీరానికి తెలియదు; సతో న జన్మ = సత్తుకు జన్మ లేదు; మధ్యే = మధ్యలో; అన్యః = ఇతరమైనది; దేహప్రమాణ = శరీరముయొక్క ప్రమాణము కలది; ఉదేతి = ఉత్పన్నమౌతోంది; అహంకృతిగ్రన్థివిబన్ధసూక్ష్మ శరీరచేతోభవజీవనామా= అహం, గ్రంథి, బంధం, సూక్ష్మశరీరం, మనస్సు, చేతస్సు, జీవుడు, మొదలైన పేర్లు గలది.

**తాత్పర్యం:** శరీరానికి తెలియదు, సత్తుకు జన్మ లేదని. మధ్యలో ఇతరమైనది, శరీరముయొక్క ప్రమాణము కలది ఉత్పన్నమౌతోంది. అది అహం, గ్రంథి, బంధం, సూక్ష్మశరీరం, మనస్సు, చేతస్సు, జీవుడు, మొదలైన పేర్లు గలది.

**వివరణ:** రమణమహర్షి ఈ అద్భుతమైన అహంకార వివరణలు ఇంకా కొనసాగిస్తున్నారు. అవి శ్లోకం 25 లో మొదలైంది. 25, 26, 27, 28, 29 శ్లోకాల్లో వస్తుంది; అంటే మొత్తం ఐదు శ్లోకాలలో అహంకారాన్ని, అహంకార మిక్చర్‌ని, ఇంకా మాట్లాడితే అహంకార సలాడ్‌ని వివరిస్తున్నారు.

**దేహః న జానాతి** – శరీరం ఎన్నడూ చెప్పలేదు నేను ఒక జీవినని. శరీరం ఎన్నడూ చెప్పలేదు నేను అశాశ్వత చైతన్యాన్ని అని. ఎందువల్ల అంటే శరీరానికి చైతన్యం లేదు; అది జడం. ఒకవేళ శరీరానికి చైతన్యం ఉంటే దానికి మరణం ఉండదు. శవం కూడా మాట్లాడుతుంది. అందువల్ల జడశరీరం చెప్పలేదు. పోనీ ఆత్మ చెప్పగలదా నేను అని?

**సతః న జన్మ** – ఆత్మ కూడా చెప్పలేదు. నేను శాశ్వతచైతన్యాన్ని అని, నేను స్వరూపాన్ని అని ఎందుకు ఆత్మ చెప్పలేదు? అంతకు ముందు మనం చూసిన కారణం ఆత్మ నిర్వికారం అని. అంటే ఆత్మకు మార్పులు లేవు. ఈ శ్లోకంలో ఇంకొక కారణం చూస్తాము. ఆత్మ నేను శాశ్వత చైతన్యాన్ని అని చెప్పలేదు. ఆత్మ శాశ్వతమా, అశాశ్వతమా?

**న జాయతే మ్రియతే వా కదాచిత్** – గీత

మీకు తెలుసు ఆత్మకు పుట్టుక లేదని; కానీ మీరు ఏదైనా ఫామ్ ఫిలప్ చేస్తుంటే అక్కడ మీ పుట్టినరోజు ఏమిటి అని అడిగితే నేను అజం అంటే నాకు పుట్టుక లేదని అంటారా, అనరు. ఆత్మ నేను అని చెప్పేటట్టయితే నేను అజమ్, నేను చైతన్యం అని చెప్పాలి కానీ ఆత్మకు పుట్టుక లేనప్పుడు ఎలా చెబుతుంది? అందువల్ల ఆత్మ నేను శాశ్వత చైతన్యాన్ని అని చెప్పలేదు. ఇప్పుడు అనాత్మ నేను అని చెప్పలేదు, ఆత్మ నేను అని చెప్పలేదు. ఈ విధంగా శరీరం అశాశ్వతం. ఆత్మ చైతన్యం, శరీరం చైతన్యం కాదు. ఆత్మ అశాశ్వతం కాదు.

కానీ మనం శరీరంయొక్క అశాశ్వతత్వాన్ని చైతన్యంయొక్క శాశ్వతత్వాన్ని రెండు తీసుకుని కలుపుతున్నాము. ఈ రెండింటినీ కలిపి ఒక కొత్త అంశాన్ని తయారు చేస్తున్నాము. ఆ అంశానికి అశాశ్వతమైన చైతన్యతత్త్వం అని పేరు పెడుతున్నాము. ఈ మిశ్రమం తెలిసి చేస్తే సమస్య లేదు కానీ ఆత్మతత్త్వం స్పష్టంగా తెలియక పోవటంవల్ల వస్తోంది సమస్య అంతా.

**అన్యః ఉదేతి** – మూడవ అంశం, అంతుపట్టని అంశం ఉదయిస్తుంది. అది ఆత్మలోని కొన్ని అంశాలను, అనాత్మలోని కొన్ని అంశాలను తీసుకుని ఏర్పడిన మిశ్రమం. అంటే అది స్వచ్ఛమైన ఆత్మ కాదు, స్వచ్ఛమైన అనాత్మ కాదు, కానీ రెండింటి కలయిక.

**మధ్యే** – మధ్యలో ఏర్పడుతుంది. ఈ మూడవ అంశాన్ని అహంకారం అంటున్నాము. అంటే సలాడ్ అహంకారం అని ప్రస్తుతానికి అనుకుందాం. ఎందుకంటే సలాడ్లో అనేక పండ్లు ఉన్నట్టుగా ఇక్కడ ఈ అహంకారంలో ఆత్మ లక్షణాలు, అనాత్మ లక్షణాలు కలగలిసి ఉన్నాయి. ఇప్పుడు అహంకారం ఆకారం ఎంత? ఈ అహంకారం నేను హైదరాబాద్‌లో ఉన్నాను, నేను నల్లగండ్లలో ఉన్నాను అంటుంది. అంటే దానికి ఒక పరిమితిని విధించుకుంటున్నది. ఆ పరిమితి దేని లక్షణం? శరీర లక్షణం.

**దేహ ప్రమాణ అన్యః ఉదేతి మధ్యే** – అంటే దేహప్రమాణంలో ఉన్న అహంకారం మధ్యలో పుట్టుకు వస్తుంది. ఈ అహంకారం నిజమైనది కాదు. పెద్ద మోసగాడు. ఇది నా అసలు స్వరూపం కాదు. మోసగాళ్లకు అసలు పేర్లు ఉండవు. ఏవో దొంగ పేర్లు పెట్టుకుంటారు దొంగలు మోసగాళ్లు. అహంకారం అందరికన్నా పెద్ద దొంగ.

**అహంకృతిగ్రన్థివిబన్ధసూక్ష్మ శరీరచేతోభవజీవనామా** = అహం, గ్రంథి, బంధం, సూక్ష్మశరీరం, మనస్సు, చేతస్సు, జీవుడు, మొదలైన పేర్లు గలది.

**అహంకృతి** – అంటే అహంకారానికి ఇది ఒక పేరు. కొరుకుడు పడని దొంగ అయినా అహంకారానికి ఇది ఇంకొక పేరు.

**గ్రంథి** – గ్రంథి అంటే ముడి. ఈ గ్రంథి పదాన్ని ఉపనిషత్తులో చూస్తాము. **అవిద్యా గ్రంథిం వికిరత సౌమ్య, భిద్యతే హృదయ గ్రంథి.**

అహంకారాన్ని గ్రంథి అని రెండు కారణాలవల్ల చెప్పవచ్చు. శంకరాచార్యుల వారు ఒక కారణం చెబుతున్నారు. అదేమిటంటే ఒక గ్రంథిని చాలా తేలికగా విడదీయలేము, అది కూడా ఎన్నో సంవత్సరాల ముందు ఏర్పడినదైతే; కొన్ని నిమిషాల ముందే ముడివేస్తే దానిని తేలికగా విడదీయగలము. కాని కొన్ని నెలలు లేదా కొన్ని సంవత్సరాల ముందు వేసిన ముడిని అంత తేలికగా విడదీయలేము. ఇట్ ఇస్ ఏ నాటీ నాట్ అంటారు స్వామీజీ. అంటే మనని ఇబ్బంది పెట్టకుండా అంత తేలికగా విడివడదు. అహంకారం కూడా అటువంటి ముడే. అంత తేలికగా అహంకారాన్ని వదిలించుకోలేము.

25 సంవత్సరాలు వేదాంతం నేర్చుకున్నాక కూడా నేను ఎవరు? అంటే ఆత్మను అని తడుముకోకుండా చెప్పలేము. అహంకారపరంగానే మాట్లాడుతాము కానీ నేను ఎవరు అనే ప్రశ్నకు వెంటనే నేను ఆత్మ అని జవాబు చెప్పగలగాలి. కానీ అహంకారపరంగా జవాబు చెప్తాము. స్వామీజీ! నేను బ్రహ్మను, కానీ నా భార్యతోనే నాకు సమస్య అంటాడు ఒకతను. అంటే అతను నేను బ్రహ్మను అన్నప్పుడు ఆత్మజ్ఞానంలో ఉన్నాడు. కానీ మరుక్షణమే అహంకారం స్థాయికి దిగిపోయాడు. లేకపోతే బ్రహ్మకు ఎక్కడైనా భార్య ఉంటుందా? ఎన్ని సంవత్సరాలు వేదాంత అధ్యయనం చేసినా కూడా అహంకారంనుంచి ఆత్మస్థాయికి ఎదగలేక పోతున్నాము. నేను ఫలానా, నేను భర్తను, నేను తండ్రిని. ఇవి చెబుతున్నాము. అంటే ఆత్మ, అహంకారాల మధ్యలో మారుతున్నాము. అంటే మనని పరీక్షించుకుంటున్నప్పుడు కూడా మనం అంత తేలికగా అహంకారంనుంచి బయటకు రాలేకపోతున్నాము. ఆత్మతో మొదలు పెడతాము కానీ తెలియకుండానే అహంకారానికి జారిపోతాం. అందువల్ల అహంకారాన్ని తేలికగా పారద్రోల లేకపోతున్నాము. అందువల్ల దీన్ని గ్రంథి అన్నారు శంకరాచార్యులవారు. ఇది ఒక అర్థం.

ఇంకొక అర్థం – గ్రంథి రెండు వస్తువులను కలుపుతుంది. అహంకారం కూడా రెండు వస్తువుల మేలుకలయిక అని చూసాం. ఏమిటవి? శరీరంయొక్క అశాశ్వతత్త్వం, ఆత్మయొక్క చైతన్యతత్త్వం కలగలిపితే ఏర్పడినది అహంకారం. అందువల్ల ఇది గ్రంథి అయింది. మూడు ముడులతో ఒక స్త్రీ పురుషుడు భార్యాభర్తలు అవుతారు. ఇక్కడ అహంకారం ఆత్మ, అనాత్మల లక్షణాలను కలపడంవల్ల ఏర్పడింది. అందువల్ల గ్రంథి అని చెప్పవచ్చు

**విబంధః** – విబంధః అనేది అహంకారానికి ఇచ్చిన మూడవ పేరు. అహంకారం బంధం. జాగ్రత్తగా వినండి! అహంకారానికి బంధం లేదు, కానీ అహంకారమే బంధం. స్వేచ్ఛ అహంకారం అనేది లేదు ఎందుకంటే అహంకారం పేరే బంధం – స్వేచ్ఛ బంధం అంటే రెండు పరస్పర భిన్నపదాలను వాడినట్టు అవుతుంది. ఉంటే బంధాహంకారం ఉంటుంది

లేదా అహంకారం ఉండదు. అంతేగాని స్వేచ్ఛ అహంకారం అని వాడటం తార్కికంగా కుదరదు. అందువల్ల అహంకారాన్ని విబంధః అంటున్నారు రమణమహర్షి.

**శ్లోకం 27**

**రూపోద్భవో రూపతతిప్రతిష్ఠః**
**రూపాశనో ధూతగృహీతరూపః ।**
**స్వయం విరూపః స్వవిచారకాలే**
**ధావత్యహంకారపిశాచ ఏషః ॥**

**ప్రతిపదార్థం:** రూప + ఉద్భవః = స్థూలసూక్ష్మరూపములందు పుట్టుక కలది; రూపతతిప్రతిష్ఠః= రూపముల సముదాయములందు స్థితి గలది; రూప + అశనః – రూపములు ఆహారముగా కలది; ధూతగృహీతరూపః = విడువబడిన, స్వీకరింపబడిన రూపములు కలది; స్వయం = స్వయంగా; విరూపః = రూపం లేనిది; ఏషః = ఈ; అహంకార పిశాచః = అహంకారమనే పిశాచం; స్వవిచారకాలే = తన విచార సమయమునందు; ధావతి = పారిపోతున్నది.

**తాత్పర్యం:** అహంకారము స్థూలసూక్ష్మరూపములందు పుట్టుక కలది. రూపముల సముదాయములందు స్థితి గలది. రూపములు ఆహారముగా కలది. విడువబడిన, స్వీకరింపబడిన రూపములు కలది. స్వయంగా రూపం లేనిది. ఈ అహంకారమనే పిశాచము తన విచార సమయమునందు పారిపోతున్నది. మాయమౌతున్నది.

**వివరణ:** ఇంతకుముందు శ్లోకాలు అహంకారం ఒక మిథ్యా అంశమని, అది ఆత్మ అనాత్మల లక్షణాలు కొన్నింటిని పుణికిపుచ్చుకుని, మధ్యలో ఏర్పడిన అంశమని చూసాం. అది ఆత్మ నుంచి తీసుకున్న లక్షణం, చేతనతత్త్వం. అందువల్లనే మీరు ఎప్పుడు నేను అని అన్నా నేను అనే విషయం చేతనతత్త్వాన్ని సూచిస్తుంది. చేతనముంటేనే నేను అని చెప్పగలదు. జడమైన బల్ల నేను ఉన్నానని చెప్పగలదా? అది సాధ్యం కాదు; ఎందుకంటే అది జడం కాబట్టి. అంటే చేతనం ఉన్న వస్తువే మాట్లాడగలదు, ఆలోచించగలదు. అందువల్ల అహంకారం నేను అని అంటే అది ఆత్మనుంచి అరువు తెచ్చుకున్న చైతన్యం. నేను ఉన్నాను అని చెప్పి ఆగితే సమస్య లేదు. మనం అందరం ఒకటే. అందరం సర్వవ్యాపకమైన ఆత్మే. అందువల్ల నేను ఉన్నాను అని ఎవరన్నా కూడా అందరం మాట్లాడేది సర్వవ్యాపకమైన ఆత్మ గురించే. **ఏషః అహంకారపిశాచః –** మరి ఎప్పుడు ఈ అహంకారం అనే పిశాచం పుట్టింది? పిశాచం అని ఎందుకు అన్నారు? వచ్చిన చిక్కేమిటంటే మనం నేను ఉన్నాను అని చెప్పి ఊరుకోము. దానికి అనేక గుణాలు కలుపుకుంటూ వస్తాం. ఒక్కొక్క గుణం కలిపినప్పుడల్లా ఆ గుణం ఆత్మనుంచి వచ్చిందా, అనాత్మనుంచి వచ్చిందా అని చూడాలి.

నేను ఉన్నాను అంటే ఆత్మనుంచి వచ్చింది అని చూసాం కానీ ఎప్పుడైతే ఒక గుణం కలుపుతామో అది ఆత్మయొక్క గుణం కాదు. ఆత్మనుంచి వచ్చినది కాదని ఎందుకు చెబుతున్నాము? పాపం ఆత్మకి గుణాలు లేవు కాబట్టి. ఆత్మ నిర్గుణం. గుణం ఉంటే ఏదో ఒక కోశానికి చెందినదే అవుతుంది. ఇక్కడ తత్త్వబోధలో మీరు నేర్చుకున్న బోధను గుర్తు తెచ్చుకోవాలి. ఏ ఉపనిషత్తు నేర్చుకున్నా, ప్రకరణ గ్రంథాలు నేర్చుకున్నా, తత్త్వబోధ మీకు ఆధారం. అది గుర్తుంటే ఇవన్నీ తేలికగా అర్థమవుతాయి.

తద్వారా పంచకోశాల గురించి నేర్చుకుంటాం. అవి – అన్నమయకోశం, ప్రాణమయకోశం, మనోమయకోశం, విజ్ఞానమయకోశం, ఆనందమయకోశం. ఇవన్నీ అనాత్మ లక్షణాలు, ఇవన్నీ అనాత్మకు చెందినవి. అందువల్ల మీరు ఏ లక్షణం గురించి చెప్పినా ఆ లక్షణం ఈ ఐదు కోశాల్లో ఏదో ఒక కోశానికి చెందినదై ఉంటుంది.

| | |
|---|---|
| నేను లావుగా ఉన్నాను | – ఈ లక్షణం అన్నమయకోశానికి చెందినది. |
| నాకు ఆకలి వేస్తోంది | – ఈ లక్షణం ప్రాణమయకోశానికి చెందినది. |
| నాకు కోపంగా ఉంది | – ఈ లక్షణం మనోమయకోశానికి చెందినది. |
| నాకు అర్థం కావడం లేదు | – ఈ లక్షణం విజ్ఞానమయకోశానికి చెందినది. |
| నాకు నిద్ర వస్తోంది | – ఈ లక్షణం ఆనందమయకోశానికి చెందినది. |

ఈ విధంగా నేను లేదా నాకు తర్వాత ఏ లక్షణాన్ని కలిపినా కూడా అది అనాత్మకు చెందినదే, కానీ ఆత్మకు చెందినది కాదు. అందువల్ల నేనొక మనిషిని అంటే నేను పదం ఆత్మకి చెందితే, మనిషి భాగం అనాత్మకు చెందుతుంది. ఇలా ఆత్మ అనాత్మలను కలిపేసి మనకే అర్థం కాని ఒక మూడో అంశాన్ని తయారు చేశాం. అదే అహంకారం అనే వేషం. ఈ అనాత్మకు చెందిన వేషాలు, లక్షణాలు నిరంతరం మారుతూనే ఉంటాయి. ఆత్మకు చెందిన లక్షణం మారదు. అది ఎప్పుడు ఒకటేగా ఉంటుంది.

మీకు 5 ఏళ్ళ వయస్సులో నేను బాలుణ్ణి అంటారు.
మీకు 20 ఏళ్ళ వయస్సులో నేను యువకుణ్ణి అంటారు.
మీకు 40 ఏళ్ళ వయస్సులో నేను నడివయస్కుణ్ణి అంటారు.
మీకు 60 ఏళ్ళ వయస్సులో నేను వృద్ధుణ్ణి అంటారు.

**స్వవిచారకాలే స్వయం విరూపః –** ఈ వాక్యాలను విశ్లేషిస్తే నాలుగింటిలోనూ సమానంగా ఉన్న పదం – నేను నేను నేను. ఇది ఆత్మలక్షణం. ఇది మారలేదు కానీ అనాత్మ లక్షణం మారుతూ వచ్చింది. బాలుడు యువకుడయ్యాడు, యువకుడు నడివయస్కుడు అయ్యాడు, నడివయస్కుడు వృద్ధుడు అయ్యాడు. కానీ ఈ నాలుగు దశల్లోనూ నేను ఒకటి ఉన్నది.

నేను, ఆ నేను ఒకటే. అదే ఆత్మ లక్షణం. 90 ఏళ్ళ వయస్సులో మీరు వణుకుతూ నేను ఉన్నానని చెప్పినా అందులో ఉన్న నేను కూడా ఆత్మే. అహంకారంలో ఉన్న ఆత్మ లక్షణం ఎన్నడూ మారదు కానీ దానికి మీరు కలుపుకుంటూ వచ్చిన అనాత్మ లక్షణాలు అడుగడుగునా నిరంతరం మారుతూ ఉంటాయి. అందువలన అహంకారానికి కెలిడియోస్కోప్ లక్షణం ఉంది అంటున్నారు. అనేక ఆకారాలు మారిపోతూ కనిపిస్తాయి; అహంకారానికి కూడా అనేక గుణాలు మారుతూ ఉంటాయి.

అహంకారం కర్మేంద్రియాల ద్వారా పనిచేస్తున్నప్పుడు అది కర్త అవుతుంది. అదే జ్ఞానేంద్రియాల ద్వారా పనిచేస్తున్నప్పుడు భోక్త అవుతుంది. కొడుకుతో ఉన్నప్పుడు తండ్రి, పితా అవుతుంది. తండ్రితో ఉన్నప్పుడు పుత్ర అవుతుంది. ఆ విధంగా అనాత్మ గుణాలు క్షణక్షణం మారుతూ ఉంటాయి. ఆ విధంగా అహంకారం గుణాలు అనాత్మ లక్షణాలనుబట్టి క్షణక్షణం మారుతూ ఉంటాయి. అందువల్ల అనాత్మ లక్షణాలవల్ల అహంకారం పుట్టింది. పుట్టటంవల్ల అంటే ఈ శరీరం పుట్టడంవల్ల అహంకారం పుట్టింది. వారి అహంకారానికి ఉనికి ఉంది. శరీరం లయమైపోతే అహంకారం కూడా లయమవుతుంది.

**రూప ఉద్భవః** – అహంకారం గుణాలు వస్తే వస్తుంది. మన శరీరాలను కార్యకరణ సంఘాతం అంటారు. కార్యకరణ సంఘాతంయొక్క లక్షణాలు అహంకారానికి కూడా వస్తాయి. ఈ కార్యకరణసంఘాతం పడుకున్నప్పుడు అహంకారం కూడా పడుకుంటుంది. అహంకారం పడుకుంటే నేను రాగీ, నేను ద్వేషి, నేను కామీ, నేను క్రోధీ అనే లక్షణాలు కూడా పడుకుంటాయి. అందువల్ల రూప ఉద్భవ అంటే ఈ గుణాలు అహంకారానివి. ఉద్భవ అంటే జనించటం. లక్షణాలు అహంకారానికి అనాత్మనుంచి వచ్చాయి.

**రూపతతి ప్రతిష్ఠ** – ఈ లక్షణాలలో అహంకారం తిరుగుతుంది.

తతి అంటే సామూహికం. రూపతతి అంటే లక్షణాల సమూహం. అందువల్ల శరీరం లావుగా ఉంటే, అహంకారం నేను లావుగా ఉన్నాను అంటుంది. శరీరం పుడితే, అహంకారం నేను పుట్టాను అంటుంది. శరీరం పడిపోతుంటే, నేను మరణించబోతున్నాను అంటుంది. మరణించాక నేను మరణించాను అనలేదు కానీ మరణించబోతూ ఉంటే అయ్యో నేను మరణిస్తున్నాను, నా పిల్లలను ఎవరు చూసుకుంటారు అని బాధపడుతుంది.

ప్రతిష్ఠ అంటే అది ఏ రంగంలో పని చేస్తుందో అది. మనస్సు మేలుకుని ఉన్నప్పుడు అహంకారం నేను మేలుకునే ఉన్నాను అంటుంది. అంటే నేను జాగ్రత్ పురుషుణ్ణి అంటుంది, పూర్తిగా విప్పారిన పువ్వులాగా మనస్సు పనిచేస్తున్నప్పుడు. మనస్సు అరవిరిసిన మొగ్గలాగా పనిచేస్తున్నప్పుడు, అంటే స్వప్నావస్థలో ఉండగా నేను స్వప్నపురుషుణ్ణి అంటుంది. మనస్సు

పూర్తిగా ముడుచుకున్నప్పుడు అంటే మనస్సు పడుకున్నప్పుడు నేను సుప్తపురుషుణ్ణి అంటుంది. సుషుప్తిలో పడుకున్నప్పుడు సుప్తపురుషుడు అనాలి. సుషుప్తి పురుషుడు అనకూడదు. ఆ విధంగా మనస్సుయొక్క లక్షణాన్నిబట్టి అహంకారం కూడా మారుతూ ఉంటుంది.

**రూపాశనః** – రూపములు ఆహారముగా కలది. అందువల్ల అనాత్మ లక్షణాలు అహంకారానికి ఆహారం. అంటే ఏమిటి? మనం జీవించటానికి ఆహారం ఎలా అవసరమో, అలా అహంకారం జీవించడానికి కూడా ఆహారం కావాలి. ఆ ఆహారం అనాత్మ లక్షణాలనుంచి వస్తుంది. ఎలా నిరూపించగలరు? నిద్రలో ప్రపంచం పడుకుంటుంది; శరీరం పడుకుంటుంది; మనస్సు కూడా పడుకుంటుంది. అప్పుడు అహంకారం ప్రపంచంనుంచి, శరీరంనుంచి, మనస్సునుంచి లక్షణాలను అరువు తెచ్చుకోలేదు కాబట్టి అహంకారం కూడా పడుకుంటుంది.

అందువల్లనే ధ్యానంలో సమస్య వస్తుంది. ధ్యానంలో ప్రతి ఒక్క వస్తువు గురించిన ఆలోచనని ప్రయత్నపూర్వకంగా పారద్రోలుతారు. ఆలోచనలు లేకపోయేసరికి అహంకారం అరువు తెచ్చుకోవడానికి ఏ లక్షణం మిగలదు. అంటే అహంకారానికి, దాని ఆహారం పోయినట్టే. ధ్యానంలో కూర్చున్నప్పుడు మీ అబ్బాయి గురించి, మీ ఆఫీసు గురించి, మీ డబ్బు గురించి, మీ శరీరం గురించి, ఒక్క ముక్కలో చెప్పాలంటే దేనిగురించి ఆలోచించడానికి ఇష్టపడరు. ఎందుకంటే మీరు ప్రశాంతంగా ధ్యానం చేయాలి అనుకుంటున్నారు. అందువల్ల, ఆలోచనలు లేకుండా మనస్సును శూన్యం చేస్తున్నారు. అప్పుడు అహంకారం ఏ లక్షణాన్ని అరువు తెచ్చుకుంటుంది? దానికి ఆహారం లేదు కాబట్టి పడుకుండి పోతుంది.

అందువల్లనే మనస్సుని శూన్యం చేస్తే ధ్యానంలో నిద్ర వచ్చేస్తుంది. మీరు కూర్చునే నిద్రపోతారు. అందువల్లనే ధ్యానాన్ని కృత్రిమనిద్ర అంటారు. పడుకుని నిద్రపోతే అది సహజనిద్ర. ఇలా ధ్యానంలో పడుకుంటే అదే కృత్రిమనిద్ర.

జ్ఞానం పొందాక చేసే ధ్యానాన్ని నిదిధ్యాసనం అంటారు. దీన్నే ఇంగ్లీషులో వేదాంతిక్ మెడిటేషన్ అంటారు. అంటే మెడిటేషన్‌లో మనస్సు ఉండాలి. మనస్సులో ప్రయత్నపూర్వకంగా శ్రవణంలో నేర్చుకున్న ఆత్మలక్షణాలను గుర్తుతెచ్చుకోవాలి. అందువల్ల నిదిధ్యాసనంలో అహంకారం ఉంటుంది.

**ధూతగృహీతరూపః** – ఒక వ్యక్తి రోజులో అనేకసార్లు దుస్తులు మార్చుకున్నట్టుగా అహంకారం కూడా లక్షణాలను మార్చుకుంటూ ఉంటుంది. ధనవంతుడు ప్రొద్దుట, మధ్యాహ్నం, రాత్రి దుస్తులు మార్చుకున్నట్టుగా, అహంకారం కూడా తన లక్షణాలను మార్చుకుంటూ ఉంటుంది. చీరల అడ్వర్టైజ్‌మెంట్లో చూడండి, ఒకే అమ్మాయి అనేక చీరలు మారుస్తూ ఉంటుంది.

అలాగే అహంకారం కూడా క్షణక్షణమూ తన లక్షణాలను మార్చుకుంటూ ఉంటుంది. కొడుకు ఎదురుగా ఉంటే నేను తండ్రిని అనే ఆలోచన వస్తుంది. కొడుకు వెళ్ళి భార్య వచ్చేసరికి అహంకారం భర్తగా మారుతుంది. ఆఫీసుకి వెళ్తే ఎం.డి.గానో, క్లర్క్‌గానో మారిపోతుంది. ఆ విధంగా అహంకారం అనేక రూపాలు ధరిస్తూ ఉంటుంది. ధూత అంటే లక్షణాలను వదిలివేస్తుంది అని అర్థం. వెంటనే గ్రహీత రూపా అంటే, వెంటనే ఇంకో రూపాన్ని దాలుస్తుంది; అంటే తండ్రి పోయి అన్న వస్తాడు; అన్న పోయి భర్త వస్తాడు. స్వామిజీ క్లాస్‌లో మీరు ఉంటే, విద్యార్థిగా వినాలి. అన్నగా వింటే బోధ తలకెక్కదు. క్లాస్ అయి చెప్పులు వేసుకోగానే ఇంకొక పాత్ర వస్తుంది. అది మీ ప్రారబ్ధకర్మనిబట్టి ఉంటుంది.

ఈ అహంకారం ఎప్పుడు వస్తుంది అన్నది చెప్పలేము. ఒకోసారి క్లాస్ అవకముందే వచ్చేయవచ్చు కూడా. అదృష్టం బావుంటే క్లాస్ అయ్యాక రావచ్చు. అందువల్ల నిరంతరం ఒక లక్షణాన్ని తీసుకుని దాన్ని వదిలేసి ఇంకొక లక్షణాన్ని తీసుకుంటూ ఉంటుంది. ఆ విధంగా అహంకారానికి అనేక లక్షణాలున్నాయి.

(స్వవిచారకాలే స్వయం విరూపః) **ధావతి** – ఇంతగా ఆటాడిస్తున్న అహంకారవిచారణ చేస్తే, దానికి విడిగా ఉనికి లేదని అర్థమౌతుంది. అప్పుడు అహంకారం పారిపోతుంది.

**శ్లోకం 28**

**భావేఽహమః సర్వమిదం విభాతి**
**లయేఽహమో నైవ విభాతి కించిత్ ।**
**తస్మాదహంరూపమిదం సమస్తం**
**తన్మార్గణం సర్వజయాయ మార్గః ॥**

**ప్రతిపదార్థం:** అహమః = అహంయొక్క; భావే సతి = ఉనికి ఉండగా; ఇదం = ఈ; సర్వం= జగత్తంతా; విభాతి = భాసిస్తుంది; అహమః = అహంకారం; లయే సతి = నాశనం అయితే; కించిత్ = ఏదీ; న+ఏవ విభాతి = ఏ మాత్రమూ భాసించదు; తస్మాత్ = అందువల్ల; ఇదం సమస్తం = ఈ జగత్తు అంతా; అహంరూపం= అహంభావరూపమయినది; తత్ + మార్గణం= ఆ అహంయొక్క అన్వేషణ; సర్వజయాయ= సర్వసంగ పరిత్యాగంకోసం; మార్గః = సాధనం; భవతి = అవుతుంది.

**తాత్పర్యం:** అహంకారమున్నప్పుడు ఈ జగత్తు అంతా భాసిస్తుంది. అహంకారం లయించినప్పుడు ఏదీ ఉండదు. అందువల్ల ఈ జగత్తు అంతా అహంభావరూపమయినది. ఆ అహంయొక్క అన్వేషణ సర్వసంగ పరిత్యాగంకోసం సాధనం అవుతుంది.

**వివరణ:** మనం చాలా విషయాలను జీవితంలో పట్టించుకోమని, స్వీకరిస్తామని చూసాం. అహంకారాన్ని కూడా వాటిలో ఒకటిగా స్వీకరించవచ్చు కదా ఎందుకు విచారణ చేయాలి అనిపించవచ్చు కానీ మనం పట్టించుకోని కొన్ని విషయాలు మనకు ఏ విధమైన సమస్య ఇవ్వవు. అందువల్ల జీవితం సాఫీగానే సాగిపోతుంది. ఉదాహరణకి మన నీడ ఏర్పడినా మనం దాన్ని పట్టించుకోము. అది మనకు ఏవిధమైన హాని కలగజేయదు. అలాగే అద్దంలో ప్రతిబింబం చూస్తాము. దాని గురించి కూడా మనం లోతుగా ఆలోచించము. ఎందుకంటే అది మనకు ఏవిధమైన సమస్యను ఏర్పరచదు. కానీ అహంకారం అలా కాదు, మిథ్యను సృష్టిస్తుంది. అదే ఒక పెద్ద సమస్య. నిజానికి జీవితంలో మనం అనుభవిస్తున్న సమస్యలన్నీ కూడా ఈ అహంకారంవల్లే పడుతున్నాయి. ఇంకా మాట్లాడితే ఈ అహంకారం వల్లనే ఏర్పడుతున్నాయి.

శంకరాచార్యులవారు బ్రహ్మసూత్రాలకి తను రాసిన భాష్యంలో ఉపోద్ఘాతంలో అహంకారంమీద చాలా వివరంగా రాశారు. ఈ అద్భుత కల్పన అయిన అహంకారం గురించి రాశారు. ఇది ఆత్మానాత్మల మేలుకలయిక అని చూసాం. దీన్ని అన్యోన్య ఆభాస అని లేదా అన్యోన్య అధ్యాస అని అంటారు. అందువల్ల తన ఉపోద్ఘాతానికి శంకరాచార్యులవారు అధ్యాసభాష్యం అని పేరు పెట్టి, ఈ మిథ్యా అహంకారాన్ని విశ్లేషించారు. ఈ అహంకారమే కర్తగా, భోక్తగా మనని చేస్తున్నది, ఆగామి కర్మలను ప్రారబ్ధకర్మలను అనుభవించేలాగా చేస్తుంది.

ఎప్పుడు ఏ మూలనుంచి ఏ దారుణమైన వార్త వినాల్సి వస్తుందో అని భవిష్యత్తు గురించి రకరకాలుగా ఆందోళన చెందేలా చేస్తుంది. ముఖ్యంగా వయస్సుమీద పడుతున్న కొద్దీ ఆందోళనలు, బెంగలు, భయాలు ఎక్కువ అవుతూ వస్తాయి. భవిష్యత్తు గురించి ఎప్పుడు ఈ ప్రారబ్ధకర్మ ముగిసి ఈ జీవితం రాలిపోతుందో అని భయపడుతూ ఉంటారు. ఆ విధంగా ప్రారబ్ధకర్మ ఒక ఆట ఆడిస్తూ ఉంటుంది. అహంకారంవల్ల సంసారం ఏర్పడింది. అందువల్ల సమస్యలన్నీ అహంకారంవల్లే వస్తున్నాయి. అహంకారం ఈ అద్భుత కల్పనవల్ల ఏర్పడింది.

**అహమః భావే** – ఈ ప్రారబ్ధకర్మకి బలి అయినన్నాళ్ళు ప్రారబ్ధకర్మతో యుద్ధం చేయక తప్పదు. ప్రారబ్ధకర్మతో యుద్ధం చేయటం చాలా కష్టం; పైగా ఈ యుద్ధం చాలా అన్యాయం అనిపిస్తుంది. మీకు కళ్ళకు గంతలు కట్టి, ఇంకొకరితో యుద్ధం చేయమంటే పరిస్థితి ఎలా ఉంటుందో ఒకసారి ఊహించుకోండి. అతను ఎక్కడనుంచి, ఎటునుంచి వచ్చి గుద్దుతాడో తెలియదు. అతను మీ ముక్కుమీద గుద్దితే ఎదురుగా ఉన్నాడు అనుకుని మీరు ఎదురుగా గుద్దటానికి ప్రయత్నిస్తారు. అతను మీకు తెలియకుండా పక్కకు జరిగిపోతాడు.

అలాగే ప్రారబ్ధకర్మ ఎటునుంచి వస్తుందో, ఏ రూపంలో వస్తుందో మీకు తెలియదు; మీరు ఊహించలేరు. ఎంత శక్తితో వస్తుందో కూడా తెలియదు. అహంకారంతో మీరు మమేకం చెందినప్పుడు, ఈ సమస్యని ఎదుర్కోక తప్పదు. అహంకారాన్ని గెలవాలి అంటే ప్రారబ్ధం తెలియాలి. కానీ ప్రారబ్ధం తెలిసే మార్గం లేదు; గెలవాలి అంటే ఒకటే మార్గం ఉంది. ఏమిటది?

మల్లయుద్ధపరంగా చూస్తే మీరు అలా కళ్ళు మూసుకుని ఎదుటి వ్యక్తితో గెలిచే ఆస్కారం ఏమాత్రం లేదు. ఆ దాడి నుంచి బయటికి రావటం ఒక్కటే మార్గం. ఇక్కడ అహంకారం విషయంలో కూడా అంతే. అహంకారం వైపు ఉండి ప్రారబ్ధంతో గెలవలేరు. అందువల్ల అహంకారంనుంచి బయటపడటమే దానికి పరిష్కారం. నేను అహంకారాన్ని అనే భావననుంచి బయటికి రావాలి. అంటే ఆత్మానాత్మ వివేకం చేయాలి. అందువల్ల రమణమహర్షి నేను అహంకారం అని భావించినన్నాళ్ళూ మీరు ప్రారబ్ధకర్మకు లొంగక తప్పదు అంటున్నారు.

**ఇదం సర్వం విభాతి** – ఇక్కడున్న మొత్తం అంటే ద్వైతప్రపంచం మొత్తం. ఇంకా మాట్లాడితే మిథ్యా ప్రపంచం మొత్తం. మీరు అహంకారంతో మమేకం చెందినంతవరకు ఉంటూనే ఉంటుంది. మిమ్మల్ని ఒక ఆట ఆడిస్తూనే ఉంటుంది.

**అహమః లయే సతి** – అహంకారం పారద్రోలితే కానీ, **నైవ విభాతి మిథ్యా** ప్రపంచం మాయమవదు. దానివల్ల ఏర్పడిన సంసారమూ మాయమవదు.

దీన్ని అన్వయ వ్యతిరేక న్యాయం అంటారు. ఒకటి ఉంటే ఇంకొకటి ఉండి, అది లేకుండా ఇంకొకటి లేకపోతే, దానిని అన్వయవ్యతిరేక న్యాయం అంటారు. ఉదాహరణకు నీటిలో పంచదార వేస్తే నీరు తీయగా ఉంటుంది. పంచదార వేయకపోతే నీరు తీయగా ఉండదు. అంటే నీటి తీయదనానికి పంచదారే కారణం. ఈ సూత్రాన్ని అహంకారానికి అన్వయిస్తే, అహంకారం ఉంటే సమస్య ఉంది; అహంకారం లేకపోతే సమస్య లేదు. దీన్నిబట్టి అహంకారమే అన్ని సమస్యలకు మూలం అని అర్థమవుతుంది.

అలా ఎలా చెప్పగలరు అంటే భగవంతుడే దీన్ని ప్రతిరోజు మనకి చూపిస్తున్నాడు. ఇది అర్థం చేసుకోవడానికి పెద్దగా తెలివితేటలు అవసరం లేదు. జాగ్రదావస్థలో అహంకారం పనిచేస్తుంది. మనం ద్వైతప్రపంచాన్ని అనుభవిస్తున్నాము. తద్వారా సంసారాన్ని కూడా అనుభవిస్తున్నాము. అలాగే స్వప్నావస్థలో అహంకారం పనిచేస్తుంది. స్వప్నావస్థలో కూడా ద్వైతప్రపంచాన్ని అనుభవిస్తున్నాము. తద్వారా సంసారాన్ని కూడా అనుభవిస్తున్నాము. కానీ సుషుప్తిలో మనస్సు పడుకుంటుంది. మనస్సుతోపాటు అహంకారం కూడా పడుకుంటుంది. సుషుప్తిలో ద్వైతప్రపంచమూ లేదు, సంసారమూ లేదు. దీనిబట్టి అర్థం అయినది ఏమిటి?

అహంకారం ఉంటే సంసారం ఉంటుంది. అహంకారం లేకపోతే సంసారం లేదు. అందువల్ల అహంకారమే మన సమస్యలన్నింటికీ మూలకారణం.

అయితే ఏం చేయమంటారు, రోజంతా పడుకోవాలా అని అడగకూడదు. ఈ విచారణ ద్వారా వచ్చిన పరిష్కారం ఇది కాదు. దీన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. జాగ్రదావస్థలో, సుషుప్తిలో ఉన్న మనస్సుని అలవర్చుకోవాలి. మెలకువగా ఉన్న నిద్ర అంటే వేక్ఫుల్ స్లీప్. వేదాంతం అంటే ఏమిటో ఒక్కముక్కలో చెప్పాలి అంటే సుషుప్తిలో ఉండగా మీకు తెలియకుండా పొందిన ఆనందాన్ని, జాగ్రదావస్థలో ప్రయత్నపూర్వకంగా అనుభవించేలాగా చేసుకోవాలి. అలా చేయాలి అంటే ఆత్మానాత్మ వివేకం చేయాలి. ఆత్మానాత్మవివేకం చేయాలంటే ఆత్మజ్ఞానం పొందాలి. ఆత్మజ్ఞానం పొందితే నేను అహంకారాన్ని కాను, నేను ఆత్మను అనే విషయం జీర్ణించుకుంటారు. అప్పుడు నేను కర్తను కాదు, నన్ను ప్రారబ్ధకర్మ ఏమి చేయలేదు, నన్ను సంసారం ఏమీ చేయలేదు అనే జ్ఞానం కలుగుతుంది. అప్పుడు మీరు అహంకారం అనే తొడుగులు విప్పివేస్తారు; మెలకువగా ఉన్న నిద్రలో ఉంటారు.

మెలకువగా ఉన్న నిద్రలో మీరు మేల్కొని ఉంటారు, కానీ నిద్రలో అహంకారం పడుకున్నట్టుగా మెలకువలోనే మీరు అహంకారాన్ని పడుకోబెట్టేస్తారు అంటే అర్థం అహంకారం మిథ్య, నేను అహంకారం కాదని అర్థం చేసుకోవడం. ఈ విధంగా అహంకారాన్ని నియంత్రించాలి.

**తస్మాత్** – అందువల్ల. ఎందువల్ల? అహంకారమే అన్ని సమస్యలకు మూలకారణం కాబట్టి. అహంకారంనుంచే ఈ మిథ్యా జగత్తు వచ్చింది, మిథ్యా ఈశ్వరుడు వచ్చాడు అని గ్రహించారు. ఈ విషయాన్ని అంతకు ముందు చూశాము. ఇప్పుడు మళ్ళీ దాన్నే నొక్కి చెబుతున్నారు.

**అహం రూపం** – రూపం అంటే అహంకార జన్య అహం. అహంకారంనుంచి ఈ మిథ్యా జగత్తు, మిథ్యా ఈశ్వరుడు పుట్టారు. కాబట్టి మనం సమస్యను పరిష్కరించడానికి జగత్తుని మార్చి ప్రయోజనం లేదు. నిరంతరం జగత్తుని మార్చడానికి ప్రయత్నిస్తూ కూర్చున్నా, మనుషులని మార్చటానికి ప్రయత్నిస్తూ కూర్చున్నా, పరిస్థితులను మార్చటానికి ప్రయత్నిస్తూ కూర్చున్నా, సమస్యలు తీరవు. ఒక సమస్యను మారిస్తే ఇంకొక సమస్య వస్తుంది.

భాగవతంలో ఒక ఉదాహరణ చెబుతారు. పల్లకి మోసే బోయి కాసేపు కుడిభుజంమీద మోస్తాడు, తర్వాత ఆ భుజం నొప్పి అనిపిస్తే కుడిభుజంనుంచి ఎడమభుజానికి మార్చుకుంటాడు. అలా మార్చడంవల్ల నొప్పి తగ్గినట్టు అనిపిస్తుంది, కానీ అది తాత్కాలికమైన ఉపశమనం మాత్రమే. ఎందుకంటే పల్లకిని అతని కుడిభుజంమీంచి తీసి ఎడమ భుజంమీదకు మార్చేలోపు కుడిభుజంమీద పల్లకీ రాట ఉండదు. కాబట్టి అక్కడ నొప్పి పోతుంది. ఎడమభుజంమీదకి

ఇంకా చేర్చలేదు కాబట్టి నొప్పి మొదలవలేదు. అందువల్ల నొప్పి లేదు అనుకుంటాడు. కానీ కాసేపటికల్లా ఎడమభుజంమీదకి వస్తుంది, దాని వెన్నంటే నొప్పి కూడా వస్తుంది. అలా భుజాలు మార్చడంవల్ల సమస్య తీరదు. ఆ పల్లకిని మోయటం ఆపితే నొప్పి తగ్గుతుంది. ఈ భుజాలు మార్చడం తాత్కాలిక ఉపశమనం మాత్రమే.

**తన్మార్గణం** – మార్గణం అంటే అహంకారంయొక్క స్వరూపవిచారణ చేయడం ఒక్కటే దీనికి మార్గం. మార్గం అంటే అహంకారంయొక్క విచారణ చేయటం. జాగ్రత్తగా గమనించండి ఈ విచారణ అనేక మార్గాలలో ఒక మార్గం కాదు; ఇదొక్కటే మార్గం దేనికి?

**సర్వజయాయ మార్గః** – అంటే పూర్తి విజయం సాధించడానికి మార్గం. తక్కిన మార్గాలేవి పాటించినా అవి తాత్కాలిక పరిష్కారాలనే ఇస్తాయి కానీ శాశ్వతపరిష్కారం ఇవ్వవు. శాశ్వత పరిష్కారం అంటే మోక్షం ఒకటే మార్గం. ధర్మాన్ని పాటిస్తే తాత్కాలిక విజయం కలుగుతుంది. మీకు చాలా పుణ్యం ఉన్నప్పుడు జీవితం చాలా సాఫీగా సాగుతున్నట్లు అనిపిస్తుంది. అనుకూలమైన భార్య, మాటలు వినే పిల్లలు ఉంటే, మీ కింది ఉద్యోగులు మీ మాట వింటే, అంతా నందనవనంలా అనిపిస్తుంది. ఇలా సాగినన్నాళ్ళు ఆనందమే ఆనందం. ఇది పుణ్యం ఉన్నన్నాళ్ళు ఉంటుంది, కానీ ఈ పుణ్యం ఎన్నాళ్ళు ఉంటుందో తెలియదు. అన్నీ సమస్యలే, సమస్యలు. భార్య మాట వినదు, పిల్లలు మాట వినరు, ఉద్యోగులు మాట వినరు. ఇంకా కష్టాల కడలిలో కూరుకుపోయినట్టు అనిపిస్తుంది. అందువల్ల ప్రేయోమార్గం శాశ్వత పరిష్కారాన్ని ఇవ్వదు. ప్రేయోమార్గం అంటే ధర్మార్థకామాలను పాటించటం. శాశ్వత పరిష్కారం కావాలంటే శ్రేయోమార్గానికి రావాలి. శ్రేయోమార్గం అంటే మోక్షం పొందడానికి ప్రయత్నించాలి.

**శ్లోకం 29**

**సత్యా స్థితిర్నాహముదేతి యత్ర**
**తచ్ఛేదయస్థానగవేషణేన ।**
**వినా న నశ్యేద్యది తన్న నశ్యేత్**
**స్వాత్మైక్యరూపా కథమస్తు నిష్ఠా ॥**

**ప్రతిపదార్థం:** యత్ర = ఏ స్థితిలో; అహం = అహం; న+ఉదేతి = ఉదయించదో; సా= అది; సత్యా = సత్యమైన; స్థితిః = స్థితి; భవతి = అవుతుంది; తత్ + చ = ఆ అహం; ఉదయస్థానగవేషణేన వినా = ఆ అహకారం జన్మమూలాన్ని అన్వేషించకుండా; న నశ్యేత్= నశించదు, లీనం కాదు; తత్ = ఆ అహం; స్వాత్మైక్యరూపా = జీవాత్మ పరమాత్మల ఏకత్వ (అభేద) రూపమైన; నిష్ఠా= దృఢస్థితి; కథమ్ = ఏ విధంగా; అస్తు = ఉంటుంది?

**తాత్పర్యం:** అహం బుద్ధి ఉదయించని స్థితే సత్యమైన స్థితి. ఆ అహకారం జన్మమూలాన్ని అన్వేషించకుండా అహం నశించదు. అహంకారం నశించకపోతే జీవ-పరమాత్మైక రూపమైన ఆత్మనిష్ఠ ఏ విధంగా కలుగుతుంది?

**వివరణ:** రమణమహర్షి శ్లోకాలు 25, 26, 27లలో అహంకార స్వరూపాన్ని వివరించాక, 28వ శ్లోకంలో అహంకారమే సంసారానికి మూలకారణం అని ఎత్తిచూపారు. అహంకారం అశాశ్వతం కాబట్టి, మృత్యుభయం ఉంటూనే ఉంటుంది. అహంకారం కర్త కాబట్టి, వద్దనుకున్నా భోక్త కూడా అవక తప్పదు. పుణ్యపాప కర్మలను నిస్సహాయంగా భరించవలసి రావటాన్నే సంసారం అంటారు. అందువల్ల అసలు సిసలు మోక్షం పొందాలంటే, అహంకారాన్ని నాశనం చేస్తేనే అది సాధ్యం. అసలు సిసలు మోక్షం అంటే అబద్ధం మోక్షం ఇంకొకటి ఉందని కాదు అర్థం. నిజంగా మోక్షం పొందాలనుకుంటే మాత్రం అహంకారాన్ని పారద్రోలటమొక్కటే మార్గం.

మరయితే అహంకారాన్ని పారద్రోలటం లేదా నాశనం చేయటం ఎలా? దాన్నే 29వ శ్లోకంనుంచీ వివరిస్తున్నారు రమణమహర్షి. అహంకారాన్ని తాత్కాలికంగా ఉపశమింపజేసే మార్గాలు ఉన్నాయి కాని అవి సంసారంనుంచి కూడా తాత్కాలిక ఉపశమనాన్ని కలుగజేస్తాయి అంటారు రమణమహర్షి. వైద్యశాస్త్రపరంగా చెప్పాలంటే అణగద్రొక్కే పద్ధతి, పలాయనవాదం, ఉపశమనం అంటారు వీటిని. అందరికీ బాగా తెలిసిన పద్ధతి గాఢనిద్ర. అహంకారం గాఢనిద్రలో పడుకుంటుంది కాబట్టి, అప్పుడు సంసారంనుంచి విముక్తి పొందుతాము. కాని నిద్ర ఎంతసేపు పోతామో అంతసేపే విముక్తి ఉంటుంది. అంటే అది తాత్కాలిక పరిష్కారం.

అదే విధంగా ఏదైనా విషయవస్తువును బాగా ఆనందిస్తున్నప్పుడు మనం తాత్కాలికంగా ఆనందమయకోశంలోకి వెళతాము. ఆనందమయకోశం పేరే చెబుతోంది, అది ఆనందానికి చిహ్నమని. బాహ్యవస్తువులు కలుగజేసే ఏ ఆనందమైనా తీసుకోండి – షడ్రశోపేతమైన విందు భోజనం చేసినా, వీనుల విందైనా సంగీతం రెండుగంటలు విన్నా, ప్రకృతి అందాలు చూసి మైమరచిపోయినా – ఆ సమయంలో మనం అంతులేని ఆనందాన్ని అనుభవిస్తాము. అందువల్ల మనస్సు కూడా చాలా ప్రశాంతంగా ఉంటుంది. ఈ సందర్భాలలో ఆనందమయ కోశంలోకి వెళ్ళిపోతాము. అప్పుడు అప్రయత్నంగా నిర్వికల్పస్థితిలోకి వెళ్ళిపోతుంది మనస్సు.

ప్రయత్నపూర్వకంగా నిర్వికల్పంలోకి వెళ్ళిపోతే దాన్ని సమాధి అంటారు. అదే ఏదైనా అద్భుతమైన ఆనందాన్ని పొందితే, అంటే విందు భోజనం చేసినా, మంచి సంగీతం విన్నా, మంచి కళాఖండాన్ని చూసినా, ప్రకృతి అందాలని కళ్ళారా తిలకించినా అప్పుడు కూడా

మనకు తెలియకుండానే నిర్వికల్ప అవస్థలోకి వెళ్ళిపోతాము. అప్పుడు కూడా భేదబుద్ధి ఉండదు. ఎందుకంటే ఈ ఆనందాల్లో మునిగితేలేటప్పుడు అహంకారం తాత్కాలికంగా పడుకుంటుంది.

అందువల్ల ఇది తెలిసి తెలిసి అనుభవిస్తున్న ఆనందమైనా, తెలియకుండా ఆనందంలో మునిగిపోయినా, ఏ విధమైన ఆనందం అనుభవించినా మనస్సు ప్రశాంతతను, ఆనందాన్ని అనుభవిస్తుంది. ఆ సమయంలో అహంకారం లయమవుతుంది. అహంకారం లయమయేసరికి, మనం ఆ సమయంలో అద్వైతులం అవుతాము; అప్పుడు మనం ముక్తులం అవుతాము. దీన్నే అహంకార లయం అంటారు.

యోగశాస్త్రం నిర్దేశించిన నిర్వికల్ప సమాధిని అనుభవించినా కూడా, పైన చెప్పిన పద్ధతుల్లో నిర్వికల్ప అవస్థను అనుభవించినా కూడా, వాటివల్ల అహంకారలయం జరిగినా కూడా, వాటినుంచి బయటపడగానే అహంకారం కూడా నేనున్నానంటూ దూసుకు వచ్చేస్తుంది. ఎప్పుడైతే అహంకారం దూసుకువస్తుందో, అప్పుడే సంసారం కూడా దూసుకువస్తుంది. నిర్వికల్ప సమాధికి ప్రయత్నపూర్వకంగా వెళ్ళిన యోగి దానినుంచి బయటకు వచ్చాక, ఇంకా ఎక్కువ సమస్యలో పడతాడు. దీన్ని వ్యుత్థాన అవస్థ అంటారు. ఈ సందర్భాలన్నీ కూడా అహంకార లయాన్ని సూచిస్తాయి. కాని అహంకారలయం అసలు సిసలు మోక్షం కాదు అంటారు రమణమహర్షి.

ఎందుకు అహంకారలయం అసలు సిసలు మోక్షం కాదు? ఎందుకంటే అది తాత్కాలికం మాత్రమే. దానినుంచి బయటకు రాగానే మళ్ళీ అహంకారం దూసుకువచ్చేస్తుంది. పైన చెప్పిన సందర్భాలలో మాత్రమే కాదు, ప్రళయకాలంలో కూడా అహంకారం పూర్తిగా నాశనమవదు; లయమవుతుంది అంతే. రెండువేల చతుర్యుగాలు అహంకారం లయమయి ఉంటుంది. కాని తరువాత సృష్టి వచ్చినప్పుడు పాత అహంకారం నేనున్నాను అంటూ మళ్ళీ దాని ప్రతాపం చూపిస్తుంది.

మరి అయితే మోక్షం అంటే ఏమిటి? ఈ అహంకారాన్ని పూర్తిగా నాశనం చేస్తేనే అది మోక్షం అవుతుంది. అహంకారాన్ని పూర్తిగా నాశనం చేయాలి అంటే, దాన్ని కూకటివేళ్ళతో సహా పెకళించి వేయాలి. అహంకారాన్ని కూకటివేళ్ళతో పెకళించి వేయాలంటే, దాని వేళ్ళేమిటో తెలుసుకోవాలి ముందు. అంటే అహంకారం ఏర్పడటానికి మూలకారణం ఏమిటో తెలుసుకోవాలి.

అహంకారం అజ్ఞానంనుంచి పుట్టింది అంటున్నారు కదా, దేనియొక్క అజ్ఞానంనుంచి పుట్టింది? అహంకారంయొక్క అజ్ఞానం అయితే కాదు; అహంకారం, అహంకారంయొక్క

అజ్ఞానంనుంచి పుట్టలేదు. అది అసాధ్యం. తర్కానికి అందదు. ఉదాహరణకు రజ్జుసర్పభ్రాంతిలో సర్పభ్రాంతి సర్ప అజ్ఞానంవల్ల ఏర్పడదు. తాడు అజ్ఞానంవల్ల ఏర్పడుతుంది. అదేవిధంగా అహంకారం, అహంకారం అజ్ఞానంవల్ల ఏర్పడదు. ఆత్మ అజ్ఞానంవల్ల ఏర్పడుతుంది. అందువల్ల ఆత్మ అజ్ఞానం కారణం. కారణాన్ని తొలగించండి. కారణాన్ని తొలగించకుండా ఏం చేసినా కూడా అహంకార లయం మాత్రమే జరుగుతుంది కానీ అహంకార నాశనం జరగదు. అహంకారనాశనం జరగాలంటే, ఆత్మ అజ్ఞానం తొలగాలి. ఈ విషయాలన్నీ మీకు ముందే తెలిసినా, ఎంత విన్నా చాలామంది ఆత్మజ్ఞానం పొందడానికి, మోక్షం పొందడానికి అనేక మార్గాలు ఉన్నాయి అని భావిస్తారు.

అనేక మార్గాల పద్ధతి అయోమయంవల్ల పుట్టిందే తప్ప అలాంటి పద్ధతి లేనేలేదని అర్థం చేసుకోవాలి. అహంకారనాశనం అవ్వాలి. అహంకారనాశనం అవ్వాలంటే ఆత్మ అజ్ఞాన నాశనం అవ్వాలి. ఆత్మ అజ్ఞాననాశనం ఎలా అవుతుంది? దానికి ఎన్ని మార్గాలు ఉన్నాయి? ఈ సందేహమే రాకూడదు. దానికి ఒకటే మార్గం ఉంది.

అది ఆత్మజ్ఞానం ఒక్కటే. ఆత్మజ్ఞానం కూడా ఒక్క మార్గంవల్లనే వస్తుంది. అది ఆత్మ విచారణ ద్వారా వస్తుంది. అందువల్ల మనం చేయాల్సింది అహంకార విచారణ కాదు, ఆత్మవిచారణ. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే అహంకార మూల ఆత్మవిచారణ. ఈ ఆత్మవిచారణ చేసి అజ్ఞానాన్ని తొలగించుకునేంతవరకు అహంకారం లయమవుతుందే కానీ, నాశనం అవ్వదు. అహంకారం ఉన్నంతవరకు ఇవాళ ఆనందంతో చిందులు వేస్తే, రేపు దుఃఖసాగరంలో మునిగిపోతారు. ఒకరోజు చిరునవ్వులు చిందిస్తే, ఇంకొకరోజు కృంగిపోతారు. ఎవరికోసం జీవించాలి అనే నిరాశ కూడా కమ్ముకుంటుంది. అలా జీవితం అంతా డోలాయమానంగా సాగుతూ ఉంటుంది.

ఇంత విన్నా కూడా నాకు ఈ జీవితం సుఖంగానే ఉంది అని మీకు అనిపిస్తే శాస్త్రం ఏమీ ఆత్మ విచారణకు రండి అని బలవంత పెట్టదు; ఆల్ ది బెస్ట్ అంటుంది, మీ ఇష్టం ఎన్ని మార్గాలలో తిరుగుతారో, అన్నీ ప్రయత్నించి చూడండి. కానీ చివరికి మాత్రం ఆత్మ విచారణకు రాక తప్పదు, అప్పుడే మీకు నేర్పిస్తాము అంటుంది శాస్త్రం.

అహంకారానికి మూలకారణం ఆత్మ అజ్ఞానమే అంటున్నారు రమణమహర్షి. ఆత్మ అజ్ఞానాన్ని పారద్రోలితేనే, అహంకారం పూర్తిగా నాశనమవుతుంది. అహంకారం నాశనమవటమంటే అహంకారం మిథ్య అని అర్థం చేసుకోవటమే. అహంకారం నాశనమవటమంటే, ఈ ప్రపంచంనుంచి పారిపోవటం కాదు. మనం అహంకారం మిథ్య అని అర్థం చేసుకున్నాక కూడా ప్రపంచంలోనే ఉంటాము, ప్రపంచంలోని వ్యవహారాలను

పూర్వంలాగానే కొనసాగిస్తాము. ఎందుకంటే అహంకారం లేకుండా వ్యవహారాలు నడపలేము. కాని ఎన్ని వ్యవహారాలు నడుపుతున్నా అహంకారం సత్యం కాదు, మిథ్య అనే దృఢనిశ్చయ జ్ఞానంతో కొనసాగిస్తాము. ఈ మిథ్యాత్వ నిశ్చయమే అహంకార నాశనం అంటారు.

కుండయొక్క మిథ్యాత్వ నిశ్చయాన్ని రెండు భిన్నమార్గాల్లో చేయవచ్చు. ఒకటి నిజంగానే కుండను నాశనం చేయటం. అంటే కుండను కింద పడవేసి ముక్కలు ముక్కలు చేయటమో, దాన్ని సుత్తితో కొట్టి పగలగొట్టటమో చేయవచ్చు.

కాని వేదాంతం నేర్చుకుంటే, కుండను అక్షరాలా నాశనం చేయకుండానే, బుద్ధిలో మార్పు ద్వారా కుండ మిథ్యాత్వాన్ని అర్థం చేసుకోవచ్చు. అదెలా సాధ్యం? ప్రకృతి సూత్రం– కార్యం అంతటా కారణం ఉంటుంది. కుండ, మట్టినుండి వచ్చింది కాబట్టి, కుండ అంతటా మట్టి ఉంటుంది. అందువల్ల మట్టి లేకుండా, కుండకు విడిగా ఉనికి లేదు.

**వాచారంభణం వికారో నామధేయం మృత్తికేత్యేవ సత్యమ్** – ఛాందోగ్యమ్

అంటే కుండ ఏర్పడ్డాక మన నోరు కుండకు కుండ అని ఒక పేరు పెడుతుంది. కాని నిజానికి కుండకు విడిగా ఉనికి లేదు. ఎందుకంటే మట్టి లేకుండా కుండ లేదు. మనం చేతిలో కుండను పట్టుకున్నా కూడా మట్టినే పట్టుకున్నట్టు అర్థం. విడిగా ఉనికి లేనిదాన్ని మిథ్య అంటారు. మిథ్య అంటే అసలు లేదని కాదు కాని, దానికి స్వతంత్ర సత్తా లేదని అర్థం.

కుండ మిథ్య అని అర్థమయ్యాక కూడా కుండను వాడతాము. కుండలోంచి నీరు తాగుతాము. కాని నువ్వేం పట్టుకున్నావు అంటే మట్టి అంటాము. అంటే కుండయొక్క మిథ్యాత్వ దర్శనం చేయాలంటే, దానికి అధిష్ఠానమైన మట్టి జ్ఞానం పొందాలి. అధిష్ఠానం అంటే మూలకారణం.

ఇంకొక ఉదాహరణ – రజ్జుసర్ప భ్రాంతి. తాడును చూసి పాము అని భ్రమపడతారు, చెమటలు పడతాయి, ఖంగారు పడతారు. కాని మీరు పాము పాము అనుకుంటున్నది పాము కాదు, తాడు అని అర్థమయితే పాము యొక్క మిథ్యాత్వ దర్శనం అవుతుంది. తాడును అధిష్ఠానం అనీ, పాముని అధ్యాస అనీ అంటారు.

అలాగే స్వప్నదృష్టాంతం. స్వప్నంలో పులిని చూసి భయపడతారు, పరుగులు తీస్తారు. కాని స్వప్నంనుంచి లేస్తే, స్వప్నం మిథ్య అని అర్థమవుతుంది. స్వప్నం అధ్యాస, జాగ్రత్ పురుషుడు అధిష్ఠానం.

ఈ దృష్టాంతాలని ఆధారం చేసుకుని అహంకారాన్ని చూస్తే, అహంకారానికి విడిగా ఉనికి లేదు, ఆత్మకు భిన్నంగా వేరే వస్తువు లేదు. అందువల్ల అహంకారం మిథ్య, దానికి ఆత్మ అధిష్ఠానం. అహంకారం సత్యం అని ఎందుకు అనుకుంటాము? అజ్ఞానం వల్ల. ఆత్మజ్ఞానం పొందితే, అజ్ఞానం పోతుంది. అంటే అహంకారం గురించిన అజ్ఞానం పోతుంది.

**కారణనాశాత్ కార్యనాశః భవతి**

అహంకారానికి మూలకారణమైన అజ్ఞానం పోతే, అజ్ఞాన కార్యమయిన అహంకారం కూడా నాశనమవుతుంది. అంటే అహంకారం అధ్యాస, ఆత్మ అధిష్ఠానం. ఈ అహంకార మిథ్యాత్వ నిశ్చయమే అహంకార నాశనం అంటారు.

ఇది కాక వేరే ఏ పద్ధతి చెప్పినా కూడా అది అహంకారలయం మాత్రమే. లయలో అహంకారం తాత్కాలికంగా నాశనమవుతుంది కాని, మళ్ళీ దూసుకువస్తుంది. కాని ఆత్మజ్ఞానం పొంది, అహంకార మిథ్యాత్వ నిశ్చయం చేస్తే, అహంకారం మళ్ళీ దూసుకురాలేదు. ఎందుకు? ఇక్కడ మనం ప్రత్యక్షంగా అహంకారాన్ని నాశనం చేయటం లేదు. అహంకారానికి మూలమైన అజ్ఞానాన్ని నాశనం చేస్తున్నాము. అజ్ఞానాన్ని ఒకసారి నాశనం చేస్తే మళ్ళీ అది దూసుకురాదు. ఎందువల్లనంటే అజ్ఞానానికి ఒక ఆరంభం అంటూ ఉండదు. అది అనాదికాలంగా వస్తున్నది.

**సత్యా స్థితి యత్ర అహం న ఉదేతి** – ఇది అసలైన జీవన్ముక్తి. సత్యా స్థితి అంటే అసలైన జీవన్ముక్తి. జీవన్ముక్తుడు అహంకారాన్ని అహం మిథ్య లేదా వ్యావహారిక సత్యం అనే జ్ఞానంతో ఉపయోగిస్తాడు.

**నైవ కించిత్ కరోమీతి యుక్తో మన్యేత తత్త్వవిత్ ।**
**పశ్యన్ శృణ్వన్ స్పృశన్ జిఘ్రన్నశ్నన్ గచ్ఛన్ స్వపన్ శ్వసన్ ॥** – గీత

జ్ఞాని తను చూస్తున్నా, వింటున్నా, ముట్టుకుంటున్నా, ఆస్వాదిస్తున్నా – ఏం చేస్తున్నా, తనేమీ కొంచెం కూడా చేయటం లేదనే జ్ఞాననిష్ఠలో ఉంటాడు. అది చేస్తున్నది మిథ్యా అహంకారం మాత్రమే, ఆత్మ అయిన తను కాదని అర్థం చేసుకుంటాడు. మిథ్యా అహంకారం, మిథ్యా ప్రపంచంలో మిథ్యాకర్మను చేస్తున్నది అంటాడు.

యత్ర అహం న ఉదేతి. ఇక్కడ 'అహం' అంటే అహంకారం. అహం పదాన్ని ఇన్‌వర్టెడ్ కామాలలో రాయాలి. ఇక్కడ సంస్కృతం తెలిస్తే చిన్న సందేహం ఉదయించేందుకు ఆస్కారం ఉంది. అహం పదం ఉత్తమ పురుషునికి (ఫస్ట్ పర్సన్) చెందినదైతే, ఉదేతి క్రియాపదం ప్రథమ పురుషుడు (థర్డ్ పర్సన్)కు చెందినది. ఒక పురుషునికి వాడే క్రియాపదం ఇంకొక పురుషునికి ఎలా వాడతారు? తెలుగులో కూడా నేను వస్తున్నాను అంటే ప్రథమ పురుషునికి

అతను వస్తున్నాడు అని వస్తుంది. ఇక్కడ నేను వస్తున్నాడు అని వాడినట్టు అర్థం వస్తుంది. ఈ రెండూ వ్యాకరణపరంగా పొసగవు.

అందువల్ల ఇక్కడ 'అహం' (నేను) ముందు ఇదం అహం అని అర్థం వస్తుంది. ఇదం పదం వేస్తేనే అహంకారం అని అర్థం వస్తుంది.

ఇది అర్థం చేసుకోవాలంటే ఈ జోక్‌ని అర్థం చేసుకోవాలి.

ఒక జ్ఞానిని ఎవరో ప్రశ్నిస్తారు, 'నేను ఎప్పుడు శాశ్వతం అవుతాను?' దానికి జ్ఞాని, 'నేను మరణిస్తే, నేను శాశ్వతం అవుతాను అని అర్థం చేసుకోవాలి,' అంటాడు. ఈ పదాలు విభిన్న పదాలుగా లేవూ? మరణిస్తే, ఇంక శాశ్వతం అయ్యే ప్రసక్తి ఎలా వస్తుంది? అందులోనే ఉంది అసలు తమాషా. ఇక్కడ నేను అంటే అహంకారం. అహంకారం మరణిస్తే, నేను శాశ్వతం అవుతాను. రెండో నేను ఆత్మను సూచిస్తుంది. జ్ఞానం పొందితే, అహంకారం నశిస్తుంది, ఆత్మలో రమిస్తాము. అందువల్ల యత్ర అహం న ఉదేతిని అహం అహంకారః యత్ర న ఉదేతిగా మార్చుకుంటే అది సాధ్యమవుతుంది.

**ఉదయస్థాన గవేషణేన** – ఇదెలా సాధ్యమవుతుంది? అధిష్ఠాన జ్ఞానం పొందితేనే. దానికి రమణులవారు ఉదయస్థాన గవేషణేన అంటున్నారు.

సత్యా స్థితిః – అంటే సత్య ఆత్మ గురించిన జ్ఞానం పొందటం ఒక్కటే శాశ్వతమైన పరిష్కారం. అదే మోక్షస్థితి. మోక్షస్థితి అంటే ఆ స్థితిలో ఇంకా అహంకారం మళ్ళీ లేచి తోక జాడించకూడదు.

మనుషుల మనస్థితి ఎలా ఉంటుందంటే పరిస్థితులు బాగుండకపోతే కుంగిపోతారు. పోనీ అవి బాగుంటే అప్పుడన్నా సుఖంగా ఉంటారా అంటే దిష్టి తగిలిపోతుందని బాధపడిపోతారు. అందరూ దిష్టి పెట్టేస్తున్నారని, ఆ దిష్టి పోవడానికి దిష్టి గణపతిని గుమ్మం ముందు తగిలిస్తారు, భయపడతారు. ఆ విధంగా మనుష్యులు ఎన్నడూ ఆనందంగా ఉండరు. ఇవి పోవాలంటే అహంకారం శాశ్వతంగా తొలగిపోవాలి. అప్పుడు ఈ దిష్టి భయం కూడా పోతుంది.

తత్ అంటే అది; తత్ అంటే ఆ అహంకారం. ఆత్మవిచారణ చేయకపోతే అహంకారం తాత్కాలికంగానే పోతుంది. లౌకిక మార్గాలు ఉన్నాయి, లేవనటం లేదు. జాతకం, నాడీ జోష్యం అలా ఎన్నో మార్గాలు ఉన్నాయి. వీటిని మనం ప్రశ్నించడం లేదు. కాకపోతే మనం చెప్పేది ఒకటే; వీటివల్ల అహంకారం పూర్తిగా, శాశ్వతంగా పోదు. గవేషణమ్ అంటే విచారణ. దేనియొక్క విచారణ?

**ఉదయస్థానమ్** – అంటే అహంకార ఉదయస్థానం అంటే అహంకారం ఎక్కడ పుట్టిందో ఆ మూలం. దీన్ని వేదాంతపరిభాషలో చెప్పాలంటే అహంకారంయొక్క అధిష్ఠానం. అహంకారం అధిష్ఠానం ఏది? ఆత్మ. అందువల్ల ఉదయస్థానం అంటే ఆత్మ అని; గవేషణమ్ అంటే విచారణ అని చెప్పవచ్చు. ఆత్మవిచారణ చేయటం ఒక్కటే మార్గం. అందువల్ల ఈ శ్లోకాల్లో అంటే 29, 30, 31, 32, 33 శ్లోకాల్లో రమణమహర్షి ఆత్మవిచారణ గురించి నొక్కివక్కాణిస్తున్నారు. ఈ శ్లోకాల్లో అహంకార నాశనానికి ఆత్మవిచారణ ఒకటే మార్గం లేదా పరిష్కారం అని నిశ్చయంగా చెబుతున్నారు. నాశనం అంటే మిథ్యాత్వ నిశ్చయం.అంటే అధిష్ఠానమైన ఆత్మవిచారణ చేయకుండా అహంకారం శాశ్వతంగా పోదు. అహంకారం శాశ్వతంగా పోకపోతే మోక్షం సాధ్యం కాదు. ఇక్కడ సత్యా స్థితి అంటున్నారు మోక్షాన్ని. అందువల్ల ఆత్మవిచారణ లేకుండా మోక్షం రాదు.

నాకు మోక్షం అవసరం లేదు, నాకు అహంకారం శాశ్వతంగా పోనవసరం లేదు, నేను వేదాంతం వినను అని అనవచ్చు కొందరు. ఎందుకంటే వేదాంతానికి వస్తే, శ్రవణ మనన నిదిధ్యాసనలు చేయాలి. శ్రవణంలో సాధన చతుష్టయ సంపత్తిని పెంచుకోమని వస్తుంది. అందులో మొట్టమొదటి సాధన వివేకం. రెండవది వైరాగ్యం. వైరాగ్యం పెంచుకోమని చెప్పగానే, చాలామందికి అది చాలా పెద్ద అపచారంగా తోస్తుంది. భార్యమీద, పిల్లలమీద, వస్తువులమీద వైరాగ్యం పెంచుకోమంటున్నారు. ఇదెక్కడి ఘోరమైన సాధన! మిగతా సాధనలు బాగున్నాయి. కానీ వైరాగ్యం అనేది భరించలేనిది. ఎవరికీ వైరాగ్యం అనే మాత్ర వేసుకోవటం ఇష్టం ఉండదు. నేను వైరాగ్యం పెంచుకోవాలంటే నా కసలు వేదాంతమే వద్దు అంటారు. స్వామీజీలకు సంసారం ఉండదు కాబట్టి తేలికగా చెప్పేస్తారు. కానీ పిల్లలమీద బంధం తెంచుకోవడం అంత తేలిక కాదు. బంధం అంటే ఏమిటో వారికి తెలియదని అంటారు. అందువల్ల కొంతమంది ఇలా పిల్లలమీద వైరాగ్యం పెంచుకోవాలి అంటే మాకు అసలు వేదాంతమే వద్దు అని అంటారు. వేదాంతం నేర్చుకుంటేనే అహంకారం శాశ్వతంగా పోతుంది అంటే ఏం ఫర్వాలేదు, నాకు అహంకారం చాలా ఇష్టం అంటారు.

సరే అయితే మీ ఇష్టమే కానివ్వండి, కానీ రేపు ప్రారబ్ధకర్మ మిమ్మల్ని ఒక ఊపు ఊపి, అనేక కష్టాల్లో పడవేస్తే అప్పుడు మాత్రం భగవంతుణ్ణి నిందించకండి అంటుంది శాస్త్రం. నీకు కళ్ళు లేవా, చెవులు లేవా, నేను ఇన్ని పూజలు చేశాను, ఇన్ని తీర్థయాత్రలు చేశాను, నీ భక్తుణ్ణి కదా ఇన్ని కష్టాలు పడుతుంటే నీకు జాలి లేదా అంటారు. ఆర్తత్రాణ పరాయిణుడివి అంటారు కదా, ఏమైంది నీ దయ అని దేముణ్ణి నిర్దాక్షిణ్యంగా నిందిస్తారు. అప్పుడు భగవంతుడు చెబుతాడు, నేను ఆ రోజే చెప్పాను కదా! నువ్వు అహంకారాన్ని పూర్తిగా పారద్రోలకుంటే నీకు ఈ కష్టాలు పోవు. అహంకారంలో మునిగి తేలుతున్నన్నాళ్ళు

ఈ ఎగుడు దిగుడులు తప్పవు. అప్పుడు అహంకారాన్ని పట్టుకు ప్రాకులాడావు, వేదాంతం వద్దు పొమ్మన్నావు అని అంటాడు.

మనం జీవితంలో వృద్ధాప్యానికి తగిన జాగ్రత్తలు తీసుకుంటాం. వృద్ధాప్యంలో అవస్థలు పడకుండా ఉండేందుకు అనేక ఇన్సూరెన్స్ పాలసీలు తీసుకుంటాం. ఎఫ్.డి.లు వేసుకుంటాం. డబ్బు విషయంలో జాగ్రత్త పడతాం. కానీ వృద్ధాప్యంలో మనస్సు హాయిగా, ప్రశాంతంగా ఉండటానికి ఏం జాగ్రత్తలు పడుతున్నాము? ఏ జ్ఞానం పాలసీ తీసుకుంటున్నాము అంటుంది శాస్త్రం. జ్ఞానం పాలసీ తీసుకోవడం అంటే అహంకారాన్ని నాశనం చేయటమే. ఈ అహంకారం ద్వారా పొంచి ఉన్న ప్రమాదం మనకి తెలియదు. ప్రమాదం ఎప్పుడు ముంచుకు వస్తుందో అనే బెంగ, ఆందోళన, అభద్రతాభావంతోనే జీవితమంతా సరిపోతుంది. వీటినుంచి భద్రత కావాలి అంటే ఒకటే మార్గం.

**స్వాత్మైక్యరూపా కథమస్తు నిష్ఠా** – అంటే అద్వైత ఆత్మనిష్ఠ. జీవాత్మ పరమాత్మ ఐక్యం లేదా ఐక్యజ్ఞానం. జ్ఞానం లేదా ఏకత్వం. మామూలుగా చెప్పాలంటే అద్వైతనిష్ఠ. నేను పూర్ణుణ్ణి అనే జ్ఞాననిష్ఠ. ఆ జ్ఞాననిష్ఠ లో నిలబడాలంటే ఒక బీమా పాలసీ ఉంది, ఆ పాలసీ జ్ఞానం పొందితే వస్తుంది. అది జీవితంలో అన్నీ బాగున్నప్పుడు తీసుకోవాలి. ఎల్ఐసి పాలసీలో యాక్సిడెంట్ పాలసీ ఎప్పుడు తీసుకుంటారు? యాక్సిడెంట్ జరగక ముందు, జీవితం హాయిగా సాగుతున్నప్పుడు. అలాగే ఎఫ్.డి.లు ఎప్పుడు వేసుకుంటారు? డబ్బు సమృద్ధిగా ఉండి, ఆర్థిక ఇబ్బంది లేనప్పుడు. అలాగే మనస్సు ప్రశాంతంగా ఉన్నప్పుడే, జీవితం పూలనావలా సాగుతున్నప్పుడే, ముందుగానే జ్ఞానం అనే పాలసీ తీసుకోవాలి. ఎందుకంటే జీవితం ఎప్పుడు ఏ మలుపు తిరుగుతుందో, ఎవరూ చెప్పలేరు. ఏ ప్రమాదం పొంచి ఉందో, ఏ మూలనుంచి ఏ విపత్తుమీద పడుతుందో ఎవరూ చెప్పలేరు. అందువల్ల జీవితం నందనవనంగా ఉన్నప్పుడే మిమ్మల్ని మీరు రక్షించుకోవాలి. దీన్నే విజ్ఞత అంటారు.

**శ్లోకం – 30**

**కూపే యథా గాఢజలే తథా உన్త–**
**ర్నిమజ్జ్య బుద్ధ్యా శితయా నితాన్తమ్ ।**
**ప్రాణం చ వాచం చ నియమ్య చిన్వన్**
**విన్దే న్నిజాహంకృతిమూలరూపమ్ ॥**

**ప్రతిపదార్థం:**(నర = మనిషి) యథా = ఏ విధంగా; గాఢజలే = లోతైన నీరున్న; కూపే= నూతిలో; నిమజ్జ్య = మునిగి; తత్ర = అక్కడ; (నష్టం వస్తు – పోయిన వస్తువును);

(గృహ్ణాతి = వెతికి తీస్తాడో); తథా = అలాగే; నితాంతం =చాలా; శితయా=నిశితమైన; బుద్ధ్యా = బుద్ధితో; ప్రాణం = ప్రాణాన్ని; వాచం చ = వాక్కును; నియమ్య= నియంత్రించి; చిన్వన్ = వెదుకుతూ; నిజాహంకృతిమూలరూపమ్ = తన అహంకారం పుట్టిన స్థానాన్ని; (ప్రాప్నుయాత్ = తెలుసుకోవాలి).

**తాత్పర్యం:** లోకంలో మనిషి లోతైన నీరుగల నూతిలోకి మునిగి వాక్కును, ప్రాణాన్ని స్తంభింపజేసి, నీటిలోకి పోయి అక్కడ పడిపోయిన వస్తువును ఎలా వెతికి తీస్తాడో; అలాగే సాధకుడుగూడ చాలా నిశితమైన బుద్ధితో వాక్ ప్రాణాలను నియంత్రించి హృదయంలో మునిగి వెతుకుతూ తన అహంకారం పుట్టిన స్థానాన్ని తెలుసుకోవాలి.

**వివరణ:** ఆత్మవిచారణ చేయాలంటున్నారు బాగానే ఉంది. కాని అది తేలికా, కష్టమా అని అడుగుతారు చాలామంది. కొంతమంది ఆత్మవిచారణ చేయటం చాలా కష్టం అంటారు. ముఖ్యంగా కలియుగంలో చాలా కష్టమనీ, భక్తిమార్గం ఒక్కటే చాలనీ, అది కూడా నామజపం ఒక్కటీ చేస్తే చాలనీ వాదిస్తారు. రామ రామ రామ అంటూనే ఉండండి చాలు, మోక్షం వచ్చేస్తుంది అంటారు వారు. ఇది ఒక వాదన.

ఇంకొక వాదనలో విచారమార్గం అన్నింటికన్నా తేలికైన మార్గమనీ, అది చక్కని రాజమార్గమనీ అంటారు. అమ్మో, ఇది మేథస్సుకు అందదు అని కొందరంటే రమణమహర్షి మేథస్సుకు చాలా తేలికగా అందుతుంది అంటారు.

ఈ రెండు వాదనలూ వింటే, ఇంతకీ ఆత్మవిచారణ చేయటం తేలికా, కష్టమా అని మళ్ళీ మీరు నిలదీయవచ్చు. ఎందుకంటే, వీరి వాదనలు పక్కన పెట్టండి. శాస్త్రంలోకి తొంగిచూసి, నిజానిజాలు తేల్చుకుందామా అంటే శాస్త్రం రెండువైపులా మాట్లాడుతుంది.

**ఉత్తిష్ఠత! జాగ్రత! ప్రాప్య వరాన్నిబోధత।**
**క్షురస్య ధారా నిశితా దురత్యయా దుర్గం పథస్తత్కవయో వదన్తి॥** – కఠ

ఆత్మవిచారణ చేయాలంటే బుద్ధి చాలా పదునుగా ఉండాలి. అది క్షురకుని కత్తి అంచు మీద నడిచినట్టు ఉంటుంది అంటుంది కఠోపనిషత్తు. అంటే ఆత్మవిచారణ చేయటం చాలా కష్టం అంటుంది.

**రాజవిద్యా రాజగుహ్యం పవిత్రమిదముత్తమమ్**
**ప్రత్యక్షావగమం ధర్మ్యం సుసుఖం కర్తుమవ్యయమ్** – గీత

కృష్ణపరమాత్మేమో ఈ విద్య నేర్చుకోవటం తేలిక మాత్రమే కాదు, చాలా తేలిక అంటాడు.

మళ్ళీ మన సమస్య మొదటికి వచ్చింది. ఆత్మవిచారణ చేయటం తేలికా, కష్టమా? ఇలా ఏ ప్రశ్నకన్నా జవాబు అయోమయంలో పడవేసేటట్టయినా, ఇలా భిన్న జవాబులు వచ్చే

ఆస్కారం ఉన్నా, దానికి ఒక్కటే పరిష్కారం ఉంది. ఏమిటది? దానికి జవాబు ఏదో ఒకటి నిర్ణయించే బదులు మళ్ళీ ఒకసారి ప్రశ్నకి వెళ్ళాలి. అసలు ప్రశ్నే తప్పయినా, పూర్తిగా లేకపోయినా కూడా జవాబు ఇలా అయోమయంలో పడవేసే ప్రమాదం ఉంది. ఇక్కడ ప్రశ్న తప్పు కాదు, కాని అసంపూర్ణంగా ఉంది. పూర్తి ప్రశ్న ఇలా వస్తుంది. ఫలానా వ్యక్తికి ఆత్మవిచారణ కష్టమా తేలికా అని అడగాలి. అందువల్ల ఎవరైనా మిమ్మల్ని ఆత్మవిచారణ తేలికా, కష్టమా అని అడిగితే మీరు వెంటనే జవాబు చెప్పకూడదు; తిరిగి ప్రశ్నించాలి. ఎవరి గురించి అడుగుతున్నారు ఈ ప్రశ్న?

ఎందువల్లనంటే ఈ ప్రశ్నకు సమాధానం అందరి విషయంలో ఒక్కలాగా ఉండదు. అందువల్ల కష్టమా, తేలికా అని అడిగితే ఆ వ్యక్తిని బట్టి ఉంటుంది జవాబు అంటాము. ఆత్మవిచారణ చేయాలని సంసిద్ధమైన మనస్సు ఉన్న వ్యక్తికి అది వెన్నతో పెట్టిన విద్య అవుతుంది. ఆత్మవిచారణకు సిద్ధపడని వ్యక్తికి అది చాలా కష్టం. కష్టం ఒక్కటే కాదు, అది అతనికి నచ్చదు కూడా. పైగా అతను వేదాంతంలో ఏమీ పస ఉండదు, అదే భక్తిలో చూడండి, చాలా ఆర్ద్రత ఉంటుంది అంటాడు. భక్తుడు, భక్తిలో రమిస్తే అతనికి కళ్ళనీళ్ళు తిరుగుతాయి. వేదాంతంలో అలాంటి తన్మయత్వం కనబడదు అంటాడు. (నిజానికి వేదాంతానికి వస్తే కదా, అతనికి ఆ తన్మయత్వం అంటే ఏమిటో అర్థమయ్యేది.)

అందువల్ల వేదాంతం కష్టమా, తేలికా అని అడిగితే, మీరు సంసిద్ధమైన మనస్సుతో వస్తే చాలా తేలిక అవుతుంది. అందువల్ల రమణమహర్షి ముందు మీ మనస్సును సంసిద్ధ పరుచుకోండి; దాని తర్వాత ఆత్మవిచారణకు రండి అని చెప్పదలుచుకున్నారు. కాని దురదృష్టవశాత్తూ చాలామంది రమణులవారి సలహాలో ఈ భాగాన్ని నిర్లక్ష్యం చేస్తారు. అందువల్ల వారు విచారమార్గాన్ని దశదిశలా చాటుతున్నారే కాని దానికి కావాల్సిన జ్ఞానయోగ్యతా సాధన గురించి ఎక్కడా చెప్పటం లేదు.

దానివల్ల అయోమయంలో పడిపోతున్నారు మనుష్యులు. ఆత్మవిచారణ చేయండి అన్న భాగమే తీసుకుని అంతవరకూ వారు చేస్తూ వస్తున్న సాధనలైన పూజ, జపం, కర్మలను వదిలివేస్తున్నారు. ఒక ఏకాంత ప్రదేశంలో కూర్చుని 'నేనెవరు?' అనే అంశంమీద జపం చేయసాగారు. అలా నిశ్శబ్దంగా కూర్చుని నేనెవరు అని పదేపదే మనస్సును ప్రశ్నించుకుంటే జవాబు రాదు సరికదా, నిద్ర ముంచుకు రావచ్చు లేదా తలనొప్పి రావచ్చు. ఇంకా మాట్లాడితే పిచ్చెక్కుతుంది. ఇక్కడ ఈ ధ్యానాన్ని మనం కించపరచటం లేదు కాని ఆత్మవిచారణ చేసే మార్గం ఇది కాదంటున్నాము అంతే. ఎందుకంటే మీరు నేనెవరు అని మనస్సును ప్రశ్నిస్తే మనస్సుకు తెలిసిన దానినుంచే జవాబు ఇవ్వగలదు కాని తనకు తెలియని దాని గురించి ఎలా జవాబు చెప్పగలదు?

అందువల్ల ఇప్పుడు పెద్ద సమస్యలో పడిపోతున్నాము మనం. కొంతమంది ఆత్మజ్ఞానం పొందాలంటే ఆత్మవిచారణ చేయాలని చెబుతున్నారు కాని ఆత్మవిచారణ చేయటానికి జ్ఞానయోగ్యతాప్రాప్తిని పొందాలనే విషయాన్ని పక్కన పెట్టేస్తున్నారు. జ్ఞానయోగ్యత పొందాలంటే అధికారి అవాలి. అధికారి ఎప్పుడవుతాడు? సాధన చతుష్టయ సంపత్తి పొందితేనే అవుతాడు.

సాధన చతుష్టయ సంపత్తి అంటే వివేకం, వైరాగ్యం, శమాదిషట్క సంపత్తి, ముముక్షుత్వం ఉండాలి. మళ్ళీ అందులో ఏదో ఒకటి ఉంటే చాలు, తక్కినవి అవసరం లేదని భ్రమ పడకూడదు. నాలుగూ అవసరమే. నాలుగింటిలోనూ మూడవది ఇంకా కొంచెం ఎక్కువ అవసరం. అది శమాదిషట్క సంపత్తి. ఇందులో ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం వస్తాయి.

బాహ్యంగా పరుగులు తీసే మనస్సును వెనక్కి లాగి అంతర్ముఖం చేయాలి. వేదాంతం నేర్చుకోవాలంటే కాసేపు మీకున్న అనుబంధాలను తీసి పక్కన పెట్టాలి. తండ్రిగా వేదాంత విచారణ చేయటం మొదలుపెడితే, ఆత్మవిచారణ కాస్తా పుత్రవిచారణ అయికూర్చుంటుంది. అలాగే భర్తగా విచారణ మొదలుపెడితే అది భార్యవిచారణ అయికూర్చుంటుంది. వేదాంతం చెప్పేదేదీ తలకెక్కదు. అందువల్ల కాసేపు ఈ బంధాలను పక్కన పెట్టాలి. నిజానికి మీరు వేసే ఈ పాత్రలనుంచి మరణించాలి. అంటే మానసికంగా సన్న్యాసం స్వీకరించాలి.

సన్న్యాసం పొంది వేదాంతశ్రవణం చేయాలని శాస్త్రవిధి. అలా అనగానే రేపీపాటికి మీరందరూ కాషాయ వస్త్రధారులయిపోనవసరం లేదు. బాహ్యంగా గృహస్థుగానే ఉంటారు కాని ఆంతరంగా సన్న్యాసభావనలో ఉంటారు. సన్న్యాసభావన అంటే నేను, నావారు అనే అహంకార, మమకారాలను పారద్రోలి వేదాంతం నేర్చుకుని చూడండి; మీకే బోలెడు వ్యత్యాసం తెలుస్తుంది.

అలా ఆంతర సన్న్యాసం స్వీకరించటాన్నే శాస్త్రం శమాదిషట్క సంపత్తి అంటుంది. ఈ శమాదిషట్క సంపత్తినంతటినీ కలిపి రమణమహర్షి ఇంద్రియనిగ్రహం అంటున్నారు. ఇంద్రియాలను బాహ్యవస్తువులనుంచి వెనక్కి లాక్కోవాలి.

**పరాంచి ఖాని వ్యతృణత్ స్వయంభూః తస్మాత్ పరాఙ్ పశ్యతి నాంతరాత్మన్** – కఠ

ఇంద్రియాలను బాహ్యవస్తువులు చూసేలాగా భగవంతుడే ఏర్పాటు చేశాడు. అందువల్ల అవి బాహ్యంగానే చూస్తాయి కాని అంతర్ముఖం అవవు అని కఠోపనిషత్తులో వస్తుంది. కాని వాటి వెన్నంటే మనిషికి బుద్ధి కూడా ఇచ్చాడు. అందువల్ల బుద్ధిని ఉపయోగించి జ్ఞానేంద్రియాలను, కర్మేంద్రియాలను, ప్రాణాలను, మనస్సును అంతర్ముఖం చేయాలి. అంటే

సూక్ష్మశరీరంలో ఉన్న పంతొమ్మిది అంగాలను వెనక్కి లాక్కోవాలి. అలా వాటిని వెనక్కి లాక్కున్నాక విచారణ చేస్తే జ్ఞానం పొందుతారు.

ఈ భావనను అందజేయటానికి రమణులవారు ఒక అద్భుతమైన ఉదాహరణను ఇస్తున్నారు. పూర్వం పల్లెటూర్లలో లోతైన బావులు ఉండేవి. వాటినిండా నీరు కూడా బాగా ఉండేది. ఇప్పటి కాలానికి ఈ బావులంటే తెలియవు. ఎక్కడన్నా ఒకటీ, అరా బావులున్నా కూడా వాటిలో నీరు ఇంకిపోయి ఉంటుంది. ఇప్పుడు వెల్ పోయి బోర్‌వెల్ వచ్చింది. దానిలో నీరు ఉన్నట్టు తెలియదు. ఆ విషయం పక్కన పెడితే ఒకసారి పూర్వకాలపు బావుల విషయం చూద్దాము. పూర్వం ఆ లోతైన బావుల్లోంచి నీరు తోడి తీసుకుని పనులకు వాడుకునేవారు. దానికోసం ఒక చిన్న ఇనుప బక్కెట్టుకు ఒక పురికొస తాడు కట్టి నీళ్ళు తోడుకునేవారు.

ఆ తాడు బాగా తడిసి, తడిసీ ఎప్పుడో చటుక్కున బక్కెట్టు దానినుంచి ఊడిపోయి బావిలో పడిపోయేది. ఏదైనా పొడుగైన కర్ర తెచ్చి బక్కెట్టును దానితో పట్టుకుని పైకి లాగటానికి ప్రయత్నించేవారు కాని అది సాధ్యమయ్యేది కాదు. ఇంక వారి ప్రయత్నాలన్నీ విఫలమయ్యాక బావిలో దిగగలిగే సామర్థ్యం ఉన్న వ్యక్తిని పిలుచుకువచ్చేవారు. ఆ బక్కెట్టు పైనుంచి కనబడదు. అందువల్ల ఆ బక్కెట్టు బావిలో ఏ భాగంలో ఉందో తెలియదు. అందువల్ల అతను నోటికి, ముక్కుకు అడ్డంగా గుడ్డ కట్టుకుని, బావిలోకి దిగుతాడు. ఎలాగైతేనేం బక్కెట్టును వెతికిపట్టుకుని, పైకి తీసుకువస్తాడు.

అతను నీటిలోకి దిగినప్పుడు ప్రాణనిరోధం చేస్తాడు, వాక్ నిరోధం చేస్తాడు. అల్లకల్లోలంగా ఉన్న మనస్సును ప్రశాంతంగా చేయాలంటే ప్రాణనిరోధం, వాక్‌నిరోధం మంచి సాధనలు. ప్రాణనిరోధం అంటే ప్రాణాయామం సాధన చేయటం. ప్రాణాయామం మనస్సుకు ప్రశాంతత చేకూర్చే అద్భుత సాధన. వాక్‌నిరోధం మరొక అద్భుత సాధన. వాక్ అంటే నోరు. నోరు అన్నప్పుడల్లా రెండు నోర్లూ వస్తాయి. రెండు నోర్లు అంటే అతనికి రెండు నాలుకలు ఉన్నాయని కొంతమందిని విమర్శిస్తాము; అది కాదు ఇక్కడ అర్థం. రెండు నోర్లు అంటే తినే నోరు, మాట్లాడే నోరు. తినే నోరును అదుపులో పెడితే వాటంతట అవే తక్కిన జ్ఞానేంద్రియాలు అదుపులోకి వస్తాయి. అలాగే మాట్లాడే నోరును నియంత్రించుకుంటే తక్కిన కర్మేంద్రియాలన్నీ అదుపులోకి వస్తాయి.

వేదాంతాన్ని అధ్యయనం చేసే శిష్యుడు ప్రాణనిరోధం, వాక్‌నిరోధం రెండూ చేయాలి. బావిలో దిగిన వ్యక్తి ఉదాహరణను దీనికి గుర్తుంచుకోవాలి. అంటే శిష్యుడు నిజంగా బావిలోకి దిగనవసరం లేదు. ఉదాహరణను ఎంతమేరకు తీసుకోవాలో అంతమేరకే

తీసుకోవాలి. అక్కడ బావిలో అతను నోరు తెరిస్తే నీరు లోపలికి వెళ్ళిపోతుంది. బావి అంటే బావే అవసరం లేదు. ఏ కొలనో, సరస్సో కూడా తీసుకోవచ్చు. రమణమహర్షి బావి అంటున్నారు.

**గాఢ జలే కూపే –** గాఢ జలే అంటే బాగా లోతైన నీరు గల; కూపే అంటే బావి. గాఢ జలే అని ప్రత్యేకించి ఎందుకు చెబుతున్నారు రమణమహర్షి. ఎందుకంటే అతను ఊపిరి బిగబట్టాల్సింది అరక్షణం కాదు, చాలా ఎక్కువ సేపే ఉంటుంది. వేదాంతంలో కూడా విద్య నేర్చుకోవాలంటే చాలా కాలమే పడుతుంది.

**నిమజ్జ్య –** మునిగి. నీళ్ళలో బాగా కిందకు వెళ్ళి అని ఆగారు రమణమహర్షి. తక్కినదంతా మనం కలుపుకోవాలి. నీళ్ళలోకి బాగా లోపలికి వెళ్ళి, అందులో పడిపోయిన బక్కెట్టును తీసుకుని వస్తాడు.

**యథా తథా–** అతనెలా చేస్తాడో, అదే విధంగా వేదాంత సాధకుడు,

**ప్రాణం చ వాచం చ నియమ్య –** ఇంతవరకే ఉదాహరణలోంచి తీసుకోవాలని చూశాము. సాధకుడు వేదాంతం అధ్యయనం చేసేటప్పుడు ప్రాణాయామం నేర్చుకోవాలి. దాన్ని గీతలో నాలుగవ అధ్యాయంలో వివరంగా చూస్తాము. వాచిక తపస్సును గీతలోనే పదిహేడవ అధ్యాయంలో వివరంగా చూస్తాము.

**అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియహితం చ యత్ ।**
**స్వాధ్యాయాభ్యసనం చైవ వాఙ్మయమ్ తప ఉచ్యతే ॥** – గీత

**వాచం నియమ్య –** ఆ విధంగా శాస్త్రంలో చెప్పినట్టుగా వాచిక తపస్సు చేయాలి. ఎలా చేయాలి?

**నితాన్తమ్ –** పూర్తిగా నియంత్రించుకోవాలి. అంటే ఆషామాషీగా కుదరదు. ఇలా అన్ని ఇంద్రియాలనూ నియంత్రించాలి.

ఇంద్రియాలను నియంత్రించాలంటే కర్మయోగం వస్తుంది, ఉపాసనయోగం వస్తుంది. కర్మయోగం, ఉపాసనయోగం వల్ల జ్ఞానయోగ్యతాప్రాప్తి కలుగుతుంది.

దీన్నిబట్టి రమణమహర్షి కూడా ఆత్మవిచారణకి వెంటనే వచ్చేయకండి. ఆత్మవిచారణకు దగ్గర దారులు లేవు, ముందు సాధన చతుష్టయ సంపత్తిని పొందాలనే చెబుతున్నారు అని అర్థమవుతున్నది. ఆత్మజ్ఞానం పొందమని అందరికీ తేలికగా చెప్పేయకూడదు.

**న బుద్ధిభేదం జనయేత్ –** గీత

ఆత్మజ్ఞానం అంటే అందరికీ ధారాళంగా పంచేసే ఆధ్యాత్మిక సాధన కాదు. దానిముందు చాలా సాధన చేయాల్సి ఉంటుంది. కర్మయోగం పాటించాలి; పంచమహాయజ్ఞాలు చేయాలి; అనేక పూజలు చేయాలి; జపాలు చేయాలి; అష్టాంగయోగం పాటించాలి. అనేక ఈశ్వర ధ్యానాలు చేయాలి. అందువల్ల అందరికీ ముందే వేదాంతం గురించి చెప్పేయకూడదు అంటుంది శాస్త్రం. ముందు చిత్తఏకాగ్రత అలవడాలి.

పతంజలి అష్టాంగయోగంలో ధ్యానం గురించి ముందే చెప్పలేదు. ఎనిమిది దశల్లో ధ్యానం ఏడవ దశ. ముందు యమనియమాలు పాటించాలి. అది కర్మయోగం. దాని తరువాత ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార దశలు వస్తాయి. అవి ఉపాసనకు తోడ్పడతాయి. వాటి తర్వాతే ధారణ, ధ్యానం, సమాధి గురించి వస్తుంది. కాని వచ్చిన చిక్కేమిటంటే చాలామంది యమనియమాల గురించి నేర్చుకోరు, పాటించరు. అలాగే ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార సాధనలు చేయరు. సరాసరి ధ్యానానికి వచ్చేస్తారు. నేనెవరు? ఈ ధ్యానంలో కూర్చుంటాం అంటారు. అది ఎంత పొరపాటు? ఆత్మజ్ఞానం పొందాలంటే నేనెవరు అని ధ్యానంలో కూర్చుంటే ఆత్మజ్ఞానం వచ్చేస్తుందని రమణమహర్షి బోధించలేదు.

అలా ఎలా చెప్పగలరు? రమణమహర్షే ఇక్కడ స్పష్టంగా చెబుతున్నారు. ప్రాణం చ వాచం చ అంటే ప్రాణ నియంత్రణ, వాక్ నియంత్రణ చేయాలని అన్నారు. ఈ రెండూ చేయాలంటే సాధన చతుష్టయ సంపత్తిని పొందితీరాలని ప్రత్యేకించి చెబుతున్నారు. అలా సంసిద్ధమైన మనస్సును పొందాక అక్కడితో ఆగకూడదు. సమాధిలో కూర్చుంటే జ్ఞానం కలగదు.

**చిన్వన్** – చిన్వన్ అంటే వెదుకు. ఇక్కడ విచారణ చేయాలని అర్థం. దేని విచారణ? ఆత్మవిచారణ అని మనం కలుపుకోవాలి. ఈ ఆత్మవిచారణ ఏ పరికరంతో చేయాలి? చాలా పదునైన బుద్ధితో చేయాలి. దానికి సాధనలు చేయాలి. వేదాంత శ్రవణ, మననాలు చేయాలి. శ్రవణం ఒక క్రమపద్ధతిలో చేయాలి. వేదాంత అధ్యయనం చేసేటప్పుడు అనేక సందేహాలు కలుగుతాయి. ఆ సందేహాలు తీరాలంటే తార్కికబుద్ధి ఉండాలి.

**దృశ్యతే త్వగ్ర్యయా బుద్ధ్యా సూక్ష్మయా సూక్ష్మదర్శిభిః** – కఠ

క్షురకుని కత్తి అంత పదునుగా ఉండాలి బుద్ధి అంటుంది కఠోపనిషత్తు.

అందువల్ల రమణమహర్షి చాలా స్పష్టంగా చెబుతారు – బుద్ధికి అతీతంగా ఎదిగితే జ్ఞానం రాదు, బుద్ధిని అణగద్రొక్కితేనూ జ్ఞానం రాదు. వేదాంత విచారణ చేయాలంటే బుద్ధి ఉండితీరాలి. దానికి బుద్ధిని ఉపయోగించాలి. ఎవరు అంటున్నారు? సాక్షాత్తూ రమణమహర్షే!

**బుద్ధ్యా** – బుద్ధిని ఉపయోగించాలి. అది కూడా ఎలాంటి బుద్ధి?

**శితయా** – శితయా బుద్ధ్యా అంటున్నారు. శితయా అంటే తీక్షణమైన అని అర్థం. అంటే తీక్షణమైన లేదా పదునైన బుద్ధితో విచారణ చేయాలి; ఆత్మవిచారణ చేయాలి. ఆ విచారణ దేనికి దారితీస్తుంది.

**అహంకృతి మూలరూపమ్** – అహంకృతి మూలం ఏమిటో తెలుస్తుంది. మిథ్యా అహంకారంయొక్క అధిష్ఠానం ఆత్మ. అధిష్ఠానం అంటే మూలం. ఎటువంటి అధిష్ఠానం? మిథ్యా అధిష్ఠానం అనకూడదు. ఆత్మ మిథ్యా అహంకారానికి సత్య అధిష్ఠానం. ఎవరి అహంకారం?

**నిజ (అహంకృతి)** – మీయొక్క అహంకారం. మీ అహంకారంయొక్క మూలరూపాన్ని విచారణ చేస్తారు. ఎవరిదో కాదు. మీ అహంకారాన్ని మీరు విచారణ చేస్తే చాలు. సమస్య తీరుతుంది.

**విందేత్** – పొందాలి. మీ అహంకారానికి అధిష్ఠానమైన ఆత్మజ్ఞానాన్ని పొందాలి.

రమణమహర్షి ఆత్మవిచారణ చేయాలి అంటున్నారు. కాని ఈ ఆత్మవిచారణ ఎలా చేయాలో చెప్పటం లేదు. శితయా బుద్ధ్యా అన్నారు అంతే. అంటే పదునైన బుద్ధితో పొందాలి అన్నారు. కాని పదునైన బుద్ధితో ఆత్మవిచారణ ఎలా చేయాలో స్పష్టంగా చెప్పలేదు. నిశ్శబ్దంగా ఉండిపోయారు. అందువల్ల అది పొరపాటుకి దారి తీసింది. ఏమిటా పొరపాటు?

మనం ఒకచోట ఆసనంలో కూర్చుని, కళ్ళు గట్టిగా మూసుకుని, అహంకారం ఎక్కడినుంచి వచ్చింది, అహంకారం ఎక్కడినుంచి వచ్చింది అని ప్రశ్నించుకుంటూ పోవాలి అంటారు వారు. అలా ప్రశ్నిస్తే జవాబు వస్తుందా? రాదు. ఒకవ్యక్తి స్వామీజీ దగ్గరికి వచ్చి ఇలా అన్నారుట, 'స్వామీజీ! నేను సమాధిలో కూర్చుని, ఒకటి కాదు, రెండు కాదు, పన్నెండు సంవత్సరాలు నేనెవరు అనే ప్రశ్నను వేసుకుంటూనే వస్తున్నాను కాని నాకు జవాబు దొరకనే లేదు. నేను సాధించగలిగినదల్లా మనస్సును శూన్యంగా చేయగలిగాను. దాని తర్వాత ఏంచేయాలో తెలియటం లేదు. మీరు ఏదైనా చెప్పండి స్వామీజీ!'

నిజానికి జరిగేదంతే! మీరు కళ్ళు మూసుకుని 'నేనెవరు?' అని ప్రశ్నించుకుంటూ కూర్చుంటే నిద్రలోకి జారుకోవటమో, మహా అయితే ఆలోచనలు లేకుండా మనస్సును శూన్యంగా చేసుకోవటమో చేయగలరు కాని అంతకు మించి ముందుకు పోలేరు. అందువల్లనే దాని తర్వాత ఏం చేయాలో మీరు చెప్పండి స్వామీజీ అని అడిగిన వ్యక్తికి రేపట్నుంచి

వేదాంత బోధకు రమ్మని చెప్పారుట స్వామీజీ. ఏం చేయాలో తెలియలేదు అంటే ఏం చేయాలో రమణమహర్షి చెప్పలేదు కాబట్టి, తెలియలేదు.

రమణమహర్షి సూచనప్రాయంగా చెప్పి వదిలేసిన ఈ ఖాళీని భర్తీ చేయాలి. ఆ విషయం తెలియక, రమణమహర్షి ధ్యానం చేయమన్నారని సూచిస్తారు కొందరు మనుష్యులు.

ఆత్మవిచారణ చేయాలని రమణమహర్షి అంటే భగవద్గీతకు వెళితే దాని అర్థం తెలుస్తుంది.

**తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా ।**

**ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానినస్తత్త్వదర్శినః ॥** – గీత 4.34

గురువు దగ్గరకు వెళ్ళి, ప్రశ్నలు అడిగితే జ్ఞానబోధ చేస్తాడు గురువు అంటున్నాడు కృష్ణపరమాత్మ. అందువల్ల బుద్ధిగా, లక్షణంగా గురువు దగ్గరకు వెళ్ళాలి.

**తద్విజ్ఞానార్థం స గురుమేవాభిగచ్ఛేత్** – ముండకమ్

ఇంచుమించు ప్రతి ఉపనిషత్తు కూడా జ్ఞానాన్ని గురువు ద్వారానే పొందాలని నొక్కి వక్కాణిస్తుంది. గురువు దగ్గరికి వెళితే ఆ గురువేం చేస్తాడు?

ఆ గురువు గనుక సాంప్రదాయ గురువు అయితే, శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ గురువు అయితే,

**ఆత్మా వా అరే ద్రష్టవ్యః శ్రోతవ్యో మంతవ్యో నిదిధ్యాసితవ్యః** – బృహదారణ్యకమ్

శ్రవణం, మననం, నిదిధ్యాసనం చేస్తేనే ఆత్మజ్ఞానం పొందగలవు; వేరే దగ్గర దారి ఏమీ లేదని బోధిస్తాడు. గురుపరంపరలో వస్తున్న గురువు మాత్రమే ఆత్మదర్శనానికి వేరే మార్గం లేదని బోధిస్తాడు. శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేసితీరాలని చెబుతాడు. అంతేకాదు, ఈ మూడు కూడా ఇదే వరుసక్రమంలో చేయాలి. అంటే ముందు శ్రవణం చేయాలి. శ్రవణం చేయాలంటే వినాలి. వినాలి అంటే ఎవరో చెప్పాలి. అంటే గురువు బోధ చేయాలి, శిష్యుడు నేర్చుకోవాలి.

కృష్ణపరమాత్మ చేసిందదే! అర్జునుడు నేను నీ శిష్యుణ్ణి, నాకు శ్రేయస్కరమైనదేమిటో చెప్పు అంటే కృష్ణపరమాత్మ ఒక క్రమపద్ధతిలో బోధ చేశాడు. అంతేకాని, కృష్ణపరమాత్మ అతని వీపు కిందభాగాన్ని ముట్టుకుని కుండలిని లేపలేదు; లేదా తలమీద చేయి వేసి స్పర్శ ద్వారా జ్ఞానాన్ని పంపలేదు. చక్కగా రెండవ అధ్యాయంలో 11వ శ్లోకంతో తన బోధను మొదలుపెట్టాడు.

**అశోచ్యానన్వశోచస్త్వం ప్రజ్ఞావాదాంశ్చ భాషసే**

అక్కడనుంచీ ఒక క్రమపద్ధతిలో కర్మయోగం గురించీ, ఉపాసనాయోగం గురించీ, జ్ఞానయోగం గురించీ చెప్పుకొచ్చాడు. ఈ బోధ మధ్యలో అర్జునునికి అనేక సందేహాలు కమ్ముకొచ్చాయి. కృష్ణపరమాత్మ అన్నిటికీ ఓపికగా జవాబులు చెప్పుకొచ్చాడు.

**నష్టో మోహః స్మృతిర్లబ్ధా త్వత్ప్రసాదాన్మయాచ్యుత** – గీత 18.73

నాకు నా మోహం తొలిగిపోయింది; నాకు జ్ఞానం కలిగింది అని చెప్పేదాకా బోధిస్తూనే ఉన్నాడు. శ్రవణం అంటే ఊరికే వినటం కాదు. శ్రవణం నిర్వచనమే ఒక క్రమపద్ధతిలో క్రమం తప్పకుండా కొన్ని సంవత్సరాలపాటు ఒక సమర్థవంతమైన గురువు వద్ద శాస్త్ర అధ్యయనం చేయటం. ఆధ్యాత్మిక చింతన ఉన్న సాధకునికి ఆత్మజ్ఞానం పొందటానికి దగ్గరదారులు లేవు.

రమణమహర్షి ఉదాహరణ చెప్పకూడదు. రమణమహర్షి సామాన్య సూత్రానికి మినహాయింపు. ప్రతి సామాన్య సూత్రానికి ఒక మినహాయింపు ఉంటుంది. మనం సూత్రం గురించి చెప్పేటప్పుడు మినహాయింపును తీసుకోకూడదు. ప్రతి రంగంలోనూ అసాధారణ వ్యక్తులు ఉంటారు. సంగీతంలోనైనా, మాథమాటిక్స్‌లోనైనా, గురువు దగ్గర నేర్చుకోకుండానే ఆయా రంగాలలో నిష్ణాతులు ఉన్నారు. అలాంటివారిని ఆరాధించాలి, మెచ్చుకోవాలి కాని వారిని ఉదాహరణగా తీసుకోకూడదు. నేను కూడా అలాంటి అసాధారణ వ్యక్తి అయితే అంతకు మించిన భాగ్యం ఏముంది? కాని దురదృష్టవశాత్తూ చాలామందిమి, నాతో సహా, ఇలాంటి అసాధారణ వ్యక్తులం కాలేము. కాని ఇలా గురువు ద్వారానే నేర్చుకోవాలని రమణమహర్షి నోరు విప్పి చెప్పలేదు; అలాగని గురుశాస్త్ర ఉపదేశాన్ని ఖండించనూలేదు. అందువల్ల మనం ఆ ఖాళీని భర్తీ చేసుకుని, రమణమహర్షి ఆత్మవిచారణ చేయాలని చెప్పిన చోట గురుశాస్త్ర ఉపదేశ సహాయేన ఆత్మవిచారః అని కలుపుకోవాలి.

గురుశాస్త్ర ఉపదేశం కలుపుకోకపోతే అది సాంప్రదాయపద్ధతిలోకి రాదు. కలిపితే గురు పరంపర సాంప్రదాయంలోకి వస్తుంది. మనం ఈ గురుపరంపరలోకి వస్తాము కాబట్టి గురుశాస్త్ర ఉపదేశ సహాయేన కలుపుకుంటాము ఆత్మవిచారః ముందు.

**శ్లోకం – 31**

**మౌనేన మజ్జన్మనసా స్వమూల–**
**చర్చైవ సత్యాత్మవిచారణం స్యాత్।**
**ఏషోఽ హమేతన్న మమ స్వరూప–**
**మితి ప్రమా సత్యవిచారణాంగమ్॥**

**ప్రతిపదార్థం:** మౌనేన = మౌనంతో; మజ్జన్మనసా = లోపలకు చొచ్చుకు పోయే మనస్సుతో; స్వమూల చర్చా = మూలం స్వరూప చర్చ; సత్యాత్మవిచారణం = సత్యమైన ఆత్మవిచారణం; స్యాత్ = అవుతుంది; ఏషోఽహమ్ = ద్రష్ట; ఏతత్ = ఈ శరీరం; మమ= నాయొక్క; స్వరూపం = స్వరూపం; న = కాదు; ఇతి = అను; ప్రమా = యథార్థమైన, అనుభవమైన; సత్యవిచారణాంగం = ఆత్మవిచారణకు చక్కని ఉపాయమైన అంగం; భవతి= అవుతుంది.

**తాత్పర్యం:** ఆత్మకు భిన్నమైన దాని గురించి ఆలోచించకుండా గాఢంగా లోపలికి చొచ్చుకుని పోయే మనస్సుతో చేసే ఆత్మస్వరూప చర్చే సత్యమైన ఆత్మవిచారణ అవుతుంది. శాస్త్రీయబుద్ధే సత్యాత్మ విచారణకు అంగమౌతుంది.

**వివరణ:** ఇంతవరకూ రమణమహర్షి అహంకార స్వరూపాన్ని వివరించారు. అహంకారం, కొన్ని ఆత్మలక్షణాలనూ, మరికొన్ని అనాత్మలక్షణాలనూ పుణికిపుచ్చుకుందని చూశాము. ఇప్పుడు రాబోయే శ్లోకాల్లో మోక్షం పొందాలంటే ఈ అహంకారాన్ని పారద్రోలాలని చూపించబోతున్నారు.

ఈ మిథ్యా అహంకారం రాజ్యమేలుతున్నంతవరకూ, మిథ్యాప్రపంచంలో మునిగి తేలుతూ ఉంటారు. దానికే స్వతంత్రంగా ఉనికి లేనిది మీకెలా భద్రతను ఇస్తుంది? అందువల్ల అహంకారాన్ని పారద్రోలి తీరాలి. అహంకారాన్ని పారద్రోలాలంటే, మిథ్యా అహంకారానికి సత్య అధిష్ఠానమేమిటో తెలుసుకోవాలి. సత్య అధిష్ఠానాన్ని ఆత్మ అంటారు. అందువల్ల ఆత్మవిచారణ చేసి, ఆత్మ అంటే ఏమిటో తెలుసుకోవటం ఒక్కటే దీనికి పరిష్కారం. వేదాంతంలో ఆత్మవిచారణ అని దేనినైతే అంటారో, దాన్ని రమణమహర్షి అహంకార మూలవిచారణ అంటున్నారు. జాగ్రత్తగా గమనించండి, అహంకార విచారణ కాదు, అహంకార మూలవిచారణ చేయాలంటున్నారు.

అహంకార మూలవిచారణ అంటే అహంకారానికి ఆధారం ఏమిటో తెలుసుకోవాలి. ఆ ఆధారాన్నే అధిష్ఠానం అంటారు. ముందే చూసినట్టుగా రమణమహర్షి ఆత్మవిచారణ చేయాలన్నారే కాని ఎలా చేయాలో చెప్పలేదు. ఆయన చెప్పకుండా వదిలేసిన ఈ ఖాళీని మనం వేదాంతంనుంచి అరువు తెచ్చుకుని పూరించాలి. వేదాంతం ఆత్మవిచారణ స్వంతంగా చేయకూడదు అంటుంది.

ఒకసారి మీరే ఆలోచించండి! మీరు స్వంతంగా ఆత్మవిచారణ చేయలేరు కూడా! ఎందుకు? మీ మనస్సుకు ఆత్మ అంటే ఏమిటో తెలియదు. మీ మనస్సు అజ్ఞానంలో కూరుకుపోయింది. అలాంటప్పుడు అజ్ఞానంలో కూరుకుపోయిన మనస్సును నేనెవరు అని ప్రశ్నిస్తే ఆ మనస్సు మాత్రం ఏం జవాబు చెప్పగలదు? అజ్ఞానంలో ఉన్న నేను, ప్రశ్న అడగాలంటే ఎవరిని

అడగాలి? జ్ఞానం ఉన్న వ్యక్తిని అడగాలి. దాని బదులు అజ్ఞానంలో ఉన్న మనస్సును అడిగితే, మనస్సు దానికి ఉన్న పొరపాటు భావననే అందిస్తుంది. మహా అయితే, ఆలోచనలు లేకుండా శూన్యంగా మారుతుంది, అంతేగాని మీకు సరియైన సమాధానాన్ని ఇవ్వలేదు.

అందువల్ల శంకరాచార్యులవారు తన గీతాభాష్యంలో ఒక తిరుగులేని వాక్యం చెప్పారు. ఎవరూ స్వంతంగా ఆత్మవిచారణ చేయకూడదు, బాహ్యంగా ఒక ప్రమాణాన్ని తీసుకోవాలి అన్నారు. కంటికి కనబడని సూక్ష్మక్రిములను మైక్రోస్కోప్‌లో చూస్తాము; కనుచూపుమేరలో లేకుండా, సుదూరంగా ఉన్న నక్షత్రాలను తెలుసుకోవటానికి టెలిస్కోప్ వాడతాము. అంటే ఇటు సూక్ష్మమైన క్రిములను కాని, అటు విశ్వంలో ఉన్న నక్షత్రాలను చూడటానికి కాని, కన్నుకు తోడుగా ఇంకొక పరికరాన్ని వాడినట్టు, కంటికి కనబడని ఆత్మ గురించి తెలుసుకోవటానికి కూడా ఇంకొక పరికరం కావాలి.

### శాస్త్ర ఆచార్య ఉపదేశ శమదమాదిభిః సంస్కృతం మనః ఆత్మజ్ఞానే కరణమ్

ఆత్మవిచారణ చేయాలంటే మనస్సు సంస్కరించబడి ఉండాలి. అలా సంస్కృత మనస్సుతో శాస్త్రాన్ని ఆచార్యబోధ ద్వారా నేర్చుకోవాలి. అంటే స్వంతంగా మీ మనస్సుతో చేయకూడదు. బాహ్యంగా రెండు కరణాలు ఉపయోగించాలి. అవి – ఒకటి శాస్త్రం, రెండు ఆచార్యుడు. ఆచార్యుడు శాస్త్రాన్ని ఉపదేశించాలి. ఆచార్యుడు ఉంటే చాలదు, ఆయన బోధ చేయాలి. మౌనంగా ఉంటే కుదరదు. మౌనవ్యాఖ్యానం చేస్తారు అనేది ఇంకొక పొరపాటు.

నక్షత్రాలను చూడటానికి టెలిస్కోప్ వాడాలన్నారు కదా అని పక్కన పెట్టుకుని, అందులోంచి మీ కంటితో మీరు చూడకపోతే లాభంలేదు. అలాగే మైక్రోస్కోప్‌లోంచి, మీ కంటితో మీరు చూడకపోతే సూక్ష్మక్రిములని చూడలేరు. అంటే ఇటు టెలిస్కోప్‌నూ, మైక్రోస్కోప్‌నూ వాడాలి; వీటితో పాటు మీ కన్నునూ వాడాలి. రెండూ ఒకదానిమీద ఒకటి ఆధారపడి ఉన్నాయి. ఒకటి లేనిదే ఇంకోదానికి ఉపయోగం లేదు.

ఇదే సూత్రం ఆత్మవిచారణకు కూడా వర్తిస్తుంది. శాస్త్ర ఆచార్య ఉపదేశం మాత్రం ఉంటే సరిపోదు, మీ మనస్సును కూడా దానిమీద కేంద్రీకరించాలి. కేవలం మనస్సును వాడినా లాభంలేదు; కేవలం శాస్త్ర ఆచార్య ఉపదేశం ఉన్నా లాభంలేదు. శాస్త్ర ఆచార్య ఉపదేశాన్ని మనస్సు ద్వారా నేర్చుకోవాలి. రెండూ ఒకదానితో ఒకటి పెనవేసుకుని ఉంటాయి. ఈ బాహ్యపరికరాన్ని సద్దర్శనంలోని 44 శ్లోకాల్లో ఎక్కడా పేర్కొనలేదు రమణమహర్షి. ఎక్కడా శాస్త్ర ఆచార్య ఉపదేశం అనే మాటను ఇంత ప్రత్యక్షంగా వాడలేదు.

ఇంత ప్రత్యక్షంగా వాడకపోవటంవల్ల ఇది అనవసరంగా, పొరపాటుకి దారితీసింది. కొంతమంది ఆత్మవిచారణ అంటే కళ్ళు మూసుకుని 'నేనెవరు, నేనెవరు?' అని విచారణ

చేస్తే చాలు, ఆత్మజ్ఞానం వస్తుందనే పొరపాటులో పడ్డారు. అలా కళ్ళు మూసుకుని ప్రశ్నిస్తే సరియైన జవాబు రాదు. మనస్సు శూన్యం అవవచ్చు అంతే.

అందువల్ల రమణమహర్షి ఆత్మవిచారణ చేయమని చెప్పిన ప్రతి శ్లోకంలోనూ మనం ఇలా కలుపుకోవాలి. **శాస్త్ర ఆచార్య ఉపదేశ సహిత ఆత్మవిచారః**

ఆత్మవిచారః పదం కూడా ప్రత్యక్షంగా వాడలేదు. ఒక్కొక్క శ్లోకంలో దాని అర్థం వచ్చేలా ఒక్కొక్క పదం వాడారు.

| | |
|---|---|
| అహమః శోధయ | – శ్లోకం 25 |
| స్వవిచారకాలే | – శ్లోకం 27 |
| తన్మార్గణమ్ | – శ్లోకం 28 |
| చిన్వన్ | – శ్లోకం 30 |
| స్వమూల చర్చా | – శ్లోకం 31 |
| గవేషణమ్ | – శ్లోకాలు 29,32 |
| భూయః విచారః | – శ్లోకం 34 |

ఈ పదాలన్నింటి అర్థం ఒకటే. ఆత్మవిచారణ చేయాలని అర్థం. అది కూడా ఎలా చేయాలి? వీటిల్లో ఏ పదం వచ్చినా విసుక్కోకుండా శాస్త్ర ఆచార్య ఉపదేశసహిత ఆత్మవిచారః అని మనం కలుపుకోవాలి. ఎందుకంటే ఈ భాగం కలపకపోవటంవల్ల దురదృష్టవశాత్తూ చాలామంది ఈ మధ్యదశను వదిలేస్తారు. ధ్యానంలో నేనెవరో తెలుసుకోవచ్చు అనే పొరపాటులో పడిపోతున్నారు.

మిథ్యా అహంకారాన్ని పారద్రోలాలంటే సత్య ఆత్మవిచారణ చేయాలి, అది కూడా శాస్త్రాన్ని ఆచార్యుల ద్వారా అభ్యసించాలి.

ఈ శ్లోకంలో కూడా ఆత్మవిచారణ గురించి వస్తున్నది. అహంకార మిథ్యాత్వ నిశ్చయం చేయాలంటే ఆత్మవిచారణ ఒక్కటే మార్గం. ఇందులో ఇంకొక సాధన గురించి నొక్కి వక్కాణిస్తున్నారు. ఈ సాధనలన్నీ సాధన చతుష్టయ సంపత్తి పొందటానికి తోడ్పడతాయి. ముందు శ్లోకంలో ప్రాణనిరోధం, వాక్‌నిరోధం గురించి చెబితే, ఈ శ్లోకంలో మనోనిరోధం గురించి చెబుతున్నారు రమణమహర్షి. మనోనిగ్రహాన్ని శమః అంటారు. ముందు శ్లోకంలో వాక్‌నిరోధం అంటే దమః అంటే ఇంద్రియనిగ్రహం గురించి వచ్చింది.

**మౌనేన** – మౌనేన అంటే మౌనంగా ఉండటం ద్వారా. మౌనాన్ని రెండురకాలుగా వివరించవచ్చు. మౌనం అంటే నిశ్శబ్దంగా ఉండటం, మాట్లాడకుండా ఉండటం కాని

ఇంకొక రకం మౌనం ఇంకా ఉన్నతస్థాయికి చెందిన, ఇంకా సూక్ష్మమైన మౌనం. అది మానసిక నిశ్శబ్దం. నిరంతరం రొదపెట్టే మనస్సును ప్రశాంతంగా ఉండేలా చేయటం. నిరంతరం రొదపెట్టే మనస్సు గురువు చేసే బోధను శ్రద్ధ పెట్టి వినలేదు.

దీనికి ఒక ఉదాహరణ వినేఉంటారు. ఒక మాథ్స్ టీచర్ చాలా కష్టమైన మాథ్స్ ప్రాబ్లెమ్ ఎంతో బాగా ఆయన తెలివితేటలంతా ఉపయోగించి ఒకరోజు క్లాసులో బోధించాక, చాలా ఉత్సాహంగా, దూరిందా అని అడిగారు. ఒక కుర్రాడు వెంటనే తోక మాత్రం మిగిలింది సార్ అన్నాడు టక్కున. గురువుకు అతను చెప్పినదాని తలా తోకా అర్థం కాలేదు. గురువు దూరిందా అని సర్వనామం వాడాడు. ఆయన ఉద్దేశ్యం, ఆయన చేసిన బోధ. శిష్యుడు ఆ సర్వనామాన్ని ఎలుకకు తీసుకున్నాడు. గురువు బోధ చేస్తున్నంతసేపూ ఆ క్లాసులో ఉన్న ఒక కలుగులోకి ఒక ఎలుక కష్టపడి దూరటం పూర్తి ఏకాగ్రతతో గమనిస్తున్నాడా శిష్యుడు. అందువల్లనే గురువు దూరిందా అనగానే ఎలుక గురించే గురువు కూడా అడుగుతున్నారనుకుని తోక మాత్రం మిగిలింది సార్ అన్నాడు.

గురువు ఆత్మబోధ చేసేటప్పుడు శ్రద్ధగా వినకపోతే ఇలాగే ఉంటుంది పరిస్థితి.

**అన్యోంతర ఆత్మా ప్రాణమయః మనోమయః విజ్ఞానమయః**

ఆత్మ ప్రాణమయకోశం, మనోమయకోశం, విజ్ఞానమయకోశాలకు అతీతంగా ఉందని గురువు చెబితే, మధ్యలో వేరే ఆలోచనల్లోకి వెళ్ళిపోయిన శిష్యునికి అది మింగుడుపడదు. నేనెలా ఆనందస్వరూపుణ్ణి, నా భార్య నన్ను కాల్చుకు తింటుంటే అనిపిస్తుంది. లేదా ఆర్థిక సమస్యో, ఉద్యోగసమస్యో, ఏదో ఒకటి నన్ను పీడిస్తుంటే నేను ఆనందస్వరూపుడనెలా అవుతానో నాకు అర్థంకాదు. ఎందువల్ల? నేను పూర్తిగా శ్రద్ధపెట్టి వినలేదు. అందువల్ల మౌనం అంటే ఏ అలజడీ లేని ప్రశాంత మనస్సు.

**మజ్జన్మనసా** – మజ్జత్ + మనసా – మజ్జన్మనసా అంటే గాఢంగా లోపలకు చొచ్చుకుపోయే మనస్సు. మౌనం అంటే ప్రశాంతత, నిశ్చలమనస్సు. మజ్జన్మనసా అంటే గురువుతో పాటు ప్రయాణం చేసే మనస్సు. పరిసరాలకు మరణించిన మనస్సు. ఈ ఏకాగ్రత గురించి తెలియాలంటే జనక మహారాజు కథ చెబుతారు.

జనక మహారాజు, కొందరు సన్న్యాసులతో కలిసి ఆత్మజ్ఞానం పొందుతూ ఉంటారు ఒక గురువు వద్ద. ఒకరోజు మిథిలానగరం అగ్నిప్రమాదానికి గురి అయిందనే వార్త దావానలంగా వ్యాపించింది. భటులు పరిగెత్తుకుంటూ వచ్చి ఈ వార్తను వినిపించారు. కాని గొప్ప ఏకాగ్రతతో గురుబోధను వింటున్న జనక మహారాజు చెక్కు చెదరలేదు. రాజుతోపాటు బోధ వింటున్న

తక్కిన శిష్యులు, సన్న్యాసులు వారంతా పరుగులు తీశారు. వారు వెళ్ళి రక్షించటానికి భార్య, పిల్లలు లేరు; ఆస్తి, ఖరీదైన వస్తువులు లేవు. ఉన్నదంతా వారి కౌపీనం మాత్రమే.

**కౌపీన సంరక్షణార్థమ్ అయం పటాటోపః**

అని వస్తుంది. కౌపీన రక్షణకోసం ఇంత హడావుడి చేస్తున్నారు వారు.

దేనితోనైనా సంగత్వం ఉండాలంటే అది చాలా ఖరీదైన వస్తువే అయివుండాల్సిన పనిలేదు. కొందరికి పనికిరాని అగ్గిపెట్టెలమీద కూడా బంధకత్వం ఉండవచ్చు. అగ్గిపెట్టెలతో మా మనవడు ఆడుకుంటాడు అంటారు. మనవడు పక్కనే ఉన్నాడా అంటే, ఇంకా కొడుక్కి పెళ్ళి కానేలేదు, తండ్రి ఇప్పుడే అవలేదు. అయినా అంత ముందుచూపు. అందువల్ల సన్న్యసించటం అంటే బాహ్యంగా సన్న్యసిస్తే చాలదు, ఆంతర సన్న్యాసం కూడా ఉండాలి. ఆంతరసన్న్యాసం స్వీకరించాలంటే మనస్సు ప్రశాంతంగా ఉండాలి; ఎటువంటి ఆందోళన కూడా ఉండకూడదు. అదికూడా కనీసం ఆత్మబోధ వింటున్నప్పుడు.

శంకరాచార్యులవారు, సురేశ్వరాచార్యులవారు మనస్సు అలా ప్రశాంతంగా ఉండి, వింటే వారికి శ్రవణంలోనే నిశ్చయజ్ఞానం కలుగుతుంది; మననం అవసరంలేదు; నిదిధ్యాసనం కూడా అవసరంలేదు అంటారు.

మజ్జన్మనసా ఒక కాంపౌండ్ వర్డ్. దాన్ని అలాగే తీసుకోవచ్చు లేదా మజ్జత్+మనస్సుగా విడదీయవచ్చు. ముందు పద్ధతి కన్నా ఇలా విశేషణంగా తీసుకుంటే మంచిది. ఇటువంటి ప్రశాంత మనస్సుతో ఏం చేయాలి?

**స్వమూల చర్చా ఏవ** – బాహ్యప్రపంచంనుంచి విడివడిన మనస్సుతో ఏం చేయాలి? చర్చలో దిగాలి. చర్చ అంటే సంభాషణ. వేదాంత పరిభాషలో సంవాదం. కృష్ణార్జున సంవాదే అని భగవద్గీతలో చూస్తాము. అందువల్ల చర్చ అంటే గురుశిష్యుల సంవాదం జరుగుతుంది అని అర్థం.

గురుశిష్యసంవాదంలో శిష్యుడు శ్రద్ధగా వినాలి; ఊరికే బుర్ర ఊపటం కాదు. ఏమీ అర్థం కాకుండా కూడా బుర్ర ఊపేవాళ్ళు ఉంటారు. అది కాదు ఇక్కడ. గురువును ప్రశ్నలు అడిగి నేర్చుకోవాలి. దేనిమీద చర్చ?

స్వమూల విచారణ – స్వ అంటే అహంకారం. అందువల్ల అహంకారంయొక్క మూలం ఏమిటో విచారణ చేయాలి.

**సత్యాత్మవిచారణం స్యాత్** – గురుశిష్యుల సంవాదం జరిగేది సత్యాత్మ విచారణమీద. అహంకార మూలమే సత్యాత్మ. మిథ్యా అహంకార మూలవిచారణమే సత్య అధిష్ఠాన ఆత్మవిచారణ. రెండూ ఒకటే.

ఈ విచారణలో రెండు భాగాలు ఉన్నాయి.

1. నేను ఏదికాదో, అది తెలుసుకోవటం

2. నేను ఏదో, అది తెలుసుకోవటం.

ప్రపంచంలో ఉన్న ప్రతి ఒక్క వస్తువునూ తీసుకుని ఇది నేను కాదు, ఇది నేను కాదు అంటూ ఆ వస్తువును కొట్టివేయటం. దీన్ని నేతినేతి పద్ధతి అంటారు. అలా జగత్తులోని వస్తువులను కొట్టివేస్తూ వచ్చి మీకు సమీపంగా ఉన్న మీ శరీరానికి వస్తారు. ఆబ్జెక్టుగా మీకు తెలిసేదేదీ మీరు కాదు. ఇది ప్రకృతిసూత్రం.

శరీరానికి కలిగే బాధలు మీకు తెలుసు; మీరు శరీరం కాదు. ఇంద్రియాలు విషయ వస్తువులను చూస్తున్నాయని మీకు తెలుసు; మీరు ఇంద్రియాలు కాదు. మనస్సులో కలిగే భావోద్రేకాలు మీకు తెలుసు; మీరు మనస్సు కాదు. బుద్ధికి ఇది అర్థం అవుతున్నదని మీకు తెలుసు; మీరు బుద్ధి కాదు.

ఇదే వేదాంతపరంగా, సాంకేతికపరంగా చేస్తే మీ పంచకోశాలలో ఒక్కొక్క కోశాన్ని తీసుకుని నేను అన్నమయ కోశాన్ని కాను అంటూ ఐదు కోశాలనూ పరిశీలించి, నేను పంచకోశాలకు అతీతంగా ఉన్న ఆత్మను అని అర్థం చేసుకుంటారు. ఈ కోశాలు మిథ్యా ప్రపంచంలో భాగాలనీ, వాటితో మీరు మమేకం చెందకూడదనీ అర్థం చేసుకుంటారు. వాటిని సంరక్షించుకోవాలి కాని అవే మీ ప్రపంచంలా మమేకం చెందకూడదు.

**మనో బుద్ధ్యహంకారచిత్తాని నాహమ్.**

ఇప్పుడు ఈ శ్లోకంలోని మూడవ పాదంలోకి వెళదాము.

వేదాంతశాస్త్రంలో **తత్ త్వమ్ అసి** అనే మహావాక్య విచారణ వస్తుంది. అది మూడు దశల్లో చేయబడుతుంది. తత్ పదవిచారణ, త్వమ్ పదవిచారణ, అసి పదవిచారణ.

**త్వమ్ పదవిచారణ** – కొన్ని ఉపనిషత్తులు తత్ పదవిచారణ చేసి, త్వమ్ పదవిచారణకు వస్తే మరికొన్ని త్వమ్ పదవిచారణ చేసి తత్ పదవిచారణకు వస్తాయి. త్వమ్ అంటే జీవాత్మ. జీవాత్మ స్వరూపాన్ని తెలుపుతుంది. ఇది వ్యష్టి గురించి తెలుపుతుంది. ఉదా. అల గురించిన జ్ఞానం.

**తత్ పదవిచారణ** – తత్ అంటే పరమాత్మ. పరమాత్మ అంటే సమష్టి. అందువల్ల తత్ పదవిచారణ సమష్టి గురించి తెలుపుతుంది. ఉదా. సముద్రం గురించిన జ్ఞానం.

**అసి పదవిచారణ** – అసి అంటే ఐక్యం. జీవాత్మస్వరూపమూ, పరమాత్మస్వరూపమూ ఒకటే అనే జ్ఞానం పొందేలా చేస్తుంది. అంత చిన్న అలలో ఉన్నదీ నీరే, అంత పెద్ద

సముద్రంలో ఉన్నదీ నీరే. నీటిపరంగా అలా, సముద్రమూ రెండూ ఒకటే. అదే విధంగా అంత చిన్న వ్యక్తిలో ఉన్నదీ చైతన్యమే, అంత పెద్ద పరమాత్మలో ఉన్నదీ చైతన్యమే. రెండింటిలోనూ సమానంగా ఉన్న పదం ఆత్మ. జీవాత్మలోనూ ఆత్మ ఉంది, పరమాత్మలోనూ ఆత్మ ఉంది. అదే చైతన్యం.

జీవ, పరమ పదాలు ఆ ఆత్మకు వాడిన విశేషణాలు మాత్రమే. వ్యష్టిపరంగా జీవ అనేది ఆగంతుక నామరూపాలు ఆత్మకు. అలాగే పరమ అనేది సమష్టిపరంగా ఆగంతుక నామరూపాలు ఆత్మకు. ఈ రెండూ విశేషణాలూ తీసేస్తే ఆత్మ మాత్రమే మిగులుతుంది; అల, సముద్రాల నామరూపాలు తీసేస్తే నీరు మాత్రమే మిగిలినట్టుగా. రెండింటిలోనూ నీరు చూసినట్టుగా, వ్యష్టి-సమష్టిలోని చైతన్యాన్ని చూడటమే ఐక్యజ్ఞానం. ఇది అసి పదం చూపిస్తుంది. ఈ మూడింటినీ కలిపితే ఇలా చెప్పవచ్చు.

జీవాత్మ విచారణ, పరమాత్మ విచారణ, ఐక్యవిచారణ లేదా త్వమ్ పదవిచారణ, తత్ పదవిచారణ, అసి పదవిచారణ. ఈ మూడూ కలిపితే తత్త్వమసి మహావాక్య విచారణ వచ్చేస్తుంది.

**జీవాత్మ విచారణ** – జీవాత్మ విచారణ ఎలా చేయాలి? పంచకోశవివేకం ద్వారా చేయటం ఒక పద్ధతి. పంచకోశాలలో అన్నమయకోశంతో మొదలుపెట్టి ఒక్కొక్క కోశాన్నీ తీసుకుని నేతి-నేతి పద్ధతి ద్వారా ఇదికాదు, ఇదికాదు అని కొట్టివేస్తూ రావాలి. లేదా కార్యకరణ సంఘాతాన్ని తీసుకుని విశ్లేషించవచ్చు. కార్యకరణసంఘాతం అంటే శరీరం, ఇంద్రియాలు, మనస్సు. వీటిని ఒక్కొక్కటి విశ్లేషించుకుంటూ వస్తే, ఇవి నా ఆగంతుక లక్షణాలు తప్పితే, నా స్వాభావిక లక్షణాలు కావని తెలుస్తుంది.

**శరీరం** – ఈ శరీరం నా ముందు జన్మలో లేదు, ఇంకో జన్మ పొందితే ఈ శరీరం ఉండదు. **వాసాంసి జీర్ణాని యథా విహాయ నవాని గృహ్ణాతి నరోఽపరాణి॥**

వేసుకున్న బట్టలు మాసిపోతే వాటిని మార్చి ఇంకొకటి వేసుకున్నట్టుగా ఈ శరీరాన్ని కొత్తగా తొడిగితే అది పుట్టుక అవుతుంది. ఈ శరీరం జీర్ణమయి, శిథిలమైతే అది మరణం అవుతుంది. అప్పుడు ఆత్మ ఇంకొక కొత్త శరీరాన్ని తీసుకుంటుంది.

ఇలా ఇంద్రియాలను, మనస్సును కూడా వాటి వ్యవహారాలు నాకు తెలుస్తున్నాయి కాబట్టి, ఇవి నేను కాదు; ఇవి నా ఆగంతుక లక్షణాలు అని తెలుసుకోవాలి.

రమణమహర్షి పంచకోశవివేకాన్ని సద్దర్శనంలో సూచిస్తున్నారు. ఆయన సూచనప్రాయంగా చెప్పారే కాని వివరంగా చెప్పలేదు. మనం తైత్తిరీయోపనిసషత్తుకో లేదా తత్త్వబోధకో వెళ్ళి

విపులంగా నేర్చుకోవాలని ఆయన ఉద్దేశ్యం. కాని ఈ ఖాళీలను పూరించకుండా, గెంతు గెంతేసి, ఆత్మవిచారణ అంటే స్వయంగా చేయాలి లేదా ధ్యానంలో కూర్చోవాలి అంటారు కొందరు.

31వ శ్లోకంలో 3, 4 పాదాలు త్వమ్ పదవిచారణలో భాగంగా పంచకోశవివేకం చేస్తున్నాయి. ఎలా చేస్తున్నాయి?

**ఏతత్ న మమ స్వరూపమ్** – ఇది నా స్వరూపం కాదు అంటున్నారు. రమణమహర్షి ఇది అని సర్వనామం వాడుతున్నారు. ఆ సర్వనామం దేన్ని సూచిస్తుందో మనం కలుపుకోవాలి. మనం పంచకోశాలలో ఒక్కొక్కటిగా తీసుకుని, అంటే ముందు అన్నమయకోశం తీసుకుని ఇది నా స్వరూపం కాదని చెప్పగలగాలి. దాని తర్వాత ప్రాణమయకోశం తీసుకుని ఇది నా స్వరూపం కాదని చెప్పగలగాలి. అలా ఐదు కోశాల విచారణ చేయాలి.

దీనికి ఒకటే సూత్రం. ఆబ్జెక్టుగా నాకు అనుభవంలోకి వస్తున్నదేదీ నేను కాదు.

శరీరానికి వచ్చే నొప్పులు నాకు తెలుస్తున్నాయి, నేను శరీరం కాదు
ఇంద్రియాలలో వచ్చే మార్పులు నాకు తెలుస్తున్నాయి, నేను ఇంద్రియాలు కాదు
మనస్సులో వచ్చే ఆలోచనలు నాకు తెలుస్తున్నాయి, నేను మనస్సు కాదు.

ఈ విధంగా విచారణ చేసి ఏతత్ న మమ స్వరూపం. ఇది నా స్వరూపం కాదని చెప్పగలగాలి. అందువల్ల ఈ భాగం పంచకోశవివేకాన్ని సూచిస్తున్నది.

ఇలా ఒక్కొక్కటి త్రోసిపుచ్చుతూ వచ్చేసరికి, చివరికి శూన్యమే మిగులుతుంది. ఏమీ లేదు, శూన్యమే మిగిలింది అంటే ఆత్మ శూన్యమా? కాదు. ఇక్కడే గురువు, శాస్త్రంయొక్క అవసరం అర్థమవుతుంది. శాస్త్రం ద్వారా గురువు ఇంకొక అడుగు ముందుకు తీసుకువెళతాడు. అక్కడ ఏమీ లేదని తెలుస్తోంది కదా! అంటే తెలుసుకునేది ఇంకొకటి ఉంది. ఈ గదిలో ఎవరూ లేరు అంటే, ఈ గదిలో ఎవరూ లేరని చూసి చెబుతున్నవారు ఒకరు ఉన్నారు.

అదే విధంగా మీరు నిశ్శబ్దాన్ని చూస్తున్నా, శూన్యాన్ని చూస్తున్నా, దాన్ని సాక్షిగా చూస్తున్న చైతన్యం ఒకటి ఉంది. అది ఆబ్జెక్టుగా అనుభవంలోకి రాదు. ఆబ్జెక్టుకాని చైతన్యమే ఆ నిశ్శబ్దం. ఆ ఆబ్జెక్టు కాని చైతన్యం, నిశ్శబ్దంగా అనుభవంలోకి వస్తున్నది ఏదైతే ఉందో, ఆ నిశ్శబ్దమే నా స్వరూపం. ఆ నిశ్శబ్దచైతన్యాన్ని నా స్వరూపంగా తెలుసుకోవాలి నేను. దాన్ని నా స్వరూపంగా స్వీకరించాలి.

**ఏషః అహమ్** – ఈ నిశ్శబ్దాన్ని సాక్షిగా చూస్తున్న సాక్షిచైతన్యమే నేను. మనస్సులో ఆలోచనలు ఉన్నా నాకు తెలుస్తున్నది, ఆలోచనలు లేకపోయినా నాకు తెలుస్తున్నది. అందువల్ల ఆలోచనలు

ఉన్న, ఆలోచనలు లేని మనస్సును సాక్షిగా చూసే సాక్షిచైతన్యాన్ని నేను. ఈ సాక్షిచైతన్యాన్ని నేను ఆబ్జెక్టుగా చూడలేను. ఎందుకంటే అది నేనే.

అందువల్ల **ఏతత్ న మమ స్వరూపం** అనాత్మ నిషేధాన్ని సూచిస్తే, **ఏషః అహమ్** ఆత్మ నిశ్చయం చేస్తుంది. ఈ భావనను ఇంకా స్పష్టంగా నిర్వాణషట్కంలో చూస్తాము.

**మనో బుద్ధ్యహంకార చిత్తాని నాహమ్**
**న చ శ్రోత్రజిహ్వే న చ ఘ్రాణనేత్రే**
**న చ వ్యోమభూమిర్న తేజో న వాయుః**

ఇంతవరకూ **ఏతత్ న మమ స్వరూపమ్** – ఇవి నేను కాదు.

**చిదానందరూపః శివోఽహం శివోఽహమ్**

ఇది ఏషః అహమ్. నా స్వరూపం చిదానందరూపం.

ఇంత విచారణ ఉంటే, దాన్ని ఒక్క వాక్యంలో కుదించారు రమణమహర్షి. అది కూడా ఒక్క సర్వనామం (ఏతత్)వాడి. దానికి నామవాచకం ఏమిటి? ఈ పంచకోశాలు. ఇవన్నీ గురువు లేకపోతేనూ, వేదంతగ్రంథాలు లేకపోతేనూ ఎలా అర్థమవుతాయి? అందువల్లనే శాస్త్రాన్ని ఒక క్రమపద్ధతిలో ఒక గురువువద్ద అధ్యయనం చేయాలి. అలా చేస్తే ఏమవుతుంది?

**ఇతి ప్రమా** – ఈ జ్ఞానం పొందుతారు. ప్రమా అంటే జ్ఞానం. ఏ జ్ఞానం? జీవాత్మ స్వస్వరూపాన్ని గురించిన జ్ఞానం.

**సత్యవిచారణ అంగమ్** – జీవాత్మ గురించిన స్వస్వరూపజ్ఞానం అంగమ్ అంటున్నారు రమణమహర్షి. సత్యాత్మగురించి చేయాల్సిన విచారణలో ఒక భాగం మాత్రమే. అంగం అంటే ఒక భాగం. ఇది ఒక భాగం అంటే ఇంకా కొన్ని భాగాలున్నాయని చెప్పకనే చెప్పినట్టు అర్థం.

ఇక్కడితో త్వం పదవిచారణ అయింది. దీని తర్వాత పరమాత్మ విచారణకూ, ఆ తరువాత అసి పదవిచారణకూ వెళ్ళాలి. అలా వెళ్ళకుండా ఇక్కడే ఆగిపోతే, సాంఖ్యదార్శనికులం అవుతాం. అదెలా? ఇప్పటివరకూ ఏం నేర్చుకున్నాము? ఇప్పటివరకూ త్వం పదవిచారణ మాత్రమే చేశాము. దానిలో మనం నేర్చుకున్నది నా శరీరం, నా మనస్సు, నా ఆగంతుక స్వరూపం, ఆత్మనైన నేను నా స్వస్వరూపం. అవునా?

ఇక్కడ ఆగిపోతే వచ్చే ప్రమాదం ఏమిటి? నాకొక శరీరం ఉంది; అందులో ఆత్మగా నేను ఉన్నాను అంటాను. అంతవరకూ బాగానే ఉంది. కాని అక్కడే ఆగిపోతే, నాకొక

శరీరం ఉండి, అందులో నేను ఆత్మగా ఉన్నట్టే, నీకొక శరీరం ఉంది, అందులో నువ్వొక ఆత్మగా ఉన్నావు అంటాము. అంటే నీకొక ఆత్మ, నాకొక ఆత్మ ఉంది అంటాము. అప్పుడు ఎన్ని శరీరాలు ఉంటే, అన్ని ఆత్మలు ఉన్నట్టు వస్తుంది. అది ఒక పెద్ద పొరపాటు. ఈ పొరపాటుని దాటాలంటే త్వమ్ పదవిచారణనుంచి తత్ పదవిచారణకు వచ్చితీరాలి. దాని తర్వాత అసి పదవిచారణకు వచ్చితీరాలి.

ఈ రెండు విచారణలూ ముఖ్యమే అని సూచించటానికే రమణమహర్షి త్వమ్ పదవిచారణను సత్యవిచారణ అంగమ్ అన్నారు. ఇప్పుడంతా విద్యావిధానం సెమిష్టర్ల పద్ధతిలో సాగుతున్నది కదా! ఆ పరిభాషలో చెప్పాలంటే సత్యవిచారణ మూడు సెమిష్టర్లలో చేయాలి. కనీసం మూడు సెమిష్టర్ల కోర్సు చేయాలి మనం.

**శ్లోకం 32**

**గవేషణాత్ ప్రాప్య హృదంతరం తత్**
**పతేదహంతా పరిభుగ్న శీర్షా।**
**అథాహమన్యత్ స్ఫురతి ప్రకృష్టం**
**నాహంకృతిస్తత్పరమేవ పూర్ణమ్॥**

**ప్రతిపదార్థం:**అహంతా = అహంభావం; హృదంతరం = హృదయం మధ్యలో; గవేషణాత్= విచారణ చేయటంవల్ల; తత్ ప్రాప్య = తన మూలస్వరూపాన్ని పొంది; పరిభుగ్నశీర్షా = తల క్రిందులుగా; పతేత్ = పడిపోతుంది; అథ = ఆ అహంకారవికారం నశించిన తరువాత; ప్రకృష్టం = ఉత్తమమైన; స్ఫురతి = తెలుస్తుంది; అన్యత్ = ఇంకొక; అహం = అహంరూపమైన; అహంకృతిః = ఇతః పూర్వం ఉదహరించిన అహంభావం; న = కాదు; పూర్ణం = అఖండమైన; పరం+ఏవ= పరమమైన ఆత్మతత్త్వమే.

**తాత్పర్యం:** అహంభావంగురించి హృదయం మధ్యలో విచారణ చేయటంవల్ల, తన మూలస్వరూపాన్ని పొంది, తల క్రిందులుగా పడిపోతుంది. అప్పుడు మరియొక అహం భాసిస్తుంది. అది పూర్వము చెప్పిన అహంకారం కాదు, సాక్షాత్తూ పరమమైన ఆత్మతత్త్వమే.
**వివరణ:** ఈ శ్లోకంలో రమణమహర్షి ఈ విచారణ గనుక సరిగ్గా విజయవంతంగా చేస్తే, తద్వారా ఆత్మజ్ఞానాన్ని విజయవంతంగా పొందితే, అప్పుడు అహంకారం లయమవుతుంది అంటున్నారు. అహంకారం ఎందులో లయమవుతుంది? దానికి కూడా ఒక సూత్రం ఉంది. ఏ మిథ్యావస్తువు అయినా సరే, అది దాని అధిష్ఠానంలో అంటే దాని సత్యవస్తువులో లయమవుతుంది.

ఉదాహరణకు స్వప్నప్రపంచం తీసుకోండి. స్వప్నప్రపంచం మిథ్య. స్వప్నంలో ఉన్నంతవరకూ ఒక స్వాప్నికునికి తన స్వప్నం, స్వప్నం కాదు; అది సత్యమే. కాని అతను ఆ స్వప్నంనుంచి లేస్తే, ఆ స్వప్నం మిథ్యగా తెలిపోతుంది. కల కరిగిపోతుంది అంటాము. నేను నిద్ర లేస్తే, స్వప్నం ఏమవుతుంది? పక్కగదిలోకి వెళ్ళిపోదు. అది జాగ్రత్ పురుషుడనైన నానుంచే వచ్చింది, నాలోనే లయమవుతుంది. జాగ్రత్ పురుషుడనైన నేను నా మిథ్యా స్వప్నప్రపంచానికి అధిష్ఠానాన్ని. అందువల్ల అధిష్ఠానమైన నానుంచే వచ్చిన స్వప్నప్రపంచం నాలోనే లయమవుతుంది.

ఇదే విధంగా అహంకారం ఆత్మ అజ్ఞానంవల్ల ఆత్మనుంచి పుట్టింది. ఎప్పుడైతే ఆత్మజ్ఞానం పొందుతామో అప్పుడు అహంకారం ఆత్మలోనే లయమవుతుంది. ఆత్మ అజ్ఞానం అహంకార సృష్టికి కారణమైతే, ఆత్మజ్ఞానం అహంకార లయకు కారణమవుతుంది. తాడు అజ్ఞానం పాము సృష్టికి కారణమైనది; తాడు జ్ఞానం పాము లయకు కారణమవుతుంది. పాము లయమయ్యేది తెలియని తాడులో కాదు, తెలిసిన తాడులో. తెలిసిన తాడులో అంటే అర్థం, అది పాముకాదు, తాడు అని తెలిసిన తాడు జ్ఞానంలో లయమవుతుంది.

అదే విధంగా తెలియని నేనునుంచి అహంకారం పుట్టింది. అందువల్ల అహంకారం లయమయ్యేది తెలియని నేనులో కాదు, తెలిసిన నేనులో. తెలియని తాడు తెలిసిన తాడుగా మారితే, పాము లయమయిపోతుంది; తెలియని జాగ్రత్‌పురుషుడు తెలిసిన జాగ్రత్‌పురుషునిగా మారితే, స్వప్నప్రపంచం లయమయిపోతుంది; అలాగే తెలియని ఆత్మ తెలిసిన ఆత్మగా మారితే, అహంకారం లయమయిపోతుంది. అందువల్ల విచారణ అంటే తెలియని నేను, తెలిసిన నేనుగా మారటం. ఈ నేపథ్యంలో ఈ శ్లోకం చూద్దాము.

**గవేషణాత్** – గవేషణాత్ అంటే విచారణ. విచారణకు రమణమహర్షి ఐదు పదాలు వాడుతున్నారని చూశాము. అవి మళ్ళీ ఒకసారి చూస్తే, అవి – అహమః శోధయ, స్వవిచారకాలే, తన్మార్గణమ్, చిన్వన్, స్వమూల చర్చా, గవేషణమ్, విచారః. అన్నింటి అర్థం ఒకటే – విచారణ. విచారణ అంటే ఏమిటో మర్చిపోకూడదు.

**శాస్త్ర ఆచార్య ఉపదేశ సహిత ఆత్మవిచారః**

ఈ విధంగా విచారణ చేస్తే ఏమవుతుంది?

**అహంతా పతేత్** – రెండవ పాదంలో ఉంది చూడండి. అహం అంటే అహంకారం. పతేత్ అంటే పతనమవుతుంది. ఎక్కడ పతనమవుతుంది?

**హృదంతరమ్** – హృదంతరమ్ అంటే అధిష్ఠానం ఆత్మ. ఆత్మను ఎందుకు హృదంతరమ్ అంటున్నారు. హృద్ అంటే హృదయం; అంతరం అంటే లోపల. ఆత్మ చైతన్యం, హృదయం లోపల ఉంది. **యో వేద నిహితం గుహాయాం పరమే వ్యోమన్** అందువల్ల అధిష్ఠాన ఆత్మలోకి,

**ప్రాప్య** – చేరుకున్నప్పుడు.

ఈ వర్ణనలో కవిహృదయం కనిపిస్తుంది. అహంకారం ఆత్మలో చేరటానికి పరుగులు తీస్తుంది అంటున్నారు. తాడు జ్ఞానం పొందగానే తాడులో పాము లయమయి, మాయమయిపోతుంది. అంటే పాము మెల్లమెల్లగా తాడులోకి వెళుతున్నట్టు, ముందు తలభాగం వెళ్ళినట్టు, నెమ్మదిగా తోక కూడా తాడులోకి వెళుతున్నట్టు ఊహించుకోకూడదు. అలాగే స్వప్నప్రపంచం జాగ్రత్ పురుషునిలోకి వెళ్ళి, మాయమయిపోతుంది అంటే మెల్లమెల్లగా స్వప్నప్రపంచం జాగ్రత్ పురుషునిలోకి వెళ్ళినట్టుగా ఊహించుకోకూడదు. ఇది ఒక అద్భుత భావన. దాని సారం తీసుకోవాలి; తాడు జ్ఞానం పొందితే పాము సత్యత్వం మాయమయిపోతుంది; జాగ్రత్ పురుషుని జ్ఞానం పొందితే స్వప్నప్రపంచం సత్యత్వం మాయమయిపోతుంది.

**పరిభుగ్న శీర్షా** – కవి హృదయాన్ని సూచించే ఇంకొక అద్భుతమైన ఊహాశక్తి. ఇంతకు ముందేమన్నారు, అహంకారం వెళ్ళి హృదయం లోపల ఉన్న ఆత్మలో పడిపోతుంది అన్నారు. ఇప్పుడేమంటున్నారు. తలక్రిందులుగా పడుతున్న పురుషునిలా పడిపోతుంది అంటున్నారు.

ఒక వ్యక్తి ఎత్తైన భవంతినుంచి కింద పడుతున్నాడు అనుకోండి. అతను రెండు రకాలుగా పడే అవకాశం ఉంది. ముందుగా కాళ్ళు కిందపడితే, మహా అయితే కాళ్ళు విరుగుతాయేమో కాని, మరణం సంభవించదు. అంటే అతనికి తాత్కాలికంగా సమస్య వస్తుంది కాని కోలుకుంటాడు. అదే, అతను తలక్రిందులుగా పడ్డాడనుకోండి, తలపగిలి అక్కడికక్కడే మరణిస్తాడు. బ్రతికే అవకాశమే లేదు. ఈ రెండవ అంశాన్ని నొక్కి చెప్పదలుచుకున్నారు రమణమహర్షి.

**పరిభుగ్న శీర్షాలో** శీర్షా అంటే తల; పరిభుగ్న అంటే కిందపడి; పరిభుగ్న శీర్షా అంటే తలక్రిందులుగా పడి మరణించినట్టు. అహంకారానికి తల లేదు. కాని కవి హృదయాన్ని చూడాలి మనం. భుగ్న పదం భుజ్ ధాతువునుంచి వచ్చింది. భుజ్ అంటే కిందవైపు, పరిభుగ్న శీర్ష అంటే తలకింది వైపుకు వంగివున్న అహంకారం పడేసరికి అహంకారం యొక్క తల బద్ధలయింది.

అహంకారం క్రాష్ హెల్మెట్‌ను ధరించలేదు. క్రాష్ హెల్మెట్ అంటే క్రాష్ అయ్యే హెల్మెట్ కాదు; క్రాష్ అవకుండా కాపాడే హెల్మెట్. దాన్ని మధ్యమపదలోప అహంకారం అంటారు.

ఈ విషయాన్ని పక్కనపెడితే అహంకారం తలక్రిందులుగా వెళ్ళి ఆత్మలో పడింది అని ఈ ఊహాశక్తి కల్పనాంశం. దాని అర్థం ఇంక మళ్ళీ పుట్టకుండా అహంకారం తిరుగులేని చావు చచ్చింది అని. అందువల్ల **అహం తా పతేత్** అన్నారు. అహంకారం పూర్తిగా, మళ్ళీ తిరిగి లేవలేనట్టుగా, ముక్కలయిపోయింది.

ఇంత కవితా ధోరణిలో అహంకారం కిందపడింది, తల చెక్కలయింది, మళ్ళీ పుట్టలేదు అని ఎందుకు చెబుతున్నారు రమణమహర్షి? ఎందుకంటే అహంకారాన్ని తాత్కాలికంగా లయం చేసే మార్గాలు అనేకం ఉన్నాయి. ఇంగ్లీషులో ఒక ప్రయోగం ఉంది – ది నైట్ ఫాల్స్ బట్ నెవర్ బ్రేక్స్ అని. రాత్రి పడుతుందిట కాని విరగదుట. అది విరిగిపోతే, ముక్కలయితే మళ్ళీ మర్నాడు రాత్రి పడదు. అదే విధంగా అహంకారం రాలినా, మళ్ళీ లేస్తే లాభంలేదు.

అలా అహంకారం తాత్కాలికంగా మాయమయ్యే ఒక సందర్భం సమాధి. సమాధిని యోగసమాధి అంటారు. యోగసమాధి చేసే వ్యక్తికి వేదాంత అధ్యయనం చుక్కెదురు; అతను జ్ఞానానికి బద్ధశత్రువు. అతను మనస్సును అన్నింటినుంచి వెనక్కి లాక్కుంటాడు. అప్పుడు అతను ఈ ప్రపంచంనుంచి మరణించిన వానితో సమానం. ఏ వికారాలూ ఉండవు. అందువల్ల నిర్వికల్పసమాధిలో ఉంటాడు. ఆనందమే ఆనందం. అత్యంత సుఖాన్ని అనుభవిస్తాడు. ఒక మామూలు నిద్రలోనే ఎంతో సుఖాన్ని అనుభవిస్తే, ఇంక ప్రయత్నపూర్వకంగా అన్నింటినుంచి విడివడి, మనస్సును ప్రశాంతంగా చేసుకుంటే కలిగే ఆనందం గురించి వేరే చెప్పాలా?

అతని పరంగా అది అద్భుతమైన ఆనందం. ఆ ఆనందం పొందుతాడు కూడా, నిజమే, అందులో ఏమాత్రం సందేహం లేదు. కాని వేదాంతం దీన్ని అంధసమాధి అంటుంది. ఎందుకు? ఈ ఆనందం తాత్కాలికమే కాబట్టి. ఆ సమాధి ముగింపుకు వస్తుంది; ఎప్పుడైతే సమాధిస్థితి ముగుస్తుందో, అప్పుడే ఆ యోగి సమాధినుంచి లేస్తాడు. ఎప్పుడైతే సమాధి నుంచి లేస్తాడో, అప్పుడే అహంకారం కూడా నేనున్నానంటూ దూసుకువచ్చేస్తుంది. ఎందుకు? అహంకారం గురించిన అజ్ఞానం పోతే కదా, అహంకారం పోవటానికి. సుషుప్తిలో సుఖం అనుభవించినా, దానినుంచి లేవగానే అహంకారం ఎలా దూసుకువస్తుందో, అలా సమాధిలో సుఖం అనుభవించినా, దానినుంచి లేవగానే, మళ్ళీ అహంకారం దాని తోక జాడిస్తుంది.

అందువల్ల యోగి, సమాధినుంచి లేవగానే, మహాసంసారాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుంది. శూన్యాన్ని అనుభవించాక, ఆలోచనలను అనుభవించటం కష్టం; ప్రశాంతతను అనుభవించాక, రణగొణ ధ్వనులను భరించటం మరీ కష్టం. రోజంతా నిశ్శబ్దంగా ఉండాలి, ఏ ధ్వనులూ

లేని ఏకాంతాన్ని అనుభవించాలంటే పట్నవాసంలో జరిగే పనేనా? అతని సమస్య తాత్కాలికంగా తీరుతుందే గాని, అది శాశ్వతపరిష్కారం కాదు. ఎందుకు? అతను అహంకారానికి మూలకారణమైన అజ్ఞానాన్ని జ్ఞానంతో పారద్రోలటానికి ప్రయత్నిస్తేనే కదా!

అందువల్లనే వేదాంతం, జ్ఞానంతో తప్ప వేరే ఏ మార్గం ద్వారా అహంకారాన్ని పారద్రోలటానికి ప్రయత్నించినా సమస్య తీరదు అంటుంది. సమాధిలోకి వెళ్ళినా లాభం లేదు; ఏకాంతంగా నిశ్శబ్దంగా ఉన్న ప్రాంతానికి వెళ్ళినా లాభం లేదు; కైలాస మానస సరోవరానికి వెళ్ళినా లాభంలేదు; ఆశ్రమాలకి వెళ్ళినా లాభం లేదు. ఎందుకంటే ఇవన్నీ తాత్కాలికంగా ప్రశాంతతను ఇస్తాయే కాని, శాశ్వత పరిష్కారాన్ని చూపించవు.

కొన్ని మత్తు పదార్థాలు ఆనందంలో తేలిపోయేలా చేస్తాయి. అందులో భంగు ఒకటి. మత్తు పదార్థాలకు అలవాటయినవారి అనుభవాలు వింటే, వారు పొందే ఆనందం కూడా సమాధియోగంలాగానే ఉంటుంది. నిజానికి హిమాలయ ప్రాంతాల్లో ఉండే కొందరు సన్యాసులు ఈ భంగుకు అలవాటు పడతారు. వారు ముందు సహజంగా సమాధిస్థితిలోకి వెళ్ళి ఆనందాన్ని పొందేవారు. తరువాత కారణాంతరాలవల్ల వారు ఆ సమాధిస్థితిని పొందలేకపోతారు. కాని ఆ ఆనందాన్ని పొందాలని తపన పడతారు. అందువల్ల ఆ ఆనందంకోసం వేరే మార్గాలను వెతుక్కుంటారు. ఉత్తరకాశీలో కొన్ని ఆకులనుంచి రసం పిండి, భంగు తయారుచేస్తారు. ఋషీకేశ్‌లో ఈ భంగు తీసుకునే సన్న్యాసి ఒకరిని భంగు సన్న్యాసి అనే పిలుస్తారుట కూడా. అంతలా దానికి బానిస అయిపోతారు. ఎందుకు దానికి బానిస అవుతారు? సమాధిలో పొందే ఆనందాన్ని వారు, ఈ భంగులో వెతుక్కుంటున్నారు కాబట్టి.

కాని ఇవేవీ మీకు శాశ్వత పరిష్కారాన్ని ఇవ్వవు, మీకు కావాల్సింది ఈ తాత్కాలికమైన సమాధియోగం ద్వారా తాత్కాలికమైన ఆనందం కాదు, మీకు కావాల్సింది శాశ్వతమైన ఆనందం; అది ఒక్క జ్ఞానం ద్వారానే సాధ్యం అంటుంది వేదాంతం. జ్ఞానం అహంకారాన్ని మిథ్యగా కొట్టివేస్తుంది కాబట్టి, దాని తరువాత మీరు ప్రపంచంతో వ్యవహారం నడుపుతున్నా కూడా, అహంకారం మిమ్మల్ని ఇబ్బంది పెట్టలేదు. జ్ఞానంతో అహంకారం తిరిగి లేవకుండా మటుమాయమవుతుందనే విషయాన్ని నొక్కి వక్కాణించటానికి రమణమహర్షి తలక్రిందులుగా పడ్డ వ్యక్తి మరణించినట్టుగా, అహంకారం ఆత్మలో తలక్రిందులుగా పడి మరణిస్తుందనే కవితాధోరణిలో చెప్పారు. అప్పుడేమవుతుంది?

**అథ** – దాని తరువాత. దాని తరువాత జ్ఞాని అహం పదం వాడతాడా లేదా? ఇదొక పెద్ద సందేహం అందరికీ. జ్ఞాని అహంకారాన్ని నాశనం చేశాడు కాబట్టి అహం అంటే నేను

పదం వాడకూడదు అని ఒక పెద్ద అపోహ కొందరికి. నేను వచ్చాను అనకూడదు. ఈ శరీరం వచ్చింది అనాలి అనుకుంటారు. అది పొరపాటు. జ్ఞాని కూడా అహం పదం వాడతాడు, కాకపోతే జ్ఞాని అహం పదం వాడినప్పుడు, ఆ అహం ఎవరో అతనికి స్పష్టమైన జ్ఞానం ఉంటుంది. అహం అంటే ఉనికిలేని అహంకారం కాదు, తన స్వస్వరూపమైన ఆత్మ అని అర్థం చేసుకుంటాడు.

**అహమ్ ఆత్మా అస్మి॥ అహం సచ్చిదానందస్వరూపః అస్మి॥**

**మయ్యేవ సకలం జాతం మయి సర్వం ప్రతిష్ఠితమ్।**

**మయి సర్వం లయం యాతి॥**

ఈ వాక్యాలు చెప్పినప్పుడు అహం అంటే నేను ఈ జగత్తులో పుట్టిన శరీరాన్ని కాను, దేనినుంచైతే ఈ జగత్తు పుట్టిందో, ఆ ఆత్మను నేను అని అర్థం చేసుకుంటాడు. అంతకుముందు జ్ఞాని నేను ఈ జగత్తులో పుట్టాను అనుకునే అజ్ఞాని, జ్ఞానిగా మారాక, నేనే ఈ జగత్తుయొక్క సృష్టిస్థితిలయ కారకుణ్ణి, నేను ఆత్మను అంటాడు.

ఆత్మబోధలో శంకరాచార్యులవారు జ్ఞాని మొత్తం గాలక్సీనే ఒక నీటిబుడగలా చూస్తాడు అంటారు. ఒక గాలక్సీలో లక్షల కొద్దీ నక్షత్రాలుంటాయి. అనంతమైన గాలక్సీ, అనంతమైన సముద్రం తననుంచే వచ్చాయి అంటాడు. దీన్ని రమణమహర్షి కొత్త అహం అంటారు. పాత అహాన్ని అహంకారం అంటే, కొత్త అహాన్ని ఆత్మ అంటారు. అందువల్ల అథ అంటే జ్ఞాన అనంతరం.

**అన్యత్ అహం స్ఫురతి** – అన్యత్ అహం అంటే కొత్త అహం. చిన్న నేను పోయి, పెద్ద నేనులో నెలకొనివుంటాడు. ఇంగ్లీషులో స్మాల్ *i* రాస్తే అది వంకరగా ఉంటుంది. అదే కాపిటల్ I రాస్తే అది నిటారుగా ఉంటుంది. అలాగే చిన్న నేను అయిన అహంకారం వంకర ఆలోచనలు చేయిస్తే, పెద్ద నేను అయిన ఆత్మ నిటారుగా పరిపూర్ణంగా నిలబెడుతుంది. అందువల్ల చిన్న పరిమితిని సూచించే నేను పోయి, అనంతమైన ఆత్మ 'పుడుతుంది.' పుడుతుంది పదాన్ని ఇన్‌వర్టెడ్ కామాలలో పెట్టాలి. పుట్టినట్టుగా ఉంటుంది.

స్ఫురతి అంటే చాలా స్పష్టంగా అర్థం అవుతుంది. ఆత్మ గురించి తెలుసుకోవటానికి కళ్ళు మూసుకోనవసరం లేదు. నేను ఆత్మను అని తెలుసుకోవటానికి కళ్ళు మూసుకుని సమాధి అవస్థలోకి వెళ్ళనవసరం లేదు. నేను కళ్ళు తెరుచుకునే ఆత్మను అనే జ్ఞానం పొందుతాను. నేను జాగ్రద్ స్వప్న సుషుప్తి అవస్థలన్నింటిలోనూ ఉన్న ఆత్మను. ఈ జ్ఞానం కలుగుతుంది. ఎలా?

**ప్రకృష్టం (స్ఫురతి)** – చాలా స్పష్టంగా తెలుస్తుంది. నాకు కలిగే ప్రతి అనుభవంలోనూ తెలుస్తుంది. ఆత్మజ్ఞానం ఏదో ఒక అనుభవం కాదు, ఆత్మ ప్రతి అనుభవంలోనూ తెలుస్తుంది. ఎందుకంటే ఆత్మచైతన్యం ప్రతి అనుభవంలోనూ ఉంటుంది కాబట్టి.

ఒక వస్తువుయొక్క అనుభవం ఆ వస్తువును చూస్తున్నంతసేపే ఉంటుంది. ఉదాహరణకు నేను ఒక క్లిప్‌ను చూస్తుంటే, దాని అనుభవం దాన్ని చూస్తున్నంతసేపే ఉంటుంది. దానినుంచి దృష్టి మరల్చి తెరను చూస్తే, తెర అనుభవం వస్తుంది, క్లిప్ అనుభవం పోతుంది. కాని రెండు అనుభవాలలోనూ చైతన్యం ఉంది. అలా నేను ప్రపంచంలో ఏ అనుభవం పొందుతున్నా కూడా అది చైతన్యంవల్లనే పొందుతున్నాను.

**ప్రతిబోధవిదితం మతమ్ –** కేనోపనిషత్

అందువల్ల **ప్రకృష్టం స్ఫురతి** అప్రయత్నంగా తెలుస్తుంది. దానికోసం ప్రత్యేకించి శ్రమ పెట్టనవసరం లేదు. ఈ కొత్త అహం గొప్పతనం ఏమిటి?

**తత్ న అహంకృతిః** – ఈ కొత్త అహం ఇంక అహంకారం కాదు. ఇది అహంకారానికి భిన్నంగా ఉంది. అహంకారానికి ఒక పరిమితి ఉంది, ఒక వ్యక్తిత్వం ఉంది. దాన్ని తండ్రి అనీ, భర్త అనీ, కర్త అనీ, భోక్త అనీ అంటారు. అన్నింటినీ మించి అది ఒక మహాసంసారి.

అదే ఆత్మ విషయానికి వస్తే ఆత్మకు తండ్రి, భర్త, కర్త, భోక్తా అనే పరిమితులు లేవు. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర అనే వర్ణాశ్రమ భేదాలు లేవు. ఇది అహంకారం కాదు. మరయితే ఈ అహం ఏమిటి?

ఇది సగుణ అహంకారం కాదు, నిర్గుణ ఆత్మ. ఒక గుణం వేస్తే, అది సాపేక్షికం అవుతుంది. మొదట్లో ఆత్మను నిర్వచించటానికి ఆత్మ ఆబ్జెక్టు కాదు, సబ్జెక్టు అంటుంది శాస్త్రం. కాని అద్వైతాన్ని అర్థం చేసుకున్నాక ఏ పదమూ వాడలేము అంటుంది. ఎందుకంటే ఆత్మ సబ్జెక్టు అంటే, దానికి సాపేక్షిక పదం ఆబ్జెక్టు ఉంది.

**ఆత్మ సబ్జెక్టు అంటే ఆత్మ ఆబ్జెక్టు కాదు అని చెప్పినట్టు అవుతుంది.**
**ఆత్మ దృక్ అంటే ఆత్మ దృశ్యం కాదు అని చెప్పినట్టు అవుతుంది.**
**ఆత్మ పదం వాడితేనే అది అనాత్మ కాదు అని చెప్పినట్టు అవుతుంది.**
**ఆత్మ సత్ అంటే అది అసత్ కాదు అని చెప్పినట్టు అవుతుంది.**
**ఆత్మ చిత్ అంటే అది జడం కాదు అని చెప్పినట్టు అవుతుంది.**
**ఆత్మ ఆనందం అంటే అది దుఃఖం కాదు అని చెప్పినట్టు అవుతుంది.**

అలా ఆత్మను వివరించటానికి ఏ పదం వాడినా అది ఒక గుణాన్ని గురించి చెప్పినట్టు అవుతుంది. అప్పుడు ఆత్మ సగుణం అవుతుంది. కాని ఆత్మ నిర్గుణం. అందువల్ల పరం పదం వాడుతుంది శాస్త్రం. అందువల్లనే ఆత్మ పూర్ణం. పూర్ణం అంటే ఇంకొక గుణం కాదు. పూర్ణం అంటే గుణాలు లేనిది అని అర్థం.

బట్టతల అంటే అది సానుకూల పదం కాదు. బట్టతల పదం ఒక రంగునో, రూపాన్నో వర్ణించదు. బట్టతల అంటే ఏమిటి? నెత్తిమీద జుట్టు లేదని అర్థం. బట్టతల పదం చూడటానికి ఒక గుణాన్ని సూచిస్తున్నట్టుగా ఉంది కాని, నిజానికి అది నిర్గుణాన్ని సూచిస్తున్నది. అలాగే పూర్ణం అంటే ఆత్మయొక్క గుణాన్ని సూచించే పదంగా తీసుకోకూడదు; పూర్ణం అంటే గుణాలు లేని ఆత్మ. ఆత్మ నిర్గుణం.

ఆత్మ నిర్గుణం అని చెప్పగానే విశిష్టాద్వైతులు, ద్వైతులు అదుగో మీరు ఒక గుణాన్ని వాడుతున్నారు అంటారు. ఏమిటది అంటే, నిర్గుణం అంటారు. మీ ఆత్మకు ఒక గుణం ఉంది. అది నిర్గుణం అంటారు. అలా అంటే నిర్గుణం పదాన్ని కూడా నిషేధిస్తే, అయితే అది సగుణం అవుతుంది అన్నమాట అంటారు.

అందువల్లనే ఏ పదమూ వాడము. దాన్ని పరం అంటాము అంటుంది శాస్త్రం. **పరమ్ ఏవ పూర్ణమ్॥**

కాని ఇక్కడ ఒక విషయం గుర్తు పెట్టుకోవాలి. నేను ఆత్మను, సచ్చిదానంద స్వరూపుడను, నేను తండ్రి కాదు, భర్త కాదు అనే జ్ఞానం పొందాక కూడా వ్యవహారంలోకి వచ్చేసరికి ఎవరైనా నువ్వెవరు అంటే నేను తండ్రి కాదు, నేను భర్త కాదు అనకూడదు; ఎక్కణ్ణుంచి వచ్చావు అంటే నాకు రాకపోకలు లేవు, నేను పుట్టనే లేదు, నాకు మరణం లేదు అనకూడదు. వ్యవహారం వ్యవహారమే; అందులో వేషం వేసుకోవాలి. అహంకారం అనే వేషం వేసుకోవాలి. బయటకు వెళ్ళేటప్పుడు చక్కగా దుస్తులు వేసుకుని ఎలా వెళతారో అలా జగత్తుతో వ్యవహారం నడిపేటప్పుడు అహంకారం అనే దుస్తులు తొడుక్కోవాలి. నేను ఫలానా వ్యక్తికి తండ్రిని, ఫలానా స్త్రీకి భర్తను అని పరిచయం చేసుకోవాలి. కాని వ్యవహారాలు నడుపుతున్నంతసేపూ ఇది నా అసలు స్వరూపం కాదు. ఇది నేను వేసుకున్న వేషం అని మర్చిపోకూడదు. దీన్ని అహంకార కంచుకం అంటారు సురేశ్వరాచార్యులు. ఆఫీసుకు వెళ్ళేటప్పుడు దానికి తగ్గ వస్త్రాలంకరణం చేసుకున్నట్టుగా వ్యవహారం నడిపేటప్పుడు, అహంకారం అనే వస్త్రాలంకరణ చేసుకోవాలి కాని ఇది నా వేషం మాత్రమే, నేను దాని వెనకనున్న ఆత్మను అనే విషయం మర్చిపోకూడదు. **వ్యవహారంలో ఎప్పుడూ అహంకారంలో ఉండాలి, భావనలో ఎప్పుడూ ఆత్మలో నెలకొని ఉండాలి.**

ఆత్మవిచారణ చేస్తే కలిగే ఫలమేమిటో రమణమహర్షి కవితాశైలిలో వివరిస్తున్నారు. ఆత్మజ్ఞానఫలం అహంకారం కోరలు పీకి, ఆత్మ, పెద్దనేను, దాని స్థానంలోకి వస్తుంది. ఇన్నాళ్ళూ అహంకారమే యజమానిగా రాజ్యం ఏలుతూ వస్తే, దాన్ని దాని పదవినుంచి కిందికి తోసి, ఆత్మ యజమాన్యాన్ని చేజిక్కించుకుంటుంది. ఈ విషయాన్ని రమణమహర్షి కవితాధోరణిలో చెప్పారని చూశాము. చిన్ననేను పోయి పెద్దనేను పెద్ద స్థానంలోకి వస్తుంది.

ఇదంతా బాగానే ఉంది కాని, ఈ పెద్ద మార్పు ఎలా అనుభవంలోకి వస్తుంది? అంటే జ్ఞాని హృదయంలో అహంకారం పోయి, కొత్త కాంతి ఏదైనా తళుక్కుమని మెరుస్తుందా? మెరవదు. ఇలా చిన్ననేను మటుమాయమై, పెద్దనేను ఆ స్థానంలోకి వస్తుంది అంటే, అతని జీవితంలో ఏ మార్పులు వస్తాయి?

1. **దృక్పథంలో మార్పు** – ఈ మార్పులు బాహ్యంగా జరిగే మార్పులు కావు, దృక్పథంలో పెద్ద మార్పు వస్తుంది.

జ్ఞాని ఆలోచనాతీరులో, తనను తాను అర్థం చేసుకోవటంలో మార్పు వస్తుంది. జ్ఞానానికి రాకముందు తను పరిమితి ఉన్న జీవినని అనుకునేవాడు. ఇంకా చెప్పాలంటే పొరపాటు పడేవాడు. ఆ పొరపాటునే సత్యంగా భావించి, దానికి తగ్గట్టుగానే తన జీవితాన్ని గడిపేవాడు. ఈ జగత్తుతో ఏ వ్యవహారం నడిపినా, ఆ ఒక్క పొరపాటు చుట్టూనే ఉండేది. ఇప్పుడు జ్ఞానం పొందాక, ఆత్మ అజ్ఞానం తొలగింది. అజ్ఞానం తొలగటంవల్ల దానినుంచి వచ్చిన పొరపాటూ పోయింది. నేను పరిమితి ఉన్న, అశాశ్వతమైన జీవాత్మను కాను; నేను అనంతమైన, నిత్యమైన పరమాత్మను అని ఎప్పుడైతే అర్థం చేసుకుంటాడో అప్పుడే ఇన్నాళ్ళూ తనని ఆటలాడిస్తున్న అహంకారాన్ని పక్కకినెట్టి, ఆత్మలో రమిస్తాడు.

ఎప్పుడైతే జ్ఞాని తను అహంకారం కాదు, తను ఆత్మ అని అర్థం చేసుకుంటాడో, అప్పుడే అతని దృక్పథంలో చాలా పెద్ద మార్పు వస్తుంది. అంత పెద్ద మార్పు అతను నడిపే ప్రతి వ్యవహారంలోనూ వస్తుంది. వ్యవహారం నడపటంయొక్క ఉద్దేశ్యంలో పూర్తిగా మార్పు వస్తుంది. ఇలా అహంకారాన్ని అర్థం చేసుకోవటంలో కలిగిన మార్పునే అహంకారం కోరలు పీకటమనీ, దాని రాజ్యాన్ని లాక్కోవటమనీ, ప్రభుత్వాన్ని మార్చటమనీ అంటున్నాము. దేశంయొక్క ప్రధానమంత్రి మారితే ఎలా ఉంటుందో, అలా వ్యష్టి అనే దేశం ప్రధానమంత్రి కూడా మారతాడన్నమాట. అహంకారాన్ని పక్కకునెట్టి, ఆత్మ రాజ్యమేలుతోందని కవితాధోరణిలో చెబితే, జ్ఞాని దృక్పథంలో మార్పు వచ్చిందని అర్థం. ఇన్నాళ్ళూ నేను అహంకారం అనుకున్న జ్ఞాని, ఇప్పుడు నేను ఆత్మను అని అర్థం చేసుకుంటాడు. ఇది ఒక అర్థం.

2. **అహంకారం పూర్తిగా నశించిపోదు** – పైనుంచి తలక్రిందులుగా కిందపడిన వ్యక్తి అప్పటికప్పుడే మరణించినట్టుగా, కవితాధోరణిలో అహంకారం ఆత్మలో మరణిస్తుందని చెప్పటం జరిగింది. మరణిస్తుందంటే, అహంకారం మళ్ళీ తోక జాడించదని అర్థం అని చూశాము.

ఇక్కడ ఒక విషయాన్ని బాగా అర్థం చేసుకోవాలి. అహంకారం మరణిస్తుంది అంటే అహంకారం పూర్తిగా నాశనమవదు, పూర్తిగా మటుమాయమవదు. దాని అర్థం ఇందాక చెప్పినట్టుగా మళ్ళీ తోక జాడించదని అర్థం. దాని కోరలు పీకినట్టు అవుతుంది. ఉద్యోగంలో ప్రమోషన్, డిమోషన్ పదాలు వాడతారు. ఎవరైనా ఉద్యోగం బాగా చేస్తుంటే అతనికి ప్రమోషన్ ఇస్తారు. అదే, అతను తోక జాడిస్తుంటే, ఉన్న పదవిని లాక్కుని, కిందికి తోస్తారు. దాన్ని డిమోషన్ అంటారు. డిమోషన్ అయిన వ్యక్తి ఏమీ పెత్తనం చెలాయించలేడు.

అహంకారం విషయంలో జరిగింది కూడా అదే. ఇన్నాళ్ళూ అహంకారమే రాజ్యమేలింది. అది ఆడింది ఆటగా, పాడింది పాటగా చెల్లింది. ఇప్పుడు ఆ పెత్తనాలేవీ చెల్లవు. అది ఇప్పుడు యజమాని కాదు, యజమాని వాడే ఒక పరికరం మాత్రమే. యజమాని ఆత్మ. ఆత్మ అవ్యవహారి, అకర్తా కాబట్టి అహంకారాన్ని వ్యవహారాలు నడపటానికి ఒక పరికరంగా వాడతాడు జ్ఞాని, అంతే!

ఈ విషయాన్ని చాలా బాగా అర్థం చేసుకోవాలి. జ్ఞానికి ఈ విషయం బాగా స్పష్టంగా తెలుసు. తన స్వస్వరూపం ఆత్మ అనీ, తన ఆగంతుక స్వరూపం అహంకారం అనీ, అహంకారం మిథ్య అనీ, ఆత్మ మాత్రమే సత్యం అనీ అడుగడుగనా గుర్తుంచుకుంటాడు. అహంకారం ఆగంతుకం అని ఎలా చెప్పగలరు? జ్ఞాని మరణించినప్పుడు, అంటే అతను విదేహముక్తి పొందినప్పుడు, అహంకారం పోతుంది. అందువల్ల అతను జీవించి ఉండగా, జీవన్ముక్తుడుగా ఉన్నంతవరకే, అహంకారాన్ని వాడతాడు. అందువల్ల జ్ఞాని అహంకారం తన స్వస్వరూపం కాదనీ, అది తాత్కాలికంగా తనకు ఉపయోగపడే పరికరం అనీ అర్థం చేసుకుంటాడు.

జ్ఞానికి ఈ అహంకారం తను వాడే మిథ్యా పరికరం అనీ, తను వ్యవహారం నడిపే మిథ్యా ప్రపంచానికి ఈ మిథ్యా అహంకారమే చాలనీ కూడా తెలుసు. ఎందుకంటే ఒక స్వాప్నికునికి తన స్వప్నంలో జ్వరం వచ్చిందనుకోండి, అతను స్వప్నంలోని డాక్టరు దగ్గరికే వెళ్ళాలి, స్వప్నంలోని మందులషాపుకే వెళ్ళాలి, స్వప్నంలోని మందులే వేసుకోవాలి. జ్ఞానికి ఈ జాగ్రత్ ప్రపంచం కూడా స్వప్నం–2 అనీ, అందువల్ల అది మిథ్య అనీ తెలుసు. తన అహంకారం కూడా మిథ్య అనీ తెలుసు. అందువల్ల ఈ మిథ్యాప్రపంచంలో వ్యవహారం నడపటానికి మిథ్యా అహంకారమే చాలనీ తెలుసు.

ఆ మాటకొస్తే మిథ్యా అహంకారమే చాలు అనేకన్నా, మిథ్యా అహంకారమే ప్రతి వ్యవహారానికీ కావాలి అనాలి. అది వ్యవహారం నడపాలంటే ఉండి తీరాలి. ఆఖరికి అహం బ్రహ్మ అస్మి అని చెప్పాలన్నా అహంకారం కావాలి. ఎందుకంటే అహం బ్రహ్మ అస్మి అని చెప్పటం ఒక వ్యవహారం. అది వాచికవ్యవహారం. ఆత్మ అవ్యవహారి కాబట్టి, ఆత్మ ఎన్నడూ నేను బ్రహ్మను అని చెప్పలేదు. వ్యవహారం నడపాలంటే అహంకారం ఉండితీరాలి.

ఇక్కడ ఒక సూక్ష్మభేదాన్ని గమనించాలి. జ్ఞాని బ్రహ్మలో రమించటానికి అహంకారం అవసరం లేదు. బ్రహ్మలో రమించటానికి ఎందుకు అహంకారం అవసరం లేదంటే, అహంకారం ఉన్నా లేకపోయినా కూడా అతను బ్రహ్మే. కాని నేను బ్రహ్మను అని చెప్పటానికి అహంకారం ఉండాలి. అలాగే ఒక గురువు అహం బ్రహ్మ అస్మి అని బోధ చేయటానికి అహంకారాన్నే వాడాలి. బోధ కూడా వ్యవహారమే, వ్యవహారం నడపాలంటే పరికరం కావాలి.

అందువల్ల జ్ఞాని ఏ వ్యవహారం నడపాలన్నా కూడా ఈ మిథ్యా అహంకారాన్ని వాడతాడు. కాని అహంకారంతో అంతకుముందులా మమేకం చెందదు. నేను అహంకారాన్ని వ్యవహారం నడపటానికి వాడుతున్నాను కాని అహంకారం ఉన్నా లేకపోయినా, నేను అంతకుముందు, ఇప్పుడు, ఇకముందూ కూడా బ్రహ్మనే అనే సత్యంలో నెలకొని ఉంటాడు. ఇది రెండవ అర్థం.

జ్ఞాని కూడా అహంకారాన్ని వాడతాడు; జ్ఞాని పూర్తిగా అహంకారాన్ని తప్పించుకోలేడు. కాని అహంకారాన్ని కర్త స్థాయినుంచి, కర్త వాడే ప్రమాణం స్థాయికి దింపుతాడు. జగత్తుతో వ్యవహారాలు నడపటానికి జ్ఞాని వేసుకున్న వేషం అహంకారం. అంతే!

గ్రీన్‌రూమ్‌లో అతనికి తనెవరో తెలుసు. అతను ఆత్మ అనీ, అహంకారం అనే వేషాన్ని తాత్కాలికంగా వేసుకున్నాడనీ అతనికి తెలుసు.

ఇదీ ఈ శ్లోకం 32 యొక్క సారాంశం.

ఎప్పుడైతే అహంకారాన్ని దాని పదవినుంచి తొలగిస్తాడో, ఎప్పుడైతే దాని స్థానంలో ఆత్మని ప్రవేశపెడతాడో, అప్పుడే జ్ఞాని పూర్ణత్వాన్ని అనుభవిస్తాడు. జ్ఞాని తనలోనే పూర్తి ఆనందాన్ని పొందుతాడు.

**ఆత్మన్యేవాత్మనా తుష్టః స్థితప్రజ్ఞస్తదోచ్యతే ॥** – గీత

అందువల్ల ఇంక జీవితంలో పొందాల్సినదేమీ లేదు జ్ఞానికి. 'పని పూర్తయింది.' పూర్వం ఇలా టెలిగ్రామ్ పంపేవారు. ఇప్పుడు టెలిగ్రామ్ ఎక్కడ ఉంది? అందువల్ల జ్ఞాని భగవంతునికి

ఈమెయిల్ పంపుతాడు. 'ఓ భగవంతుడా! నువ్వు నాకు మానవజన్మను ఒక ప్రయోజనం కోరి ఇచ్చావు. ఆ పని పూర్తయింది. నా జన్మ ధన్యమైంది. ఇంక నా శేషజీవితం నీ ముందు పరచాను. దాన్ని ఎలా వాడుకుంటావో నీ ఇష్టం స్వామీ.'

ఎవరో అద్భుతంగా వర్ణించారు. 'జ్ఞాని కృష్ణపరమాత్మ చేతిలో ఉన్న వేణువు.' వేణువు లోపల ఖాళీగా ఉంటుంది. అహంకారం అనే అడ్డంకి లేదు. వేణువులో తొమ్మిది రంధ్రాలు ఉన్నాయి.

**సర్వకర్మాణి మనసా సన్న్యస్యాస్తే సుఖం వశీ ।**
**నవద్వారే పురే దేహీ నైవ కుర్వన్ న కారయన్ ॥** – గీత

వేణువులో తొమ్మిది రంధ్రాలలో ఏడు రంధ్రాలు సప్తస్వరాలకు, ఒక రంధ్రం నోరు పెట్టి వేణువును మ్రోగించటానికి, ఇంకొకటి ఇంకొక చివరినుంచి సంగీతం రావటానికి.

మనిషికి కూడా నవద్వారాలు ఉన్నాయి. వాటిని అహంకారం అనే అడ్డంకి మూసివేస్తున్నది. అలా అది అడ్డం పడుతుంటే, శరీరమనే వేణువును మ్రోగించటానికి ప్రయత్నిస్తే వచ్చేదేమిటి? అపశ్రుతి మాత్రమే. ఆ అపశ్రుతి మరేమీ కాదు, కుటుంబంలో రేగే అల్లకల్లోలాలు, సంస్థలో కలిగే భేదాభిప్రాయాలు. వీటన్నిటికీ కారణం అహంకారమే. కాని ఎప్పుడైతే జ్ఞాని ఈ అహంకారమనే అడ్డంకి తొలగిస్తాడో, అప్పుడే అతను కృతకృత్యుడు అవుతాడు. అటువంటి జ్ఞాని నలుగురిలో ప్రత్యేకంగా కనిపిస్తాడు.

మనుషుల్లో చాలామందికి జీవితం ఒక నిరంతర పోరాటం. వారి మొహాల్లో ఆందోళన కొట్టొచ్చినట్టు కనబడుతుంది. ముక్కుమీదే ఉంటుంది కోపం. కాస్త కదిలిస్తే చాలు, అగ్నిపర్వతంలా పేలుతుంది వారి కోపం. ఇది మామూలుగా మనుషుల పరిస్థితి. కాని జ్ఞాని వీరికి భిన్నంగా ప్రత్యేకంగా నిలుస్తాడు. ఎవరంటున్నారు ఈ మాట? రమణమహర్షి అంటున్నారు. ఇప్పుడు శ్లోకం 33 చూద్దాము.

**శ్లోకం 33**

**అహంకృతిం యో లసతి గ్రసిత్వా**
**కిం తస్య కార్యం పరిశిష్టమస్తి ।**
**కించిద్విజానాతి స నాత్మనోఽన్యత్**
**తస్య స్థితిం భావయితుం క్షమః కః ॥**

**ప్రతిపదార్థం:** యః = ఏ జీవన్ముక్తుడు; అహంకృతి = అహంకారాన్ని; గ్రసిత్వా = మింగి; లసతి = ప్రకాశిస్తున్నాడో; తస్య = ఆ జీవన్ముక్తునికి; పరిశిష్ఠ కార్యం = మిగిలిన కార్యం;

కిమ్ = ఏమి; అస్తి = ఉంది; సః = అహంకారాన్ని మింగిన ఆ జ్ఞాని; ఆత్మనః = ఆత్మకన్నా; అన్యత్= వేరైనది; కించిత్ = దేనిని ఎరుగడు; తస్య = జ్ఞానియొక్క; స్థితిమ్ = స్థితిని; భావయితుం = ఊహించటానికి; కః = ఎవరు; క్షమః = సమర్థుడు.

**తాత్పర్యం:** అహంకారవిముక్తుడైన జీవన్ముక్తునికి చేయవలసిన కార్యం లేదు. ఎందుకంటే ఆ జ్ఞానికి ఆత్మకన్నా భిన్నమైనది లేదు. జ్ఞానియొక్క స్థితి ఊహించటానికి ఎవరు సమర్థుడు?

**వివరణ: యః** – యః అంటే జ్ఞాని. ఈ జ్ఞాని విజయవంతంగా ఆత్మవిచారణ చేశాడు, అంటే గవేషణమ్ చేశాడు. ఈ పదాన్ని ముందు శ్లోకంలో చూశాము.

**అహంకృతిం గ్రసిత్వా** – గవేషణం చేసిన జ్ఞాని, అహంకారాన్ని మింగేశాడు. మింగేశాడు అంటే అక్షరాలా మింగినట్టు కాదు, అహంకారం మిథ్య అని అర్థం చేసుకున్నాడని అర్థం. మనం నిద్రనుంచి లేస్తే స్వప్నప్రపంచాన్ని మింగేస్తాము అంటే అర్థం ఏమిటి? నిద్ర లేవగానే స్వప్నంలో జరిగిన అనుభవాలు నిజం కాదని, అవి మిథ్య అని అర్థం చేసుకుంటాము. దాన్నే గ్రసినం అంటారు. **మిథ్యాత్వ నిశ్చయ ప్రవిలాపనమ్**

అహంకారాన్ని లయ చేసి, దాని స్థానంలో ఆత్మను నిలబెట్టాక,

**లసతి** – మెరుస్తాడు. ప్రకాశిస్తాడు. తక్కినవారికి భిన్నంగా, ప్రత్యేకంగా కనిపిస్తాడు. అతనిలో అయస్కాంతంలా ఇతరులను ఆకర్షించే శక్తి ఉంటుంది. కృష్ణపరమాత్మ పేరులోని కృష్ణ అంటే అర్థం – సర్వాన్ కర్షతి. అందరినీ తన వ్యక్తిత్వంవల్ల తనవైపు ఆకర్షించుకుంటాడని అర్థం. కృష్ణ పదానికి వ్యతిరేకపదం సంసారి. సంసారి అందరినీ తననుంచి దూరంగా పారిపోయేలా చేస్తాడు. సంసారితో గట్టిగా రెండు రోజులు కూడా కలిసి ఉండలేరు. అతన్నుంచి పారిపోవటానికి ప్రయత్నిస్తారు.

దానికి భిన్నంగా జ్ఞాని మూర్తీభవించిన ఆనందంలా ఉంటాడు కాబట్టి, అతను ప్రత్యేకంగా ఉంటాడు. అందువల్ల లసతి. అంతేకాదు,

**తస్య కిం కార్యం పరిశిష్టమ్ అస్తి** – ఇంక అతను సాధించాల్సిన కార్యం ఏం ఉంటుంది? కార్యం ఏం ఉంటుంది అని అడిగితే, అది ప్రశ్న కాదు. అతనికి ఇంక ఏమీ ఉండదని అర్థం. దీన్ని రిటారికల్ కొశ్చెన్ అంటారు. ప్రశ్నలోనే లేదు అనే జవాబు ఇమిడివుంది.

ఎందుకు జ్ఞాని సాధించాల్సింది ఏమీలేదు? ధర్మార్థకామమోక్షాల్లో అతను మోక్షం పొందనవసరం లేదు. ఎందుకంటే అతను మోక్షం ముందే పొందేశాడు. అతను తను నిత్యశుద్ధముక్త పురుషుణ్ణి అని నేర్చుకుంటాడు. పోనీ ధర్మార్థకామాలు సాధించాలా? లౌకిక విద్యలోలాగా ఆధ్యాత్మిక విద్యకు కూడా నెలనెలా పరీక్షలు పెట్టేట్టయితే ఈ ప్రశ్న మొదట

వస్తుంది. కాని మీ అదృష్టం బాగుండి అలా పరీక్షలు లేవు. జ్ఞాని ధర్మార్థకామాలు కూడా పొందనవసరం లేదు. ఎందుకంటే ధర్మార్థకామాలు మోక్షంలో కలిసిపోతాయి.

**యావానర్థ ఉదపానే సర్వతః సంప్లుతోదకే।**
**తావాన్ సర్వేషు వేదేషు బ్రాహ్మణస్య విజానతః॥** – గీత

పెద్ద సరస్సులో నీరు ఉంటే, చిన్న కొలనుతో పనిలేదు. అన్నీ అందులో వస్తాయి. అనంతంలో పరిమితి ఉన్నవన్నీ వస్తాయి. అందువల్ల అనంతమే పొందాక, చిన్నచిన్నవాటి వెంట పరుగులు తీసే పనిలేదు. అందువల్ల జ్ఞాని దేన్నీ పొందాల్సిన పనిలేదు. అందువల్ల ఏమీ చేయనవసరం లేదు. దానికి అనేక కారణాలు చెప్పవచ్చు.

1. అతను మోక్షం పొందాడు కాబట్టి ఇంకేమీ పొందనవసరం లేదు.

2. అతను కర్తా భోక్తా కాదు కాబట్టి ఏ పనీ చేయడు. కర్తా భోక్తా అయితే బోలెడు కర్మలు చేయాల్సి ఉంటుంది. కర్తగా భావిస్తే భవిష్యత్తును తీర్చిదిద్దుకోవటానికి అనేక కర్మలు చేయాల్సి ఉంటుంది. లేదా అనేక కర్తవ్యాలు నిర్వర్తించాల్సి ఉంటుంది. వారికి వారికంటూ లౌకిక విజయాలను కోరే తీరిక ఉండకపోవచ్చు కాని, వారితో అనుబంధం ఉన్నవారి పనులను నెరవేర్చాల్సిన ధర్మం లేదా బాధ్యత ఉంటుంది. ఆ బాధ్యతను వెన్నంటే ఆందోళన కూడా ఉంటుంది.

భార్య అతన్నుంచి ఎన్నో ఆశిస్తుంది. పిల్లలు ఎన్నో ఎదురుచూస్తారు. అదికాక, మనవళ్ళ బాధ్యత కూడా ఇప్పుడు చేపడుతున్నారు. ముఖ్యంగా మన భారతదేశం బాధ్యతలకు పెట్టింది పేరు. అన్నింటికన్నా మనిషికి భారంగా ఉండేది ఈ బాధ్యతే. పైగా దురదృష్టకరమైన విషయం ఏమిటంటే చివరిశ్వాస వదిలేవరకూ ఈ బాధ్యతలు చుట్టుముట్టుతూనే ఉంటాయి.

వేదాంతం, ఈ బాధ్యతలు ఎన్నటికీ పూర్తికావు అంటుంది. కర్తగా మిమ్మల్ని మీరు భావించుకున్నంతవరకూ బాధ్యతలు పుట్టుకొస్తూనే ఉంటాయి. సముద్రంలో అలలు ఎలా ఒకదాని వెంట ఒకటి వస్తూనే ఉంటాయో, అలా బాధ్యతల్లో కూడా ఒకటి తీరింది అనుకునేలోపు ఇంకొకటి పుట్టుకొస్తూనే ఉంటుంది.

జ్ఞానికి ఈ బాధ్యతలు ఉండవు. ఎందుకంటే అతను తను కర్త అనుకుంటే కదా కర్తకుండే బాధ్యతలు అతన్ని చుట్టుముట్టటానికి. అంటే అతను బాధ్యతారహితంగా ప్రవర్తిస్తాడు అనకూడదు. కాని అవి నేను చేస్తున్నాను అనుకోడు. అతను బాధ్యతలన్నింటినీ మిథ్యా అహంకారానికి అప్పచెప్పేస్తాడు. అందువల్ల బాధ్యతలను వెన్నంటి వచ్చే ఆందోళన అతన్ని బాధించదు. మిథ్యా అహంకారం నెరవేర్చే బాధ్యతల్లో కొన్ని తీరతాయి, చాలామటుకు తీరకపోవచ్చు. కాని అతను వాటికి చలించదు. అదంతా జీవితమనే నాటకంలో ఒక

భాగమని అర్థం చేసుకుంటాడు. అందువల్ల కర్తవ్యం నెరవేర్చటం కూడా నాటకంలో ఒక భాగమే.

తన బాధ్యతల్లో ఏవైనా తీర్చలేకపోతే కృంగి కృశించిపోడు. ఆరోగ్యాన్ని పాడు చేసుకోడు. నిద్రలేని రాత్రులను గడపడు. ఎవరంటున్నారు ఈ మాట. రమణమహర్షి.

**కిం తస్య కార్యం పరిశిష్టమస్తి** – ఆ జీవన్ముక్తునికి ఇంక మిగిలివున్న కార్యం ఏం ఉంది? అతను కృతకృత్యుడయ్యాడు. అతను పరిపూర్ణుడయ్యాడు.

కాని నేను పూర్ణుడయ్యాను, నేను చేసే కార్యం ఇంక ఏమీ లేదని కుటుంబసభ్యులతో చెప్పకండి. వారు మిమ్మల్నేమీ అనరు. ఇలాంటి బోధలు చేసి, మిమ్మల్ని బాధ్యతారహితులుగా చేస్తున్నారని స్వామీజీని తిడతారు అని హాస్యంగా చెబుతున్నారు స్వామీజీ.

నిజానికి వారు మిమ్మల్ని సరిగ్గా అర్థం చేసుకోవటంలేదు. మిమ్మల్ని శాస్త్రం బాధ్యతారహితులుగా చేయటం లేదు. మిమ్మల్ని నిర్లక్ష్యంగా ప్రవర్తించమనటం లేదు. మిమ్మల్ని కర్మలు చేయకుండా బద్ధకస్తునిగా మార్చటం లేదు. మరేం చేస్తోంది శాస్త్రం? శాస్త్రం ఆందోళనలను పారద్రోలుతున్నది; తీవ్రంగా ప్రతిస్పందన చూపకుండా తీర్చి దిద్దుతోంది. మీ బాధ్యతలను మీరు ప్రశాంతమనస్సుతో నెరవేర్చేటట్టుగా చేస్తోంది. దీన్నే జీవన్ముక్తి అంటారు. అందువల్ల కిం తస్య కార్యం పరిశిష్టమస్తి అంటున్నది. అంతేకాదు,

**సః** – ఈ వివరణ అంతా జీవన్ముక్తి పొందిన జ్ఞాని గురించి అని, అతను జ్ఞానాన్ని ఆత్మవిచారణ చేసి పొందాడనీ మరిచిపోకూడదు. అటువంటి జ్ఞానికి కలిగే ఫలాన్ని వివరిస్తున్నారు ఇక్కడ.

**(సః) ఆత్మనః అన్యత్ కించిత్ న విజానాతి** – జ్ఞానికి ఆత్మకు భిన్నంగా ఏమీలేదు. న విజానాతి అంటే ఏదీ చూడడు, అనుభవించడు. ఆత్మకు భిన్నంగా దేన్నీ చూడడు, దేన్నీ అనుభవించడు. అంటే అతని ఎదురుగా ఉన్న ప్రతిదీ ఆత్మే అతనికి.

**ఇదం బ్రహ్మ ఇదం క్షత్రమ్ ఇమే లోకా ఇమే దేవాః।**
**ఇమాని భూతాని ఇదగ్ం సర్వం యదయమాత్మా॥**

**ఆత్మా ఏవ ఇదగ్ం సర్వమ్** – ఇక్కడ ఉన్నదంతా ఆత్మే! మరయితే నేను అనుభవిస్తున్న అనాత్మ విషయం ఏమిటి? అనాత్మకు విడిగా ఉనికి లేదు. అవి కేవలం నామరూపాలు మాత్రమే. ఉన్నదొకటే ఆత్మ. ఆత్మమీద ఆరోపించబడిన నామరూపాలు అవి. ఈ సృష్టి మొత్తం మిథ్యా నామరూపాలు మాత్రమే. వాటికి అధిష్ఠానమైన ఆత్మమీద అవి ఆరోపించబడ్డాయి అంతే. ఎలాగైతే స్వప్నప్రపంచంలో కనబడే అనేకానేక స్వప్నవస్తువులు జాగ్రత్‌పురుషునికి

భిన్నంగా ఎలా లేవో, అలా జాగ్రత్ ప్రపంచంలో కనబడే అనేకానేక జాగ్రత్ వస్తువులు ఆత్మకు భిన్నంగా లేవు.

**విశ్వం దర్పణదృశ్యమాననగరీతుల్యం నిజాన్తర్గతం**
**పశ్యన్నాత్మని మాయయా బహిరివోద్భూతం యథా నిద్రయా।**
**యః సాక్షాత్కురుతే ప్రబోధసమయే స్వాత్మానమేవాద్వయం**
**తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే ॥**

అదే అర్థం ఇక్కడ కూడా. ఆత్మను తప్ప వేరే దేన్నీ చూడదు జ్ఞాని. వేరే ఏం చూసినా అది మిథ్యా నామరూపం మాత్రమే.

ఒక్కమాటలో చెప్పాలంటే రమణమహర్షి నేను జ్ఞానిని వర్ణించటానికి పూనుకున్నాను కాని, అతన్ని మాటలతో వర్ణించటం కష్టమని అర్థమయింది అంటారు. అతని మనఃస్థితి యొక్క లోతులు కొలవటం చాలా కష్టం. మీకు నిజంగా జ్ఞాని మనఃస్థితి తెలుసుకోవాలని ఉంటే, దానికొకటే మార్గం ఉంది అంటున్నారు రమణమహర్షి. ఏమిటో చెప్పగలరా? జ్ఞాని అవటమే! జ్ఞాని గురించి తెలుసుకోవాలంటే మీరు జ్ఞాని అవటం ఒక్కటే మార్గం. ఇది వివరించే ఒక శ్లోకం ఉంది.

**విద్వానేవ విజానాతి విద్వజ్జన పరిశ్రమమ్।**
**న హి వంధ్యా విజానాతి గుర్వీమ్ ప్రసవవేదనామ్॥**

గొడ్రాలు, కడుపుతో ఉన్న స్త్రీ ప్రసవవేదనను అర్థం చేసుకోలేనట్టుగా అజ్ఞాని జ్ఞానిని అర్థం చేసుకోలేడు. జ్ఞానిని జ్ఞాని మాత్రమే అర్థం చేసుకోగలడు.

**తస్య స్థితిం భావయితుం క్షమః కః** – జ్ఞాని మనఃస్థితి అర్థం చేసుకోవటానికి ఎవరు సమర్థుడు? స్థితి అంటే మనఃస్థితి; భావయితుం అంటే ఊహించటానికి; క్షమ అంటే సమర్థుడు; కః అంటే ఎవరు? అన్నీ కలిపితే జ్ఞాని మనఃస్థితిని అర్థం చేసుకోవటానికి ఎవరు సమర్థుడు? సామర్థ్యం ఎవరికి ఉందని ప్రశ్నిస్తే అది నిజానికి ప్రశ్న కాదు. ఎవరికీ లేదని దాని అర్థం. దీన్ని రిటారికల్ కొశ్చెన్ అంటారని చూశాము.

**శ్లోకం 34**

**ఆహ స్ఫుటం తత్త్వమసీతి వేద–**
**స్తథాప్యసంప్రాప్య పరాత్మనిష్ఠామ్ ।**
**భూయో విచారో మతిదుర్బలత్వం**
**తత్సర్వదా స్వాత్మతయా హి భాతి ॥**

**ప్రతిపదార్థం:** వేదః = వేదం; తత్త్వమసి = ఆ బ్రహ్మవు నువ్వే అయి ఉన్నావు; ఇతి స్ఫుటం= అని స్పష్టంగా; ఆహ = చెబుతున్నది; తథాపి = అయినా; పరమాత్మనిష్ఠామ్ = పరమాత్మనిష్ఠను; అసంప్రాప్య = పొందక; భూయః = మళ్ళీ; విచారః = వాచావేదాంతం; మతిదుర్బలత్వం= మనోదౌర్బల్యం; భవతి = అవుతుంది; తత్ = ఆ బ్రహ్మ; సర్వదా = నిరంతరం; స్వ+ ఆత్మతయా = తన ఆత్మగా; భాతి హి = ప్రకాశిస్తూనే ఉంది.

**తాత్పర్యం:** వేదం తత్త్వమసి – ఆ బ్రహ్మవు నువ్వే అయి ఉన్నావు అని స్పష్టంగా చెబుతున్నది. అయినా సహజమైన పరమాత్మనిష్ఠను పొందక, నేను ఆత్మను, శరీరాన్ని కాదు అనే కేవల వాచావేదాంతం మనోదౌర్బల్యం అవుతుంది. ఆ బ్రహ్మ నిరంతరం తన ఆత్మగా ప్రకాశిస్తూనే ఉంది.

**వివరణ:** ఇది చాలా ముఖ్యమైన శ్లోకం. ఇందులో చెప్పబడిన అంశం చాలా ముఖ్యమైనది. ఇక్కడ రమణమహర్షి బోధ చేసే సిద్ధాంతం గురించిన అతి ముఖ్యమైన ఆధారం (క్లూ) దొరుకుతుంది. ఆత్మవిచారణ చేయాలంటే వేదాంతవిచారణ చేయాలనే సూత్రాన్ని ఆయన నమ్ముతారని మనకి ఈ శ్లోకం సూచిస్తుంది.

రమణమహర్షి అనుయాయుల మధ్య ఇదొక పెద్ద అపోహ ఉంది. ఆత్మవిచారణ చేయాలంటే వేదాంతవిచారణ చేయాలా వద్దా అనే చర్చ వస్తే, చాలామంది ఆత్మవిచారణ చేయటానికి గురువు అవసరం లేదు, వేదం అవసరం లేదు, వేరే ఏదీ అవసరం లేదు అంటారు. అది పొరపాటు అని ఈ శ్లోకం పరోక్షంగా సూచిస్తుంది. ఆత్మవిచారణ అంటే వేదాంతవిచారణే అని చెప్పకనే చెబుతుంది.

**ఆత్మా వా అరే ద్రష్టవ్యః శ్రోతవ్యో మంతవ్యో నిదిధ్యాసితవ్యః** – బృహదారణ్యకమ్

బృహదారణ్యకోపనిషత్తులో ఆత్మజ్ఞానం పొందాలంటే శ్రవణ మనన నిదిధ్యాసనలు చేసితీరాలని వస్తుంది.

ఈ విషయాన్ని ఇక్కడ రమణమహర్షి సూచనప్రాయంగా తెలియచేస్తున్నారు. ఇది చాలా ముఖ్యమైన సలహా. ఎందుకంటే వేదాంతం నేర్చుకునే శిష్యుడు వేదాంత విచారణ ఎలా చేయాలో తెలుసుకుని తీరాలి. ఎందుకంటే అది చాలా ముఖ్యమైన సాధన లేదా ముఖ్యమైన పరికరం.

నిజజీవితంలో కూడా ఏ పరికరమైనా కూడా, దాన్ని సరిగా వినియోగించుకోగలిగితే అది మనకు ఒక దీవెన; కాని దాన్ని సరిగా వినియోగించుకోలేకపోతే మాత్రం, రెండు సమస్యలు ఎదురవుతాయి. ఒకటేమో దానినుంచి మనం ఆశించిన ఫలం రాదు. రెండవది

ఇంకా దారుణం. ఎందుకంటే ఆశించిన ఫలం రాకపోయినా ఫర్వాలేదు కాని, రెండవ సమస్య ప్రతికూల ఫలాన్ని ఇవ్వవచ్చు లేదా సమస్యను సృష్టించవచ్చు. ఇది ఒక పరికరం యొక్క సామాన్యసూత్రం.

చిన్న చాకు విషయమే తీసుకోండి. ఆ చాకుని మీరు చాకచక్యంగా వాడగలిగితే దానితో సునాయాసంగా కూరలు కోసుకోగలరు, పండ్లు కోసుకోగలరు, ఇంకా ఎన్నో పనులు చేసుకోగలరు. అలాగే కత్తితో తాడుని కత్తిరించాలనుకోండి, దాన్ని ఒడుపుగా పుచ్చుకుని సరిగ్గా కత్తిరించకపోతే, తాడు బదులు మీ చేతిని కోసుకునే ప్రమాదం ఉంది. అంటే రెండు సమస్యలు ఎదుర్కొన్నారు. ఒకటి ఆశించినట్టుగా తాడును కోయలేకపోయారు; రెండు తాడును కోయలేకపోగా, మీ చేతిని కోసుకున్నారు.

ఇదే సూత్రం వేదాంతవిచారణకు కూడా వర్తిస్తుంది. వేదాంతవిచారణ కూడా ఒక పరికరమే. అది కూడా మామూలు పరికరం కాదు, పవిత్రమైన పరికరం. కాని ఇక్కడ రమణమహర్షి స్టాట్యుటరీ వార్నింగ్ ఇస్తున్నారు. ఇంత పవిత్రమైన పరికరాన్ని కూడా మీరు సరిగ్గా వినియోగించకపోతే, అది ఇవ్వాల్సిన ప్రయోజనం ఇవ్వకపోగా, మీకు సమస్యను సృష్టించవచ్చు.

అది తెలియాలంటే ముందు వేదాంతవిచారణ చేస్తే వచ్చే ఫలమేమిటో తెలియాలి. అప్పుడే దాన్ని సరిగ్గా వాడగలుగుతారు. వేదాంతవిచారణ అన్నింటినుంచీ స్వేచ్ఛను ప్రసాదిస్తుంది. వేదాంతవిచారణ మీకు లౌకిక బంధాలనుంచి, ఆధ్యాత్మిక బంధాలనుంచి విముక్తి ప్రసాదించటానికి తోడ్పడే సాధన. ఆధారపడటం అంటూ జరిగితే అది బంధమే అంటుంది వేదాంతం. అందువల్ల దేనిమీదా ఆధారపడకూడదు. ఆఖరికి భగవంతునిమీద ఆధారపడటం కూడా బంధమే అంటాడు ఒక గొప్ప తమిళ విద్వాంసుడు.

వేదాంతం నిర్దాక్షిణ్యంగా ఖండిస్తుంది ఏ బంధాన్నైనా, ఆఖరికి అది భగవంతునితోనైనా! బంధం ఉంది అంటే అది సంగత్వం కిందికి వస్తుంది. సంసారం అంటే సంగత్వం తప్ప ఏమీకాదు. మోక్షం అంటే ఈ సంగత్వంనుంచి విడివడాలి. అంటే దేనితోనూ బంధం పెంచుకోకూడదు, దేనిమీదా ఆధారపడకూడదు. తమాషా ఏమిటంటే వేదాంతంమీద కూడా సంగత్వం పెంచుకోకూడదు అంటుంది వేదాంతం.

వేదాంతాన్ని మీకు జ్ఞానం పొందటానికి వినియోగించుకోవాలి. మీరు జ్ఞానం పొంది, తద్వారా మోక్షం పొందాలి అనే లక్ష్యాన్ని మర్చిపోకూడదు. వేదాంతం అనే పరికరం వాడి, తద్వారా అన్నింటినుంచీ విడివడాలి అనే విషయాన్ని మర్చిపోకూడదు. ఈ లక్ష్యాన్ని కనుక మర్చిపోతే, వేదాంతాన్ని జ్ఞానం పొందే లక్ష్యంగా వాడే బదులు, ఆనందాన్ని ఇచ్చే మార్గంగా వినియోగించే ప్రమాదం ఉంది.

మీరొక ప్రాథమిక ప్రశ్న వేసుకోవాలి. వేదాంతం ఉన్నది జ్ఞానం పొందటానికా, దానినుంచి సరదా పొందటానికా? కొంతమంది జ్ఞానం పొందటానికి వాడితే, మరికొంతమంది సరదా పొందటానికి వాడతారు. ఇప్పటి విద్యావిధానంలో పిల్లలకు ఆటపాటలతో కలగలిపి విద్యను నేర్పిస్తారు కొన్నిచోట్ల. అలా వేదాంతంలో కూడా కొందరు గురువులు జోక్స్ వేస్తూ వేదాంతాన్ని బోధిస్తారు. అలా చేయగలిగితే మంచిదే. కాని అప్పుడు కూడా ప్రాథమిక లక్ష్యాన్ని మర్చిపోకూడదు. జోక్స్ ఎక్కువైతే, శిష్యులు జోక్స్‌ని మాత్రమే గుర్తుపెట్టుకుని, అసలు విషయాన్ని మర్చిపోతారు.

శిష్యులను క్లాసు ఎలా ఉందని అడిగితే, చాలా బాగుంది అంటారు. గురువు ఏం చెప్పారు అని అడిగితే, వారికి జోక్స్ మాత్రమే గుర్తుంటాయి కాని గురువు ఆ జోక్స్ ఎందుకు చెప్పారో, తద్వారా గుర్తుంచుకోవాల్సిన అంశమేమిటో గుర్తుండదు. వేదాంతం ఉన్నది మిమ్మల్ని జోక్స్‌తో అలరించటానికి కాదు; వేదాంతం ఉన్నది మీ స్వస్వరూపాన్ని తెలియజేయటానికి, మీ స్వస్వరూపం ఆనందస్వరూపం అని తెలియజేయటానికి.

కాని ఈ విషయాన్ని సరిగ్గా అర్థం చేసుకోలేకపోతే, వేదాంతం**నుంచి** ఆనందం పొందటానికి ప్రయత్నిస్తారు. వేదాంతం మీకు ఆనందాన్ని, శాంతిని ప్రసాదిస్తుంది అని భావించి, తక్కినవాటిమీద ఉన్న బంధాలన్నింటినీ వదులుకుని, వాటి బదులుగా వేదాంతంమీద బంధం పెంచేసుకుంటారు. ఏ కారణంవల్లనైనా వేదాంతం నేర్చుకోలేకపోతే, లేదా వేదాంతబోధకు వెళ్ళలేకపోతే విపరీతమైన చిరాకు, కోపం వచ్చేస్తుంది. వేదాంతం మిమ్మల్ని బంధాలనుంచి విడదీయాల్సింది పోయి, ఇంకొక కొత్త బంధంలో పడవేస్తున్నది. బంధం బంధమే, బంధం సంసారమే! బంధాలనుంచి విడివడాలి అంటే వేదాంతంమీద కూడా బంధం పెంచుకోకూడదు. అలా బంధం పెంచుకుంటున్నారు అంటే వేదాంతాన్ని మీరు సరిగ్గా వాడటం లేదని అర్థం. ఈ శ్లోకంలో ఈ ప్రత్యేకమైన సలహాని ఇస్తున్నారు రమణమహర్షి . శ్లోకం చూడండి!

**వేదః తత్ త్వమ్ అసి ఇతి స్ఫుటమ్ ఆహ** – వేదాంతం చాలా స్పష్టంగా నువ్వు బ్రహ్మవు అయివున్నావు అని చెబుతున్నది. నువ్వు బ్రహ్మవు అంటే ఏమిటి అర్థం? నువ్వే ఆనందస్వరూపుడవు, నువ్వే శాంతిస్వరూపుడవు అని అర్థం. కాబట్టి నీ ఆనందంకోసం, నీ శాంతికోసం నువ్వు ఎవరిమీదా ఆధారపడనవసరం లేదు; ఆఖరికి వేదాంతంమీద కూడా అని చాలా స్పష్టంగా చెబుతున్నది అంటున్నారు రమణమహర్షి. జాగ్రత్తగా గమనించాలి ఆ వ్యత్యాసాన్ని. వేదాంతం నేను కూడా మీ శాంతి ఆనందాలకు కారణాన్ని కాదు అని చెప్పకనే చెబుతున్నది. మీరు ఏ శాంతి ఆనందాలకోసం వెంపర్లాడుతున్నారో మీరే

ఆ శాంతిస్వరూపులు, మీరే ఆనందస్వరూపులు. వాటికోసం నామీద కూడా ఆధారపడనవసరం లేదు అంటున్నది వేదాంతం.

అందువల్ల మీరు కోరుతున్న శాంతి, ఆనందాలను మీనుంచే పొందండి, నానుంచి కాదు అని వేదాంతం చెబుతున్నది. ఇతి స్ఫుటమ్ ఆహ – ఈ మాట వేదాంతం చాలా స్పష్టంగా చెబుతున్నది. మీరే బ్రహ్మ కాబట్టి మీరే ఆనందస్వరూపులు అంటున్నది. అందువల్ల వేదాంతం ఒక మంచి గురువులాగా, నాతోసహా, దేనిమీదా ఆధారపడకండి అంటున్నది.

గురువు, మంచిగురువు అయితే, దేనిమీదా ఆధారపడకండి, నాతో సహా అని చెప్పగలగాలి. ఒకవేళ గురువు ఆనందహేతువు అయితే అది కూడా సంసారమే అవుతుంది. సంసారం అంటే దేనిమీదో ఒకదానిమీద ఆధారపడటం అని చూశాము. గురువు కూడా సంసారి అయిపోతాడు. శిష్యుడు తనమీద ఆధారపడాలి అని భావిస్తే, ఆ గురువు శిష్యుడు స్వతంత్రంగా ఎదిగితే భరించలేడు. ఆ శిష్యునిమీద కోపం కూడా వస్తుంది. కొంతమంది తల్లిదండ్రులకు వారి పిల్లలు ఎంత ఎదిగినా వారు స్వతంత్రంగా ఆలోచించినా, ప్రవర్తించినా భరించలేరు. అలా తల్లిదండ్రులు భరించలేకపోతే అర్థం ఉంది. ఎందుకంటే వారు ఇంకా సంసారంలోనే కూరుకుపోయి ఉన్నారు. కాని వేదాంతబోధ చేసే గురువు అలాంటి బంధం పెంచుకోకూడదు. ఆ గురువు సంసారానికి అతీతంగా ఎదగాలి.

**తథాఽపి** – తథా అపి – అంత స్పష్టంగా వేదాంతం చెప్పినాకూడా. ఏం చెప్పింది? మీ శాంతి, ఆనందాలకు ఆధారం నేను కాదు, మీరు శాంతిస్వరూపులు, మీరే ఆనందస్వరూపులు. ఎందుకంటే మీరు బ్రహ్మ కాబట్టి అని చెప్పింది. అలా చెప్పినా కూడా,

**పరాత్మనిష్ఠామ్ అసంప్రాప్య** – కొంతమంది ఈ పరమాత్మ నిష్ఠను పొందకుండా ఉన్నారు. అసంప్రాప్య అంటే పొందకుండా; దేన్ని పర+ఆత్మ+నిష్ఠామ్ – తను బ్రహ్మ అనే తన సహజస్థితిని. రెండూ కలిపితే, కొందరు వారి బ్రహ్మస్వరూపజ్ఞానంలో నెలకొని ఉండలేరు. వారే ఆనందస్వరూపులు అని జీర్ణించుకోలేకపోతే ఏం చేస్తారు? ఆనందంకోసం ఏదో ఒకదానిమీద ఆధారపడతారు. అంతకుముందు ఈ ఆనందం పొందటంకోసం ఏ క్లబ్‌కో, ఏ సినిమాకో వెళితే, ఇప్పుడు ఆనందం పొందటంకోసం వేదాంతబోధకు వస్తారు.

వేదాంతవిచారణయొక్క ఉద్దేశ్యం అది కానేకాదు. కాని ఆ విషయం అర్థంకాక జీవితాంతం వేదాంతం నేర్చుకోవాలనుకుంటారు. అంతకుముందు వేరే అలవాటుకి బానిస అయితే, ఇప్పుడు వేదాంతబోధకు బానిస అవుతారు. ఏ కారణంవల్లనైనా ఆ క్లాసులకు కొన్నాళ్ళు వెళ్ళలేకపోతే తెగ బాధపడిపోతారు.

**భూయో విచారః** – అందువల్ల మళ్ళీమళ్ళీ వేదాంతవిచారణ చేయాలనుకుంటారు. వారే ఆనందస్వరూపులు అనే విషయం తెలుసుకోలేక, వేదాంతంలో ఆనందాన్ని వెతుక్కుంటారు. వేదాంతవిచారణ అసలు ఉద్దేశ్యం మీరు బ్రహ్మ, మీరు ఆనందస్వరూపులు అని అర్థమయ్యేలా చేయటం; కాని దాన్ని అర్థం చేసుకోక, వేదాంతవిచారణ చేస్తే ఆనందం దొరుకుతుందని భావించి, యాంత్రికంగా, గుడ్డిగా ప్రతిరోజూ బోధకు వెళుతుంటారు.

**మతిదుర్బలత్వమ్** – అది మనోదౌర్బల్యం తప్ప వేరే ఏమీకాదు. వేదాంతవిచారణ కొనసాగించకూడదు అనటం లేదు. వేదాంతవిచారణ చేస్తూ పోవచ్చు కాని వేదాంతం బోధించిన సారాంశాన్ని మర్చిపోకూడదు. శ్రవణం అంటే కొన్ని సంవత్సరాలపాటు వేదాంతవిద్యను అభ్యసించటం అని వస్తుంది. అందువల్ల వింటూ ఉండటంలో తప్పు ఉంది అనటం లేదు. కాని ఎందుకు వింటున్నారో మర్చిపోకూడదు. వేదాంతబోధమీద ఆధారపడటానికి వెళ్ళకూడదు; వేదాంతబోధ ద్వారా మీ స్వస్వరూపంలో నిలవటానికి వెళ్ళాలి. అందువల్ల ఈ విషయం గ్రహించకుండా వేదాంతంమీద ఆధారపడితే అది మనోదౌర్బల్యం అంటున్నారు రమణమహర్షి. అలా చేస్తే మనస్సు పరిపక్వత చెందలేదని అర్థం. ఎందుకంటే దేనిమీదనైనా ఆధారపడితే అది మనస్సును అంతకంతకూ బలహీన పరుస్తుంది.

అందువల్ల రమణమహర్షి హెచ్చరిస్తున్నారు ఇక్కడ. వేదాంతం నేర్చుకునేదే ఇలా ఏదో ఒకదానిమీద ఆధారపడే మనస్తత్వాన్ని పారద్రోలి, స్వతంత్రంగా ఉండటానికే కాని, వాటిని వదిలి కొత్తగా వేదాంతంమీద ఆధారపడటానికి కాదు. అలా చేస్తే అది మనస్సుయొక్క దౌర్బల్యాన్ని సూచిస్తుంది అంటున్నారు రమణమహర్షి.

**తత్** – తత్ అంటే ఆ పరమాత్మ. ఏ పరమాత్మ అయితే శాంతి, ఆనందాలకు అసలైన కారణమో,

**సర్వదా హి భాతి** – అది ఎప్పుడూ, అందుబాటులో ఉంది; అదికూడా చాలా దగ్గరగా ఉంది. భాతి – ప్రకాశిస్తున్నది. ఎలా ఉంది?

**స్వాత్మతయా** – స్వ ఆత్మతయా – మీ స్వస్వరూపంగా ఉండి. మీరే ఆ శాంతిస్వరూపులు, మీరే ఆనందస్వరూపులు. మీ స్వరూపం వేదాంతంకన్నా చాలా దగ్గరగా ఉంది. వేదాంతం దాకా వెళ్ళనే అవసరం లేదు. ఆత్మ మీకు చాలా దగ్గరగా ఉంది. నిజానికి దగ్గరగా కూడా కాదు, అది మీ స్వస్వరూపం.

ఆత్మ అంత దగ్గరగా ఉండి, ఆనందం నా స్వస్వరూపం అయితే, వేదాంతాన్ని ఎందుకు నేర్చుకోవాలి? నేను ఆత్మను, నేను ఆనందస్వరూపుడను అని తెలుసుకోవటానికి వేదాంతానికి

వెళ్ళాలి. ఎప్పుడైతే ఆత్మలోనే రమించటం నేర్చుకుంటారో, అప్పుడే వేదాంతంనుంచి వచ్చే కృత్రిమ ఆనందం జోలికి పోరు.

ఈ శ్లోకంలో రమణమహర్షి ఆత్మజ్ఞానంయొక్క ప్రత్యేకతను వివరిస్తున్నారు. ఆత్మజ్ఞానం లౌకికజ్ఞానానికి ఏ విధంగా భిన్నంగా ఉందో ఇందులో వివరిస్తున్నారు.

1. **బుద్ధిలోనే పొందాలి** – ఏ జ్ఞానమైనా సరే బుద్ధిలోనే కలగాలి. అంటే జ్ఞానంయొక్క స్థానాన్ని (లోకస్) బుద్ధి అంటారు. ఆత్మజ్ఞానం కూడా ఈ విషయంలో దానికి భిన్నంగా లేదు. ఆత్మజ్ఞానం కూడా బుద్ధిలోనే కలగాలి. అందువల్లనే ఏ విద్యకైనా కూడా బుద్ధి పదునుగా ఉండాలి అంటారు. అలాగే వేదాంతానికి వస్తే, దీనితో పాటు చిత్తశుద్ధి, చిత్తఏకాగ్రత ఉండాలని, విలువలను పెంపొందించుకుని అర్హతను సంపాదించుకోవాలని అంటుంది శాస్త్రం.

ఆత్మజ్ఞానాన్ని శరీరం పొందలేదు, ఆత్మ పొందలేదు. బుద్ధి మాత్రమే పొందగలదు. ఈ విషయంలో లౌకికవిద్యకూ, ఆత్మవిద్యకూ భేదం లేదు. రెండూ బుద్ధిలోనే పొందాలి.

2. **ప్రమాణం వాడాలి** – ఏ విద్య పొందాలన్నా కూడా దానికి అనువైన ప్రమాణం వాడాలి. ఉదాహరణకు రంగు, రూపు ఉన్న దృశ్యప్రపంచాన్ని చూడాలంటే కన్ను అనే ప్రమాణాన్ని వాడాలి. అలాగే ఆత్మజ్ఞానం పొందాలంటే వేదాంతప్రమాణాన్ని వాడాలి. ప్రమాణం మారుతుంది కాని ప్రమాణం అవసరం మారదు. అంటే లౌకికవిద్య, ఆత్మవిద్య కూడా ప్రమాణం ద్వారానే పొందాలి.

ఈ విధంగా లౌకికవిద్యకూ, ఆత్మవిద్యకూ మధ్య రెండు పోలికలు ఉన్నాయి. రెండు జ్ఞానాలూ బుద్ధిలోనే కలుగుతాయి, రెండు జ్ఞానాలకూ వాటికి తగ్గ ప్రమాణాలు వాడాలి.

మరి ఎక్కడ ఉంది భేదం?

3. **సబ్జెక్టు–ఆబ్జెక్టు విషయం** – లౌకికవిద్యలో ఏ అంశం నేర్చుకున్నా, నేర్చుకునే సబ్జెక్టు వేరు, నేర్చుకోబడే ఆబ్జెక్టు వేరు. ఉదాహరణకు మీరు రంగు రూపు గురించి నేర్చుకోవాలంటే కన్ను అనే ప్రమాణం వాడతారని చూశాము. నేర్చుకునే సబ్జెక్టు మీరు, నేర్చుకోబడే ఆబ్జెక్టు రంగు, రూపు. ఇవి రెండూ భిన్నం.

కాని ఆత్మ విషయానికి వచ్చేసరికి నేర్చుకునేది ఎవరు? సబ్జెక్టు అయిన నేను. నేర్చుకునేది దేని గురించి? నా గురించే! ఆత్మజ్ఞానం పొందుతాను. అంటే నేర్చుకోబడే ఆబ్జెక్టు ఏమిటి? సబ్జెక్టు అయిన నా గురించే. అంటే సబ్జెక్టు అయిన నేనే ఆబ్జెక్టు కూడా. సబ్జెక్టుకి, ఆబ్జెక్టుకీ మధ్య భేదం లేదు. రెండూ ఒకటే. అదే ఆత్మజ్ఞానంయొక్క ప్రత్యేకత. రెండూ ఒకటే అయితే ఒక సమస్య ఉంది.

ఏమిటా సమస్య? తార్కికంగా చూస్తే, ఏ ఒక్క వ్యవహారంలో కూడా సబ్జెక్టు, ఆబ్జెక్టు ఒక్కటే అవలేవు. వ్యవహారంలోనే కాదు, జ్ఞానం పొందే తతంగంలో కూడా అవలేవు. జ్ఞానం పొందే నేను ప్రమాతను, జ్ఞానం దేని గురించి పొందుతానో అది ప్రమేయం. ప్రమాత అయిన నేను ప్రమేయం గురించిన జ్ఞానం పొందుతాను. ఆ జ్ఞానాన్ని ప్రమా అంటారు. ప్రమాత వేరు, ప్రమేయం వేరు. సబ్జెక్టు వేరు, ఆబ్జెక్టు వేరు. ఇవి రెండూ ఒకటి కాలేవు. ఇది ప్రకృతిసూత్రం. ఈ సూత్రాన్ని అంతకుముందు కూడా చూశాము.

జగత్తంతటినీ చూసే కళ్ళు తమను తాము చూసుకోలేవు. చూసే కన్ను చూడబడలేదు. వేలికొనతో అన్నింటిని ముట్టుకోగలరు కాని, ఆ వేలికొనను ముట్టుకోలేరు. ఎంతో శక్తివంతమైన నాలుకతో ప్రపంచంలో ఉన్న అన్నింటినీ రుచి చూడగలరు కాని, నాలుకను రుచి చూడలేరు. బొత్తిగా అసాధ్యం. మీ ఫోనులో ఉన్న అన్ని నంబర్లకూ మీరు ఫోను చేయగలరు కాని, మీ నంబరుకు మీరే ఫోను చేసుకోలేరు. అందువల్ల ఇది ఒక ప్రకృతిసూత్రం. చూసే సబ్జెక్టు ఎన్నటికీ చూడబడే ఆబ్జెక్టు కాలేదు. ప్రమాత ఎన్నటికీ ప్రమేయం కాలేదు. మరి అయితే ఆత్మజ్ఞానం ఎలా పొందగలరు? అదే మరి ఆత్మజ్ఞానం ప్రత్యేకత.

**శ్లోకం 35**

**న వేద్మ్యహం మాముత వేద్మ్యహం మా–**
**మితి ప్రవాదో మనుజస్య హాస్యః।**
**దృగ్దృశ్యభేదాత్ కిమయం ద్విధాఽఽత్మా**
**స్వాత్మైకతాయాం హి ధియాం న భేదాః॥**

**ప్రతిపదార్థం:** అహమ్ = నేను; మామ్ = నన్ను; న వేద్మి = తెలుసుకోవటం లేదు; ఉత= లేక; అహమ్= నేను; మామ్ = నన్ను; వేద్మి = తెలుసుకొంటున్నాను; ఇతి = అను; మనుజస్య = మనిషియొక్క; ప్రవాదః = ప్రేలాపనలు; హాస్యః = పరహసింపదగినవి; దృగ్దృశ్యభేదాత్ = ద్రష్ట ఆత్మ, దృశ్య ఆత్మ అనే భేదంతో; భవతి కిమ్? = ఉంటుందా? (ఉండదు); స్వ+ఆత్మా+ఏకతాయామ్= తన ఆత్మ ఏకత్వంలో; ధియామ్ = బుద్ధుల ; భేదాః= భేదములు; న హి = లేవు కదా!

**తాత్పర్యం:** నేను నన్ను తెలుసుకోవటం లేదు, లేదా నేను నన్ను తెలుసుకొంటున్నాను. అనే మనిషి ప్రేలాపనలు పరిహసింపదగినవి. ఎందుకంటే ద్రష్ట అయిన ఆత్మ, దృశ్యమయిన ఆత్మ అని ఆత్మ రెండు విధాలుగా లేదు. ఆత్మ ఏకత్వంలో భేదాలు లేవు కదా!

**వివరణ:** రమణమహర్షి అహంకారాన్ని మటుమాయం చేయటానికి ఆత్మజ్ఞానం ఒకటే మార్గం అని చెప్పుకొస్తున్నారు. అహంకారంవల్లనే మనం సంసారంలో పడి అవస్థలు

పడుతున్నాము కాబట్టి అహంకారాన్ని పారద్రోలాలి. దానికి ఆత్మజ్ఞానం ఒక్కటే మార్గం కాని, ఈ ఆత్మజ్ఞానం గురించి అనేక అపోహలు ఉన్నాయి. అందువల్ల 35వ శ్లోకంలో రమణమహర్షి ఆత్మజ్ఞానం గురించి ఉన్న అపోహలను పారద్రోలుతున్నారు. దాని గురించి ముందు స్పష్టమైన అవగాహన ఉండాలి అంటున్నారు.

ఆత్మజ్ఞానం అంటే ఒక సంఘటన కాదు. మనకు తెలియని ఆత్మ గురించి తెలుసుకునే సంఘటన కాదు ఆత్మజ్ఞానం. ఆత్మజ్ఞానం అంటే తెలియని ఆత్మ గురించి తెలుసుకోవటం అని అంటేనే, ఆత్మను ఒక ఆబ్జెక్టుగా చూసినట్టు అవుతుంది. ఆబ్జెక్టు అంటే ప్రమేయం అని చూశాము. ఆబ్జెక్టు నిర్వచనం ఏమిటి? అంతకుముందు మనకు ఆ వస్తువు లేదా ప్రమేయం గురించి తెలియదు, దాని గురించి మనం జ్ఞానం పొందటం, కాలంలో జరిగే ఒక సంఘటన. అంటే ఆ వస్తువు గురించి మనకు జ్ఞానం పొందకముందు తెలియదు. జ్ఞానం పొందాక తెలుస్తుంది. కాని ఆత్మ విషయంలో ఈ నిర్వచనం సరిపోదు. ఆత్మను ఆబ్జెక్టుగా ఎన్నడూ చూడలేము.

చూసే నువ్వే అది, ఎన్నటికీ చూడబడే వస్తువు కాదు; చూసే నువ్వే ఆత్మవు ఎప్పటికీ. ఆత్మ చూడబడేది కాదు అంటుంది శాస్త్రం. ఆత్మస్వరూపం చేతనతత్త్వం. చైతన్యాన్ని ఆబ్జెక్టుగా చూడలేము. ఒకవేళ ఆబ్జెక్టుగా చూడాలంటే, ఎవరు చూస్తారు?

1. చైతన్యాన్ని పదార్థం చూడలేదు. ఎందుకంటే పదార్థం **జడం**.

2. పోనీ రెండవ చైతన్యం, మొదటి చైతన్యాన్ని చూస్తుందా అంటే అదీ సాధ్యం కాదు. ఎందుకంటే ఉన్నదొకటే చైతన్యం. **అద్వితీయం.** అందువల్ల రెండవ చైతన్యం మొదటిదాన్ని, మొదటిది రెండవదాన్ని చూస్తుందనటానికి కుదరదు.

3. సరే అయితే, చైతన్యంలో ఒక భాగం ఇంకొక భాగాన్ని చూస్తుందా? మనం శరీరంలో ఒక భాగాన్ని ఇంకొక భాగంతో ముట్టుకోగలం కదా; అలా చైతన్యంలో ఒక భాగం చూస్తుందా అంటే అదీ కుదరదు. ఇందాకేమన్నాం, ఉన్నదొకటే చైతన్యం అన్నాం. ఇప్పుడా చైతన్యానికి భాగాలు కూడా లేవు అంటుంది శాస్త్రం. చైతన్యం **నిరవయవం, అఖండం**.

అందువల్ల చైతన్యాన్ని జడమైన పదార్థంతో చూడలేము, ఇంకో చైతన్యంతో చూడలేము, చైతన్యంలో ఒక భాగంతో చూడలేము. అంటే చైతన్యం గురించి తెలుసుకోలేము.

ఇప్పుడు చైతన్యాన్ని తెలుసుకోవటంనుంచి అనుభవించటం గురించి చూద్దాము. చైతన్యాన్ని అనుభవించలేము కూడా. దానికీ ఇవే కారణాలు. పదార్థం అనుభవించలేదు. అది **జడం** కాబట్టి; రెండవ చైతన్యం మొదటిదాన్ని అనుభవించలేదు, చైతన్యం **అద్వితీయం** కాబట్టి;

చైతన్యంలో ఒక భాగం అనుభవించలేదు, అది **అఖండం** కాబట్టి. అందువల్ల చైతన్యాన్ని ఒక సంఘటనలాగా తెలుసుకోలేము, అనుభవించలేము.

మరి అయితే చైతన్యాన్ని తెలుసుకోవటమెలా? ఓదార్పునిచ్చే అంశం ఏమిటంటే చైతన్యం గురించి తెలుసుకోనవసరం లేదు, చైతన్యాన్ని అనుభవించనవసరంలేదు. ఒక వస్తువు గురించి ఎప్పుడు తెలుసుకోవాలి? దాని గురించిన అజ్ఞానం ఉంటే తెలుసుకోవాలి. అజ్ఞానం ఉంటే ఒక పద్ధతిలో దాని గురించి నేర్చుకోవాలి. కాని చైతన్యం గురించిన అజ్ఞానం ఎవరికీ లేదు. ప్రతి ఒక్కరికీ తాను ఒక చైతన్యస్వరూపం అనీ, ఏ కుర్చీలాగానో జడమైన పదార్థం కాదనీ బాగానే తెలుసు. చైతన్యం గురించిన అజ్ఞానం లేకపోతే, జ్ఞానం పొందాల్సిన అవసరం ఏముంది? దాన్ని ఒక పద్ధతిలో నేర్చుకోవాల్సిన అవసరం ఏమిటి? ఆత్మజ్ఞానం తక్కిన జ్ఞానాలలాగా సాంప్రదాయ పద్ధతిలో నేర్చుకునేది కాదు. అందువల్లనే రమణమహర్షి ఎవరైనా నాకు ఆత్మ గురించి తెలుసన్నా, మరెవరైనా ఆత్మ గురించి తెలియదన్నా కూడా, ఇద్దరూ హాస్యం చేస్తున్నారు తప్ప అది నిజం కాదు అంటున్నారు. ఈ నేపథ్యంతో ఈ శ్లోకం 35 చూద్దాము.

**హాస్యః** – పరిహసింపదగినది. ఏది?
**న వేద్మి అహం మామ్** – నాకు ఆత్మ గురించి తెలియదు;
**ఉత** – లేక,
**అహం మాం వేద్మి ఇతి** – ఆత్మ గురించి నాకు తెలుసని ఎవరైనా చెబితే అది హాస్యాస్పదంగా ఉంటుంది. ఆత్మ అంటే తన గురించి,
**మనుజస్య ప్రవాదః** – మనిషియొక్క ప్రేలాపనం. వాదః అంటే మాట్లాడటం. ప్రవాదః అంటే ప్రేలాపనం. ఇలా మనుష్యులు నాకు నా గురించి తెలుసు, నాకు నా గురించి తెలియదు అని ఏ ప్రగల్భాలుగా చెప్పినా అది హాస్యాస్పదంగా ఉంటుంది. ఇప్పుడే కాదు, ఎప్పుడు చెప్పినా కూడా.

రెండు వాక్యాలూ చెల్లవు. నాకు నేను తెలుసు అంటే నన్ను నేను ఆబ్జెక్టుగా తెలుసుకున్నట్టు అర్థం వస్తుంది. సబ్జెక్టు గురించి సబ్జెక్టే తెలుసుకోలేదు. అందువల్ల నా గురించి నేను జ్ఞానం పొందలేను. సబ్జెక్టు గురించి సబ్జెక్టు జ్ఞానం పొందలేదు అంటే అది అజ్ఞానానికి కూడా వర్తిస్తుంది. అందువల్ల నాకు నా గురించి తెలుసు, నాకు నా గురించి తెలియదు అనే ఈ రెండు వాక్యాలూ కూడా తప్పే.

వ్యాకరణపరంగా కూడా ఈ రెండు వాక్యాలూ కుదరవు. ఇంగ్లీషులో వెర్బ్ (క్రియ)లో ట్రాన్సిటివ్ వెర్బ్, ఇన్‌ట్రాన్సిటివ్ వెర్బ్ అని ఉంటాయి.

He **bought** a pen – transitive verb

He **laughed** – intransitive verb

మొదటి వాక్యంలో పెన్ను వేరు, అతను వేరు. అది ట్రాన్సిటివ్ వర్బ్. సకర్మక క్రియ అంటారు తెలుగులో. రెండవ వాక్యంలో అతను నవ్వాడు. అతని గురించే ఉంది కాబట్టి, దాని పక్కన ఆబ్జెక్టు రాదు. అందువల్ల అది అకర్మక క్రియ అవుతుంది.

ఆత్మ విషయంలో ట్రాన్సిటివ్ వర్బ్‌ను వాడలేము. దానికి కళ్ళను ఉదాహరణగా చూశాము అంతకుముందు.

నా కళ్ళు అతనిని **చూశాయి.**

అక్కడ నేను వేరు, అతను వేరు. కాని నా కళ్ళు తమను తాము చూసుకోలేవు. వాటికి ఈ క్రియాపదం వాడలేము. అందువల్ల ఎవరైనా నాకు ఆత్మ గురించి తెలుసన్నా, తెలియదన్నా, రెండూ తప్పే అంటున్నారు రమణమహర్షి. ఎందుకు?

**అయమ్ ఆత్మాద్విధా (అస్తి కిమ్?)** – ఈ ఆత్మ రెండు విధాలుగా ఉంటుందా? ఏమిటా రెండు విధాలు?

**దృక్ దృశ్య భేదాత్** – దృక్కు, దృశ్యం అనే భేదాలు ఆత్మలో ఉన్నాయా? దృక్ అంటే సబ్జెక్టు, దృశ్యం అంటే ఆబ్జెక్టు. ఆత్మ దృక్ అయితే ఎన్నటికీ దృశ్యం కాలేదు; అలాగే దృశ్యం అయితే దృక్ ఎన్నటికీ కాలేదు.

**దృగేవ న తు దృశ్యతే**

ఆత్మ (దృక్ + ఏవ) చూసే చైతన్యమే కాని ఎన్నటికీ చూడబడే పదార్థం కాదని దృక్‌దృశ్య వివేకంలో వస్తుంది. అందువల్ల నన్ను నేను తెలుసుకున్నాను అనే వాక్యంలో సబ్జెక్టు అయిన నేను, నా గురించే తెలుసుకున్నాను అని వస్తుంది తప్ప, నన్ను అనేది ఆబ్జెక్టు కాదు.

ఆత్మా ద్విధా (అస్తి కిమ్) – అస్తి కిమ్ మనం కలుపుకున్నాము. ఆత్మ రెండు విధాలుగా ఉంటుందా? ఇది చూడటానికి ప్రశ్న అయినా జవాబు కోరే ప్రశ్న కాదు. ప్రశ్నలోనే ఉండదు అనే జవాబు ఇమిడి ఉంది. దీన్ని రిటారికల్ కొశ్చెన్ అంటారని చూశాము. అందువల్ల ఆత్మజ్ఞానం పొందాను అని చెపితే, అది తార్కికంగా కుదరదు. ఆ జ్ఞానం పొందటం ఒక కాలంలో జరిగే సంఘటన కాదు. అందువల్ల ఈ విధంగా ముగిస్తున్నారు రమణమహర్షి.

**స్వాత్మైకతాయాం హి** – స్వ+ఆత్మ+ఏకతాయా హి – ఉన్నది ఒకటే ఆత్మ . ఉన్నది ఒకటే ఆత్మ కాబట్టి, అది అద్వితీయం కాబట్టి,

**న భేదాః** – భేదాలు లేవు. కాబట్టి ఆత్మజ్ఞానం విషయంలో సబ్జెక్టు, ఆబ్జెక్టు అనే భేదాలు లేవు.

**ధియాం** – బుద్ధులయొక్క భేదాలు లేవు. అంటే నాకు ఆత్మజ్ఞానం లేదు, నాకు ఆత్మజ్ఞానం కలిగింది అనే ఈ భిన్నవాక్యాలకు ఆత్మజ్ఞానం విషయంలో ఆస్కారం లేదు. అందువల్ల జ్ఞాని కూడా నేను ఆత్మజ్ఞానం పొందాను అని చెప్పలేడు.

ఆత్మజ్ఞానం పొందాను, పొందలేను అని చెప్పలేరు అంటే మరి ఆత్మజ్ఞానం అంటే ఏమిటి? ప్రతి ఒక్క సాధకుడూ ఆత్మజ్ఞానం పొందితీరాలని ఎందుకు చెబుతున్నది? ఆత్మజ్ఞానం పొందలేము అనేటట్టయితే శాస్త్రం ఆత్మజ్ఞానం గురించి ఎందుకు చెబుతున్నది? ఆత్మజ్ఞానం పొందిన జ్ఞాని గురించి ఎందుకు ప్రత్యేకంగా చెబుతున్నది?

అందువల్లనే అసలు ఆత్మజ్ఞానం అంటే ఏమిటో స్పష్టంగా తెలుసుకోవాలి. నేను చైతన్యస్వరూపుణ్ణి. నిజానికి ఈ విషయం అందరికీ తెలుసు. ఈ విషయంలో ఎవరికీ అజ్ఞానం లేదు, సందేహం అసలే లేదు. అందువల్ల శాస్త్రం పనిగట్టుకుని నువ్వు చైతన్యస్వరూపుడివి అని చెప్పనవసరం లేదు. నిజానికి శాస్త్రం నువ్వు చైతన్యస్వరూపుడివి అని చెప్పినది మీరు వినాలంటే మీరు చైతన్యస్వరూపులై ఉండాలి. మీరు జడమైతే మీరు వినలేరు. అందువల్ల ఆత్మజ్ఞానం అంటే శాస్త్రం ప్రత్యేకించి నువ్వు చైతన్యస్వరూపుడివి అని చెప్పదు. ముందే తెలిసిన దాని గురించి ఏ ప్రమాణం కూడా కొత్తగా చెప్పదు.

మరి అయితే శాస్త్రం ఏం చెబుతుంది? నేను చైతన్యస్వరూపుణ్ణి వరకూ అందరికీ తెలుసు. ఆ తరువాతే వస్తుంది చిక్కంతా! దాని తరువాత నేను ఎవరు అనే విషయంలో అనేక పొరపాట్లు ఉన్నాయి. కొన్ని తప్పుడు సిద్ధాంతాలు కూడా ఉన్నాయి. వాటిలో కొన్ని చూద్దాము.

1. నేను అశాశ్వతమైన జీవిని. నాకు చావు, పుట్టుకలు ఉన్నాయి.

2. నాకు దేశకాలపరిమితులు ఉన్నాయి. నేను ఒక దేశంలో ఉన్నాను. నాకు ఇన్ని సంవత్సరాలు, నా వయస్సు ఇంత.

ఇలా ఎన్నో అపోహలు ఉన్నాయి. ఇవన్నీ ప్రాథమికంగా ఆత్మను ఆబ్జెక్టుగా చూడటంవల్ల ఏర్పడుతున్నాయి. శాస్త్రం, మన గురించి మనకున్న అపోహలను తొలగిస్తుంది. మీరు ఆత్మను అనుభవంలోకి వచ్చే ఆబ్జెక్టుగా భావించటంవల్ల ఈ అపోహలు కలుగుతున్నాయి.

వాటిని ఒకసారి పరిశీలించుకోండి అంటుంది శాస్త్రం. వేదాంతశాస్త్రంలో ఆత్మవిచారణ అంటే ఆత్మ గురించిన అధ్యయనం కాదు, ఆత్మకు మనం ఆపాదించిన అనేక గుణాల గురించిన విచారణ.

మీరు ఆత్మకు ఏఏ గుణాలను ఆపాదించారో అవేవీ ఆత్మకు చెందవు అంటుంది శాస్త్రం. అందువల్ల ఆత్మజ్ఞానం అంటే గుణాల గురించి జ్ఞానం. ఆత్మజ్ఞానం ఆత్మ గురించి చెప్పదు; మీరు ఆత్మకు ఆపాదించిన గుణాలను గురించి చెబుతుంది. ఉదాహరణకు –

నాకు ఆనందంగా ఉంది
నాకు ఈర్ష్యగా ఉంది
నాకు కోపంగా ఉంది
నాకు యాభయి సంవత్సరాలు వచ్చాయి

పై వాక్యాల్లో నాకు ఉంది/నాకు వచ్చాయి పదాలను గురించి చెప్పబోవటం లేదు శాస్త్రం. అవి ఆత్మయొక్క చేతనతత్త్వాన్ని సూచిస్తాయి. చైతన్య ఆత్మకు మీరు ఆపాదించిన గుణాలేమిటి? ఆనందం, ఈర్ష్య, కోపం, యాభై సంవత్సరాలు.

**ఇచ్ఛా ద్వేషః సుఖంః దుఃఖం సంఘాతశ్చేతనా ధృతిః ।**
**ఏతత్ క్షేత్రం సమాసేన సవికారముదాహృతమ్ ॥**

రాగం, ద్వేషం, సుఖం, దుఃఖం, ధృతి ఈ లక్షణాలన్నీ క్షేత్రానికి చెందుతాయి అంటున్నాడు కృష్ణపరమాత్మ. క్షేత్రం అంటే శరీరం. ఈ వికారాలన్నీ శరీరానికి చెందుతాయి కాని ఆత్మకు చెందవు. ఈ గుణాల విచారణ చేస్తే మూడు విషయాలు సుస్పష్టమవుతాయి.

1. నేను, నాకు ఆపాదించుకుంటున్న ఈ గుణాలేవీ, ఈ భావోద్రేకాలేవీ, నాకు చెందవు.
2. నేను, నాకు ఆపాదించుకుంటున్న ఈ గుణాలన్నీ మిథ్య.
3. ఈ గుణాలు మిథ్య కాబట్టి అవి నన్నేమీ బాధించలేవు.

దీన్నిబట్టి మనకు అర్థమయిందేమిటి? ఆత్మజ్ఞానం అంటే ఆత్మ గురించిన జ్ఞానం కాదు, గుణాల గురించిన జ్ఞానం. మళ్ళీ ఒక సందేహం! నాకు సుఖం ఉంది, నాకు సుఖం లేదు అనే ఈ లక్షణాలన్నీ ఆత్మకు చెందవు; అనాత్మకు చెందుతాయి అంటే, ఈ జ్ఞానాన్ని ఆత్మజ్ఞానం అని అనటం ఎందుకు? గుణజ్ఞానం అంటే పోలేదా?

దానికి జవాబు ఇది! ఈ గుణాలన్నీ దేనికి ఆపాదించబడ్డాయి? ఆత్మకు! ఆత్మజ్ఞానానికి రాకముందు ఈ గుణాలను తీసుకువెళ్ళి ఆత్మమీద ఆరోపించారు. ఆత్మజ్ఞానానికి వచ్చాక కాని తెలియలేదు, ఇవి ఆత్మ లక్షణాలు కావు అని. అందువల్ల లక్ష్యార్థంగా ఆత్మజ్ఞానం అంది దీనిని శాస్త్రం. కాని నిజానికి మనం నేర్చుకునేది ఈ గుణాల గురించి. ఈ గుణాలను

ఆత్మకు చెందుతాయా లేదా అని విచారణ చేస్తాము. ఉపదేశసాహస్రిలో శంకరులవారు ఆత్మజ్ఞానాన్ని ఇలా నిర్వచిస్తారు. ఆత్మజ్ఞానం అంటే ఆత్మకు ఆపాదించబడిన గుణాలను నిషేధించుకుంటూ రావటం తప్ప వేరే ఏమీ కాదు.

నేను చైతన్యస్వరూపుణ్ణి అని నాకు తెలుసు. కాని దాని తర్వాత నాకు నేను ఆపాదించుకునే గుణాలు నావి కావు అని నేర్పిస్తుంది శాస్త్రం. నేను అని మాత్రం అంటే నేను చైతన్యస్వరూపుణ్ణి అని అర్థం. కాని నేను అక్కడితో ఆగను. నేను తర్వాత అనేక పదాలను కలుపుతాను. ఒక పూర్తి బయోడేటానే తయారుచేస్తాను. శాస్త్రం నేను ఉన్నాను అని, తరువాత ఆ వాక్యాన్ని పెంచవద్దు అంటుంది. నేను ఉన్నాను మాత్రం ఉంచి తక్కిన పదాలన్నీ తీసివేయమంటుంది.

అందువల్ల ఆత్మజ్ఞానం పొందటం అంటే ఆత్మ గురించి కొత్తగా బోధ ఉండదు. ఆత్మజ్ఞానం అంటే నీకు నువ్వు ఆపాదించుకున్న గుణాలేవీ నీకు చెందవు అని వాటిని కొట్టివేస్తుంది శాస్త్రం. అందువల్ల ఆత్మజ్ఞానం అనాత్మ జ్ఞానానికి భిన్నంగా ఉంటుంది.

**శ్లోకం 36**

**హృత్ప్రాప్య సద్ధామ నిజస్వరూపే**
**స్వభావసిద్ధేఽనుపలభ్య నిష్ఠామ్।**
**మాయావిలాసః సదసత్సరూప–**
**విరూపనానైకముఖప్రవాదాః॥**

**ప్రతిపదార్థం:** స్వభావసిద్ధే = సహజసిద్ధమైన; నిజస్వరూపే = తన ఆత్మస్వరూపంలో; భాసమానమ్= ప్రకాశిస్తున్న; సద్ధామ = సద్వస్తు స్థానమయిన; హృత్ = హృదయాన్ని; ప్రాప్య = పొంది; నిష్ఠామ్ = సహజాత్మనిష్ఠను; అనుపలభ్య = తెలుసుకొనక; సదసత్ = సత్ లేక అసత్తా; సరూప+విరూప = సగుణమా నిర్గుణమా; నానా+ఏకముఖ = ఏకమా అనేకమా; ప్రవాదాః = మొదలైన వాదాలు; యే = ఏవైతే ; ప్రవృత్తాః = బయలుదేరాయో మాయావిలాసః = పరమేశ్వరశక్తి విలాసమే.

**తాత్పర్యం:** సాధకుడు సహజసిద్ధమైన తన ఆత్మస్వరూపంలో ప్రకాశిస్తున్న సద్వస్తు స్థానమయిన, హృదయాన్ని పొంది సహజాత్మనిష్ఠను తెలుసుకొనక – అది సద్రూపమా లేక అసద్రూపమా? రూపరహితమా లేక రూపసహితమా? అనేకమా లేక ఏకమా? – మొదలైన వాదాలు పరమేశ్వర మాయాశక్తి విలాసమే!

**వివరణ:** ఇంతవరకూ చూసినట్టుగా ఆత్మజ్ఞానం పొందటం అంటే స్వయంప్రకాశమైన ఆత్మకు ఆపాదించబడిన లక్షణాలను లేదా గుణాలను పారద్రోలి, ప్రక్షాళన చేయటమే.

ఈ ప్రాథమిక ప్రక్షాళన చేయకపోతే, ఆత్మజ్ఞానం కూడా కాలేజీల్లో చేసే కోర్సులాంటిదే అవుతుంది. అందువల్ల వేదాంతం ప్రాథమికంగా బోధించేది నాకు ఆపాదించుకున్న అనేక లక్షణాలను పారద్రోలమని. నిజానికి వేదాంతబోధలో తప్పు ఎక్కడచూసినా, నేను జీవితంలో ఎలా ఉన్నత శిఖరాలు అధిరోహించాలో నేర్పిస్తుంది.

జీవితంలో ఎవరేం చేసినా, ఏం సాధించినా ఇప్పుడు ఉన్న పరిస్థితిని మరింత మెరుగు పరుచుకోవటానికి ప్రయత్నం చేస్తారు. భవిష్యత్తును మరింత సుందరంగా తీర్చిదిద్దుకోవటానికి చేసే ప్రయత్నమే అదంతా! ఎవరైనా డబ్బు సంపాదనలో మునిగిపోతే, అతను సంపాదనమీద శ్రద్ధ చూపిస్తున్నాడు అనుకుంటాము కాని, నిజానికి దాని వెనుకనున్న కారణాన్ని విశ్లేషిస్తే దాని వెనుక తన బీదరికంనుంచి బయటపడి, ధనవంతుడవ్వాలనే తపన అతనిలో కనిపిస్తుంది.

అదే విధంగా ఎవరైనా బ్రహ్మచారి పెళ్ళి చేసుకోవాలని తీవ్రంగా ప్రయత్నిస్తుంటే, బ్రహ్మచారి–నేనుకన్నా గృహస్థ–నేను ఇంకా ఆనందంగా ఉంటాను అనుకోవటంవల్ల చేస్తున్నాడు. అలాగే పిల్లలు పుట్టాలని శతవిధాల ప్రయత్నాలు చేస్తుంటే, తండ్రిగా అయితే ఇంకా ఆనందంగా ఉంటాను అనుకోవటంవల్ల చేస్తున్నాడు. ఒక్కముక్కలో చెప్పాలంటే సంసారం అంటే ఇలా జీవితంలో కొత్తగా ఏదో పొందితే నేను పరిపూర్ణుడను అవుతాను అనుకోవటమే. అదే వేదాంతాన్ని అర్థం చేసుకుంటే ఈ తపనలు, ఈ అవస్థలు ఆగిపోతాయి. నన్ను నేను మరింత మెరుగుపరచుకోవాలనే కోరికే ఈ దురవస్థలకు కారణం. కాని వేదాంతానికి వస్తే అసలు ఈ గుణాలు నాకు చెందవు. నేను గుణాతీత ఆత్మను, నిర్గుణ ఆత్మను అని అర్థం అవుతుంది.

నేను నిర్గుణ ఆత్మచైతన్యాన్ని కాబట్టి నేను కొత్తగా గుణాలను పెంపొందించుకోనవసరం లేదు, ఉన్న గుణాలను పారద్రోలటానికి తాపత్రయపడనవసరం లేదు. వేదాంతం నొక్కివక్కాణించదలుచుకున్న అంశం ఇది. ఇది కనుక మీ దృష్టి దాటిపోయిందంటే, వేదాంత అధ్యయనం సంసారంలో మరొక భాగం అవుతుంది.

నేను ముక్తపురుషుణ్ణి అవాలని కోరుకుంటున్నాను అని చెపితే, అది కూడా ఒక గుణాన్ని కలిపినట్టే అవుతుంది. ఇప్పుడు బద్ధపురుషుణ్ణి, నేను ముక్తపురుషుణ్ణి అవాలి అని గుణం చెప్పినట్టు అవుతుంది. బంధంనుంచి మోక్షానికి ప్రయత్నం చేయటం కూడా ఇంకొక రకమైన సంసారమే. వేదాంతం బద్ధపురుషుడు, ముక్తపురుషుడు పదాలను కూడా వాడదు, అవి కూడా గుణాల కిందకే వస్తాయి. అందువల్ల సంసారంలోకే వస్తుంది అంటుంది.

**న నిరోధో న చోత్పత్తిః న బద్ధో న చ సాధకః।**
**న ముముక్షుర్న వై ముక్తః ఇత్యేషా పరమార్థతా॥** – మాండూక్య కారిక

ఈ విషయం అర్థం చేసుకోకపోతే, నాకు వేదాంతం బాగా అర్థమయింది కాని నేను ఇంకా మోక్షం పొందలేదు అంటాడు. ఎప్పుడైతే నేను మోక్షం పొందటానికి ప్రయత్నిస్తున్నాను అంటాడో, అప్పుడే అతనికి వేదాంతం బాగా అర్థమవలేదని అర్థం.

అందువల్ల ఈ శ్లోకంలో రమణమహర్షి గట్టిగా హెచ్చరిస్తున్నారు. వేదాంతబోధను కూడా ఇంకొక సంసారంగా మార్చకండి అని.

**హృత్ప్రాప్య** – హృత్ప్రాప్యలో రెండు పదాలు ఉన్నాయి. హృత్+ప్రాప్య. హృత్ అంటే మనస్సు. ప్రాప్య అంటే పొంది. ఒక శిష్యుడు తన మనస్సును పొందాలి. శాస్త్రం మనస్సు హృదయంలో ఉంది అని చెబుతుంది. అందువల్ల శిష్యుడు మనస్సును పొందాలి అంటే శిష్యుడు తన దృష్టిని మనస్సు వైపుకు తిప్పాలి. ఈ మనస్సు ఏమిటి?

**సద్ధామ** – సత్ ధామ. ఈ మనస్సు స్థానం. దేనికి? సత్‌కు. సత్ అంటే చైతన్యతత్త్వానికి. చైతన్యం మనస్సులో ఉండి, మనస్సును సాక్షిగా చూస్తుంది. ఆలోచనలు ఉన్న, ఆలోచనలు లేని మనస్సును సాక్షిగా చూసేది చైతన్యం అని నిర్వచిస్తాము. మనస్సులో ఆలోచనలు కలుగుతుంటే మనకు తెలుస్తున్నది. ఆలోచనలు లేకుండా మనస్సు శూన్యంగా ఉన్నా, మనకు తెలుస్తున్నది. మనస్సులో ఆలోచనలు లేకపోతే మనస్సు శూన్యంగా ఉంది అంటారు కొందరు. కాని నిజానికి మనస్సు శూన్యంగా ఉంది అని ఒకదానికి తెలుస్తున్నది. ఆ తెలుసుకుంటున్నదే సాక్షిచైతన్యం. అందువల్ల చైతన్యం మనస్సులో సాక్షిగా ఉంది అంటున్నారు.

సద్ధామ పదం సంయుక్తపదం. అది హృత్ అనే పదానికి విశేషణం. దీన్ని మొత్తంగా చూస్తే సాక్షిచైతన్యానికి నెలవైన మనస్సుకు వెళ్ళండి. వెళ్ళి సాక్షిచైతన్యం వైపుకు మనస్సును మళ్ళించండి. సాక్షిచైతన్యం వైపు మనస్సును మళ్ళించటం అంటే నేను సాక్షిచైతన్యాన్ని అనే ఆలోచనను పెంచుకోవటం.

దేనివైపన్నా దృష్టి మరల్చండి అంటే దాని గురించిన ఆలోచన చేయమని అర్థం. ఈ పుస్తకాన్ని చూడండి అంటే, పుస్తకం గురించిన ఆలోచన చేయటం. అలా దేనిమీద దృష్టి పెట్టాలంటే దాని గురించిన ఆలోచన చేయాలి. ఇప్పుడు చైతన్యంమీద దృష్టి పెట్టండి అంటే ఏం చేయాలి? సాక్షిచైతన్యం ఆబ్జెక్టు కాదు, ఆత్మనైన నేనే అనే ఆలోచనను చేయాలి. నేను సాక్షిచైతన్యాన్ని, ఆలోచనలు ఉన్న, ఆలోచనలు లేని మనస్సును నేను సాక్షిగా చూస్తున్నాను అని తెలుసుకోవాలి. నేను సాక్షిచైతన్యాన్ని అనే ఆలోచన కూడా నాకు తెలుస్తున్నది అని తెలుసుకోవాలి. ఈ ఆలోచనలో నెలకొని ఉండటమే **ఆత్మసంస్థం మనః కృత్వా** అంటే.

**ఆత్మసంస్థం మనః కృత్వా న కించిదపి చింతయేత్॥**

మనఃకృత్వా అంటే అహం చిద్రూపః అస్మి అనే ఆలోచనను పెంపొందించుకోవటం.

**చిదానందరూపః శివోఽహం శివోఽహమ్॥**

నేను చిదానంద రూపాన్ని, నేను బ్రహ్మను అనే ఆలోచనను పెంపొందించుకోవాలి. అందువల్ల జ్ఞానం పొందటం, ధ్యానం చేయటం అంటే ఆలోచనారహితంగా ఉండటం కాదు. మనస్సును శూన్యం చేయటమూ కాదు. సరియైన ఆలోచనను పెంపొందించుకోవటం. నేను ఎవరు? నేను చైతన్యాన్ని.

మరి అయితే, నేను ఆనందంగా ఉన్నాను, నాకు దుఃఖం కలుగుతోంది, నేను సంసారిని, నేను డబ్బులేని భర్తను, నేను ధనవంతుడైన భర్తను – ఇవన్నీ ఏమిటి? ఇవన్నీ నేను ఆపాదించుకున్న బయోడేటా. ఈ లక్షణాలేవీ సాక్షినైన నాకు చెందవు.

**న మే ద్వేషరాగౌ న మే లాభమోహౌ మదో నైవ మే నైవ మాత్సర్యభావః॥**

ఈ రాగద్వేషాలు, లోభమోహాలు, మదమాత్సర్యాలు గుణాలకు చెందిన ఆలోచనలు. ఆత్మనైన నాకు ఈ గుణాలు అంటవు. గుణాల గురించి విచారణ చేసి మూడు సత్యాలను కనుగొన్నాము. అవి ఇక్కడ మళ్ళీ గుర్తు తెచ్చుకుందాము. అవి–

1. నేను, నాకు ఆపాదించుకుంటున్న ఈ గుణాలేవీ, ఈ భావోద్రేకాలేవీ నాకు చెందవు.
2. నేను, నాకు ఆపాదించుకుంటున్న ఈ గుణాలన్నీ మిథ్య.
3. ఈ గుణాలు మిథ్య కాబట్టి అవి నన్నేమీ బాధించలేవు.

ఈ మూడు సూత్రాలను ధ్యానంలో ఆలోచనల రూపంలో నేను గుర్తుతెచ్చుకోవాలి.
న మే ద్వేషరాగౌ – ఈ ఆలోచనను నేను ధ్యానంలో చేయాలి
న మే లోభమోహౌ – ఈ ఆలోచనను నేను ధ్యానంలో చేయాలి
చిదానందరూపః శివోఽహం శివోఽహమ్ – ఈ ఆలోచనను నేను ధ్యానంలో చేయాలి.

దీన్నే ఆత్మనిష్ఠ అంటున్నారు. ఈ గుణాలు నాకు చెందవు, ఇవి మిథ్య, ఇవి నన్నేమీ చేయలేవు. నేను వాటిని సాక్షిగా చూసే సాక్షిచైతన్యాన్ని అనే ఆలోచనలో నిలబడి ఉండటమే ఆత్మనిష్ఠ అంటే. ఆత్మనిష్ఠలో ఉండటం అంటే అది శారీరకంగా చేసే కర్మ కాదు.

**నిష్ఠామ్ ఉపలభ్య** – నిజానికి ఈ శ్లోకంలో అనుపలభ్య అని ఉంది. కాని ముందు ఉపలభ్య అర్థం చూసి తరువాత అనుపలభ్యకు వెళదాము. నిష్ఠామ్ అంటే ఈ ఆత్మనిష్ఠలో. ఆత్మనిష్ఠ అంటే ఆత్మ నిజస్వరూపంలో. ఉపలభ్య అంటే నెలకొని ఉండాలి. ఏమిటా నిజస్వరూపం?

**స్వభావసిద్ధే** – స్వభావసిద్ధే అంటే సహజసిద్ధంగా తెలిసినది. వేదాంతానికి రాకముందే నేను చైతన్యస్వరూపాన్ని, నేను ఆ బల్లలాగా, ఆ రాయిలాగా జడపదార్థాన్ని కాదని మీకు తెలుసు. దీన్ని స్వభావసిద్ధం అంటున్నారు.

మరి అయితే వేదాంతం ఏం నేర్పించింది కొత్తగా? నేను నాకు ఆపాదించుకుంటున్న గుణాలేవీ నాకు చెందవు, అవి మిథ్య. అవి నన్నేం చేయలేవు. ఆ ఆలోచనలో నెలకొని ఉండటం నేర్పించింది. నిష్ఠామ్ ఉపలబ్ధి. ఇదీ వేదాంతంయొక్క ఉద్దేశ్యం. అంతేకాని నాకు కొత్తగా ఇంకొక గుణాన్ని ఆపాదించటం కాదు. ఏమిటా గుణం? నేను వేదాంతబోధను నేర్చుకునే శిష్యుణ్ణి అనుకోవటం. వేదాంతం నేర్చుకోవటమంటే కొత్త గుణాలను కలుపుకోవటం కాదు. నేను వేదాంతంలో ఆరితేరాను, నేను దశ ఉపనిషత్తులు నేర్చుకున్నాను, నేను వేదాంత గురువును, నన్ను అందరూ పూజిస్తారు, నాకు అందరూ నమస్కారాలు పెడతారు, నేను గొప్ప సన్న్యాసిని – వీటిలో ఏవి చెప్పినా కొత్తగా ఇంకొక గుణాన్ని ఆపాదించుకోవటమే అవుతుంది. నేను మోక్షం పొందాను అని చెప్పటం కూడా నాకింకొక గుణాన్ని ఆపాదించుకోవటమే.

వేదాంతబోధ కొత్త గుణాలను ఆపాదించటానికి కాదు ఉన్నది, నేను నిర్గుణం అని నేర్పించటానికి ఉంది. నాకు అంతకుముందు గుణాలు లేవు, నాకు ఇప్పుడూ గుణాలు లేవు, ఇకముందూ నాకు గుణాలు ఉండబోవు అని అర్థం చేసుకోవాలి. ఈ జ్ఞానంలో నెలకొని ఉండేలా చేయటమే వేదాంతంయొక్క ముఖ్య ఉద్దేశ్యం.

**అనుపలభ్య** – రమణమహర్షి అనుపలభ్య వాడారు. ఈ జ్ఞానంలో నెలకొని ఉండటం లేదు అంటున్నారు. వేదాంతం యొక్క ఈ ముఖ్య ఉద్దేశ్యాన్ని అర్థం చేసుకోకుండా,

**ప్రవాదాః** – అనేక వాదోపవాదాలు చేస్తున్నాను. అనవసరంగా కాలయాపన చేస్తున్నాను. నేను నిర్గుణ ఆత్మలో నెలకొని ఉన్నానా లేదా అని ప్రశ్నించుకోకుండా, నేను ఇప్పుడు ఉన్న గుణాల గురించి బాధపడటమో, భవిష్యత్తులో పొందబోయే గుణాల గురించి ఆందోళన పడటమో చేస్తున్నాను.

నిష్ఠామ్ అనుపలభ్య ప్రవాదాః – ఆత్మజ్ఞాననిష్ఠలో నెలకొని ఉండకుండా, అనేక వేదాంత చర్చల్లో మునుగుతున్నాను. చూడండి! వేదాంతాన్ని సరిగ్గా అర్థం చేసుకోకుండా, వాదనల్లోకి దిగితే, దాన్ని కూడా ప్రేలాపనలు అంటున్నారు రమణమహర్షి. వేదాంతం చెప్పేది అర్థం చేసుకోకుండా మాట్లాడితే ఇట్లాగే ఉంటుంది మరి.

ఒకవ్యక్తి, 'నాకు వేదాంతం బాగా అర్థమయింది. నేను బ్రహ్మను అని కూడా అర్థమయింది. కాని నా భార్యతోనే నాకు సమస్యగా ఉంది,' అని అంటే అతనికి వేదాంతం బాగా అర్థం

కాలేదని అర్థం. బ్రహ్మ అంటే అద్వితీయం బ్రహ్మ అని అంటున్నది శాస్త్రం. అది పారమార్థికస్థాయికి చెందినది. అక్కడ ఉన్నది ఒకటే బ్రహ్మ. అసంగం బ్రహ్మ. ఒక పక్క నేను బ్రహ్మను అంటూ, ఆ వాక్యం పూర్తిచేయకుండా నా భార్యతోనే నాకు సమస్యగా ఉంది అంటే, అతను వెనువెంటనే వ్యావహారికస్థాయికి దిగిపోతున్నాడు, సంసారిజీవి అయిపోతున్నాడు.

నేను బ్రహ్మను అంటూ నా భార్య అంటే దాని అర్థం ఏమిటి? బ్రహ్మయొక్క భార్య సరిగా లేదు అని వస్తుంది. నిర్గుణబ్రహ్మకు భార్య ఎక్కడినుంచి వస్తుంది? అంటే అతను వేదాంతాన్ని పైపైన నేర్చుకుంటున్నాడు, ఏదో చిలకలా వల్లిస్తున్నాడు తప్పితే దాని అసలు అర్థం తెలుసుకోవటం లేదు. అందువల్లనే రెండు భిన్నవాక్యాలను వెంటవెంటనే పలుకుతున్నాడు.

నేనిప్పుడు ఘోరున ఏడుస్తున్నా కూడా అహం బ్రహ్మ అస్మి, అహం నిత్య అస్మి, అహం శుద్ధ అస్మి అని అర్థం చేసుకోవాలి. వ్యావహారికస్థాయిలో ఏడుస్తున్నాను కాని పారమార్థిక స్థాయిలో నేను ఆనందస్వరూపాన్ని. ఈ భేదం తెలుసుకోకపోతే వేదాంతం నేర్చుకుని కూడా ప్రయోజనం లేదు. అందువల్ల ఇలా మిడిమిడి జ్ఞానం పొందిన శిష్యులను తీవ్రంగా విమర్శిస్తున్నారు రమణమహర్షి.

**మాయావిలాసః** – వీరి వాదనలన్నీ కూడా మాయాశక్తి విలాసమే అంటున్నారు. మాయాశక్తియొక్క గెలుపుకు ఇది ఇంకొక చిహ్నం. మాయ ఎంత శక్తివంతమైనదంటే, మనను విజయవంతంగా సంసారంలో పడవేయటమే కాక, వేదాంతబోధను కూడా సంసారంగా విజయవంతంగా మార్చివేసింది.

'అయ్యో, ఇవాళ్టి క్లాసుకు వెళ్ళలేకపోయానే!' ఇది ఒక సంసారం

'అయ్యో, ఈ శ్లోకం నాకు కంఠతా రావటం లేదే!' ఇంకొక సంసారం

'చిన్నప్పుడు నాకు అఖండమైన జ్ఞాపకశక్తి ఉండేది. ఇప్పుడు వేదాంతంలో నేర్చుకున్నది గుర్తుండటం లేదు!' ఇంకొక సంసారం.

ఇలా ఏదో ఒక బెంగ తినేస్తుంది. అది సంసారం కాక మరేమిటి? ఇది మాయయొక్క శక్తి. మాయ వేదాంతాన్ని కూడా సంసారంగా మార్చివేస్తుంది. తమాషా ఏమిటంటే వేదాంతం సంసారమనే భవరోగానికి మందు ఇస్తుంది; దాన్ని కూడా సంసారాన్ని పెంచి పోషించేలా మారుస్తుంది మాయ.

మిడిమిడి జ్ఞానంతో అర్థం చేసుకునేవారి వాదనలు ఎలా ఉంటాయో, ఉదాహరణకు కొన్ని చూపిస్తున్నారు రమణమహర్షి.

**సత్ అసత్** – సత్ అంటే సత్యం, అసత్ అంటే మిథ్య.

**సరూపవిరూప** – సరూప అంటే సగుణం, విరూప అంటే నిర్గుణం.

**నానా ఏకముఖమ్** – నానా అంటే ద్వైతం, ఏకముఖం అంటే అద్వైతం. ఇందులో విశిష్టాద్వైతాన్ని కూడా కలుపుకోవచ్చు.

వేదాంతం నేర్చుకున్నవారు ఈ విధంగా సత్యం, మిథ్యల గురించి; సగుణ నిర్గుణ బ్రహ్మ గురించి; ద్వైతం, అద్వైతం, విశిష్టాద్వైతం గురించి అనేక వాదోపవాదాల్లోకి దిగుతారు. ఈ వాదనల ద్వారా తాను సత్యబ్రహ్మ, తాను నిర్గుణబ్రహ్మ, ఇది అద్వైత సిద్ధాంతం అనే అంశాల్లో నెలకొనివుంటే తప్పులేదు. కాని కేవలం వాదనలు చేస్తూ, అసలు విషయాన్ని మర్చిపోతే మాత్రం వేదాంతం నేర్చుకుని కూడా ప్రయోజనం లేదు.

అందువల్ల మిమ్మల్ని మీరు అడుగడుగునా ప్రశ్నించుకోవాలి. 'నేను వేదాంతం నేర్చుకున్నాను, నన్ను నేను అర్థం చేసుకుంటున్నానా, నా స్వస్వరూపం ఏమిటో తెలుసుకున్నానా, దానిలో నెలకొని ఉన్నానా లేక యాంత్రికంగా ప్రతి క్లాసుకీ వెళుతూ, బుద్ధిగా నోట్సు రాసుకుంటూ కూర్చున్నానా?' ఈ ఆత్మపరిశీలన చేసుకుంటూ ఉండాలి.

స్వామీజీ నేను ఇప్పటికే 2500 క్యాసెట్లు విన్నాను, ఇంకొక 320 వింటే చాలు వేదాంతం అంతా వినేసినట్టే అని అంటే దానివల్ల ఏమిటి ప్రయోజనం? మీరెంత మారారు దానివల్ల? మీరు పొందిన జ్ఞానంలో నెలకొని ఉన్నారా లేదా? చిన్మయానంద స్వామీజీ అద్భుతంగా అంటారు, 'మీరు పది ఉపనిషత్తులు విన్నారు సరే, అందులో కనీసం ఒక ఉపనిషత్తు అయినా మీలో దూరిందా?' ఉపనిషత్తు మీలో దూరిందా అంటే, ఉపనిషత్తు జ్ఞానం మీలో మార్పు తెచ్చిందా, అహం బ్రహ్మ అస్మి జ్ఞానంలో నెలకొని ఉన్నారా అని అర్థం.

ఆ జ్ఞానం పొంది కూడా ఇసుమంత కూడా మారకపోతే, మీరు తక్కినవారికి వేదాంతం మీద అపప్రధను కలుగజేసినవారవుతారు. 'ఇన్నాళ్ళు వేదాంతం నేర్చుకుని నువ్వేం మారావు, వేదాంతం క్లాసుకి ఒక్కరోజు కూడా వెళ్ళని మేమే నీకన్నా మెరుగ్గా ఉన్నాము,' అంటారు. అంతేనా? పాపం స్వామీజీని కూడా విమర్శిస్తారు. 'ఇదేనా నీకు స్వామీజీ నేర్పించింది?' అంటారు.

అందువల్ల **సదసత్సరూప విరూపనా నైకముఖ ప్రవాదాః –** ఈ వాదనలన్నీ మాయయొక్క శక్తి మాత్రమే. దీన్ని 34వ శ్లోకంతో కలిపి చదువుకోవాలి.

**భూయో విచారో మతిదుర్బలత్వం**

వేదాంతం నేర్పించిన అహం బ్రహ్మ అస్మి మహావాక్యంలో నెలకొని ఉండక, వేదాంతం మళ్ళీమళ్ళీ విచారణ చేయాలనీ, వేదాంతంలో ఆనందాన్ని వెతుక్కోవాలనీ అనుకుంటారు. ఇది మనోదౌర్బల్యం తప్ప వేరే ఏమీకాదు అని చూశాము. వేదాంతం నేర్చుకునేది ఇంకొక కొత్త ఆనందాన్ని పొందటానికి కాదు; వేదాంతం నేర్చుకునేది దానిమీద భావపరంగా ఆధారపడటానికి అంతకంటే కాదు; వేదాంతం తక్కిన విద్యల్లాగా యాంత్రికంగా నేర్చుకునేది కాదు; మిమ్మల్ని బానిసలు చేసేది అసలేకాదు. ఈ విషయాన్ని బాగా గుర్తు పెట్టుకోమని గట్టిగా హెచ్చరిస్తున్నారు.

**శ్లోకం 37**

**సిద్ధస్య విత్తిః సత ఏవ సిద్ధిః**
**స్వప్నోపమానాః ఖలు సిద్ధయోఽన్యాః।**
**స్వప్నః ప్రబుద్ధస్య కథం ను సత్యః**
**సతి స్థితః కిం పునరేతి మాయామ్॥**

**ప్రతిపదార్థం:** సిద్ధస్య = సిద్ధమైన, నిత్యమైన; సతః = సద్వస్తువుయొక్క; విత్తిః + ఏవ = లాభమే; జ్ఞానమే సిద్ధిః = పరమసిద్ధి; అన్యాః = ఇతరమైన (అణిమాది); సిద్ధయః = సిద్ధులు; స్వప్న + ఉపమానాః = స్వప్నాన్ని పోలి ఉన్నాయి; ఖలు = కదా; ప్రబుద్ధస్య= మేల్కొన్నవానికి; స్వప్నః = స్వప్నం; సత్యః = సత్యమైనది; కథం ను = ఎలా అవుతుంది?; సతి= సత్యమైన స్వాత్మయందు; స్థితః = ఉన్నవాడు–నిష్ఠ కలవాడు; పునః = మరల; మాయాం= సత్యస్వరూపానుభూతికి ఆటంకం కలుగచేసే మాయ; ఏతి కిమ్ = పొందునా? (పొందదు)

**తాత్పర్యం:** సత్యాత్మస్థితి నశించేది కాదు, అదే పరమసిద్ధి. అణిమాది సిద్ధులు స్వప్నాన్ని పోలి ఉన్నాయి. మేల్కొన్నవానికి, స్వప్నం సత్యం కాదు. ఆత్మనిష్ఠ కలిగిన వానికి మాయ ప్రతిబంధకం కాదు. ఆటువంటి జ్ఞాని సిద్ధులందు భ్రమను పొందదు.

**వివరణ:** ఈ శ్లోకంలో రమణమహర్షి ఆత్మజ్ఞానం గురించీ, మోక్షం గురించీ ఉన్న మరొక పెద్ద అపోహను తొలగిస్తున్నారు. చాలామంది ఆత్మజ్ఞానం పొంది, మోక్షం పొందటం అంటే సిద్ధులు పొందటం అనే అపోహలో పడిపోతారు. అందువల్ల వారు జ్ఞానులను సిద్ధపురుషులుగా భావించి ఆరాధిస్తారు. అందువల్ల వారు జ్ఞానుల గురించి చెప్పేటప్పుడు, వారు జ్ఞానం పొందారు అనే పదం కూడా వాడరు. ఎందుకంటే వారి భాషలో జ్ఞానం చాలా చిన్న పదం, లౌకికజ్ఞానానికి మాత్రమే అది పనికివస్తుంది. అందువల్ల వారు ఏదో పెద్ద పదాన్ని వాడాలని చూస్తారు. ఈ జ్ఞానులకు సాక్షాత్కారం అయిందనో, జ్ఞానోదయం అయిందనో వాడతారు.

కాని నిజానికి ఆత్మజ్ఞానం కూడా తక్కిన జ్ఞానాల్లాగా, బుద్ధిలో కలిగే స్పష్టమైన జ్ఞానమే. లౌకికవిద్య ఎలా నేర్చుకుంటామో, ఇది కూడా అలా ఒక పద్ధతిలో నేర్చుకోవాలి. గురువు శాస్త్రం ద్వారా కొన్ని సంవత్సరాలు బోధ చేస్తారు. ఆ బోధను శ్రద్ధగా వింటే ఆలోచనలో మార్పు వస్తుంది. ఇదంతా బుద్ధిలో జరుగుతుంది. కాని ఆత్మజ్ఞానాన్ని బుద్ధితో పొందే జ్ఞానంగా ఒప్పుకోరు కొందరు. వారు దీని స్థాయిని పెంచుతారు. ఇది అసాధారణ జ్ఞానం అనీ. అందువల్ల ఇది బుద్ధిలో కలిగే జ్ఞానం కాదనీ అంటారు. ఎప్పుడైతే దీన్ని అసాధారణ జ్ఞానం అంటారో అప్పుడే ఈ అసాధారణ విద్య పొందిన వ్యక్తికి అసాధారణ శక్తులు వస్తాయి అనుకుంటారు. అంటే అతనికి సిద్ధులు కలుగుతాయి అనుకుంటారు.

కాని దురదృష్టవశాత్తూ సిద్ధులకు, జ్ఞానానికి లేదా మోక్షానికి ఎటువంటి సంబంధం లేదు. ఈ విషయం రమణమహర్షే స్పష్టం చేస్తున్నారు. జ్ఞానానికి కాని, మోక్షానికి కాని సిద్ధులతో ఎటువంటి సంబంధం లేదు అంటున్నారు. ఎందుకు? సిద్ధులనేవి అసాధారణ శక్తులు. ఈ అసాధారణ శక్తులు అనాత్మకు చెందుతాయి. అనాత్మ అంటే మిథ్య అని చూశాము. అనాత్మ వ్యావహారిక సత్యానికి చెందితే, ఆత్మ పారమార్థిక సత్యానికి చెందినది. అందువల్ల సిద్ధులకూ, ఆత్మజ్ఞానానికీ సంబంధం లేదు.

ఒక విషయం సరిగ్గా అర్థం చేసుకోవాలి. ఇలాంటి సిద్ధులు లేవనటం లేదు మనం. కాకపోతే ఆత్మజ్ఞానానికీ సిద్ధులకీ సంబంధం లేదు అంటున్నాము అంతే. మనుష్యులలో నాలుగు రకాలు ఉంటారు. వారు –

1. అతను అజ్ఞాని, అతనికి సిద్ధులు లేవు.
2. అతను అజ్ఞాని, కాని అతనికి సిద్ధులు ఉన్నాయి.
3. అతను జ్ఞాని, అతనికి సిద్ధులు లేవు.
4. అతను జ్ఞాని, అతనికి సిద్ధులు కూడా ఉన్నాయి.

ఈ నలుగురిలో ఎవరికి మోక్షం వస్తుంది అంటే 3, 4 రకాల మనుషులకే వస్తుంది. సిద్ధులు ఉన్నా, లేకపోయినా జ్ఞానం ఉంటే మోక్షం వస్తుంది. రెండవరకం మనిషికి సిద్ధులు ఉన్నా, అతనికి జ్ఞానం లేదు కాబట్టి మోక్షం రాదు. అంటే మోక్షం పొందటానికి జ్ఞానం అవసరం, సిద్ధులు కాదు. సిద్ధులు ఉంటే అదనపు అర్హత అవుతుంది కాని కేవలం సిద్ధులు ఉంటే జ్ఞానం రాదు. నిజానికి సిద్ధులు ఉంటే అది మోక్షం ఇవ్వకపోగా, మీరు జాగ్రత్తగా లేకపోతే ఇంకా సంసారంలోకి దింపేయవచ్చు కూడా! ఈ భావాన్నే ఈ శ్లోకంలో చెబుతున్నారు రమణమహర్షి.

సిద్ధులు అంటే అసాధారణమైన శక్తులు. వీటి గురించి వేదాల్లో, పురాణాల్లో, యోగశాస్త్రంలో కూడా చూస్తాము. అష్టమహిమా సిద్ధులు ఉన్నాయి. అవి –

**అణిమా గరిమా చైవ లఘిమా మహిమా తథా।**
**ప్రాప్తిః ప్రాకామ్యమీశిత్వం వశిత్వమ్ చ అష్టసిద్ధయః॥**

అణిమా – శరీరాన్ని అతి చిన్నగా చేయటం.
మహిమా – శరీరాన్ని అతి పెద్దదిగా చేయటం.
గరిమా – శరీరం బరువును విపరీతంగా పెంచటం.
లఘిమా – శరీరాన్ని అతి తేలికగా చేయటం (ఆకారం తగ్గదు కాని బరువు తగ్గుతుంది).
ప్రాప్తిః – ఎక్కడికి వెళ్ళాలంటే అక్కడికి వాహనం అవసరం లేకుండా చేరటం.
ప్రాకామ్యమ్– ఏది కావాలంటే దాన్ని అనుకున్న వెంటనే పొందగలగటం.
ఈశిత్వమ్ – ఎవరిమీదైనా, దేనిపైనైనా అధికారాన్ని పొందటం.
వశిత్వమ్ – అన్ని జీవరాశులను తన అధీనంలో పెట్టుకోవటం (వశపరుచుకోవటం).

మనస్సును అదుపులో పెట్టటం ద్వారా ఈ అష్టసిద్ధులు వస్తాయి అంటారు. అవి కాక మరికొన్ని సిద్ధులు ఉన్నాయి. గతం తెలుసుకోగలరు; భవిష్యత్తును చెప్పగలరు; ఎదుటివారి మనస్సులో ఉన్నది చదవగలరు. ఈ సిద్ధులను కూడా శాస్త్రంలో చూస్తాము.

ఈ సిద్ధులు పొందే మార్గాలను కూడా ఐదుగా సూచిస్తుంది శాస్త్రం. అవి మణి, మంత్రం, ఔషధం, యోగం, పూర్వజన్మపుణ్యం.

**మణి** – కొన్ని ప్రత్యేక మణులను మీ చేతిలో పట్టుకుంటే, కొన్ని సిద్ధులు వస్తాయి
**మంత్రమ్** – కొన్ని మంత్రాలను కొన్ని లక్షలసార్లు లేదా కోట్లసార్లు జపిస్తే కొన్ని సిద్ధులు వస్తాయి.
**ఔషధమ్** – కొన్ని మూలికలను మీ చేతిలో పట్టుకుంటే కొన్ని సిద్ధులు వస్తాయి.
**యోగమ్** – శరీరంలోని చక్రాలను మేలుకొల్పగలిగితే, కొన్ని సిద్ధులు వస్తాయి.
**పూర్వజన్మపుణ్యమ్** – కొంతమంది పుట్టటమే కొన్ని సిద్ధులతో పుడతారు. ఈ విధంగా శాస్త్రంలో అనేక సిద్ధుల గురించి చాలా సుదీర్ఘంగా వస్తుంది. భాగవతపురాణంలో కూడా వీటిని గురించి చదువుతాము.

ఇవన్నీ వినటానికి బాగానే ఉన్నాయి కాని వేదాంతబోధకు వచ్చిన శిష్యుని దృక్పథం ఈ సిద్ధులమీద ఎలా ఉండాలి? ఈ విషయం తెలుసుకోకపోతే పక్కదారి పట్టే ప్రమాదం ఉంది.

1. **సిద్ధులు ఉన్నాయి** – ముందుగా నేర్చుకోవలసిన మొట్టమొదటి పాఠం ఈ సిద్ధులు ఉన్నాయి. వేదాంతం ఏమీ వాటిని కాదని కొట్టివేయటమూ లేదు; అబద్దాలనీ సత్యదూరం అనీ తీసిపారేయటమూ లేదు. నిజమే, కొందరు అతీంద్రియ సిద్ధులు పొందారు. శాస్త్రం చెప్పిందంటే అది అక్షరసత్యం. శంకరాచార్యులవారు సిద్ధులు ఉన్నాయనీ, సిద్ధులు పొందటం ఏమీ సత్యదూరం కాదనీ చెబుతారు. ఇది మొదటి పాఠం.

2. **ఆత్మజ్ఞానంతో సంబంధం లేదు** – ఆధ్యాత్మిక జ్ఞానం పొందటానికీ, సిద్ధులకీ అణువంత కూడా సంబంధం లేదనే విషయాన్ని కూడా ఒప్పుకుని తీరాలి. ఆత్మజ్ఞానాన్ని అణువంతైనా సిద్ధి లేకపోయినా కూడా భేషుగ్గా పొందవచ్చు. తద్వారా మోక్షాన్ని కూడా పొందవచ్చు. దానికి భిన్నమైన వాక్యం కూడా సత్యమే అంటే ఎన్ని సిద్ధులు ఉన్నా, వాటివల్ల అణువంతైనా ఆత్మజ్ఞానాన్ని పొందలేరు. అంటే సిద్ధులు ఉన్నవారికందరికీ ఆధ్యాత్మిక చింతన ఉంటుందన్న నమ్మకం లేదు.

ఆ మాటకొస్తే అణువంతైనా ఆధ్యాత్మిక చింతన లేనివారెందరికో, గొప్ప సిద్ధులు ఉన్నాయి. నిజానికి నైతిక విలువలు ఇసుమంతైనా లేని సిద్ధులు ఎందరో ఉన్నారు. ఎంతమంది రాక్షసులకు సిద్ధులు లేవు? వారు ఏదైనా ధార్మిక చర్యలు చేశారా? లేదే! నిజానికి వారి సిద్ధులను అధార్మిక పనులకు ఉపయోగించేవారు.

3. **కర్మ ఉపాసనఫలం** – ఈ సిద్ధులన్నీ కర్మఫలంగానో, ఉపాసనఫలంగానో వస్తాయి. అంటే అవి మాయలోనో, సంసారంలోనో వస్తాయి. అవి అనాత్మకు చెందుతాయి కాని ఆత్మకు చెందవు.

4. **సిద్ధపురుషులు జ్ఞానాన్ని ఇవ్వలేరు** – ఈ శ్లోకంలో ఒక విషయాన్ని స్పష్టం చేస్తున్నారు రమణమహర్షి. సిద్ధుల పరిమితులను తెలుసుకోకపోతే, ఒక సాధకుడు, వాటి వలలో చిక్కుకుని, తన మార్గంనుంచి దూరంగా వచ్చేస్తాడు. జ్ఞానిని వదిలేసి, ఈ సిద్ధపురుషుల వెంట పడతాడు. సాధకునికి కావాల్సింది ఆత్మబోధ. అది జ్ఞాని చేయగలడు కాని, సిద్ధపురుషుడు చేయలేడు. అందువల్ల సిద్ధపురుషుల వెంటపడితే, తన లక్ష్యం మరిచిపోయే ప్రమాదం ఉంది.

అందువల్లనే రమణమహర్షి ఈ శ్లోకంలో ప్రత్యేకించి చెబుతున్నారు. సిద్ధుల మహిమలో పడిపోకండి. వాటిని అసలు పట్టించుకోకండి. అసలు గొప్ప సిద్ధి ఏదైనా ఉంటే అది ఆత్మజ్ఞానం ఒక్కటే అంటున్నారు.

ఎందుకు? ముందే చూసినట్టుగా, శాస్త్రం వర్ణించే సిద్ధులన్నీ మిమ్మల్ని సంసారంలోనే బంధించి ఉంచుతాయి. ఎందుకంటే, ఆ సిద్ధులను ఆ పురుషులు వారి కర్మఫలంగా, వారి

ఉపాసనల ఫలంగా పొందారు. కాని ఆత్మజ్ఞానం అత్యంత గొప్ప సిద్ధి. ఎందుకంటే అది మాత్రమే మిమ్మల్ని సంసారమనే బంధంలోంచి బయటకు వేసి, మోక్షాన్ని ప్రసాదిస్తుంది.

ఈ ఆత్మజ్ఞానం సిద్ధి కాకుండా వేరే ఏ సిద్ధులు పొందినా అవి అనాత్మకు చెందినవి. అందువల్ల ఆ సిద్ధపురుషులు సిద్ధులు పొందినా, అహంకారాన్ని జయించలేరు. ఇద్దరు సిద్ధుల మధ్యా పోటీతత్త్వం పెరుగుతుంది. ఎవరి శిష్యులను వారే, ఇంకొకరి వైపు ఆకర్షించబడకుండా, గట్టిగా తమ అధీనంలో ఉంచుకోవటానికి ప్రయత్నిస్తారు. ఈర్ష్య అసూయలు రాజ్యమేలుతాయి. అనేక సమస్యలు ఉంటాయి. ఎన్ని సిద్ధులు ఉన్నా పరిపూర్ణతను ఇవ్వవు. ఎందుకంటే అవి ఎంత ఉన్నా ఇంకా కావాలనిపిస్తాయి. ఎన్ని కోట్ల ధనమున్నా, ఆ ధనికుడికి ఎలా తృప్తిగా ఉండదో, అలాగే ఈ సిద్ధులకు కూడా ఎన్ని సిద్ధులున్నా తనివి తీరదు. అందువల్ల అవి ఇచ్చే ఆనందం కూడా పరిమితి ఉన్న ఆనందమే! అసలు సిసలు సిద్ధి పొందాలంటే, జ్ఞానం ఒక్కటే మార్గం! అందువల్ల రమణమహర్షి, అసలైన సిద్ధి అంటే ఆత్మజ్ఞానం పొందటమే అని తేల్చి చెప్పేస్తున్నారు. ఇప్పుడు శ్లోకం చూద్దాము.

**విత్తిః ఏవ సిద్ధిః** – అసలు సిసలు సిద్ధి అంటే జ్ఞానం మాత్రమే. విత్తి అంటే జ్ఞానం. దేని జ్ఞానం?

**సతః** – సత్ అంటే సత్ చిత్ ఆనంద ఆత్మ లేదా బ్రహ్మ. అందువల్ల సత్ అంటే ఆత్మ. సతః విత్తిః అంటే ఆత్మజ్ఞానం. ఆత్మజ్ఞానం ఒక్కటే అసలైన సిద్ధి. ఎటువంటి ఆత్మ?

**సిద్ధస్య** – ఆత్మ సిద్ధవస్తువు, సాధ్యవస్తువు కాదు. ఆత్మను మీరు ముందే పొంది ఉన్నారు, ఆత్మ మీకు అత్యంత సమీపమయినది. నిజానికి ఆత్మ అత్యంత సమీపమయినది కూడా సరియైన పదం కాజాలదు. ఎందుకంటే అది మీరే కాబట్టి.

**సిద్ధస్య సతః (ఆత్మనః) విత్తిః ఏవ సిద్ధిః** – సిద్ధవస్తువైన సత్ చిత్ ఆనంద ఆత్మ గురించిన జ్ఞానం పొందటమే సిద్ధి. ఈ ఆత్మజ్ఞానమే మీకు మోక్షాన్ని కలుగజేస్తుంది. దానికోసం మీరు అసాధారణ శక్తులను పొందాల్సిన అవసరం లేదు. దానికోసం మీరు వస్తువులను సృష్టించనవసరం లేదు. మీరు గాలిలో తేలిపోనవసరం లేదు. మీరు వ్యాధులను నయం చేయనవసరంలేదు. ఎదుటివారి మనస్సును చదవనవసరం లేదు. భవిష్యవాణి పలుకనవసరం అంతకన్నా లేదు. మోక్షం పొందటానికి ఇవేవీ అవసరం లేదు. శాస్త్రం పేర్కొన్న తక్కిన సిద్ధులకన్నా ఆత్మనిష్ఠే అత్యంత గొప్ప సిద్ధి.

**అన్యాః సిద్ధయః** – తక్కిన సిద్ధులన్నీ ఈ సిద్ధి ముందు దిగదుడుపే. తక్కిన సిద్ధులంటే అష్టసిద్ధులు, వశిత్వం అని చూశాము. ఈ సిద్ధులను ఊరంతా కీర్తిస్తే రమణులవారు పరిపక్వత చెందని మనస్సున్నవారు కీర్తిస్తున్నారు అని విమర్శిస్తున్నారు.

పరిపక్వత చెందని మనస్సున్నవారిని శంకరాచార్యులవారి గొప్పతనం ఏమిటని అడిగితే వారు శంకరులవారు చూపిన మహిమలను పేర్కొంటారు. శంకరులవారు పూర్ణానది ప్రవహిస్తున్న దిశను మార్చి, తన తల్లి ఉన్న వైపుకి ప్రవహించేలా చేశారని చెబుతారు. అలాగే ఒక బీద ఇల్లాలుకోసం కనకధారాస్తోత్రం చదివి, బంగారు ఉసిరికాయలు రాలేలా చేశారని అంటారు. లేదా తన శరీరాన్ని వదిలి, ఒక రాజు శరీరంలోకి పరకాయ ప్రవేశం చేశారని స్తుతిస్తారు. అలా శంకరులవారు చూపిన సిద్ధులను కీర్తిస్తారే కాని ఆయన రాసిన భాష్యాలు తెలియవు ఈ పామరులకి. ప్రస్థానత్రయానికి శంకరులవారు రాసిన భాష్యాలు అధ్యయనం చేస్తే శంకరులవారి పాదాలకు సాష్టాంగనమస్కారం చేసి, ఆ పాదాల చెంతనుండి లేవబుద్ధేయదు, అంత గొప్ప జ్ఞానం ఆయనది అంటారు స్వామీజీ.

అలాగే రమణమహర్షి విషయంలోనూ ఇదే పొరపాటు చేస్తారు అంటారు స్వామీజీ. రమణమహర్షి పేరు చెప్పగానే అందరికీ గుర్తు వచ్చేది ఆయన అనస్తీషియా లేకుండా ఆపరేషను చేయించుకున్నారన్న విషయమే. రమణమహర్షి ఆత్మజ్ఞానానికి కాని, ఆత్మవిచారణకు గాని ఇచ్చిన ప్రాముఖ్యతను వీరు పట్టించుకోరు. ఇంతకుముందు శ్లోకాల్లో రమణమహర్షి ఆత్మవిచారణ చేయాలని చెబుతూ వాడిన భిన్నపదాలను చూశాము. ఎప్పుడైతే ఈ సిద్ధాంతుల మహిమలను చూడకుండా, వారి బోధను చూస్తామో అప్పుడే మనం అసలయిన సాధకులం అంటున్నారు రమణమహర్షి.

**(అన్యాః సిద్ధయః) స్వప్న ఉపమానాః** – తక్కిన సిద్ధులన్నీ స్వప్నంతో సమానం అంటున్నారు రమణమహర్షి. స్వప్నం ఎలా మిథ్యగా తేలిపోతుందో, అలా తక్కిన శాస్త్రీయ సిద్ధులనీ కూడా ఆత్మజ్ఞానం పొందాలనుకునే వ్యక్తికి మిథ్యగా వీగిపోతాయి. అవి మాయ. అవి సంసారంలోనే పట్టి ఉంచుతాయి. దాన్నే మూడవ పాదంలో వివరిస్తున్నారు.

**ప్రబుద్ధస్య** – స్వప్నంనుంచి మేలుకున్న పురుషునికి,

**స్వప్నః కథం ను సత్యః** – స్వప్నం ఎలా సత్యమవుతుంది? ఒక **స్వాప్నికునికి** తను **స్వప్నంలో** ఉన్నంతవరకూ తన **స్వప్నం**, ఒక **స్వప్నం** అని తెలియదు. అది నిజమనే భ్రమలో ఉంటాడు. అప్పుడెవరన్నా వచ్చి, అది నిజం కాదని చెప్పినా నమ్మడు. కాని అతనికి నిద్రనుంచి లేచాక, అది మిథ్యగా తేలిపోతుంది. అంటే స్వప్నానికి తాత్కాలిక ఉనికి మాత్రమే ఉంటుంది.

అదే విధంగా, ఇలా శాస్త్రం పేర్కొన్న సిద్ధులకు కూడా తాత్కాలిక ప్రయోజనమే ఉంది. అవి శాశ్వతం కాదు. అంతేకాదు, ఒక సిద్ధపురుషుడు తన కర్మసిద్ధులతో ఏ ఒక్కటి ప్రదర్శించి, ఏ ఒక్క శాపం ఇచ్చినా ఎన్నో జన్మల పుణ్యం హరించుకుపోతుంది; లేదా ఏ మహిమ చూపినా ఎన్నో సంవత్సరాల తపశ్శక్తి హరించుకుపోతుంది. దీన్నిబట్టి అర్థమయినది ఏమిటి? ఈ సిద్ధులు కూడా తాత్కాలికమైనవే. అవి కూడా ఎప్పుడో ఒకప్పుడు ముగిసిపోతాయి. అలా కొన్నాళ్ళే ఉండే సిద్ధులు మిథ్య కిందకే వస్తాయి. అవి తాత్కాలికంగా ఉంటాయి. వాటిలో తారతమ్యాలు కూడా ఉంటాయి.

అందువల్ల సిద్ధులు కావాలని కోరకండి! ఆత్మజ్ఞానాన్ని మించిన గొప్ప సిద్ధి లేదు. ఎందుకంటే ఒకసారి ఆత్మజ్ఞానం పొందితే, దాని శక్తి తగ్గదు. ఒక మంచిరోజు చూసి మాయమవదు. సిద్ధులు వాడితే వందలకొద్దీ సంవత్సరాలు చేసిన తపశ్శక్తి, సంవత్సరాల కొద్దీ చేసిన మంత్రబలం తగ్గుతూ వస్తాయి. అయినా వాటిని ప్రదర్శిస్తూ వస్తే, ఆధ్యాత్మిక పతనానికి దారితీయవచ్చు కూడా.

పతంజలి యోగసూత్రాల్లో, ఈ సిద్ధుల గురించి వస్తుంది. కాని వాటిని కీర్తించే బదులు, మోక్షప్రతిబంధకాల్లో ఒకటిగా పేర్కొంటుంది. ఈ సిద్ధులు వచ్చాయని మురిసిపోతూ కూర్చుంటే, అది మన సాధనలో ముందుకు సాగనివ్వదు. అందువల్ల రసాస్వాదనను కూడా ఒక ప్రతిబంధకం అంటారు యోగశాస్త్రంలో. కాని జ్ఞానమనే సిద్ధి పొందితే మాత్రం అది ఎన్నటికీ ఆటంకం కాదు; దాని శక్తి తగ్గదు.

**సతి స్థితః (పురుషః)** – ఆత్మనిష్ఠలో నెలకొని ఉన్న పురుషుడు. ఆత్మనిష్ఠ అంటే ఎప్పుడూ ఆత్మజ్ఞాననిష్ఠగా అర్థం చేసుకోవాలి. మనమే ఆత్మ అయినప్పుడు మనం ఆత్మలో ఎలా నెలకొని ఉంటాము? అందువల్ల ఆత్మనిష్ఠలో నెలకొని ఉన్నాడు అంటే, ఆత్మజ్ఞాననిష్ఠలో నెలకొని ఉన్నాడని అర్థం. ఆత్మజ్ఞానంలో నెలకొని ఉన్నాడు అంటే తను పొందిన జ్ఞానాన్ని ఎన్నడూ మర్చిపోడు అని అర్థం. తనకు క్లిష్టపరిస్థితి ఎదురైనప్పుడు ఈ ఆత్మజ్ఞానాన్ని ఉపయోగించి, ఈ కష్టం ఆత్మ అయిన తనకు కాదు, అనాత్మకు అని అర్థం చేసుకుంటాడు. ఆత్మనిష్ఠను జ్ఞాననిష్ఠ అనీ, సహజసమాధి అనీ అంటారు.

సహజసమాధి చాలా లోతైన పదం. సహజసమాధి అంటే నేను నిత్యముక్త పురుషుణ్ణి అని ఎన్నడూ మర్చిపోకపోవటం.

**మాయాం పునరేతి కిమ్?**– అంత ఆత్మనిష్ఠలో నెలకొని ఉన్న వ్యక్తి మళ్ళీ మాయలో పడిపోతాడా?

అంతకుముందు మేలుకున్నవానికి స్వప్నం సత్యం ఎలా అవుతుంది అనే ప్రశ్నను చూశాము. ఇప్పుడు మళ్ళీ మాయలో పడిపోతాడా అనే ప్రశ్నను చూస్తున్నాము. ఈ రెండూ కూడా చూడటానికి ప్రశ్నలుగా ఉన్నా, అవి నిజానికి ప్రశ్నలు కావు. వాటిలోనే జవాబు ఇమిడి ఉన్న ప్రశ్నలు అవి. అటువంటి ప్రశ్నలను రిటారికల్ క్వశ్చన్స్ అంటారు ఇంగ్లీషులో.

మేలుకున్నవానికి స్వప్నం సత్యం ఎలా అవుతుంది అంటే అతనికి సత్యం అవదు; స్వప్నం మిథ్యగా తేలిపోతుంది అని చూశాము. అలాగే ఇక్కడ కూడా ఆత్మనిష్ఠలో నెలకొని ఉన్న వ్యక్తి మళ్ళీ మాయలో పడిపోతాడా అంటే పడడు అని అర్థం. మాయ అంటే అజ్ఞానం. ఎప్పుడైతే జ్ఞానం పొందుతాడో అప్పుడే అతని అజ్ఞానం మటుమాయమై పోతుంది. మళ్ళీ తిరిగి వచ్చే ప్రసక్తే లేదు.

అందువల్ల అంటారు, ధనాన్ని ఇతరులకు పంచితే అది తగ్గిపోతుంది కాని, విద్యాధనాన్ని ఇతరులకి పంచితే, అది తగ్గదు సరికదా, రెట్టింపు అవుతుంది. అంటే ఒకసారి పొందిన జ్ఞానం ఎన్నడూ మాయమవదు. అందవల్ల అన్నింటికన్నా గొప్ప సిద్ధి జ్ఞానం. అందులోనూ ఆత్మజ్ఞానం.

అందువల్ల రమణమహర్షి ప్రత్యేకించి చెబుతున్నారు. సిద్ధుల వెంట పరుగులు తీయకండి. ఎదుటివ్యక్తిని అతనికున్న సిద్ధులని చూసి గౌరవించకండి; అతను పాటించే విలువలను చూసి, అతనికున్న జ్ఞానాన్ని చూసి గౌరవించండి. అదే సరియైన దృక్పథం. మీ దృక్పథం మీ నడవడికను చూపిస్తుంది. అందువల్ల విలువలకు విలువనివ్వండి, జ్ఞానానికి పెద్దపీట వేయండి, సిద్ధులకు కాదు అంటున్నారు రమణమహర్షి.

**శ్లోకం 38**

**సోఽహం విచారో వపురాత్మభావే**
**సాహాయ్యకారీ పరమార్గణస్య।**
**స్వాత్మైక్యసిద్ధౌ స పునర్నిరర్థో**
**యథా నరత్వప్రమితిర్నరస్య॥**

**ప్రతిపదార్థం:** వపురాత్మభావే (సతి) = స్థూల, సూక్ష్మ దేహాత్మభావమున్నప్పుడు; సోఽహం విచారః = ఆ పరమాత్మనే నేను అనే విచారణ; పరమార్గణే = పరమాత్మయొక్క అన్వేషణమునకు; సాహాయ్యకారీ = సహకారి; భవతి = అవుతుంది; పునః = కానీ; స+ఆత్మా+ ఐక్యసిద్ధౌ = తన ఆత్మయొక్క ఏకత్వం సిద్ధించినపుడు; సః = ఆ సోఽహం విచారణ; నరస్య = మనిషికి; నరత్వప్రమితిః యథా = నేను మనిషిని అన్నట్టే ఉంటుంది; నిరర్థః = వ్యర్థం; భవతి= అవుతుంది.

**తాత్పర్యం:** స్థూల, సూక్ష్మదేహాత్మ భావమున్నప్పుడు సోఽహం విచారణ పరమాత్మాన్వేషణమునకు సహకారి అవుతుంది; కాని తన ఆత్మయొక్క ఏకత్వం సిద్ధించినపుడు, మనిషికి నేను మనిషిని అనే ఆలోచన ఎలా అవసరం లేదో అలాగే సోఽహం విచారణ ఇంక అవసరము లేదు.

**వివరణ:** ఈ శ్లోకంలో మళ్ళీ ఇంకొక హెచ్చరిక చేస్తున్నారు రమణమహర్షి వేదాంత శిష్యులకు. ఒకవేళ ఏ శిష్యుడైనా వేదాంతానికి యాంత్రికంగా వస్తే, అతనికి తెలియకుండానే అంత యాంత్రికంగానూ తను వేదాంతానికి ఎందుకు వచ్చాడో, కాలక్రమేణా మర్చిపోయే ప్రమాదం ఉంది. వేదాంతంయొక్క అసలు లక్ష్యం, మనిషిని అన్ని రకాల బంధాలనుంచి విముక్తుణ్ణి చేయటం. ఏ కారణంవల్లనైనా అతను వేదాంతంయొక్క ఈ ప్రాథమిక లక్ష్యాన్ని మర్చిపోతే, అతను వేదాంత విచారణకు ఎందుకు వచ్చాడో వదిలేసి, వేదాంత విచారణకు బందీ అయిపోతాడు. వేదాంత విచారణకు ఎంతగా బానిస అయిపోతాడంటే, తన అధ్యయనానికి ఏ కాస్త ఆటంకం కలిగినా అతనికి చిరాకు వచ్చి, దుఃఖంతో కృంగిపోవచ్చు.

అప్పుడు ఆ విధంగా వేదాంతం కూడా ఒక బంధం అవవచ్చు. శాస్త్రం దీన్ని శాస్త్రవాసన అంటుంది. ఇంతకీ శాస్త్రం ఆత్మా, అనాత్మా? ఇది ఒక ప్రాథమిక సందేహం. శాస్త్రం కూడా అనాత్మ కిందకే వస్తుంది. అనాత్మలో ఏ విధమైన బంధం ఉన్నా కూడా అది సంసారమే. శాస్త్రం కూడా అనాత్మ కాబట్టి, శాస్త్రంతో బంధాన్ని కూడా సంసారం అంటారు.

కాని ఈ విషయాన్ని జాగ్రత్తగా వినాలి. అసలే శాస్త్ర అధ్యయనం ఎలా ఎగ్గొట్టాలా అని చూస్తారు చాలామంది. అందువల్ల ఇది వినగానే, 'ఓహో అలాగా! శాస్త్రంతో బంధం కూడా సంసారమే అయితే, రేపట్నుంచి నేను శాస్త్రం నేర్చుకోవటానికి రాను,' అనేస్తారు తేలికగా. శాస్త్రంమీద బంధం పెంచుకోవటం ఎలా తప్పో, శాస్త్రాన్ని నేర్చుకోను అని నిశ్చయించుకోవటమూ తప్పే.

ఓం ప్రథమంగా శాస్త్రంతో బంధం ఏర్పరచుకోవాలి; గురువుతో బంధం ఏర్పరచుకోవాలి; ఆత్మవిద్య బోధించే గురువుగా ఆయనతో బంధం పెంచుకోవాలి; భగవంతునితో బంధం ఏర్పరచుకోవాలి; తద్వారా ఆత్మజ్ఞానం పొందాలి. వీటి ద్వారా తక్కిన బంధాలను వదుల్చుకుని తరువాత వీటిమీద కూడా బంధాలు వదుల్చుకోవాలి.

శాస్త్రవాసన, గురువాసన, ఈశ్వరవాసన ఇవన్నీ మీకున్న తక్కిన వాసనలను వదులు కోవటానికి అద్భుతంగా దోహదం చేస్తాయి. అందువల్ల వాటిని మార్గంగా ఉపయోగించు కోవటానికి వాటిమీద మీరు బంధం ఏర్పరచుకోవాలి. కాని వాటివల్ల మీరు చేరాల్సిన లక్ష్యం చేరాక, అంటే మీరు ముక్తపురుషులు అని అర్థం చేసుకున్నాక, ఇంక ఈ మార్గంతో

పనిలేదు. అందువల్ల శాస్త్రం, గురువు, ఈశ్వరుడు – మీకు మార్గాలే కాని, లక్ష్యం కాదని రమణమహర్షి పదేపదే హెచ్చరిస్తున్నారు. దీని గురించి 34వ శ్లోకంలో, 36వ శ్లోకంలో చెప్పారు. ఇప్పుడు ఈ 38వ శ్లోకంలో కూడా మళ్ళీ అదే విషయం చెబుతున్నారు.

**సోఽహం విచారః సాహాయ్యకారీ** – మహావాక్య విచారణ చాలాచాలా అవసరం. అది చేసి తీరాలి. దానివల్ల మీరు ఫలం పొందుతారు. సోఽహం అంటే సః అహం. సః అంటే పరమాత్మ; అహం అంటే జీవాత్మ. ఆ పరమాత్మే ఈ జీవాత్మ అయిన నేను. ఒక్క ముక్కలో చెప్పాలంటే సోఽహమ్ అంటే మహావాక్యం అని చెప్పవచ్చు. అందువల్ల సోఽహం విచారః అంటే జీవాత్మ పరమాత్మల ఐక్యాన్ని బోధించే మహావాక్యం. అందువల్ల సోఽహం విచారః అంటే మహావాక్య విచారణ అనవచ్చు లేదా వేదాంత విచారణ అనవచ్చు లేదా వేదాంత శ్రవణ మనన నిదిధ్యాసనం అనవచ్చు.

సాహాయ్యకారీ అంటే సహకారి. వేదాంతవిచారణ గొప్పసాధన. వేదాంత వాక్యం ప్రమాణం. ఏ ప్రమాణమైనా, దాన్ని ఉపయోగిస్తే దానికి తగ్గ 'ప్రమా'ని అంటే జ్ఞానాన్ని కలుగజేస్తుంది. దేని గురించిన జ్ఞానం?

**పరమార్గణస్య** – పర+ మార్గణస్య. పరమ్ అంటే బ్రహ్మ; మార్గణం అంటే అన్వేషణం. అందువల్ల వేదాంతవిచారణ బ్రహ్మ గురించి తెలుసుకునే మీ అన్వేషణకు మార్గంగా తోడ్పడుతుంది. బ్రహ్మ అన్వేషణ మోక్షం పొందటానికి, పూర్ణత్వం పొందటానికి, శాశ్వతమైన భద్రతను పొందటానికి, మీ ఆధ్యాత్మసాధనకు గొప్ప సాధన. మోక్షం, పూర్ణత్వం, శాశ్వతమైన భద్రత, బ్రహ్మజ్ఞానం – ఇవన్నీ పర్యాయపదాలు. ఇవి సాధ్యం లేదా లక్ష్యం. ఒక సాధ్యాన్ని సాధనతో పొందుతారు. లేదా లక్ష్యం పదం వాడాలంటే, ఒక లక్ష్యాన్ని మార్గం ద్వారా పొందుతారు. రెండింటి అర్థం ఒకటే!

ఇప్పుడు ఒక సాధనను ఎంతవరకు ఆచరిస్తారు? మీరు ఆశించిన సాధ్యాన్ని పొందేదాకానే. ఒకసారి సాధ్యాన్ని పొందేశాక, సాధనతో అవసరం తీరిపోతుంది. ఇక్కడ సాధ్యం ఏమిటి?

### అహం బ్రహ్మ అస్మి

అహం బ్రహ్మ అస్మి నిజానికి సాధ్యం కాదు. మీరు ఎప్పుడూ బ్రహ్మే, కాని ఆ విషయం తెలియనంతవరకూ దానికోసం సాధన చేస్తారు. ఈ **అహం బ్రహ్మ అస్మి** జ్ఞానం మీకొక సత్యంలా వెలిగేదాకా, ఈ సాధన కొనసాగాలి. అంటే నేనొక పరిమితి ఉన్న జీవాత్మను అనే భావనలో మీరు ఉన్నన్నాళ్ళూ ఈ సాధన (వేదాంత విచారణ అనే సాధన) చేయక తప్పదు. నేనొక పరిమితి ఉన్న జీవిని, నేను మారాలి అనుకునేదాకా, సాధన తప్పదు.

దయానంద స్వామీజీ సంసారాన్ని అద్భుతంగా నిర్వచిస్తారు. 'నేను ఉన్నదానికన్నా భిన్నంగా ఉండాలి అనుకుని సాధన చేయటమే సంసారం.' నేను ఇప్పుడు పూర్ణపురుషుణ్ణి కాను, నేను కొన్ని కార్యక్రమాలను సక్రమంగా నెరవేర్చాలి. అది 2025లోగా చేయాలి. అప్పుడే నేను పరిపూర్ణుడను అవుతాను అనుకుని, ఆ దిశలో శ్రమపడుతూ, పరుగులు తీస్తూ ఉంటాను. భవిష్యత్తు కాస్తా వర్తమానం అయింది. ఎదురుచూసిన 2025 రానే వచ్చింది. పరిపూర్ణుణ్ణి అయ్యానా? నా పరుగులు ఆగాయా? లేదే! ఇప్పుడు వర్తమానంలో నేను, నాకు తృప్తి లేదనుకుని, భవిష్యత్తులో నేను వైపుకు పరుగులు తీస్తున్నాను.

కాని ఇలా వర్తమానంలో జీవించకుండా, భవిష్యత్తులో పూర్ణుడను అవుతాను అనుకుని పరుగులు తీసినన్నాళ్ళూ, పూర్ణుడయ్యే ప్రసక్తే లేదు. ఎందుకంటే ఇప్పటి నేనుతో నేను తృప్తి పడకపోతే, 2025లోనూ తృప్తిపడను; 2030లోనూ తృప్తిపడను. ఈ పరుగుపందెం ఆపాలంటే దానికి వేదాంత విచారణ ఒక్కటే మార్గం. వేదాంత విచారణ మీరు ఇప్పుడే పూర్ణపురుషులు అంటుంది; మీరు వేసుకున్న ప్రణాళికలను సాధించినా, సాధించకపోయినా మీరు పరిపూర్ణులు అంటుంది. ఎందుకు? మీరు వేసుకున్న ప్రణాళికలను పొందటం, పొందకపోవటం సంసారంలోకి వస్తుంది. ఎప్పుడైతే ఈ విషయాన్ని అర్థం చేసుకుంటారో, అప్పుడే వేదాంతబోధ అర్థమయినట్టు అర్థం.

వేదాంతబోధ మీకు కొత్తగా ఇంకొక ప్రణాళికను ఇవ్వకూడదు. వేదాంతబోధ మీకున్న అనేక ప్రణాళికలు ముగిసినా, ముగియకపోయినా కూడా మీ పూర్ణత్వానికి అవి అడ్డురావని నిరూపిస్తుంది. ఆ ప్రణాళికలన్నీ అనాత్మకు చెందుతాయి. మీకు దేహాత్మభావన ఉన్నంతవరకూ, మీరు నేను అహంకారాన్ని అనుకుని అహంకారంతో మమేకం చెందినంతవరకూ మీరు పరిపూర్ణులు కాలేరు. నేను అహంకారంలో మమేకం చెందుతున్నానో లేదో ఎలా తెలుస్తుంది అనుకోవచ్చు. నేను వేసుకున్న ఈ ప్రణాళిక ముగిసి, ఇందులో నేను విజయం పొందితే, నేను పూర్ణుడను అని అనుకునేటట్టయితే, ఆ కార్యక్రమం అవగానే అమ్మయ్య, ఇది తీరింది అని అనుకునేటట్టయితే, అది సంసారమే అవుతుంది. దాన్ని జీవాత్మభావన అంటారు.

ఆ జీవాత్మభావనలో ఉన్నంతవరకూ వేదాంతాన్ని అధ్యయనం చేయాల్సిందే. అలా వేదాంతవిచారణ కొనసాగిస్తూ ఎప్పటికప్పుడు మీ మనస్సును బేరీజు వేసుకుంటూ రండి. నేను ఈ కార్యక్రమం ముగిశాక, ఆనందం పొందుతాను అని ఇంకా అనుకుంటూ ఉంటే, మీరింకా సాధన చేయాల్సి ఉంటుంది. లేదు, నా ప్రణాళిక పూర్తి అయినా, కాకపోయినా నేను పూర్ణపురుషుణ్ణి అని అర్థం చేసుకోగలిగితే, వేదాంతాన్ని కూడా వదిలివేయవచ్చు.

నా పూర్ణత్వానికి లౌకిక విజయాలతో సంబంధం లేదనే జ్ఞానం వచ్చేదాకా, వేదాంత విచారణ చేయక తప్పదు.

**స్వాత్మైక్య సిద్ధౌ** – స్వాత్మైక్యంలో స్వ అంటే జీవాత్మ; ఆత్మ అంటే పరమాత్మ. స్వాత్మ కాదు. స్వ+ఆత్మ. రెండు పదాలు ఇందులోనే ఉన్నాయి. ఐక్యం అంటే ఈ జీవాత్మ, పరమాత్మల ఐక్యం. సిద్ధౌ అంటే ఈ ఐక్యజ్ఞానం పొందాలి. అలా ఐక్యజ్ఞానం పొందినట్టు నిదర్శనం ఏమిటి? నా పూర్ణత్వాన్ని ఏ ప్రణాళికతోనూ ముడిపెట్టను, వేదాంత ప్రణాళికతో సహా!

కొంతమందిని నువ్వు ముక్తపురుషుడివా అని అడిగితే, బ్రహ్మసూత్రాలు నేర్చుకుని ముగిస్తే మోక్షం వస్తుంది అంటారు. తమాషా ఏమిటంటే, బ్రహ్మసూత్రాలు ఇలాంటి ప్రణాళికలనుంచి వారిని విడదీయటానికే చెప్పబడ్డాయి. కాని వారు వాటిని కూడా ఇంకొక ప్రణాళికగా చేస్తున్నారు. అదీ అజ్ఞానంయొక్క పరాకాష్ఠ. భగవద్గీత నేర్చుకోవాలి, బ్రహ్మసూత్రాలు నేర్చుకోవాలి, సద్దర్శనం నేర్చుకోవాలి. వేదాంతం పనిగట్టుకుని నేర్పించేది ఈ బంధాలను వదులుకోండి, ఇవి నెరవేరినా, నెరవేరకపోయినా మీరు పూర్ణపురుషులేఅంటుంది. కాని అహంకారం తెలివిమీరింది. వీటిని కూడా మీరు చేయాల్సిన పనులుగా మార్చివేసింది. ఎప్పుడైతే ఒక ప్రణాళిక వేస్తారో, అప్పుడే దాని లక్షణం ఏమిటో తెలుసా? వాయిదాలు వేయటం – రేపు చేద్దాంలే, రేపు చూద్దాంలే అనుకోవటం.

**రేపు అంటే సంసారం; ఇక్కడే ఇప్పుడే అంటే వేదాంతం.** రేపు (భవిష్యత్తులో) పూర్ణపురుషుణ్ణి అవుతాను అనుకోవటం సంసారం; నువ్వు ఇక్కడే ఇప్పుడే ముక్తపురుషుడివి అంటుంది వేదాంతం. అందువల్ల ఎప్పుడైతే జీవాత్మ పరమాత్మ ఐక్యజ్ఞానం పొందుతారో, అప్పుడే,

**సః** – ఆ సోఽహం విచారణ ఇంక అవసరం లేదు, మీరు పూర్ణత్వం పొందటానికి. వేదాంత విచారణమీద మమకారం కూడా వదులుకోవాలి. అలాగని అసలు వేదాంతం అధ్యయనం చేయటం వదలమనటం లేదు. మీరు ఉపనిషత్తు నేర్చుకోవటాన్ని ఆస్వాదించవచ్చు; ఇతరులతో మననం చేయటంలో ఆనందం పొందవచ్చు; క్లాసులకు వెళ్ళటంలో ఆనందం అనుభవించవచ్చు కాని మీ ఆనందాన్ని బంధించని కోరికగా మలుచుకోవాలి.

బంధించే కోరికకూ, బంధించని కోరికకూ మధ్య భేదమేమిటి? బంధించని కోరికకు, నేర్చుకోగలిగితే ఆనందం, నేర్చుకోలేకపోయినా ఆనందమే ఉంటుంది. మనది పెరిగే వయస్సే కాని తరిగే వయస్సు కాదు. వయస్సు పైబడినకొద్దీ ఇంద్రియాలు మొరాయిస్తాయి, చూపు మందగిస్తుంది, వినికిడిశక్తి తగ్గుతుంది; కాని వాటివల్ల మళ్ళీ సంసారంలో పడకూడదు.

**పునః నిరర్థః భవతి** – జ్ఞానంలో నిలబడ్డాక, వేదాంతం వ్యర్థం అవుతుంది. ఏ విధంగా?

**యథా నరత్వప్రమితిర్నరస్య** – ఎలాగైతే ఒక మనిషికి, నేను మనిషిని అని పదేపదే జపించనవసరం లేదో అలా జ్ఞానంలో నిలబడ్డాక వేదాంతం కూడా వల్లెవేయనవసరం లేదు.

మనిషి నేను మనిషిని, నేను మనిషిని అని ప్రతిరోజూ లేవగానే 108సార్లు జపిస్తాడా? నేను మనిషిని, నేను ఫలానావారి అబ్బాయిని, నేను ఫలానావారి తండ్రిని, నా వయస్సింత అని జపం చేసుకుంటూ కూర్చుంటాడా? లేదే! ఎందుకు? అది అతనికి సత్యం కాబట్టి. సత్యాన్ని జపిస్తూ కూర్చోనవసరం లేదు. సత్యానికి జపం తోడవసరం లేదు. ఇదే సూత్రం **అహం బ్రహ్మ అస్మి** సత్యానికి కూడా వర్తిస్తుంది.

నేను వేదాంతాన్ని సరిగ్గా అధ్యయనం చేస్తే, అహం బ్రహ్మ అస్మి నాకు సత్యం అవుతుంది. ఎంత సత్యం అంటే అజ్ఞానికి నేను మనిషిని అనేది ఎంత సత్యమో, అంత సత్యం. అందువల్ల నేను బ్రహ్మను అనే మహావాక్యాన్ని పదేపదే జపించనవసరం లేదు. చిదానందరూప శివోఽహం, శివోఽమ్ కూడా జపించనవసరం లేదు. మహావాక్యాలు జపమంత్రాలు కాదు. అవి సత్యం, సత్యం, పునః సత్యం – ఆ సత్యాన్ని అర్థం చేసుకుని, జీర్ణించుకోవాలి. ఎప్పుడైతే అర్థం చేసుకుని జీర్ణించుకుంటారో అప్పుడే ఇంక వేదాంత విచారణ చేయనవసరం లేదు; మహావాక్య జపమూ చేయనవసరం లేదు. ఈ మహావాక్యాలు జపమంత్రాలు కాదని ఇప్పుడే చూశాము. అందువల్ల,

నరస్య నరత్వప్రమితిః – మనిషికి నేను మనిషిని అనే జపం ఎలా అవసరం లేదో, అదే విధంగా జ్ఞానికి అహం బ్రహ్మ అస్మి విచారణ కూడా అవసరం లేదు. జపం అంతకన్నా అవసరం లేదు.

ముందే చూసినట్టుగా, జ్ఞాని ఇంకా వేదాంత అధ్యయనం చేసి, అందులో రమిస్తాను అంటే నిక్షేపంలా చేయవచ్చు, తప్పేం లేదు. పైగా అతను చేయగల మంచిపని దానికన్నా వేరే ఏమీ లేదు. ఏదో పనికిమాలిన దాని గురించి ఆందోళన చెందే బదులు, వేదాంతాన్ని ఏం చేయాలి అని బెంగపడితే మంచిదే. వేదాంతాన్ని ఉపయోగించి ప్రాపంచిక చింతలను పారద్రోలవచ్చు కాని, వేదాంతం ఇంకొక వ్యసనంగా మారకూడదని హెచ్చరిస్తున్నారు రమణమహర్షి. ప్రమితి అంటే జ్ఞానం. నిరర్థ అంటే ఇక్కడ పునరుక్తిగా వాడవచ్చు.

ఈ శ్లోకం అర్థం టూకీగా చూస్తే నేను మనిషిని అనే జ్ఞానాన్ని వల్లెవేయటం ఎలా అవసరం లేదో; అలా అహం బ్రహ్మ అస్మి అనే జ్ఞానాన్ని పొందిన జ్ఞాని దాన్ని జపించటం కూడా అనవసరం అంటున్నారు రమణమహర్షి.

**శ్లోకం 39**

**ద్వైతం విచారే పరమార్థబోధే**
**త్వద్వైతమిత్యేష న సాధువాదః।**
**గవేషణాత్ ప్రాగ్దశమే వినష్టే**
**పశ్చాచ్చ లబ్ధే దశమత్వమేకమ్॥**

**ప్రతిపదార్థం:** విచారే = తత్త్వవిచారణ చేసే సమయంలో; ద్వైతం = దృక్–దృశ్య– జీవ–ఈశ్వరాది ద్వైతభావమనీ; పరమ+అర్థబోధే తు = సత్ ఒకటే సత్యం తక్కినదంతా మిథ్యా; అద్వైతం = అద్వైతం; ఇతి = అనే; ఏషః = ఈమాట; సాధువాదః= యుక్తమయినవాదం; న = కాదు; గవేషణాత్ = విచారణకు; ప్రాక్ = ముందు; దశమే= పదవవాడు; వినష్టే= కన్పించకున్నా; దశమత్వమ్ ఏకః = పదవవాడు అతనే తప్ప మరొకడు లేదు.

**తాత్పర్యం:** మనిషికి తత్త్వవిచారసమయంలో ద్వైతం, యథార్థజ్ఞానసమయంలో అద్వైతం అనేది సరియైనది కాదు. విచారణకు ముందు పదవవాడు కన్పించకున్నా, పదవవాడు ఉన్నాడు. లేకుండా లేడు.

**వివరణ:** ఇంకొక ముఖ్యమైన శ్లోకం ఇది. మోక్షం అంటే ఏమిటో వివరిస్తున్నారు ఇందులో రమణమహర్షి. మోక్షం అంటే అనాత్మస్థాయిలో బాహ్యంగా జరిగే మార్పు కాదు అంటున్నారు. మోక్షం అంటే బాహ్యంగా జరిగే మార్పు కాదు కాబట్టి, బాహ్యప్రపంచంలో మార్పును ఆశించకండి అంటున్నారు. అంతేకాదు, శారీరకస్థాయిలో కూడా మార్పు జరగదనీ, అటువంటి మార్పుని ఆశించకండి అనీ అంటున్నారు.

ఒకవేళ మీరు యోగాసనాలు వేస్తుంటే మీ శరీరం యవ్వనాన్ని సంతరించుకోవచ్చు. యోగశాస్త్రంలో శరీరం మిలమిలా మెరుస్తుందని అంటారు. శరీరంలో మెరుపుకూ, జ్ఞానానికీ ఏ విధమైన సంబంధమూ లేదు; మోక్షానికి అసలే సంబంధం లేదు.

పరమహంస యోగానంద శరీరం ఆయన తనువు చాలించాక కూడా ఎన్నాళ్ళో తాజాగా ఉందనీ, శరీరంలో మెరుపు ఏమాత్రం తగ్గలేదనీ అంటారు. ఆటోబయోగ్రఫీ ఆఫ్ ఎ యోగి తెలుగులో ఒక యోగి ఆత్మకథ అని వచ్చింది. ఆ ఆత్మకథ ఎంతో ప్రసిద్ధి చెందింది. దాని గురించి తెలియనివారు ఉండరు. కాని దానిలో ఆయనకున్న జ్ఞానంకన్నా ఆయన చూపిన సిద్ధులే ఎక్కువగా చోటు చేసుకున్నాయి.

కాని వేదాంతానికి వచ్చేవారు ఈ విషయాన్ని స్పష్టంగా అర్థం చేసుకోవాలి. ఇలాంటి పుస్తకాలలో ఉటంకించినట్టుగా శరీరంలో మెరుపులు రావనీ, సిద్ధులు పొందరనీ తెలుసుకోవాలి. వేదాంతం అధ్యయనం చేస్తే, శరీరంలో మెరుపు వస్తుందనో, మొహంలో

ఒక కాంతి వస్తుందనో ఆశించకూడదు అంటున్నారు రమణమహర్షి. పొరపాటున కూడా అలాంటి భ్రమలో పడకండి అంటున్నారు.

మీరు జ్ఞానం పొందగానే మీ చుట్టూ ఉన్న ప్రపంచం మారిపోదు, మీ శరీరం తళతళలాడదు. ఇంద్రియాలు చూసే విషయవస్తువులు అలాగే ఉంటాయి. రంగులు ఏమీ మారవు. నిజానికి అన్నీ ఒకే రంగులో కనిపిస్తే దాని అర్థం జ్ఞానం వచ్చిందని కాదు. కంటికి శుక్లాలు వచ్చాయనీ, కంటివైద్యుని దగ్గరకు వెళ్ళాలనీను. అందువల్ల బాహ్యంగా మీలో కానీ, ప్రపంచంలో కాని మార్పులు రావు. వచ్చే మార్పల్లా, మీ దృక్పథంలో వస్తుంది. మీ బుద్ధిలో మార్పు వస్తుంది. మీరు అర్థం చేసుకోవటంలో మార్పు వస్తుంది. ప్రపంచాన్ని అర్థం చేసుకోవటంలో, భగవంతుణ్ణి అర్థం చేసుకోవటంలో, మిమ్మల్ని మీరు అర్థం చేసుకోవటంలో మార్పు వస్తుంది. ఈ శ్లోకం అర్థం ఇదీ.

ఈ శ్లోకంలో రమణమహర్షి అద్వైతం స్వరూపం గురించి వివరిస్తున్నారు. ముక్తి అంటే ఏమిటి, బంధం అంటే ఏమిటి, జ్ఞానం అంటే ఏమిటనే అంశాల గురించి స్పష్టమైన అవగాహన ఏర్పడాలంటే ముందుగా అద్వైతం అంటే ఏమిటో స్పష్టంగా తెలియాలి.

అందువల్ల అద్వైతం అంటే ఏమిటో స్పష్టంగా వివరిస్తున్నారు రమణమహర్షి. అద్వైతం అంటే ఎప్పుడో భవిష్యత్తులో జరిగే సంఘటన కాదు, ఒకకాలంలో వచ్చే అనుభవం కాదు, ఒక అవస్థ కాదు, అనుభవంలోకి వచ్చే సాధారణ అనుభవమూ కాదు, అసాధారణ అనుభవమూ కాదు. ఆ విధంగా అద్వైతం ఒక సంఘటన కాదు, ఒక స్థితి కాదు, ఒక అనుభవం కూడా కాదు. ఎందుకంటే ఈ మూడూ కాలానికి లోబడి ఉంటాయి. భవిష్యత్తులో జరగబోయే సంఘటన అంటే కాలానికి లోబడి ఉంటుంది. అంతేకాదు, ఒక కాలంలో జరగబోయే సంఘటన ఇంకొక కాలంలో ముగుస్తుంది కూడా.

**జాతస్య హి ధ్రువో మృత్యుః**

పుట్టిన ప్రతి వ్యక్తికీ మరణం తప్పదు. అలాగే ఒక సమయంలో పుట్టిన సంఘటన కూడా ఇంకొక సమయంలో ముగుస్తుంది.

అదే విధంగా ఒక స్థితి కూడా కాలం కోరల్లో చిక్కుకుంటుంది. అది మామూలు అవస్థ అయినా, అసాధారణ అవస్థ అయినా సరే. ఇదే సూత్రం అనుభవానికి కూడా వర్తిస్తుంది. అనుభవం కూడా కాలానికి కట్టుబడి ఉంటుంది. ఎందుకంటే ఒక అనుభవం కూడా ఒక సమయంలో జరుగుతుంది. అందువల్ల అద్వైతం అంటే భవిష్యత్తులో జరిగే సంఘటన కాదు. అది మనం అనుభవించే ఒక అవస్థ కాదు, మనం ప్రయత్నం చేసి పొందే అనుభవం అసలే కాదు. ఈ విషయం ముందు చాలా స్పష్టంగా అర్థం చేసుకోవాలి.

ఈ సూత్రం ప్రకారం ఒక ఉపసిద్ధాంతం ఏర్పరచవచ్చు. సుషుప్తిలో అనుభవించే అద్వైతం కాని, సమాధి స్థితిలో అనుభవించే అద్వైతం కాని, ప్రళయంలో అనుభవించే అద్వైతం కాని అసలు సిసలు అద్వైతం కాదు. సుషుప్తిలో, సమాధిలో, ప్రళయంలో అనుభవంలోకి వచ్చే అద్వైతం అద్వైతమే కాదు. అది పొరపాటుగా ఇచ్చిన పేరు మాత్రమే. ఎందుకంటే తాత్కాలికంగా ఏర్పడిన అద్వైతం, అద్వైతం కానేరదు. ఈ మూడు సందర్భాలలోనూ అద్వైతం తాత్కాలికమే, ఎందుకంటే ఈ మూడూ ఎప్పుడూ ఉండవు. ఒక కాలంలో వచ్చి, మరొక కాలంలో వెళ్ళిపోతాయి. ఈ మూడింటిలోనూ అనుభవంలోకి వచ్చేది అద్వైతం కాదు, అవ్యక్తంలో ఉన్న ద్వైతం. అవ్యక్తంలో ఉన్న ద్వైతం అని తెలియక, దానినే అద్వైతంగా పొరపాటు పడుతున్నారు.

సుషుప్తి అద్వైతం, సమాధి అద్వైతం, ప్రళయ అద్వైతం అన్నీ కూడా అవ్యక్త ద్వైతం మాత్రమే. అలా ఎలా చెప్పగలరు? ఏమిటి దానికి కారణం? ఎందుకంటే సుషుప్తిలో అనుభవించిన అద్వైతం నిద్ర లేవగానే ద్వైతంగా మారుతుంది; సమాధి స్థితిలోని అద్వైతం, ఆ స్థితినుంచి బయటకు రాగానే మటుమాయమవుతుంది.

మరి అయితే అద్వైతం అంటే ఏమిటి? అద్వైతం అన్నివేళలా ఉండే సత్యం. అది ఒక సంఘటన కాదు, ఒక స్థితికాదు, ఒక అనుభవం కానే కాదు. అది కాలాతీత సత్యం. ఈ సత్యాన్ని బుద్ధిలో గ్రహించాలి అంటుంది వేదాంతం. అద్వైతం అంటే నిత్యం అని అర్థం చేసుకోవటమే అద్వైత జ్ఞానం. ఈ అద్వైతజ్ఞానాన్ని అనుభవం అనకూడదు. జ్ఞానానికీ, అనుభవానికీ మధ్య చాలా భేదం ఉంది. జ్ఞానం పదం వాడాల్సిన చోట అనుభవం పదం ఎలా వాడతారు? ఎందుకంతలా నొక్కివక్కాణిస్తారు అని ఎవరైనా అడిగితే, అనుభవానికీ జ్ఞానానికీ మధ్య ఉన్న భేదాన్ని గమనించమంటాము.

1. **శాశ్వత అంశం** – రెండూ బుద్ధిలో జరిగేవే కాని వాటి మధ్య సూక్ష్మభేదం ఉంది. అనుభవం బుద్ధిలో కలుగుతుంది, కాని ఒక అనుభవాన్ని, ఇంకొక అనుభవం పారద్రోలుతుంది. కొత్త అనుభవం వస్తే పాత అనుభవం వెళ్ళిపోతుంది. అందువల్ల అద్వైతం కూడా ఒక అనుభవం అనేటట్టయితే అది కూడా ద్వైత అనుభవం కలగగానే, పోతుంది.

కాని జ్ఞానం అలా కాదు. ఒక విషయానికి సంబంధించిన జ్ఞానం బుద్ధిలో కలిగాక, దాని తరువాత ఎన్ని అనుభవాలు ఎదురైనా, ఆ జ్ఞానం పోదు. ఒకసారి 2+2=4 జ్ఞానం పొందాక మీరు ఏ అనుభవాన్ని పొందుతున్నా కూడా ఈ జ్ఞానం (2+2=4) మటుమాయమవదు. అంటే మీరు ఆనందంగా ఉన్నా, విచారంగా ఉన్నా, నిస్పృహ చెందుతున్నా, చలి వేస్తున్నా, చెమటలు కారుతున్నా, మీ మనస్సు ఎటువంటి భావోద్రేకాలకు

లోనవుతున్నా కూడా, మీరు బుద్ధిలో పొందిన జ్ఞానం ఎక్కడికీ పోదు. అది చెక్కు చెదరకుండా అలాగే నిలిచి ఉంటుంది. అందువల్లనే ఎక్కడ జ్ఞానం పదం వాడాలో, అక్కడ జ్ఞానమే వాడాలి, అనుభవం వాడకూడదు. అందువల్ల ఇప్పుడు మనం పొందాల్సింది అద్వైత అనుభవం కాదు, అద్వైతజ్ఞానం.

2. **సత్య అంశం** – జ్ఞానం సత్య అంశంతో ముడిపడి ఉంటుంది ఎప్పుడూ. జ్ఞానం అంటేనే సత్యానికి సంబంధించిన జ్ఞానం. అదే అనుభవం విషయానికి వస్తే అది సత్యంతో ముడిపడి ఉండవచ్చు, అసత్యంతో కూడా ముడిపడి ఉండవచ్చు. అనుభవం అయినంత మాత్రాన అది సత్యమై తీరాలనే నియమం ఎంతమాత్రమూ లేదు. ఉదాహరణకు మనమంతా సూర్యోదయాన్ని అనుభవిస్తున్నాము. కాని అది సత్యం కాదని మనకు తెలుసు. ఏమిటి సత్యం? సూర్యుడు భూమి చుట్టూ తిరగటం లేదు, భూమే సూర్యుని చుట్టూ తిరగటంవల్ల, సూర్యుడు ఉదయిస్తున్నట్టుగానూ, అస్తమిస్తున్నట్టుగానూ అనిపిస్తున్నదని మనకు తెలుసు. భూమి నలుచదరంగా ఉన్నట్టు కనిపిస్తుంది, కాని ఆ అనుభవం నిజం కాదు. భూమి గుండ్రంగా ఉంటుంది అనే సత్యాన్ని మనకు విజ్ఞానశాస్త్రం బోధించింది. అందువల్ల అనుభవం సత్యం విషయంలోనూ అవవచ్చు లేదా మిథ్యా విషయంలోనూ, పొరపాటు విషయంలోనూ అవవచ్చు.

అందువల్ల ముందుగా అనుభవానికీ, జ్ఞానానికీ మధ్య ఉన్న భేదాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. మనకి కావాల్సింది సత్యం గురించిన జ్ఞానం. ఇక్కడ మనం సత్యం గురించి మాట్లాడుతున్నాము. అందువల్ల ఇక్కడ జ్ఞానం పదం వాడాలి కాని అనుభవం పదం వాడకూడదు. నేను అద్వైతం గురించిన జ్ఞానం పొందితే, అది అద్వైతం గురించిన జ్ఞానం, సత్యం గురించిన జ్ఞానం. అది జ్ఞానం అవటంవల్ల, భవిష్యత్తులో ద్వైత అనుభవం కలిగినా కూడా, అది అద్వైతజ్ఞానాన్ని పారద్రోలలేదు. ఏ జ్ఞానాన్ని కూడా ఏ అనుభవమూ పారద్రోలలేదని చూశాము. అదే విధంగా, అద్వైతజ్ఞానాన్ని, ద్వైత అనుభవం పారద్రోలలేదు. అందువల్ల అద్వైతజ్ఞాని జాగ్రదావస్థలో ద్వైతాన్ని, స్వప్నావస్థలో ద్వైతాన్ని అనుభవిస్తూనే ఉంటాడు. అంతేకాదు సుషుప్తిలో అద్వైతంలా అనిపిస్తున్న అవ్యక్త ద్వైతాన్నీ అనుభవిస్తాడు. ఈ అనుభవాలు మారవు. జ్ఞానం పొందాక కూడా ఈ అనుభవాలు కొనసాగుతాయి కాని భేదం ఎక్కడంటే, ఈ ద్వైత అనుభవాలు అతని అద్వైతజ్ఞానాన్ని ఏమీ చేయలేవు. అందువల్ల అద్వైతం అనేది సత్యం.

మనకు కావాల్సింది ఈ అద్వైత జ్ఞానం. ఈ అద్వైత జ్ఞానాన్ని ఏ అనుభవం కూడా, ద్వైత అనుభవంతో సహా, పారద్రోలలేదు. ఈ విషయాన్నే ఈ శ్లోకంలో నొక్కివక్కాణిస్తున్నారు

రమణమహర్షి. ఇదే సూత్రాన్ని అహం బ్రహ్మ అస్మి మహావాక్యానికి కూడా అన్వయించాలి అంటున్నారు రమణమహర్షి. అహం బ్రహ్మ అస్మి అనేది నా గురించిన ఒక సత్యం. ఈ సత్యం నేను ద్వైతం అనుభవిస్తున్నా కూడా మారదు.

నేను బ్రహ్మను ఎప్పుడో అవను. అలా అయితే అది భవిష్యత్తులో జరిగే ఒక సంఘటన అవుతుంది. నేను బ్రహ్మ అనుభవం పొందను. అనుభవం పొందితే, అది ఒక కాలంలో వచ్చి, ఇంకొక కాలంలో పోతుంది. నేను బ్రహ్మను అని ఒక స్థితిలో పొందను. అదికూడా వచ్చిపోయే స్థితి అవుతుంది. నేను బ్రహ్మను అనేది ఒక సత్యం. అది కాలం కోరల్లో చిక్కుకున్న అనుభవం కాదు. నేను ఏ అనుభవం పొందుతున్నా కూడా, నిజానికి ద్వైతాన్ని అనుభవిస్తున్నా కూడా, నేను అద్వైత బ్రహ్మను. ఆ భావననే ఇక్కడ వివరిస్తున్నారు రమణమహర్షి. ఈ నేపథ్యంలో ఈ శ్లోకాన్ని చూద్దాము.

**న సాధువాదః** – ఈ వాదన సరియైన వాదన కాదు. ఏ వాదన?

**ద్వైతం విచారే** – తత్త్వం విచారణ చేస్తున్నప్పుడు ద్వైతం ఉంది. అంటే సాధన చేస్తున్నప్పుడు ద్వైతం ఉంది.

**పరమార్థబోధే తు అద్వైతమ్** – నేను ఇప్పుడు బంధంలో ఉన్నాను. అద్వైతజ్ఞానం పొందాక, అద్వైతం వస్తుంది. అంటే భవిష్యత్తులో ఎప్పుడో అద్వైతం వస్తుంది.

**ఇతి** – అనే భావన. ఇంతవరకూ ఇన్‌వర్టెడ్ కామాలలో పెట్టాలి. సాధన చేస్తే అద్వైతాన్ని భవిష్యత్తులో పొందుతారు అనే భావన సరియైనది కాదు. అద్వైతం పర్యాయపదం మోక్షం. మోక్షం నిత్యం; అది భవిష్యత్తులో జరిగే ఒక సంఘటన కాదు. అందువల్ల నేను ఇప్పుడు బంధంలో ఉన్నాను, భవిష్యత్తులో ఎప్పుడో ముక్తి పొందుతాను అనేది ఒక పెద్ద పొరపాటు.

జ్ఞానం పొందాక కూడా, చాలామందిలో ఈ పొరపాటు ఉంటుంది. వారు మోక్షం అంటే ఎప్పుడో భవిష్యత్తులో కలిగే సంఘటన అనుకుంటారు. వారు, 'నేను వేదాంతాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేశాను, పూర్తి జ్ఞానం పొందాను,' అంటూనే, 'స్వామీజీ, నాకు మోక్షం ఖచ్చితంగా వస్తుందని మీరు హామీ ఇవ్వగలరా?' అంటారు. దానివల్ల మనకు అర్థమయింది ఏమిటి? వారికి మోక్షం గురించి అర్థం కాలేదని మనకు అర్థమవుతుంది. వారు ఆత్మజ్ఞానాన్ని సరిగ్గా పొందలేదు. ఎందుకంటే వేదాంతం, **'నువ్వు నిత్య ముక్త శుద్ధ పురుషుడివి'** అంటుంది.

**న సాధువాదః** – అందువల్ల ఈ వాదన సరియైనది కాదు అంటున్నారు రమణమహర్షి. దీన్ని వివరించటానికి రమణమహర్షి పదవవ్యక్తి ఉదాహరణ కూడా ఇస్తున్నారు. దీన్ని

పరమానందయ్య శిష్యుల కథగా మనం చిన్నప్పుడు విన్నదే అయినా ఇక్కడ సందర్భం వచ్చింది కాబట్టి మళ్ళీ చూద్దాము.

ఒకసారి పరమానందయ్య శిష్యులు నది దాటి ఆవలి ఒడ్డుకు చేరాలి. వారిలో ఒక శిష్యుడు వారిమీద నాయకత్వం వహిస్తున్నాడు . అతను తక్కిన తొమ్మిది మందిని భద్రంగా వెనక్కి తిరిగి తీసుకువస్తానని గురువుకు హామీ ఇచ్చాడు. వారు నది దాటాలి. అందరూ దాటగలరని నమ్మకంగా తెలిశాకే, నదిలోకి దిగారు. అలాగే నది దాటి, ఆవలి తీరానికి చేరుకున్నారు.

అందరూ వచ్చారో లేదో, ఎందుకైనా మంచిది, చూద్దామనుకున్నాడు ఆ నాయకుడు. ఆరోజు నదీ ప్రవాహం కొంత ఉధృతంగా ఉంది. అందువల్ల ఎవరైనా కొట్టుకుపోయారేమోననే భయం ఏమూలో ఉంది. అందువల్ల అందరినీ ఒక వరుసలో నిలుచోమన్నాడు. వరుసగా లెఖ్ఖ పెట్టసాగాడు. 1,2,3,4,5,6,7,8,9. తొమ్మిది మందే ఉన్నారు. పదో వ్యక్తి లేడు. తనే తప్పు లెక్క పెట్టానేమోననుకుని, మళ్ళీ వారిని ఇటూ, అటూ మార్చి వేరే వరుసలో నిలబెట్టాడు. మనం కూడికలు చేసేటప్పుడు కూడా చూడండి, ఒక్కోసారి కిందనుంచి కూడితే ఒక సంఖ్య, పైనుంచి కూడితే ఇంకొక సంఖ్య వస్తుంది. మళ్ళీ ఇంకోవైపునుంచి కూడినా తొమ్మిదిమందే వస్తున్నారు. ఎన్నిసార్లు కూడినా పదో వ్యక్తి రాడే! ఇంకేముంది, ఒక శిష్యుడు నీళ్ళలో మునిగిపోయాడు, గురువు గారికి ఎలా చెప్పాలి అనే భయంతో భోరున ఏడుస్తూ, తన తలను చెట్టుకేసి బాదుకోసాగాడు.

అటుగా వెళుతున్న ఒక పెద్దమనిషి అతని బాధను చూసి, ఏమయ్యింది అని అడిగాడు. మేము పదిమందిమి వచ్చాము, నది దాటటంలో ఒక వ్యక్తి మునిగిపోయాడు, ఇప్పుడు మా గురువుకేమి చెప్పమంటారు అని వాపోయాడు ఆ ముఖ్య శిష్యుడు.

ఈ కథ వింటే ఆ శిష్యుని వెర్రితనానికి మనం నవ్వుకుంటాము కాని మనం చేస్తున్నదేమీ దీనికి భిన్నంగా లేదు అంటుంది వేదాంతం. మనం శాంతికోసం బాహ్యంగా పరుగులు తీస్తున్నాము; భద్రతకోసం బాహ్యంగా పరుగులు తీస్తున్నాము; ఆనందం కోసం బాహ్యంగా పరుగులు తీస్తున్నాము. మనమే శాంతి, భద్రత, ఆనందాలకు మారుపేరు అని తెలియక పరుగులు తీస్తున్నాము అంటుంది వేదాంతం. తానే పదవ వ్యక్తి అని తెలియక ఆ శిష్యుడు అంతటా వెతికినట్టుగా, మనమే పూర్ణపురుషులం అని తెలియక మనం అంతటా వెతుకుతున్నాము.

ఇప్పుడు ఆ శిష్యుడు ఆ వచ్చిన పెద్దమనిషిని గురువుగా భావించి, తన గోడు వెళ్ళబుచ్చుకున్నాడు. ఆ గురువు నవ్వి, బాధపడకు, 'ఆ పదవ వ్యక్తి ఇక్కడే ఉన్నాడు,'

అన్నాడు. ఆ మాటతోనే సగం భారం తీరింది ఆ శిష్యునికి. గుండెల నిండా గాలి పీల్చుకున్నాడు. ఇప్పుడతనికి పదవ వ్యక్తి ఉన్నాడని తెలిసింది. దాన్ని పరోక్షజ్ఞానం అంటారు. కాని అక్కడితో అతని సమస్య తీరలేదు. 'సరే, ఆ పదవ వ్యక్తి ఉన్నాడన్నారు కదా, ఎక్కడున్నాడో చూపించండి. నా కళ్ళారా చూస్తే కాని నేను నమ్మలేను,' అన్నాడు.

ఆ కొత్త గురువు మళ్ళీ శిష్యులనందరినీ ఒక వరుసలో నిల్చోమని, మళ్ళీ ఈ నాయకుణ్ణి లెక్కపెట్టమన్నాడు. మళ్ళీ తొమ్మిదే వస్తున్నారు. 'పదవ వ్యక్తి ఏడీ,' అన్నాడు నాయకుడు. 'తత్త్వమసి' అన్నాడు కొత్త గురువు. అంటే ఏమిటి? ఆ పదవ వ్యక్తివి నువ్వే. నువ్వు ఎవరి కోసమైతే వెతుకుతున్నావో ఆ పదవ వ్యక్తివి నువ్వే అన్నాడు.

ఇప్పుడు చెప్పండి! ఈ నాయకుడు పదవ వ్యక్తిగా జ్ఞానం పొందాక అయ్యాడా, జ్ఞానం పొందకముందే ఉన్నాడా? అతను పదవ వ్యక్తి అనేది సత్యం. అది అన్నివేళలా సత్యమే. అతను జ్ఞానం పొందాక, ఈ పదవ వ్యక్తిని కొత్తగా పొందలేదు, అతను పదవ వ్యక్తిగా కొత్తగా మారనూ లేదు. మరి ఏం జరిగింది? పదవ వ్యక్తి తప్పిపోయాడు అనే అపోహను పారద్రోలింది ఈ జ్ఞానం. అంతే! అంటే జ్ఞానం పొందటం అంటే కొత్తగా జ్ఞానం పొందటం కాదు, బుద్ధిలో ఉన్న అజ్ఞానాన్ని పారద్రోలటం మాత్రమే.

ఈ జ్ఞానం పొందటంవల్ల అతని శరీరంలో బరువేం తగ్గలేదు; చూసే వస్తువులు మారలేదు; పరిసరాలలో మార్పు రాలేదు. ఒక్కముక్కలో చెప్పాలంటే అతనికి అనుభవంలో మార్పు లేదు. కొత్త సంఘటన ఏమీ జరగలేదు. కొత్త స్థితీ పొందలేదు. మరి ఏం జరిగింది? బుద్ధిలో చిన్న మార్పు జరిగింది. పదవ వ్యక్తి తప్పిపోయాడు అని బుద్ధిలో అపోహ పడ్డాడు. పదవ వ్యక్తి తప్పిపోలేదు, తను అపోహ పడ్డాడు. ఆ వ్యక్తి తనే అని బుద్ధిలో మార్పు జరిగింది. దీన్ని వృత్తిలో మార్పు అంటారు. పారడైమ్ షిఫ్ట్ అంటారు.

ఈ వృత్తిలో మార్పు జరగటం బుద్ధికి కలిగిన చిన్న జ్ఞానం. కానీ ఈ జ్ఞానం బుద్ధికి చెందిన జ్ఞానం. కాని ఈ జ్ఞానం ప్రభావం భావోద్రేకాలమీద చెరగని ముద్ర వేస్తుంది. ఎందువల్లనంటే ఇంతవరకూ పడిన ఆందోళన, బెంగ అంతా దూదిపింజంలా తేలిపోయింది.

ఈ సూత్రాన్ని మన జీవితానికి అన్వయిస్తే, మనం శాంతి, భద్రత, ఆనందాలను బాహ్యవస్తువుల్లో వెతుక్కుంటే, ఆ నాయకుడు పదవ వ్యక్తి గురించి వెతికినట్టే ఉంటుంది అంటుంది శాస్త్రం. అక్కడ ఆ నాయకునికి కొత్త గురువు వచ్చి, పదవ వ్యక్తి ఉన్నాడని చెప్పినట్టే శాస్త్రం కూడా శాంతి, భద్రత, ఆనందాలను ఇచ్చేవారు ఒకరున్నారు. ఆయన పేరు బ్రహ్మ అంటుంది. పదవ వ్యక్తి ఉన్నాడనగానే, ఎక్కడున్నాడో చూపించండి అని ఆ నాయకుడు వెతికినట్టే, మనం కూడా బ్రహ్మ గురించి చెప్పగానే బ్రహ్మ మనకు బాహ్యంగా దొరికే

అబ్జెక్టుగా భావించి, బ్రహ్మ సాక్షాత్కారం అవాలనుకుంటాము లేదా మనం బ్రహ్మ అవటానికి మనను మనం మార్చుకోవాలి అనుకుంటాము.

కాని శాస్త్రం బ్రహ్మ అంటే ఇవేవీ కాదు అంటుంది. బ్రహ్మ అనుభవంలోకి వచ్చే ఆబ్జెక్టు కాదు, బ్రహ్మ అనుభవంలోకి వచ్చే సంఘటన కాదు, బ్రహ్మగా కొత్తగా మారనవసరం లేదు. ఎందుకంటే ఆ బ్రహ్మ మీరే అంటుంది శాస్త్రం.

Ever the experiencer never the experienced.

**అనుభవించే నువ్వే బ్రహ్మవు ఎప్పటికీ, అనుభవించబడే వస్తువు కాదు ఎన్నటికీ.**

నువ్వు అంతకుముందూ బ్రహ్మవే, ఇప్పుడూ బ్రహ్మవే, ఇకముందూ బ్రహ్మవే అంటుంది శాస్త్రం. ఈ జ్ఞానం బుద్ధిలో పొందాలి. ఎప్పుడైతే ఈ జ్ఞానంలో నెలకొని ఉంటారో అప్పుడే ఏ అనుభవం కూడా ఈ జ్ఞానాన్ని పారద్రోలలేదు. ప్రారబ్ధ కర్మ ఏ అనుభవాలకు గురి చేసినా కూడా, మీరు బ్రహ్మే! మీరు ఆనందంగా ఉన్నా, దుఃఖం అనుభవిస్తున్నా, ఆరోగ్యం బాగున్నా, బాగాలేకపోయినా, మనస్సులో అనేక భావోద్రేకాలు చెలరేగుతున్నా మీరు బ్రహ్మే! ఈ అనుభవాలేమీ మీరు బ్రహ్మ అనే సత్యాన్ని మార్చలేవు. మీరు దుఃఖంలో ఉన్నా, భూమి గుండ్రంగా ఉంది అనే సత్యాన్ని ఎలా చెప్పగలరో, అలా మీరు దుఃఖంలో ఉన్నా మీరు బ్రహ్మే అనే సత్యాన్ని మరువలేరు.

**దశమత్వమేకమ్** – అందువల్లనే రమణమహర్షి పదవవ్యక్తి ఉన్నాడు, అది సత్యం అంటున్నారు. ఏకం అంటే అన్ని కాలాల్లోనూ అతను ఉన్నాడు అన్నది సత్యం.

**దశమే వినష్టే** – పదవ వ్యక్తి కనిపించకుండా పోయాడు అనుకున్నప్పుడూ అతను ఉన్నాడు;

**లబ్ధే** – దొరికాక కూడా ఉన్నాడు. నిజానికి 'దొరికాక' పదాన్ని ఇన్‌వర్టెడ్ కామాలలో పెట్టాలి. అతను నిజంగా పోతే కదా దొరకటానికి! పదవ వ్యక్తి పోలేదన్న జ్ఞానం పొందటమే పదవ వ్యక్తి దొరకటం అర్థం. అందువల్ల తప్పిపోయాడనుకున్న వ్యక్తీ, దొరికాడనుకున్న వ్యక్తీ ఒకరే! వెతుకుతున్న వ్యక్తే వెతకబడుతున్న వ్యక్తి. అదే విధంగా –

**గవేషణాత్ ప్రాక్** – ఆత్మ విచారణ చేయకముందు,

**పశ్చాత్ చ (లబ్ధే)** – విచారణ చేశాక కూడా, మీరు వెతుకుతున్న బ్రహ్మ మీరే! అందువల్ల అద్వైతం అంటే భవిష్యత్తులో జరిగే సంఘటన కాదు; అది సత్యం. ఇక్కడ కావాల్సింది జ్ఞానమే కాని అనుభవం కాదు.

**శ్లోకం 40**

**కరోమి కర్మేతి నరో విజానన్**
**బాధ్యో భవేత్కర్మఫలం చ భోక్తుమ్ ।**
**విచారధూతా హృది కర్తృతా చేత్**
**కర్మత్రయం నశ్యతి సైవ ముక్తిః ॥**

**ప్రతిపదార్థం:** నరః = మనిషి; కర్మ = కర్మను; కరోమి = చేస్తున్నాను; ఇతి = అని; విజానన్ = తెలుసుకుంటున్నవాడై; కర్మఫలం = కర్మఫలాన్ని; భోక్తుం చ = అనుభవించటానికి; బాధ్యః = బాధ్యుడు; భవేత్ = అవుతాడు; హృది = హృదయంలో, ఆత్మస్వరూపము భాసించే స్థానంలో; కర్తృతా = కర్తృత్వం; విచారధూతా చేత్ = సత్యమైన ఆత్మస్వరూపంయొక్క విచారణచేత దూరం చేయబడితే; కర్మత్రయం = ఆగామి, సంచిత, ప్రారబ్ధం అనే కర్మల త్రయము; నశ్యతి = నశిస్తుంది; సా+ఏవ = అదే; ముక్తిః = ముక్తి.

**తాత్పర్యం:** మనిషి తాను ఈశ్వరునికన్నా, జగత్తుకన్నా భిన్నంగా స్వతంత్రమైనవాడిననే అహంకారంతో కర్మలను చేస్తూ, కర్మఫలాలను అనుభవిస్తాడు. ఆత్మస్వరూపం భాసించే స్థానంలో సత్యమైన ఆత్మస్వరూపంయొక్క విచారణచేత కర్తృత్వం దూరం చేయబడితే ఆగామి, సంచిత, ప్రారబ్ధం అనే మూడు కర్మలు నశిస్తాయి; ఆ కర్మత్రయనాశనమే ముక్తి.

**వివరణ:** ఇంచుమించు అదే భావన. అంతకుముందు జగత్తు పరంగా ద్వైతభావన గురించి చెబితే, ఇప్పుడు జీవి పరంగా చెబుతున్నారు. రమణమహర్షి మోక్షం అంటే ఎప్పుడో భవిష్యత్తులో వచ్చే సంఘటన కాదు అంటున్నారు. మోక్షం అంటే బుద్ధిలో కలిగే మార్పు. ఒక సాధకునికి తన స్వస్వరూపం గురించి బుద్ధిలో కలిగే మార్పును అద్భుతంగా వివరిస్తున్నారు ఇక్కడ.

ఒక వ్యక్తిగా నేను అహం అంటే నాలో రెండు అంశాలు ఉన్నాయి. అవి చైతన్య అంశ, అహంకార అంశ. చైతన్య అంశను ఆత్మ అంటారు. అహంకారం అంటే కార్యకరణ సంఘాతం+చిదాభాస. చిదాభాసను ప్రతిబింబ చైతన్యం అనీ, చిత్ ఆభాస అనీ అంటారు. నేను అంటే ఆత్మ+అహంకారం. ఈ రెండింటి మేలుకలయికనే 'నేను' అంటారు. 'నేను' అని అంటే, ఆ నేను అనేదెవరు? శుద్ధ ఆత్మ నేను అనలేదు, శుద్ధ అహంకారం నేను అనలేదు. అసలు నిజానికి శుద్ధ అహంకారం పదాన్నే వాడలేము. ఎందుకంటే అసలు అహంకారం ఉనికి, ఆత్మ ఉంటేనే సాధ్యమవుతుంది. అందువల్ల శుద్ధ అహంకారానికి విడిగా ఉనికి లేదు. శుద్ధ ఆత్మకు కరణాలు లేవు కాబట్టి, అది వ్యవహారాలు నడుపలేదు. అందువల్ల నేను అంటేనే ఆత్మ+అహంకారం కలిసి అంటున్నాయి. ఇవి రెండూ విడదీయరాని జంట. ఇందులో ఆత్మ అంశ సత్యం, అహంకారం అంశ మిథ్య.

కర్తృత్వం అంటే నేను చేస్తున్నాను అనే గుణం మిథ్యా అహంకారానికి చెందుతుంది. కర్తృత్వం సత్య ఆత్మకు చెందదు. ఈ ఆత్మ అహంకారాల మేలుకలయికే అన్ని వ్యవహారాలూ చేస్తున్నది; ఈ మేలు కలయికే అజ్ఞానంలో ఉంది; ఈ మేలు కలయికే జ్ఞానం పొందగలదు. అందువల్ల ఏం జరిగినా ఆత్మ, అహంకారాల జంటకే జరుగుతుంది.

కాని, వచ్చిన చిక్కేమిటంటే నేను ఈ ఆత్మ అహంకారాల మేలు కలయికను అని శాస్త్రానికి రాకముందు తెలియదు. శాస్త్రానికి రాకముందు నాకు అసలు ఆత్మ అనేది ఒకటుందనే తెలియదు. నేనెవరు అంటే నేను శరీరాన్ని అనుకుంటాను. నాకొక ఉన్నతమైన ఆత్మ ఉందని తెలియక నేను అహంకారంతో మమేకం చెందుతాను. కాని శాస్త్రం నీకు నీ ఉన్నతమైన ఆత్మస్వరూపం గురించి తెలిసినా, తెలియకపోయినా, నువ్వు ఆత్మవే అంటుంది. అది తెలియక నేను మిథ్యా అహంకారాన్నే సత్యంగా భావిస్తాను.

సత్యం తెలియకపోతే మిథ్య సత్యం అయి కూర్చుంటుంది. ఒక స్వాప్నికునికి తన స్వప్నం ఒక స్వప్నం అని తను స్వప్నంలో ఉన్నంతవరకూ తెలియదు. ఆ మాటకొస్తే అతనికొక జాగ్రద్ ప్రపంచం ఉందనే తెలియదు. అందువల్ల స్వప్నప్రపంచమే అతనికి సత్యం. అదే విధంగా ఆత్మ గురించిన సత్యం తెలియకపోయేసరికి అహంకారం సత్యం అవుతుంది. వేదాంతంలో ప్రతిపదాన్నీ జాగ్రత్తగా వాడాలి. నిజంగా సత్యం అవదు, దాన్ని సత్యంగా భావిస్తాను. అంతే. అందువల్ల 'అవుతుంది' పదాన్ని ఇన్‌వర్టెడ్ కామాలలో పెట్టాలి.

అందువల్ల అజ్ఞానస్థితిలో నేను అహంకారంతో మమేకం చెందుతాను. ఆ అహంకారమే సత్యం అనుకుంటాను. అహంకారంతో కర్మలు చేయటంవల్ల కర్తృత్వం కూడా సత్యం అనుకుంటాను. ఎప్పుడైతే కర్తృత్వభావన సత్యమవుతుందో, అప్పుడే నేను చేసే కర్మలు సత్యమవుతాయి. కర్మలు సత్యమయితే, కర్మఫలాలు సత్యమవుతాయి; సంచిత కర్మలు, ఆగామి కర్మలు సత్యం అవుతాయి; ప్రారబ్ధకర్మ మహాసత్యం అయి కూర్చుంటుంది; జ్యోతిష్యంలో వచ్చే శనిదశ, రాహుదశలు నిజమయి కూర్చుంటాయి. ఇవన్నీ చాలా సత్యమవుతాయి. ఎందుకంటే అహంకారం సత్యం అనుకుంటున్నాను. మూడు కర్మలూ వాటి ఫలాలూ అనుభవించక తప్పదు. భోక్తగా నేను సుఖదుఃఖాలలో మునిగితేలుతాను. అన్నీ వెరసి సంసారం అవుతుంది. ఈ సంసారం నిజమనుకుని, ఈ సంసారసాగరంలో మునిగి తేలుతాను. ఇదంతా ఎందుకు జరిగింది? నేను ఆత్మను అనే సత్యం తెలియక. ఒక్క విషయంలో అజ్ఞానం ఎలా అనేక పొరపాట్లకు దారితీసిందో చూశారా?

అజ్ఞానం → అహంకారం → కర్తృత్వం → కర్మలు → కర్మఫలాలు (సంచిత, ఆగామి, ప్రారబ్ధ కర్మఫలాలు) → సుఖదుఃఖాలు → భోక్త → సంసారం.

అజ్ఞానంవల్ల కలిగిన మొదటి దశనూ ఆఖరి దశను కలిపి చూస్తే అహంకారం=సంసారం. అహంకారం సత్యం అని మీరు భావించినన్నాళ్ళు ఈ సంసారాన్ని తప్పించుకోలేరు. ఎందుకంటే ఆగామికర్మలను రాకుండా చూడగలరు, కొన్ని ప్రారబ్ధకర్మలకు ప్రాయశ్చిత్త కర్మలు చేయగలరు. ఒకవేళ చేయలేకపోయినా, ప్రారబ్ధకర్మ ముగియగానే ఈ శరీరం రాలిపోతుంది. కాని సంచితకర్మలు, జన్మజన్మలుగా మోసుకొస్తున్న మీ పుణ్యపాపాల మూటను నాశనం చేయలేదు. అందువల్ల అహంకారం సత్యం అనే భావనలో ఉన్నంతవరకూ, మోక్షాన్ని ఎన్నడూ పొందలేరు. దీనికి ఒకటే మార్గం ఉంది. ఏమిటది?

అహంకారాన్ని మిథ్యగా మార్చాలి. స్వప్నప్రపంచం స్వప్నంలో ఉన్నంతవరకూ నిజంగా అనిపిస్తుందని చూశాము. దాన్ని మిథ్యగా కొట్టివేయాలంటే ఏం చేయాలి? దానికన్నా ఉన్నతస్థాయికి లేవాలి. అంటే నిద్రనుంచి జాగ్రదావస్థకు లేవాలి. అలాగే అహంకారాన్ని మిథ్యగా కొట్టివేయాలంటే దానికన్నా ఉన్నతస్థాయికి లేవాలి. అంటే ఆత్మను అర్థం చేసుకోవాలి. ఆత్మ అన్నా బింబ చైతన్యం అన్నా ఒకటే. ఈ బింబచైతన్యంవల్లనే జడమైన మనశ్శరీరాలు చైతన్యవంతమయ్యాయి అని అర్థం చేసుకోవాలి.

ఆ చైతన్యమే నేను అనగలగాలి. అదే ఆత్మజ్ఞానం అంటే. నా స్వస్వరూపం ఆత్మ అని అర్థం చేసుకుంటేనే, ఆ ఉన్నతస్థాయికి ఎదిగితేనే అహంకారం వీగిపోతుంది. అహంకారం మిథ్యగా తేలిపోతుంది. అహంకారాన్ని, ఆత్మజ్ఞానం ద్వారా మిథ్యగా కొట్టివేయగలగటమే మోక్షం. మళ్ళీ అంతకుముందు అద్వైతం విషయంలో చూసినట్టే ఆత్మజ్ఞానం అంటే అది ఒక స్థితి కాదు, ఒక సంఘటన కాదు, ఒక అనుభవం అసలే కాదు. అది జ్ఞానం మాత్రమే! ఈ నేపథ్యంతో ఈ శ్లోకాన్ని చూద్దాము.

**నరో విజానన్** – నరః విజానన్ – విజానన అంటే అనుకుంటాడు. ఇక్కడ పొరపాటుగా అనుకుంటాడు. నరః అంటే మనిషి. ఏ పొరపాటు చేస్తాడు? నేను అహంకారాన్ని అనుకుంటాడు. అహంకారం అంటే కార్యకరణసంఘాతం+చిదాభాస అని చూశాము. నేను అహంకారం అనుకుని ఊరుకోడు.

**కర్మ కరోమి ఇతి** – నేను కర్మ చేస్తున్నాను అనుకుంటాడు. ఎప్పుడైతే తను అహంకారం అనుకుంటాడో, అప్పుడే కర్తృత్వభావన కలుగుతుంది. అప్పుడే కర్మలు చేస్తాడు. అవి కూడా ఎక్కువగా ప్రాయశ్చిత కర్మలు చేస్తాడు. ప్రయాణం ముగియలేదు. పరుగులు తీస్తూనే ఉంటాడు.

**కర్మఫలం చ భోక్తుమ్** – కర్మఫలం అనుభవించటానికి,

**బాధ్యో భవేత్** – బాధ్యుడు అవుతాడు. కర్త అనుకుని కర్మలు చేస్తే, వాటికి కర్మఫలాలు రాకతప్పవు. కర్మఫలాలను భోక్తగా అనుభవించకా తప్పదు.

వేదాంతం ఏం నేర్పిస్తుంది? అదొక పెద్ద అపోహ. చాలామంది వేదాంతం ఒక సిద్ధాంతం అనీ, సాధకులను అనేక కర్మలు చేయటానికి శిక్షణ ఇస్తుందనీ పొరపాటు పడతారు. ఇంతవరకూ థియరీ నేర్చుకున్నాను, ఇప్పుడు దాన్ని ఆచరణలో పెట్టటానికి కర్మలు చేయాలి అనుకుంటాడు. అది పెద్ద పొరపాటు. రమణమహర్షి వేదాంతం కర్మలను నేర్పించదనీ, అసలు మీరు కర్తే కాదని నేర్పిస్తుందనీ అంటారు. మీరు కర్త కానప్పుడు మీరు కర్మలు చేయనవసరం లేదు. నిజానికి కర్మవల్ల మోక్షం రాదు కూడా.

**విచారధూతా** – విచారణ అంటే ఆత్మజ్ఞానం పొందటం. అంటే గురుశాస్త్రవిచారణ చేయటం. శాస్త్రాన్ని గురువు ద్వారా అధ్యయనం చేయాలి. ధూతా అంటే మిథ్యగా నిరూపించబడుతుంది. ఆత్మ విచారణ చేస్తే అహంకారం అక్షరాలా మాయమవదు. శరీరం కొనసాగుతుంది, మనస్సు కొనసాగుతుంది, చిదాభాస కూడా కొనసాగుతుంది. అందువల్ల ఈ మనశ్శరీరాలు+ చిదాభాస అయిన అహంకారం ఉంటుంది కాని, దాన్ని మిథ్యగా అర్థం చేసుకుంటాము.

స్వప్నంనుంచి లేస్తే స్వప్నశరీరం మాయమయిపోతుంది. అప్పుడు అది మిథ్య అని తేలికగా అర్థమవుతుంది. కాని జాగ్రదావస్థకి వచ్చేసరికి, జాగ్రదావస్థలో ఆత్మ+అహంకారాల మేలుకలయికనైన నేను ఇన్నాళ్ళూ అహంకారంతో మమేకం చెందాను. అది పొరపాటు. నేను ఆత్మను అని అర్థం చేసుకుని నా ఉన్నతస్థాయికి లేచినా కూడా అహంకారం మాయమవదు. శరీరం కొనసాగుతుంది, మనస్సు కొనసాగుతుంది. కాకపోతే ఇప్పుడు నేను వాటితో మమేకం చెందను.

భూమి గుండ్రంగా ఉందని లౌకికవిద్యలో నేర్చుకున్నా కూడా, అనుభవంలో భూమి నలుచదరంగానే ఉంటుంది. అనుభవంలో ఏ మార్పూ ఉండదు. అనుభవంలో సత్య అనుభవమూ, మిథ్యా అనుభవమూ – రెండూ ఉంటాయని చూశాము. ఈ సూత్రాన్ని ఆత్మజ్ఞానానికి కూడా అన్వయిస్తే నేను ఆత్మను అని అర్థం చేసుకున్నా కూడా అహంకారం అనుభవంలోకి వస్తూనే ఉంటుంది. కాకపోతే ఇప్పుడా అనుభవాన్ని మిథ్యా అనుభవంగా కొట్టివేస్తాను. అందువల్ల శరీర అనుభవం, మనస్సు అనుభవం కొనసాగుతూనే ఉంటుంది. మరి మార్పు ఎక్కడ వస్తుంది అంటే నా దృక్పథంలో మార్పు వస్తుంది.

ధూత అంటే అక్షరాలా తీసుకుంటే పారద్రోలటం. కాని ఇక్కడ సందర్భాన్నిబట్టి మిథ్యగా కొట్టివేయబడటంగా తీసుకోవాలి. చేత్ అంటే అలా కొట్టివేయబడినప్పుడు మిథ్యగా కొట్టి వేయబడుతుంది.

**కర్తృతా** – కర్తృత్వం మిథ్యగా కొట్టివేయబడుతుంది. ఆత్మవిచారణవల్ల నేను ఆత్మను అని అర్థమయితే, నేను కర్తను అనే భావన కొట్టివేయబడుతుంది. అప్పుడేమవుతుంది?

**కర్మత్రయం నశ్యతి** – మూడు కర్మలూ నశించిపోతాయి. మరి ప్రారబ్ధకర్మ మాటేమిటి? ప్రారబ్ధకర్మ కొనసాగుతుంది. అంటే, ప్రారబ్ధకర్మ అనుభవం అవుతూనే ఉంటుంది. కాని జ్ఞాని దాన్ని సత్యంగా తీసుకోడు. అతనికి ప్రారబ్ధ అనుభవం మిథ్యగా అనిపిస్తుంది. ఏదైతే మిథ్యో, అది ఉన్నా లేనట్టే అవుతుంది. అందువల్ల జ్ఞానికి ప్రారబ్ధకర్మ లేనట్టే అనిపిస్తుంది.

కాని ఒక విషయం మర్చిపోకూడదు. శరీరపరంగా ప్రారబ్ధం సత్యమే, మనస్సు పరంగా కూడా సత్యమే. ఆత్మస్థాయికి ఎదిగితేనే ప్రారబ్ధం మిథ్య అవుతుంది. స్వప్నంలో ఉండగా స్వప్నశరీరానికి అది సత్యమే. స్వప్నంలో ఉండగా స్వప్నశరీరానికి ఆకలి వేస్తుంది. స్వప్నంలోనే ఏదైనా తినాలి. స్వప్నం ఎప్పుడు మిథ్య అవుతుంది? జాగ్రదావస్థకు లేస్తేనే మిథ్య అవుతుంది.

అదేవిధంగా ప్రారబ్ధం మనశ్శరీరాలకు మహాసత్యం, ఆత్మ స్థాయికి ఎదిగితేనే ప్రారబ్ధం మిథ్య అవుతుంది. అందువల్ల ఆత్మదృష్ట్యా కర్మలు అంటే సంచిత, ప్రారబ్ధ, ఆగామి కర్మలు మూడూ, నశ్యతి అంటే మిథ్యగా తేలిపోతాయి.

**స ఏవ ముక్తిః** – ఇలా కర్మఫలత్రయ నాశనమే ముక్తి అంటున్నారు రమణమహర్షి. ముందు శ్లోకంలో ద్వైతం మిథ్యగా తేలిపోవటం ముక్తి అన్నారు. ఇక్కడ కర్తృత్వం మిథ్యగా తేలిపోవటం ముక్తి అంటున్నారు.

అన్ని దర్శనాలు కూడా ఏకగ్రీవంగా ఒకటే అంతిమలక్ష్యం గురించి హోరెత్తిస్తాయి. అదే మోక్షం! అందరూ మోక్షాన్ని సర్వజనీన లక్ష్యంగా అభివర్ణిస్తున్నారు అంటేనే, మానవజాతి అంతా బంధంలో కూరుకుపోయిందని అందరూ ఏకగ్రీవంగా ఒప్పుకున్నారని చెప్పకనే చెప్పినట్టవుతున్నది. ఈ బంధాన్ని శాస్త్రం సంసారం అంటుంది. మనిషి సమస్యలన్నింటికీ ఈ సంసారమే కారణం. తను పరిమితి ఉన్న జీవినని వాపోతాడు మనిషి. తను ఉన్న స్థాయి లేదా స్థితి బాగాలేదని, దానికన్నా ఉన్నతంగా ఎదగాలని కృషి చేస్తాడు.

ఈ సమస్యని ఎలా వర్ణించినా, ఏ నిర్వచనం ఇచ్చినా, ఈ ప్రాథమిక సమస్యను సంసారం అంటారు. అన్ని దర్శనాలూ సంసారం ఉందని అంటాయి కాబట్టే, అందరూ ఈ సంసారంనుంచి మోక్షం పొందే మార్గాన్ని అన్వేషిస్తారు. కాకపోతే మార్గాలు వేరేగా ఉంటాయి. వీటన్నింటికి భిన్నంగా, ప్రత్యేకంగా ఉంటుంది వేదాంతం చూపే మార్గం. వేదాంతం, మోక్షం ఎన్నడూ పొందలేమనీ, నిజానికి మోక్షం అవసరమే లేదనీ అంటుంది. మోక్షం పొందాలని అందరూ కోరుకుంటుంటే మోక్షం పొందలేరనీ, అసలు అవసరమే లేదనీ ఎలా అనగలదు వేదాంతం? ఎందుకంటే అసలు సంసారం ఉంటే కదా, దానినుంచి

మోక్షం పొందేది; లేనేలేని సంసారాన్ని ఉందని ఊహించుకుని దానినుంచి బయటపడాలని ప్రయత్నిస్తున్నారు. నిజానికి సంసారాన్ని లోతుగా విశ్లేషిస్తే, ఉందనుకుని బాధపడుతున్న సంసారం అసలు లేనేలేదని తెలిపోతుంది.

ఈ సంసారమనే సమస్య కోరి తెచ్చుకున్నది తప్పితే అది నిజంగా లేదు అంటుంది వేదాంతం. దాన్ని భ్రమగా కొట్టివేస్తుంది. సంసారం ఉంటే కదా, దాని విముక్తికోసం ప్రయత్నం చేసేది. అందువల్ల మోక్షసాధన అంటూ ఒక సాధనను నిర్దేశించలేదు శాస్త్రం. శాస్త్రప్రకారం అది సాధ్యవస్తువు కాదు, సిద్ధవస్తువు. అంటే మనం ముందే ముక్తపురుషులం అంటుంది.

కాని మనుష్యులందరూ ఏకకంఠంతో కోరుతున్నది మోక్షాన్ని; దాన్ని పొందటానికి అనువైన మార్గాన్ని. ఏ దర్శనం మోక్షసాధనాన్ని ఇస్తుందా అని ఉన్న దర్శనాల చుట్టూ మనుష్యులు తిరుగుతూ ఉంటే, నీకసలు సంసారమే లేదు; అందువల్ల మోక్షం అవసరం లేదు పొమ్మంటే వేదాంతం జోలికి ఎవరూ రారు. మోక్షం పొందాలనే కోరిక మనుష్యుల మెదళ్ళను పురుగులా తినేస్తుంటే, వేదాంతం, మోక్షం బదులు ఏ మార్గం చూపినా కూడా మనుష్యులు స్వీకరించరు. అందువల్ల మనుష్యులను తన వైపుకి ఆకర్షించుకోవాలంటే, వేదాంతం ప్రయత్నపూర్వకంగా ఒక మెట్టు దిగివచ్చి, నా దగ్గరకి రండి, నేను మీకు మోక్షసాధనను చూపిస్తానని ప్రకటనలు ఇచ్చుకోవాలి.

అలా 'ప్రకటనల ద్వారా' మనుష్యుల హృదయాలను దోచుకుని, నెమ్మదిగా వారిని తనవైపు తిప్పుకున్నాక, అప్పుడు వారిని ఒక ప్రాథమిక ప్రశ్న వేయాలి. మోక్షం కావాలనుకుంటున్నారు సరే, కాని దేనినుంచి కావాలి అంటుంది. సహజంగానే సంసారమనే బంధంనుంచి విముక్తి పొందాలి అంటారు వారు. వేదాంతం అప్పుడు, మీ మోక్షం అనే లక్ష్యాన్ని కాసేపు పక్కన పెడదాము; ముందు మీరనే బంధం గురించి విశ్లేషిద్దాము అంటుంది. బంధం అంటే ఏమిటి? బంధం ఎక్కడ ఏర్పడుతుంది? ఎవరికి ఉంది ఈ బంధం? వీటికి జవాబులు చెప్పండి అంటుంది.

ఎవరికి బంధం ఉండటమేమిటి, అర్థంలేని ప్రశ్న! నాకే ఉంది బంధం అంటారు మనుషులు. పైగా అంత స్పష్టంగా నేను బంధంలో కూరుకుపోయానని తెలుస్తుంటే, ఎవరికి అని ప్రత్యేకించి అడుగుతారేమిటి అంటారు. సరే, నీకే బంధం ఉంది అంటున్నావు కదా, ఆ నువ్వెవరు అంటుంది వేదాంతం. నేను ఎవరో సరిగ్గా తెలిస్తే బంధమే లేదు. నేను అంటే శరీరం కాదు, మనస్సు కాదు, వీటిని సాక్షిగా చూసే చైతన్యాన్ని. చైతన్యానికి బంధం లేదు. చైతన్యం అసంగం. అసంగ చైతన్యానికి మోక్షం అవసరమా అంటుంది వేదాంతం!

నువ్వు ముందే ముక్తపురుషుడివి, నువ్వు మోక్షం పొందనవసరం లేదు అని తెలుసుకోవటమే మోక్షం పొందటం అంటే అంటుంది శాస్త్రం.

**న ధర్మో న చార్థో న కామో న మోక్షః**
**చిదానందరూపః శివోఽహం శివోఽహమ్ ॥**

నువ్వు చిదానంద స్వరూపానివి, మోక్షం పొందనవసరం లేదని నేర్పిస్తుంది. ఈ విషయం అర్థం అవటానికి తనకు ఒకసారి అయిన తమాషా అనుభవాన్ని వర్ణిస్తున్నారు స్వామీజీ. చిన్నచిన్న వివరాలు స్పష్టంగా గుర్తులేకపోయినా, సంఘటన మాత్రం హత్తుకుపోయింది అంటున్నారు.

ఒకసారి స్వామీజీ కొందరితో కలిసి ఎయిర్‌పోర్ట్‌కి వెళ్ళి దయానందస్వామీజీని స్వాగతించటానికి వెళ్ళాలనుకున్నారు. వారి శిష్యబృందంలో ఒకరిని కారు తీసుకుని రమ్మన్నారు. వారు ఎయిర్‌పోర్ట్‌కు వెళ్ళాల్సిన సమయం రానే వచ్చింది కాని, వారిని తీసుకు వెళ్ళాల్సిన శిష్యుడూ రాలేదు, కారూ రాలేదు. ఎక్కడైనా దోవలో ట్రాఫిక్‌జామ్‌లో ఇరుక్కు పోయాడేమోనని కాసేపు ఆశగా వేచిచూశారు. అయినా రావల్సిన వ్యక్తి మాత్రం రాలేదు.

ఇంక నెమ్మదిగా అందరిలోనూ ఖంగారు, ఆందోళన చోటు చేసుకుంది. ఎవరికి వారే ఈ సమస్యకు పరిష్కారమార్గాన్ని అన్వేషించసాగారు. సమస్య ఏమిటి? వారు ఎయిర్‌పోర్ట్‌కు వెళ్ళటానికి తక్షణం వారికొక కారు కావాలి. అదీ ఆఘమేఘాలమీద రావాలి. రకరకాల మార్గాలు చూస్తున్నారు. ఒకరేమో రావాల్సిన వ్యక్తికే ఫోను చేస్తున్నారు, కాని అతను దొరకటం లేదు. ఇంకొకరేమో చుట్టుపక్కల ఎక్కడన్నా టాక్సీ ఉందేమో చూసొస్తానన్నారు. ఇంకొక వ్యక్తి తనకు తెలిసినవారిలో కారెవరికి ఉందో గుర్తు తెచ్చుకుని, వారికి ఫోన్ చేస్తానన్నాడు. అలా ఒకటే సమస్యకు భిన్నమార్గాలు శోధిస్తున్నారు. సమస్య ఏమిటి? కారు సంపాదించటం. పరిష్కారం ఇంకా దొరకలేదు.

ఇంతలోపు ఒక తెలివైన వ్యక్తి నిశ్శబ్దంగా లోపలికి వెళ్ళి, అక్కడ ఫోను ఉంటే, ఆ ఫోనునుంచి ఎయిర్‌పోర్ట్‌కి ఫోను చేశాడు. పూజ్యస్వామీజీ రావాల్సిన విమానం ఎన్నింటికి వస్తున్నది, సరియైన సమయానికే వస్తున్నదా అని అడిగాడు. ఆశ్చర్యం! విమానం నిర్ణీత సమయానికి రావటం లేదని, అనివార్యకారణాలవల్ల రెండు మూడు గంటలు ఆలస్యమవుతుందనీ చెప్పారు వారు. దాని అర్థం – వారికి ఆఘమేఘాలమీద ఇంకొక కారు అవసరం లేదు. ఇంకా మాట్లాడితే ఇప్పుడు వారికి సమస్యే లేదు. అది దూదిపింజలా తేలిపోయింది.

ఆ తెలివైన వ్యక్తి చేసిన విచారణ గురించి తెలియని తక్కినవారు మాత్రం ఇంకా సమస్య ఉందనుకుని, వారి బుర్ర బద్దలు కొట్టుకుంటున్నారు. రెండు మూడు గంటల వ్యవధి ఉందంటే, ఏ మాత్రం ఖంగారు పడనవసరం లేదు. ఇప్పుడా విషయాన్ని తక్కినవారికి తెలియచేయాలి ఈ వ్యక్తి. కాని వచ్చిన చిక్కేమిటంటే, వారు సమస్యలో ఎంతగా కూరుకుపోయారంటే, వారు అతన్ని వారి దరిదాపులకు కూడా రానివ్వటం లేదు. అతను నోరు తెరిచేలోపే, ఇప్పుడేం మాట్లాడవద్దు. అసలే మా మెదడు పనిచేయటం లేదు అంటున్నారు. అతను వినకుండా దగ్గరికి వెళుతుంటే, ఆగ్రహంతో ఒక తోపు తోయటానికి కూడా వెనుకాడటం లేదు.

ఈ సమస్యను అతను ఎలా పరిష్కరించగలడు? దానికి ఒకటే మార్గం ఉంది. కొంచెం దూరంగా ఉండే, గట్టిగా అరచి చెప్పాలి, 'నేను సమస్యకు పరిష్కారమార్గాన్ని పట్టుకున్నాను.' అప్పుడు కూడా వారు సరిగ్గా అర్థం చేసుకోరు. ఇంకా ఆందోళన నిండిన గొంతుతోనే, 'ఓ, అయితే, నీకొక కారు దొరికిందా?' అంటారు. మనకిప్పుడు కారు అవసరం లేదు అనేది వారి మనస్సుల్లోకి ఎక్కించాలంటే, ముందు వారిని శాంతపరచాలి. వారు, వారి ఆందోళన నుంచి బయటకు వచ్చాకనే అతని పరిష్కారాన్ని సరిగ్గా వినే స్థితికి వస్తారు.

మన సంసారం సమస్య కూడా దీనికేమీ తీసిపోలేదని వివరిస్తున్నారు స్వామీజీ. స్వామీజీ చెప్పిన దృష్టాంతంలో ఎలాగైతే సమస్య లేదని తెలివైన వ్యక్తి కనుగొన్నాడో, అలాగే ఇక్కడ కూడా జ్ఞాని అసలు సంసారమనే సమస్య లేదని కనుగొంటాడు. కాని అక్కడ అతను ముందే, మనకు సమస్య లేదని చెప్పలేదు. మరి ఏమన్నాడు? 'నేను సమస్యకు పరిష్కార మార్గాన్ని పట్టుకున్నాను,' అన్నాడు. అలాగే జ్ఞాని లేదా గురువు కూడా, మీ సంసారమనే సమస్యకు నేను పరిష్కారమార్గాన్ని పట్టుకున్నాను అని చెప్పాలి. అతను సూచించే మార్గం వేదాంత శ్రవణ, మనన, నిదిధ్యాసనలు. ఇవి చేస్తే మోక్షం పొందుతారు అంటాడు. కాని నిజానికి అది మోక్షానికి మార్గం కాదు. మోక్షం పొందటానికి బంధమే లేదని తెలియజెప్పే మార్గం మాత్రమే. ఈ భావననే ఈ శ్లోకంలో అద్భుతంగా చొప్పించారు రమణమహర్షి.

**శ్లోకం 41**

**బద్ధత్వభావే సతి మోక్షచిన్తా**
**బంధస్తు కస్యేతి విచారణేన ।**
**సిద్ధే స్వయం స్వాత్మని నిత్యముక్తే**
**క్వ బంధచిన్తా క్వ చ మోక్షచిన్తా ॥**

**ప్రతిపదార్థం:** బద్ధత్వభావే సతి = నేను బద్ధుడను అనే భావమున్నప్పుడు; మోక్షచింతా = మోక్షముయొక్క ఆలోచన; భవతి = కలుగుతుంది; తు = కానీ; కస్య = ఎవరికి; బంధః= బంధము? ఇతి = అను; విచారణేన = విచారణచేత; నిత్యముక్తే = సర్వదా ముక్తుడైన; స్వ+ఆత్మని = తన మూలమైన అఖండాత్మ; స్వయం = స్వయంగా; సిద్ధే సతి= లభించినదికాగా; బంధచింతా= బంధమును గురించి ఆలోచన; క్వ = ఎక్కడ; మోక్షచింతా చ = మోక్షం గురించి చింత; క్వ = ఎక్కడ

**తాత్పర్యం:** (మనిషికి) నేను బద్ధుడను అనే భావమున్నప్పుడే మోక్షము గురించి ఆలోచన కలుగుతుంది. కానీ బంధము ఎవరికి అని విచారణచేత కాలత్రయములో బంధరహితమైన తన మూలస్వరూపమైన అఖండాత్మ భాసించునో అతనికి బంధచింత, మోక్షచింత ఉండదు.

**వివరణ:** అద్వైతం గురించి ఎలా స్పష్టంగా అర్థం చేసుకోవాలో, అలా మోక్షం గురించి కూడా సరిగ్గా అర్థం చేసుకోవాలి. ఇక్కడ రమణమహర్షి నిజం చెప్పాలంటే అసలు మోక్షం పొందటమే సాధ్యం కాదు అంటున్నారు. ఎందుకంటే మోక్షం నిర్వచనం బంధవిముక్తి. వేదాంతాన్ని అధ్యయనం చేస్తే అసలు బంధం అనేది లేనేలేదు అంటుంది. బంధం అనేది మనస్సులో కలిగే ఒక భావన మాత్రమే అంటారు. నిజంగా బంధమే లేకపోతే, బంధంనుంచి విముక్తి పొందే ప్రసక్తి ఎక్కడ వస్తుంది?

మోక్షం ఉందని అంటే, సంసారం కూడా ఉందని ఒప్పుకోవాలి. సంసారం అజ్ఞానంవల్ల ఏర్పడింది. అందువల్ల వేదాంతం, మోక్షం అంటే బంధవిముక్తి పొందటం అంటే అసలు బంధమే లేదని అర్థం చేసుకోవటమే అంటుంది. మోక్షం పొందటానికి ఏమీ చేయనవసరం లేదని అర్థం చేసుకోవటమే మోక్షం.

రజ్జుసర్పభ్రాంతి దృష్టాంతం తీసుకుంటే, అక్కడ పామునుంచి విముక్తి పొందాడు అంటే ఏమిటి అర్థం? అక్కడ టార్చ్‌లైట్ వేసి చూస్తే అక్కడ పాము లేదని అర్థం అవుతుంది. ఎవ్వరైనా వచ్చి పాము పోయిందా అని అడిగితే అతను ఏమని చెబుతాడు? పాము పోయింది అంటాడు. అంటే అర్థమేమిటి? అక్కడ నిజానికి పాము లేనేలేదు. పాము అనుకున్నది నిజంగా పాము కాదని అర్థమయిందని అర్థం.

అదే విధంగా మోక్షం పొందాను అంటే నిజంగా మోక్షం పొందటం కాదు. లక్ష్యార్థం తీసుకుంటే, నిజంగా బంధం లేదు, దానినుంచి ముక్తి పొందటానికి అని అర్థం చేసుకోవటమే మోక్షం. అంటే బుద్ధిలో చిన్న మార్పు. బంధవిముక్తి శారీరకంగా పొందటం కాదు. దృక్పథంలో మార్పు కలగటం. బంధమే లేదని అర్థం చేసుకుంటే, ఇంక విముక్తి పొందే ప్రసక్తి ఎక్కడ ఉంది? అతీతత్త్వం పొందేలాగా చేయటమే వేదాంతంయొక్క లక్ష్యం.

**బద్ధత్వభావే సతి మోక్షచింతా** – ముందుగా ఒక సాధకుడు అసలు నాకు నిజంగా బంధం ఉందా అని అడగాలి. బంధం ఉంటే మోక్షం కావాలనుకోవటం సమంజసంగా, అర్థవంతంగా ఉంటుంది. అందువల్ల సాధకుడు మోక్షం కావాలి అనేకన్నా, ముందు నాకసలు బంధం ఉందా అని తనను తను ప్రశ్నించుకోవాలి. కాని దురదృష్టవశాత్తూ, ఈ సందేహమే ఎవరికీ రాదు. అందువల్ల వేదాంతం ముందు, వారిని తనవైపు ఆకట్టుకోవటానికి మీకు మోక్షం ఇప్పిస్తాను రండి, నా దగ్గరికి అని మంచి మాటలతో ఆకర్షించి, వారు వచ్చాక, నాకసలు బంధం ఉందా లేదా అని ప్రశ్నించుకోమంటుంది.

**బంధః తు కస్య** – కానీ నిజానికి ఎవరు బంధంలో ఉన్నారు అంటుంది. ఒకవేళ నేను బంధంలో కూరుకుపోయానని వారు అంటే, వేదాంతం నేను ఎవరు అని అడుగుతుంది.

శరీరంయొక్క అశాశ్వతత్వం బాధించకూడదు. ఎందుకంటే శరీరం లక్షణమే అది అని మనకందరికీ తెలుసు. ఆత్మ అశాశ్వతం అని బాధపడుతున్నారా అంటే ఆత్మ నిత్యం అని కూడా తెలుసు. మరి ఏమిటి సమస్య? నేను అశాశ్వతం అని మీరు అనేటప్పుడు, ఆ నేను ఎవరు అనుకుంటున్నారు? నేను శరీరం అనేటట్టయితే, శరీరం శాశ్వతం కాదు; దానికి చావుపుట్టుకలు ఉన్నాయని మీకు తెలుసు; నేను ఆత్మ అనేటట్టయితే ఆత్మ నిత్యమా, అశాశ్వతమా అని ప్రశ్నించుకుంటే ఆత్మ నిత్యం అని మీకూ తెలుస్తుంది. అందువల్ల బంధః తు కస్య – ఎవరికి బంధకత్వం అనే సమస్య ఉంది.

**ఇతి విచారణేన** – ఈ విషయాన్ని విచారణ చేస్తే తెలుస్తుంది. విచారణ అన్నప్పుడల్లా దానికి ముందు గురుశాస్త్ర విచారణేన అనే విషయాన్ని కలుపుకుని తీరాలి. విచారణ అంటే గురువు ద్వారా వేదాంత శ్రవణ మననాలు చేసితీరాలి. రమణమహర్షి ఇంత ప్రత్యక్షంగా ఈ విషయం ఎన్నడూ చెప్పలేదు కాని విచారణ అని వచ్చిన ప్రతిచోటా మనమే కలుపుకోవాలి. విచారణేన అంటే గురుశాస్త్ర విచారణేన అని కలుపుకోవాలి. అలా చేస్తే ఏం కనుగొంటాము?

**స్వాత్మని నిత్యముక్తే స్వయం సిద్ధే** – ఇలా విచారణ చేస్తే మనకు స్పష్టంగా అర్థమవుతుంది, స్పష్టంగా నిరూపించబడుతుంది, నిస్సంశయజ్ఞానం స్వయంగా కలుగుతుంది. స్వాత్మ అంటే స్వ ఆత్మ; మన స్వస్వరూపం నిత్యముక్తః – నేను నిత్యముక్తుణ్ణి (ఇతి) సిద్ధే – అని స్పష్టంగా అర్థమయితే,

**క్వ బంధచింతా** – నేను బంధజీవిని అనే ప్రశ్న ఎక్కడ్నుంచి వస్తుంది? నేను బంధజీవిని కాకపోతే,

**క్వ చ మోక్షచింతా** – ఇంక మోక్షం గురించిన ఆలోచన మాత్రం ఎలా వస్తుంది?

ఏ జ్ఞాని కూడా నేను జ్ఞానం పొందాక, ఇప్పుడు మోక్షం పొందాను అని చెప్పడు. నేను ఇప్పుడు మోక్షం పొందాను అని అతను చెప్పాడంటే, అతనికి వేదాంతం సరిగ్గా అర్థం కాలేదని అర్థం. అతనికి వేదాంతం సరిగ్గా అర్థం కాలేదు అంటే, అతను బంధంలో ఉన్నాడనా అంటే అతను బంధంలోనూ లేడు. ఇంతకీ అతను బంధంలో ఉన్నాడా, మోక్షం పొందాడా అంటే అతను బంధంలోనూ లేడు, మోక్షమూ పొందలేదు. అతను బంధమోక్షాలకు అతీతంగా ఉన్నాడు.

క్వ బంధ చింతా క్వ చ మోక్షచింతా – జ్ఞానికి బంధంలో ఉన్నాననే బాధా లేదు, మోక్షం పొందాలనే తపనా లేదు.

ఇప్పుడు సద్దర్శనం బోధలోని ఆఖరి అంశంలోకి అడుగు పెట్టబోతున్నాము.

**శ్లోకం 42**

**రూపిణ్యరూపిణ్యుభయాత్మికా చ**<br>
**ముక్తిస్త్రిరూపేతి విదో వదన్తి।**<br>
**ఇదం త్రయం యా వివినక్త్యహంధీ–**<br>
**స్తస్యాః ప్రణాశః పరమార్థముక్తిః॥**

**ప్రతిపదార్థం:** రూపిణీ = రూపం ఉన్నది; అరూపిణీ = రూపం లేనిది; ఉభయాత్మికా చ= ఉభయవిధాలుగా ఉన్నది; ముక్తిః = ముక్తి; త్రిరూపా = మూడురూపాలు కలది; ఇతి = అని; విదః = వేదవేత్తలు – వేదం తెలిసిన వారు; వదన్తి = చెబుతున్నారు; ఇదం = ఈ; త్రయం = సరూప, అరూప, ఉభయవిధాలుగా ఉన్న మూడు ముక్తులను; యా = ఏ; అహంధీః = అహంబుద్ధి; వివినక్తి = వివేచించి–విచారణ చేసి గ్రహించునో; తస్యాః = ఆ అహం బుద్ధియొక్క; ప్రణాశః = వినాశం; పరమార్థముక్తిః = యథార్థమైన ముక్తి; భవతి= అవుతుంది.

**తాత్పర్యం:** ఇక్కడ రూపం ఉన్నది ముక్తి అను మాట సరైనది కాదు. ముక్తి కలిగినపుడు పురుషునకు శరీరం ఉంటుంది. (ఇది జైమినీ, ద్వైత, విశిష్టాద్వైతాలలో చెప్పబడుతుంది). ముక్తి కలిగినపుడు పురుషునకు శరీరం ఉండదు. (ఇది బదరీ మహర్షి సిద్ధాంతం) ముక్తి కలిగినపుడు పురుషునకు శరీరం ఉంటుంది, ఉండదు. జీవన్ముక్తుడుగా శరీరముంటుంది. విదేహముక్తుడుగా శరీరముండదు.(ఇది అద్వైత సిద్ధాంతం)

**వివరణ:** వేదాంతంలో సంసారం – మోక్షం నిర్వచనాలు ఈ విధంగా వస్తాయి. ద్వైతభావన సంసారం; ద్వైతభావానికి అతీతంగా ఎదగటమే మోక్షం. అంటే అద్వైతంలో నెలకొని ఉండటమే

మోక్షం. కాని తమాషా ఏమిటంటే, వేదాంతం అంతగా నేర్చుకుని, మోక్షం అంటే అద్వైతం అని నేర్చుకుని, ఈ మోక్షాన్ని భాగాలుగా విభజిస్తారు. ఇందులో వెలిబుచ్చుతున్న వ్యతిరేక పదాలను గమనించారా? ఆ పదాలు ఒకదానితో ఒకటి పొసగవు. మోక్షం అంటేనే ద్వితీయం కానిది, అద్వితీయమైనది. ఏదైతే అన్ని రకాల ద్వైతానికి ముగింపు పలకాలో, దాన్ని భిన్నరూపాలుగా విభజిస్తారు. అంటే వారు వేదాంతాన్ని సరిగ్గా అర్థం చేసుకోలేదని అర్థం.

**విదః వదంతి** – కొంతమంది విజ్ఞులు మూదురకాల ముక్తి గురించి మాట్లాడతారు అంటున్నారు రమణమహర్షి.

కొన్నిచోట్ల నాలుగు రకాల ముక్తిని కూడా చూస్తాము. అది సాలోక్యముక్తి, సారూప్య ముక్తి, సామీప్యముక్తి, సాయుజ్యముక్తి. కాని ఇక్కడ మూడు రకాల ముక్తి గురించి విజ్ఞులు చెబుతారు అంటున్నారు రమణమహర్షి. ఏమిటవి? రూపిణి (ముక్తిః), అరూపిణి (ముక్తిః), ఉభయాత్మికా (ముక్తిః).

**రూపిణి (ముక్తిః)** – ముక్తపురుషునికి శరీరం ఉంటుంది అంటారు కొందరు. రూపం అంటే శరీరం. ఈ విధమైన ముక్తి గురించి జైమిని మహర్షి, ద్వైతులు, విశిష్టాద్వైతులు వర్ణిస్తారు. వారి ఉద్దేశ్యంలో ముక్తి అంటే జీవుడు ఒక లోకానికి వెళ్ళి, అక్కడ ఒక శరీరాన్ని దాల్చి, మోక్షాన్ని అనుభవిస్తాడు. వీరు శరీరం ఉంటుంది, ఉండాలి అంటారు.

**అరూపిణి (ముక్తిః)** – అశరీరత్వం ముక్తిః. అంటే ముక్తి పొందిన వ్యక్తికి రూపం ఉండదు. దీన్ని బదరీమహర్షి అంటారు.

**ఉభయాత్మికా చ** –ఈ సిద్ధాంతంలో రెండు రకాల ముక్తి కూడా ఉంది అంటారు. ఈ వాదన ముఖ్యంగా వేదాంతంలో చూస్తాము. మనం ముక్తిని రెండు రకాలుగా విభజిస్తాము. అవి జీవన్ముక్తి, విదేహముక్తి. జీవన్ముక్తి అంటే జీవించి ఉండగానే ముక్తి. అంటే శరీరంతో ఉండగానే ముక్తి. దీన్ని సదేహముక్తి అని కూడా అంటారు. విదేహముక్తి అంటే మరణించాక కలిగే ముక్తి అంటే దేహం లేకుండా ముక్తి. జైమిని మహర్షి సదేహముక్తిని వర్ణిస్తే, బదరీ మహర్షి విదేహముక్తిని వర్ణిస్తున్నారు.

**విదః వదంతి** – అలా విజ్ఞులు ముక్తి గురించి భిన్నాభిప్రాయాలు వెలిబుచ్చుతున్నారు. విజ్ఞులు వారి జ్ఞానాన్ని అనవసరమైనచోట ప్రయోగిస్తున్నారు అంటున్నారు రమణమహర్షి. ముక్తి అంటే ఏమిటని రమణమహర్షిని అడిగితే ముక్తిని భాగాలుగా విభజించే అహంకార నాశనమే ముక్తి అంటారు.

వేదాంతం ముక్తిని జీవన్ముక్తి, విదేహముక్తి అని రెండు రకాలుగా అభివర్ణిస్తుంది. కాని నిజానికి, జ్ఞానం పొందాక, ఈ పదాలను కూడా ప్రయోగించలేము. జీవన్ముక్తి, విదేహముక్తి పదాలు కూడా తప్పే అవుతాయి. అజ్ఞానికి అర్థమవటంకోసం జ్ఞాని జీవించి ఉండగా జీవన్ముక్తి, మరణించాక విదేహముక్తి పొందుతాడని వివరిస్తుంది కాని, జ్ఞానిపరంగా చూస్తే అసలు మొత్తం జగత్తే మిథ్యగా నేర్చుకుంటాడు. ఈ మిథ్యాజగత్తులో ఈ ఒక్క శరీరం ఉన్నా, లేకపోయినా ఏ భేదమూ ఉండదు.

జ్ఞాని నేర్చుకునేది ఏమిటి? నేను సర్వవ్యాపకమైన ఆత్మను, నాలోనే ఈ శరీరాలన్నీ ఉన్నాయి అని ఒక పక్క చెబుతూ, నాకు జీవన్ముక్తి, తరువాత విదేహముక్తి కలుగుతుందని ఎలా చెబుతాడు? నేను స్థూలశరీరాన్ని కాదు అంటే సశరీర మోక్షం గురించి మాట్లాడలేదు; సూక్ష్మశరీరం కాదు అంటే అశరీర మోక్షం గురించీ మాట్లాడలేదు. ఇదంతా అజ్ఞానికి అర్థం అవటంకోసం చెప్పబడింది అంతే. అయితే, మోక్షం అంటే ఏమిటి? ఈ భాగాలను చూపించే అహంకార నాశనమే మోక్షం.

**అహంధీః ఇదం త్రయం వివనక్తి** – అహంకారం మూడు రకాల ముక్తి గురించి వివరిస్తుంది. అహంకారం ఎలాగోలా సందు చూసుకుని, దూసుకువస్తుంది. ఇక్కడ అహంకారం ఇదం త్రయం అంటే మూడు రకాల ముక్తి గురించి చెబుతుంది. అవి సశరీరత్వం, అశరీరత్వం, ఉభయత్వం. అహంధీః అంటే అహంకారం. ఏ అహంకారమైతే ఇలా విభజిస్తున్నదో,

**తస్యాః ప్రణాశః** – ఆ అహంకారాన్ని నాశనం చేయాలి. విభజన చూపే అహంకారాన్ని నాశనం చేయాలి. మళ్ళీ అహంకార నాశనం ఎన్ని రకాలు అనకూడదు. ఏ విధంగా విభజించినా, ద్వైతం వచ్చేస్తుంది.

మళ్ళీ అహంకారాన్ని నాశనం చేయాలనే పదాన్ని కూడా సరిగ్గా అర్థం చేసుకోవాలి. అహంకారాన్ని నాశనం చేయటమంటే, అహంకారం మిథ్య అనే జ్ఞానాన్ని పొందటం. నిజానికి అహంకారం అక్షరాలా పోదు. జ్ఞానికి కూడా వ్యవహారం నడపటానికి అహంకారం కావాలి. జ్ఞానం పొందగానే జ్ఞానికి అహంకారం పోయేటట్టయితే, అతను గురువు అవలేడు. ఎందుకంటే గురువుకు అహంకారం ఉండాలి. అహంకారం లేకపోతే, అతనికీ, బల్లకూ మధ్య ఏమీ భేదం ఉండదు. అందువల్ల జ్ఞాని గురువు అవాలంటే, శిష్యుణ్ణి చూడటానికి అహంకారం కావాలి, శాస్త్రాన్ని చూడటానికి అహంకారం కావాలి, తత్త్వమసి మహావాక్యాన్ని విశ్లేషించటానికి అహంకారం కావాలి. అంటే ఒక్కముక్కలో చెప్పాలంటే, జ్ఞానికి కూడా వ్యవహారం నడపటానికి అహంకారం తప్పనిసరిగా ఉండాలి. అహంకారం అంటే జీవభావం.

దానికి భిన్నంగా, జ్ఞానికి జ్ఞానం పొందగానే అహంకారం పోతే, జ్ఞాని మరణిస్తాడు. జీవించి ఉన్నవారందరూ అజ్ఞానులు అవుతారు. అప్పుడు బోధ చేసే గురువు కూడా అజ్ఞానే అవుతాడు. ఒక అజ్ఞాని తక్కిన అజ్ఞానులకు బోధ చేస్తే, అది అంధపరంపర అవుతుంది. అందువల్ల అహంకార నాశనం అంటే అహంకారం వ్యావహారిక సత్యమని అర్థం చేసుకోవటమే.

ఏ వ్యవహారం చేయాలన్నా కూడా దానికి అహంకారాన్ని ఉపయోగించాలి. ఒక ఆశ్రమాన్ని నెలకొల్పాలన్నా, గ్రంథాలను రచించాలన్నా, శాస్త్రాన్ని బోధించాలన్నా, ఏం చేయాలన్నా కూడా అహంకారం కావాలి. అందువల్ల జ్ఞాని అహంకారం వ్యావహారిక సత్యమనీ, అది దాని పని అది చేసుకుపోనీ, నేను మాత్రం పారమార్థిక ఆత్మను, పారమార్థిక ఆత్మగా నేను నిత్యముక్తుడను అనీ అర్థం చేసుకుంటాడు. మిథ్యా అహంకారం తన పని తాను చేసుకుపోతున్నా కూడా అతని దృష్టిలో అది అహంకార నాశనమే. ఎందుకంటే తను అహంకారంతో మమేకం చెందదు. అది మిథ్య అని బాగా అర్థం చేసుకుంటాడు. అందువల్ల అహంకార నాశనః అంటే మిథ్యాత్వనిశ్చయం. దీన్ని అసలు మోక్షం అంటారు.

అద్వైతంలో ఏ పదం వాడినా తప్పే. ఇదే అసలు మోక్షం అనగానే, శిష్యుడు ఓహో, రెండు మోక్షాలున్నాయన్నమాట అంటాడు. అదేమిటి అంటే అసలైన మోక్షం అంటే, అబద్ధం మోక్షం ఇంకొకటి ఉన్నట్టే కదా అంటాడు.

**పరమార్థముక్తిః** – ఇది పరమార్థ ముక్తి అంటే అయితే తక్కినవారిది అపరమార్థిక ముక్తా ? ఇదంతా అహంకారం చేసే గారడీ. అహంకారంతో పెద్ద చిక్కే వచ్చిపడుతుంది. అందువల్ల ముక్తి అంటే అహంకార నాశనం అని నొక్కి వక్కాణిస్తున్నారు రమణమహర్షి. దీనితో సద్దర్శనంలోని బోధ అయిపోయింది.

సద్దర్శనం బోధ సారాంశాన్ని చూద్దాము.

1. **అహంకారం కారణం** – మీ సమస్యలన్నింటికీ మూలకారణం అహంకారం. అంతేకానీ జగత్తు కాదు అని రమణమహర్షి పదేపదే చెప్పారు. అందువల్ల మీ సమస్యలకు జగత్తును నిందించకండి, మనుష్యులను నిందించకండి, గురువును నిందించకండి, మీ అహంకారమే మీ సమస్యలకు మూలకారణం.

2. **అహంకారం కోరలు పీకాలి** – అహంకారాన్ని తెలివిగా అదుపులో పెట్టగలగటమొక్కటే దీనికి పరిష్కారం. కావాలనే అహంకార నాశనం పదం వాడటం లేదు. నాశనం చేయాలి అంటే విపరీతార్థం తీసుకుంటారు. దయానంద స్వామీజీ అహంకారంయొక్క కోరలు పీకాలి అంటారు. కోడెత్రాచులో విషమున్నంతవరకూ అది మన ప్రాణానికే ముప్పు. కాని

ఆ కోడె(త్రాచునుంచి విషాన్ని లాగేస్తే, అది మనని ఏమీ చేయలేదు. అందువల్ల పామును చంపకుండా, విషాన్ని మాత్రం తీస్తే చాలు. అది ఒక ఆభరణం అవుతుంది. పరమశివుడు నాగాభరణాన్ని ధరిస్తాడు. అదే విధంగా మనం కూడా అహంకారంలోని కోరలు పీకేస్తే, అహంకారాన్ని ఆభరణంగా ధరించవచ్చు.

3. **ఆత్మజ్ఞానంవల్లనే అహంకారం కోరలు పీకవచ్చు** – అహంకారం ఇన్నాళ్ళూ మనల్ని ఒక ఆట ఆడిస్తోంది. మనం మనని ఆడించే అహంకారం కాదు, దానికన్నా ఉన్నత స్వరూపులం. మనం ఆత్మ, అహంకారం అనాత్మ అని అర్థం చేసుకోవటమే అహంకారంయొక్క కోరలు పీకే మార్గం.

**ఆత్మ స్వరూపమైన సద్దర్శనమే అహంకారానికి మందు**

4. **ఆత్మ సత్ చిత్ ఆనంద ఆత్మ** – ఆత్మ అంటే శుద్ధ ఉనికి. అది జగత్తులో ఒక భాగం కాని, ఒక లక్షణం కాని, దానినుంచి ఉత్పత్తి చెందింది కానీ కాదు. శుద్ధ ఉనికి లేదా సత్ స్వతంత్రమైనది. దానివల్లనే జగత్తుకు ఉనికి ఏర్పడుతుంది. జగత్తు ఉన్నా లేకపోయినా శుద్ధ సత్ ఎప్పుడూ ఉంటుంది. ఈ శుద్ధ ఉనికే ఆత్మ.

ఈ సత్ దర్శనమే అహంకారాన్ని పారద్రోలటానికి వాడే ఏకైక మార్గం.

5. **సద్దర్శనం గురుశాస్త్ర ఉపదేశంవల్లనే సాధ్యం** – ఇది చాలా ముఖ్యమైన అంశం. ఆత్మ అంటే సత్ అని చూశాము. ఆత్మ దర్శనం లేదా సద్దర్శనం చేయాలంటే ఆత్మవిచారణ చేయాలి. ఆత్మవిచారణ ఎలా చేయాలో రమణమహర్షి ప్రత్యేకించి చెప్పరు. మనం ఎక్కడికక్కడ ఆయన సూచనలనందుకుని కలుపుకుంటూ వచ్చాము. అది ఆత్మవిచారణను గురుశాస్త్ర ఉపదేశం ద్వారానే చేయాలి. అంటే వేదాంతాన్ని ఒక క్రమపద్ధతిలో, క్రమం తప్పకుండా, ఒక గురువువద్ద అధ్యయనం చేయాలి.

మళ్ళీ ఈ సారాంశాన్ని టూకీగా చూస్తే – అహంకారమే అన్ని సమస్యలకూ కారణం. అందువల్ల అహంకారం కోరలు పీకాలి. అహంకారం కోరలను ఆత్మజ్ఞానంవల్లనే పీకగలము. ఆత్మస్వరూపం సత్, ఆ సత్ దర్శనమే అహంకారానికి మందు. సద్దర్శనం గురుశాస్త్ర ఉపదేశంవల్లనే సాధ్యం.

ఇదీ సద్దర్శనం సారాంశం.

కాని దీని తరువాత ఇంకొక రెండు ఉపసంహార శ్లోకాలు ఉన్నాయి. ఇందులో ఇద్దరు కవుల గురించి చూస్తాము. ఎవరు వారు? మొదటిది ఈ సద్దర్శనం గ్రంథకర్త అయిన రమణమహర్షి గురించి, రెండవది వాసిష్ఠ గణపతి ముని గురించి.

రమణమహర్షి సద్దర్శనాన్ని తమిళంలో రచించారు. దానిలో 40 శ్లోకాలు ఉన్నాయి. దాన్ని **ఉల్లదు నార్పదు** అంటారు. ఉల్లదు అంటే ఉనికి ఉన్నది. ఉనికిని సత్ అంటారు. నార్పదు అంటే 40 అని అర్థం. అంటే 40 ఉనికిల గురించి చెప్పారని కాదు అర్థం, 40 శ్లోకాలను ఉనికి లేదా సత్ గురించి రచించారు అని అర్థం. ఇది తమిళంలో ఉంది.

ఇప్పుడు మనం నేర్చుకున్నది సంస్కృతంలోకి అనువదించబడినది. దీన్ని అనువదించినవారు వాసిష్ఠ గణపతి ముని. ఈయన దీన్ని రచించిన రెండవ కవి. వీరిద్దరి గురించి 43, 44 శ్లోకాల్లో చూస్తాము. ఈ రెండు శ్లోకాలు ఎవరు రాశారో సరిగ్గా తెలియదు. ఎవరో మూడో కవి రాశారు అనేకన్నా గణపతి మునే రమణమహర్షి గురించీ, తన గురించీ రాశారని అర్థం తీసుకోవచ్చు.

**శ్లోకం 43**

**సద్దర్శనం ద్రావిడవాఙ్నిబద్ధం**
**మహర్షిణా శ్రీరమణేన శుద్ధమ్।**
**ప్రబంధముత్కృష్టమమర్త్యవాణ్యా**
**మనూద్య వాసిష్ఠమునిర్వ్యతానీత్॥**

**ప్రతిపదార్థం:** వాసిష్ఠమునిః = వసిష్ఠగోత్రసంభవుడైన గణపతిముని; మహర్షిణా శ్రీ రమణేన= రమణ మహర్షిచేత; ద్రావిడవాక్ నిబద్ధం = తమిళ భాషలో రచింపబడిన; శుద్ధం = పవిత్రమైన; ఉత్కృష్టం = శ్రేష్ఠమైన; సద్దర్శనం ప్రబంధం = సద్దర్శనమనే గ్రంథాన్ని; అమర్త్యవాణ్యాం = సంస్కృతభాషలో; అనూద్య వ్యతానీత్ = అనువదించి రచించెను

**తాత్పర్యం:** శ్రీ రమణమహర్షి తమిళంలో రచించిన పవిత్రమైన, శ్రేష్ఠమైన సద్దర్శన గ్రంథాన్ని వసిష్ఠగోత్రసంభవుడైన గణపతిముని సంస్కృతభాషలో అనువదించి రచించెను.

**వివరణ: సద్దర్శనం** – సద్దర్శనం అనే ఈ బోధ. సత్ దర్శనం అర్థం అక్షరాలా చూస్తే సత్ ఆత్మ గురించిన జ్ఞానం లేదా సత్‌బ్రహ్మ గురించిన జ్ఞానం. సత్యమైన ఉనికిని గురించిన జ్ఞానం. ఇది ఈ గ్రంథంయొక్క పేరు. ఈ సత్ జ్ఞానం,

**ద్రావిడవాఙ్నిబద్ధం** – నిబద్ధం అంటే రచించబడినది. ఏ భాషలో? ద్రావిడ అంటే తమిళ, వాక్ అంటే భాషలో. అంతా కలిపితే సద్దర్శనం అనే ఈ గ్రంథం ముందుగా తమిళ భాషలో రచించబడినది. తమిళంలో పేరు ఉల్లదు నార్పదు. ఈ గ్రంథం ఎలా ఉంది?

**శుద్ధమ్** – స్వచ్ఛంగా ఉంది. ఎటువంటి దోషాలు లేవు. తార్కికంగా దోషాలు లేవు, భాషలో దోషాలు లేవు. సాధారణంగా ఏ గ్రంథంలోనైనా చూసేది శబ్దదోషం, అర్థదోషం. శబ్దదోషం అంటే వ్యాకరణపరంగా దోషం; అర్థదోషం అంటే తార్కికంగా దోషం.

అగ్ని చల్లగా ఉంది – ఇది అర్థదోషం. ఎందుకంటే అగ్ని ఎప్పుడూ వేడిగా ఉంటుంది.

అగ్ని చల్లగా ఉంటాయి – ఇది శబ్దదోషం. ఎందుకంటే అగ్ని ఏకవచనం. ఉంటాయి బహువచనం.

రెండవ వాక్యంలో అర్థదోషం లేదు కాని శబ్దదోషం ఉంది. ఈ రెండు దోషాలూ లేని గ్రంథాన్ని శుద్ధం అంటారు. అందువల్ల ఈ గ్రంథం శుద్ధం.

**ప్రబంధమ్** – ప్రబంధం అంటే గ్రంథం. ఈ శుద్ధం, ప్రబంధం సద్దర్శనానికి విశేషణాలు. అంతేకాదు,

**ఉత్కృష్టమ్** – ఇలా శబ్దదోషాలు, అర్థదోషాలు లేని గ్రంథాలు అనేకం ఉండవచ్చు. అవి ఏవైనా లౌకిక విషయాల గురించి ఉండవచ్చు. ఒక నది గురించో, ఒక కొండ గురించో, మరోదేని గురించో ఉండవచ్చు. అవన్నీ అపరావిద్యలోకి వస్తాయి. అశాశ్వతమైన అనాత్మను వర్ణించేదేదైనా అపరావిద్యే. శాశ్వతమైన, నిత్యమైన ఆత్మ గురించి బోధించేది మాత్రమే పరావిద్య. అందువల్ల ఉత్కృష్టమ్. ఉత్కృష్టమ్ అంటే శ్రేష్ఠతమమైనది. దీన్ని కృష్ణపరమాత్మ రాజవిద్యా రాజగుహ్యం అన్నాడు. అందువల్ల,

ఉత్కృష్టం శుద్ధం ద్రవిడవాఙ్గ్ నిబద్ధం సద్దర్శనం ప్రబంధమ్.

దీన్ని ఎవరు రచించారు?

**మహర్షిణా శ్రీరమణేన** – మహర్షి అయిన శ్రీరమణులు రచించారు. అసలు కవి శ్రేష్ఠులైన రమణమహర్షి. మరి నేనో? నేను ఒక మామూలు మనిషిని. నా పని కేవలం దాన్ని అనువదించటం. మీముందుకు తీసుకురావటం అంటున్నారు అనువాదకులు.

**వాసిష్ఠమునిః** – దీన్ని వాసిష్ఠముని అనువదించారు అంటున్నారు. అనువాదకుడైన వాసిష్టమునికి ఇంకో పేరు ఉంది. అది,

**గణపతిః** – ఆయన పూర్తి పేరు వాసిష్ఠ గణపతిముని. ఇది ఎవరు రాశారు అంటే వాసిష్ఠ మునే తన గురించి రాశారనీ, ఎవరి గురించో రాసినట్టుగా రాశారనీ అర్థం తీసుకోవచ్చు.

**అనూద్య** – అనూద్య అంటే అనువాదం చేశారు. తమిళంలో రచించిన **ఉళ్ళదు నార్పదు** అనే ఈ గ్రంథాన్ని అనువాదం చేశారు. దేనిలోకి?

**అమర్త్యవాణ్యా** – అమర్త్యవాణి అంటే దేవవాణి, దేవభాష. దేవభాష అంటే సంస్కృతం. సంస్కృతంలో,

**వ్యతానీత్** – రచించారు.

అంటే పరోక్షంగా ఇంత ఉత్కృష్టమైన గ్రంథాన్ని రమణమహర్షి రచించారనీ, దాని ఘనత రమణమహర్షికే చెందుతుందనీ, తను కేవలం అనువదించాననీ చెప్పారు.

**శ్లోకం 44**

**సత్తత్త్వసారం సరలం దధానా**
**ముముక్షులోకాయ ముదం దదానా।**
**అమానుషశ్రీరమణీయవాణీ**
**మయూఖభిత్తిర్మునివాగ్ విభాతి॥**

**ప్రతిపదార్థం:** సత్తత్త్వసారం = పరమార్థసత్యముయొక్క సారాన్ని; సరలం = సుగమం చేస్తూ; దధానా = ధరించునది; ముముక్షలోకాయ = మోక్షగాములకు; ముదం = ప్రీతిని; దదానా= చేకూర్చే; అమానుషశ్రీరమణీయవాణీమయూఖభిత్తి = మానవాతీతమైన శ్రీ రమణులకు సంబంధించిన వాక్కులనే కిరణాలకు గోడలాగ; మునివాక్ విభాతి = గణపతిముని అనువాదము ప్రకాశిస్తోంది

**తాత్పర్యం:**సద్విద్యను బోధించే పరమార్థ సత్యమును సుగమం చేస్తూ దేహాత్మభావమునుండి విడివడి, మోక్షగాములకు ప్రీతిని కలిగించుచున్న శ్రీరమణుల వాక్కులనే కిరణాలకు గోడలాగ గణపతిముని అనువాదము ప్రకాశిస్తోంది.

**వివరణ:** ఈ శ్లోకంలో ఈ అనువాదంయొక్క విశిష్ఠత గురించి చెబుతున్నారు.

**మునివాక్ విభాతి** – ముని వాక్కు అంటే వాసిష్ఠముని వాక్కు. అంటే ఈ సద్దర్శన గ్రంథాన్ని అనువదించిన కవి.

**విభాతి** – విభాతి అంటే ప్రకాశిస్తున్నది. అంటే ఈ అనువాదం కూడా అద్భుతంగా ఉంది. వేదాంత గ్రంథాల్లో ఇది ఒక వెలుగు వెలుగుతుంది. ఏం చేస్తుంది ఈ గ్రంథం? మొదటి పాదం చూద్దాం.

**సత్తత్త్వసారం దధానా** – సాధారణంగా సారం అంటే అర్థం సారాంశం. కాని ఇక్కడ సారం అంటే బోధ. దేని బోధ? సత్ తత్త్వం. సత్ అంటే ఉనికి. తత్త్వం అంటే శుద్ధ ఉనికి, అంతిమ సత్యం. సాధారణంగా మనకు ఉనికి గురించి విశేషణంగానే తెలుసు.

ఉదాహరణకు చెట్టు **ఉంది**, కుర్చీ **ఉంది**, బల్ల **ఉంది**. అలా చెట్టు, కుర్చీ, బల్లల ఉనికి అనే నామవాచకాలని సూచించే విశేషణంగా తెలుసు. కాని ఇక్కడ సత్ విశేషణం కాదు, అదే నామవాచకం. అదే అంతిమ సత్యం. అందువల్ల సత్ తత్త్వం అంటున్నారు. సారం అంటే సత్ తత్త్వం గురించిన బోధ. దధానా అంటే ఇచ్చేది. ఈ బోధను ఇచ్చే గ్రంథం ఇది.

అన్నీ కలిపితే ఈ సద్దర్శనం సత్ తత్త్వం లేదా బ్రహ్మతత్త్వంయొక్క బోధను ఇస్తున్నది. అది కూడా ఎలా?

**సరలమ్** – సరళమ్ అంటే సులభశైలిలో. తేలికగా అర్థమయ్యే భాషలో, కష్టమైన భాషలో కాదు. సరళమ్ పదం దధానా అనే క్రియాపదానికి సరళమ్ క్రియా విశేషణం. ఈ బోధను సరళంగా ఇస్తున్నది.

**ముదం దదానా** – ఈ బోధ మోక్షమనే అద్భుతమైన ఆనందాన్ని కలుగజేస్తున్నది. ముదం అంటే ఆనందం. ఎటువంటి ఆనందం? విషయానందం కాదు, ఆత్మానందం. దీన్నే మోక్షానందం అంటారు. ఈ ఆత్మానందాన్ని దదానా – ఈ సంస్కృతగ్రంథం ఇస్తుంది. ఎవరికి ఇస్తుంది?

**ముముక్షులోకాయ** – తీవ్రమైన ముముక్షుత్వం ఉన్నవారికి మాత్రమే ఇస్తుంది. తక్కినవారికి ఈ గ్రంథం అర్థం కాదు; చాలా క్లిష్టమైనదిగానూ, అర్థం లేనిదిగానూ అనిపిస్తుంది. ముముక్షు పదం మొత్తం సాధన చతుష్టయ సంపత్తిని సూచిస్తుంది. ఈ సాధన చతుష్టయ సంపత్తి లేనివారికి ఇది అర్థంకాదు. అందువల్ల జాగ్రత్తగా ముముక్షులోకాయ అన్నారు. లోకాః అంటే వారికి. ఎవరికి? ముముక్షువులకు అంటే మోక్షం పొందాలనుకునేవారికి. సాధన చతుష్టయ సంపత్తి అంటే వివేకం, వైరాగ్యం, ముముక్షుత్వం, శమదమాది షట్కసంపత్తి. అది ఉన్నవారికే ఆత్మానందాన్ని ఇస్తుంది.

ఇలా ఆత్మానందాన్ని ఇచ్చే ఈ సద్దర్శనం శ్రేష్ఠమైనది అంటున్నారు ముని – వాసిష్ఠముని. వాసిష్ఠముని తనకు తానే నా గ్రంథం శ్రేష్ఠమైనది అని కీర్తించుకుంటే, పాఠకులకు ఒక సందేహం కలుగవచ్చు. ఒకపక్క సద్దర్శనం చేయాలంటే అహంకారం నాశనం చేయాలని చెబుతూ, ఆయనే నా గ్రంథం శ్రేష్ఠమంటూ అహంకారాన్ని ప్రదర్శిస్తున్నారే అనవచ్చు. అది ఊహించినట్టుగా వాసిష్ఠముని ఒక విశేషణాన్ని కలుపుతున్నారు.

**భిత్తిః** – నా ఈ గ్రంథం కేవలం ఒక అద్దం మాత్రమే అంటున్నారు. అద్దం ఎలాగైతే ప్రతిబింబకాంతినే చూపించగలదో, అలా నా గ్రంథం ప్రతిబింబకాంతినే ప్రదర్శిస్తున్నది. దానికంటూ స్వతంత్రంగా కాంతి లేదు. అది అసలు కాంతిని ప్రతిబింబించేస్తున్నది. భిత్తి అంటే అద్దాలున్న గోడ అని చెప్పవచ్చు. అది దేన్ని ప్రతిబింబిస్తుంది?

**మయూఖ** – కాంతి కిరణాలను ప్రతిబింబిస్తుంది. ఏ కాంతి కిరణాలు?

**రమణీయవాణీ** – రమణమహర్షి బోధ అనే కిరణాలను నా గ్రంథమనే అద్దం, ప్రతిబింబింపజేస్తున్నది. అందువల్ల ఇందులో నా గొప్పతనం ఏమీలేదు. ఘనత అంతా

రమణమహర్షి బోధకే చెందుతుంది. ఎక్కడ ఉంది రమణమహర్షి బోధ? తమిళగ్రంథమైన **ఉళ్ళదు నార్పదు**లో ఉంది. రమణమహర్షి గ్రంథం సూర్యుడైతే, ఆయన బోధ సూర్యకిరణాలు. ఈ సంస్కృత అనువాద గ్రంథం ఈ కిరణాలను ప్రతిబింబంపజేసే అద్దం. అందువల్ల ఈ కిరణాలు ప్రతిబింబకిరణాలే కాని వాటికి స్వంత కాంతి లేదు. రమణమహర్షి ఎటువంటి వారు?

**అమానుషశ్రీరమణ** – అమానుష అంటే మామూలు మనిషి కాదు. ఆయన సాక్షాత్తూ భగవంతుని అవతారం.

**అమానుషశ్రీరమణీయవాణీమయూఖభిత్తి** –

ఇదంతా ఒకటే పెద్ద సమాసం. మానవాతీతులయిన శ్రీరమణమహర్షి రచించిన **ఉళ్ళదు నార్పదు** గ్రంథంనుంచి వెలువడిన కిరణాలను ఈ సద్దర్శనం అద్దంలా ప్రతిబింబింప జేస్తున్నది. అందువల్ల వేదాంత గ్రంథాలలో ఇది మకుటాయమానంగా విరాజిల్లుతున్నది.

దీనితో సద్దర్శనం అనువాద గ్రంథం గురించిన వివరణ అయిపోయింది. సద్దర్శనం కూడా అయిపోయింది.

మానవాతీతులయిన శ్రీరమణమహర్షి రచించిన **ఉళ్ళదు నార్పదు** గ్రంథంనుంచి వెలువడిన కిరణాలను, స్వామి పరమార్థానందజీ బోధల ద్వారా, తెలుగులో కూడా ఈ సద్దర్శనం అద్దంలా ప్రతిబింబింప జేస్తున్నది. అందువల్ల వేదాంత గ్రంథాలలో ఇది మకుటాయమానంగా విరాజిల్లుతుంది.

**ఓం పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణముదచ్యతే।**
**పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే ॥**
**ఓం శాంతిః శాంతిః శాంతిః॥**

**ఓం తత్సత్। సర్వం శ్రీకృష్ణార్పణమస్తు॥**

**హరిః ఓమ్**

# ARSHA VIDYA TARANGINI

మా యూట్యూబ్ ఛానెల్ పేరు ఆర్ష విద్యా తరంగిణి. ఇందులో అతి సులభమైన తెలుగులో భగవద్గీత, ఉపనిషత్తుల, ప్రకరణ గ్రంథాల బోధలు ఉన్నాయి. అంతేకాదు వేదాంతంలో అనేక అంశాలను షార్ట్స్ రూపంలో చూడవచ్చు.

మా యూ ట్యూబ్ ఛానెల్ లింక్ ఇది –

**https://www.youtube.com/channel/UCvN1vYmtilmR1-r9AIVI6QQ/playlists**

మా ఛానెల్ మీకు నచ్చితే subscribe చేయండి, **like** పెట్టండి, **share** చేయండి.

ధర్మప్రచారానికి చేయూతనివ్వండి.

మా వెబ్ సైట్ **https://arshavidya.app**

ఇందులో మా గురువుల విశిష్టత, మా శిబిరాల, మా కార్యక్రమాల వివరాలు, ఫొటోలు, క్లాసుల వివరాలు, మా బోధల ఆడియోలు, మా గ్రంథాల ఈ–బుక్స్ పొందు పరిచాము.

మా గ్రంథాల ఉచిత సాఫ్ట్ కాపీకోసం ఈ కింది లింకులో కూడా చూడండి–

**http://www.telugubhakti.com/telugupages/Adwaitam/Adwaitam.htm**

అద్వైత వేదాంత బోధ వారంలో ఐదు రోజులు యం యస్ టీమ్స్‌లో జరుగుతున్నది.

## Advaita Vedanta Bodha

**ARSHA VIDYA TARANGINI CLASSES**

మా క్లాస్ రూమ్ అప్ డేట్స్ మా వాట్సాప్ గ్రూప్ లో పొందుపరచబడతాయి.

అందులో చేరటానికి 98490 92368 కి వాట్సాప్ చేయండి.

# ఆర్ష విద్యా తరంగిణి పుస్తక ప్రచురణలు

## ప్రకరణ గ్రంథాలు

01. అద్వైతవేదాన్త పరిచయము
02. భజగోవిన్దమ్
03. దృగ్దృశ్య వివేకము

### శ్రుతి గ్రంథాలు

01. ముండకోపనిషత్
02. కఠోపనిషత్
03. తైత్తిరీయోపనిషత్
04. ప్రశ్నోపనిషత్
05. ఈశావాస్యోపనిషత్
06. ఐతరేయోపనిషత్
07. ఛాందోగ్యోపనిషత్
08. కేనోపనిషత్
09. కైవల్యోపనిషత్
10. బృహదారణ్యకోపనిషత్
11. మాండూక్యోపనిషత్

## స్మృతి గ్రంథము

01. శ్రీమద్భగవద్గీత మొదటి షట్కము
02. శ్రీమద్భగవద్గీత రెండవ షట్కము
03. శ్రీమద్భగవద్గీత మూడవ షట్కము
04. సంక్షిప్త భగవద్గీత

## న్యాయ గ్రంథము

బ్రహ్మసూత్రములు – చతుస్సూత్రీ

## ఇతర గ్రంథములు

01. వేదాంత జీవన విధానము – 01
02 సద్దర్శనం